# ఆముక్తమాల్యద

(వ్యాఖ్యానం)

- వనం వేంకట వర ప్రసాదరావు



శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 165

కౌముది మాసపత్రికలో

2012 సెప్టెంబర్ నుంచి సెప్టెంబర్ 2016

వరకూ

వచ్చిన వ్యాఖ్యాన పరంపర

# పరిచయం

**ఏ దేశపు ఔన్నత్యమైనా** ఆ దేశపు సాహిత్య, సంగీత, సాంస్కృతిక, సామాజిక రీతుల ఆధారంగానే అంచనా వేయబడుతుంది, ఎందుకంటే, ఇవన్నీ నాగరితకు ప్రామాణికాలు గనుక. సంగీత సాహిత్యాలు రెండింటిలో కూడా సంగీతం పాడగలిగినవాడు ఉంటేనే వినే వాళ్ళు వుంటారు. అంటే, సంగీతం, అది అందించేవాడు లేకుంటే నిలవదు. వినపడదు. ఎప్పటికప్పుడూ గొప్ప రాగాన్ని గొప్పగా పాడగలిగిన వాడు వుంటేనే కదా రాగం, సంగీతం, గానం శ్రోతలకు అందేది. సాహిత్యం సాహిత్యాన్ని అందించినవాడు లేకపోయినా నిలిచే వుంటుంది, గ్రంధ రూపంలో. సంగీతం కూడా గ్రంధరూపంలో అంటే రికార్డుల రూపంలో నిలిచేవుంటుంది..కానీ నాణ్యత మరుగునపడిపోతుంది, వాడిన కొద్దీ..రికార్డులు అరిగిపోతాయ్ కదా. త్యాగయ్య కృతులనూ, అన్నమయ్య సంకీర్తనలనూ మనం వారి గొంతుల్లో ఇప్పుడు వినే అదృష్టం మనకు లేదు కదా! కానీ సాహిత్య గ్రంథాలు మాత్రం గ్రంథ కర్తలు లేకున్నా పాఠకులు ఆనందించగలిగినవి, నన్నయ్య, తిక్కన్న, ఎర్రన, పోతన, త్యాగయ్య, అన్నమయ్య, రామదాసు మొదలైన మహానుభావుల సాహిత్యం, సారస్వతం వారి ప్రత్యక్ష దర్శనాన్ని మనకుచేయిస్తాయి కదా ఇప్పటికీ, ఇంకా ఎప్పటికైనా! అంతే కాదు, సంగీతం ఆపాత మధురం, సాహిత్యం ఆలోచనామృతం. సంగీతం వినపడగానే ఆకర్షిస్తుంది, అంటే ఆనంద ప్రధానం, సాహిత్యం ఆలోచించిన కొద్దీ ఆ-నందాన్ని ఇస్తుంది, అంటే ఆలోచనా ప్రధానం, అంటే సందేశంతో కూడిన ఆనందాన్ని ఇస్తుంది.

సందేశాన్ని ఇచ్చే సంగీతానికి కూడా సాహిత్యమే ప్రాణం అనేది మనకు తెలిసిందే కనుక ఏ దేశ సారస్వత సామాజిక ఉద్యమాలు ఐనా దేశపు సాహిత్యం చేతనే ప్రభావితం అయ్యాయి, అవుతాయి, అవుతూనే వుంటాయి.

ఆంధ్ర సారస్వత యుగంలోనే కాదు, అఖిల భారత సారస్వత ఉద్యమాలలోనూ..ప్రపంచ సాహిత్య యుగాలలోనూ అత్యున్నత శ్రేణికి చెందినది, శతాబ్దాల తరబడి కోట్లాది ప్రజలను ప్రభావితులను చేసినది, భారతీయ సాహిత్య ఆలోచనా ధోరణులను తెలుగువారి సాహిత్య, సారస్వత సంపదను సమృద్ధం చేసినది, శ్రీకృష్ణ దేవరాయల యుగం. రాయలు కవి, పండిత, గాయక, కళాకారులను పోషించిన వాడు మాత్రమే కాదు, జీవిత కాలంలో ఒక్క యద్ధము లోనూ వోడిపోని మహావీరుడు, నిరంతరమూ యుద్ధ రంగంలో బ్రతికినవాడు మాత్రమే కాదు, స్వయంగా గొప్ప సంస్కృత, ఆంధ్ర కావ్యకర్త. గొప్ప సంగీతవిద్వాంసుడు, వీణావాదకుడు, మల్లయుద్ధ వీరుడు, గొప్ప కళాకారుడు, కళా పోషకుడు, కళాభిమాని, మానవతావాది, సంఘసంస్కర్త. తనచేతిలో పరాజితులైన యితర ధర్మాల వాళ్ళకు కూడా వారి వారి ధార్మిక కార్య క్రమాలకు సహకరించిన మహా సంస్కర్త. తాను వీరవైష్ణవుడైనా, శైవులను, బౌద్ధులనూ, యితర –లోచనా ధోరణులనూ ఆదరించి ఆశ్రయమిచ్చినవాడు. తను హిందువు ఐనా మసీదులనూ, చర్చిలనూ కట్టించి ఇచ్చినవాడు, తన పాలనలో, అన్ని మతాల, కులాల, ధర్మాల వాళ్ళనూ సమానంగా ఆదరించినవాడు. ఆంధ్ర సాహిత్యంలోని పంచ మహాకావ్యాలలో నాలుగు రాయల ప్రత్యక్ష ప్రమేయంతో వెలసినవే. అందులో ఒకటి ఆముక్త మాల్యదను ఆయన స్వయంగా రచిస్తే, రెండవది మనుచరిత్రమును ఆయన ఇష్ట సఖుడు, గురుసముడు ఐన అల్లసాని పెద్దన రచిస్తే, మూడవది ఐన పాండురంగ మహత్యమును ఆయన స్థాన కవి ఐన తెనాలి రామకృష్ణుడు రచించాడు, నాలుగవది ఐన వసుచరిత్రమును అల్లసాని పెద్దన శిష్యుడు ఐన భట్టుమూర్తి అని పిలువబడిన రామరాజ భూషణుడు రచించాడు. రామరాజ భూషణుడు రాయల స్మామ్రాజ్య ఉచ్చ స్థితిలో పెద్దన శిష్యరికం చేసిన వాడు, భువనవిజయ సాహిత్య మధురిమలను తన వసంత గానముగా మలుచుకున్న వాడు. ఐదవది ఐన శృంగార నైషధం మాత్రం శ్రీనాధ

మహాకవి రచించినది, అది స్వతంత్ర కావ్యం కాదు. సంస్కృత కావ్యానికి అనువాదం మాత్రమే. ఈ ఒక్క సత్యం చాలు ఆంధ్ర సాహిత్యానికి ఎల్లలులేని సేవ చేసిన వాడు శ్రీకృష్ణ దేవరాయలు అని రుజువుచేయడానికి.

తన తనువృత్తి సామ్రాజ్య రక్షణంగా, మనః ప్రవృత్తి సరస సంగీత సాహిత్య సాంస్కృతిక సీమల రసవీక్షణంగా బ్రతికినవాడు రాయలు. తన శరీరాన్ని సమర రంగానికీ, తన మనసునూ, ఆత్మనూ సంగీత, సాహిత్య, సాంస్కృతిక రంగాలకు అంకితం చేసినవాడు రాయలు. కరవాలముతో కన్న ఘంటముతోనే తాను చిరంజీవిని కాగలనని, కావలెనని తలచినవాడు రాయలు. సామ్రాజ్య సీమలను సంరక్షించు సైనికునికన్న సాంస్కృతిక సీమలను పరిరక్షించు కళాకారుడు శాశ్వతునిగా చరిత్రలో నిలిచిపోగలడు అని నమ్మినవాడు రాయలు. రాజులు వెళ్ళి పోతారు కానీ, కవిరాజులు శాశ్వతులై నిలిచిపోతారు చరిత్రలో, ప్రజల హృదయాలలో అని నమ్మినవాడు రాయలు. సమాజ శాంతికి సవ్యమైన పరిపాలన, సభ్యమైన నడవడిక ఎంత ముఖ్యములో స్వచ్ఛమైన, స్వేచ్ఛయైన సాహిత్య, సంగీత సాంస్కృతిక సర్వతోముఖ వికాసమూ అంతే ముఖ్యము అని నమ్మి, తన పరిపాలనలో, తన యుగంలో ఆచరించి, చూపించిన వాడు, ప్రపంచ చరిత్రలో అత్యంత గొప్ప చక్రవర్తులలో నిశ్చయంగా ఒకడు శ్రీ కృష్ణ దేవరాయలు. స్వతంత్ర భావాలకు, రసభావాలకు, సరసభావాలకు పురిటిల్లు ఐన భావ కవితోద్యమ రసధ్వని..'నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు, నా యిచ్చయే గాక నాకేటి వెరపు?' అని పొగరేసిన, తల ఎగరేసిన, తలపుల పొగేసిన కృష్ణశాస్త్రి వంటి మహానుభావుడు కూడా..' అప్పుడు పుట్టివుంటే..శ్రీకృష్ణదేవరాయల కాలంలో పుట్టివుంటే ఎంత బావుండేది..పుడితే అప్పుడు నేను పెద్దన గానే పుట్టివుంటాను' అని కలలు గన్నాడు.. ఇంతకన్నా రాయల రసరమ్యమయ మూర్తికి నిదర్శనము ఏం కావాలి? రాయలను ఆదరించడం అంటే అమ్మను ఆదరించడం..అప్పచెల్లెళ్ళను అభిమానించడం..అన్నదమ్ములను అనురాగంతో సమీపించడం!

రాయల కవిత్వరస వీక్షణం చేయడం అంటే అమ్మ తెలుగు భాష పోయిన హొయలను, పలికిన గమకాలను, కులికిన లయలను సంతోషం చెమర్చిన కళ్ళతో చూడడం. అంతే కాదు, అదికవి నన్నయగారి సంస్కృత శ్లోకంతో మొదలైన ఆంధ్ర సారస్వతంలో నాటి పదకొండవ శతాబ్ది నుండి నేటి వరకూ ఆంధ్రభాషకు అత్యున్నత స్థాయినిచ్చిన వర్ణనను శ్రీకృష్ణ దేవ రాయలే చేశాడు, వేరెవరూ చేయలేదు. దేవతలలో వెంకటేశ్వరుడికి సమానమైన దైవం కానీ, భాషలలో తెలుగు భాషకు సమానమైన భాష కానీ లేదు అని ఒక్క ముక్కలో తేల్చి పారేశాడు. ముందు ముందు వివరంగా ఈ వ్యాస సంపుటిలో ఈ సత్యాన్ని మనం దర్శించవచ్చు. విశేషించి తెలుగు నేలపై, తెలుగు భాషపై, తెలుగు ప్రజలపై అత్యంత అనురాగాన్ని కలిగినవాడు శ్రీకృష్ణదేవరాయలు. తన అధికారులుగా, ప్రతినిధులుగా తెలుగువారినే నియమించుకుని, తెలుగు వారి సర్వతోముఖాభివృద్ధికి నిరంతరమూ పెద్ద పీట వేసినవాడు.

ఆముక్తమాల్యద రాయల సర్వతోముఖ ప్రతిభకు, పాండిత్యానికి, చమత్కృతికి, పరిశీలనాదృష్టికీ, మానవతావాదానికీ అద్భుతమైన దర్పణం. వేదాలు, ఉపనిషత్తులు, ధర్మ శాస్త్రం, సంగీత శాస్త్రం, పాక శాస్త్రం..ఒకటేమిటి సమస్త శాస్త్రాలలో తన ప్రతిభకు గీటురాయిగా ఆముక్త మాల్యదను రాయలు మలిచాడు. ఆరు శ్వాసాల ఆముక్త మాల్యదా ప్రబంధంలో వున్న వేల కొలదీ గద్య పద్యాలను సమీక్షించడం ఈ వ్యాస ఉద్దేశం కాదు. ఆరు శ్వాసాల సంక్షిప్త కథనూ, ముఖ్యమైన సన్నివేశాలనూ, శ్రీకృష్ణ దేవరాయల సర్వతోముఖ ప్రతిభనూ వెల్లడించే పద్యాలనూ విమర్శనాత్మకంగా పరిశీలించడమే ఈ వ్యాస ప్రధానొద్దేశం. ఆంధ్రసాహిత్యంలో అనర్ఘ రత్నములైన ప్రబంధములలో మణిపూసవంటి , కొలికిపూసవంటి ఆముక్తమాల్యదా ప్రబంధమునకే కాక, రాయల వ్యక్తిత్వానికీ దర్పణం పట్టడం ఈ వ్యాసకర్త యొక్క లక్ష్యం. తద్వారా ఆంధ్రసాహిత్య రస గ్రహణకు, విమర్శకూ మరొక పర్యాయం ఆంధ్ర సాహిత్య ప్రియులను సంసిద్ధులను చేయడం ఈ వ్యాసం వెనుక వున్న మహదాశయం. సాహితీ ప్రియులు ఈ ప్రయత్నాన్ని ఆశీర్వదించి అభిమానిస్తారని నా ఆకాంక్ష. స్వస్తి! ****

# వ్యాసకర్త పరిచయము

వనం వేంకట వర ప్రసాద రావు

ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో 1965లో జననం, ప్రాథమిక విద్యాభ్యాసము.

తరువాత ఖమ్మంలో గ్రాడ్యుయేషన్, ఉస్మానియా విశ్వవిద్యాలయంనుండి ఆంగ్లంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్,

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం నుండి జ్యోతిష్యంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్.

తల్లి దండ్రులు:- శ్రీమతి జానకి దేవి, శ్రీ వనం వేంకట రామారావు

వృత్తి:- భారత జీవిత భీమా సంస్థ, మధిర, ఖమ్మం జిల్లాలో 1990 నుండి ఇప్పటివరకూ వికాసాధికారిగా ఉద్యోగం.ప్రవృత్తి రీత్యా ఆధ్యాత్మిక, సాహిత్య ఉపన్యాసకులు.. భక్తి, ఈ-టి.వి. 2 మొదలైన అనేక తెలుగు టీవీ చానెళ్ళలో, ఆకాశవాణిలో.

పౌరాణిక, సాంఘిక నాటక రచయిత, నటుడు, దర్శకుడు, గేయ రచయిత, ప్రయోక్త. భక్త ప్రహ్లాద, గోదా కళ్యాణం (ముక్త మాల్యద) పౌరాణిక పద్య నాటకాలు, నాలుగు సాంఘిక నాటికలు రచించి, నటించి, దర్శకత్వం వహించి అనేక రాష్ట్రస్థాయి పోటీలలో బహుమతులు పొందారు. అనేక రాష్ట స్థాయి, అంతరరాష్ట్రస్థాయి పోటీలలో నాటక ప్రదర్శన, నటన, దర్శకత్వమ్లలో బహుమతులు, ప్రశంసలు పొందిన అనుభవం. 200 పైగా కవితలు, అనేక అంశాలపై గేయాల, సంగీత, నృత్య రూపకల రచనా. అనేక టీవీ చానెళ్ళకు, ప్రైవేటు ఆల్బమ్లకు గేయరచనా, సంభాషణల రచన.

రాష్ట్రంలోని అనేక ప్రసిద్ధ పుణ్య క్షేత్రాలలో, సాహితీ కేంద్రాలో సాహిత్య, ధార్మిక, పౌరాణిక, ఆధ్యాత్మిక ఉపన్యాసకులు.

'చైతన్య భారతి సాహితీ సాంస్కృతిక సంస్థ-మధిర' అనే సంస్థను స్థాపించి, 1997 నుండి మధిర, ఖమ్మం జిల్లా లో.. సాహిత్య, సంగీత, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా, యువ సమ్మేళనాల ద్వారా, వ్యక్తిత్వవికాస ఉపన్యాసాల ద్వారా సామాజిక చైతన్యం కోసం చిరు కృషి! ఈనాడు మొదలైన అనేక దినపత్రికలలో, ఆధ్యాత్మిక మాస పత్రికలలో సాహిత్య, ఆధ్యాత్మిక, వేదాంత సంబంధ విషయాలపై అనేక వ్యాసముల రచన..

# ఆముక్తమాల్యద - పూర్వభూమిక - సంక్షిప్త కథా పరిచయం

ఆముక్త మాల్యద తెలుగు ప్రబంధములలో కెల్లా అద్భుతమైన ఋతు వర్ణనలు, పాత్ర చిత్రణమూ కల ప్రబంధమని ప్రశంసింపబడినది. ముక్తము అంటే విడువ బడినది, అంటే ధరించి విడిచిపెట్టబడినది అనే అన్వయంలో, ధరించి విడిచిపెట్టిన 'మాల్యము' అంటే మాల, పూమాల ను 'ద' అంటే ఇచ్చినది..అంటే తను ధరించి విడిచిపెట్టిన పూమాలను ఇచ్చినది, ఇంత అర్థాన్ని ఇచ్చే పేరును తెలుగులో అత్యుత్తమమైన వాటిలో ఒకటని చెప్పబడిన ప్రబంధానికి పెట్టాడు శ్రీకృష్ణ దేవరాయలు. పరమాత్ముడికి అలంకరణంగా తన తండ్రి ఐన విష్ణు చిత్తుడు నిత్యమూ సమర్పించే పూమాలను తన తండ్రికి తెలియకుండా తాను ధరించి (అంటే ఒకరకంగా ఎంగిలి చేసి..) ఇచ్చిన గోదాదేవి ఈ ప్రబంధములోని నాయిక. ఆమెయే ముక్త మాల్యద. ''శూడి క్కొడుత్తాళ్'' అనే తమిళములోని పదం, ఆముక్త మాల్యద అనే పదానికి సరి ఐన పదం. 'శూడి క్కొడుత్తాళ్ ' అంటే ధరించి ఇచ్చినది అని అర్థమట! అందుకే గోదాదేవి రెండు మాలలను స్వామికి సమర్పించిందని తమిళ సారస్వతము లోని గోదాదేవి స్తుతులు తెల్పుతాయి..( పాడిక్కొడుత్తాళ్ నర్పామాలై, పూమాలై శూడిక్కొడుత్తాళ్ళైళ్..శూడిక్కొడుత్త శుడర్కొడియే) రెండూ..ఒకటి పామాల..అంటే పాటల మాల, అంటే ఆమె తను చేసిన వ్రతంలో భాగంగా ప్రతి రోజూ రోజుకొక్కటి చొప్పున మాసం కాలం విరచించిన 30 పాశురముల అంటే పాటల మాల ఐతే, రెండవది పూమాల అంటే తను ధరించి విడిచి, ఎంగిలి చేసి స్వామికి ఇచ్చిన పుష్పమాల! ఆముక్త మాల్యదా ప్రబంధానికి 'విష్ణు చిత్తీయము' అనే రెండవ పేరు కూడా వున్నది. నాయిక ఐన గోదాదేవి తండ్రి విష్ణుచిత్తులు ఇందులో ప్రధాన పాత్ర కనుక, ఆయన నడవడిని, శీలాన్ని, విజయాన్ని ఇందులో వర్ణించడం జరిగింది కనుక దీనికి విష్ణు చిత్తీయము అని కూడా పేరు.

విష్ణుచిత్తులు వైష్ణవ ధర్మ ప్రవర్తకులలో గురువులైన పన్నిద్దరు ఆళ్వారులు అని పిలువబడే పన్నెండు మంది మహానుభావులలో శ్రేష్ఠుడు, అత్యంత భక్తుడు అని ఆయనను 'పెరియాళ్వారు' అంటే..పెద్ద ఆళ్వారు అని పిలుస్తారు! ఆళ్వారు అంటే మహాభక్తుడు అని అర్థం. మహా విష్ణుభక్తులైన వైష్ణవధర్మ గురువులలో ఈయన పెద్ద అంటే గొప్పవాడు కనుక ఈయనకు మాత్రమే ఆ పేరు. పన్నెండుమంది ఆళ్వారులలో ఒకతే స్త్రీ, ఆమెయే గోదాదేవి. పన్నెండు మంది ఆళ్వారులలో శ్రేష్ఠుడు ఐన విష్ణుచిత్తుడు, ఏకైక స్త్రీ మూర్తి ఐన గోదాదేవి ఈ ప్రబంధములోని ప్రధాన పాత్రలు కనుక, పరమ వైష్ణవుడు, విశిష్టాద్వైత మత అవలంబి ఐన శ్రీకృష్ణ దేవరాయలు దీని కర్త కనుక , ద్రావిడ గురు పరంపర ప్రభావము అనే గ్రంథము నుండి ప్రధాన కథను రాయలు ఈ ప్రబంధంకోసం స్వీకరించి స్వేచ్ఛగా, సందర్భోచితంగా కొన్ని మార్పులను చేసి, ప్రధాన కథతో జోడించాడు. విష్ణుచిత్తులు నేటి తమిళనాడులోనిది, నాటి పాండ్య ప్రభువుల ఏలుబడిలోనిది ఐన శ్రీవిల్లిపుత్తూరు అనే గ్రామంలో జన్మించారు. ఈ గ్రామానికే ధన్వానవ్య పురం అనే పేరు కూడా ఉంది, వైష్ణవ సంప్రదాయంలో. ఆ గ్రామంలో వటపత్ర శాయి ఐన మహావిష్ణువు దేవాలయం ఉంది. స్వామిని సంప్రదాయంలో వడపెరుంగోయిలాన్ అని పిలుస్తారు. ఆలయ పూజారి ఐన ముకుందాచార్యులు, పద్మ అనే దంపతులకు జన్మించిన బాలకుడు విశేష జ్ఞానము, పాండిత్యమూ లేకున్నప్పటికీ, అపరిమితమైన భక్తి, సాత్విక గుణం కలిగినవాడు. ఆయనే విష్ణుచిత్తులు. యజుశ్శాఖాధ్యాయి, బోధాయన సూత్ర అనుయాయి. తన తండ్రి వలెనే ఆయన కూడా వటపత్ర శాయిని నిత్యమూ పరమ భక్తితో అర్చన చేస్తుండేవారు. తమ తాత తండ్రులు సంపాదించి ఇచ్చిన సారవంతమైన భూమిలో ఒక గొప్ప ఉద్యానవనమును పోషిస్తూ ఫల, పుష్పములచే స్వామిని

అర్చిస్తూ..తమ తోటలోని తులసీ దళములనూ, పుష్పములనూ మాలికలల్లి నిత్యమూ స్వామికి అలంకరించి అతి నిరాడంబరమైన జీవనాన్ని గడిపే దంపతులకు సంతానం లేని కొరత మాత్రమే ఉండేది.

ఒకనాడు ఎప్పటిలాగే తన తోటలోని తులసీ దళములను సేకరించడానికి వెళ్ళిన విష్ణుచిత్తుల వారికి తోటలో ఒక అందమైన స్త్రీ శిశువు లభించింది. ఆవిడకు 'కోద్దై' అని (కోద్దై అంటే మాల, పూమాల అని అర్ధము, తమిళంలో. వాడుకలో 'గోద'యని స్థిరపడింది. తమిళంలో 'ఆండాళ్' అంటే లక్ష్మి కనుక ఆండాళ్ అని వారు పిలుచుకుంటారు) పేరుబెట్టి పెంచుకోవడం ప్రారంభించారు దంపతులు.

విష్ణుచిత్తులు తన ఆరాధ్యదైవమైన వడ పెరుంగోయిలాన్ ఆజ్ఞపై, పాండ్యదేశ మహారాజు ఐన మత్స్య ధ్వజుడి కొలువుకు వెళ్ళి మహారాజుకు వైష్ణవతత్వాన్ని బోధించి, మిగిలిన పండితులను జయించి, శ్రీ మహావిష్ణువే శ్రేష్టుడు అని నిరూపించి మత్స్య ధ్వజుడిని వైష్ణవునిగా మారుస్తాడు.

మత్స్య ధ్వజుని అసలుపేరు వల్లభదేవుడు. ఈ వల్లభ దేవుడు అంతకు క్రితం ఒక వేశ్యకు లోలుడై నిత్యమూ వేశ్యతో కామ భాగాలలో తేలి ఆనందించే వాడు. ఒక రోజు రాత్రి ఎప్పటిలాగే ముసుగువేసుకుని వేశ్యయింటికి వెడుతున్న రాజుకు ఒక యింటిఅరుగుమీద తోడి పండితులతో సంభాషణ చేస్తున్న ఒక వృద్ధ బ్రాహ్మణుడు చెప్పిన ఒక శ్లోకము వినిపిస్తుంది. '' వానాకాలపు నాలుగు నెలల కొరకు మిగిలిన ఎనిమిది నెలలో

ఆహార ధాన్యములను సమకూర్చుకొనవలెను, రాత్రిళ్ళు అవసరమయే వాటికోసం పగటిపూటనే ప్రయత్నము చేసి సిద్ధము చేసుకొనవలెను, వృద్ధాప్యము కొరకు యవ్వనములోనే తగిన జాగ్రత్తలు తీసుకొనవలెను, పరలోకములోని జీవనము కొరకు అంటే దేహానంతరము దుర్గతులు పొందకుండా ఉండవలెను అంటే ఈ జన్మలోనే మంచి కర్మములను చేయువలెను..'యిదీ ఆ వృద్ధబ్రాహ్మణుడు చెప్పిన శ్లోక తాత్పర్యము.

ఈ శ్లోకాన్ని విన్న రాజుకు ఆలోచన, పరివర్తన కలిగి, ఇంత కాలమూ తను సమయాన్ని, యవ్వనాన్ని, ధనాన్ని వెచ్చించి తుచ్ఛమైన భోగములకొరకు ప్రాకులాడినందుకు పశ్చాత్తాపము కలిగి, వెంటనే తన భవనానికి వెళ్ళి, మర్నాడు రాజగురువుతో, యితర ముఖ్యులతో సభదీర్చి తనను దయజూసి దరిజేర్చ గలిగిన దైవము ఎవరు అని నిర్ణయింపగోరి తన కొలువుకూటములో ఒక స్తంభమునకు బంగారుకాసుల

మూటను వ్రేలాడ దీయించి, తనకు తగిన ఆధ్యాత్మిక ఉపదేశమును, దైవమును చూపించిన వారికి బంగారు నాణెముల మూటను కానుకగా ప్రకటించాడు.

విష్ణుచిత్తులకు సాక్షాత్కరించిన వటపత్రశాయి రాజసభకు వెళ్ళి అక్కడి పండితులతో వాదించి అన్యమతములను నిరసించి, వోడించి, విష్ణుమతమునుస్థాపించి, రాజును వైష్ణవునిగా చేయుమని ఆజ్ఞాపించగా, ' నేను పండితుడను కాను, కేవలము నీ సేవలు తప్ప అన్యము తెలియని వాడిని అక్కడికి పంపి ఎందుకు నా పరాజయ, పరాభవాలకు నీవు అప్రదిష్టపాలుగావడం' అని అన్న విష్ణుచిత్తునకు ' నేనున్నానుగా, నీకేమీ భయము లేదు, నా ఆజ్ఞను ధిక్కరించక నీవు వెళ్ళి వాదించుమయ్యా , అంతా నేను చూసుకుంటాను అనగా, వల్లెయని విష్ణుచిత్తులు రాజసభకు వెళ్ళి , అక్కడి సర్వమతప్రతినిధులను తన పాండిత్య, జ్ఞాన, తార్కిక ప్రతిభ చేత అప్రతిభులను జేసి, శ్రీమహావిష్ణువే పరదైవము అని నిరూపించగా స్తంభమునకు వ్రేలాడదీసిన ధనపుసంచి ముడి తెగి..తనంత తానుగా నేలరాలి, విష్ణుచిత్త విజయము రూఢియై, మహారాజు ఆయనకు శిష్యుడై ఆయనను సత్కరించి పంపుతాడు.

ఆయనకు భగవద్దత్తముగా దొరికిన బాలిక గోదాదేవి తన తండ్రి ఐన విష్ణు చిత్తులు స్వామికి అలంకరించుటకు సిద్ధము జేసే పూలమాలికలనూ, తులసీమాలికలనూ తనతండ్రి చూడకుండా ధరించి పరవశించి పోతూ మరలా మాలలను ఏమీ ఎరుగనట్లు యథాస్థానములో నుంచేది. విషయము తెలియని ఆమెతండ్రి ఆ మాలలనే స్వామికి అలంకరించేవాడు. ఒకనాడు విష్ణుచిత్తులవారు స్వామికి సిద్ధం చేసిన మాలికను తనకూతురు ధరించడం చూసి, కుమార్తెను మందలించి, రోజు మాలను స్వామికి అలంకరించడమ్మాని, మిగిలిన పూజను యథావిధిగాచేసి, నిదురించగా, స్వామి స్వప్నంలో దర్శనమిచ్చి, ఆమె తన ఆంతరంగిక భక్తురాలనియూ, ఆమె ధరించి ఇచ్చిన మాల తనకు అత్యంత ప్రీతికరమైనది అనీ తెలిపి, ఆమె కారణజన్మురాలని తెల్పుతాడు. దినదిన ప్రవర్ధమానయై అతిలోకలావణ్యవతియై పెరుగుతూ, బాల్యమునుండే విష్ణుభక్తి గలదియై, తనతోనే పెరుగుతున్న విష్ణుభక్తి చేత మహావిష్ణువును ఆరాధించి, ఆయనను తప్ప అన్యులను వివాహమాడనని నిశ్చయించుకుని, స్వామిమీద

విరహముతో కృశించి పోవుచూ చివరికి ఆత్మత్యాగము చేయుటకైననూ నిశ్చయించుకొనగా ఆమె చెలికత్తెలు వారించి, గోదాదేవి సాక్షాత్తూ భూదేవి అంశతో జనించిన కారణ జన్మురాలని, పూర్వ జన్మలో గోదాదేవియే సత్యభామయనీ, తాము నాగకన్యలమనీ , క్రితం జన్మలో తామే గోపికలుగా వున్నప్పుడు, కాత్యాయనీ వ్రతము చేసి శ్రీకృష్ణుని భర్తగా పొందినట్లే ఈ జన్మలోనూ గోద వ్రతమును చరించినట్లయితే స్వామిని పొందవచ్చు అని తెలుపుతారు. వారి ఉపదేశానుసారము మార్గశిర మాసములో ధనుస్సంక్రమణంతో మొదలై మాసం సాగే ధనుర్మాసములో గోదాదేవి నెలరోజులు కాత్యాయనీ వ్రతమును చేసి, నెలరోజుల వ్రతములో తనను గోపకన్యగా, తన చెలికత్తెలను గోపకన్యలుగా, తన విల్లిపుత్తూరును నందగోకులంగా తమనాధుడు శ్రీకృష్ణుని పొందడంకొరకు చేసే వ్రతంగా ఆ వ్రతాన్ని భావించి, ప్రతిరోజూ ఒక దివ్యమైన గేయాన్ని రచించి స్వామికి వినిపించేది. ఈ వ్రతనిష్ఠలతో, ఉపవాసములతో, విరహముతో నానాటికీ చిక్కి శల్యమైపోయిన కుమార్తె స్థితినీ, ఆమె మన్మధావస్థనూ అమాయకుడైన విష్ణుచిత్తుడు గుర్తించక తనస్వామితో వాపోతాడు. స్వామి ' ఈమె నన్నే ఆరాధించుచున్నది, నాకొరకే ఈ అవస్థ యంతయూ..సమస్త భక్తి విధానములలోనూ గాన కైంకర్యము చేత నేను అత్యంత తృప్తి పొందుతాను. నిష్కల్మషమైన భక్తి చేత నన్ను పొందుటకు ఎవ్వరికైననూ ఏ విధముగా పొందుటకైననూ అడ్డంకులు లేవు, రావు ' అని దానికి ఒక ఉదాహరణముగా ఒక పరమభక్తుడు ఐన మాలదాసరి కథను చెప్తాడు విష్ణు చిత్తులవారికి.

ఒక మాలదాసరి నిత్యమూ మంగళ కైశికీ రాగంలో కీర్తనలను రచించి స్వామికి మేలుకొలుపులు పాడి వినిపించి సేవించేవాడు. ఒకనాటి అర్ధరాత్రంలో ఒక అడవిపిల్లి కోళ్ళగుడిశెలో దూరగా కోళ్ళు భయంతో అరవడంతో కోడికూతలకు తెల్లవారినదని భ్రమచేత, మాలదాసరి యింటినుండి బయలుదేరి చీకటిలో దారి తప్పి, ఒక బ్రహ్మరాక్షసునకు చిక్కి, వానికి ఆహారము కాబోయి, వానిని బ్రతిమిలాడి, ప్రాధేయపడి, స్వామికి రోజుకూడా మేలుకొలుపు పాడి వచ్చి ఆహారము నౌతాను అని అతి కష్టము మీద బ్రహ్మరాక్షసుని ఒప్పించి, అదే ప్రకారముగా స్వామికి గాన కైంకర్యము చేసి, వచ్చి, తనను చంపి తినవచ్చునని చెప్పగా, బ్రహ్మరాక్షసుడు మాలదాసరి సత్య నిష్ఠకు ఆశ్చర్యపడి, తని ఔన్నత్యమును గుర్తించి, పాదములపైబడి, తను పూర్వజన్మలో ఒక బ్రాహ్మణ యువకుడననీ భ్రష్టుడై, దుష్టకర్మల కారణంగా ఈ జన్మ వచ్చినదనీ చెప్పి మాలదాసరిని తన గాన కైంకర్య ఫలితాన్ని తనకు ధార పోసి తన బ్రహ్మరాక్షస రూపమును తొలగించమని వేడుకొని, బ్రతిమిలాడి, ప్రాధేయపడగా, ఎట్టకేలకు నాటి గాన కైంకర్య ఫలితాన్ని మాత్రము ధార పోసెదనని మాలదాసరి పలికి, ఆ గాన ఫలితాన్ని సమర్పించగా, బ్రహ్మరాక్షసుడికి పూర్వ రూపము, పాండిత్యమూ వచ్చి, మాల దాసరి పాదములపై బడి దాసరిని తన గురువుగా స్తుతించి, శ్రీరంగములో స్వామికీ, గోదాదేవికీ కళ్యాణము జరుగబోవుచున్నదని పలికి దాసరితో గూడి శ్రీరంగమునకు చేరుకుంటాడు.

ఈ కథను వినిపించి, గోదాదేవిని శ్రీ రంగమునకు తోడ్కొనివచ్చి సమస్త లాంఛనములతో తనకు ఇల్లాలిని చేయుమని చెప్పి స్వామి విష్ణుచిత్తునితో పలుకగా అట్లేయని విష్ణుచిత్తుడు గోదాదేవిని స్వామికి కన్యాదానం చేయగా, గోదాదేవి శ్రీ రంగని పెండ్లాడి ఆయనలో ఐక్యమై పోతుంది. యిది సంక్షిప్తంగా కథ. ప్రధానంగా 'గురుపరంపరా ప్రభావము' అనే వైష్ణవ గురువుల చరిత్ర ఐన ప్రాచీన గ్రంథమునుండి గ్రహించిన మూల కథతో విష్ణు పురాణము, వరాహ పురాణము, అనేకములైన ఉపనిషత్తులు, వేదములు, ధార్మిక గ్రంధములనుండి గ్రహించిన అనేక వివరములతో, అనేక శాస్త్రముల మర్మములతో, తన లోక పరిశీలనా పాటవంతో, కథన వైశిష్ట్యంతో సాటిలేని ప్రబంధముగా ఆముక్తమాల్యదను శ్రీకృష్ణదేవరాయలు తీర్చిదిద్దాడు. శ్రీకృష్ణదేవరాయల అంతటి పరిశీలనాదృష్టి కలిగిన, సన్నివేశముల, పాత్రల చిత్రణ చేసిన కవులు చాలా కొద్దిమంది మాత్రమే కనిపిస్తారు ప్రబంధ యుగంలో కూడా.. కొద్దిమంది కన్నా కూడా ఒక పిసరు ఎక్కువ లోకానుభవము వివిధ శాస్త్ర పరిచయము రాయలకే వున్నాయి అనిపిస్తుంది. ఇది కేవలం ఒక సంక్షిప్త కథ మాత్రమే. రాయలు తన రచనకు స్వీకరించిన వాటిలోనుండి మార్పులతో, చేర్పులతో, నూతన వ్యాఖ్యానముతో జోడించి ఆముక్తమాల్యదలో ఇచ్చాడు. ఒక్కొక్క ఆశ్వాసములోని ప్రసిద్ధమైన, ముఖ్య పద్యాలను, సన్నివేశాలను తెలుసుకునే సందర్భములో ఈ వివరాలను మనం పూర్తిగా తెలుసుకుందాము. స్వస్తి!!!

***

# ప్రథమాశ్వాసము

ఉ.

శ్రీ కమనీయ హారమణి చెన్నుగ దానును కౌస్తుభంబునం
దా కమలావధూటియు నుదారత దోప పరస్పరాత్మలం
దాకలితంబులైన తమ యాకృతు లచ్చత పైకి దోచియ
స్తోకతనందు దోచెనన శోభిలు వేంకట భర్త గొల్చెదన్

శ్రీ- కమనీయ - హారమణిన్ = లక్ష్మీదేవి యొక్క కమనీయమైన హారములోని మణిలో

చెన్నుగ - తానును = బాగుగా తాను

కౌస్తుభంబునందు - కమలా వధూటియున్ = కౌస్తుభమునందు లక్ష్మీ దేవియును

ఉదారతన్ - తోపన్ = మిక్కిలిగా ప్రతిబింబించగా

పరస్పర ఆత్మలందున్ - ఆకలితంబులైన = పరస్పరము ఒకరి మనసులో ఒకరు నిలిచిన
తమ ఆకృతులు - అచ్ఛతన్ - పైకిన్ - తోపన్ = తమ తమ ఆకారములు శరీర స్వచ్ఛత చేత బయటకు కనిపించగా
అస్తోకతన్ - అందున్ - తోచెన్ అన = మిక్కిలి ఎక్కువ యౌట చేత వానిలో కనిపించెను అన్నట్లుగా
శోభిలు - వేంకట భర్తన్ - కొల్చెదన్ = వెలుగొందు వేంకటాచల పతిని కొలిచెదను

ఇది ఆముక్తమాల్యదా ప్రబంధంలోని ప్రథమపద్యం. తొలి పద్యంలోనే అద్భుతమైన విశేషాలను చూపించాడు రాయలు. మొదటి విశేషము తన స్వతంత్ర భావావేశము, రీతి. సాధరణముగా శార్దూల వృత్తముతో ప్రబంధాన్ని ప్రారంభించడం ఆనవాయితీ. ప్రసిద్ధ ప్రబంధకారులందరూ అలాగే చేశారు. ''శ్రీ వక్షోజ కురంగ నాభమెదపై చెన్నొంద ..'' అని పెద్దన తెలుగులో తొలి స్వతంత్ర కావ్యమైన, ప్రబంధమైన మనుచరిత్రను, 'శ్రీరామా కుచమండలీమృగమద శ్రీగంధసంవాసిత స్ఫారోదార భుజాంతరుండు'...అని శ్రీనాధుడు శృంగార నైషధాన్ని, 'శ్రీ భూపుత్రి వివాహ వేళ నిజ మంజీరాగ్ర రత్న స్వలీలాభివ్యక్తిన్'..అని భట్టుమూర్తి వసుచరిత్రనూ, 'శ్రీకాంతామణి గన్మొరంగి మది ధాత్రిన్మంచినన్' అని తెనాలి రామకృష్ణుడు పాండురంగ మాహాత్మ్యాన్నీ ప్రారంభించారు, ఒక ఉదాహరణ కోసం, మరొక నాలుగు తెలుగుమహాకావ్యాలను స్మరించడం కోసం ఈ వివరం. రాయలు మాత్రం ఉత్పలమాలా వృత్తంతో ప్రారంభం చేశాడు. సరే, ఉత్పలమాల తోనే ఎందుకు అనేది యింకా విశేషం. గ్రంథ కథ మాలతో ముడిపడి వుంది కనుక, గ్రంథ నామములోనే మాల వున్నది కనుక, ఒక మాలను సూచించడం కోసము అలా చేశాడు, కేవలం అదే అయితే చంపకమాలా వృత్తం కూడా సరి ఐనదే కావొచ్చు కదా, చంపక మాలా వృత్తం ఎందుకు వాడలేదు అంటే ఉద్దేశ పూర్వకంగానే..అని నా ఉద్దేశం.

''లౌకికానాం హి సాధూనాం అర్థం వాగనువర్తతి , ఋషీనాం పునరాద్యానాం వాచమర్థోనుధావతి '' అని ఒక గొప్ప మాట అన్నాడు భవభూతి 'ఉత్తర రామచరితము' అనే గొప్ప నాటకంలో,అంటే, లౌకికులైన మహానుభావులైనవారి వాక్కులకు అర్థం అనుసరించి వస్తుంది, అంటే వారి వాక్కులు అర్ధవంతములుగా ప్రయోజన పూర్వకములుగా వుంటాయి, కానీ, ఋషుల అర్ధములను బట్టి వాక్కు తనంత తానుగా అనుసరించి వస్తుంది, అంటే వారి మనసులోని అర్ధాన్ని అనుసరించి పలుకులు తమంత తాముగా మేమంటే మేము అని వస్తాయి, సామాన్య కవి పండితులలాగా వాక్కులకోసం వెదుక్కునే, పలుకులకోసం పలవరించే పరిస్థితి ఉండదు. వాక్కులే వారి బంట్లవలె ఎదురుచూస్తూంటాయి వారి మనసులోని అర్ధానికి అక్షర రూపాన్ని ఇవ్వడం కోసం. శ్రీకృష్ణ దేవరాయలు ఋషి తుల్యుడు. సందేహమే లేదు.

ఉత్పలమంటే కలువ. నీలోత్పలమంటే నల్లకలువ. కలువలలో శ్రేష్ఠమైనది నల్లకలువ. ఇందులో నాయిక వరించినది నల్లనయ్యను. కనుక నీలోత్పలం స్ఫురణకు వచ్చింది కనుక ఉత్పలమాల నీలోత్పలమాల ఐపోయిందిక్కడ. మరొక విశేషం కూడా వున్నది. మన్మధుడిని పంచబాణుడు అన్నారు భారతీయులు. ఆయన బాణాలు పూలే. ఐదు పూల బాణాలు అరవిందము( పద్మము, తామర పూవు ), అశోకము ( అశోక పుష్పము ), మామిడి, నవమల్లిక, నల్లకలువ. ఈ ఐదు పూలకూ మాదనము ( కామము ), ఉన్మాదము, సంతాపనము ( దు:ఖము ), సంశోణము ( శుష్కి ంచి పోవడం), నిశ్చేష్టాకరణము అనే ఐదు విశిష్ఠ గుణాలున్నాయి. ఈ

ఐదు గుణాలూ ఒకటిగా ప్రారంభమై, క్రమ క్రమంగా తర్వాతి దాన్ని, తర్వాతి దాన్ని కలుపుకుంటూ పోయి చివరికి ఐదవది ఐన నిశ్చేష్ఠగా పరిణమిస్తాయి! అంటే చివరి దాంట్లో అంతకుముందు చెప్పిన నాలుగు గుణాలూ కలిసిపోయి ఉంటాయి అన్నమాట! అంటే, వలచినవారి మీద మదనభావము చిగురించి, అది తీరకుంటే ఉన్మాదమైపోయి, బాధ తీవ్ర దు:ఖానికి దారి తీసి, వలచిన వారి కోసం నిద్రాహారాలు మాని శుష్కించి, చివరికి చేష్టలుడిగి స్తంభించి పోవడం లేదా జడత్వం దాపురించడం జరుగుతాయి. నల్లనయ్య ప్రేమలో పడి, ఈ అవస్థలను అన్నింటినీ అనుభవించి చివరికి నిశ్చేష్ఠ ఐపోయింది గోదాదేవి, ఇక ఏమీ చేయడానికి చేత కాని స్థితిలో చివరికి ఆత్మ త్యాగానికి కూడా సిద్ధమయ్యింది, అంతే గాదు, తన ప్రేమ, మోహ, కామ పాశాల్లో బంధించడం కోసం సాక్షాత్తూ నల్లనయ్యపై ఇన్ని బాణాలూ ప్రయోగించి ఐదవ బాణంతో యన్ని కూడా నిశ్చేష్టావస్థకు గురి చేసింది. లోకంలో సహజంగా పిల్లనిస్తామని వెళ్తారు పిల్ల తల్లిదండ్రులు, ఇక్కడ మాత్రం కథ తారుమారై పిల్లనివ్వమని లోకేశ్వరుడే పిల్ల తండ్రిని అడిగి బ్రతిమిలాడే వరకూ వెళ్ళింది కథ చివరికి. నీలోత్పలానికి ఇంత కథ వుంది కనుక, నీలోత్పల సూచనకోసం, ఉత్పలమాలను ఉద్దేశపూర్వకంగా రాయలు తన ప్రారంభ పద్యానికి ఎన్నుకున్నాడు!

ప్రహ్లాదుడు కూడా శ్రీహరిని తీవ్రంగా ఆరాధించి, ప్రేమించి, ఏకాంతంలో రోదించేవాడు, మైమరచిపోయి గానం చేసేవాడు, శ్రీ హరి తప్ప వేరే ఏమున్నది అని సన్నగా నవ్వుకునే వాడు, శ్రీ హరి అనే పెన్నిధి దొరికిందని ఎగిరి గంతులు వేసేవాడు ఒకోసారి, చివరికి 'ప్రణయ హర్ష జనిత బాష్ప సలిల మిళిత పులకుడై నిమీలిత నేత్రుడై ఒక చోట నిలిచి వూరకుండు' అన్నాడు పోతన మహానుభావుడు! పరమాత్మునితో ప్రేమలో పడినా చివరికి చేష్టలుడిగి పోవడం జరుగుతుంది, సమాధిభావం అంటే అదే! పరమాత్ముడు ఒక్కడే పురుషుడు సృష్టిలో, మిగిలిన అందరూ స్త్రీలే, ఈ భావంతో పరమాత్ముడిని నాథునిగా ఆరాధించడాన్ని మధుర భక్తి మార్గం అంటారు, భారతీయ భక్తి వేదాంతంలో. రాధాదేవి ఈ మార్గానికి ఆద్యురాలు. కలియుగంలో ఈ ప్రణయభక్తి మార్గానికి పరాకాష్ఠగా జన్మించిన జగజ్జనని అంశ ఐన గోదాదేవి శ్రీ కృష్ణుడిని ఆరాధనకు, ప్రణయ భక్తికి గురుస్థానీయురాలు! గోదాదేవియే ఈ ప్రబంధ నాయకురాలు కనుక, ఆమె పరమాత్ముని ప్రేమలో పడి, తాను ధరించి వదిలిన 'పూ మాలను' ఆయనకు ఇచ్చిన విషయాన్ని సూచించడం కోసం తాను కూడా ఒక మాలను, ఉత్పల మాలను, సమర్పించాడు వేంకటేశ్వరుడికి.

ఇక పద్యాన్ని పరిశీలిస్తే, 'శ్రీ' యొక్క అంటే లక్ష్మి యొక్క మెడలోని కమనీయమైన హారంలోని మణిలో తను, తన వక్షస్థలం మీది కౌస్తుభ మణిలో ఆవిడ పరస్పర ప్రేమాతిశయంచేత కనిపిస్తున్నారు. ఇద్దరూ తమ తమ ఆత్మల్లో, హృదయాలలో, ఒకరినొకరు నిలుపుకుని వున్న కారణం చేత, స్వచ్ఛమైన ఆ త్మల కారణంగా, మరీ స్వచ్ఛమైన శరీరములనుండి పైకి వచ్చి మరీ కనిపిస్తున్నాయేమో అన్నట్లుగా, ఆవిడ మెడలోని హారంలోని మణిలో ఈయన, ఈయన వక్షస్తలంపైన వున్న కౌస్తుభ మణిలో ఆవిడ కన్పిస్తున్నారు. ఈ రకంగా శోభిల్లే వేంకటాచలపతిని నేను సేవించెదను అని తన మనోరథాన్ని వెల్లడించాడు.

చాలా చమత్కారపూర్వకమైన పద్యం ఇది. జాగ్రత్తగా చూస్తే ఇక్కడ మూడు దృశ్యాలున్నాయి. ఒకటి లక్ష్మీదేవి అమ్మవారు. ఆవిడ మెడలోని హారంలో మహావిష్ణువు కనిపిస్తున్నాడు. రెండవది విష్ణుమూర్తి. ఆయన వక్షస్థలం పైన వున్న కౌస్తుభ మణిలో లక్ష్మీదేవి కనిపిస్తున్నది. మూడవ దృశ్యం శ్రీ వేంకటాచలపతి. లక్ష్మీదేవి మనసు లోపల హృదంతరాళంలో వున్న వాడే పైన వున్న హారంలో ప్రతిఫలించాడు. ఎంత గొప్ప భక్తుడో, ఉపాసకుడో, రాయలు ఎంత జ్ఞానియో, అవధులు లేని పాండిత్య, ప్రతిభా, వ్యుత్పత్తులకు పెన్నిధివంటివాడో చెప్పడానికి ఈ పద్యం ఒక మచ్చు తునక. 'అంతర్బహిశ్చతః స్సర్వం వ్యాప్య నారాయణ స్థితః అనంతమవ్యయం కవిగుం సముద్రేంతం విశ్వ శంభువం..'' బయటా, లోపలా అంతటా వ్యాప్తమైవున్న, అందరిలోనూ, అన్నింటా ఉన్నదే విష్ణు తత్వము అని నారాయణోపనిషత్తులోని ఈ మంత్రార్థాన్ని స్ఫురింప జేశాడు ఉపాసనా పరంగా, ఉపనిషత్తుల పరంగా, సర్వభూతముల హృదయ దేశంలో నేనున్నాను అర్జునా అన్న గీతాచార్యుని పలుకులను ధ్వనించాడు. అన్నింటా వున్నవాడే అమ్మ హృదయంలో వున్నాడు కనుక ఆయనే పైకి కనిపించాడు, అమ్మ యొక్క స్వచ్ఛత కారణంగా.

ఆవిడ స్వచ్ఛమైన దేహంలోనుండి లోపలి హృత్పుండరీకంలో వున్న ఈయన కనిపించాడు అంటే, స్వచ్ఛమైన మనసుతో స్వామినే తప్ప ఎవరినీ తెలియని పతివ్రత కనుక, స్వచ్ఛమైన దేహం లక్ష్మిది, కనుక స్వచ్ఛమైన దేహం పారదర్శకం గావడంచేత పైన వున్న హారంలోని మణిలో లోపల వున్న ఆయన కనిపించాడు అంటే , అంతే స్వచ్ఛమైన హృదయంతో తననే హృదయంలో నిలుపుకున్న గోదాదేవిని ఇలాగే కరుణించాడు, కరుణిస్తాడు అని ధ్వని. లక్ష్మీ విష్ణులు అభిన్నులు, పార్వతీశివుల వలెనే, సరస్వతీ బ్రహ్మలవలేనే, సీతారాములవలెనే , వాక్కూ దాని అర్థముల వలెనే, సూర్యుడూ యన వెలుతురు వలెనే. కనుకనే లక్ష్మీ విష్ణుల సంయోగ తత్వమైన వెంకటేశ్వరునికి, తన ఇష్ట దైవమైన వెంకటేశ్వరునికి వందనములు చేస్తున్నాడు.

లౌకికంగా చూసినా ఆభరణాలలో తమ ప్రియుల ప్రియురాండ్ర చిత్రాలను ఉంచుకోవడం కొత్త విషయమేమీ కాదు. హృదయానికి దగ్గిర ఆభరణాలలోనే కాదు, హృదయాలలోనే పరస్పరం వారు ఒకరినొకరు నిలుపుకున్నారు అని చెప్పడం అందరికీ తెలిసిన విషయమే ఐనా మరలా చెప్పడం ఎందుకంటే అనురాగము, అరిభావము (శత్రుత్వము) రెండూ పరస్పరం ఇచ్చిపుచ్చుకునే దాన్నిబట్టే పెరగడం, తరగడం అనేవి వుంటాయి. ఆయన ఆమెను తన హృదయ పీఠంలో నిలుపుకున్నాడు కనుకనే, ఆవిడ ఆయన పదముల చెంత కనిపిస్తుంది ఎప్పుడూ! మరొక దివ్యమైన లౌకిక అందం ఏమిటంటే చివరిలో ముక్తాయింపుగా వేంకటేశ్వర సేవ చేసెదను అని ముగించాడు. వేంకటేశ్వరునితో ప్రారంభం ఐంది ఆయన మనసులో భావం, వేంకటేశ్వరుని హృదయ పీఠంపై వుండే లక్ష్మీ దేవి అమ్మవారి మూర్తి దర్శనమిచ్చింది, వేంకటేశ్వరుని వక్షస్థలంపైన వుండే కౌస్తుభమణి కనిపించింది, అందులో అమ్మవారు కనిపించింది. శుద్ధ సాత్విక భావం స్వచ్ఛమైనది. శుద్ధ సత్త్వ స్వరూపులైన ఇద్దరి స్వచ్ఛమైన దేహాలలోనుండి ఇరువురి హృదయాలలోని మూర్తులు కనిపిస్తున్నాయా అన్నట్లు ఉన్న వేంకటేశ్వరుని స్మరణతో ప్రారంభం చేశాడు, వేంకటేశ్వరుడు లక్ష్మీ నారాయణుల సమిష్టి తత్త్వం అనే సూచనతో!

వేదములకు ఓంకారము ప్రథమాక్షరం వలెనే, కృతులకు శ్రీ కారము ప్రథమము..అని సూక్తి, కనుక, శ్రీ కారముతో మొదలుబెట్టాడు. ఆదిలో మంగళం, మధ్యలోనూ మంగళం, చివరిలోనూ మంగళ సూచకములుగా మహా కావ్య రచన వుండాలి కనుక, శ్రీవాచకముతో మొదలుబెట్టడం, మంగళ వాచకముతో మొదలు బెట్టడం కావ్య లక్షణం, సంప్రదాయం కనుక 'శ్రీ'కారం చుట్టి మొదలుబెట్టాడు! ఆశీస్సు, నమస్కారము, వస్తునిర్దేశంతో మంగళ కావ్య ప్రారంభం చేయడం సంప్రదాయం కనుక ..ఇన్నీ కలిసి వచ్చేలా, మంగళ వాచకంతో, ధ్వనిగా వస్తు నిర్దేశంతో (అంటే కావ్యానికి సంబంధించిన విషయ సూచనతో), నమస్కారంతో(వేంకటాచల పతికి) తన కావ్య ప్రారంభం చేశాడు, అత్యుత్తమమైన లోక పరిశీలనా, ప్రతిభా, పాండితీ, వ్యుత్పత్తీ, ఆధ్యాత్మిక జ్ఞానములనే పంచనదుల ప్రవాహంగా, పరమాత్మసాగరానికి అభిముఖంగా, తన కవిత్వ రస ప్రవాహాన్ని పరుగులెత్తించాడు!

కావ్య ప్రారంభంలోనే తన సర్వ స్వతంత్ర సార్వభౌమ లక్షణాన్ని చాటాడు. తనకు అవసరం లేదు అనుకున్న శార్దూల వృత్తంతో ప్రారంభం, 'మ' గణముతో ప్రారంభం అనే సంప్రదాయాన్ని ఎంత చవగ్గా పక్కకు బెట్టాడో, మిగిలిన కావ్య లక్షణాలనూ, సంప్రదాయాన్నీ అంత నెత్తికెత్తుకున్నాడు. అంతేగాదు, కావ్యంలో తన స్వేచ్ఛ ప్రకారమే గోదాదేవిని, జగజ్జనని పాత్రను, ఇది ప్రబంధం కనుక, ప్రబంధ నాయికగా కావలసిన శృంగార లక్షణాలు అన్నింటినీ ఆరోపించి అద్భుతమైన వర్ణనలు చేశాడు, కనీసం ఒక్క చోట గూడా పూర్తి ఆధ్యాత్మిక సూచనలైన తిరుప్పావై పాశురాల జోలికి వెళ్ళలేదు, ఆళ్వారుల గురు పరంపరా ప్రభావం లోనుండి తీసుకున్న విషయాలను కూడా తన ప్రణాళిక ప్రకారం, మార్పులూ, చేర్పులూ, కథలను వెనకా ముందూ చేసి, ప్రబంధ విలువలకు పెద్ద పీట వేశాడు, దేశ, కాల, పాత్రల పరిమితులను పక్కకు బెట్టి, అపరిమితమైన ఆనందాన్నే, సందేశాన్నీ ఇవ్వడం కోసం. ప్రత్యేకించి నాటకీయత, పాత్ర చిత్రణం, పాత్రలతో పలికించే సంభాషణల గొప్పదనానికి ఆముక్త మాల్యదకు సాటివచ్చే ప్రబంధం లేదు. అంతే కాదు, ప్రత్యేకించి ఒక సందేశాత్మకమైన కథను, మాల దాసరి కథను, ఎక్కడో వరాహ పురాణంలో ఉన్నదాన్ని తీసుకొచ్చి, ప్రధాన కథకు అద్భుతంగా జోడించి, అత్యుత్తమ ఆధ్యాత్మిక జ్ఞాన ప్రబోధం చేశాడు రాయలు. ఈ వ్యాసములో కూడా మరీ లోతైన పూర్తి ఆధ్యాత్మిక విషయాలను చెప్పిన వాటిని దాటేసుకుని, ప్రబంధ సంబంధమైన, రస సంబంధమైన, సరస సంబంధమైన వాటిని మనం ఎక్కువగా పరిశీలన చేద్దాము, కేవలం సాహిత్య ప్రేమికులు ఐన వారిని దృష్టిలో పెట్టుకుని.

ప్రథమాశ్వాసంలోని ఈ ప్రథమ పద్యంలోని ఇంకొక్క చమత్కారాన్ని చర్చించుకుని ముందుకు సాగిపోదాం. ఎదురెదురుగా ఉంచిన దర్పణాలలో కనిపించే ప్రతిబింబముల సంఖ్య అనంతము! ఇక్కడ కూడా అదే చమత్కారం చేశారు రాయలవారు. వేంకటేశ్వరుని మూర్తిలో వక్షస్థలం పైన కౌస్తుభ మణి వుంది. అందులో అమ్మవారు దర్శనమిస్తుంది. దర్శనమిచ్చిన అమ్మవారి హారం లోని మణిలో అయ్యవారు దర్శనమిస్తారు..మరలా కౌస్తుభమణి కూడా కనిపిస్తుంది కదా..అందులో మరలా అమ్మవారు..ఇలా అనంత మూర్తుల అంతులేని దివ్య దర్శనాల పరంపర అన్నమాట, ఇది ఎందుకంటే, ఆయన అనంతుడు, అనంతమైన విశ్వకర్త అని ఈయనకు నమ్మకం గనుక. పైన ప్రారంభంలో ఉదాహరించుకున్న 'అంతర్బహిశ్చతః సర్వం వ్యాప్య నారాయణ స్థితః' తర్వాతి వాక్యం 'అనంత

మవ్యయం కవిగుం సముద్రేంతం విశ్వ శంభువం..'అంటే, అనంతుడు, అవ్యయుడు (తరిగి పోనివాడు, అంటే క్షీణించడం,నశించడం లేనివాడు ), సృష్టి కర్త, సముద్ర పర్యంతమైన విశ్వానికి ఆయన అధిపతి కనుక.

అంతే కాదు, ఇక్కడ వక్షస్థల వ్యూహ లక్ష్మిని రాయలవారు చెప్తున్నారు. తిరుపతి శ్రీ వేంకటేశ్వరుని నిజరూప దర్శన సమయంలో ప్రతి ఉదయమూ వక్షస్థలం మీద వున్న లక్ష్మీదేవిని పూజిస్తారు. వేంకటేశ్వరునికి తులసీదళములతో అర్చన చేసిన తర్వాత ఆ అర్చనలో ఉపయోగించిన తులసీ దళము లతోనే మరలా పద్మాసన, ద్విభుజ ఐన లక్ష్మీ అమ్మవారిని పూజిస్తారు, వరాహపురాణాంతర్గత చతుర్వింశతి ( 24 ) నామములతో. ఓం శ్రీ య్యై నమః..తో మొదలై ఓం అబ్ధి జాతాయై నమః అనే ఇరవై నాలుగు నామముల లోని మొదటిదైన 'శ్రీ' పదమును వాడడం, వక్షస్థలముమీది అమ్మవారిని చూడడం, అమ్మవారి మెడలోని హారపు మణిలో స్వామివారిని చూడడం ఇవన్నీ ఇందుకు సూచనలుగా, ఈ వర్ణనకు అనువుగా, పైన చెప్పిన గ్రంథార్ధమును సూచించడం కోసం, భావి కథా సూచకంగా, అనంత సృష్టి చతుర్వింశతి తత్త్వములతో నిండి వున్నది కనుక (శబ్ద, రూప, స్పర్శ, రస, గంధములనే పంచ తన్మాత్రలు, ప్రుథివ్యాపస్తేజో వాయురాకాశములనే పంచ భూతములు, పంచ కర్మేంద్రియాలు, పంచ జ్ఞానేంద్రియాలు, మనసు, బుద్ధి, చిత్తము, అహంకారము అనే అంతఃకరణ చతుష్టయం..ఇవీ ఇరవై నాలుగు తత్త్వములు..వీటి పంచీకరణం అంటే రక రకాల పాళ్ళలో మిశ్రమం చేయడం వలన, మరొక భాషలో చెప్పాలి అంటే ఈ ఇరవై నాలుగు తత్త్వముల పర్మ్యుటేషన్స్ అండ్ కాంబినేషన్స్ వలన సృష్టిలోని భూత కోటి ఉధ్భవించింది అని భారతీయ వేదాంత శాస్త్రం చెప్తుంది). ఆ చతుర్వింశతి తత్త్వ సూచకంగా చతుర్వింశతి నామములతో చేసే వ్యూహ లక్ష్మీ పూజను ధ్వనిస్తూ, వేంకటేశ్వరుని ప్రార్ధనతో తొలి పద్యాన్ని అందించి ఆముక్తమాల్యదా గ్రంథాన్ని ప్రారంభం చేశాడు రాయలవారు!

**ప్రథమ పద్యం తరువాత,** ఇది విష్ణు సంబంధమైన ప్రబంధం కనుక, శ్రీ కృష్ణ దేవరాయలు, తను వ్యక్తి గతంగా వీరవైష్ణవుడు కనుక , వరుసగా దిశేషుడైన అనంతుని ఒక పద్యంలో, విష్ణు వాహనమైన గరుడుడిని ఒక పద్యములో, విష్ణు కార్య దురంధరుడు, వైష్ణవ భక్తి మార్గంలో దేవసేనాపతి ఐన విష్వక్సేనుడిని ఒక పద్యంలో, అలాగే పాంచజన్య శంఖమునూ, సుదర్శన చక్రమునూ, శ్రీ హరి గద ఐన కౌమోదకీ గదనూ, శ్రీ హరి విల్లు ఐన శార్ఙ్గ ధనుస్సును, శ్రీహరి ఖడ్గమైన నందకమును, వైష్ణవ మార్గ గురువులు ఐన పన్నిద్దరాళ్వారులనూ ..ఇలా మొత్తం తొమ్మిది పద్యాలలో ఇష్ట దేవతా స్తుతిగా మహావిష్ణు పరివారముగా భావించే పైన చెప్పిన అందరినీ, ఆయన ఆయుధములనూ, వైష్ణవ మార్గంలో శ్రేష్ఠులు ఐన గురువులనూ ప్రార్ధించి ఆ తర్వాత ఈ గ్రంథ రచనకు కారణమైన దివ్య సన్నివేశాన్ని ఒక అద్భుతమైన దృశ్య కావ్యంగా మలిచి వర్ణించాడు.

పైన చెప్పుకున్న తొమ్మిది పద్యాలూ నిజంగా నవరత్నాలు. అద్భుతమైన వర్ణనలు, చమత్కారము వున్నాయి, కానీ ప్రత్యేకించి ఆధ్యాత్మిక అంశాలు గనుక వాటి గురించి విశేషముగా ఇక్కడ చర్చ చేయకుండ, ఒక మాట మాత్రం చెప్పుకుందాం. భగవంతుడి పరివారము, ఆయుధములు, భక్తులు వీరందరూ కూడా భగవత్సమానులే..వారిని స్మరించుకొనడం చేత భగవానుడికి తనను స్మరిస్తే ఎంత ప్రీతి కలుగుతుందో, అంతటి ప్రీతి కలుగుతుంది. కనుక ఈ ప్రార్ధనలు. సంప్రదాయ ప్రకారం కూడా ముందు పరివార

దేవతలను సేవించి, వారి అనుమతితో, వారిని సంతృప్తులను చేసిన తర్వాత ప్రధాన దేవతను సేవించాలి. లౌకికంగా చూసినా, మనము అత్యంత ప్రేమతో ఆరాధించే వారి ప్రతి కదలిక, కట్టూ, బొట్టూ, మాట తీరూ అన్నీ మనను మైమరచిపోయేట్లు చేయడం ఎంత సహజమో, వారిని తలచుకోగానే వారికి సంబంధించిన సర్వమూ గుర్తుకు రావడం అత్యంత సహజం, అది మన అంకిత భావానికి అసలైన దర్పణం. కనుక ఇలా తన ఇష్ట దేవతా స్తుతి చేసిన తర్వాత, తనను ఈ గ్రంథ రచనకు ప్రేరేపించిన సన్నివేశాన్ని వర్ణించాడు రాయలు.

యుద్ధ విజయాలకై దండయాత్రలకు ఎక్కడికి వెళ్ళినా అక్కడి ప్రసిద్ధ దేవాలయాలను దర్శించి, ఇనాములూ, భూములూ ఇచ్చి, జీర్ణమై పోయిన ఆలయాలను ఉద్ధరించి, తన దర్శనానికి గుర్తుగా కొన్ని శాసనాలనో, గుర్తులనో స్థాపించి, కొన్ని స్మృతి చిహ్నాలను తీసుకుని తిరిగి రాజధానికి చేరుకునేవాడు రాయలు. కళింగ దండయాత్ర సందర్భముగా విజయవాడ మీదుగా వెళ్ళేప్పుడు, వెనక్కు తిరిగి వచ్చేప్పుడూ శ్రీ కాకుళంధ్ర మహా విష్ణువు దర్శనం చేసుకున్నాడు రాయలు. సింహాచలం, ఉదయగిరి, అన్నవరం, ఇలా ఎన్నో ప్రముఖ దేవాలయాలను దండయాత్ర సందర్భంగా దర్శించాడు. శాసనాలను వేయించాడు. జీర్ణ దేవాలయ ఉద్ధరణ చేశాడు. గాలి గోపురాలను నిర్మించాడు. ఉదయగిరి నుండి అక్కడి బాలకృష్ణుని ప్రతిమను తీసుకుని వెళ్ళి తన పూజా మందిరంలో స్థాపించుకున్నాడు. విజయవాడలో కొన్ని మాసములు మకాం వేశాడు. విజయవాడ-మచిలీపట్టణం మార్గంలో, విజయవాడ తర్వాత దాదాపు ఒక ఇరవై కిలోమీటర్ల తర్వాత ప్రధాన రహదారి దిగి దాదాపు ఒక ఇరవై కిలోమీటర్లు ప్రయాణం చేస్తే ఈ శ్రీ కాకుళం అనే గ్రామం వున్నది. అక్కడి దేవాలయంలోని విష్ణుమూర్తికి ఆంధ్ర మహా విష్ణువు అని పేరు. ఈ నాటికీ అక్కడ ఈ దేవాలయం ఉన్నది. శ్రీకృష్ణ దేవరాయ పట్టాభిషేక మహోత్సవం జరిగి ఐదువందల సంవత్సరాలు పూర్తి ఐన సందర్భంగా కర్ణాటక ప్రభుత్వం వారు మహోత్సవాలను జరిపిన సంవత్సరం తర్వాత... ఏ ఆంధ్రుల సంక్షేమం గురించి, సాహిత్యం గురించి, సాంస్కృతిక వైభవాన్ని గురించి నిరంతరమూ ఆలోచించాడో, ఆ ఆంధ్ర ప్రభుత్వం కళ్ళు తెరిచి, శ్రీ కృష్ణ దేవరాయల పట్టాభిషేక పంచ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఇక్కడ కూడా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించింది..

‘‘ అని యిష్టదేవతా ప్రార్థనంబు జేసి మున్నే గళింగ దేశ విజిగీషా మనీషన్ దండెత్తిపోయి విజయవాటిం గొన్ని వాసరంబులుండి శ్రీకాకుళ నికేతనుండగు నాంధ్ర మధుమథను సేవింపం బోయి

హరివాసరోపవాసం బచ్చట గావింప నప్పుణ్య రాత్ర చతుర్థ యామంబున..‘‘ అని ఒక చిన్ని గద్యంలో తన స్వప్న వృత్తంత నేపథ్యాన్ని చెప్పాడు. ఇది ఈ రచనకు కీలకమైన సన్నివేశం కనుక ఈ గద్యను కూడా పరమార్శ చేసుకుందాము.

అప్పటికి కొంతకాలం క్రితం కళింగదేశం ( ఒరిస్సాపై, గజపతులపై) మీదికి దండయాత్రకు వెళ్ళినప్పుడు, విజయవాటిక అంటే విజయవాడలో కొన్ని దినములు నివసించి, సమీపంలోనే వున్న శ్రీ కాకుళం అనే గ్రామములోని ఆంధ్ర మహావిష్ణువు అని పేరు గల విష్ణుమూర్తిని దర్శించి, ఒక ఏకాదశి నాడు అక్కడనే ఉపవాసం చేసి, సన్నిధిలో నిదురించిన తనకు (రాయలకు) రాత్రి చతుర్థ యామంలో ఒక కల వచ్చినదనీ, కలలో శ్రీకాకుళ ఆంధ్ర మహా విష్ణువు ఇలా దర్శనమిచ్చి, ఇలా ఆనతిచ్చాడనీ కొనసాగిస్తున్నాడు రాయలు. చతుర్థ యామము అంటే నాలుగవ ఝాము. ఝాము అంటే మూడు గంటల కాల వ్యవధి. పగలు నాలుగు ఝాములు, రాత్రి నాలుగు ఝాములు , వెరసి ఇరవై నాలుగు గంటలు ఒక రోజు అది భారతీయుల లెక్క. రాత్రి నాలుగవ ఝాము అంటే రాత్రి చివరి భాగంలో, అంటే తెల్లవారు ఝామున, ఇంత ప్రత్యేకంగా చెప్పడం ఎందుకంటే, తెల్లవారబోయే ముందు వచ్చిన కలలు సత్వరమే నిజము అవుతాయి అని నమ్మకం. రాత్రి ఒకటవ ఝామున వచ్చిన కలలు ఒక సంవత్సరానికి, రెండవ ఝామున వచ్చిన కలలు ఆరు నెలలకు, మూడవ ఝామున వచ్చిన కలలు ఒక నెలలోనూ నాలుగవ ఝామున వచ్చిన కలలు వెంటనే ఫలిస్తాయని

జ్యోతిష శాస్త్రం స్వప్న సంబంధ విషయాలలో చెప్తోంది. శ్రీకృష్ణదేవరాయలు సకల శాస్త్ర పారంగతుడు అని చెప్పడానికి ఇది చిన్న ఉదాహరణ మాత్రమే. అందుకే ప్రత్యేకమగా చతుర్థ యామమున అని ప్రత్యేకముగా చెప్పడం, ద్వితీయ, తృతీయ యామము అన్నా గ్రంథరచనకు వచ్చే యిబ్బందేమీ ఉండదు!

సీ. నీలమేఘము డాలు డీలు సేయగ జాలు
మెరుగు జామనచాయ మేని తోడ
నరవిందముల కచ్చులడగించుజిగి హెచ్చు
నాయతంబగు కన్నుదోయి తోడ
బులుగురాయని చట్టుపల వన్నె నొరబట్టు
హొంబట్టుజిలుగు రెంటెంబుతోడ
నుదయార్క బింబంబు నొరపు విడంబంబు
దొరలంగనాడు కౌస్తుభము తోడ
తే. దమ్మికేలుండ బెరకేల దండ ఇచ్చు
లేములుడిపెడు లేజూపు లేమతోడ
దొలకు దయదెల్పు చిరునవ్వుతోడగల ద
దంధ్ర జలజాక్షు డిట్లని యానతిచ్చె

నీలమేఘము డాలు - డీలు సేయగా జాలు = నీలి మేఘము యొక్క చర్మము అంటే చర్మకాంతిని నీరసించేట్లు, తక్కువ చేసేట్లు చేయ గలిగిన

మెరుగు - చామన చాయ - మేనితోడ = మెరిసిపోయే చామన చాయలోనున్న శరీరంతో

అరవిందముల - కచ్చులు - అడగించు = పద్మముల అతిశయమును అణచివేసే,

జిగిన్ - హెచ్చు - యతంబగు - కన్నుదోయి తోడ = కాంతి తోనూ, ఎక్కువ విశాలమైన కన్నులతోనూ

పులుగు రాయని - చట్టుపల - వన్నెన్ - ఒరబట్టు = పక్షుల రాజైన గరుత్మంతుని రెక్కల రంగును ఒరుసుకుని పోవుచున్న, సానబెట్టుచున్న

హొంబట్టు - జిలుగు - రెంటెంబు - తోడన్ = బంగారపు వర్ణములోని పట్టునేతగల వస్త్రముతో

ఉదయార్క బింబంబున్ - ఒరపు - విడంబంబు = ఉదయించు చున్న సూర్య బింబమును ఒప్పించు పోలికను, సామ్యమును

తొరలంగనాడు - కౌస్తుభము తోడన్ = తూలనాడే, పరిహసించే కౌస్తుభ మణితో

తమ్మికేలుండన్ - పెర కేల - దండ ఇచ్చు = పద్మము ఒక చేతిలో నుండగా ఇంకొక చేతితో చేయూతనిస్తూ, స్వామి చేతిలో చేయి కలిపి

లేములుడిపెడు - లే జూపు - లేమ తోడన్ = దారిద్ర్యమును తొలిగించే లేత చూపుల యింతితో, లక్ష్మీ దేవితో

దొలకు - దయ దెల్పు - చిరునవ్వు తోడన్ - కలన్ = తొణికిసలాడుతున్న, దయను సూచించే చిరునవ్వుతో, ‘కల‘యందు

తదంధ్ర జలజాక్షుడు - ఇట్లు అని - నతిచ్చెన్ = పద్మములవంటి కనులు గలిగిన ఆంధ్ర మహావిష్ణువు ఇలా పలికి ఆజ్ఞాపించాడు

నీలిమేఘము యొక్క కాంతిని ధిక్కరించే ప్రకాశవంతమైన చామనచాయ రంగులో వున్నవాడు, పద్మముల ‘కచ్చులు‘ అంటే అతిశయాన్ని, అంటే ప్రగాల్భాలను అణిచి వేసే కాంతివంతమైన, విశాలమైన కన్నుల జంట గలవాడు దర్శనమిచ్చాడు. కచ్చులు అనేది చాల అరుదైన పదం. అచ్చ తెలుగు పదం. కచ్చులు అంటే అదనమైన, అధికమైన, అని.. స్వామి ధరించిన బంగారపు వర్ణపు అంచులు కలిగిన పట్టువస్త్రం ఎంత కొత్తగా..మిసిమి పసుపులో వుంది అంటే, పులుగురాయడు, అంటే పక్షులకు రాజైన గరుత్మంతుడిని ఎక్కి స్వామి ప్రయాణం చేస్తున్నప్పుడు, అటూ ఇటూ కాలువేసుకుని కూర్చోడం వల్ల రెండు ప్రక్కల, డొక్కల మీద, రెక్కల వద్ద,

ఈ పట్టు వస్త్రాల రాపిడికి రంగు గరుడుడి పార్శ్వాలను సానబెట్టినట్లు, రుద్దినట్లుగా రెక్కలు, పార్శ్వా లు పసుపురంగును పూసుకుంటాయేమో అన్నంత పచ్చని పట్టువస్త్రాలను ధరించివున్నాడు,

ఉదయిస్తున్న సూర్య కాంతిని ధిక్కరించే లేతదైన ఎర్రని కాంతి కలిగిన, కౌస్తుభమణిని కలిగివున్నవాడు, ఆయన ప్రక్కన ఒక యింతి వున్నది, ఆమె ఒకచేతిలో పద్మము వున్నది, మరొక చేయి స్వామి వారి చేతికి ఊతం ఇస్తున్నది, ఆమె లేత చూపులు సమస్త దరిద్రాలనూ దూరం చేస్తాయి, ఎందుకంటే ఆమె శ్రీ మహాలక్ష్మి కనుక. లేత చూపులు అంటే ప్రసన్నంగా చూసే కొనగంటి చూపులు, కరుణతో నిండిన నాజూకైన చూపులు. కొసలు లేతగా వుంటాయి కనుక కొసకంటినుండి, చూసీ చూడనట్టు చూసే కంటినుండి వచ్చే చూపులు! ఇటువంటి ఇంతితో కలిసి దర్శనమిచ్చిన స్వామి

దయ తొణికిసలాడే కనులతో, చిరునవ్వుతో యిలా పలికి, యిలా ఆజ్ఞ ఇచ్చాడు.

సీ. పలికి తుత్ప్రేక్షోపమల జాతి బెం పెక్క<br>
రసికులౌనన మదాలస చరిత్ర<br>
భావధ్వనివ్యంగ్య సేవధి కాగ జె<br>
ప్పితివి సత్యావధూ ప్రీణనంబు<br>
శృతిపురాణోపసంహిత లేర్చి కూర్చితి<br>
సకలకథాసార సంగ్రహంబు<br>
శ్రోత్రఘుచ్చటలు విచ్చుగా రచించితి సూక్తి<br>
నైపుణి జ్ఞాన చింతామణి కృతి

తే. మఱియు రసమంజరీ ముఖ్య మధుర కావ్య<br>
రచన మెప్పించుకొంటి గీర్వాణ భాష<br>
నాంధ్ర భాష యసాధ్యంబె యందు నొక్క<br>
కృతి వినిర్మింపుమిక మాకు బ్రియము కాగ

ఉత్ప్రేక్ష - ఉపమల - జాతి పెంపెక్క - రసికులౌనన - మదాలస చరిత్ర పలికితి = ఉత్ప్రేక్ష, ఉపమాన, జాతి (అంటే స్వభావము అనే ధ్వనితో) స్వభావోక్తులతో రసికులు మెచ్చుకునేట్లు మదాలస చరిత్ర రచించినావు

భావ - ధ్వని - వ్యంగ్య సేవధి కాగ - సత్యావధూప్రీణనంబు - చెప్పితివి = భావము, ధ్వని, వ్యంగ్యము నిక్షేపించి 'సత్యావధూప్రీణనంబు' రచించితివి

శృతి - పురాణ - ఉపసంహితలు - ఏర్చి - సకల కథా సార సంగ్రహంబు - కూర్చితివి = వేదములను, పురాణములను సంహితలను శోధించి సకలకథాసారసంగ్రహమును రచించితివి

శ్రోతృ - అఘ - ఘటలు - విచ్చుగా - జ్ఞాన చింతామణి కృతి -సూక్తి నైపుణి -రచించితి = వినేవారి పాప సమూహాలు విచ్చిపోయేట్లు జ్ఞాన చింతామణి కృతిని చక్కని సూక్తుల నైపుణ్యంతో రచించితివి

శ్రీకృష్ణ రాయా! ఉత్ప్రేక్షా , ఉపమానాలంకారాలతో, స్వభావోక్తులతో రసికజనులు భళీ అనేట్లు మదాలస చరిత్రను, మధురమైన భావాలను, ధ్వని, వ్యంగ్యమూ నిక్షేపించి సత్యావధూప్రీణనంబు అనే గ్రంథమును, వేదములను, పురాణములను, సంహితలను శోధించి సకలకథాసారసంగ్రహమునూ, వినేవారి పాప సమూహాలు తొలిగిపోయేట్లుగా జ్ఞాన చింతామణి కృతినీ, ఇంకా రసమంజరి మొదలైన మధుర కావ్యములను రచించి సంస్కృత భాషలో మెప్పులను పొందిన నీకు ఆంధ్ర భాషలో కావ్య నిర్మాణం చేయడం అసాధ్యమా? ఇక ఆంధ్ర భాషలో ఒక కృతిని అద్భుతంగా రచించి మాకు ప్రీతిని చేకూర్చవయ్యా అన్నాడు ఆంధ్ర మహా విష్ణువు. సంస్కృతంలో నీ ప్రజ్ఞను చూపించి మెప్పులు పొందావు కదా..ఇక సంస్కృత గ్రంథ రచనకు కొంత విరామమునిచ్చి..తెలుగులో ఒక కావ్యాన్ని 'మాకు' ప్రీతి కలిగేట్లు అనడం గౌరవవాచకంగా మాత్రమే కాదు, వచ్చిన వాళ్ళు ఇద్దరు, లక్ష్మీ నారాయణులు, ఎక్కడికెళ్ళినా ఇద్దరూ కలిసే వెళ్తారు, అరుదుగా అప్పుడప్పుడు కొంచెం వెనుకా ముందుగా వెళ్ళారు రక రకాల అవతారాలలో, ఇద్దరూ కలిసే వుంటారు అనే సూచనగా ఒక్క వేంకటేశ్వరుడి దర్శనం లోనే ఆయనకు లక్ష్మీ నారాయణుల రూపాలు గోచరమైన సంగతి మనకు ఇంతకుముందు తెలిసినదే, కనుక మాకు అంటే మా ఇద్దరికీ కూడా ప్రియముగా తెలుగు భాషలో ఒక కృతిని రచించవయ్యా అన్నాడు, గోదాదేవి అమ్మవారి అవతారమే కనుక జరుగబోయే కథా రచన విడకు కూడా ప్రీతిని కలిగించేదే, అది ఇక్కడి చమత్కారం!

ఉ. ఎన్నిను గూర్తు నన్న విను మే మును దాల్చినమాల్యమిచ్చు న
ప్పిన్నది రంగమందయిన పెండిలి సెప్పుము మున్ను గొంటి నే
వ న్ననదండ యొక్క మగవాడిడ నేను దెలుంగు రాయడన్
గన్నద రాయ యక్కొదువ గప్పు ప్రియాపరిభుక్త భాక్కథన్

(ఇది కొంత సులువైన పద్యమే కనుక ప్రతిపదార్థము అవసరము లేదు.)'' యే నీ గురించి చెప్పను..? '' అని అడుగుతావేమో..నన్ను.అంటే అనంతమైన అవతారములలో, అర్చా మూర్తులలో ఏ అవతారము గురించి అన్న సందేహము వస్తుందేమో..'మే' అంటే శరీరం మీద క్రితం తను ధరించిన మాల్యమును (పూదండను) ఇచ్చి, నన్ను శ్రీరంగమందు పెళ్ళి జేసుకున్న పిన్నది అంటే పిల్ల అని ఒక అర్థమైతే 'నప్పిన్న' అంటే గోదాదేవి యని వాడుక తమిళ వైష్ణవ ప్రబంధాలలో, అది ఇక్కడి విరుపు.. పెండ్లి కథను చెప్పు, ఇది కూడా భావి దృశ్య సూచకం. శ్రీహరి తన కూతురిని చేపడతాడు అని తెలిసిన తర్వాత విష్ణు చిత్తుల వారు కుమార్తెను అడుగుతారు, హరియొక్క ఏ అవతారము తన మనసులో ఉన్నది అని, ఆమె అవతారముల, అర్చా మూర్తుల వివరాలు అడిగితే దివ్య దేశాలు అని పిలువ బడే 108 పుణ్య క్షేత్రాల గురించి , అక్కడి అర్చనా , అలంకార , పూజా విశేషాలను గురించి చెప్తూ ఆ08 మూర్తులలో రంగనాథుడిని ఆవిడ ఎన్నుకుంటుంది , దాన్నే యిక్కడ సూచనచేశాడు ఆంధ్రమహావిష్ణువు పలుకుల ద్వారా శ్రీకృష్ణదేవరాయలు. మున్ను గొంటి..ఏవన్.. ననదండ ఒక్క మగవాడిడ..అంతకు ముందు ఒక మగవాడు పూమాలను ఇస్తే, దాన్ని అయిష్టంగానే స్వీకరించాను మరి, కొరతను(కొదువను) 'ప్రియాపరిభుక్తభాక్కథ' ప్రియురాలిచేత అనుభవించబడ్డ,

ఎంగిలిచేయబడ్డ దాన్నిపొందిన నా కథను చెప్పవయ్యా! యిక్కడ కొంత జాగ్రత్తగా విమర్శ చేసుకోవాలి. అంతకు ముందు ఒక మగవాడిస్తే ఏవగా అంటే, విముఖతతోనే స్వీకరించాను..అన్నదానికి క్రితం ముక్తమాల్యదను పరిశీలించిన పెద్దలు మగవాడు అంటే శ్రీ కృష్ణావతారంలో సుదాముడు అని, లేదా విష్ణుచిత్తులు అని భావించారు, కానీ , అది సరిగాదు ,రాయల శైలి పదముల కూర్పులోనే కాదు, పదములను ఉపయోగించే స్థలంలోనూ కొంత క్లిష్టంగా వుంటుంది, సంస్కృత భాషా సాహిత్య ప్రయోగాల అలవాటువల్ల, పెండ్లి చేసుకున్న అనే పదమును ఉపయోగించిన తర్వాత ఇది చెప్పాడు కనుక, కూతురు పరమాత్ముడికొరకు తను సిద్ధం చేసిన మాలను ముందుగా ఆమె ధరించి ఇస్తున్న సంగతి గ్రహించిన విష్ణు చిత్తులు కుమార్తెను మందలించి, నాడు మాలను సమర్పించకుండా మిగిలిన పూజ యథావిధిగా చేసి, తర్వాత కుమార్తె ధరించకుండా జాగ్రత్త పడిన మాలనే స్వామికి అర్పించేవాడు, స్వప్నములో స్వామి కనపడి, ఆమె ధరించి ఇచ్చిన మాలయే తనకు ఇష్టమని చెప్పడం, ఆమె తనకు భార్య కాబోతున్నది అని చెప్పడం కథలోని భాగాలు. కనుక ఆమె ధరించి ఇచ్చిన మాలకు అలవాటుపడ్డ తర్వాత పెండ్లి అయ్యే దాక ఆమె సంపర్కం లేకుండా విష్ణు చిత్తులు ఇచ్చిన మాలను అయిష్టముగా స్వీకరించి, ఇక ఆమెను తన ఇల్లాలిని చేసుకోన వలసిందే అని నిశ్చయించుకున్నాడు, ఇలా భావించడమే ఉచితము అని ఈ వ్యాసకర్త ఉద్దేశము. ఓ కన్నడ రాయా, శ్రీకృష్ణ దేవరాయా, నేను తెలుగు రాయడను అని అప్పుడు తను ఎవరో స్పష్టం చేశాడు. అప్పుడు తన ఎదురుగా వున్న మూర్తి శ్రీకాకుళాంధ్ర మహావిష్ణు మూర్తి అని రాయలకు నిశ్చయం అయ్యింది. ఆంధ్ర మహావిష్ణు మూర్తి ఇలా కొనసాగించాడు.

. తెలుగదేలయన్న దేశంబు దెలు, గేను
తెలుగు వల్లభుండ తెలుగొ కండ
ఎల్ల నృపులు గొలువ ఎరుగవే బాసాడి
దేశభాషలందు తెలుగు లెస్స

తెలుగులోనే ఎందుకు అంటావా? ఇది తెలుగు దేశము, నేను తెలుగు నేలపై వెలసిన వాడిని, తెలుగు భాష అంటావా, ‘కండ‘ అంటే తీయనిది, మధురమైనది, (కండ అంటే పుష్టి కలది అని కాదు యిక్కడ, కండ అంటే నిఘంటువు ప్రకారం కూడా పటికబెల్లము అని అర్థము వున్నది, ఖండసారి చక్కెర కు అచ్చ తెనుగు పదం కండ చక్కెర ) రాజులందరూ నిన్ను కొలిచి, పొగుడుతుంటే తెలుగు భాష లోని మాధుర్యాన్ని తెలుసుకున్నవాడవే కదా నువ్వు! అంతే గాదు, దేశ భాషలందు తెలుగు లెస్స..సంస్కృతం దేవభాష కనుక సమస్త భాషలలోనూ గొప్పదే, నీకు తెలుసుగదా, కనుక తెలుగు ‘దేశ భాషలందు‘ శ్రేష్ఠమైనది!

క. అంకితమోయన నీకల
వేంకటపతి ఇష్టమైన వేల్పగుట తదీ
యాంకితము సేయు మొక్కొక
సంకేతముగా కతడరస న్నేగానే

ఇక అంకితము ఎవరికి ఇవ్వాలి అని అడుగుతావా? నీకు వేంకటేశ్వరుడు యిష్ట దైవము కనుక వెంకటేశ్వరునికి అంకితము చేయవయ్యా, ఒక్కొక్క అవతారము ఒక్కొక్క తత్వానికి సంకేతము, అంతే గానీ, ‘అరసన్‘ అంటే అరసిచూడగా, పరిశీలించి చూస్తే, వెంకటేశ్వరుడిని కూడా నేనే కాదా? ఈ రెండు పద్యాలూ తెలుగు భాషకు ఇంతకుముందైనా, ఇకపైన ఐనా అందిన, అందగలిగే

అత్యున్నత ప్రశంసలు. రాయలకంటే ముందు కానీ, రాయల తర్వాత కానీ తెలుగు భాషపై ఇంత ఉన్నతమైన ప్రశంసలను ఎవరూ చేయలేదు, ఇకపై చేయలేరు!

'దేశ' భాషలలో తెలుగు లెస్స, ఏ రకంగానైతే సమస్త భాషలలోనూ 'దేవ' భాష ఐన సంస్కృతం లెస్స ఐనదో, తీపి కలిగిన భాష.ఈ పలుకులను సాక్షాత్తూ శ్రీ మహావిష్ణువు నోటివెంట పలికించాడు. మరొక చమత్కార పూర్వకమైన విశేషం వుంది యిక్కడ. యిక్కడ సాక్షాత్తూ దేవభాష ఐన సంస్కృతం సమస్త భాషలలోకీ గొప్పది, తియ్యనైన తెలుగు భాష సమస్త 'దేశ' భాషలలోకీ గొప్పది, ఇక దేవతలలో వేంకటేశ్వరుడు గొప్పవాడు, కనుక, ఇంతవరకూ సంస్కృత రచనలు చేశావు కదా, ఇప్పుడు తెలుగు భాషలో ఒక కావ్యాన్ని రచించు, వెంకటేశ్వరునికి అంకితం చెయ్యి, అని చెప్పి భాషలలో తెలుగు భాష దేవతలలో వెంకటేశ్వరుడితో సమానమైన గొప్పదనాన్ని కలిగివుంది కనుక నీ కావ్యపరంగా భాషకూ, కావ్యపతి పదవికీ తెలుగు, వెంకటేశ్వరుడూ తగినవారు అని తెల్చిపారేశాడు. మరొక ఆధ్యాత్మిక రహస్యాన్నీ చెప్పాడు. '' ఆకాశాత్పతితం తోయం యథా గచ్ఛతి సాగరం సర్వ దేవ నమస్కారః కేశవం ప్రతి గచ్ఛతి'', ఆకాశమునుండి పడిన వర్షపు నీరు ఎక్కడెక్కడ, ఏ పేరుతొ , ఏ రూపంతో ప్రవహించినా చివరికి సముద్రంలో కలిసినట్లు, ఏ దేవుడికీ, దేవతకూ చేసిన నమస్కారం ఐనా కేశవుడికి, అంటే విష్ణువుకు చెందుతుందని, అసలు కేశవనామ అర్థం 'క' కార.. 'శ' కార..

'మ' కారములు మూడూ త్రిమూర్తులకు సంకేతాలు అని చెప్పిన ఉపనిషత్తుల సారాన్ని ధ్వనించి, ఈ ఆంధ్ర మహావిష్ణువే వేంకటేశ్వరుడు కాదా, కాకుంటే ఒక్కొక్క విశేష తత్వానికీ ఒక్కొక్క కార్య సాధనకూ ఒక్కొక్క అవతారాన్ని నేను ( పరతత్వం) దాల్చడం జరుగుతుంది అని చెప్పాడు. కనుక దేవుళ్ళలో వేంకటేశ్వరుడికీ, భాషలలో తెలుగు భాషకూ, కవులలో శ్రీకృష్ణ దేవరాయలకూ మించిన వారు లేరు! తెలుగువాడిని అని చెప్పుకునే ప్రతివ్యక్తీ విధిగా కంఠస్థం చేయవలసిన పద్యాలు ఇవి, తెలుగు సాహిత్యసమావేశాలలో ముందు ప్రార్థనా పద్యాలుగా పఠించవలసిన పద్యాలు ఇవి,

ఈ రెండుపద్యాలూ రాయలచిత్రంతో కలిపి ప్రతి తెలుగువాడూ, కనీసం ప్రతి తెలుగుసాహిత్య ప్రేమికుడూ తన ఇంట్లో గోడకు అలంకరించుకోవాలి ఈ వ్యాసకర్త ఉద్దేశంలో!

'...యిలా ఈ కావ్య రచనా చేయవయ్యా, నీకు ముందు ముందు ఎంతో అభివృద్ది జరుగుతుంది' అని శ్రీకాకుళాంధ్ర మహావిష్ణువు తియ్యగా ఆనతియ్యగా, తనను ఆశీర్వదించి అదృశ్యుడు కాగా, మేలుకొన్న రాయలు దేవాలయ గోపురానికి వందనం చేసి, రాజధానికి తిరిగి వచ్చి, తన మంత్రులతో, దైవజ్ఞులతో, భువన విజయ కవులతో, పురప్రముఖులతో సభదీర్చి, తన స్వప్న వృత్తాంతమును వారికి వివరించి, అందరి అభినందనలను, స్వప్న శుభఫలితముల వివరణలనూ అందుకుని, తన వంశచరిత్రనూ, గొప్పదనాన్నీ, తన పూర్వ జన్మ పుణ్యాన్నీ కొనియాడిన మధురమైన పద్యములను అందించి, తర్వాత శ్రీ వెంకటేశ్వరునికి అంకితం చేసిన పద్యాలను చెప్పి ప్రధాన కథలోకి దిగాడు. అంకితంగా చెప్పిన మూడు ముచ్చటైన పద్యాలను రుచిచూసి మనము కూడా ప్రధాన కథలోకి వెళ్దాము.

*కం. అంభోధి కన్యకా కుచ*
*కుంభోంభిత ఘుసృణ మసృణ గురువక్షునకున్*
*జంభారి ముఖాధ్యక్షున*
*కంభోజాక్షునకు సామి హర్యక్షునకున్*

అంభోధికన్యకా కుచకుంభ - ఉంభిత -ఘుసృణ - మసృణ-గురువక్షునకున్.. అంటే సముద్రుని కుమార్తె ఐన లక్ష్మీదేవి యొక్క .కలశములవంటి విశాలమైన వక్షోజములు..

వాటికి పూయబడిన కాశ్మీర కుంకుమ పొడిచేత- ప్రకాశవంతమైన విశాల వక్షస్తలమును కలిగిన వానికి..శ్రీ మహా విష్ణువుకు - జంభారి-ముఖ-అధ్యక్షునకు-దేవేంద్రుడు మొదలైన వారికి నాయకుడైన

అంభోజాక్షునకు - కమలముల వంటి ఎర్రనైన, విశాలములైన, నేత్రములు గలవానికి, శ్రీమహావిష్ణువుకు-

సామి-సగము భాగము..ఇది అరుదైన జాను పదముల ప్రయోగానికి రాయల ప్రసిద్ధికి ఒక ఉదాహరణ!

హర్యక్షునకున్-సింహము ఐన వానికి- సగము సింహము ఐన వాడు అంటే నరసింహుడు.

క్షీరసాగర కన్య ఐన శ్రీ మహాలక్ష్మి యొక్క కలశములవంటి వక్షోజములపై పూతగా అద్దుకున్న కాశ్మీర కుంకుమ పొడి అంటుకున్న కారణం చేత (ఆమెను కౌగిలించుకున్న కారణం చేత) ఎర్రని రంగులీనుతున్న సమస్త విశ్వమునూ భరించే విశాలమైన వక్షస్థలాన్ని కలిగినవాడు, దేవేంద్రాదులకు నాయకుడు, పద్మములవంటి విశాలములైన, సుందరములైన, చివరలు ఎర్రనైన నేత్రములను కలిగిన వాడు ( సాముద్రికా శాస్త్రం ప్రకారం శరీరములో కొన్ని అవయవాలు ఎర్రగా వుండడం ఉత్తమ పురుష లక్షణం..కనులు ఆ అవయవాలలో ఒక భాగము కనుక కావ్యములలో కండ్లను పద్మములతో పోల్చడం) సగము నరుడు, సగము సింహము ఐన నరసింహ మూర్తికి , శ్రీహరికి..

*కం. మర్దిత కాళియ ఫణికి గ*
*పర్దభ్రుదజబింబితాచ్ఛ పదనఖఘ్రుణికిన్*
*దోర్దండశార్ఙ్గకిణి కఘ*
*కర్దమ దినమణికి దనుజ కరివర సృణికిన్*

మర్దిత కాళియ ఫణికి..మర్దింపబడిన కాళీయుని పడగలు గలవాడు, అంటే, కాళీయుని పడగలను మర్దించిన వాడు, శ్రీ కృష్ణుడు

కపర్ద భ్రుత్..కపర్దము అంటే జటా జూటము..దానిని ధరించినవాడు, కపర్ది.. అంటే శివుడు, శివుని చేత

అజ..బ్రహ్మదేవునిచేత

బింబిత-అచ్ఛ-పద నఖ-ఘృణికిన్..ప్రతిబింబించ బడిన పదముల గోళ్ళ కాంతులు కలిగినవాడు..శ్రీ మహావిష్ణువు

దోర్దండ - శార్ఙ్గ - కిణికి..మహా దండము వంటి బహువుకు శార్ఙ్గము అనే మహా ధనుస్సును ధరించుట చేత కాయలు కాచిన వాడు

అఘ-కర్దమ-దినమణికి ..అఘము అంటే పాపము.. కర్దమము అంటే బురద.. దినమణి అంటే సూర్యుడు..అంటే పాపములనే బురదను ఎండిపోయేట్లు జేసే సూర్యుని వంటి శ్రీహరికి,

దనుజకరివర-సృణికిన్..రాక్షసులనే ఏనుగులను అదుపు జేసే అంకుశము వంటి శ్రీ మహా విష్ణువుకు..

కాళీయుని పడగలను మర్దించినవాడు, శివుడు , బ్రహ్మ తనకు వినయముగా నమస్కరించునపుడు వారి రూపములను ప్రతిబింబించే కాంతులీనే కాలి గోళ్ళను కలిగినవాడు, నిరంతరమూ శార్ఙ్గము అనే మహా ధనుస్సును ధరించుట చేత కాయలు కాచిన మహా దండము వంటి బాహువు కలిగినవాడు, జనుల పాపములు అనే బురద పాలిటి సుర్యునివంటివాడు.. పాపములను నశింపజేసేవాడు ఐన శ్రీ కృష్ణునకు , శ్రీ హరికి..

*కం.బంధురరథాంగధారా గంధవహాప్తజ్వలచ్ఛిఖాపటల*

*పున స్సంధుక్షణ ఘృత రాహుప*

*లాంధోసృక్సృతికి వేంకటాచల పతికిన్*

బంధుర-రధాంగ ధారా..గొప్పదిఐన చక్రము యొక్క, అంటే సుదర్శన చక్రము యొక్క పదునైన అంచుచేత

గంధవహ ఆప్త - జ్వలత్ - శిఖా పటల..వాయుదేవుని మిత్రుడైన అగ్నిదేవుని యొక్క జ్వలించుచున్న శిఖల సమూహముయొక్క

పునస్సంధుక్షణ..మరలా సంధానము చేయడంలో

రాహు-పలాంధః..రాహువు అనే.. పల అంధుడు..పలము అంటే మాంసము..దానిని ఆహారముగా కలిగినవాడు..రాహువు అనే రాక్షసుడు

అసృక్..రక్తముయొక్క

సృతికిన్..స్రుతి అంటే సర్వము కలిగినవాడు అగు..వేంకటాచల పతికిన్...

సుదర్శన చక్రము అనే హోమాగ్ని యందు రాక్షసులను హోమము చేయటకు రాహువు అనే రాక్షసుని రక్తమునే ఆజ్యముగా అంటే నేయిగా కలిగిన వేంకటాచల పతికి..అంకితముగా తన కావ్యాన్ని ప్రారంభం చేస్తున్నాను అని కొనసాగించాడు రాయలు. చివరలో అరవ విభక్తీ పదములతో( కిన్..కున్..యొక్క..లోన్..లోపలన్..) పూర్తి అవుతాయి కనుక వీటిని షష్ఠ్యంకములు అంటారు. వీటితో ఫలానా వారికి..అని అంకితం

చేయడం సంప్రదాయం! హోమము జరిగేప్పుడు ఆ హోమ గుండములోని అగ్ని శిఖలను ప్రజ్జ్వరిల్ల జేసేందుకు నేతిని పోస్తారు. రాక్షసులను అంతం చేయడం అనే యజ్ఞములో సుదర్శన చక్రపు పదునైన అంచులే హోమగుండం ఇక్కడ. చక్రానికైతే అంచులు పదును ఎక్కడానికి సాన బెట్టేప్పుడు కొంత తడిని కూడా చేరుస్తారు. అగ్నికైతే ఆ అగ్ని కీలలు మరింతగా విజృంభించేందుకు నేతిని పోస్తారు. ఇక్కడ ఆ తడి ఐనా, ఆ నేయి ఐనా రాహువు అనే రాక్షసుని స్రవిస్తున్న రక్తమే! అటువంటి సుదర్శనచక్రధారి ఐన వేంకటాచల పతికి అంకితం చేస్తున్నాడు రాయలు తన కావ్యాన్ని.

విల్లిపుత్తూరు వర్ణనం:

*మ. లలితోద్యాన పరంపరా పిక శుకాలాప ప్రతి ధ్వానము*

*ల్వలభీ నీల హరిన్మణీ పికశుకస్వాన భ్రమంబూన్ప మి*

*న్నులతో రాయు సువర్ణ సౌధముల నెందుం జూడ జెన్నొంది శ్రీ*

*విలుబుత్తూరు చెలంగు బాండ్య నగరోర్వీ రత్న సీమంతమై*

లలితములైన ఉద్యానవనముల సముదాయములలోని కోకిలలు చిలుకలు నిరంతరమూ తమ తీయని ధ్వనులు చేస్తుంటాయి. ఆ ధ్వనులు ఆ నగరములోని మేడలలో ప్రతిధ్వనులు చేస్తుంటాయి. అంటే ప్రతి ఇంటిలోనూ ఒక తోట, ఒక ఉద్యాన వనము ఉంటుందన్నమాట! ఆ ఇండ్ల చూరులకు నీలమణులతో తాపడం చేయబడిన చెక్కబడిన కోకిలలు, మరకతములచేత తాపడం చేయబడిన చెక్కబడిన చిలుకలూ ఉంటాయి. కోకిల నల్లనిది కనుక నీలమణులతో తాపడం చేయబడడం, చిలుక పచ్చనిది కనుక మరకత పచ్చలచేత తాపడం చేయబడడం! ఎంత సహజ, సుందరమైన వర్ణన! తోటలలోని, ఉద్యానవనముల లోని కోకిలల, చిలుకల ధ్వనులు ఇళ్ళల్లో ప్రతిధ్వనులు చేస్తుంటే, ఆ ధ్వనులను విన్నవాళ్ళు, దారిన వెళ్ళే వాళ్ళు తలలెత్తి చూసేప్పటికి ఇళ్ళ చూరులలోని ఈ నీలమణుల కోకిలలు, మరకత పచ్చల చిలుకలు కనబడి, ఈ బొమ్మకోకిలలు, బొమ్మచిలుకలే ఆ ధ్వనులు చేస్తున్నాయని భ్రమపడుతుండగా, ఆకాశాన్ని ఒరుసుకునేంత ఎత్తైన బంగారు మేడలతో, ఎక్కడ చూసినా కళకళలాడుతూ, శృంగార ప్రకాశముతో, శ్రీ విల్లిపుత్తూరు పాండ్యదేశము అనే స్త్రీయొక్క పాపిటలోని రత్నమువలె ప్రకాశిస్తూ వుంటుంది.

*సీ. పాథోదిజలయుక్తి బ్రాచివట్టిన దిశా*

*కరులు నాదగు మరకతపు గరుల*

*గరుల తొండము సిక్క గబళించి ఖ్రింగిన*

*హరులునా దొండ మొప్పగు తదశ్మ*

*హరుల దాపినతాప లమర నేనికదోయి*

*నీరార్చు నపరంజి నీటి వ్రాత*

*శ్రీలు దత్పార్శ్వ చిత్రిత శంఖ చక్రముల్*

*రత్నంపు దిన్నెల బ్రతిఫలింప*

*తే. బెరపురాళి గృహశ్రీల బెండ్లియాడ*

*భవనరాజులు గట్టిన బాసికమన*

*దనరు మణితోరణములతో ద్వారవితతి*

*బరగు వీథులు పురి సూత్రపట్టినట్లు*

ఆంధ్ర సాహిత్యములోని అత్యద్భుత వర్ణనలలో ఇదొకటి. ఆ విల్లిపుత్తూరులో గృహములలో రత్నమయ వేదికలు వున్నాయి. ఆ వేదికలకు దారి తీసే మెట్లకు అటూ ఇటూ ఏనుగుల శిల్పములు చెక్కబడి వున్నాయి. మెట్లకు అటూ ఇటూ మరకత పచ్చలు తాపడం చేసిన ఏనుగులు సముద్ర జలములలో వుండీ వుండీ పాచిపట్టిన దిగ్గజములు అన్నట్లు వున్నాయి, ఆ పచ్చల కాంతిచేత. కొన్నిశిల్పాలు సింహపు ముఖాలు కలిగినవి, వాటి ముఖముల లోనుండి ఏనుగుల తొండములు మాత్రమే కనిపిస్తూ తొండములను తప్ప ఆ ఏనుగుల మిగిలిన శరీరాలను మ్రింగేసినట్లు కనిపిస్తున్నాయి. ఆ మెట్లెక్కి వెళ్తే రత్నమయ వేదికలు కనిపిస్తాయి. ఆ వేదికల వెనుకనున్న గోడలమీద బంగారపు నీరు పోసిన లక్ష్మీ దేవి చిత్తరువులు వున్నాయి. ఆ లక్ష్మీ ప్రతిమలకు అటూ ఇటూ తమ తొండములలోని కలశములలోని నీటి చేత స్నానం చేయిస్తున్న ఏనుగుల చిత్తరువులున్నాయి, శంఖ చక్రముల చిత్రములున్నాయి, గోడలమీది ఈ లక్ష్మీ చిత్రముల, స్నానము చేయిస్తున్న ఏనుగుల చిత్రముల, శంఖ చక్రముల ప్రతిబింబములు దిగువనున్న రత్నమయ వేదికల మీద పడుతున్నాయి. ఆ గృహముల ద్వారములు మణి తోరణములు కట్టి వున్నాయి. ఆ మణి తోరణాలు ఆ గృహములు అనే రాజులు యితర పట్టణములలోని ఇండ్ల శ్రీలను అంటే సంపదలు అనే స్త్రీలను వివాహం చేసుకొనడం కోసం కట్టిన పెళ్లి బాసికాల లాగా వున్నాయి, అంటే యితర గ్రామముల పట్టణముల (పెర పురాళి) సంపదలను స్వాధీనం చేసుకున్నట్లు, పరిహసిస్తున్నట్లు వున్నాయి. ఆ పట్టణ వీథులు వంకర టింకరలు లేకుండా సూటిగా, తీర్చినట్లు కట్టుబడి సుతారులు దారము పట్టి తిన్నగా కట్టినట్లు వున్నాయి.

ఈ ప్రబంధమే శ్రీ మయం, లక్ష్మీ మయం, ప్రారంభంలో శ్రీ పదం, శ్రీలక్ష్మీ దర్శనం, స్వప్నంలో శ్రీ దర్శనం, కావ్య వస్తువు ఆ 'శ్రీ' యొక్క (గోదాదేవి యొక్క) ప్రేమ వివాహం, ఇళ్ళ చూరులలో చెక్కబడి వున్న కోకిలల చిలుకల ప్రతిమలు నీల మణుల మయములు, చిలుకలు మరకత పచ్చల మయములు, ఇప్పుడు మేడలు శ్రీ మయములు..ఇక్కడ..రత్నమయ వేదికలు, పచ్చలు తాపడం చేసిన ఏనుగుల సింహముల ప్రతిమలు, గోడలమీద లక్ష్మీ చిత్తరువులు, ద్వారములకు కట్టినవి మణిమయ తోరణములు, అది లక్ష్మి పుట్టబోతున్న పట్టణం, లక్ష్మీపతి ఐన వటపత్ర శాయి ' మన్ననారు' అనే పేరుతొ కొలువబడుతున్న పట్టణం, కనుక శ్రీమయం!

పలుకులతో రమ్య హర్మ్యాలను చిత్తరువులుగా నిలిపి చూపాడు రాయలు, సరస్వతీ ప్రసాదంగా 'లక్ష్మీ ప్రాసాదములను' ప్రసాదించాడు. ఇంత అద్భుతమైన 'వర్ణ'చిత్రాలను కేవలం పోతన మాత్రమే చిత్రించాడు ఆంధ్ర కవిత్వ కుడ్యములపై, ఒక భీష్మాచార్యునిపై దూకిన శ్రీకృష్ణుని

చిత్రాన్ని, ఇంతింతయై ఎదిగిన ఒక వామనుడిని..ఐతే ఇంతవరకే చెప్తే రాయల గొప్పదనం ఏముంది? ఇందులో ఒక అద్భుతమైన ఉపాసనా రహస్యాన్ని ఇమిడ్చాడు, తెలిసి తెలిసీ, ఉద్దేశ పూర్వకంగా! యాదృచ్ఛికంగా కాదు.

శుద్ధ సత్త్వ గుణ స్వరూపిణి ఐన, సకల సంపదలను ప్రసాదించే శ్రీ మహాలక్ష్మిని ఆవిడ రెండు ప్రక్కలా రెండు ఏనుగులు సువర్ణ కళాశాలలో నీటితో అభిషేకిస్తున్నట్లు భావించి ఉపాసన చేయడం శీఘ్ర ఫలప్రదం, అత్త్యుత్తమ ఉపాసన. అందుకే జగద్గురువు ఆది శంకరాచార్యులు తమ ప్రప్రథమ స్తోత్రమైన 'కనకధారా స్తవం' లో చివరిలో..'' దిగ్గస్తిభి: కనకకుంభ ముఖావసృష్ట స్వర్వాహినీ విమల చారు జలాప్లుతాంగీం ప్రాతర్నమామి జగతాం జననీం అశేష లోకాధినాథ గృహిణీం అమృతాబ్ది పుత్రీం'' రెండుప్రక్కలా బంగారపు కలశములలో సురగంగా జలంచేత అభిషేకింపబడుతున్న జగజ్జననీ, అనంతలోకములకు అధిపతిఐనవాడి గృహిణీ, ఓ అమృతాబ్ది పుత్రీ, ప్రాతఃకాలమున నీకు ప్రణామములు' అన్నాడు! శ్రీకృష్ణదేవరాయల సర్వతోముఖ ప్రతిభకు ఈ పద్యం ఒక మచ్చుతునక.

విల్లిపుత్తూరు వర్ణనలో ఆ నగరసౌందర్యాన్ని, స్త్రీల సౌందర్యాన్ని, అక్కడి వారకాంతల సౌందర్యాన్ని, అక్కడి ప్రకృతి సౌందర్యాన్ని, పంటచేల, బావుల, ఉద్యానవనముల స్త్రీ, పురుషుల వర్ణన చేస్తూ 24 అత్యద్భుతములైన పద్యాలను చెప్పాడు రాయలు. నిజానికి ఏ ఒక్క పద్యమూ కూడా వదిలిపెట్టాల్సినది కాదు, కానీ, ఇది కేవలం విమర్శా వ్యాసమే, విమర్శా గ్రంథం కాదు గనుక ఒక మూడు నాలుగు పద్యాలను పరిశీలిస్తున్నాము మనము.

*ఉ. వేవిన మేడపై వలభి వేదిక జంట వహించి విప్పగా*
*బూవులు గోటమీటుతరి బోయెడు తేటుల మ్రోత గామిశం*
*కావహమౌ గ్రుతాభ్యసన లౌటను దంతపు మెట్ల వెంబడిం*
*జేవడి వీణ మీటుటలు చిక్కెడలించుటలు న్నరింబడన్*

వేకువ కాగానే అనడానికి 'వేవినన్' అని విచిత్ర ప్రయోగము చేశాడు. వేకువ కాగానే, తెల్లవారగానే, మేడలమీద చూరుల వెంట కూర్చుని తమ జడలను విప్పుకుంటూ క్రితం రాత్రి తాము తురుముకున్న వడలిపోయిన పూవులను తమ గోళ్ళతో మీటుతూ వాటిని విదిలించివేస్తుంటే, ఆ పూవుల పరిమళమునకు తుమ్మెదలు చేస్తున్న ధ్వనులను విన్న ఆ దారిన వెళ్ళే కాముకులకు, వారు ( ఆ స్త్రీలు ) కృతాభ్యసనలు ( అభ్యాసము చేసినవాళ్ళు ) కావడం చేత, చేవడిన్..చేతుల 'వడి' తో అంటే.. హస్త లాఘవంతో దంతపు మెట్లు వేసి వున్న వీణలను మీటినట్లుగా అనుమానము కలుగుతుంది. అంటే ఇది ఆ నగర వారకాంతల వర్ణన అని అన్వయం. ఇక్కడ ప్రత్యేకంగా చెప్పక పోయినా ఈ పద్యనికిముందు పద్యాలలో, ఆ తర్వాతి పద్యాలలో కూడా ఆ నగర వారకాంతల సౌందర్యాన్ని, అతిశయాన్ని, వైభవాన్ని వర్ణించిన పద్యాలే వున్నాయి కనుక ఇక్కడ వర్ణింప బడ్డ స్త్రీలు కూడా ఆ నగర

వారకాంతలే అని భావం. వారకాంతలు కనుకనే దారిన వెళ్ళే వాళ్ళను కవ్విస్తూ, ఊరిస్తూ భ్రమలు పెడుతూ ఇలా చేస్తారు అని కూడా ఒక విసురు!

ఆ సుందరీమణులు సంగీత శాస్త్రములో నేర్పు, అభ్యాసము కలిగినవారు కనుక, ఆ సంగతి ఆ వాడలోని ఇళ్ళ జాడలు తెలిసిన వాళ్లకు పరిచయమే కనుక, దారిన వెళ్ళే వాళ్లకు ఆ సుందరీమణులు.. వేణికన్ ..అంటే జడను..'చంట' వహించి..అంటే తమ వక్షోజములమీద పడేట్లుగా, ముందుకు వేసుకుని..విప్పుతూ..విలాసంగా గోళ్ళతో మీటుతూ విదిలించి వేస్తుంటే.. ఆ నల్లని జడ, ఆ జడకింద వున్న విశాలమైన వక్షోజ భాగము వీణ మెట్ల దారి, వీణ దిమ్మలా (బుర్రలా) ఏమిటి అనే అనుమానాలను కలిగిస్తున్నాయి. యింతలో ఆ విసిరేస్తున్న, విదిలిస్తున్న పూల పరిమళాలకు ఆకర్షింప బడి ఝుమ్మని మ్రోతలు చేస్తూ వచ్చి వాలుతున్న తుమ్మెదల ధ్వనులు వీణా నాదములా ఏమిటి.. అనే అనుమానాలను కలిగిస్తున్నాయి.

ఈ జడ, జడకింది వక్షోజ భాగం వీణలా కనిపించడం అనేది ఒక విచిత్రమైన, ప్రత్యేకమైన వర్ణన. జడను ఇలా వర్ణించడం ఇదివరకు ఎవరూ చేయలేదు ఆంధ్ర సాహిత్యంలో బహుశా. కానీ ఈ కావ్య నాయిక ఐన గోదాదేవి మాత్రం అద్భుతమైన అధ్యాత్మిక రహస్యాలతోపాటు సాహిత్య సౌరభాలను కూడా కలిగిన తమిళ సారస్వతంలోని ప్రసిద్ధమైన తన తిరుప్పావై పాశురముల ప్రబంధంలో ఒక గొప్ప వర్ణన చేసింది..'' పుత్తరవల్గుల్ పునమయిలే..'' అని, 'పుత్తరవల్గుల్' అంటే, పుట్టలోని పాము వంటి పిరుదుల భాగము కలిగిన అని, పిరుదులపైన పడుతున్న నల్ల తాచు వంటి జడను ఒకసారి ఊహించుకుంటే, విశాలమైన ఆ జఘన భాగం పుట్టలాగా, అక్కడిదాకా వున్న నల్లనిజడ కొస త్రాచుపాముతోకలాగా, తలవెనుకవైపునుండి చూస్తే శిరస్సు మీది భాగం వెడల్పుగా ఉండి, పడగవిప్పుకున్న నల్ల త్రాచులాగా కనిపిస్తుంది, కేవలం తలనుండి జడ చివర దాకా చూస్తే, పునమయిలే అంటే పురివిప్పిన నెమలి అని, మగనెమలి పురివిప్పి ఆడుతుంటే ఎలా వుంటుందో, స్వేచ్ఛగా విరిసిన తలకట్టు అంత అందంగా ఉంటుందని. ఇలాంటి వర్ణనకు సమానమైన వర్ణన వేరెక్కడా, ఏ సాహిత్యములో కూడా లేదు అని మహానుభావులైన పెద్దలు సాధికారికంగా తెలుగు, తమిళ, సంస్కృత ఆధ్యాత్మిక, సాహిత్య సారస్వతముల పై విమర్శ చేయగలిగిన వారు చెప్పారు, నాకు మాత్రం ఈ శ్రీకృష్ణ దేవరాయల వర్ణన , గోదామాత చేసిన ఆ వర్ణన రెండూ ప్రత్యేకమైన, విశిష్టమైన వర్ణనలు అనిపించాయి, స్త్రీల తలకట్టు గురించి. ఆదిశంకరాచార్యుల వారి సౌందర్యలహరీ స్తోత్రం ఈ వ్యాఖ్యలో మినహాయిస్తే, ఎందుకంటే ఆయన వర్ణించిన కేశపాశములు జగజ్జనని ఐన అమ్మవారి గురించి కనుక.

('' ధునోతు ధ్వాంతం నః తులిత దళితేందీవరవనం ఘనం, స్నిగ్ధం, శ్లక్ష్ణం చికురనికురుంబం తవ శివే
యదీయం సౌరభ్యం సహజముపలబ్ధుం సుమనసో వసంత్యస్మిన్ మన్యే బలమథన వాటీ విటపినాం ''
నల్లకలువల వనాన్ని ధిక్కరించే, ఆ సహజమైన సౌరభాన్ని తాము కూడా పొందాలని వచ్చే, దేవేంద్రుని నందనోద్యానవనంలోని దేవజాతికిచెందిన పుష్పాలకు కూడా నివాస స్థలమైన నీ నల్లని ప్రకాశవంతమైన

తలకట్టు మా యొక్క పాపములను ఎగురగొట్టుగాక..

'' తనోతు క్షేమం నః తవ వదన సౌందర్య లహరీ పరీవాహ శ్రోతస్సరణివ సీమంత సరణి:

వహంతీ సిందూరం ప్రబల కబరీభార తిమిర ద్విషాం బృందై: బందీకృతమివ నవీనార్క కిరణం''

నల్లని ఆ జుట్టును రెండు పాయలుగా చీల్చిన సౌందర్య ప్రవాహంలాగా పాపిట మార్గం వుంటే, చీకట్లు అనే శత్రువులబృందం బందీగా చేసిన బాలభానుడేమో అన్నట్లు ఆ పాపిటమార్గంలో ధరించిన అమ్మవారి సిందూరం వున్నది..అటువంటి ఆ పాపిటమార్గం మాకు క్షేమమును కూర్చుగాక''..ఇవీ ఆది శంకరుడి వర్ణనలంటే!)

ఇంత బేరీజు వేయడానికి ..తద్వారా కలిగే మాటలకందని ఆత్మానందాన్ని ఒంటరిగా అనుభవించడం ఇష్టం లేక అందరితో పంచుకోవాలనుకోవడం ఒక కారణమైతే, కవిగా రాయలు ఎదిగిన ఎత్తులు ఊహించడానికి చేసే ప్రయత్నంలో..

ఒక గోదాదేవి, ఒక ఆదిశంకరుడు మాత్రమే రాయలంతటి విశిష్ట వర్ణనలు చేశారు అని చెప్పాలనుకోవడం రెండవ కారణం.

మ. తల బక్షచ్చట గ్రుక్కి బాతువులు కేదారంపు గుల్యాంతర
స్థలి నిద్రింపగ జూచి యారెకులుష స్నాత ప్రయాత ద్విజా
వలిపిండీకృత శాటులన్నవి దదావాసంబు జేర్పంగ రే

'' తనోతు క్షేమం నః తవ వదన సౌందర్య లహరీ పరీవాహ శ్రోతస్సరణివ సీమంత సరణి:

వహంతీ సిందూరం ప్రబల కబరీభార తిమిర ద్విషాం బృందై: బందీకృతమివ నవీనార్క కిరణం''

నల్లని ఆ జుట్టును రెండు పాయలుగా చీల్చిన సౌందర్య ప్రవాహంలాగా పాపిట మార్గం వుంటే, చీకట్లు అనే శత్రువులబృందం బందీగా చేసిన బాలభానుడేమో అన్నట్లు ఆ పాపిటమార్గంలో ధరించిన అమ్మవారి సిందూరం వున్నది..అటువంటి ఆ పాపిటమార్గం మాకు క్షేమమును కూర్చుగాక''..ఇవీ ఆది శంకరుడి వర్ణనలంటే!)

ఇంత బేరీజు వేయడానికి ..తద్వారా కలిగే మాటలకందని ఆత్మానందాన్ని ఒంటరిగా అనుభవించడం ఇష్టం లేక అందరితో పంచుకోవాలనుకోవడం ఒక కారణమైతే, కవిగా రాయలు ఎదిగిన ఎత్తులు ఊహించడానికి చేసే ప్రయత్నంలో.. ఒక గోదాదేవి, ఒక ఆదిశంకరుడు మాత్రమే రాయలంతటి విశిష్ట వర్ణనలు చేశారు అని చెప్పాలనుకోవడం రెండవ కారణం.

*మ. తల బక్షచ్ఛుట గ్రుక్కి బాతువులు కేదారంపు గుల్యాంతర*
*స్థలి నిద్రింపగ జూచి యారెకులుష స్స్నాత ప్రయాత ద్విజా*
*వలిపిండీకృత శాటులన్నవి దదావాసంబు జేర్పంగ రే*
*వుల డిగ్గ న్వెస బారు వాని గని నవ్వున్నాలి గోప్యోఘముల్*

ఆ వూరి వరిచేలలోని పంట కాలువలలో తలను రెక్కల చాటున(పక్ష చ్ఛుటన్) 'కుక్కుకొని'.. దూర్చుకొని..ఆ వరిమళ్ల మధ్యలోని నీటి పాయలలో బాతువులు అంటే బాతులు నిదురిస్తుంటే పహారా కాస్తున్న వూరి కాపలా భటులు (ఆరెకులు) తలలు కనబడక, దగ్గిరికి ముడుచుకుని పడుకున్న ఆ తెల్లని నీటి బాతులను దూరం నుండి చూసి, వాటిని.. ఉషః కాలంలో కాలువలో స్నానాలు చేసిన బ్రాహ్మణులు, పిండుకుని, వెళ్ళేప్పుడు తీసుకుని వెళ్ళడం మరిచిపోయిన అంగవస్త్రములు గామోసు అనుకుని,( ఉష స్స్నాత ప్రయాత -ద్విజావళీ-పిండీకృత- శాటుల్-అన్-సవి) వాటిని, ఆ పిండుకున్న వస్త్రాలు అని తాము అనుకున్న వాటిని వారి వారి ఇళ్ళకు చేరుద్దాం..(దదావాసంబు జేర్పంగ) అని..నీటి కాలువలలోకి దిగగానే, ఆ బాతులు పారిపోతుంటే ఆ బాతులనూ,ఈ బైతులనూ చూసి, ఆ పంటల కాపలాకోసం వున్న స్త్రీలసమూహం ఘొల్లున నవ్వుతుంటుంది! పాపం తెల్లమొహాలేసి వెనక్కు తిరిగి వెళ్తారు ఆ నగర కావలివాళ్ళు .

*సీ. ఎదురేగి సాష్టాంగ మెరగి పాద్యం బిచ్చి*
*నారికేళ కటాసనముల నునిచి*
*నును బోక పాత్తి గుట్టిన దొప్ప గమితోడ*
*రంభ విశాల పర్ణములు వరిచి*
*శాల్యన్న సూపాజ్య కుల్యా బహువ్యంజ*
*నక్షీర దధులర్పణంబు జేసి*
*వార్చిన పిదప సంవాహన మంఘ్రుల*
*కొనరిచి తాంబూల మొసగి కుశల*

*తే. మడిగి పోయెద మన్న దవ్వనిచి సిరికి*
*దగిన సత్కృతి జేసి ఖేదమున మగిడి*

*యర్చన గావింతు రెపుడు నిట్లతిథులైన*

*భాగవతులకు నప్పురి భాగవతులు*

ఆ పట్టణము లోని భాగవతులు తమ అతిథులు ఐన భాగవతులకు ఎదురేగి, సాష్టాంగ వందనము జేసి కాళ్ళు కడుక్కోడానికి నీళ్ళ నిచ్చి, కొబ్బరి ఆకులతో, ఈనెలతో అల్లిన చాపల మీద కూర్చుండబెట్టి, పోక చెట్ల ఆకులతో కుట్టిన దొప్పలను వుంచి , పెద్ద పెద్ద అరటి ఆకులను పరచి, వరియన్నము, పప్పు, నేతి కాలువలతో, అనేకములైన పచ్చళ్ళు , కూరలతో, పాలు పెరుగులతో భోజనం పెట్టి, భోజనానంతరం వారు కొద్దిగా నడుము వాల్చితే, వారికి తాంబూలం ఇచ్చి వారి కాళ్ళు పిసికి ( ప్రయాణ శ్రమతో కాళ్ళు లాగుతుంటాయి గదా పాపం!) ఇక వాళ్ళు వెళ్లి వస్తాము అంటే, తమ శక్తి కొద్దీ వాళ్లకు సత్కారము జేసి, అల్లంత దూరం వాళ్లతో వెళ్లి, సాగనంపి, అయ్యో..అప్పుడే వెళ్లి పోయారే ..అనే బాధతో వెనక్కు వెళ్ళే వారు. ఎంత నమ్మ శక్యము గాని సుందర స్వప్నం కదూ? ఈ పద్యానికి కండ్లు చెమరిస్తే అది మానవత్వానికీ, భారతీయ తత్త్వానికీ, తెలుగు ప్రేమల వెలుగు లోగిళ్ళ అమృతత్త్వానికీ చిన్ని రుజువు!

కన్న వాళ్ళు, తోడబుట్టిన వాళ్ళు వచ్చినా ఇంత ఆదరంతో కాదు కదా, అసలు ఆహ్వానం ఇవ్వడానికే వెనక్కి తీసే రోజులివి. కాళ్ళకు కాదు కదా, తాగడానికి కూడా సరిపడా నీళ్ళివ్వలేని నికృష్టమైన నగర నివాసాలివి. వాళ్ళో, వాళ్ళతో వచ్చిన పిల్లలో కొత్తగా కొనుక్కున్న సోఫాలనూ, వాటి కవర్లనూ ఎక్కడ పాడుజేస్తారో అనే పాడు టెన్షన్ల పాట్లివి. సింథేటిక్, ప్లాస్టిక్ ప్లేట్లూ, గ్లాసులూ, ప్లాస్టిక్ ఫిల్టర్ నీళ్ళూ , మన సీరియల్స్ సమయంలోనో, చాటింగు సమయంలోనో వస్తే , చూసీ చూడనట్టు మనం చూస్తే, చూసీ చూసీ ' ఇక వెళ్ళొస్తాము ' అంటే, ఇంకా ఇక్కడే వున్నారా..వెళ్ళడం సరే..మళ్ళీ రావడం ఏంటి? అన్నట్లు తలలు దిప్పి చూసే చూపులు! అతిథులకు కాళ్ళు పిసకడం అటుంచి..అమ్మా నాన్నల కట్టుకున్నవాళ్ళ పీకలు పిసక్క పోతే ఆ మానవుడు మహానుభావుడే! కానీ ఒకప్పుడు ఇలాంటి లోగిళ్లుండేవి, అలాంటి మనుషులు వుండేవాళ్ళు ,అంతటి సభ్యతా సంస్కారాలు, ప్రేమాభిమానాలు ఉండేవి. ఇవి ఆ దృశ్యములను చిత్రించిన అక్షరచిత్రాలు కనుకనే ఈ పద్యాలూ, కావ్యాలూ ఈ కావ్యాలు శాశ్వతంగా నిలిచి ఉండేవి.

వైష్ణవం వైష్ణవో దృష్ట్వా దండవత్ప్రణవేద్భువి, వైష్ణవుడు మరొక వైష్ణవునికి కర్రలాగా నేలమీద పడిపోయి,రెండు చేతులు, రెండు కాళ్ళు , రెండు భుజాలు, వక్షస్థలం, తల నేలకుతాకించి,ఈ అష్టాంగములతో నమస్కరించి,

'అమర్యాదః,క్షుద్రః, చలమతిః, అసూయా ప్రసవభూః, కృతఘ్నో, దుర్మానీ,స్మరపరవశః,వంచన పరః,పాపిష్టో..

( మర్యాదా మన్ననా తెలియని వాడిని, క్షుద్రుడిని,చంచలమైన మనసు కలవాడిని,అసూయా పరుడిని, క్రుతఘ్నుడిని,దురభిమానం గల దుర్మార్గుడిని,కాముడికీ, కామానికీ లొంగిన బలహీనుడిని, వంచకుడిని, పాపిని..ఐన నన్ను మన్నించి కరుణించండి) అని ప్రాధేయ పడి ప్రార్ధించి, ఆదరించి సత్కరించడం చేస్తాడు, చేయాలి!

వైష్ణవుడు అని ఇక్కడ చెప్పడం ఇది వైష్ణవ మార్గ సంబంధ ప్రబంధం కనుక. శైవుడైనా, ఇంకెవరైనా,ఇంత వినయంగానూ వుండాలి,మానవుడెవరైనా ఇలా చెయ్యొచ్చు,చెయ్యాలి అని చెప్పడం కోసం ఇంత సాత్త్వికులైన విల్లిపుత్తూరు భాగవతులను పరిచయం చేసి, వెంటనే తరువాతి పద్యంలో భాగవతోత్తముడైన విష్ణుచిత్తులను పరిచయం చేశాడు రాయలు!

*శా. అందుండుం ద్వయసద్మపద్మవదనుండ ద్వంద్వు డశ్రాంతయో*
*గాందూబద్ధమధు ద్విషద్విరదు డన్వర్థాభిధానుం డురు*
*చ్ఛందో బృంద తదంత వాగపఠనా సంజాత తజ్జన్య ని*
*ష్పంద ద్వైత సుసంవిదాలయుడు నిష్ఠన్ విష్ణుచిత్తుండనన్*

శ్రీ మహావిష్ణువు యొక్క ద్వయ మంత్రమునకు నిలయమైనవాడు, పద్మమువంటి సుందరమైన, మృదువైన నిర్మలమైన వదనము కలవాడు, సుఖ దుఖాలు, ఆనందము విషాదము..ఇలాంటి ద్వంద్వములు లేని వాడు అంటే స్థిత ప్రజ్ఞుడు, నిరంతర యోగమనే సంకెలల చేత మధుసూదనుడు అనే గజమును బంధించికున్నవాడు, వేదములను, వేదాంతములైన ఉపనిషత్తులను చదువనివాడైనా, ఆ వేదవేదాంతరహస్యసారమైన చలింపని ద్వైత జ్ఞానము ( జీవుడు-దేవుడు అనే దేహము-దేహి..అనే ద్వైత జ్ఞానము) అనే పవిత్ర జ్ఞానమునకు ఆలయమైనవాడు, విష్ణు చిత్తుడు అనగా మహా విష్ణువు యందే లగ్నము చేసిన చిత్తము గలవాడు అనే సార్ధక నామధేయుడు (అన్వర్థాభిధానుండు ) ఉండేవాడు.

వేద వేదాంతముల పఠనం చేయకుండానే, ఆ వేద వేదాంత మర్మమైన పరమేశ్వర సంబంధ మైన అమలిన జ్ఞానమును పొందినవాడు, యోగమంటే చిత్తమును నిరోధించడం, అంటే చిత్తమును అనవసరమైనవాటివైపు పోకుండా నిరోధించడం కనుక, అలా అనవసరమైన విషయములకు పోకుండా, చిత్తమును, విష్ణుమూర్తి యందే లగ్నంచేసిన విష్ణుచిత్తుడు అనే సార్ధక నామధేయుడు ఉండేవాడు ఆ విల్లిపుత్తూరులో. అసలైన కథా ప్రారంభము ఇది కనుక ఇక్కడ శార్దూల విక్రీడితాన్ని వాడాడు శ్రీకృష్ణదేవరాయలు! అది రాయల మెరుపు!

ఈ ఒక్క పద్యంలోనే విష్ణుచిత్తుని సంపూర్ణ పరిచయం చేయడం రాయల ప్రతిభ. పాండిత్యము, శాస్త్ర జ్ఞానము, ఆధ్యాత్మిక జ్ఞానముల సర్వోత్కృష్ట లక్ష్యము పరమాత్మ తత్త్వదర్శనమే. ఆ పాండిత్య, శాస్త్ర జ్ఞాన, ఆధ్యాత్మిక జ్ఞాన రహితుడైనపుటికీ పరమాత్మ తత్త్వాన్ని దర్శించ గలిగినవాడు విష్ణుచిత్తుడు. కేవలం నిష్కల్మషమైన, నిశ్చలమైన, నిష్కామమైన భక్తి భావం కలిగినవాడు.

ఇక్కడ ఒక అద్భుతమైన వచనంలో విష్ణుచిత్తుని పాత్ర చిత్రణ అనే నెపంతో 'కుహనా' జ్ఞానులనూ, ఆధ్యాత్మికతత్త్వవేత్తలనూ పండితులనూ' వ్యంగ్యంగా నిరశించి, అసలు జ్ఞానము అంటే ఏమిటో చెప్పాడు శ్రీకృష్ణదేవరాయలు. ఇలాంటివి రచయితను పట్టించే, పరిచయం చేసే పరమ సత్యాలు కనుక వచనమే ఐనా పరిశీలిద్దాం. రాయలు ఎంత జ్ఞానియో, ఎంత ఔచిత్యం కలిగినవాడో, ఎంత స్వతంత్ర భావాలను కలిగినవాడో తెలుస్తుంది.

'' అమ్మహీసుర వరుండు ప్రకృతికంటే పరుండగు తన్నును, దనకంటె బరుండగు పరమేశ్వరుం, బరమేశ్వర ప్రసాద బహుజనన కృత సుకృత ఫలరూపయగు నాచార్య కృప గుప్త దానంబు నిదానంబు న్దేలిపిన గతిం దెలుపగా..( ఆ బ్రాహ్మణుడు మనము ప్రారంభములో చెప్పుకున్న చతుర్వింశతి 24 తత్త్వములకు తనను భిన్నుడైనవానిగా, జీవుడిగానూ, తనకంటే భిన్నుడైన వానిగా పరమాత్ముడినీ, పూర్వ జన్మలో చేసిన గుప్తదానము మరుసటి జన్మములో సత్ఫలితాన్ని ఇచ్చినట్లు, అనేక పూర్వజన్మల లో చేసిన పుణ్య ఫలితముగా ఒక సద్గురువుయొక్క దయ చేత తెలుసుకున్నట్లు, తెలుసుకోగలిగాడు. యిరవై నాలుగు తత్త్వముల ప్రకృతిని అచిత్తు అని, తనను జీవుడు అని,ఈ రెంటికీ భిన్నుడైన వాడు దేవుడనీ లేదా చిత్తు అనీ విశిష్టాద్వైత సిద్ధాంతం. లోతులకు వెళ్ళకుండా కనీసం ఇంతవరకూ తెలిసికోవడం ఈ ప్రబంధాన్ని, రాయల ఆలోచనా విధానాన్నీ, ప్రజ్ఞనూ తెలిసికొనడానికి అవసరం, సహాయకారి. కీర్తి, ప్రతిష్ఠలకు ఆశించకుండా చేసిన గుప్త జ్ఞానం మరుజన్మలో పెన్నిధిని అందించినట్లు, అనేక పూర్వ జన్మలలో చేసిన పుణ్య ఫలితముగా సద్గురువును పరమేశ్వరుడు ప్రసాదించడం వలన, ఆ సద్గురు కృపచేత తెలుసుకున్నట్లు, ప్రకృతి-జీవుడు-దేవుడు అనే మూడు తత్త్వాలను ఆయన తెలుసుకున్నాడు)..

''...నాత్మీయ తదీయ శేష శేషిత్వ సంబంధం బనాద్యంబుగా దెలిసి...''( తన యొక్క పరమేశ్వరునియొక్క భ్రుత్యుని-యజమాని యొక్క సంబంధమును అనాదిగా, అతి పూర్వమైనదని తెలిసికొని, అంటే తను పరమేశ్వరుని దాసుడు సహజంగా, ఎన్నెన్ని జన్మల నుండో అనే జ్ఞానము కలిగి)

''..ఈ తెలివి గలిగి యఖర్వ నిర్వృతిం గాంచి సుఖించు పరమ యోగికి బహు క్లేశదంబులగు చదువులం బని ఏమి..''( పైన చెప్పుకున్న ఈ జీవునికీ దేవునికీ వున్న భ్రుత్యుడు-యజమానుల సంబంధమును తెలిసికొని, తనను పరమేశ్వరునికి దాసునిగా భావించి అఖండమైన అసలైన సుఖమును పొందే పరమయోగికి బహు కష్టములను ఇచ్చే చదువులతో పని ఏమి?)

''...ఈ వివేకంబు లేని వాని.. హేతువాదంబు ధాతువాదంబు...'' ( ఈ జ్ఞానము లేని హేతువాది వల్ల ధాతువులకు హాని..వాటిని శోధనతో చంపుతాడు కనుక!)

''...కాణాదంబు ప్రాణాదంబు..''(ఈ జ్ఞానము లేని వాని తర్క శాస్త్రము ప్రాణాలను తీస్తుంది, వూరికే తర్కించి చంపుతాడు కనుక! కణాదుడు ఒక తార్కికుడు )

''...కాపిలంబు చాపలంబు...''( కపిలుని సాంఖ్య మతము చపలత్త్వము కలిగినది..కపిలుని సంఖ్య వాదము ఈశ్వర-నిరీశ్వర అనే వాదం మధ్య  వూగిసలాడుతుంది)

''...మీమాంస హింస...''(యజ్ఞ, యాగ, అగ్నిష్టోమ సంబంధమైన కర్మకాండ యితర జీవుల ప్రాణాలను తీస్తుంది..యజ్ఞ పశువులుగా చేసి!)

''...వ్యాకరణంబు  అశరణంబు...'' (వ్యాకరణం రక్షింపలేదు)

''..అటుగాక చదువ దొరకొనిన నరునకు గాలంబు నలంబు, విఘ్నంబు లఖిలోద్యమఘ్నంబులు."( అదీ గాక బాగా చదువుకుందాము, తెలుసుకుందాము  అనుకునేవాడికి సమయము సరిపోదు, ఎంత చదువుకుంటే చదువుకున్నట్లు, దానికి అంతం ఎక్కడ వుంటుంది? ఎన్నో విఘ్నాలు సమస్త ప్రయత్నాలనూ నాశనం చేస్తాయి..ఎందుకొచ్చిన వెధవ చదువులు?!)

''..అందులకు సామగ్రి గిటగిటన, గొంతెరుంగ నగు  మదంబు పుటపుటన...''( ఐనా సరే, బాగా జ్ఞానము సంపాదిద్దాము, చదువుకుందాము అని  మొదలు బెట్టాడా..కావలసిన సామాగ్రి ఎక్కువ దొరుకక పోవచ్చు, దొరకదు, కొంత తెలిసిందా ఇక మదం పుట్టుకొస్తుంది! నా అంతవాడు లేదు అంటాడు, ఇవ్వాళ లోకంలో జరిగేది ఇదే, ఎంత వ్యంగ్యంగా చెప్పాడో చూడండి!)

''..దుద ముట్టం జదివె నేనియు సముత్పన్న విజ్ఞానుండై త్రైగుణ్య విషయంబులగు వాని నానీత ధాన్యుండు నిష్ఫలంబైన పలాలంబును, నాలబ్దమధుండు సిక్థకంబును విడుచు వడువున విడువ వలయు, గావున శాంతిదాంతిపరతం బరమైకాంతినైన నాకు మొదల నివి యదిగామింపం, దుద విసర్జింప నేమి ప్రయోజనంబు..''( ఒకవేళ తుదిముట్ట చదివి, జ్ఞాన సముపార్జన చేసినా దాని ఫలం ఏమిటి? చివరికి  ఈ చదువు, ఈ పాండిత్యము, ఈ జ్ఞానము ఇవన్నీ నిష్ప్రయోజనములు అని ధాన్యాన్ని కొనుక్కున్నవాడు గింజలు లేని పొట్టును విసర్జిన్చినట్లు, తేనెను కొన్నవాడు ఆ తేనెపట్టులోని  మైనాన్ని, అంటే పిప్పిని వదిలేసినట్టు..ఈ చదువును, పాండిత్యమును, జ్ఞానమును నిరర్ధకాలు అని భావించి వదిలెయ్యడమేగా? కనుక బాహ్య ఇంద్రియాలను అంటే కర్మేంద్రియాలను నిగ్రహించుకున్న నాకు, దాంతునకు, శాంతునకు, అంతర ఇంద్రియాలను అంటే జ్ఞానేంద్రియాలను నిగ్రహించుకున్న నాకు, ఏకాంతముగా కేవలము భక్తితో ధ్యానము చేసుకునే వాడికి,  మౌనికి, యోగికి, ఇవన్నీ ఈ చదువు, పాండిత్యము, జ్ఞానము వీటిని పొందడం ఎందుకు, మళ్ళీ వదిలించుకోవడం ఎందుకు?)

''..వాది భంజనంబు, రాజ రంజనంబును జేయుచు బునర్జననంబులకు విసువని జనంబులకు గానిమ్ము, మాదృశులకు  దదీయఖ్యాతి ఈతి, లాభంబు క్షోభంబు, పూజనంబు ఉద్వేజనంబు..''  (శాస్త్ర వాదములు చేసి ప్రతివాదులను వోడించి రాజుల మనోరంజనంబు జేస్తూ, పునర్జన్మంబులకు విసుగు చెందని జనులకు అవి సంతోష కారకాలు గానీ, నాలాంటి వారికి ఆ ఖ్యాతి ఈతిబాధలే, ఆ రాజ పూజలు భయానక అనుభవాలే!

ఇక్కడ శాస్త్ర చర్చలు, వాద ప్రతివాదాలు చేసి, గెలిచామనే ప్రతివాద భయంకరులను, రాజులను ఆశ్రయించి వారిని ఆనంద పరిచే పండితులను, జ్ఞానులను వ్యంగ్యం చేస్తున్నాడు, కవిగా ఉద్దేశ పూర్వకంగా ఇక్కడొక ధ్వని, విష్ణుచిత్తుడు వాదంచేయవలసివచ్చింది, పాండ్య రాజును రంజింపజేయవలసివచ్చింది, పరమాత్ముడి ఆజ్ఞ మేరకు, ఎందుకంటే తను పరమాత్ముడి దాసుడు కనుక, తనకంటూ ఏమీ స్వేచ్ఛను కోరుకోని బంటు కనుక!)

''..అని వితర్కించి యుర్వర బూర్వంబున సౌవీరభూరమణునకు గౌరవంబంగీకరించి బోధించి ముక్తికనిచిన భారతభూమి సురవతంసంబును బోలె దుర్విభావ్యబోధుండై పరమ పదంబునను భాగవతులకప్రాకృతంబులగు బహు భద్ర మూర్తులు భరియించి భగవత్పరిచర్య సేయుటయు బరమ పురుషార్ధంబగుట ఎరిగి యచటి రథచరణపాణి మాలికా కరణ కైంకర్యంబున కంకురిత కౌతూహలుండై చేయుచుండె, మరియును..

( ఈ రకంగా తనలో తను వితర్కించుకొని పూర్వము సౌవీర రాజుకు జ్ఞాన బోధ చేసిన జడ భరతునివలె, సమస్త జ్ఞాన సారాన్ని తెలిసికొని మౌనంగా, నిరాడంబరంగా, ఊహకు అందని జ్ఞానము కలవాడై, భాగవతులకు ప్రకృతి మాయలకు లొంగని మంగళ రూపములలో, జన్మలలో, భగవంతునికి పరిచర్యలు, సేవకునిగా సేవలు చేయుటయే పరమ పురుషార్ధమని, అంటే మోక్షమని తెలిసికొని, ఆ విల్లిపుత్తూరునందలి చక్రాయుధుని, మన్నారు కృష్ణుని సేవలో మాలలు అల్లి శ్రద్ధ, భక్తులతో సమర్పిస్తూ, వున్నాడు విష్ణుచిత్తుడు.)

*క.* *న్యాయార్జిత విత్తంబున*
*నాయోగీశ్వరుడు పెట్టు నన్నంబా ప్రా*
*లేయ పటీరాచలప*
*ద్యాయాతా యాత వైష్ణవావళి కెల్లన్*

ఆ విష్ణుచిత్తుడు న్యాయార్జిత విత్తముతోనే అటు హిమాచలము నుండి ఇటు మలయాచలము వరకు మధ్యన వున్న మార్గంలోని బాటసారులైన వైష్ణవులకు అందరికీ భోజనం పెట్టేవాడు. యజమాని కృతం పాపం అన్నమాశ్రిత్య తిష్ఠతి అని సూక్తి. అంటే యింటి యజమాని చేసిన పాపం అతను పెట్టే భోజనాన్ని ఆశ్రయించుకుని వుంటుంది. అందుకే ఎవడుబడితే వాడు పెట్టే విందులకూ, భోజనాలకు యోగులూ, జ్ఞానులూ, సాధకులు, అసలు ఎవరైనా సరే, వెళ్ళకూడదు. ఎవరింటికైనా భోజనానికి వెళ్ళేప్పుడు పండ్లూ, పూలూ తీసుకెళ్లడం అందుకు విరుగుడు, వూరికే పిలిచాడు కదా అని పడి తినకుండానూ, సామాజిక పరస్పర మర్యాదగానూ వుంటుంది. అందుకని ప్రత్యేకముగా 'న్యాయార్జిత విత్తంబున' అని చెప్పాడు ఇక్కడ.

*చ.	గగనము నీరు బుగ్గకెనగా జడివట్టిన నాళ్ళ  భార్య క*
*న్పొగ సొరకుండ నారికెడపుం బొరియల్దవులించి వండ న*
*య్యగపల ముంచిపెట్టు గలమాన్నము నొల్చినప్రప్పు నాలుగే*
*న్పొగిపిన కూరలున్వడియముల్వరుగు ల్పెరుగు న్ఘృతప్లుతిన్*

ఆకాశము ముసురుపట్టి, నీటిబుగ్గవలె ఉబికి, ఉబికి వర్షం కురిపిస్తూవున్న రోజులలో పొగరాకుండా ఎండిన  కొబ్బరి బొండముల పీచుతో పొయ్యి అంటించి ఆ కొబ్బరికాయల ఇంధనం తోనే వరియన్నము, పొట్టు వలిచిన పప్పు, నాలుగైదు పొరిలించిన, వేయించిన కూరలు, వడియాలు, వరుగులు, పెరుగుతో, నేతి ధారలతో వండిపెట్టేది ఆ విష్ణుచిత్తుని  ఇల్లాలు. అంటే  పొమ్మనకుండా పొగబెట్టే  రకం వంట  కాదన్నమాట!  తన లౌకిక  ప్రపంచ  జ్ఞానం  ఇక్కడ పరిచయం చేస్తున్నాడు  రాయలు. సామాన్య, నిరాడంబర బ్రాహ్మణ గృహస్థు వంటల, వడ్డనల తీరు, ఇలా వుంటుంది!

శ్రీకృష్ణ దేవరాయలు సింహాసనాన్ని ఎక్కకముందు ఆయనకు ఒక గొప్ప మిత్ర బృందం ఉండేది. కవులు, గాయకులూ, కళాకారులు, రసికులు, విదూషకులు ఆ బృందంలో వుండేవారు. రాయల సర్వతోముఖ వైదుష్యానికి ఈ బృందం, ఆ బృందంతో గడిపిన రోజులే కారణం. ఆరోజునుండి ఆయనకు అత్యంత సన్నిహిత మిత్రుడు అల్లసాని పెద్దన. కనుక బ్రాహ్మణుల యింటి భోజనం, వాతావరణం ఆయనకు కొట్టిన పిండి, కనుక ఇంతటి సహజమైన వర్ణనలు! ఇది వర్షాకాలంలో ఆ బ్రాహ్మణుని యింటి భోజన పదార్థాల వివరాలైతే ఆ తర్వాత వేసవి కాలంలోని భోజన వివరాలు..

*చ. తెలి నులివెచ్చ యోగిరము దియ్యని చారులు దిమ్మనంబులున్*
*బలుచని యంబళుల్చేరకుపా లెడనీళ్ళు రసావళుల్ఫలం*
*బులును సుగంధి శీత జలముల్వడ  పిందెలు నీరు జల్లయు*
*న్వెలయగ బెట్టు భోజనము వేసవి చందన చర్చ మున్నుగన్*

తెల్లని నులివెచ్చని, మరీ వేడి, మరీ చల్లదనం లేకుండా ఉన్న అన్నము, తియ్యని చారులు, మజ్జిగ పులుసులు(తిమ్మనంబులు) పల్చని  అంబళి ద్రవాలు, చెరుకు రసాలు, లేత కొబ్బరినీళ్ళు (ఎడ నీళ్ళు) రసాలు, (అంటే రసమూరే భక్ష్యాలు) అరటి పండ్లు, రసాల మామిడిపండ్లు మొదలైన వాటితో, వట్టివేళ్ళు వేసిన చల్లని సుగంధ జలములు, వూరేసిన మామిడి

పిందెలు, ఆవకాయ ముక్కలు (వడపిందెలు, అంటే, వేసవిలో వురేసిన మామిడిముక్కల వలన వడ కొట్టకుండా వుంటుంది అని ఆయుర్వేదం చెప్తుంది.) పలుచని నీరు చల్లతో..చక్కని భోజనం పెట్టేవాడు విష్ణుచిత్తులు అతిథులకు. అంతకు ముందు వేసవి తాపానికి గురై, అలిసిపోయి వచ్చిన అతిథులకు చందన చర్చ చేసేవారు, చల్లబడడం కోసం. వేసవి కాలములో పలుచని, చల్లని, ద్రవ పదార్థాల మిశ్రమంతో భోజనము వుండాలి అని ఆరోగ్య సూత్రాన్నియిక్కడ చెప్తున్నాడు. రసం, తియ్యని చారులు అంటే పులుసులు మొదలైనవి అన్నమాట. చారు, పులుసు లేకుండా చేసిన భోజనం ఎటువంటి భోజనమో కొన్ని పోలికలతో అంతకుముందే చెప్పారు మహానుభావులైన పూర్వీకులు.

'' మాతృ హీన శిశు జీవనం వృథా, కాంత హీన నవయవ్వనం వృథా, శాంత హీన తపసః ఫలం వృథా, తింత్రిణీ రస విహీన భోజనం..'' అని, తల్లి లేని శిశువు జీవితం, చెలియ లేని యవ్వనం, శాంతం లేని తపస్సు, పోపుగింజలతో కూడిన రసం, చారు లేని భోజనం, ఇవన్నీ వృథా అని తేల్చి పారేశారు. పాక శాస్త్ర, ఆహార శాస్త్ర సంబంధ చర్చలో ఇది వుంటుంది, ఇవన్నీ తెలిసిన

రసిక రాయలు శ్రీకృష్ణదేవరాయలు! ఇక శీతాకాలంలోని భోజనాల వివరాలు..

*మ. పునుగుం దావి నవోదనంబు మిరియంపుం బొళ్ళతో జట్టి చు*
*య్యను నాదారని కూర గుంపు ముకు మంధై యేర్చునావం జిగు*
*ర్కొను పచ్చళ్ళును బాయసాన్నములు నూరుంగాయలున్ జే సురు*
*క్కనునేయుం జిరుపాలు వెల్లువుగ నాహారం బిడున్సీతునన్*

'పునుగులు' అనే పేరుగల వరిధాన్యంతోవండిన వేడి వేడి అన్నము, మిరియాల పొడి(కారప్పొడి)తో ఆ వంట పాత్ర 'చుయ్య'నే మోత ఆగకుండా, నిరంతరమూ కలయబోస్తూ, తాలింపు వేస్తూ చేసే కూరలగుంపుతో, ముక్కుమందు ఐన, పడిశాన్ని, 'రొంప'ను వదలగొట్టే ఆవపిండితో కలిపి, చురచురమనే పచ్చళ్ళతో, పాయసాన్నంతో, వూరగాయలతో, చేతిమీద పడగానే 'చురుక్కనే' వేడి వేడి నేతి ధారలతో, యిగరగాచిన పాల ప్రవాహాలతో, అంటే ఇక లేవు అనే మాటరాకుండా సమృద్ధిగా పాలతో, శీతాకాలంలో భోజనం పెట్టేవాడు, విష్ణుచిత్తుడు, తనఇంటికి వచ్చిన అతిథులకు! శీతాకాలంలో యిలాంటిభోజనం ఆరోగ్యప్రదాయకం అన్నమాట. ఒక విశేషం ఏమంటే, ఇక్కడ ఇంత సహజ సుందరమైన శైలిలో బ్రాహ్మణ దంపతుల యింటి భోజన ఏర్పాట్లనూ, ఆహార పదార్థాల వివరాలను వర్ణించిన రాయలు ఇంత అద్భుతంగానూ క్షత్రియోచితమైన భోజన వివరాలను వర్ణించాడు, రాబోయే ఆశ్వాసాలలో చూడవచ్చు!

*చ. కదళిగభీరపుష్పపుటికాచ్ఛట జేతుల నిప్పపిండిపై*
*గుదురుగ నిల్పి యొపుగతి గూనల నూనియ నించి త్రాట ము*
*న్నుదికినశాటి వ్రేల నది నొక్కట గ్రుంకిడి వత్తు రెందరే*
*వదలక యాతనింట శనివారమున న్పరదేశ వైష్ణవుల్*

ఆ మహాశయుడి ఇంట్లో ఒక మూల పెద్ద పెద్ద బానలుండేవి, వాటి నిండా నువ్వుల నూనె వుండేది, పెరట్లో పెద్ద అరటి తోట వుండేది, ఆ అరటియాకుల, పూవుల పెద్ద పెద్ద దోనెలలో ఈ బానల్లోని నూనెను కావలసినంత నింపుకొని, అరచేతుల్లో ఇప్పపూల పిండి పోసుకొని, ఆ పిండి మీద ఈ నువ్వుల నూనెను నింపిన దోనెలు పెట్టుకొని, అంతకు ముందే సిద్ధంగా, శుద్ధంగా విష్ణుచిత్తుడు ఉతికి పెట్టిన వస్త్రాలను, ధోవతులను,( ఇవి ఆయన ఇంటిలోని వస్త్రాలు, ఆయన యాత్రికులకు సిద్ధంచేసిన మడి బట్టలు, పట్టువి)

సుబ్బరంగా స్నానం చేసి కట్టుకునేవి కనుక, చేత్తో ముట్టుకోకుండా, నిబ్బరంగా వాటికిముడేసిన తాళ్ళనుపట్టుకుని ఊపుకుంటూ, పరస్పరం మీరెక్కడినుంచి వచ్చారు అంటే మీరెక్కడి నుంచి..??అని వివరాలు తెలుసుకుంటూ, పాత పరిచయస్తులను కుశల ప్రశ్నలు వేస్తూ, నదికి వెళ్లి స్నానం చేసి,ఉతికినబట్టలు కట్టుకుని, ఉతుక్కున్న తమ బట్టలమూటలు పట్టుకుని, విష్ణుచిత్తుని ఇంటికి వచ్చి, వాటిని అరేసుకుని, హాయిగా భోంచేసి, కొంతసేపు విశ్రమించి, వెళ్ళేప్పుడు అంతవరకూ తాము ధరించిన మడి పట్టుబట్టలనో, ధావళులనో విడిచేసి, తమ బట్టలు కట్టుకుని వెళ్ళిపోయేవారు..(ఇలా ఆస్తికులైన అతిథులకు బట్టలను సిద్ధంగా పెట్టేవాళ్ళు ఇప్పటికీ వున్నారు అక్కడక్కడా, కనుక ఇదేమీ విచిత్రం కాదు)

ఈ సనాతనధార్మికజీవనాన్ని, ఆ పాత్ర స్వభావాన్ని, పరిసరాలను, సమాజాన్ని పరిచయం చేయడం రాయల ప్రత్యేకత!

ఇలా గుంపులకు గుంపులుగా ప్రత్యేకించి శనివారమునాడు దూర ప్రాంతాలనుండి వైష్ణవులు వదిలిపెట్టకుండా వచ్చేవాళ్ళు . ఇలా నిత్యాన్నదాన నిరతునిగా సంతర్పణలు చేస్తున్నాడు విష్ణుచిత్తుడు. ప్రత్యేకముగా శనివారమునాడు అని ఎందుకు చెప్పాడు అంటే వారాల సంతలు జరుగుతుంటాయి కదా..ఆ ప్రాంతంలో శనివారమునాడు ఏదో సంత జరుగుతూ వుండి వుంటుంది బహుశా, భోజనం చేసి యాత్రలనుండి తిరిగి తమ తమ ఇళ్ళకో, ఇంకా యాత్రలకు ముందు ముందుకో వెళ్తూ, ఈ ప్రాంతంలో అరుదుగా, చవగ్గా దొరికే వాటిని కొనుక్కుని వెళ్ళే వాళ్ళన్నమాట!

నువ్వుల నూనెలో ఇప్పపిండిని కలిపి, ఆ మిశ్రమాన్ని తలకూ, శరీరనికికూడా కామోసు, శుభ్రంగా పట్టించి స్నానం చేసేవాళ్ళన్నమాట, ఆరోగ్యం కోసం, అది ఒక అదనపు వివరం, రాయలు ఈ పద్యంలో చెప్పింది.

*శా. ఆ నిష్ఠానిధి గేహ సీమ నడురేయాలించినన్ మ్రోయునెం*
*తే నాగేంద్ర శయాను పుణ్య కధలుం దివ్య ప్రబందాను సం*
*ధాన ధ్యానము నాస్తి శాక బహుతా నాస్త్యుష్ణతా నాస్త్యపూ*
*పో నాస్త్యోదన సౌష్టవంచ కృపయా భోక్తవ్యమన్ పల్కులున్*

ఆ విష్ణుచిత్తుని ఇల్లు అర్ధరాత్రంలో కూడా శేషశాయి ఐన శ్రీ మహావిష్ణు సంబంధమైన కథలతో, ద్రావిడ దివ్య ప్రబంధ పారాయణతో, అతిథి, అభ్యాగతులకు స్వాగతవచనాలతో, '' ఎక్కువగా కూరలు లేవు, వేడిగా కూడా లేదు, పప్పులేదు, అప్పచ్చులు లేవు, వున్న అన్నం కూడా నాణ్యముగా లేదు, దయచేసి ఓర్చుకుని భోజనం చేయండి '' అనే పలుకులతో మారు మ్రోగుతూ వుంటుంది అర్ధరాత్రంలో కూడా! అంటే, ఆయనకు అంతర్యామి దేవుడు, అతిథి దేవుడు, ఈ ఇద్దరు దేవుళ్ళ సేవ తప్ప వేరే ఏదీలేదు ప్రవృత్తి ఐనా, వృత్తి ఐనా అదే. ఆళ్వారుల లోనే కాదు, ప్రబంధపాత్రలన్నింటిలో కూడా కచ్చితంగా ఈయనే పెద్దమనిషి, ప్రవరుడికి ఐనా ఊళ్ళు తిరగాలి, వింతలూ విశేషాలూ చూడాలి అనే కుతూహలం వున్నది, ఈయనకు అదీ లేదు, తను వెళ్తే గుడిలో దేవుడు, తన ఇంటికొస్తే అతిథి దేవుడు, ఈ ఇద్దరి సేవ, అంతే.కనుక ఈయన 'పెరియాళ్వారు' అనే సార్థక నామధేయుడు కూడా!

*తే. ఇత్తెరుంగున నవ్వైష్ణవోత్తముండు*
*జాగరూకత దైర్థిక భాగవతుల*
*కితర మెరుగక ఎవ్వరేమేమి వేడి*
*రలయ కవి పెట్టి సంతుష్టి సలుపుచుండె*

ఈ విధంగా పరమ జాగరూకుడై తీర్థాటన, దేశాటన, పుణ్య క్షేత్రాటన చేసే భాగవతులకు, ఎవరేది అడిగితే, వారికది పెట్టి, సంతృప్తులను చేస్తున్నాడు. ఈ చిన్ని పద్యంతో ప్రథమాశ్వాస కథా ఘట్టాన్ని ముగించి ఆశ్వాసాంత పద్యాలూ అని చెప్పుకునే పద్యాలతో ప్రథమాశ్వాసం పూర్తిచేశాడు రాయలు. ఇంత చిన్ని పద్యంలో కూడా ఒక కొండంత సందేశాన్ని పెట్టాడు.

'జాగరూకుడై' సేవ చేయడం అంటే చాలా భయ భక్తులతో చేయడం, ఎక్కడ ఏ లోటు, పొరపాటు వస్తుందో, అతిథిసేవలో లోపం వస్తుందో అని సేవజేయడం, చేసే ఏ పనికైనా అది అవసరం, అందునా, దానం చేసేప్పుడు అది మరీ అవసరం. అందుకే '' అవజ్ఞయా న దాతవ్యం కస్య చిల్లీలయాపివా అవజ్ఞయా కృతం హన్యాద్దాతారం నాత్ర సంశయః '' అని సుమంత్రుడితో పలికించాడు వాల్మీకి వారు రామాయణంలో.

అవజ్ఞ అంటే నిర్లక్ష్యం, చిల్లీలగా అంటే సరదాగా, నిర్లక్ష్యంగా, సరదాగా, పరిహాసంతో ఎన్నడూ దానంకానీ, ధార్మిక కార్యాలు కానీ చేయకూడదు, దాతా చేయ కూడదు, కార్యకర్తలూ చేయకూడదు, ఎవరు చేసినా ఆ దోషం ఆ దాతను నాశనం చేస్తుంది!

ఇది తెలిసిన వాడు కనుక విష్ణుచిత్తుడు ఇలా జాగరూకుడై అతిథి సేవ చేస్తున్నాడు అని ఇది తెలిసిన రాయలు తెలియజేశాడు, ఈ దానంలో, యజ్ఞ, యాగాది, క్రతువుల, పూజలలో లోపాలు చేస్తే బ్రహ్మరాక్షసులై పుడతారు అని ధర్మ శాస్త్ర నిర్దేశం. అలా బ్రహ్మరాక్షసుడైన వాడి వృత్తాంతం కూడా ముందు ముందు ఆముక్తమాల్యదలో రుచి చూద్దాం.

*కం. జలచర కిటి హరి వటు భృగు*
*కుల రఘుకుల సీరి బుద్ధ ఘోటి ప్రముఖో*
*జ్జ్వల జనికృత జనరక్షా*
*అలమేల్మంగాభిధేందిరాలయ వక్షా*

జలచర -మత్స్య, కూర్మ అవతారాలు; కిటి-సూకరము, వరాహావతారము;హరి-సింహము, నరసింహావతారము; వటు- వామనుడు భృగుకుల-పరశురామావతారము, రఘుకుల-శ్రీరామావతారము;సీరి-బలరాముడు, కృష్ణావతారము;బుద్ధ-బుద్ధుడు;ఘోటి-గుర్రాన్నెక్కినవాడు కల్కి అవతారము; ప్రముఖ-ఉజ్జ్వల-జని కృత జన రక్షా- మొదలైన ప్రకాశవంతమైన జన్మలనెత్తి జనులను రక్షించినవాడా,

# ద్వితీయాశ్వాసము

**శ్రీనయన కువలయుగళా**

**నూనజ్యోత్స్నాయిత స్మితోజ్జ్వలముఖ దై**

**త్యానీత సుర శ్రీ పున**

**రానయనక్రమణ వేంకటాచలరమణా**

లక్ష్మీదేవి యొక్క కలువలవంటి కన్నులను వికసింప జేసే వెన్నెలవంటి చిరునవ్వులచేత ప్రకాశించుచున్న ముఖము గలవాడా,రాక్షసులచేత అపహరింపబడిన దేవతల లక్ష్మిని మరలా తెచ్చువాడా, వేంకటాచలపతీ, అవధరింపుము, అని ఆముక్తమాల్యదలోనిరెండవ ఆశ్వాసమును ప్రారంభించాడు రాయలు.

కలువలు చంద్రుని రాకతో వికసిస్తాయి. లక్ష్మీదేవి రెండు కన్నులు అనే కలువలు వేంకటాచలపతి యొక్క చిరునవ్వులు అనే వెన్నెలను వొలికించే ముఖము అనే చంద్రుడిని చూసి వికసిస్తాయి. ఆ వేంకటాచలపతి రాక్షసులచేత అపహరింపబడిన దేవతల లక్ష్మిని (దైత్యానీత సుర శ్రీ )మరలా తెచ్చి ఇస్తాడు. ఇక్కడ దేవతలు అంటే దైవీ సంపద గలిగిన, సద్గుణములు కలిగిన ఉత్తములు అనడానికి సూచకంగా 'పునరానయన' అనే పదంతో సూచించాడు. 'అయనము' అంటేధర్మ సంబంధమైన అని.'క్రమణ' అంటే పాదముల ఉనికి అని, కనుక ఆయన పాదములను స్మరించడం ధర్మమార్గపు సిరిని తెచ్చిఇస్తుంది అని. ఆ పదములనే నమ్ముకున్న విష్ణుచిత్తులకు ధర్మ మార్గాన్ని ప్రబోధించిన 'సిరి' లక్ష్మీ దేవియే కూతురై జన్మించింది,అంతే కాదు, వైష్ణవ ధర్మ మార్గ ప్రబోధం చేసిన విష్ణుచిత్తులవారికీ 'ధన లక్ష్మి' బహూకరింపబడబోతున్నది. వీటికి సూచనగా, కావ్యాల ఆరంభంలో, మధ్యలో, చివరిలో మంగళ పూర్వకంగా వుండాలి గనుక ఇలా శుభ సూచకంగా ఈ పద్యంతో ప్రారంభించి ఈ ద్వితీయాశ్వాసములో మదురానగర వైభవాన్ని, ఆ నగరంలోని పుష్పలావికలు, అంటే పూవులనమ్మే సుందరీమణుల చాతుర్యాన్ని,గ్రీష్మ ఋతువును, మధురరాజు మత్స్య ధ్వజుడు తన ఉంపుడుగత్తె ఐన వేశ్యవద్దకు వెళ్తూ, మార్గమధ్యంలో ఒక పండితుడి సంభాషణవిని వైరాగ్యాన్ని పొంది వెనక్కు తిరిగివెళ్ళి , తన సభలో తనను కటాక్షించి ముక్తిని ప్రసాదించే దైవమును చూపిన వారికి బహుమానమును ప్రకటించడం, అనేక ధర్మాలకు చెందినవారు తమ తమ దైవములను గురించి బోధించడం, మహావిష్ణువు విష్ణుచిత్తులవారిని మధురకువెళ్ళి, ఆ మహారాజు సభలో వైష్ణవ ధర్మాన్ని గురించి ఉపన్యసించి రాజునూ వైష్ణవునిగా జేయమని ఆదేశించి పంపడం, విష్ణుచిత్తులవారి మధురా ప్రయాణము, వీటి గురించిన అద్భుతమైన నూటఒక్క పద్యాలను అందించాడు. రాయల కవనశక్తికి మరొక తార్కాణమైన ఈ ఆశ్వాసంలో ఒక్కొక్క అంశానికి సంబంధించిన ఒకటి రెండు పద్యాలను మాత్రం పరిశీలిద్దాము!

ఏవీట సతులపాలిండ్లపై గంబూర
    నవహారముల చిప్ప కవుచు మాన్చు
మలయజం బేవీట దొలుచెక్కడులిచి  మే
    డల కిడ్డ మిగుల భూములకు డిగ్గు
గలచునేవీట సింహళ గజంబుల గాలి
    చైత్ర వేళ నుదగ్దిశాగజంబు
దాల్తురేవీటి ప్రాక్తన భూప నిర్మాల్య
    మరకతంబులు పెర ధరణిపతులు

కపివర నియుక్త గిరి సద్రుగ్గహననిలయ
గాత్ర గాహిత కనక ముక్తా కవాట
గోపురావేదితోచ్చతా క్షోభ్యవప్ర
దనరు దక్షిణ మథుర సాంద్ర ద్రుమధుర

ఎక్కడ స్త్రీల పాలిండ్లపై పూయబడిన గంధపు పూత వారు ధరించిన కొత్త ముత్తెపు హారములలోని అప్పుడే కొత్తకొత్తగా సేకరించిన ముత్తెములకున్న ముత్తెపు చిప్పల పాచివాసనను అణిచి వేస్తుందో,ఎక్కడ శ్రీ గంధపు చెట్లనుండి తొలిచిన పై పై బెరడులు వారి ఇళ్ళకు ద్వారాలు, కిటికీలు మొదలైన వాటికి ఉపయోగించగా మిగిలిన మ్రానులు ఇతర దేశాలకు ఎగుమతి అవుతాయో, (మలయజంబు.. అంటే మలయపర్వత సానువులలో మొలిచిన శ్రీగంధపు చెట్లు) ఎక్కడ సింహళ గజంబుల గాలి చైత్ర మాసంలో అంటే వసంత ఋతువులో ఉత్తర దేశంలోని గజమును కలచివేస్తుందో (ఉదగ్దిశాగజంబు), ఎక్కడ ప్రాచీన సార్వభౌములు ధరించి వదిలేసిన, వాడి వదిలేసిన నిర్మాల్యమువంటి మరకతమణులను ఇతరదేశాల రాజులు 'మహా ప్రసాదం' అని ధరిస్తారో, కపివరుడైన సుగ్రీవునిచేత నియమించబడిన కొండలవంటి శరీరాలు కలిగిన కోతులు, అంటే వానర సేన, సీతాన్వేషణ చేసిన సందర్భంలో ప్రవేశించిన, ముత్తెములు పొదిగిన బంగారు ద్వారములు, కవాటములు, ఉన్నతమైన గోపురములు కలిగినది, ఆక్రమించడానికి శక్యముగాని కోట కలిగినది, దట్టమైన వృక్షముల చేత శోభించే మధురమైన 'దక్షిణ మధుర' వొప్పారును.

తమిళనాడు లోని పొదిగై మలై పర్వత సానువులలో జన్మించే తామ్రపర్ణి నదిలో ప్రపంచ ప్రశస్తమైన ముత్తెపు చిప్పలు లభిస్తాయి. ఆ నదీతీరపట్టణం కనుక ఎప్పటికప్పుడు కొత్త కొత్త ముత్తెపు చిప్పలు సేకరించి, ఆ ముత్తెపు చిప్పల పాచివాసన కూడా వదలని కొత్తకొత్త ముత్యాల హారాలు ఆ పట్టణ స్త్రీలు ధరిస్తారు. శ్రీ చందనం విరివిగా లభించే దేశం కనుక వారు తమ వక్షోజములపై అలదుకున్న శ్రీ గంధపు పరిమళము ఈ ముత్యాల హారాల పాచివాసనను అణిచి వేస్తుంది.

ఆ పట్టణప్రజలు వాడగా మిగిలిన గంధపు చెట్ల భాగాలు ఇతర దేశాలకు ఎగుమతి అవుతాయి. అక్కడి చక్రవర్తులు వాడి పారేసిన మరకత పచ్చల హారాలను ఇతర ప్రాంతాల చక్రవర్తులు ధరిస్తారు. అంత సంపన్నమైన దేశం, పట్టణం.అక్కడి సింహళ గజములు అంటే సింహళ దేశము నుండి తెచ్చిన మేలు జాతి ఏనుగులు మాత్రమే కాదు, సింహళం అంటే లంక, అక్కడి మదగజం రావణుడు, వాడు కలిచింది, బాధ పెట్టింది చైత్ర మాసంలో జన్మించినవాడు, వసంత ఋతువులోతన భార్యా వియోగముతో బాధపడిన 'ఉత్తరదేశపుగజము ఐన శ్రీ రాముడిని' అని ధ్వని. మరొక చమత్కారం సింహళదేశపు ఏనుగులు గనుక సింహపు శరీర పరిమళముతో ఉత్తర దేశపు ఏనుగులకు కలవరం కలిగిస్తాయి అని. మరొక అద్భుతమైన చమత్కార ధ్వని సింహ మధ్య ఐన గోదాదేవి ఉత్తర దేశపు గజగమనుడైన శ్రీకృష్ణుని కలిచివేసింది అని, సహజంగానే వసంతఋతువు మదన తాపాన్ని కలిగిస్తుంది కనుక. ఇవన్నీ ఉద్దేశ పూర్వకంగా ధ్వనించిన ప్రతీకలు. రామాయణ ధ్వనిగా కపిసేన సీతాదేవి కోసం అన్వేషణ చేస్తూ మధురా పట్టణాన్ని కూడా ప్రవేశించారు అని చెప్పాడు, వాల్మీకివారు కూడా" ముక్తా కవాటం పాండ్యానాం తత్రద్రక్ష్యథవానరాః " అని సుగ్రీవునిచేత పలికించారు. పురాతన భూపతులు అంటే ఆదివరాహుడు,శ్రీరంగనాధుడు మొదలైన అవతార మూర్తులు. వారు వరించిన భూదేవి అంశతో జన్మించినది గోదాదేవి అని ముందుముందుచెప్తాడు రాయలు. కనుక ఆ గోదాదేవిని స్వీకరించిన శ్రీకృష్ణుడు, ఆ గోదాదేవియే స్వయంగా తను ధరించి వదిలివేసిన పూలహారాన్ని, ఆ నిర్మాల్యాన్ని ధరించిన శ్రీకృష్ణుడు కూడా ఈ పద్యంలో ధ్వనిగా సూచింపబడ్డాడు. ఈ శ్రీకృష్ణ ప్రతీకకు సూచనగానే 'దక్షిణ మధుర'అన్నాడు, 'ఉత్తరమధుర', శ్రీకృష్ణుని మధుర కూడా ఒకటి ఉన్నది కనుక. ' మాయనై వడమదురై మైందనై..తూయ పెరునీర్ యమునై తురైవనై' అన్నది గోదాదేవి తన తిరుప్పావైలోని ఒక పాశురంలో,'ఉత్తర మదురలో పెత్తనం చెలాయించేవాడు' అనే అర్ధముతో ఇన్ని అద్భుతమైన ప్రతీకలతో మధురా పట్టణ వైభవాన్ని ఈ అద్భుతమైన పద్యంలో వర్ణించాడు రాయలు.

**స్థిర సౌధాగ్రవిహార యౌవతరతి చ్ఛిన్నాచ్ఛ హార స్ఫుర**
**ద్గురుముక్తావలి చేటికళ్వీరులతో గూడంగ ద్రోయన్నిజో**
**దరలగ్నంబగుదాని నెమ్మొగులధస్థంబై తరిన్ రాల్ప నా**
**కర మభ్రంబని యండ్రుగా కుదధి దక్క న్బుట్టునే ముత్తెముల్**

రాయల గాఢ శృంగార వర్ణనలకు ఇది ఒక ఉదాహరణం. ఆ పట్టణంలోని మేడలపై సంచరించే యువతులు, మదవతులు తమప్రియులపై ఉపరతి సల్పుతుంటే, ఆ తీవ్రతకు వారి మెడలలోని పూలహారాలు, స్వచ్ఛమైన ముత్తెపు హారములు తెగిపోయి, వాటిలోని పూవులు, ముత్యాలు దొర్లి పడిపోతే, ఆ పూలను, ప్రకాశవంతములైన పెద్ద పెద్ద ముత్యాలను పరిచారికలు వూడ్చి పారబోస్తుంటారు. ఉపరతితో అలిసిపోయి తమ ఉదరములమీద వ్రాలిపోయిన ఆ యువతులు మదన వర్షం కురిపిస్తుంటే గగనమే నిలయమని (ఆకరము అభ్రంబని యండ్రు గాక ) అంటుంటారు ( పురుషులు), ఆ రతిపారవశ్యము చేత పొందిన ఆనందముతో స్వర్గలోకపుటంచులను చేరుకుంటారన్నమాట! సముద్రములో తప్ప ముత్యాలు పుడతాయా? (ఉదధి దక్కన్ పుట్టునే ముత్తెముల్) అంటే, మదనసాగరమధనంలో తప్ప శృంగారభావ సంతృప్తి లోని ముత్యములవంటి అనుభవాలు దొరుకుతాయా?దొరకవు!ఆ పట్టణంలోని మేడలు ఆకాశాన్ని తాకుతుంటాయి గనుక, పరిచారికలు వూడ్చి పారబోసినప్పుడు మేఘములలో చేరిన ఈ హారములలోని ముత్తెములనే మేఘములు వర్షించడం వలన మేఘములలో కూడా ముత్తెములు వుంటాయి అని అంటారు గానీ, ఎక్కడైనా మేఘాలలో ముత్యాలు ఉంటాయా? సముద్రములో వుంటాయి గానీ!..అనికూడా అర్ధము.
ఈ పద్యములో రాయలు లోతైన, గాఢమైన,గూఢమైనశృంగారవర్ణన చేశాడు, ఇది ప్రబంధము కనుక, తను రసికరాయలు గనుక!

**గిరికొను గోపురాగ్ర పరికీలిత పంకజ రాగ రశ్మి గ**

**ట్టిర యగు చాయ బొల్చు దివసేంద్రుడు చక్కన మింట బోవుచో**

**మరచి విధాత పాటలిమ మధ్యమ సంధ్యకు జేయలేని యా**

**కొరతయు దీర్చుకో దొగరు కొల్పిన కైవడి బట్టణంబునన్**

సూర్యునికి రెండు సంధ్యలున్నాయి. ఉదయ సంధ్య, సాయం సంధ్య. ఈ రెండు సంధ్యలలోనూ సూర్యుడు ఎర్రని రంగులో ఉంటాడు.ఒక్క మధ్యాహ్న సమయంలో, మధ్యాహ్న సంధ్యలో మాత్రం ఆ ఎర్రని వర్ణం వుండదు. విధాత బహుశా మరిచిపోయి ఆ మధ్యాహ్నపుసంధ్యకు ఆ ఎర్రని రంగును కలిగించని కొరతను దీర్చటానికా అన్నట్లు మధ్యాహ్న సమయంలో ఆ పట్టణము పైనుండి సూర్యుడు వెళ్ళేప్పుడు ఆ పట్టణంలోని మేడలపైన, కోట బురుజులయందు చెక్కబడిన పద్మ రాగ మణులయందు పడిన సూర్యుని కాంతి(గిరికొను గోపురాగ్ర పరికీలిత పంకజ రాగ రశ్మి) ఆ పద్మ రాగ మణుల ఎర్రని కాంతిని ప్రతిఫలించడం వలన ఎర్రని రంగును అలదుకొని మధ్యాహ్నపు సూర్యుడు కూడా ఎర్రని ఛాయతో ప్రకాశిస్తూ 'అరుణుడు' అనే పేరును సార్ధకం చేసుకుంటాడు! ఇలా ఎటు చూసినా సిరి, సంపద, ఠీవి, రాజసం వెలుగొందుతున్న పట్టణం ఆ దక్షిణ మధుర. ఇటువంటి ప్రకృతి శోభతో, ఐశ్వర్యవంతమైన

మేడలలో,కోటలలో వుండే సంపన్నులతో బాటు చతురులైన, సరసులైన సామాన్య జనులకు కూడా ఆ పట్టణంలో కొదువలేదు. ఆ పట్టణ వీధులలో పూవులమ్ముకునే యువతుల లౌక్యాన్ని, ఆ పూవులకోసం అనే మిషతో వచ్చే పురుషుల సరస సంభాషణా చాతుర్యాన్ని ఇలా వర్ణించాడు. స్త్రీ పురుషుల మధ్య శ్రుతిమించని ఈ సరసం, మొరటుగా అనిపించని శృంగార రసపోషణం మానవ జీవితంలో సహజసుందరమైన అత్యవసరమైన అంశాలలో కొన్ని. వీటిని తెలుసుకొనడం వలన సరససంభాషణా చతురత కలుగుతుంది. యాంత్రికంగా సాగే జీవన సమయం రసమయం అవుతుంది. కనుక 'కొద్దిగా' తెలుసుకుందాము.

**వెలది యీ నీదండ వెల యెంత నా దండ**

**కును వెలబెట్టనెవ్వని తరంబు**

**కలువ తావులు గానమలి కదంబక వేణి**

**కలువ తావులు వాడకయ కలుగునె**

**కడివోదు నా కిమ్ము పడతి యీ గేదంగి**

**నన కడివోమి ముందరికి జూడు**

**జాతు లేవంబుజేక్షణ పద్మినులు సైత**

**మును నున్న యెడ జాతు లునికి యరుదె**

**యనుచు దొలి నుడి నభిలాష లెనయ మూగి**

**పలుకుతోడనె నర్మ గర్భంబు గాగ**

**నుత్తరము పల్లవ శ్రేణికొసగు చలరు**

**లమ్ముదురు పుష్పలావికలప్పురమున**

వెలదీ, యీ నీ దండ వెల ఎంత? నా దండకు వెలగట్టడం ఎవ్వరి తరమయ్యా? (దండ అంటే పూల దండ, బాహువులు, సమీపమున అనికూడా అర్థం) తుమ్మెదలగుంపువంటి జడకట్టు గలదానా!(అలికదంబకవేణి) కలువల వాసనయే కనబడడం లేదేమిటి? మనము కలుసుకోవడానికి స్థలమే కనబడదేమిటి అని శ్లేష!(కలువ తావులు గానము)వాడి అంటే ధరించి చూడకుండానే కలువపూవుల వాసనలు ఎలా తెలుస్తాయయ్యా?(కలువ తావులు వాడకయ కలుగునె)అంటే ప్రాధేయపడి, తిరిగి తిరిగి అలిసి వాడిపోకుండానే, కలుసుకోవడానికి స్థలం, సమయం, సందర్భం దొరుకుతాయా?అంత తేలిగ్గా మీకు పడిపోయేవాళ్ళలాగా

కనబడుతున్నామా? అని శ్లేష! బొడ్డును కూడా తామరపూల కుదురుతో పోల్చడం సరస కవిత్వ సంప్రదాయం కనుక ఆ సుందర నాభి దర్శనం గురించి కూడా అడిగేవారు, చెప్పేవారు చెప్పకనే చెప్తున్నారని రాయలు రసమయంగా చెప్తున్నాడు!

ఓ పడతీ, వాడిపోని ఈ మొగిలి పూవురేకును నాకు యివ్వు(కడివోదు నా కిమ్ము పడతి యీ గేదంగి) వాడి..పోని.. అంటే ఒకసారి అనుభవించి ఆనందిస్తే మరలి పోని, ఈ 'మొగిలిపూరేకు' అంటే 'ఆడతనాన్ని' నాకు ఇవ్వు అని,కడివోదు..అంటే..ముద్ద నోట్లోకి పోదు, తిండి పోదు అని అతని శ్లేష కూడా, దానికి జవాబుగా 'కడివోమి ముందరికి జూడు'ఈ మొగిలిపూరేకును వాడిన తర్వాత అప్పుడు చూడు వాడిపోయేదీ లేనిదీ, ఒకసారి నాతో కలిసి ఎడబాటు కలిగితే అప్పుడుకూడా తిండి నోటికి పోదు అనేది ముందు ముందు చూద్దువుగాని అని ఆమె! 'ముందర చూసి' వాడిపోయేదో వాడిపోనిదో తెల్సుకోవయ్యా అని మరీ లోతైన శృంగార అంతరార్థం!

'జాతులు' అంటే జాజి పూవులు, ఏ జాతి స్త్రీలు, పద్మిని, హస్తిని, శంఖిని అని కూడా, కనుక జాజులున్నాయా?అని అడిగాడు.పద్మినులు అంటే తామరపూలు, పద్మినీ జాతి స్త్రీలు కూడా, కనుక పద్మినులున్న చోట వేరే జాతులు ఎందుకుండవు, జాజులుఎందుకు వుండవు, కావలసినన్ని!('జాతు లేవంబుజేక్షణ పద్మినులు సైతమును నున్న యెడ జాతు లునికి యరుదె?)స్త్రీలలో పద్మినీ జాతి స్త్రీలు, పూలలో పద్మములూ, యితర జాతుల స్త్రీలకన్నా, జాజిపూలకన్నా కొద్దిగా శ్రమతో లభించడం జరుగుతుంది,ఆ జాతి వారే, ఆ పద్మాలే లభిస్తున్నప్పుడు ఇతర జాతులు దొరకడం ఏమన్నా అరుదా? ఇలా మొదటిమాట, తొలి పలకరింపుతోనే తమ కోరికలు తెలిసేలా, నర్మగర్భముగా పలికే సరసులకు, విటులకు, వారి భావానికి తగ్గట్టు సరిగా, గడసరిగా, ముక్తసరిగా, ముచ్చటగా సమాధానాలిస్తూ సొగసరులైన విరిబోణులు విరులమ్ముతూ వుంటారు మధురా పట్టణంలో.

**పద్మాస్య పురి ననుభవితకు నీవ ఎ**
**త్తులు వెట్టు దనగ రావలసె నిటకు**
**దెలుపుమా జాముండు నలరింపొ ఘటికా ద్వ**
**యం బుండు నల రింపొ కంబుకంఠి**
**యే వేడుటకు నీవు ఋతువేల చెప్పెద**
**వువిద మే మందాక నోర్వగలమె**
**చేరగా రాదె బాసికము గే ల్సోకిన**
**యంతనే చెడునె యేణాయతాక్షి**

**యనుచు బరిభాష వోలె దమ్మోస దొరల**

**నాద మోవి జెరంగిడి యాగు నవ్వు**

**కంట నిగుడ విరుల్మాన్చు కరణి జల్లు**

**సరసపు జలంబె జాణల మరులుకొల్పు**

ఓ పద్మముఖీ! యీ పురములో విరుల గంధమును అనుభవించు వానికి నీవే ఎత్తులు అంటే పూల ఎత్తులు పెడతావట గదా (శృంగార క్రీడకు ఎదురు చెల్లిస్తావట గదా అనీ, కామసదనాన్ని కామక్రీడలోఎదురొత్తులు ఇచ్చే కాముకివి అట గదా..అనినీ!) అని ఇంత దూరం రావలసి వచ్చింది (పద్మాస్య పురి ననుభవితకు నీవ ఎత్తులు వెట్టు దనగ రావలసె నిటకు)

ఓ శంఖమువంటి కంఠముగలదానా! ఒక ఝాము నిలిచి వుండే 'అలరు' ఇంపో, రెండు ఘడియలు వుండే'అలరు' ఇంపో తెలుపుము..'అలరు' అంటే పుష్పము కనుక ఒక జాము అంటే మూడు గంటలు వాడకుండా నిలువ వుండే పువ్వు మంచిదో, రెండు ఘడియలు అంటే గంట నిలువ వుండే పువ్వు మంచిదో చెప్పవూ అని అర్ధము, మూడు గంటల కామకేళియో, ఒక గంటసేపే ఉండేదో ఏది కావాలో చెప్పవూ అని అంతరార్ధము! (దెలుపుమా జాముండు నలరింపా ఘటికా ద్వయంబుండు నలరింపా కంబుకంఠి)

నేను అడిగిన పూవును ఇవ్వడానికి ఆ పూవు దొరికే ఋతుకాలం రావాలి అని ఎందుకు తలాయిస్తావు, వాయిదా వేస్తావు,ఏడిపిస్తావు? నేను అంత దాకా వోర్చుకోగలనా?..అని అర్ధము, సంభోగానికి ఋతుస్నానం చేసిన తర్వాత అని ఎందుకువాయిదా వేస్తావు, నేను అంత దాకా వోర్చుకో గలనా అని అంతరార్ధము!
(యే వేడుటకు నీవు ఋతువేల చెప్పెదవువిద మేమందాక నోర్వగలమె)

ఓ లేడి కన్నుల చిన్నదానా! నేను దగ్గిరికి రాకూడదా? దగ్గరకు వచ్చినంత మాత్రాన, చేయి తగిలినంత మాత్రాన బాసికము ఏమన్నా చెడి పోతుందా? ( బాసికము అంటే పూలదండలలో అలంకరించి అల్లే ఒక రంగురంగుల బిళ్ళ వంటిఅలంకరణ, బాసికము అంటే ఊరువుల మధ్య భాగము, పొత్తి కడుపు క్రింది భాగము అని కూడా అర్ధము!)
(చేరగా రాదె బాసికము గేల్సోకినయంతనే చెడునె యేణాయతాక్షి)

ఇలా ఏదో రహస్య సంకేత పరిభాష లాగా మాట్లాడుతుంటే అంతరార్ధమును గ్రహించి, చీర చెంగుతో వస్తున్న నవ్వును బిగబట్టి, చీర చాటున దాగిన పంటి నవ్వు దాగకుండా కన్నుల్లో ప్రతిఫలించే కంటి నవ్వుగా, మదన భావంతో

కనులు మెరుస్తుండగా, పూలను తడిపే నెపముతో వాటిమీద చల్లుతున్నట్లుగా ఈ సరసుల మీద చల్లే నీళ్ళే సరసపు నీళ్ళుగా విటులను ఆకర్షిస్తుండగా విరిబోణులకు విటులకు విరుల వ్యాపారం విరహ వ్యాపారం జరుగుతూ వుంటుంది ఆ మధురా పట్టణంలో.

**శ్రీనయన కువలయుగళా**

**సూనజ్యోత్స్నాయిత స్మితోజ్జ్వలముఖ దై**

**త్యానీత సుర శ్రీ పున**

**రానయనక్రమణ వేంకటాచలరమణా**

లక్ష్మిదేవి యొక్క కలువలవంటి కన్నులను వికసింప జేసే వెన్నెలవంటి చిరునవ్వులచేత ప్రకాశించుచున్న ముఖము గలవాడా,రాక్షసులచేత అపహరింపబడిన దేవతల లక్ష్మిని మరలా తెచ్చువాడా, వేంకటాచలపతీ, అవధరింపుము, అని ఆముక్తమాల్యదలోనిరెండవ ఆశ్వాసమును ప్రారంభించాడు రాయలు.

కలువలు చంద్రుని రాకతో వికసిస్తాయి. లక్ష్మీదేవి రెండు కన్నులు అనే కలువలు వేంకటాచలపతి యొక్క చిరునవ్వులు అనే వెన్నెలను వొలికించే ముఖము అనే చంద్రుడిని చూసి వికసిస్తాయి. ఆ వేంకటాచలపతి రాక్షసులచేత అపహరింపబడిన దేవతల లక్ష్మిని (దైత్యానీత సుర శ్రీ )మరలా తెచ్చి ఇస్తాడు. ఇక్కడ దేవతలు అంటే దైవీ సంపద గలిగిన, సద్గుణములు కలిగిన ఉత్తములు అనడానికి సూచకంగా 'పునరానయన' అనే పదంతో సూచించాడు. 'అయనము' అంటేధర్మ సంబంధమైన అని.'క్రమణ' అంటే పాదముల ఉనికి అని, కనుక ఆయన పాదములను స్మరించడం ధర్మమార్గపు సిరిని తెచ్చిఇస్తుంది అని. ఆ పదములనే నమ్ముకున్న విష్ణుచిత్తులకు ధర్మ మార్గాన్ని ప్రబోధించిన 'సిరి' లక్ష్మీ దేవియే కూతురై జన్మించింది,అంతే కాదు, వైష్ణవ ధర్మ మార్గ ప్రబోధం చేసిన విష్ణుచిత్తులవారికీ 'ధన లక్ష్మి' బహూకరింపబడబోతున్నది. వీటికి సూచనగా, కావ్యాల ఆరంభంలో, మధ్యలో, చివరిలో మంగళ పూర్వకంగా వుండాలి గనుక ఇలా శుభ సూచకంగా ఈ పద్యంతో ప్రారంభించి ఈ ద్వితీయాశ్వాసములో మదురానగర వైభవాన్ని, ఆ నగరంలోని పుష్పలావికలు, అంటే పూవులనమ్మే సుందరీమణుల చాతుర్యాన్ని,గ్రీష్మ ఋతువును, మధురరాజు మత్స్య ధ్వజుడు తన ఉంపుడుగత్తె ఐన వేశ్యవద్దకు వెళ్తూ, మార్గమధ్యంలో ఒక పండితుడి సంభాషణవిని వైరాగ్యాన్ని పొంది వెనక్కు తిరిగివెళ్ళి , తన సభలో తనను కటాక్షించి ముక్తిని ప్రసాదించే దైవమును చూపిన వారికి బహుమానమును ప్రకటించడం, అనేక ధర్మాలకు చెందినవారు తమ తమ దైవములను గురించి బోధించడం, మహావిష్ణువు విష్ణుచిత్తులవారిని మధురకువెళ్లి, ఆ మహారాజు సభలో వైష్ణవ ధర్మాన్ని గురించి ఉపన్యసించి రాజునూ వైష్ణవునిగా జేయమని ఆదేశించి పంపడం, విష్ణుచిత్తులవారి మధురా ప్రయాణము, వీటి గురించిన అద్భుతమైన

నూటఒక్క పద్యాలను అందించాడు. రాయల కవనశక్తికి మరొక తార్కాణమైన ఈ ఆశ్వాసంలో ఒక్కొక్క అంశానికి సంబంధించిన ఒకటి రెండు పద్యాలను మాత్రం పరిశీలిద్దాము!

**ఏవీట సతులపాలిండ్లపై గంబూర**
**నవహారముల చిప్ప కవుచు మాన్చు**
**మలయజం బేవీట దొలుచెక్కడులిచి మే**
**డల కిడ్డ మిగుల భూములకు డిగ్గు**
**గలచునేవీట సింహళ గజంబుల గాలి**
**చైత్ర వేళ నుదగ్దిశాగజంబు**
**దాల్తురేవీటి ప్రాక్తన భూప నిర్మాల్య**
**మరకతంబులు పెర ధరణిపతులు**

**కపివర నియుక్త గిరి సద్రుగ్గహననిలయ**
**గాత్ర గాహిత కనక ముక్తా కవాట**
**గోపురావేదితోచ్చతా క్షోభ్యవప్ర**
**దనరు దక్షిణ మథుర సాంద్ర ద్రుమధుర**

ఎక్కడ స్త్రీల పాలిండ్లపై పూయబడిన గంధపు పూత వారు ధరించిన కొత్త ముత్తెపు హారములలోని అప్పుడే కొత్తకొత్తగా సేకరించిన ముత్తెములకున్న ముత్తెపు చిప్పల పాచివాసనను అణిచి వేస్తుందో,ఎక్కడ శ్రీ గంధపు చెట్లనుండి తొలిచిన పై పై బెరడులు వారి ఇళ్ళకు ద్వారాలు, కిటికీలు మొదలైన వాటికి ఉపయోగించగా మిగిలిన మ్రానులు ఇతర దేశాలకు ఎగుమతి అవుతాయో, (మలయజంబు.. అంటే మలయపర్వత సానువులలో మొలిచిన శ్రీగంధపు చెట్లు) ఎక్కడ సింహళ గజంబుల గాలి చైత్ర మాసంలో అంటే వసంత రుతువులో ఉత్తర దేశంలోని గజమును కలచివేస్తుందో (ఉదగ్దిశాగజంబు), ఎక్కడ ప్రాచీన సార్వభౌములు ధరించి వదిలేసిన, వాడి వదిలేసిన నిర్మాల్యమువంటి మరకతమణులను ఇతరదేశాల రాజులు 'మహా ప్రసాదం' అని ధరిస్తారో, కపివరుడైన సుగ్రీవునిచేత నియమించబడిన కొండలవంటి శరీరాలు కలిగిన కోతులు, అంటే వానర సేన, సీతాన్వేషణ చేసిన

సందర్భంలో ప్రవేశించిన, ముత్తెములు పొదిగిన బంగారు ద్వారములు, కవాటములు, ఉన్నతమైన గోపురములు కలిగినది, ఆక్రమించడానికి శక్యముగాని కోట కలిగినది, దట్టమైన వృక్షముల చేత శోభించే మధురమైన 'దక్షిణ మధుర' వొప్పారును.

తమిళనాడు లోని పొదిగ్గై మలై పర్వత సానువులలో జన్మించే తామ్రపర్ణి నదిలో ప్రపంచ ప్రశస్తమైన ముత్తెపు చిప్పలు లభిస్తాయి. ఆ నదీతీరపట్టణం కనుక ఎప్పటికప్పుడు కొత్త కొత్త ముత్తెపు చిప్పలు సేకరించి, ఆ ముత్తెపు చిప్పల పాచివాసన కూడా వదలని కొత్తకొత్త ముత్యాల హారాలు ఆ పట్టణ స్త్రీలు ధరిస్తారు. శ్రీ చందనం విరివిగా లభించే దేశం కనుక వారు తమ వక్షోజములపై అలదుకున్న శ్రీ గంధపు పరిమళము ఈ ముత్యాల హారాల పాచివాసనను అణిచి వేస్తుంది.

ఆ పట్టణప్రజలు వాడగా మిగిలిన గంధపు చెట్ల భాగాలు ఇతర దేశాలకు ఎగుమతి అవుతాయి. అక్కడి చక్రవర్తులు వాడి పారేసిన మరకత పచ్చల హారాలను ఇతర ప్రాంతాల చక్రవర్తులు ధరిస్తారు. అంత సంపన్నమైన దేశం, పట్టణం.అక్కడి సింహళ గజములు అంటే సింహళ దేశము నుండి తెచ్చిన మేలు జాతి ఏనుగులు మాత్రమే కాదు, సింహళం అంటే లంక, అక్కడి మదగజం రావణుడు, వాడు కలిచింది, బాధ పెట్టింది చైత్ర మాసంలో జన్మించినవాడు, వసంత ఋతువులోతన భార్యా వియోగముతో బాధపడిన 'ఉత్తరదేశపుగజము ఐన శ్రీ రాముడిని' అని ధ్వని. మరొక చమత్కారం సింహళదేశపు ఏనుగులు గనుక సింహపు శరీర పరిమళముతో ఉత్తర దేశపు ఏనుగులకు కలవరం కలిగిస్తాయి అని. మరొక అద్భుతమైన చమత్కార ధ్వని సింహ మధ్య ఐన గోదాదేవి ఉత్తర దేశపు గజగమనుడైన శ్రీకృష్ణుని కలిచివేసింది అని, సహజంగానే వసంతఋతువు మదన తాపాన్ని కలిగిస్తుంది కనుక. ఇవన్నీ ఉద్దేశ పూర్వకంగా ధ్వనించిన ప్రతీకలు. రామాయణ ధ్వనిగా కపిసేన సీతాదేవి కోసం అన్వేషణ చేస్తూ మధురా పట్టణాన్ని కూడా ప్రవేశించారు అని చెప్పాడు, వాల్మీకివారు కూడా" ముక్తా కవాటం పాండ్యానాం తత్రద్రక్ష్యథవానరాః " అని సుగ్రీవునిచేత పలికించారు. పురాతన భూపతులు అంటే ఆదివరాహుడు,శ్రీరంగనాథుడు మొదలైన అవతార మూర్తులు. వారు వరించిన భూదేవి అంశతో జన్మించినది గోదాదేవి అని ముందుముందుచెప్తాడు రాయలు. కనుక ఆ గోదాదేవిని స్వీకరించిన శ్రీకృష్ణుడు, ఆ గోదాదేవియే స్వయంగా తను ధరించి వదిలివేసిన పూలహారాన్ని, ఆ నిర్మాల్యాన్ని ధరించిన శ్రీకృష్ణుడు కూడా ఈ పద్యంలో ధ్వనిగా సూచింపబడ్డాడు. ఈ శ్రీకృష్ణ ప్రతీకకు సూచనగానే 'దక్షిణ మధుర'అన్నాడు, 'ఉత్తరమధుర', శ్రీకృష్ణుని మధుర కూడా ఒకటి ఉన్నది కనుక. ' మాయనై వడమదురై మైందనై..తూయ పెరునీర్ యమునై తురైవనై' అన్నది గోదాదేవి తన తిరుప్పావైలోని ఒక పాశురంలో,'ఉత్తర మదురలో పెత్తనం చెలాయించేవాడు' అనే అర్థముతో ఇన్ని అద్భుతమైన ప్రతీకలతో మధురా పట్టణ వైభవాన్ని ఈ అద్భుతమైన పద్యంలో వర్ణించాడు రాయలు.

**స్థిర సౌధాగ్రవిహార యౌవతరతి చ్ఛిన్నాచ్ఛ హార స్ఫుర**

**ద్గురుముక్తావలి చేటికల్విరులతో గూడంగ ద్రోయన్నిజో**

**దరలగ్నంబగుదాని నెమ్మొగులధస్థంబై తలిన్ రాల్ప నా**

**కర మభ్రంబని యండ్రుగా కుదధి దక్క న్బుట్టునే ముత్తెముల్**

రాయల గాథ శృంగార వర్ణనలకు ఇది ఒక ఉదాహరణం. ఆ పట్టణంలోని మేడలపై సంచరించే యువతులు, మదవతులు తమప్రియులపై ఉపరతి సల్పుతుంటే, ఆ తీవ్రతకు వారి మెడలలోని పూలహారాలు, స్వచ్ఛమైన ముత్తెపు హారములు తెగిపోయి, వాటిలోని పూవులు, ముత్యాలు దొర్లి పడిపోతే, ఆ పూలను, ప్రకాశవంతములైన పెద్ద పెద్ద ముత్యాలను పరిచారికలు వూడ్చి పారబోస్తుంటారు. ఉపరతితో అలిసిపోయి తమ ఉదరములమీద వ్రాలిపోయిన ఆ యువతులు మదన వర్షం కురిపిస్తుంటే గగనమే నిలయమని (ఆకరము అభ్రంబని యండ్రు గాక ) అంటుంటారు ( పురుషులు), ఆ రతిపారవశ్యము చేత పొందిన ఆనందముతో స్వర్గలోకపుటంచులను చేరుకుంటారన్నమాట! సముద్రములో తప్ప ముత్యాలు పుడతాయా? (ఉదధి దక్కన్ పుట్టునే ముత్తెముల్) అంటే, మదనసాగరమథనంలో తప్ప శృంగారభావ సంతృప్తి లోని ముత్యములవంటి అనుభవాలు దొరుకుతాయా?దొరకవు!ఆ పట్టణంలోని మేడలు ఆకాశాన్ని తాకుతుంటాయి గనుక, పరిచారికలు వూడ్చి పారబోసినప్పుడు మేఘములలో చేరిన ఈ హారములలోని ముత్తెములనే మేఘములు వర్షించడం వలన మేఘములలో కూడా ముత్తెములు వుంటాయి అని అంటారు గానీ, ఎక్కడైనా మేఘాలలో ముత్యాలు ఉంటాయా? సముద్రములో వుంటాయి గానీ!..అనికూడా అర్ధము.

ఈ పద్యములో రాయలు లోతైన, గాఢమైన,గూఢమైనశృంగారవర్ణన చేశాడు, ఇది ప్రబంధము కనుక, తను రసికరాయలు గనుక!

**గిలికొను గోపురాగ్ర పలికీలిత పంకజ రాగ రశ్మి గ**

**ట్టెర యగు చాయ బొల్చు దివసేంద్రుడు చక్కన మింట బోవుచో**

**మరచి విధాత పాటలిమ మధ్యమ సంధ్యకు జేయలేని యా**

**కొరతయు దీర్చుకో దొగరు కొల్పిన కైవడి బట్టణంబునన్**

సూర్యునికి రెండు సంధ్యలున్నాయి. ఉదయ సంధ్య, సాయం సంధ్య. ఈ రెండు సంధ్యలలోనూ సూర్యుడు ఎర్రని రంగులో ఉంటాడు.ఒక్క మధ్యాహ్న సమయంలో, మధ్యాహ్న సంధ్యలో మాత్రం ఆ ఎర్రని వర్ణం వుండదు. విధాత బహుశా మరిచిపోయి ఆ మధ్యాహ్నపుసంధ్యకు ఆ ఎర్రని రంగును కలిగించని కొరతను దీర్చటానికా అన్నట్లు మధ్యాహ్న సమయంలో ఆ పట్టణము పైనుండి సూర్యుడు వెళ్ళేప్పుడు ఆ పట్టణంలోని మేడలపైన, కోట బురుజులయందు చెక్కబడిన పద్మ రాగ మణులయందు పడిన సూర్యుని కాంతి(గిరికొను గోపురాగ్ర పరికీలిత పంకజ రాగ రశ్మి) ఆ పద్మ రాగ మణుల ఎర్రని కాంతిని ప్రతిఫలించడం వలన ఎర్రని రంగును

అలదుకొని మధ్యాహ్నపు సూర్యుడు కూడా ఎర్రని ఛాయతో ప్రకాశిస్తూ 'అరుణుడు' అనే పేరును సార్ధకం చేసుకుంటాడు! ఇలా ఎటు చూసినా సిరి, సంపద, ఠీవి, రాజసం వెలుగొందుతున్న పట్టణం ఆ దక్షిణ మధుర. ఇటువంటి ప్రకృతి శోభతో, ఐశ్వర్యవంతమైన మేడలలో,కోటలలో వుండే సంపన్నులతో బాటు చతురులైన, సరసులైన సామాన్య జనులకు కూడా ఆ పట్టణంలో కొదువలేదు. ఆ పట్టణ వీధులలో పూవులమ్ముకునే యువతుల లౌక్యాన్ని, ఆ పూవులకోసం అనే మిషతో వచ్చే పురుషుల సరస సంభాషణా చాతుర్యాన్ని ఇలా వర్ణించాడు. స్త్రీ పురుషుల మధ్య శ్రుతిమించని ఈ సరసం, మొరటుగా అనిపించని శృంగార రసపోషణం మానవ జీవితంలో సహజసుందరమైన అత్యవసరమైన అంశాలలో కొన్ని. వీటిని తెలుసుకొనడం వలన సరససంభాషణా చతురత కలుగుతుంది. యాంత్రికంగా సాగే జీవన సమయం రసమయం అవుతుంది. కనుక 'కొద్దిగా' తెలుసుకుందాము.

**వెలది యీ నీదండ వెల యెంత నా దండ**

**కును వెలబెట్టనెవ్వని తరంబు**

**కలువ తావులు గానమలి కదంబక వేణి**

**కలువ తావులు వాడకయ కలుగునె**

**కడివోదు నా కిమ్ము పడతి యీ గేదంగి**

**నన కడివోమి ముందరికి జూడు**

**జాతు లేవంబుజేక్షణ పద్మినులు సైత**

**మును నున్న యెడ జాతు లునికి యరుదె**

**యనుచు దొలి నుడి నభిలాష లెనయ మూగి**

**పలుకుతోడనె నర్మ గర్భంబు గాగ**

**నుత్తరము పల్లవ శ్రేణికొసగు చలరు**

**లమ్ముదురు పుష్పలావికలప్పురమున**

వెలదీ, యీ నీ దండ వెల ఎంత? నా దండకు వెలగట్టడం ఎవ్వరి తరమయ్యా? (దండ అంటే పూల దండ, బాహువులు, సమీపమున అనికూడా అర్ధం) తుమ్మెదలగుంపువంటి జడకట్టు గలదానా!(అలికదంబకవేణి) కలువల వాసనయే కనబడడం లేదేమిటి? మనము కలుసుకోవడానికి స్థలమే కనబడదేమిటి అని శ్లేష!(కలువ తావులు గానము)వాడి అంటే ధరించి చూడకుండానే

కలువపూవుల వాసనలు ఎలా తెలుస్తాయయ్యా?(కలువ తావులు వాడకయ కలుగునె)అంటే ప్రాధేయపడి, తిరిగి తిరిగి అలిసి వాడిపోకుండానే, కలుసుకోవడానికి స్థలం, సమయం, సందర్భం దొరుకుతాయా?అంత తేలిగ్గా మీకు పడిపోయేవాళ్ళలాగా కనబడుతున్నామా? అని శ్లేష! బొడ్డును కూడా తామరపూల కుదురుతో పోల్చడం సరస కవిత్వ సంప్రదాయం కనుక ఆ సుందర నాభి దర్శనం గురించి కూడా అడిగేవారు, చెప్పేవారు చెప్పకనే చెప్తున్నారని రాయలు రసమయంగా చెప్తున్నాడు!

ఓ పడతీ, వాడిపోని ఈ మొగిలి పూవురేకును నాకు యివ్వు(కడివోదు నా కిమ్ము పడతి యీ గేదంగి) వాడి..పోని.. అంటే ఒకసారి అనుభవించి ఆనందిస్తే మరలి పోని, ఈ 'మొగిలిపూరేకు' అంటే 'ఆడతనాన్ని' నాకు ఇవ్వు అని,కడివోదు..అంటే..ముద్ద నోట్లోకి పోదు, తిండి పోదు అని అతని శ్లేష కూడా, దానికి జవాబుగా 'కడివోమి ముందరికి జూడు'ఈ మొగిలిపూరేకును వాడిన తర్వాత అప్పుడు చూడు వాడిపోయేదీ లేనిదీ, ఒకసారి నాతో కలిసి ఎడబాటు కలిగితే అప్పుడుకూడా తిండి నోటికి పోదు అనేది ముందు ముందు చూద్దువుగాని అని ఆమె! ‘ముందర చూసి’ వాడిపోయేదో వాడిపోనిదో తెల్సుకోవయ్యా అని మరీ లోతైన శృంగార అంతరార్థం!

'జాతులు' అంటే జాజి పూవులు, ఏ జాతి స్త్రీలు, పద్మిని, హస్తిని, శంఖిని అని కూడా, కనుక జాజులున్నాయా?అని అడిగాడు.పద్మినులు అంటే తామరపూలు, పద్మినీ జాతి స్త్రీలు కూడా, కనుక పద్మినులున్న చోట వేరే జాతులు ఎందుకుండవు, జాజులుఎందుకు వుండవు, కావలసినన్ని!('జాతు లేవంబుజేక్షణ పద్మినులు సైతమును నున్న యెడ జాతు లునికి యరుదె?)స్త్రీలలో పద్మినీ జాతి స్త్రీలు, పూలలో పద్మములూ, యితర జాతుల స్త్రీలకన్నా, జాజిపూలకన్నా కొద్ది్గా శ్రమతో లభించడం జరుగుతుంది,ఆ జాతి వారే, ఆ పద్మాలే లభిస్తున్నప్పుడు ఇతర జాతులు దొరకడం ఏమన్నా అరుదా? ఇలా మొదటిమాట, తొలి పలకరింపుతోనే తమ కోరికలు తెలిసేలా, నర్మగర్భముగా పలికే సరసులకు, విటులకు, వారి భావానికి తగ్గట్టు సరిగా, గడసరిగా, ముక్తసరిగా, ముచ్చటగా సమాధానాలిస్తూ సాగసరులైన విరిబోణులు విరులమ్ముతూ వుంటారు మధురా పట్టణంలో.

**పద్మాస్య పురి ననుభవితకు నీవ ఎ**
**త్తులు వెట్టు దనగ రావలసె నిటకు**
**దెలుపుమా జాముండు నలరింపా ఘటికా ద్వ**
**యం బుండు నల రింపా కంబుకంఠి**
**యే వేడుటకు నీవు ఋతువేల చెప్పెద**
**వువిద మే మందాక నోర్వగలమె**
**చేరగా రాదె బాసికము గే ల్సోకిన**

**యంతనే చెడునె యేణాయతాక్షి**

**యనుచు బరిభాష వోలె దమ్మాస దొరల**

**నాద మోవి జెరంగిడి యాగు నవ్వు**

**కంట నిగుడ విరుల్నాన్చు కరణి జల్లు**

**సరసపు జలంబె జాణల మరులుకొల్పు**

ఓ పద్మముఖీ! యీ పురములో విరుల గంధమును అనుభవించు వానికి నీవే ఎత్తులు అంటే పూల ఎత్తులు పెడతావట గదా (శృంగార క్రీడకు ఎదురు చెల్లిస్తావట గదా అనీ, కామసదనాన్ని కామక్రీడలోఎదురొత్తులు ఇచ్చే కాముకివి అట గదా..అనినీ!) అని ఇంత దూరం రావలసి వచ్చింది (పద్మాస్య పురి ననుభవితకు నీవ ఎత్తులు వెట్టు దనగ రావలసె నిటకు)

ఓ శంఖమువంటి కంఠముగలదానా! ఒక ఝాము నిలిచి వుండే 'అలరు' ఇంపో, రెండు ఘడియలు వుండే'అలరు' ఇంపో తెలుపుము..'అలరు' అంటే పుష్పము కనుక ఒక జాము అంటే మూడు గంటలు వాడకుండా నిలువ వుండే పువ్వు మంచిదో, రెండు ఘడియలు అంటే గంట నిలువ వుండే పువ్వు మంచిదో చెప్పవూ అని అర్ధము, మూడు గంటల కామకేళియో, ఒక గంటసేపే ఉండేదో ఏది కావాలో చెప్పవూ అని అంతరార్ధము! (దెలుపుమా జాముండు నలరింపొ ఘటికా ద్వయంబుండు నలరింపొ కంబుకంఠి)

నేను అడిగిన పూవును ఇవ్వడానికి ఆ పూవు దొరికే ఋతుకాలం రావాలి అని ఎందుకు తలాయిస్తావు, వాయిదా వేస్తావు,ఏడిపిస్తావు? నేను అంత దాకా వోర్చుకోగలనా?..అని అర్ధము, సంభోగానికి ఋతుస్నానం చేసిన తర్వాత అని ఎందుకువాయిదా వేస్తావు, నేను అంత దాకా వోర్చుకో గలనా అని అంతరార్ధము!
(యే వేడుటకు నీవు ఋతువేల చెప్పెదవువిద మేమందాక నోర్వగలమె)

ఓ లేడి కన్నుల చిన్నదానా! నేను దగ్గిరికి రాకూడదా? దగ్గరకు వచ్చినంత మాత్రాన, చేయి తగిలినంత మాత్రాన బాసికము ఏమన్నా చెడి పోతుందా? ( బాసికము అంటే పూలదండలలో అలంకరించి అల్లే ఒక రంగురంగుల బిళ్ళ వంటిఅలంకరణ, బాసికము అంటే ఊరువుల మధ్య భాగము, పొత్తి కడుపు క్రింది భాగము అని కూడా అర్ధము!)
(చేరగా రాదె బాసికము గేల్సోకినయంతనే చెడునె యేణాయతాక్షి)

ఇలా ఏదో రహస్య సంకేత పరిభాష లాగా మాట్లాడుతుంటే అంతరార్థమును గ్రహించి, చీర చెంగుతో వస్తున్న నవ్వును బిగబట్టి, చీర చాటున దాగిన పంటి నవ్వు దాగకుండా కన్నుల్లో ప్రతిఫలించే కంటి నవ్వుగా, మదన భావంతో కనులు మెరుస్తుండగా, పూలను తడిపే నెపముతో వాటిమీద చల్లుతున్నట్లుగా ఈ సరసుల మీద చల్లే నీళ్ళే సరసపు నీళ్ళుగా విటులను ఆకర్షిస్తుండగా విరిబోణులకు విటులకు విరుల వ్యాపారం విరహ వ్యాపారం జరుగుతూ వుంటుంది ఆ మధురా పట్టణంలో.

శ్రీకృష్ణ దేవరాయలవారి రసికత రుచి చూసిన తర్వాత ఆయన వర్ణనా చమత్కృతి కొద్దిగా రుచి చూద్దాము. మధురాపురములోని సరసులైన యువతీ యువకులను వర్ణించిన తర్వాత ఆ పట్టణము లోని వేద, జప, యజ్ఞ శీలురైన బ్రాహ్మణులను గురించి వర్ణిస్తున్నాడు.

**చిర సముపాశ్రితాగ్ని తడి జెంది నశించునటంచునో, కృతా**
**ధ్వరత దదగ్ని మైనునికి దాన నొకంగము దాచు చేతనో**
**పుర ధరణీసురుల్నిగమ భూధరముల్జప యజ్ఞ శీలురా**
**హరి ధనదేశులైన వల హస్తము సాపరు వారి ధారకున్**

చిరకాలము యజ్ఞ యాగాది క్రతువులను చేయుట వలన సాధించుకున్న అగ్ని ఎక్కడ ఆరిపోతుందో అని కాబోలు (చిర సముపాశ్రితాగ్ని తడి జెంది నశించునటంచునో), వేదపర్వతములవంటి ఆ బ్రాహ్మణులు సాక్షాత్తూ ఏ దేవేంద్రుడో (హరి), కుబేరుడో(ధనదేశుడు, అంటే ధనమునునిచ్చువాడు, ధనమునకు అధిపతి) వచ్చి దానమునివ్వడానికి సిద్ధమైనా తమ దక్షిణహస్తమును అంటే కుడిచేతిని చాపకుండా, దాచిపెడతారు. యజ్ఞ యాగాది క్రతువులను నిరంతరమూ నిర్వర్తించుచుండడం వలన అగ్ని స్వరూపులైన వారు ఆపట్టణములోని బ్రాహ్మణులు. బ్రాహ్మణుని దక్షిణ హస్తము అంటే కుడి చేయి అగ్ని స్వరూపము అని వేదం చెప్తుంది. దాన జలాన్ని స్వీకరించడం వలన ఆ నీటి వలన తమ చేతిలోని అగ్ని ఎక్కడ చల్లారుతుందో అన్నట్టుగా ఇంద్రుడు, కుబేరుడు వచ్చి దానం చేస్తామన్నా వద్దు అని, చేతిని కనీసం కనపడను కూడా కనపడకుండా దాచుకుంటారు ఆ పట్టణములోని బ్రాహ్మణులు. అధ్యయనము, అధ్యాపనము,

యజనము, యాజనము, దానము, ప్రతిగ్రహము అంటే, నిరంతరమూ శాస్త్ర అధ్యయనము చేయడం (చదువుకొనడం, నేర్చుకొనడం), యితరులచేత శాస్త్ర అధ్యయనము చేయించడం (యితరులకు నేర్పడం), యజ్ఞము చేయడం, చేయించడం, దానం చేయడం, దానమును స్వీకరించడం, ఈ ఆరు బ్రాహ్మణులకు విధులు, అవి వారి లక్షణాలు అని ధర్మ శాస్త్రాలు చెప్తున్నాయి. మరి వీరు

దానమును స్వీకరించడానికి ఎందుకు వెనుకంజ వేస్తారు అంటే, ఆ దానములకు, ప్రలోభములకు లొంగకుండా, అయాచితముగా వచ్చిపడే దానికోసం కలలు కనకుండా, తమ ధ్యాస అంతా జ్ఞాన సముపార్జన, జ్ఞాన వితరణ మొదలైన వాటి మీదనే పెట్టి వుంచుతారని చమత్కారము మాత్రమే.

**ఉరవడి పోరికై కవచ మొల్లరు మంత్రములందు దక్క సు**

**స్థిర నిజ శక్తి నైదు పది సేయరు దత్తిన తక్క మంటికై**

**పొరల రధీశుడీ కమల బుద్ధి ఖలూరిక దక్క వజ్ర దో:**

**పరిఘు వశీకృతాన్యనరపాలకు లప్పురి రాకుమారకుల్**

అప్పురి రాకుమారకుల్..ఆ పట్టణములోని రాకుమారులు..మంత్ర అనుష్ఠానములో తప్ప పోరులో కవచమును ధరింపరు. కవచము అంటే పోరాటంలో శరీర రక్షణ కొరకు ధరించే కవచము, మంత్ర శాస్త్ర అనుష్ఠానము లో ధరించే కవచము కూడా. పోరాటములో మాత్రము కవచము ధరింపరు, మొండిధైర్యము, తెగువ, ఆత్మ విశ్వాసము కలవారు. మంత్ర అనుష్ఠానములో మాత్రము కవచమును ధరిస్తారు. అంటే యుద్ధ తంత్రం, మంత్రం..రెండింటా నేర్పరులన్నమాట. ఐదు పది సేయడం అంటే సందేహించడం, ఉన్నదానికన్నా ఎక్కువగా ఊహించి వెనుకంజ వేయడం. ఆ రాకుమారులు నిజ శక్తిని చూపించడంలో ఐదు పది సేయరు(శౌర్యములో వెనుకంజ వేయరు) దానం చేయడంలో తప్ప, అంటే దానం ఇచ్చేప్పుడు ఐదు ఇవ్వాల్సినప్పుడు పది యిస్తారు, లోభితనము చూపించరు. ఖలూరిక అంటే సాముగరిడీలు అని అర్థము. సాముగరిడీలు, యుద్ధ విన్యాసాలు చేసేప్పుడు తప్ప, ప్రభువు తనకై తాను యివ్వనిదే భూములకోసం, మంటిలో పొరలరు, పొర్లుదండాలు పెట్టరు, స్వాభిమానము కలవారు, విమల బుద్ధి కలవారు, వజ్రసన్నిభములైన భుజములకున్న పరిఘులచేత జయింపబడిన యితర రాజులను కలిగినవారు, ఆ పట్టణ రాకుమారులు. ఆ రాచనగరిని వర్ణించిన తర్వాత రాజుగారిని వర్ణిస్తున్నాడు రాయలు.

**ద్విద్వయోపాయ ధీ విద్వద్వతంసంబు**

**షాడ్గుణ్య చాతురీ చక్రవర్తి**

**క్రీడాచలీకృత శ్రీఖండగిరి రాజు**

**కనకాద్రి ముద్రణ గ్రంధ కర్త**

**యందూ నిబద్ధాబ్ధ బృంద వేదండాళి**

**వననిధి స్తంభనాధునిక రఘువు**

**తామ్రపర్ణ్యమల పాధః కేళి హంసంబు**

**లంకేశ మైత్రీ ప్రియంకరుండు**

**స్వస్తికృద్వాస్తవ స్తుత్యగస్తి మఘవ**

**మకుట మోటన శరకోటి మంత్రభృత్య**

**భూత భూతాత్త శాంభవ భూమికుండు**

**దత్పురంబేలు బాండ్య మత్స్యధ్వజుండు**

ఆ పురమును ఏలే పాండ్య మత్స్యధ్వజుడు, ద్విద్వయ అంటే రెండు రెళ్ళు , అంటే నాలుగు ఉపాయాలలో, అంటే సామ, దాన, భేద, దండము అనే ఉపాయాలలో నిపుణుడు. బుద్ధి కుశలుడు. పండిత శ్రేష్టుడు. సంధి, విగ్రహము, యానము, ఆసనము, ద్వైదీభావము, సమాశ్రయము అనే ఆరు గుణములలో నిపుణుడు. శ్రీఖండ పర్వతము అంటే మలయపర్వతము. ఆ మలయపర్వత సానువులయందు క్రీడగా విహరించేవాడు. కనకాద్రి అంటే మేరు పర్వతము. కనకాద్రిపర్వతమందు తన గెలుపులను, యుద్ధ విజయములను గురించి శాసనములను లిఖించిన వాడు. 'అందూ నిబద్ధ అబ్ద బృంద వేదండాళి' అంటే సంకెలల చేత బంధింపబడిన మేఘములవంటి నల్లని గజసమూహములను కలిగినవాడు. వననిధి అంటే సముద్రము, సముద్రము మీద కట్ట గట్టిన ఆధునిక రఘురాముడు. (కామవాంఛలు అనే అలలతో ఎగసిపడే మోహ సముద్రానికి ఆధ్యాత్మిక మార్గమనే వారధిని కట్టినవాడు, అది ముందు ముందు జరిగే సంఘటన మత్స్య ధ్వజుని జీవితంలో, ఇక్కడ దాన్ని ధ్వనిస్తున్నాడు రాయలు.) నిర్మలమైన తామ్రపర్ణి అనే నదీ జలములలో క్రీడించే రాజహంస వంటివాడు. లంకేశునితో అంటే ఆనాటి లంకాదేశమునకు అంటే నేటి శ్రీలంకకు ప్రభువు ఐన వాడితో స్నేహమును కలిగినవాడు.

ఇందులో కూడా ఒక ధ్వని వున్నది. లంకాధిపతి ఐన విభీషణుడు శ్రీరంగ నాధుని భక్తుడు. శ్రీ రంగనాధుని నిత్యమూ అర్చించేవాడు. శ్రీ రాముడు రావణవధ అనంతరం తన పటాభిషేక మహోత్సవానికి వచ్చిన తన మిత్రులందరికీ అనేక కానుకలను యిచ్చి సత్కరిస్తూ, విభీషణునకు ఇక్ష్వాకు వంశీయులు తమ పూజా మందిరం లో నిత్యమూ అర్చించే 'రంగనాధుని' ప్రతిమను బహూకరించాడు. లంకకు తిరిగి వెళ్తున్న విభీషణుడు కావేరీ నదీ తీరానికి చేరుకొని, తనకు సంధ్యా వందన విధుల సమయం కావడంతో అక్కడ యిసుక తిన్నెలమీద ఈ రంగనాధుని ప్రతిమను వుంచి, తన సంధ్యావందన, జప, తపాదులు నిర్వహించుకుని, మరలా విగ్రహాన్ని తీసుకుని పోవడానికి ప్రయత్నం చేస్తే ఆ విగ్రహం కదలలేదు. ఇదేమిటి అని ఖిన్నుడైన విభీషణునకు రంగనాధుడు దర్శనమిచ్చి ఈ కావేరీనదీతీర

ప్రాంతము తనకు తగినది, నచ్చింది అని చెప్పి, తనను అక్కడే నిలుపమని కోరడంతో, అక్కడే రంగనాథ ఆలయ నిర్మాణం చేసి, నిత్యమూ అక్కడికే వచ్చి విభీషణుడు అర్చనాదికాలు చేసేవాడు. లంకాధిపతితో చెలిమి చేసినవాడు అనడంలో, విష్ణుచిత్తుని ఉపదేశముతో ముందు ముందు రంగదాసునిగా, వైష్ణవునిగా మారబోతున్నాడు ఈ మత్స్యధ్వజుడు అని ధ్వనిపూర్వక సూచన! ఈ మత్స్యధ్వజుడు తనను స్వస్తి వాక్యములతో, వాస్తవములైన స్తుతులు చేసే అగస్త్యుని వంశమునకు చెందిన భూసురులు కలిగినవాడు.

'మఘవ మకుట మోటన శరకోటి', మఘువుడు అంటే దేవేంద్రుడు. దేవేంద్రుని కిరీటమును కూడా నుగ్గు నుగ్గు చేయగలిగిన బాణములను కోట్ల సంఖ్యలో కలిగినవాడు, అంటే అంతటి శస్త్రాస్త్ర పరాక్రమ శక్తి కలిగినవాడు. 'మంత్రభ్రుత్య భూత భూతాత్త శాంభవ భూమికుండు', అంటే, మంత్ర, భూత, భ్రుత్యగణ వైభవములో సాక్షాత్తూ పరమశివుని అంతటివాడు.

ఆ మత్స్యధ్వజుడు మేరుపర్వతము వరకూ అంటే ఆసేతు శీతాచల పర్యంతమూ విజయ గాధలను కలిగి, తన విజయ చరిత్రను మేరుపర్వతము మీద లిఖించినవాడు. స్వదేశములోనే కాదు, విదేశాలకూ తన కీర్తిని వ్యాపింప జేసినవాడు, శ్రీలంక ప్రభువుకు మిత్రుడు. చక్రవర్తికి కావలసిన చతుర్విధ ఉపాయాలలో, షడ్గుణాలలో, బుద్ధి కుశలత లో, పాండిత్యములో, గజసంపదలో, మంత్రశక్తిలో, క్రీడావిలాసములో, ఒకటేమిటి, అన్ని విషయాలలోనూ నిపుణుడు. సరసుడు. రసికుడు. దేవేంద్రుని సైతమూ పరాభవించగలిగిన పరాక్రమ శక్తి సంపన్నుడు. శ్రీకృష్ణ దేవరాయల విశిష్టత భావి కథా సూచకత్వం, పాత్రల పరిచయం, పాత్రల చిత్రణ. శ్లేషనూ ధ్వనినీ అద్భుతంగా ఉపయోగించి ఈ పని చేస్తాడు ఆయన. విష్ణుచిత్తుని పరిచయం చేసిన ప్రథమ పద్యంలో ఒకే ఒక పద్యంలో సంపూర్ణ పాత్ర చిత్రణ, పరిచయం చేయడం గమనించాము. విష్ణుచిత్తుడు మొదటినుండీ ఒకే మార్గంలో వున్నవాడు, శుద్ధ సాత్విక భక్తుడు, అలాగే కొనసాగుతున్నవాడు, ఆయన వ్యక్తిత్వములో మార్పు లేదు, రాదు. కనుక నేరుగా పరిచయం చేశాడు. ఇక్కడ మత్స్యధ్వజుని పరిచయం చేస్తున్న ఈ ప్రథమ పద్యంలో శ్లేషనూ, ధ్వనినీ అద్భుతంగా ఉపయోగించి మత్స్యధ్వజుని ప్రస్తుత వ్యక్తిత్వాన్నీ భావిలో ఆతనిలో కలుగబోయే మార్పునూ సూచించాడు.

**ఇందుకులావతంస మత డే తరి నేతరిగాడరిం బ్రజ**

**ల్కంద గొనం డొరుం డొరుతల న్వినిపించిన మాట డెందముం**

**జెంద ముదంబు దక్కి చెడ జేయ డొరు న్వినతాస్యుడౌ నుతిం**

**పం దను బందనుం గొరత వల్కడు శూరత దాను మించియున్**

ఆతడు ఇందు కులావతంసము, అంటే చంద్ర వంశమునకు అలంకార ప్రాయమైనవాడు. ఏతరి అంటే ఎప్పటికీ. 'ఏతరి' అంటే నీతి తప్పిన వాడు అని కూడా అర్థం. ఇక్కడ తన భాషా వైదుష్యాన్ని చూపుతున్నాడు రాయలు. ఆ రాజు ఏ తరి కూడా 'ఏతరి' కానివాడు అంటే ఎన్నటికీ నీతి తప్పని వాడు. 'అరి' అంటే పన్ను, శుల్కము. ప్రజలు కందకుండా, బాధ పడకుండా పన్నులను విధించే వాడు.

చెప్పుడు మాటలు విని ఎవరినీ బాధించేవాడు కాదు. ''..వినతాస్యుడౌ నుతింపం దను..'', తనను ప్రశంశిస్తూ ఎవరైనా నుతులు చేస్తుంటే లజ్జతో తల వంచుకునే వాడు.

పొగడ్తలకు 'ఆహా..వోహో..అవును.. నేను అంతటి వాడినే, ఏమనుకున్నావు మరి!' అని తల ఎగరెయ్యడం మదానికీ, అహంభావానికీ లక్షణం. తనను ఎవరైనా పొగుడుతుంటే తలవంచి మౌనం వహించడం అంటే ఆత్మ ప్రశంస యందు ఇష్టము లేని వాడు అని. యిది ఆతని అంతర్ముఖత్వ లక్షణానికి ప్రతీకగా, భావి కథా సూచనగా కూడా రాయలు చెప్పాడు అని నా ఉద్దేశము. తను చేసే కొన్ని పనులు తననే సిగ్గిల జేయడం ఎంతటి వారికైనా జరిగేదే. స్వానుభవంతో తెలుసుకోవాలి వీటిని. నిజాయితీ కలిగిన వాడు తనను ఎవరైనా పొగుడుతుంటే, అయ్యో, యిన్ని ప్రశంసా వాక్యాలకు నేను పాత్రుడినా, నా తప్పులు తెలియక నన్ను ఉన్నతునిగా భావిస్తున్నారు ఈ అమాయకులు! అని ఆత్మ విమర్శ చేసుకోవడం తమను తాము సరిదిద్దుకొనడం కోసం మరల మరలా ప్రయతనములను చేయడం స్వతహాగా మంచివారి నైజం. నిర్మలమైన పసిపిల్లల విషయంలోనూ, పసిపిల్లల వంటి మనసున్న వాళ్ళ విషయంలోనూ ఇది అక్షర సత్యం. అందుకే నువ్వు ఈ తప్పు చేశావు అని కాకుండా నువ్వు ఈ వొప్పు చాలా బాగా చేశావు, ఇంకా బాగా చేయగలవు అనడం ద్వారా, సున్నితమైన ప్రశంసల ద్వారా ఎవరి తప్పులను, వొప్పులను వారే గుర్తించేలా జేసి సరిజేయడం, సంస్కరించడం తెలివైనవారు చేసేపని, చేయాల్సిన పని. 'మెన్ మేనేజ్మెంట్' లో ఆధునిక మార్గాలు ఇవే చెప్తాయి. ఇన్ని మంచి లక్షణాలు వున్నా, ఈ మత్స్యధ్వజునికి వేశ్యాలోలుపత్వం ఉన్నది. ఒక వేశ్యకు దాసుడై నిత్యమూ ఆమెను చేరి, ఆమె అందచందాలకు ముగ్ధుడై కామకేళిలో తేలేవాడు, అది తన బలహీనత అని తనకు తను వితర్కించుకునేవాడు కనుకనే, ఒకే ఒక నీతి వాక్యమును అనుకోకుండా వినడంతో తన మార్గాన్ని, మనసును, ప్రవర్తనను మార్చుకుని 'తనకు ముక్తిని ప్రసాదించ గలిగే దైవం యొక్క అన్వేషణలో' పడతాడు, ముందు ముందు. అది ఈ ప్రబంధములోని అందమైన సంఘటనలలో ఒకటి. త్వరలోనే ఆ ఘట్టాన్ని మనం రుచి చూస్తాము. ముందు ముందు జరగబోయే దానికి సూచకంగా యిక్కడ ఈ విషయం చెప్పాడు రాయలు, ఆత్మ విమర్శ చేసుకునే వాడికే త్వరగా ఆత్మ శుద్ధి చేసుకునే శక్తి వుంటుంది. ఆ సమయమూ, సందర్భమూ తారసిల్లాలి, అంతే! కనుక వెంటనే మారిపోతాడు మత్స్యధ్వజుడు.

యింతే కాకుండా, తన పరాక్రమానికి లొంగి, బెదరి, పారిపోయే వారిని చులకన చేసే వాడు కూడా కాదు ఈ మత్స్యధ్వజుడు. అంటే ఆత్మస్తుతిని, పరనిందను మెచ్చనివాడు. ప్రజా రంజకుడైన పరిపాలకుడు. సకల కళా వల్లభుడు.

మధురానగర చక్రవర్తిని పరిచయమాత్రంగా పరామర్శించి, వేసవి ఋతువును వర్ణించడం మొదలు బెట్టాడు రాయలు. 'ఆముక్తమాల్యద' ప్రబంధము కనుక, వివిధ ఋతువుల వర్ణన ప్రబంధ లక్షణాల రీత్యా ఆవశ్యకం గనుక, ప్రబంధలక్షణాలను నిక్షేపించడంకొరకు గ్రీష్మ ఋతువర్ణన అనేది ఒక కారణం అయితే, మరొక కారణం కథా సంబంధమైన అవసరం కూడా. ఆ మధురానగర చక్రవర్తికి ఒక ప్రియురాలు వున్నది. ప్రతి సాయంత్రమూ ఆమె దర్శనం, స్పర్శనం, కామోపభోగ ప్రకర్షణం జరిగేవే, వింత

ఏమీలేదు. ఒక వేసవినాటి సాయంత్రం మాత్రం ఎప్పటిలాగే తన ప్రియురాలి సమాగమం కోసం వెళ్తున్న సందర్భంలో ఒక అద్భుతమైన సంఘటన జరిగింది, ఆ చక్రవర్తి జీవితంలో. ఆ సంఘటన విష్ణుచిత్తుల వారి జీవితంలో కూడా మరొక అద్భుతమైన సన్నివేశానికి

తెర తీసింది. కనుక వేసవి ప్రస్తావన ఎంతో సహజ సుందరమైన రీతిలో, ఏదో అతికించినట్టు కాకుండా, అత్యవసరమన్న కథాంశంగా ఒదిగిపోయింది ఈ ప్రబంధంలో. గ్రీష్మ ఋతువర్ణనలో భాగంగా అద్భుతమైన 27 పద్యాలను అందించాడు రాయలు. ఏ ఒక్కటీ వదిలిపెట్టబుద్ది పుట్టనియ్యదు, కొన్ని కవిసమయాలు, కొన్ని సరసరసమయాలు, అన్నిటికి అన్నీ అద్భుతకవితారసమయాలు, అయినా అన్నింటినీ పరీక్షించడం వీలుకాదు కనుక, మచ్చుకు కొన్నింటిని రుచి చూద్దాం!

**పాటల వసుంధరారుహ భాగధేయ**
**మాతతమరీచికాంబువర్షాగమంబు**
**ధరణి బొడసూవె నంత నిదాఘసమయ**
**ముదుటుతొ శాల్మలి ఫల విదళనంబు**

పాదిరి చెట్లను పుష్పింప జేస్తూ, ఎండమావుల నీళ్ళకు వర్షాకాలమువంటిది అవుతూ (పెద్దపెద్ద ఎండమావులను కల్పింప జేస్తూ) బూరుగు కాయలను పగులగొడుతూ, ఉదుటుతో అంటే ఉద్ధతితో, తీవ్రముగా, ఎండాకాలం భూమిమీద పొడసూపింది. వర్షాకాలం నిజమైన నీటికి కారణం అయితే వేసవికాలం ఉత్తుత్తి నీళ్ళకు, అంటే ఎండమావులకు కారణం అవుతుంది, అది చిన్ని చమత్కారం. వేసవిలో పాదిరిచెట్లు పుష్పించడం, బూరుగు చెట్లకున్న కాయలు పగిలి, విచ్చుకుని ఆ బూరుగు దూది పింజలు, వాటితోపాటే గింజలు వెదజల్లబడడం అనేది ప్రకృతి సహజమైన విషయం, రాయల పరిశీలనాశక్తికి యిది నిదర్శనం.

**దవధూమంపుదమంబులో దమరస ద్రవ్యంబు బంకేజ బాం**
**ధవభాను ప్రతతుల్హరింప గుయి వెంటన్వెళ్ళు శూన్యోరుకూ**
**పవితానం బన జూడజూడ బుడమిన్బాటిల్లి పై విప్పులై**
**యవసం బంచుల నాడగా నెగసె వాత్యాళిన్రజశ్చక్రముల్**

వేసవికాలంలో కార్చిచ్చు పుట్టడం సహజమే. ఆ కార్చిచ్చు రగులుతున్నప్పుడు వచ్చే నల్లని పొగ అనే చీకటిలో (దవధూమంపుదమంబులో) మాయజేసి, తమ ద్రవాలను అంటే నీళ్ళను, సూర్యుని కిరణాలు హరించివేయడం వలన, సూర్యునితోనే

మొరబెట్టుకోవడం కోసం, నీళ్ళు యింకి పోయి శూన్యాలు అయిపోయిన బావుల గుంపులేమో అన్నట్లు, (బంకేజబాంధవభానుప్రతతుల్వారింప గుయి వెంటన్వెళ్ళు శూన్యోరుకూపవితానంబన) వాయువు సుడిగుండాలుగా, సుడిగాలులు దుమ్మూ ధూళి కలిసి, విపరీతముగా చెలరేగిపోతున్నాయి ( నెగసె వాత్యాళిన్రజశ్చక్రముల్ ) గుండ్రని చేదబావులు గుండ్రంగా సుళ్ళు తిరుగుతూ పైకెగురుతున్న దుమ్మూ ధూళీ కలిసిన సుడిగాలితో పోల్చబడ్డాయి.

యిప్పుడు చవిచూసిన రెండు పద్యాలలో కవనచక్షువులతో వేసవి ఋతువులో ప్రకృతిని పరిశీలించి వర్ణించాడు రాయలు. ఈ క్రింది పద్యంలో తన కవనశక్తితో పౌరాణిక ధార్మిక ఐతిహ్యాలను జోడించి వేసవిప్రకృతిని వర్ణించాడు. భారతీయుల వర్ణనలలో సూర్యునికి ఒక రథం వుంది. దానిని ఎక్కి లోకసంచారం చేస్తుంటాడు సూర్యుడు. ఆరథానికి ఏడు గుర్రాలు. కళ్ళాలు పాములు. రథసారధి అనూరుడు కుంటివాడు(పిచ్చుకుంటు). యింతవరకూ పురాణం సంబంధమైన వివరం. ఇక సహజంగా వేసవిలో వుండే లక్షణం పగటిసమయం ఎక్కువగా వుండడం. పొద్దుసాగి సూర్యుడు పడమటికి తిరిగేసరికి ఉదయంనుండీ వేడెక్కిన భూమి వేడి గాడ్పులను వెలువరించడం

జరుగుతుంది. యిప్పుడు పద్యాన్ని పరిశీలిద్దాం.

**పడమరవెట్ట నయ్యుడుకు బ్రాశన మొల్లక కూటిపేదలై**

**బడలిక నూడు నచ్చిలువ ప్రగ్గములన్ రవియాజ్ఞ మాటికి**

**న్నుడియిడ బిచ్చుగుంటు రథమున్నిలుపం బయనంబు సాగమిన్**

**జడను వహించె నాగ దివసంబులు దీర్ఘములయ్యెనత్తరిన్**

పాములు గాలి తిని బ్రతుకుతాయని కవికల్పన, కవిసమయం. అందుకే పవనాశనము ( పవన+అశనము) అని పాముకు మరొక పేరు. వేడి పడమటి గాలిని తినలేక, కూటికి పేదలై , దస్సిపోయిన సూర్యుని రథానికి వున్న కళ్ళాలు ఐన పాములు వదలిపోయి, వాటిని రథముతో బిగించిన ముడులు వదులై, గుర్రాలు కళ్ళాల బిగింపు లేకపోవడం వలన పరుగెత్తడం ఆపడం, రథాన్ని ఎక్కివున్న సూర్యుడు యిదేమిటి? అని గద్దించి ఆజ్ఞాపించడం, సారథి ఐన అనూరుడు మరలా ఆ పాముకళ్ళాలను బిగించి కట్టడంకోసం రథాన్ని ఆపడం, దీని వలన ప్రయాణం సరిగా కొనసాగక, సూర్యుడు అస్తాద్రికి చేరుకోవడం ఆలస్యం కావడం వల్లనేమో అన్నట్లు పగళ్ళు నిడివిలో బాగా

దీర్ఘములవుతున్నాయి ఆ వేసవిలో. యిదీ రాయల వర్ణనా వైదుష్యం.

**ప్రాతర్వేళల నట్టివెట్ట సొగసై పాటిల్లె గుంభోంభనో**

**ద్భూతాంబుధ్వనివాద్యమై మరుదధః పుంజీభవత్పాటల**

**వ్రాతామ్రేడితసిక్త భూసురభిళా రామాంబుకుల్యాబహు**

**స్రోతస్సంధుల సంధుయంత్రనతిక్రుత్ప్రోద్గీత గేయౌఘముల్**

ప్రాతర్వేళలలో, ఉదయపు వేళలలో, అటువంటి వేసవి కాలముయందు  ఆ నగరం చుట్టూతా ఉన్న ఉద్యాన వనములలో రెండుమూడు వరుసలుగా నేల తడుపబడి వున్నది. పాటలీ కుసుమాలు అంటే కలిగొట్టుపూలు నేల కనిపించకుండా పరుచుకొనివున్నాయి. ఆ ఉద్యానవనములలో ఉన్న అనేకములైన నీటి కాలువలకు, బావులకు ఏతం కట్టి నీటిని తోడుతూ, తోటమాలులు తాము చేసే పనిని ఆనందమయం చేసుకోడం కోసం, శ్రమను మరిచి పోవడం కోసం పాటలు పాడుతూ వున్నారు. వారి గానానికి అద్భుతమైన మద్దెలధ్వని

జోడుకడుతూ బ్రహ్మాండమైన సంగీత కచేరీ జరుగుతున్నది. ఏతాముకు కట్టిన కుండలు నీళ్ళలో మునిగినప్పుడు చేస్తున్న ధ్వని ఆ మద్దెల ధ్వని! (గుంభోంభనోద్భూతాంబుధ్వనివాద్యమై) తోడు ఎలాగూ వేసవి ఉదయకాలాలలో వీచే గాలివేణువు ఉండనే ఉన్నది. ఆ గాలికి రాలిపడిన పూలచేత వర్ణశోభ, ఆ పూల సౌరభము, ఉద్యానవనములలోని ఇతర సుగంధములచేత దివ్యమైన పరిమళము, ఆ ఉద్యానవనములలోని చెట్లకు నీళ్ళు పెట్టడంకోసం ఏతం ఎత్తుతూ తోటమాలులు సాగిస్తున్న గానలహరికి ఆ నీటి కడవలు చేస్తున్న ధ్వని ప్రక్కవాయిద్యంలా తోడై అంతటి తీవ్రమైన వేసవికాలంలోకూడా కన్నులవిందుగా, వీనులవిందుగా వున్నది  ఆ నగరంలోప్రకృతిశోభ!

**గ్రీష్మ ఋతువులోని** ప్రకృతి వర్ణన చేస్తున్నాడు రాయలు. ప్రకృతి అంటే స్త్రీ శక్తియే. గ్రీష్మ ఋతువులో చలివేంద్రాలు వుంటాయి త్రోవలపొడవునా. వేసవి తాపానికి, దాహానికి తాళలేక చలివేంద్రములలోకి వెళ్లి దాహాన్ని తీర్చుకునే బాటసారులు ఉంటారు. రాయల సరస, కవితారస, శృంగార రసకాలం కనుక వారికి మంచినీళ్ళను అందివ్వడానికి స్త్రీలు వుండేవారు. ఆ చలివేంద్రములలోని స్త్రీలను, దాహం తీర్చుకొనడానికి అక్కడికి వెళ్లి మోహదాహంచేత అలమటించే పురుషులను వర్ణించాడు రమణీయమైన సరసమైన పద్యాలలో.

**సుడి నాభి చ్ఛలనన్సరోజములు చక్షు:ప్రక్రియన్నాచు క్రొ**

**మ్ముడి దంభంబున జక్ర ఫేన పటలంబుల్చన్నులున్నవ్వుగా**

**నడరం జేసి నిదాఘభీతి సలిలంబాగామి బీజార్థమై**

**కడవం బెట్టినవారిదేవతలు నా కాంతాళి యొప్పెస్టపన్**

అద్భుతమైన పోలికలు చెప్తున్నాడు ఇక్కడ. చలివేంద్రాలలో నీరు పోసే స్త్రీలు జలదేవతల వలె వున్నారు. జలదేవతలకు నీటికి సంబంధించిన లక్షణాలు వుంటాయి కాబోలు, బహుశా, ఆ లక్షణాలు ఈ స్త్రీల శరీరములలో ఎలా ఒదిగి వున్నాయో చెప్తున్నాడు.
నీటికి వున్న కొన్ని లక్షణాలు ప్రవాహపుసుడులు, కొలనులలోని సరోజములు, నాచు, ఆ నీటితావులను ఆశ్రయించుకుని వుండే చక్రవాకములవంటి పక్షి జాతులు మొదలైనవి, నీటి దేవతలవంటి, జలదేవతలవంటి ఈ స్త్రీలకూ వున్నాయి.

వీరి నాభులు (బొడ్లు) నీటి సుడులుగా(సుడి నాభి చ్ఛలనన్), కన్నులు సరోజములవలె, నాచు వీరి జారి వ్రేలాడుతున్న కొప్పులవలె, వీరి వక్షోజములు చక్రవాక పక్షులవలె, నురుగు వీరి నవ్వులవలె కనిపిస్తున్నాయి. ఇలా ఈ వనితలు గ్రీష్మ ఋతువులో వేడిమికి
నీరంతా ఇంకి పోతే ముందొచ్చే కాలానికి విత్తనాలకోసం నీటిని కడవలలోకి ఎత్తుకుని
వెళ్తున్న జల దేవతల వలెనున్నారు. ఇది దాహానికి నీరు పోసే వారి తీరు. ఇక దాహానికి
నీరంతా ఇంకి పోతే ముందొచ్చే కాలానికి విత్తనాలకోసం నీటిని కడవలలోకి ఎత్తుకుని వెళ్తున్న జల దేవతల వలెనున్నారు. ఇది దాహానికి నీరు పోసే వారి తీరు. ఇక దాహానికి నీటిని స్వీకరించే వారి తీరు క్రింది పద్యాలలో.

**సెగకుల్కి మరుగు జొచ్చిన జహ్నురవిజల**
**సరణి మల్లెలతోడి జడలు మెరయ**
**వాలి చన్ను కొమరు మ్రుచ్చిలిన దిమ్మను తెరం**
**గున ముంచు గరిగకాగుల మునుంగ**
**ధారలోదోచు కన్దలుకులు వాసితో**
**త్పలపత్ర పతన సంభ్రాంతి నొసగ**
**దెలి మోము పస మెచ్చి తలయూచు టెరిగి మా**
**నక నవ్వునేర్పు డెందముల గరప**

**దెరవ లిటు నీరు వోయుపందిరియ చేరి**

**యవల గౌరగాక పిచ్చుగుంటై యనంగు**

**డనుపుగొన జొచ్చె గల్లగుట్టమర వారి**

**కధ్వగులు లాచి యిడువిడియముల పేర**

నీరు పోస్తున్న నీటుగత్తెల కొప్పులలో మల్లెలున్నాయి. ఆ మల్లెలు గంగవలె, ఆ కొప్పులు యమునవలె ఉన్నాయి(జహ్ను రవిజలసరణి), ఈ గంగా యమునలు కూడా గ్రీష్మఋతువు లోని సెగకు అంటే వేడిమికి ఉల్కి అంటే భయపడి మరుగు జొచ్చిన అంటే దాగుకొన్నవాటివలె నున్నాయి. గంగా నది తెల్లనిది, యమునా నది నల్లనిది అని సంప్రదాయం. కనుక తెల్లని మల్లెలగంగ, నల్లని కొప్పుల యమున.

పెద్ద పెద్ద కడవలను వంచి నీరు పోయడానికి వారు ముందుకు వంగుతున్నప్పుడు కడవలవంటి వారి స్తనములు ఆ కడవలలో, కాగులలో మునిగిపోతున్నాయి. తమ 'పెద్దరికాన్ని' ఆ కడవలు లాక్కున్నాయి అని మరలా తమ వైశాల్యాన్ని లాక్కోడానికి ఆ స్తనములు ఆ కడవలలో దూరినట్లు, పోటీ పడుతున్నట్లు కనబడుతున్నాయి. ఆ కడవలకు సువాసనలకోసం కట్టిన కలువ తూడులవలె జలధారలలోనుండి మెరుస్తూ కనిపించీ కనిపించనట్లున్న కన్నులు కనిపిస్తున్నాయి. నీరు తాగేవాళ్లు 'ఇక చాలు' అని తలలూపుతుంటే, నీటిని గురించి గాక తమ సొగసును మెచ్చి తలలూపుతున్నట్లు భావిస్తూ, అలా తాము భావిస్తున్నట్లు భ్రమ కల్పిస్తూ, ఆటగా, వేళాకోళంగా,' ఉచ్చిలిగా' ఆగకుండా, వారు నవ్వుతున్న నవ్వులు, ఆ మల్లెల పువ్వులూ పథికుల మనసులను కరిగిస్తున్నాయి. ఆ బాటసారులు తమ మంచితనంతోనో, ప్రత్యుపకారంకోసమో వీరికి తాంబూలాలు ప్రదానం చేస్తుంటారు.

ఈ శృంగార రస నిలయాలైన సరసపు చలువ నీటి పందిళ్ళ లో దూరిన మన్మధుడు ఆ స్థలాన్ని వదిలిపెట్టి వేరేచోటికి పోలేని కుంటివాడై, తెచ్చిపెట్టుకున్న గాంభీర్యంతో అక్కడే తిష్ఠవేసుకుని కూర్చుంటాడు. బాటసారులు నీరు పోసే స్త్రీలకు ఇస్తున్న తాంబూలాలు వారు మదనునికి చెల్లిస్తున్న మన్మథ సుంకం లాగా వున్నాయి, మన్మధుని కల్ల గాంభీర్యాన్ని డొల్ల జేస్తున్నాయి.

**తొడిబడ నమ్మలక్కలని తూలుచు దీనత దోయి లొగ్గుచున్**

**వడ మరి తేరదేర నల వాక్యములెన్నక మోము గుబ్బలున్**

**గడు కొను  కక్ష దీధితు లెగాదిగ గన్గొను చిట్టకంపు ద్రా**

**గుడు గని సన్నలన్నగిరి కొందరు పాంథు బ్రపాప్రపాలికల్**

తొట్రుపాటుతో, దాహపు వేగిరం చేత ముందు 'అమ్మ' 'అక్క' అని పిలుస్తూ దోసిళ్ళు పట్టి నీరు త్రాగి వడ తీరిన తర్వాత, ఎండ వేడిమి తాలూకు అలసట, తమ దాహము తీరిన తర్వాత ముందు తాము చేసిన సంబోధనలను పాటింపక, నీరు పోస్తున్న స్త్రీల ముఖములను, వక్షోజములను, బాహుమూలములను ఎగాదిగా చూస్తూ నీరు త్రాగుతున్న పథికుల చేష్టలను చూస్తున్న ఆ చలిపందిళ్ళలోని స్త్రీలు ఒకరికొకరు సైగలు చేసుకుంటూ నవ్వుతున్నారు. కాముకుడి నైజాన్ని ఎంత సహజ సుందరంగా చిత్రించాడు రాయలు!

తరువాతి ఈ క్రింది పద్యం ఆంధ్ర సాహిత్యములో వేరెక్కడా కనబడని విచిత్రమైన వర్ణన. రాయలవారి చమత్కారానికి, ప్రకృతి పరిశీలనా శక్తికి, వర్ణనా వైదుష్యమునకు చక్కని ఉదాహరణ.

**ఎసగు కట్టావిక్రియ నావిరెగయ బగటి**
**ఎండయుడుకారకుండు భూమండలమున**
**బొలిచె మాపట బండువెన్నెల చకోర**
**పోత వితతికి జాపట్టు వోసినట్టు**

పగలంతా ఎండకు కాగిన భూగోళం పెనం లాగా వుంది. రాత్రి కాగానే ఉదయించిన చంద్రుని చల్లని వెన్నెల దోశెల పిండిలాగా వుంది. చంద్రుని చల్లని వెన్నెలల కోసం ఎదురుచూసే చకోర పక్షులు తినడం కోసం పోసిన 'చాపట్టు' లాగా, పెద్ద అట్టు లాగా వుంది ఆ వెన్నెల! కాగిన భూమి మీదినుండి రేగుతున్న ఆవిరి బాగా కాగిన పెనం మీద పిండి పోయగానే రేగే ఆవిరి లాగా వుంది. ఆంధ్ర సాహిత్య వీదులవెంట అద్భుతమైన ఫలహారశాలలను తెరిచాడిక్కడ రాయలు. దాదాపూ ఐదువందల సంవత్సరముల క్రితం రచింపబడిన ఆముక్తమాల్యద గ్రంధంలో చాపట్టు అని ప్రయోగించి ఆంధ్రుల పాకశాస్త్ర ప్రావీణ్యాన్ని తెలియజేశాడు. అప్పటికే రకరకాల దోశెల పరిచయం ఉందన్నమాట తెలుగు నాలుకలకు.

అటువంటి గ్రీష్మఋతువులో ఎక్కడినుండో యాత్రలకు బయలుదేరాడు పరదేశి విప్రుడు ఒకడు. దేశాటనం చేస్తూ, పుణ్య క్షేత్రాలను దర్శిస్తూ పాండ్య దేశం వచ్చాడు, ఆ దేశపు రాజుగారి పుణ్యం పండే సందేశం తెచ్చాడు, ఆ శ్రీహరి పనుపున వచ్చిన దూతలా అద్భుతమైన ఆదేశం యిచ్చాడు!

**అప్పెను వేసవి విభవము**
**విప్పుగ దన్నగరనికట వృషగిరి హరికిం**
**దెప్పతిరునాళ్ళ రా ముద**
**మొప్ప న్బరదేశివిప్రు డొక్కడు భక్తిన్**

**సేవించి పోవుతరి మధు**
**రా విభవము జూడవచ్చి  శ్రాంతి మెయి న్మా**
**పా వైఘనీట గ్రుతసం**
**ధ్యావిధి యై నృపపురోహితా వాసమునన్**

ఆ మధురా నగరానికి సమీపములో వున్నవున్న వృషగిరిని దర్శించుకుని, అక్కడి 'సుందరబాహుస్వామి' అనే పేరున్న విష్ణుమూర్తిని సేవించుకుని వచ్చిన ఆ బ్రాహ్మణుడు, మధురా నగరము యొక్క వైభవాన్ని చూడడం కొరకు నగరానికి వచ్చాడు. వై ఫై నదిలో ఆ మునిమాపు వేళలో అంటే సాయం సంధ్య వేళలో, స్నానం చేసి, సాయం సంధ్యావందన 'విధులు' నిర్వర్తించుకుని ఆ నగరములో వున్న రాజపురోహితుని ఇంటికి బసకోసం చేరుకున్నాడు.

చిన్ని చిన్ని పద్యాలే కానీ, ఆ నాటి జనజీవన చిత్రీకరణ వున్నది వీటిలో. బ్రాహ్మణునకు సంధ్యావందనము 'విధి', అంటే తప్పించుకునే అవకాశము, తప్పించుకోవాలి అనే ఆశ ఉండకూడని ఒక పవిత్రమైన బాధ్యత, ఒక సామాజిక బాధ్యత, ఎందుకంటే, సాయం సంధ్యా వందనం అనేది సమాజం ప్రశాంతంగా, శాంతియుతంగా వుండడం కోసం, ప్రజలందరూ సద్భావనతో, సద్వర్తనతో, సుఖంగా వుండడంకొరకు చేసే ప్రార్థన. ఆధ్యాత్మిక జీవనం బ్రాహ్మణుడి హక్కు కాదు,  సహజమైన జీవన ప్రక్రియగా కొనసాగవలసిన

పవిత్రమైన బాధ్యత, విధి, కనుక అది నిర్వర్తించుకున్నాడు ఆ పరదేశి విప్రుడు. అనవసరమైన లంపటాలు తగిలించుకోకుండా తమ విధులు తాము నిర్వర్తించే నిరంతర సత్యాన్వేషులు, జ్ఞానార్జనాపరులు, జ్ఞాన ధన సముపార్జన చేసి, ఫలితాన్ని కోరుకోకుండా వితరణ జేసే విప్రులు, పురోహితులు వున్న సమాజం అది!

అమ్మానాన్నలు, అన్నదమ్ములు వచ్చినా 'అయ్యో' అనుకునే రోజులు కావు అవి. ముక్కూ మొహం తెలియని పరదేశి యాత్రికులు కూడా స్వేచ్ఛగా వచ్చి ఆకలిబాధను తీర్చుకుని, విశ్రాంతి తీసుకోవడం కొరకు స్వాగతం చెప్పే యిళ్ళు ఉండేవి. అందునా 'పురోహితుడు' అంటే పురమునకు హితాన్ని కోరుకునేవాడు, అలా కోరుకునేవాళ్ళను ఆదరించాల్సిన బాధ్యత వున్నవాడు కనుక, ఆ రాజ పురోహితుడు ఇలా ఎక్కడెక్కడినుండో వచ్చే యాత్రీకులకు ఉచిత భోజన వసతి సదుపాయాలూ సమకూర్చేవాడు. కనుక, ఈ పరదేశి విప్రుడు ఆ రాజపురోహితుని ఇంటికి చేరుకొని...

**పరిపక్వ సురభి రంభా ఫలంబులతోడ**
**దలమెక్కు పనస పెందొలలతోడ**
**ఘృతపిండనిభ కర్కరీఖండములతోడ**
**బలుదెరంగుల మావి పండ్లతోడ**
**గోస్తనీ మృదు గుళుచ్ఛ స్తోమములతోడ**
**గప్పులేరిన వడప్రప్పుతోడ**
**సుమధుర స్థూల దాడిమ బీజములతోడ**
**దనుపారు రసాదాడి గనెలతోడ**

**బానకం బతిథుల కిడ్డ తాను గ్రోలి**
**యర్చనాదత్త చందన చర్చ దేలి**
**విరులు సిగ దాల్చి కర్పూర వీటి జౌరు**
**గొట్టుచు ద్విజుండు వెన్నెల బిట్టు గాయ**

పూర్తిగా పండి, ఘ్రుగ్గిన వాసన వస్తున్న అరటిపండ్లతో (పరిపక్వ సురభి రంభా ఫలంబులతోడ ), పెద్ద పెద్ద పనస తొనలతో, పేరిన నేతిముద్దలవంటి తెల్లని చెరకుముక్కలతో, (ఘ్రుతపిండనిభ కర్కరీఖండములతోడ), రకరకాల మామిడి పండ్లతో, మృదువైన ద్రాక్ష పండ్లతో(గోస్తనీ మృదు గుళుచ్చ స్తోమములతోడ) పొట్టుదీసిన వడపప్పుతో, పెద్ద పెద్ద తీయని దానిమ్మ గింజలతో, తృప్తికరమైన రసవంతములైన 'రసదాడి' చెరుకు గడలతోనూ (సుమధుర స్థూల దాడిమ బీజములతోడ,దనుపారు రసాదాడి గనెలతోడ)..ఇన్నింటితో తయారుజేసిన పానకాన్ని అతిథులకు ఇస్తుంటే తానుకూడా తీసుకుని త్రాగి, ఆతర్వాత ఇచ్చిన 'చందనము'ను తీసుకుని, హాయిగా పూసుకుని, విరులతో 'శిఖ' ముడివేసుకుని, కర్పూరం వేసిన తాంబూలం వేసుకుని నములుతూ ( కర్పూరవీటి చౌరు గొట్టుచు) దేదీప్యమానమైన వెన్నెల కాస్తుండగా..

**మాత్ర సంచి తలాడగా మార్గవేది**
**నొక్క డార్యలు గీత లొండొకడు తాసు**
**భాషితంబులుగా దోడి బ్రాహ్మనౌఘు**
**ముబుసుపోకకు జదువ బరున్న వేళ**

చేతి సంచీని తలగడగా పెట్టుకుని, 'మార్గవేది' అంటే మార్గంలో వున్నా వేదిక మీద, అరుగుమీద కూర్చుని, తనలాగే అతిథులుగా వచ్చిన వారిలో ఒకాయన 'ఆర్యలు' చదువుతుంటే, ఒకాయన 'గీత'లు గానం చేస్తుంటే, తాను సుభాషితాలు పఠిస్తూ కూర్చుని ఉన్న సమయంలో ఈ కావ్యంలోని అత్యద్భుత ఘట్టాలలో ఒకదానికి అంకురార్పణ జరిగింది! ఎప్పటిలాగానే ఆ చల్లని సాయం వేళలో ...

**పన్నీటితో గదంబము సేసి పూసిన**
**మృగనాభి పస రాచ నగరు దెలుప**
**బాటలానిలములార్పగ దపారపుజుంగు**
**లలరుదావికి మూగు నళుల జోప**
**గర్ణడోలా మౌక్తిక చ్ఛాయ లెగబ్రాకు**
**నురుహార రుచుల ద్రస్తరికి దన్న**
**శశికాంతి చెంగావి దసిలి మించినకేల**

**స్వర్ణస్తరువు వాడి వాలు మెరయ**

**మెలత యడపము దే జరన్మేరువనగ**

**దలవరులు కొందరొలసి ముందర జనంగ**

**నర్థి రథ్యాంతరాంతః పురాంతరమున**

**భోగినీ సంగతికి రాజు పోవుచుండి**

పన్నీటితో కలిపి పూసుకున్న కస్తూరీ పరిమళము రాచనగరికి తెలియవస్తుండగా, కస్తూరీమృగం నుండి తీసిన ఖరీదైన పరిమళము ఇది రాచ నగరు, ఈ వచ్చేది మహారాజు అని తెలియజేస్తుండగా, తను ధరించిన కలిగొట్టుపూలు వెదజల్లుతున్న పరిమళములకు మూగుతున్న తుమ్మెదలను తన తలపాగాకు వున్న కుచ్చులు తను తల పంకిస్తున్నప్పుడు ఊగుతూ పారద్రోలుతుండగా, చెవులకు ధరించిన ముత్యాల కాంతులు క్రిందికి జారుతూ, తను ధరించిన రత్నహారములనుండి పైకి ఎగసి వస్తున్న కాంతులను ధిక్కరించి క్రిందికి తోసివేస్తుండగా, చేతిలోనున్న చెంగావి రుమాలు చంద్రకాంతులను వెలయిస్తూ, చేత ఇముడ్చుకున్న బంగారు పిడివున్న వాడి ఖడ్గము మెరుస్తుండగా, ఒక స్త్రీ తాంబూలపు సంచిని తీసుకొస్తూ వుండగా, తలారులు కొందరు రక్షగా ముందు నడుస్తుండగా, ఆసక్తితో, ఆ మార్గంలో రాజుగారి రెండవ అంతఃపురము అన్నట్లుగా వెలుగొందే వైభవోపేతమైన విలాసగృహములో వుండే భోగపుగత్తెను అంటే వేశ్యను కలవడానికి వెళుతున్న రాజు, కదలి వెళుతున్న ఒక మహా పర్వతములాగా వున్న మదురానగర మహారాజు, పాండ్య చక్రవర్తి మత్స్యధ్వజుడు, ఈ పరదేశి విపుడు పఠిస్తున్న సుభాషితమునొకదానిని, ఆత్మలో నాటుకునేట్లు అన్నదానిని, నిద్రాణమైన బుద్ధి మేలుకునేట్లు అన్నదానిని విన్నాడు.

**వినియె నెలల్చతుర్ద్వయిని వృష్టి దినాళికి, రాత్రికై దివం**

**బున, జరకై వయస్సునను బూని, పరంబున కిప్పుడుద్యమం**

**బనువుగ జేయగా వలయునంచు బురోహితధర్మ మాత్మ గీ**

**ల్కొన నల విప్రుడా ద్విజులలోన సుభాషితముల్పలింపగన్**

చతుర్ద్వయి అంటే నాలుగులు రెండు, అంటే ఎనిమిది. నెలలు చతుర్ద్వయిని అంటే ఎనిమిది నెలలలో వృష్టి దినాళికి, అంటే వర్షపు రోజులకు, అంటే, సంవత్సరంలో ఎనిమిది నెలలు పోగా మిగిలిన నాలుగు నెలలు వర్షాకాలపు రోజులు. జ్యేష్ఠ మాసము,

ఆషాడమాసము కూడా శ్రావణ భాద్రపద మాసాలకు తోడుగా వర్షాకాలపు మాసాలే. తీవ్రమైన వానలు గాకున్నా గాలి దుమారాలతో కూడిన జల్లులు, ముసుర్లు పట్టే కాలం. ఈ నాలుగు నెలల కోసము మిగిలిన ఎనిమిది నెలల్లో శ్రమించాలి, ధాన్యం పోగు జేసుకోవాలి. రాత్రికోసం పగటిపూటే కష్టపడి తిండి గింజలు సంపాదించుకోవాలి. జర అంటే వృద్ధాప్యము. వృద్ధాప్యము కోసము వయస్సులోనే శ్రమించాలి, ముసలితనంలో ఉన్నంతలో సుఖంగా ఉండడానికి, అని పురోహిత ధర్మమును అనుసరించి బోధ చేసిన ఆ పరదేశి బ్రాహ్మణుడు పఠించిన సుభాషితములు ఆత్మలో నాటుకొనగా విన్నాడు మత్స్య ధ్వజుడు.

వయసున సంపాదించిన ధనము అయినా ఉండాలి, వయసున పుట్టిన సంతానము అయినా ఉండాలి, ముసలితనములో ఆదుకోడానికి. రాత్రిపూట చీకటిలో ఇబ్బందిపడి తిండికి ఏర్పాటు చేసుకొనడం కన్న పగటిపూటే రాత్రికి కూడా కావలసిన సంబారాలు సమకూర్చుకోవాలి. వర్షాకాలపు నాలుగు నెలలకోసము మిగిలిన ఎనిమిది నెలలూ కష్టపడాలి. ఇంతవరకూ మహారాజుకు సంబంధించిన వివరాలు కావు.
వర్షాకాలంలోనైనా, రాత్రి పూట అయినా, వృద్ధాప్యములో అయినా మహా చక్రవర్తికి కష్టపడాల్సిన అవసరం ఎందుకుంటుంది గనుక?

'పూని పరంబునకిప్పుడు ఉద్యమంబు అనువుగ జేయగా వలయును' అనే మాట దారుల వెంట కనిపించిన వాటికై మోరలెత్తి ఆశపడుతున్న గుర్రాన్ని కొరడాతో అదలించినట్లు, చెళ్ళున చెంపమీద చరచినట్లు, అంధకారాన్ని అంతం జేస్తూ భళ్ళున తెల్లవారినట్లు అడ్డదారులవెంట వెళుతున్న రాజుకు, అంతవరకూ అప్పుడప్పుడు తన అంతరాత్మ చేస్తున్న బోధనలను పెడచెంపన పెడుతున్న రాజుకు, కామంతో కండ్లు మూసుకుపోయిన రాజుకు తగిలింది.

**విని తద్గ్రంథార్థము నె**
**మ్మనమున నూహించి తెలిసి మ్రాన్పడి కడకుం**
**దనమోసమునకు భయపడి**
**జనపతి యటు చనక నిలిచి సంతాపమునన్**

ఆ మంచి మాటను, సుభాషితాన్ని విని, దాని అంతరార్థమును మనసులో ఊహించి, తెలిసికొని, మ్రాన్పడి పోయాడు మహారాజు. తన మోసానికి అంటే తను ఇంతకాలము కామభోగాలు, యవ్వనము, ఐశ్వర్యము శాశ్వతములన్నట్టు నమ్మి మోసపోయిన విధానానికి,

మోసము అంటే ప్రమాదము అని రూఢి అర్థము. తను ఎంత ప్రమాదపు మార్గంలో పయనిస్తున్నాడో తెలిసికొని, భయపడి, తను అంతవరకూ వెళుతున్న తన ఉంపుడుగత్తె నివాసభవనమువైపు వెళ్ళకుండా, నిశ్చేష్టుడై నిలిచి, సంతాపముతో-

**ఎక్కడి రాజ్యవైభవము లెక్కడిభోగము లేటిసంభ్రమం**
**బక్కట బుద్బుద ప్రతిమమైన శరీరమునమ్మి మోక్షపుం**
**జక్కి గణింపకుంటి యుగసంధుల నిల్చియు గాలుచేతిబల్**
**త్రొక్కుల నమ్మనుప్రభ్రుతులున్ దుద రూపరకుండ నేర్చిరే**

ఇవెక్కడి రాజ్య వైభవములు? ఎక్కడి భోగములు? ఏమిటీ వెర్రి? అయ్యో, నీటి బుడగవంటి శరీరమును శాశ్వతము అనుకున్నాను! మోక్షమార్గమును గురించి ఆలోచనే చెయ్యలేదు. యుగాల పర్యంతము దీర్ఘ ఆయుర్దాయమును అనుభవించిన మనువులు కూడా దీర్ఘ ఆయువును మాత్రమే పొందారుగానీ, శాశ్వతమైన ఆయుర్దాయమును కాదుగదా, వారే చిరంజీవులు కారే, మనమనగా ఎంత? నేనెంత? నా రాజ్యము, భోగములు ఎంత?

**సగరు నలుం బురూరవుఁ ద్రిశంకు సుతున్బురుకుత్సుఁ గార్తవీ**
**ర్యు గయుఁ బృథుం భగీరథుం సుహోత్రు శిబిం భరతుం దిలీపునిన్**
**భ్రుగుకులు యౌవనాశ్వు శశిబిందు ననంగుని నంబరీషు బూ**
**రుగురుని రంతి రాఘువు మరుత్తుని గాలము కోలుపుచ్చదే**

సగరుడు, నలుడు, పురూరవుడు, హరిశ్చంద్రుడు, పురుకుత్సుడు, కార్తవీర్యుడు అనబడే (ఆరుగురు) షట్చక్రవర్తులను, గయుడు, పృథుడు, భగీరథుడు, సుహోత్రుడు, శిబి, భరతుడు, దిలీపుడు, భ్రుగువంశము వాడైన పరశురాముడు, యౌవనాశ్వుడు, శశిబిందుడు, అనంగుడు, అంబరీషుడు, యయాతిని, రంతిని, చివరికి రఘురాముడిని, మరుత్తును, ఈ షోడశ మహారాజులను కూడా కాలము కబళించలేదా? నేనెంత? వీరందరికీ తప్పని మృత్యువును నేను తప్పించుకొనగలనా?

**" సర్వే క్షయాన్తా నిచయాః పతనాంతాః సముచ్ఛ్రయాః**
**సంయోగా విప్రయోగాన్తాః మరణాంతం హి జీవితం "**

కూడబెట్టినవన్నీ కరిగిపోయేవే, పైపైకి ఎగిసినవన్నీ పడిపోయేవే, కలయికలన్నీ ఎడబాటులకే, జీవితానికి మరణము అనే ముగింపు తప్పదు అనలేదూ వాల్మీకి!

**" యథా ఫలానాం పక్వానాం నాన్యత్ర పతనాద్భయం**

**ఏవం నరస్య జాతస్య నాన్యత్ర మరణాద్భయం "**

ముగ్గిపోయిన పండుకు రాలిపడడం అనే భయములాగా, జన్మించినవాడికి మరణం అనే భయం తప్పదు అనలేదూ? అదిసరే, మరణం తప్పదు, మరణం అంటే ఇహలోకములో లేకుండా పోవడమే కదా! ఇహలోకము అంటే పరలోకము ఒకటి ఉండాలిగదా! బతుకంటేనే ఈ లోకమునుండి ఆలోకమునకు పయనము కదా. ఈలోకములో జీవితము కొరకు ఎన్నో ఏర్పాట్లు, జాగ్రత్తలు తీసుకున్నట్లు, ఆ లోకములో జీవితము కొరకు కూడా తీసుకోవాలికదా.

ఆ పరలోకభయము నుండి అభయమునివ్వగలిగింది, అక్కడికోసం చేసుకొనవలసిన ఏర్పాటు మోక్ష చింతనయే కదా, అయ్యో, ఇంతదాకా ఎంత వ్యర్ధము ఐపోయింది జీవితము! ఇంతవరకూ ఏ ఏర్పాటూ చేసుకోలేదే ఆ లోకపు జీవితము కోసము! అని ఇంతా తన మనసులో అనుకున్నాడు రాజు, కనుకనే స్థిర సంకల్పం తీసుకున్నాడు. ఇంతా తెలిసిన వాడే అని ఆ రాజును పరిచయము చేసినప్పుడే చెప్పాడు కవిరాజు, రాయలు, ' ద్విద్వయోపాయ ధీ విద్వద్వతంసంబు, షాడ్గుణ్యా చాతురీ చక్రవర్తి..' అని. అంటే అన్నీ తెలిసినవాడే, కానీ ఆచరించనివాడు. విజ్ఞాని కానీ, జ్ఞాని కాదు ఇంతవరకూ. తెలిసినవాడు కనుకనే మంచి మనిషికి ఒక్క దెబ్బ చాలు గనుకనే ఆ క్షణము లోనే శాశ్వత పరివర్తన కలిగింది ఆయనలో.

ఇదేమీ నాటకీయత కాదు. తులసీదాసుకు యిలాగే జ్ఞానోదయము అయ్యింది. మహానుభావుడు నారాయణతీర్థులుకూడా తులసీదాసువలెనే, భార్యాలోలుడై, భార్యతో కామభోగాలలో మునిగి తేలుతూ, భార్య పుట్టింటికి వెళ్ళిన రాత్రే, ఆవిడపొందుకోసం, నిండు వర్షాకాలంలో, ఉప్పొంగి ప్రవహిస్తున్న నదిని పొట్టకు కుండ కట్టుకుని ఈది దాటి, అత్తవారింటి తలుపు తడితే, ఆయన భార్య చీవాట్లు పెట్టింది, తనపట్ల మొగుడి వ్యసనపరతను తన సోదరులు వదినలు హేళన చేస్తారేమో, నవ్విపోతారేమో అనే భయముతో. ఈ మమకారము భగవంతుడిమీదకు మరలిస్తే మీరు తరిస్తారు అని చీవాట్లు పెట్టింది. ఆ క్షణము లోనే సిగ్గుపడి, పరివర్తన కలిగి, ఆ తరువాత తను తరించడమే కాక లోకులను తరింపజేయగలిగిన మహానుభావుడు అయినాడు. ఆయన తన శ్రీకృష్ణ లీలా తరంగిణి

గానము చేస్తుంటే శ్రీ కృష్ణుడు బాలుని రూపములో ఆయన బొజ్జమీద ఆడుకుంటూ ఆలకించేవాడుట, నమ్మగలిగినవాళ్ళ అదృష్టము! సంగీతము, సాహిత్యము, నాట్యము అనే త్రివేణీ సంగమము ఆయన బోధనల సారాంశము. సిద్దేంద్ర యోగికి నృత్య శాస్త్రములో గురువు, త్యాగరాజస్వామికి ఆధ్యాత్మిక సాహిత్యములో, గాన కళలో ఆదర్శము నారాయణ తీర్థులు! లీలాశుకుడూ అంతే. వేమన కూడా ఒక క్షణకాల అనుభవముతోనే వేదాంతి అయినాడు. కనుక ఇది రాయల విపరీత కల్పనా కాదు, అసహజమూ కాదు, కాకుంటే సామాన్యుల విషయములో సహజముగా జరిగేది కాదు. అసామాన్యుడు ఐన మహాచక్రవర్తి మత్స్యధ్వజుడు మాన్యుడు కావడానికి కావలసిన స్థిర సంకల్పముతో ఒక సుస్థిరమైన నిర్ణయము తీసుకున్నాడు.

**ఉన్నట్ల యుండ నద్దరి**
**కి న్నరులను నావ చేర్చు క్రియ వెసఁ దాఁ బో**
**కున్నట్ల యుండి కాలం**
**బు న్నరులకు వయసుఁ బుచ్చి మోసముఁ దెచ్చున్**

శ్రీకృష్ణ దేవరాయలు మాత్రమే చేసిన వర్ణనలు, ఊహలు ఇవి. నావలో ( ఆమాటకొస్తే ఈనాడు మనం విమానాలలో, రైళ్ళలో, బస్సుల్లో, కార్లలో ప్రయాణము చేస్తున్నప్పుడు కూడా) ప్రయాణము చేసేవారికి ఆ నావ ప్రయాణం చేస్తున్నట్లు కనిపించదు. చుట్టుప్రక్కలకు పరికించి చూస్తేనో, నావ ప్రయాణములో కుదుపులకు గురి అయితేనో తప్ప. నావ మాత్రము మౌనముగా తన ప్రయాణము తాను చేస్తూనే ఉంటుంది. తీరా దిగాల్సిన రేవు వచ్చేదాకా తెలియనే తెలియదు ప్రయాణం ఎలా జరుగుతున్నదో. ఉన్నచోటే ఉన్నట్టు వుండి, కదులుతున్నట్టు కనిపించకుండానే ప్రయాణము పూర్తిజేసి, ప్రయాణీకుడిని తీరానికి చేర్చే నావవంటిది కాలము. జీవనము ఒక ప్రయాణము, ఆయువు ఒక ప్రవాహము, జీవుడు ఒక ప్రయాణికుడు. మరణము తీరము. కాలప్రవాహము వెనక్కు జారుతూనే ఉంటుంది, ఆయువు దిగజారుతూనే ఉంటుంది, ఆయువు అనే ప్రవాహాన్ని తెలియకుండా దాటించి, ఆయువును పోగొట్టి (వయసుఁ బుచ్చి) మోసము చేస్తుంది కాలము అనే నావ!

అన్ని కాలాలలో, అన్ని ప్రదేశాలలో, అందరికీ అన్వయించుకోగలిగిన భావనలు కేవలం కల్పనలు కావు, నిత్య, శాశ్వత సత్యాలు. ఈ పద్యం అటువంటిది. దీని తాత్పర్యము, దీని సంబంధము సమస్త మానవాళికీ ఒకే రకమైన, నిజమైన, మధురమైన సందేశాన్ని ఇస్తుంది. కనుకనే రాయలు మహాకవి, కాదు, మహర్షి. ఎందుకంటే వాక్యం రసాత్మకం కావ్యం

కదా, రసాత్మకమైన ఒకే ఒక్క వాక్యము కూడా కావ్యమే అని. అటువంటి కావ్యాన్ని ఋషి లేదా ఋషికల్పుడు మాత్రమే సృష్టించ గలుగుతాడు అని కదా 'నానృషిః కురుతే కావ్యం' అన్నది. అంతే కాదు,

'' లౌకికానాం హి సాధూనాం అర్ధం వాగనువర్తతి, ఋషీనాం పునరాద్యానాం వాచమర్థోనుధావతి '' అన్నారు కదా, అంటే లౌకికులయిన సాధువుల పలుకులకు తగిన అర్ధం ఉంటుంది, కానీ మహర్షుల మనసులోని అంతరార్ధానికి అనుగుణముగా పలుకులు అనుసరించి వస్తాయి. కనుక రాయలు మహర్షి తుల్యుడు సాహిత్య యజ్ఞములో!

ప్రశాంతముగా జీవన పయనము సాగిపోతుంటే చివరి గడియలు అకస్మాత్తుగా వచ్చిపడి, మృత్యువు కళ్ళలో కళ్ళు పెట్టి నిలదీసి చూసినప్పుడు ఉలికిపడి తన ప్రయాణము ఇంత స్వల్పమా, తన శక్తి ఇంత అల్పమా అపుడే దిగిపోవాలా అనుకుంటాడు జీవన పయనము ముగిసిన ప్రయాణికుడు, తనను తాను మరిచిపోవడం వలన. యిది కేవలము ప్రయాణమేనని, నావనెక్కినప్పుడే నావ దిగడం ఖాయమన్న సంగతి తెలుసుకుని ఎప్పుడంటే అప్పుడు ప్రశాంతముగా ఏ తొట్రుపాటూ లేకుండా దిగడానికి సంసిద్ధుడై ఉండేవాడు తెలివైన ప్రయాణికుడు, ముందుజాగ్రత్త ఉన్న ప్రయాణికుడు.

జీవనపయనములో ప్రయాణీకుడు తీసుకొనవలసిన ముందు జాగ్రత్తలు దైవచింతన, సత్ప్రవర్తన, సాధు జీవనం, తోటి ప్రయాణీకులతో స్నేహము, ప్రేమ మొదలైనవి. ఈ జీవితము కేవలము ఒక ప్రయాణము, గమ్యము కాదు అనే సంగతి మరచిపోయానే, తీరానికి చేరుకునే సమయానికి సిద్ధము కావడం జరగలేదే ఇంతవరకూ, దిగిపోక తప్పదు కదా, ఇకనైనా నా పరలోకపు తీరాలకు సర్వ సన్నద్ధుడనై ఉండాలి అని సంకల్పించుకున్నాడు మత్స్యధ్వజుడు.

**కానఁ దటిచ్చల మగు రా**
**జ్యానందము మరగి యింద్రియారాముడ నై**
**పో నింతనుండి పరలో**
**కానందంబునకె యత్నమాపాదింతున్**

రాజ్యములూ రాజులూ శాశ్వతులు కారు, మహామహులు కారణజన్ములు ఎందరో కాలగర్భములో కలిసిపోయారు, నేనెంత? కనుక మెరుపువలె క్షణికమైన (తటిచ్చల మగు) రాజ్యభోగాలను మరిగి ఇంద్రియసుఖములలో పరవశుడను అయిపోను, ఇకనుండి పరలోక ఆనందముకొరకే ప్రయత్నము చేస్తాను అని స్థిరమైన నిశ్చయము చేసుకున్నాడు

మత్స్యధ్వజుడు.

**వర్గత్రయ పరత ముహు**

**స్స్వర్గ క్ష్మామధ్యమాధ్వ జఙ్ఘాలకతా**

**దుర్గతియునొల్ల మఱి యప**

**వర్గదుడే వే ల్పెఱింగి వాని భజింతున్**

అని నిశ్చయించుకున్నాడు. వర్గత్రయము మీది ఆసక్తితో అంటే ధర్మము, అర్ధము, కామము అనే మూడు పురుషార్ధాల మీది ప్రేమతో నాలుగవ పురుషార్ధము ఐన మోక్షమును నిర్లక్ష్యము చేసి మాటిమాటికీ స్వర్గానికీ, భూమికీ మధ్య పరుగులు పెట్టే దుర్గతిని పొందను. ( స్స్వర్గ - క్ష్మా - మధ్యమ - అధ్వ - జఙ్ఘాలకతా - దుర్గతియునొల్ల) మోక్షము అంటే ముక్తి. అంటే జనన మరణ చక్ర బంధమునుండి విముక్తి. అది కావాలిగానీ, ధర్మమూ, అర్ధము, కామము అనే వాటిని అనుసరించి అంటే ధర్మమార్గము, ధర్మార్ధము, ధర్మ కామము అనే మూడూ మంచివే ఐనప్పటికీ, వీటి ఫలితముగా ఆ పుణ్యఫలము అనుభవించేదాకా ఉత్తమ లోక గతులను పొందినా ఆ పుణ్యరాశి క్షయము ఐన తర్వాత మరలా జన్మను పొందవలసినదే, ఎందుకు మరల మరలా ఈ లంపటం? మోక్ష పథ గామిని అయితే ఇక పునరావృత్తి రహితమైన పరమపదమే కనుక నాకు మోక్షమే కావాలి. అంటే ఎంత లోతైన వివేచనా శక్తి గలవాడో మత్స్యధ్వజుడు అనే విషయాన్ని చెప్తున్నాడు రాయలు ఇక్కడ.

స్వర్గ సౌఖ్యము అంటే ఇహ లోకపు సౌఖ్యము కంటే ఉన్నతమైన సౌఖ్యమే, ఆ తర్వాత మరలా మానవ జన్మ తప్పదు. కనుక తాత్కాలికమైన స్వర్గ సౌఖ్యము నాకు వద్దు, మోక్షము కావాలి, ఆ మోక్ష పదవి, ఆ అపవర్గ పదవిని ఇవ్వగలిగిన వేల్పు ఎవరో తెలుసుకుని ఆ వేల్పును భజించెదనుగాక అని నిశ్చయము చేసుకున్నాడు. చతుర్విధపురుషార్ధాలు, స్వర్గాపవర్గ తారతమ్యము, మోక్ష పథ ఔన్నత్యము ఇంత లోతైన ఆధ్యాత్మిక పరిజ్ఞానము ఉన్నవాడే కానీ ఇంతవరకూ తనకు తెలిసిన దానిని ఆచరణలో పెట్టలేకపోయినవాడు తాత్కాలికమైన భోగలాలసలో పడిన కారణంగా.

పాత్రలను పరిచయం చేయడం, ఆ పాత్రలను ఉన్నతమైన తీరులో పోషించడం అంటే ఇదే కవి పరముగా. నాటకమైనా, కావ్యమైనా, ప్రబంధమైనా నవల అయినా, సాహిత్య ప్రక్రియ ఏదైనా అందులోని పాత్రలు క్రమ పరిణామము చెందాలి,

చెందినట్టు సహజముగా చూపించగలగాలి, అది ఉత్తమ సాహిత్య కారుడి ప్రతిభ. కనుక మత్స్యధ్వజుడిని పరిచయము చేసిన దగ్గరినుండీ చివరివరకూ అతని వ్యక్తిత్వములోని సహజ పరిణామ దశలను, వ్యక్తిత్వ వికాసమును అతి సహజముగా అతి తక్కువ మాటలలో చూపించాడు రాయలు. అందుకే అయన మహా కవి అయినాడు, ఆముక్తమాల్యద ఐదు మహా కావ్యాలలో ఒకటి అయ్యింది తెలుగు భాషలో!

**అని తలఁచి మెచ్చి యవ్వి**
**ప్రునకు నీవ్వటి కరండమున ముద్రితమై**
**యునిచిన యొక ముడు పార**
**క్షునిచే నిప్పించి నగరు సొచ్చి నిశి చనన్**

ఈ విధముగా తనలో తాను తర్కించుకుని, ఒక నిశ్చయానికి వచ్చి, ఆ బ్రాహ్మణుడి బోధకు మెచ్చి, కృతజ్ఞతా పూర్వకముగా, దక్షిణగా ( తనకు జ్ఞాన బోధ చేసినందుకు గురుదక్షిణగా) తన తాంబూలపు బరిణలో ఒక ముడుపు, అంటే, ఎంతో కొంత విలువైన ధనమో, రత్నమో ఉంచి, తన రక్షకులలో ఒక తలారిచేత ఆ పరదేశి బ్రాహ్మణునకు ఇప్పించి, తన నగరు చేరి, నగరు అంటే తన రాజప్రసాదము, అంతఃపురము మొదలైనవి ఉన్న నగరు అని, ఆ రాత్రి గడచిపోయిన తర్వాత, మరునాడు ఉదయముననే తను నిర్దేశించుకున్న మార్గములో పయనము కావడానికి ఏర్పాట్లు చేసుకున్నాడు మత్స్యధ్వజుడు.

**కొలువై బహుసమయంబుల**
**మెలగెడు కోవిదులజూచి మీమీశాస్త్రం**
**బులలో నెవ్వడు మోక్షం**
**బెలయించునొ చూచి నిశ్చయింపు డటంచున్**

తన కొలువు దీర్చి, బహుసిద్ధాంత మార్గాలలో మెలిగే వారిని( సమయము అంటే వేదాంత, మత సంబంధమైన సిద్ధాంతము అని ఒక అర్థము) పిలిపించి, మీమీ శాస్త్రముల ప్రకారము ఏ దైవము ముక్తిని ప్రసాదించునో పరిశీలించి చెప్పండి అని తన కోరికను తెలియజేశాడు.

**వాదమొనరించి గెలిచి తత్త్వంబు దెలుపు**

**వానికని బీఱపువ్వులబోని టంక**

**సాలవాటులు నించి యాస్థానిఁ గట్టఁ**

**గాలసర్పము గతి వ్రేలు జాలెఁ జూచి**

మీ మీ సిద్ధాంతములను ప్రతిపాదించి వాదించి గెలిచినవారికి ఇవిగో, ఈ బీరపువ్వులవంటి తళతళ లాడే క్రొత్త బంగారు నాణెములు కానుక, అని బంగారు నాణెములు నిండిన సంచిని వ్రేలాడదీశాడు తన ఆస్థానములో, తన సభలో. ఇంతవరకూ మామూలు పద్యమే. విశేషము ఏమీ లేదు. ఇక్కడ ఉత్తమమైన విశేషణం పోదిగాడు రాయలు. ఆ జాలె కాలసర్పములాగా వ్రేలాడుతున్నది. ఆ జాలె విషనాగువంటిది, క్షణికమైన సంపదతో నిండిఉన్నది కనుక అని, ఆ ధనమును ఆశించని మహానుభావుడు ఎవరో ధనార్జన చేయడంకొరకు గాక జ్ఞానధన వితరణచేయడంకొరకు రాబోతున్నాడనీ, నల్లనివాడు, మహా సర్పముపైన శయనించిన మహావిష్ణువు యొక్క మహిమను సూచించడానికీ ఈ విశేషణము వాడాడు విశిష్ట భావికథా సూచనగా!

**హరు నొకఁ డన నుమ నొకఁ డన**

**హరి నొకఁ డన శిఖి నొకఁ డన నర్కు నొకఁ డనన్**

**గరిముఖునొకఁ డన రజనీ**

**శ్వరు నొకఁ డన నజు నొకఁ డన వా దైనతరిన్**

శివుడిని ఒకరు, పార్వతిని ఒకరు, శ్రీహరిని ఒకరు, అగ్నిదేవుడిని ఒకరు, సూర్యుడిని ఒకరు, గణపతిని ఒకరు, చంద్రుడిని ఒకరు ప్రతిపాదించగా పండిత వాదము జరిగిన ఆ సమయములో, అని వెంటనే సన్నివేశాన్ని విల్లిపుత్తూరుకు తీసుకుపోయాడు రాయలు.

**విల్లిపుత్తూరిలో నల్ల విష్ణుచిత్తు**

**డతుల తులసీ సుగంధి మాల్యమును మూల**

**మంత్రమున నక్కు సేర్చుచో మన్ననా రు**

**దారమధురోక్తి నిట్లని యానతిచ్చె**

ఆ సమయములో, విల్లిపుత్తూరులో, విష్ణుచిత్తుడు శ్రేష్ఠమైన సుగంధముతో నిండిన తులసీ మాలను మూలమంత్రమైన అష్టాక్షరీ మహామంత్రమును అనుసంధిస్తూ తన వక్షస్థలము మీద అలంకరిస్తుండగా మధురగంభీరమైన మాటలతో ఈ విధముగా సెలవిచ్చాడు మన్ననారు అని పిలువబడే వటపత్రశాయి ఐన శ్రీమహావిష్ణువు.

**నేడు మహామతీ! మధుర నీవు రయంబునఁ జొచ్చి యందుఁ బాం**

**డీడు దివాణము న్నెరయ నించినఁ బ్రేలెడుదుర్మదాంధులన్**

**బోఁడిమి మాన్చి మన్మహిమముం బ్రకటించి హరింపు శుల్కమున్**

**వాడును రోసినాఁడిహము  వైష్ణవుఁగా నొనరింపు సత్కృపన్**

ఓ మహామతీ, నీవు వెంటనే మధుర వెళ్లి, ఆ మహారాజు దివాణములో నిండిపోయిన, సభలోనున్న దుర్మదాంధులను, నానావిధములుగా పేలుతున్న వారిని, వారి గర్వమణిచి, నా మహిమను ప్రకటించి ఆ మహారాజు ప్రకటించిన శుల్కమును గ్రహింపవయ్యా! ఆ రాజుకు కూడా యిప్పుడు ఇహలోకము మీద రోతపుట్టింది. ఆతడిని అనుగ్రహించి, వైష్ణవునిగా చేయవయ్యా! అని మన్ననారు అని పిలువబడే మహావిష్ణువు ఆనతిచ్చాడు.

మహామతీ అని సంబోధించడము కేవలము అనునయముగా పలకడం మాత్రమే కాదు, ఏ విద్యాపరమైన పాండిత్యము, విజ్ఞానము లేకున్నా, మనసును నిరంతరమూ మాధవునియందు మాత్రమే లగ్నము చేసినవాడు కనుక మహామతి అని. విష్ణుచిత్తుల పాత్రను పరిచయము చేసినప్పుడే లౌకికమైన విద్య, పాండిత్యము నిరర్ధకములు అనిభావించి మనసును పరమాత్మునియందు లగ్నముచేసి తామరాకుమీది నీటిబొట్టులాగా ప్రాపంచిక విషయములను అంటకుండా జీవికను కేవలము పరమాత్ముని సేవలోనే కొనసాగిస్తున్నాడు అని చెప్పాడు రాయలు, కవిగా తాను చెప్పినదాన్ని కావ్యంలో ఆసాంతమూ ఆ పాత్ర పలికే పలుకులలో ధ్వనింపజేస్తున్నాడు, పాత్ర పోషణములో ఉత్తమమైన శైలికి నిదర్శనముగా.

మన్ననారు పలికిన మాటలు వినగానే నేనేమిటి, మహారాజు సభకు వెళ్ళడం ఏమిటి? నిండుసభలో వైష్ణవతత్త్వాన్ని బోధించడం ఏమిటి అని గడగడా వణికిపోయాడు విష్ణుచిత్తుడు. ఉన్నతాధికారులతో మాట్లాడడానికే భయపడే అమాయక, సామాన్య సాత్త్విక సేవకుడు మరి. అలాంటిది రాజువద్దకు వెళ్ళడం మాత్రమే కాదు, ఆయన సమక్షములో వాదించడము, మహా మహా విద్వాంసులకు, పండితులకు బోధ చేయడం అనేప్పటికి యింకా భయపడ్డాడు. ఐనప్పటికీ, తనను అనుగ్రహించి తనతో పలికినందుకు ఆనందబాష్పాలు రాల్చాడు. సాష్టాంగదండప్రణామాలు చేశాడు. పులకితదేహుడై, వినయముగా యిలా అన్నాడు.

**స్వామీ నన్ను నితఃపురాపఠితశాస్త్ర గ్రంథ జాత్యంధు, నా**

**రామ క్ష్మాఖననక్రియాఖరఖనిత్ర గ్రాహితోద్యత్కిణ**

**స్తోమాస్నిగ్ధకరున్భవద్భవనదాసున్వాదిఁ గాఁ బంపుచో**

**భూమీభృత్సభ నోట మైన నయశంబుల్మీకు రాకుండునే?**

స్వామీ! నన్ను, ఇంతకుముందు శాస్త్రగ్రంథములను పఠించడం అనే విషయములో పుట్టుగ్రుడ్డివాడిని ఐన నన్ను (యితఃపురాపఠితశాస్త్ర గ్రంథ జాత్యంధున్) నీ ఆలయపు ఉద్యానవనములో పాదులు త్రవ్వీ త్రవ్వీ కఠినమైన గడ్డపలుగును పట్టుకొనడం వలన కాయలుగాచిన మొరటుచేతులవాడిని (ఆరామ క్ష్మాఖననక్రియాఖరఖనిత్ర గ్రాహితోద్యత్కిణస్తోమాస్నిగ్ధ కరున్) నీ భవన దాసుడిని ఐన నన్ను వాదించడానికి పంపితే, ఆ మహారాజు సభలో నాకు ఓటమి లభిస్తే ఆ అపకీర్తి నీకు రాదా? అన్నాడు! అదీ విష్ణుచిత్తుడి వ్యక్తిత్వము. పంపేది ఆ మహానుభావుడు. వెళ్ళేది తానుగాదు, ఆ మహానుభావుని దాసుడు. అక్కడ గెలిచినా ఓడినా తాను కాదు, ఆ మహానుభావుడే, కనుక ఆ కీర్తి అయినా, అపకీర్తి అయినా పంపిన మహాశయునిదే గానీ తనది కాదు. ఫలితాన్ని నాకు వదిలివేసి నీవు కేవలము నిమిత్తమాత్రుడవై సర్వకర్మలనూ ఆచరింపుము అని శ్రీకృష్ణ పరమాత్ముడు పలికిన పలుకులను తన జీవితమంతా ఆచరణ లో పెట్టినవాడు కనుక, తను విజ్ఞాని కాడు, జ్ఞానీ కాడు అనుకునే వాడు,స్వాతిశయము, దర్పమూ, అహంకారము లేనివాడు కనుక అక్కడి పండితులతో వాదించి తను ఓడిపోతే, హరిదాసుడు ఓడిపోతే, ఆ అపకీర్తి తన స్వామికి వస్తుందికదా అని భయపడ్డాడు విష్ణుచిత్తుడు. ఇంకా ఇలా మొరబెట్టుకున్నాడు స్వామికి.

**గృహసమ్మార్జనమో జలాహరణమో శృంగార పల్యంకికా**

**వహనంబో వనమాలికాకరణమో వాల్లభ్యలభ్యధ్వజ**

**గ్రహణంబో వ్యజనాతపత్రధృతియో ద్రాగ్దీపికారోపమో**

**నృహరీ వాదములేల లేరె యితరుల్నీ లీలకుం బాత్రముల్?**

స్వామీ! అదేమన్నా నీ గృహసమ్మార్జనమా( అంటే నీ మందిరాన్ని కడిగి పరిశుభ్రము చేయడమా?) నీకొరకు నీళ్ళు తేవడమా? నీ పల్లకిని మోయడమా? నీ ప్రభుత్వమునకు చిహ్నమైన నీ ధ్వజమును మోయడమా? నీకు విసనకర్రనుబట్టి లేదా వింజామరను పట్టి వీయడమా? నీకు దీపారాధనను జేసి సేవజేయడమా? ఇవన్నీ అయితే నాకు అలవాటైనవి, తేలికైనవి, ముఖ్యముగా నాకు ఇష్టమైనవి. మౌనముగా ఏ ఆర్భాటములూ లేకుండా నీ సేవజేయడం అంటే నాకు తెలిసినది కానీ, ఈ వాదములేమిటి? ఇలాంటి నీ లీలలకు, నీ ఆటలకు తగినవారు వేరే ఎవరూ దొరకలేదా? నన్నెందుకయ్యా నాకు చేతగాని పనులలో నియోగించి నీవు అప్రదిష్టపాలు గావడం? నీలీలలకు వేరే ఎవరూ లేరా అంటే ఎందఱో ఉన్నారు విద్వాంసులు, పండితులు, జ్ఞాన, విజ్ఞాన మార్గములలో నిన్ను తెలుసుకున్నవారు, వారిని ఈ పనికి పురమాయించవయ్యా అని ధ్వని. కేవలము ఒక సేవకునిగా, మౌనముగా సేవించి ఆనందించడంలో నాకు ఆనందమున్నది అని విన్నవింపు. నాకు ఏ పండిత వాదములూ, ఆ వాదములలో గెలవడాలు,పండిత శుల్కములను గ్రహించడాలు వద్దు స్వామీ అని ప్రాధేయపడడము.

**అనిన దద్భక్తి కెద మెచ్చి యచ్యుతుండు**
**మొలక నగవొప్ప శ్రీదేవి మోము సూచి**
**వా దితని చేత గెలిపింతు నాదుమహిమ**
**మువిద కను మని ప్రాభవం బొప్పబలికె**

ఆ విష్ణుచిత్తుని పలుకులను ఆలకించి అతని భక్తికి మెచ్చుకుని, చిరునవ్వులు అంకురించుచుండగా, తన ప్రక్కనున్న శ్రీదేవితో ' వాదములో ఇతనిని గెలిపించెదను, ఉవిదా! నా మహిమ చూతువుగాని ',అని 'ప్రాభవంబొప్ప' క్రిందివిధముగా విష్ణుచిత్తులతో పలికాడు. అంటే, ప్రభువుయొక్క ఠీవి కనబరుస్తూ పలికాడు. యజమానిమీద విశ్వాసముంచి ఆతని పలుకులను జవదాటనివాడే సేవకుడు గనుక, తన అమాయకత్వముతో నన్ను ఈపనిమీద పంపేవాడే ఆపనిని చక్కబెట్టే నైపుణ్యాన్ని నాకు ప్రసాదిస్తాడు అనే విషయాన్ని మరిచిపోయాడు సేవకుడైన విష్ణుచిత్తుడు కనుక యిప్పుడు చక్రవర్తిలా 'హుకుం' జారీ చెయ్యాలి, కనుక ప్రాభవము ఒలికేట్టు పలికేట్టు చేశాడు రాయలు. అంతటి మహానుభావునికి సకల జగత్పతికి ఏమిటీ పిల్లచేష్టలు అనే అనుమానము రావొచ్చు, తనభక్తునివైభవమే తనవైభవము గనుక, తన తత్త్వమును తాను తన భక్తుని ద్వారా స్థాపించడము, తనభక్తునికి ఖ్యాతిలభించడము

తనకు ఆనందకారకాలు గనుక ఈ ఖేల, లీల! తల్లిదండ్రులు తమ పిల్లలకు అనుభవము, నైపుణ్యము పెరగడం కోసం కొన్ని పనులను పిల్లలకు అప్పజెప్పి, వారు భయపడుతుంటే, నీకేం పర్లేదు, నేనుపక్కనుంటాగా, నువ్వు చేయగలవు, నువ్వే చేయాలి అనడం సర్వసామాన్యమైన విషయమే కదా.

విష్ణుమూర్తికీ విష్ణుచిత్తులవారికీ ఉన్నది తండ్రీ కొడుకుల సంబంధమే, యజమానీ సేవకుని సంబంధమే, కనుక ఈ ఆట. ప్రాభవము కనబరుస్తూ యిలా పలికాడు 'మన్ననారు'.

**నీ యిచ్చయె? మిన్నక పో**
**వోయి మునిప్రవర! నిన్ను నొప్పింతును భూ**
**నాయకసభ నిందులకై**
**యేయడ్డము వలవ దవల నేనున్నాడన్**

(తెచ్చిపెట్టుకున్న గంభీరతతో, కాఠిన్యముతో) అంతా నీ యిష్టమేనా? మారుమాట్లాడక పోవయ్యా మునిప్రవరా! ఆ మహారాజు సభలో నిన్ను ఒప్పింతును, ఇందుకు ఏ అడ్డము చెప్పడము అక్కర్లేదు. మౌనముగా ఉండేవాడు ముని. అంటే నీ సంగతి నాకు తెలుసును. మౌనముగా ఉండడమే నీ లక్షణము. అదే మౌనమును నా ఆజ్ఞను పాటించడములో చూపి, ఎదురుమాట్లాడకుండా వెళ్ళు! తర్వాత పూచీ నాది, నేనున్నానుగా! అంతా నీయిష్టమేనా అనడంలో అంతా నా ఇష్టమే అని, నాపనికి ఎవరు పనికివస్తారో తెలుసుకోకుండానే నిన్ను వెళ్ళమంటున్నానా అని కమ్మని కసురు కసురుకుని, ఖరాఖండీగా కమలాకాంతుడు ఆజ్ఞ జారీ చేశాడు.

**అనిన మాఱువలుక నలికి యయ్యాకువా**
**రియ్యకొనియెఁ బోవ నింతలోన**
**బద్మ నయనుఁ డతని పయనంబు తూఁగింపు**
**మనుచు నంబితోడ నానతిచ్చె**

ఎప్పుడైతే యిలా గంభీరముగా మందలింపుతోకూడిన పరామర్శ, ఆజ్ఞ ఎదురయ్యిందో, యిక మారుపలకడానికి భయపడి, వెళ్ళడానికి నిశ్చయించుకున్నాడు విష్ణుచిత్తుడు. అప్పుడు, నంబి అంటే అర్చకునికి ఆజ్ఞ జారీచేశాడు అచ్యుతుడు. అంటే ఆ మన్ననారుకోవెలలో

అర్చకుడు వేరే ప్రత్యేకముగా ఉన్నాడు, ఆ అర్చకునికి కోవెలలో సహకరించడం, ఆలయపుతోటను శుభ్రముగా చెత్తాచెదారమూ లేకుండా తీర్చిదిద్దడము, పాదులు త్రవ్వడము, ఊడవడము, కళ్ళాపు చల్లడం, పూజకు కావలసిన నీళ్ళు , పూలమాలలు వగైరా తెచ్చి సిద్ధము చేయడము, దివ్యముగా అర్చన జరుగుతుంటే ఆనందించడము, అదీ విష్ణుచిత్తులవారి దినచర్య. అంటే ఆయన ఆ ఆలయపరిచారకుడు అన్నమాట. లౌకికముగాచూస్తే అంతటి సామాన్యుడు, మన్ననారుకే మాన్యుడు పారలౌకికముగా చూస్తే! ఇంత విశ్లేషణను ధ్వనించడానికి ఆ ఆళ్వారు (మామూలు ఆళ్వారు కాదు, పెరియాళ్వారు, ఆళ్వారులు అందరిలోనూ పెద్దవాడు, గొప్పవాడు) మారు మాట్లాడడానికి భయపడ్డాడు అని, నంబితో యీతని ప్రయాణమునకు కావలసిన ఏర్పాట్లు చేయుమని మన్ననారు చెప్పాడు అన్నాడు రాయలు. అంటే విష్ణుచిత్తులవారు అర్చకుడు కూడా కాదు, ఆ విద్వత్తు కూడా లేదు, కానీ, ఆళ్వారులలోనే పెద్ద అయినాడు, పెరియాళ్వార్ అయినాడు కేవలము సాటిలేని తనభక్తివిశేష కారణముగా, నిర్మలులైన తన భక్తులమీద భక్తవత్సలుడైన పరమాత్ముని కరుణ కారణముగా అని క్లుప్తముగా, అన్యాపదేశముగా చెప్పాడు రాయలు. యిక విష్ణుచిత్తులవారు రాజసభకు బయలుదేరారు.

శ్రీమహావిష్ణువు గంభీరముగా ఆజ్ఞజారీచేయడంతో యిక తప్పనిసరై స్వామిమీదనే సమస్త భారమునూ వదలి, మధురానగరానికి బయలుదేరాడు విష్ణుచిత్తుడు. కొద్దిగా నసగడం, అభ్యంతరం తెలియజేయడం, స్వామిఆజ్ఞకు ఎదురుచెప్పడం ఎందుకంటే, నిత్యమూ సమస్త ప్రాపంచిక విషయాలకూ అతీతుడై స్వామి సేవలో, ఆ ఆలయపరిచర్యలలో గడిపేవాడికి ఆ ఆలయాన్ని, ఆ సేవనూ వదిలి, గ్రామాంతరం వెళ్ళడంకన్నా పెద్ద శిక్ష ఏముంటుంది? వెళ్లి చేసేదీ స్వామి సేవయే కానీ, ఈ పాండితీవాదాలు, ప్రతిభాప్రదర్శనలూ, యివన్నీ గిట్టనివాడు, ఆ దర్పముకానీ, అహం కానీ తెలియనివాడు, మౌనముగా ఆనందముగా సేవచేస్తూ, ఆనందబాష్పాలు రాలుస్తూ స్వామికి దివ్యముగా అర్చన జరుగుతుంటే చూసి ఆనందించడమే తెలిసినవాడు, కనుక యిదంతా నాకెందుకు అనుకోడం ఒక కారణమూ, రెండవది ఆ రాజసభలూ, ఆ సమూహాలూ, ఆ వ్యర్థ, శుష్కవాదాలు, ఆ రాజసిక, తామసిక తత్త్వ నిలయాలు గిట్టని ఏకాంతుడు, దాంతుడు, శాంతుడు, యోగి, భౌతికముగా సంసారములో ఉన్నప్పటికీ మానసికముగా సన్యాసి కనుక. కానీ, అది కూడా నా పనే, నా సేవయే, నా సేవకులతో ఏం సేవ చేయించుకోవాలో నాకు తెలియదా, అని స్వామి కోపగించుకొనడం వలన బయలుదేరాడు.

**ఆనతిఁ బడి శ్రీ భండా**
**రాన స్వంబడముఁ దనదు ప్రాయందలమున్**
**స్థానికుఁ డొసంగి పనుపం**
**గా నానతి బడిన నిమితకాంద్రు వహింపన్**

స్థానికుడు అంటే ఆ దేవస్థానములోని జమాఖర్చుల అధికారి, కోశాగారపు అధికారి. ప్రాయందలము అంటే పురాతన పల్లకి, నిమితకాంద్రు అంటే ఆ పల్లకిని మోసే బోయీలు. స్వామివారి ఆనతిని పొందిన ఆ ఆలయపు అర్చకుడు కోశాగారపు అధికారికి ఆజ్ఞ జరీ చేశాడు విష్ణుచిత్తుల వారికీ దారిబత్తెముకోసము, యితర అవసరాలకోసం డబ్బునివ్వమని. ఆ కోశాధికారి అలాగే డబ్బులిచ్చి, తన పల్లకిని, ఎప్పటినుండో తను వాడుకునే తన స్వంత పల్లకిని కూడా ఇచ్చాడు. దాన్ని మోయడానికి తన బోయీలనూ కూడా సమకూర్చాడు.

యిక కావలసిన అన్ని హంగులూ సమకూరాయి కనుక ఆ పల్లకిలో కూర్చుని బోయీలు మోస్తుండగా

**లావుగల యట్టిగుబ్బపు**

**జావడములమీఁద మాత్రసంచులు తూలన్**

**గ్రేవల నేకాంగులు రా**

**వీవధముల నరిసె లవనివిభునకుఁ గొనుచున్**

జావడములు అంటే పార్శ్వభాగాలు, డొక్కలు. మాత్రసంచులు అంటే అటుచివర యిటుచివర సంచుల్లాగా వుండి, ఆ రెండు సంచులనూ కలుపుతూ మధ్యలో పొడవుగా వుండే మందపాటి గుడ్డ కలిగిన రెండు సంచుల మూట అన్నమాట. ఆ సంచులలో అవసరమైన వస్తువులు, బట్టలు మొదలైనవాటిని పెట్టుకుని అటుప్రక్క యిటుప్రక్క భుజాలమీదనో, గుఱ్ఱాలమీదనో ఈ సంచులు వ్రేలాడదీసి ప్రయాణాలు చేసేవారు ఆ కాలంలో. ఏకాంగులు అంటే సమస్త ప్రాపంచిక బంధాలను, ఆనందాలను వదిలిపెట్టి, భగవంతుని కైంకర్యముకోసమే జీవించే విరక్తులు. ప్రతిదేవాలయాన్ని అంటిపెట్టుకుని ఇలాంటివారు దేవాలయపు సేవలలో కార్యకర్తలుగా ఆనందంగా బ్రతికేవారు ఉండేవారు. వీవధములు అంటే కావళ్ళు .

పల్లకీకి ఇరుప్రక్కలా ఏకాంగులు నడుస్తుండగా, బలిష్టమైన గుఱ్ఱాలమీద మాత్రసంచులు వ్రేలాడుతుండగా, కావళ్ళలో రాజుగారికోసం ప్రత్యేకముగా వండించిన అరిసెలను కావడివాళ్ళు మోస్తుండగా బ్రహ్మాండమైన ఊరేగింపుగా బయలుదేరాడు విష్ణుచిత్తులవారు. భారతీయ, హైందవ ధర్మానికి మూలస్తంభాలైన దేవాలయ వ్యవస్థను పరామర్శిస్తున్నాడు, పరిచయం చేస్తున్నాడు రాయలవారు. దేవుడున్నాడని నమ్మేవారు, ప్రతిజీవిలోనూ దేవుడిని చూసేవారు, భగవంతుడు కూడా ప్రత్యక్షముగానో, నిదర్శనంగానో మాట్లాడి, ఆజ్ఞలు జారీచేస్తే ఆచరించే అర్చకులు, ఆ అర్చకులను గౌరవించే, వారి ఆజ్ఞలను అమలుచేసే దేవాలయ అధికారులు, తమ జీవితాలను కేవలం దేవాలయసేవకు తద్వారా దేవునిసేవకు, ఏ ఐహిక లాభాలను ఆశించకుండా అంకితం చేసిన పవిత్రాత్ములు, వీరందరి సమిష్టి కృషి, సేవల ఫలితముగా సమాజానికి ఆధ్యాత్మిక, సామాజిక, నైతిక విద్యనూ అందించే దేవాలయ వ్యవస్థ ఉన్నది ఆ రోజుల్లో! ఈరోజుల్లో దాదాపుగా లేదు, అదీ ఆనాటి, ఈనాటి సామాజిక శాంతియుత, అశాంతియుత వాతావరణానికి మూల కారణాలలో ఒకటి! ఎన్నడూ గుడికి పోనివాడు కూడా కేవలం సిఫారసులమీద దేవస్థానపాలకవర్గంలో

అధికారిగానో, సభ్యునిగానో నియమింపబడుతున్నాడు ఈనాడు, చాలాచోట్ల! కులం కారణంగా దేవాలయానికి రాకుండా నిషేధింపబడుతున్నారు అనేకులు అనేక సందర్భాలలో ఈనాడు!

**భక్తిఁ ద్రోవకు సాధ్వి పరికరంబులు వెట్టి**
**కట్టిన పొరివిళంగాయగములు**
**నెసటిపోతలు గాఁగ నేర్చి నించిన చిరం**
**తనపుశాలిక్షేమ తండులములు**
**వడిఁబెట్టి లో జీర గుడము సాఁబా లూన్పఁ**
**జెఁలగు సంబారంపు జింతపండు**
**పెల్లులోహండి కావళ్ళకొమ్ముల వ్రేలు**
**గిడ్డి మొత్తము నేతిలడ్డిగలును**

**బెరుఁగువడియంబులును బచ్చివరుగు బేడ**
**లురుతరాచ్యుత పూజోపకరణ పేటి**
**కలును జాత్తిన చాత్తనికులము బలసి**
**విధినిషేధము లెరిగి తే మధురకేగె**

పొరివిళంగాయగములు అంటే ఒకవిధమైన, తమిళదేశస్థుల తినుబండారాలు. వడిబెట్టి అంటే, మట్టి, యిసుక నలుసులు మొదలైనవి లేకుండా ఏరినవి. నేతిలడ్డిగలు అంటే మట్టితో చేసిన నేతిపిడతలు, కూజాలవంటివి.

ప్రయాణములో దారిలో తినడంకోసమని తన భార్య భక్తిగా సిద్ధము చేసి ఇచ్చిన ప్రత్యేకమైన తినుబండారాలు, చక్కగా ఏరిన దాన్యసంబంధమైన ఆవాలు, మెంతులు, జీలకర్ర, బెల్లము, చక్కని చింతపండు, కావళ్ళకు వ్రేల్లాడుతున్న ఆవునేతిపిడతలు, పెరుగు వడియాలు, పచ్చి వరుగులు, వలిచిన (చాయ)పప్పు, అచ్యుతుని పూజోపకరణములు ఉంచిన పెద్ద పెద్ద పెట్టెలను తీసుకుని, తమ తమ విధులను, తమకున్న పరిమితులను తెలిసినవారైన శ్రీవైష్ణవులు(చాత్తిన) చాత్తాదవైష్ణవులు తనను అనుసరిస్తుండగా బయలుదేరాడు విష్ణుచిత్తులవారు. శ్రీవైష్ణవులు అంటే ద్రవిడ ప్రబంధమును తెలుసుకుని, దానిని బోధించగలిగే,అర్చన, పూజ, నివేదనము మొదలైనవి అన్నీ చేసే అధికారము కలిగినవారు, గురుస్థానములో వుండి బోధ చేయగలిగినవారు, చాత్తాద వైష్ణవులు అంటే ద్రావిడప్రబంధాన్ని ఆ ధర్మాన్ని అనుసరించేవారైనప్పటికీ, దానిని బోధించడానికి, నివేదనము చేసి ఎవరికైనా సరే ప్రసాదముగా

యివ్వడానికి, గురుపీఠమును ఎక్కడానికి పరిమితులు గలిగినవారు. వీరందరూ అనుసరిస్తుండగా, యిన్ని సంబారాలతో ధర్మయుద్ధ విజయానికి బయలుదేరాడు విష్ణుచిత్తులవారు, అదీ యిన్నిరకాల వర్ణనలకు రాయలు పూనుకున్న కారణములోని మరొక మర్మము, ఎవరికి వారు తమ దైనందిన జీవితములో అనుసరించే విధివిధానాలకు ఏమాత్రమూ ఆటంకము లేకుండా ఏర్పాట్లు చేసుకుని మరీ ప్రయాణము చేయాలి. ఆహార విహారాలు, ఆధ్యాత్మిక, నైతిక సాధనలు ఎక్కడవున్నా, ఎవరికైనా ఏ మినహాయింపులూ యివ్వవు, వెళ్ళేది తీర్థయాత్రకే కదా, భగవంతుని సన్నిధికే కదా, కనుక పట్టింపులు అక్కర్లేదు,

కాస్త అటూ ఇటుగా తిన్నా, ఎలా ఉన్నా పర్లేదు అనుకుని, ఆ సందర్భముగా మనకున్న చిన్న చిన్న అభిరుచులను, రుచులను తీర్చుకుంటాము మనము, అది కూడదు అని యిక్కడ సూచన. అంటే ఆలోచన, ఆధ్యాత్మిక, నైతిక జీవనము అనేవి ఎవరైనా, ఎన్నటికీ, ఎక్కడా మినహాయింపులు, రాజీ లేకుండా అనుసరించాలి అని!

**యమనియమాది లభ్య ద్రుహిణాది జరన్మరుదిభ్య సంసృతి**
**శ్రమహర నామకీర్తన  మురప్రవికర్తన పాతకావలీ**
**దమన రమాంగనాకమన తామరసాయతనేత్ర భక్త హృ**
**ద్భ్రమతృణదాత్ర భూయువతిరంజన వర్ణజితాభ్రఖంజనా**

ద్రుహిణ అంటే బ్రహ్మదేవుడు. ఇభ్య అంటే ప్రభువు, పాలకుడు. సంసృతి అంటే పుట్టడం, చావడం అనే చక్రభ్రమణము కలిగిన సంసారము. దాత్రము అంటే కొడవలి, లవిత్రము. అభ్రము అంటే మేఘము. ఖంజనము అంటే కాటుక పిట్ట, కాటుకలాగా నల్లగా ఉండే ఒక పిట్ట.

యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధ్యాన, ధారణ, సమాధి అనే అష్టాంగయోగమార్గముద్వారా పొందబడేవాడా, బ్రహ్మ మరుత్తులు మొదలైన ఆది దేవతలకు ప్రభువైనవాడా, జననమరణాల క్రబంధనమువంటి సంసారశ్రమలను దూరముచేసే పవిత్రమైన నామకీర్తన గలిగినవాడా, మురాసురుని హతమార్చినవాడా, పాపపు సమూహాలను నాశనంచేసేవాడా, లక్ష్మీదేవిని కామించువాడా, తామరదళములవంటి విశాలమైన, నాజూకైన, కించిత్తు ఎర్రనివైన కనులు గలవాడా, భక్తుల హృదయములలోని భ్రమలు అనే గడ్డిపోచలను తెగేసే కొడవలివంటివాడా, భూదేవికి ఆనందమును కలిగించినవాడా వరాహరూపా, శరీరకాంతిచేత గెలువబడిన మేఘమును, కాటుకపిట్టను కలిగినవాడా, ఓ రమారమణా నీకు మంగళము అని ద్వితీయాశ్వాసమును ముగిస్తున్నాడు రాయలు.

అష్టాంగయోగముద్వారా తెలియదగినవాడు అంటే కేవల పాండిత్యము అక్కర్లేదు అని సూచన, కనుకనే విష్ణుచిత్తులను పాండితీ వాదానికి పంపాడు అని సూచన. దేవతలు ఎల్లరికీ ప్రభువు, వారినే శాసించి తన పనులను చేయించుకునేవాడు, విష్ణుచిత్తుని కూడా ప్రభువులా శాసించి తన పనిని చేయించుకుంటున్నాడు అని చమత్కారము.

తామరదళములవంటి కించిత్తు ఎర్రనైన కనులను ఇంకొంచెం ఎర్రగా చేసి, దొంగకోపము నటించి, విష్ణుచిత్తుల చిత్తములోని సందేహాలను చిత్తుచిత్తు చేసినవాడు అని చిలిపి చమత్కారము. జనన మరణాది శ్రమలనే దూరము చేసేవాడు, ఈ మధురా ప్రయాణము, ఆ వాదన,

ఆ తర్కము అనే శ్రమను తీర్చడం ఎంతలోపని? అని ఒక మెరుపువంటి విరుపు. భక్తుల హృదయాలలోని సంశయములనే లతలను ఖండించే కొడవలివంటి వాడు కనుకనే విష్ణుచిత్తుల సంశయాన్ని తొలగించి, నువ్వా వెళ్ళేది, వాదించేది, గెలిచేది, అన్నీ నేనే అని తేల్చిచెప్పి పంపిన ప్రభువు, కాటుక వంటి మత్స్యధ్వజుని అజ్ఞానమును గెలిచినవాడు ఐన విష్ణుచిత్తుని హృదయాకాశమును(అభ్రము) నింపిన నల్లనివాడు, లక్ష్మి(ఆండాళ్) స్వరూపిణి ఐన గోదాదేవిని కామించినవాడు ఐన శ్రీమహావిష్ణువును మంగళ పూర్వకముగా పొగిడి ద్వితీయాశ్వాసమును ముగిస్తున్నాడు రాయలు. ఈ చమత్కారపు సూచనలే కాక దివ్యమైన ధారతోకూడిన అంత్యానుప్రాసలకు రాయల కవిత్వములోని ఉదాహరణలకు ఈ పద్యము ఒక మచ్చుతునక, అచ్చుగా ఒక బెల్లపుతునక!

*శ్రీ క్షితి నీళా వర! దను*
*జోక్షప్రాణహర! దంష్ట్రికోత్కృత్త హిర*
*ణ్యాక్షక్షపాచర!క్రుపా*
*వీక్షా ధ్రుత బాహులేయ వేంకటరాయా*

లక్ష్మీదేవికి, నీళాదేవికి భర్త ఐన వాడా, వృషభ రూపములో ఉన్న రాక్షసుని సంహరించిన వాడా(దనుజోక్షప్రాణహర) దంష్ట్ర చేత ఉత్కృత్తము చేయబడిన హిరణ్యాక్షుడనే క్షపాచరుని కలిగినవాడా (కోరచేత ఖండింపబడిన హిరణ్యాక్షుడు అనే నిశాచరుడు అంటే రాక్షసుని కలిగినవాడా) క్రుపాకటాక్షముచేత ఆదరింపబడిన బాహులేయుడు అంటే కుమారస్వామిని కలిగినవాడా, వేంకటాచలరాయా వినుమని ఆముక్తమాల్యదలోని మూడవ ఆశ్వాసమును ప్రారంభము చేస్తున్నాడు శ్రీకృష్ణ దేవరాయలు.

ఆముక్తమాల్యదలో కఠినమైన పాండితీ వాదానికీ, ఉపాఖ్యానాలకూ నిలయమైనది, విశేష ఆధ్యాత్మిక రక్తి కలిగినవారికి మాత్రమే రుచించేదీ ఐన ఈ మూడవ ఆశ్వాసములో కొన్ని పద్యాలను మాత్రమే పరిశీలిద్దాము, కథకు అవసరమైనవి కనుక, ప్రతి ఆశ్వాసాన్నీ ఎంతోకొంత చర్చించుకొనడం మన లక్ష్యము కనుక.

సమస్త సన్నాహాలతో, సర్వేశ్వరునిపై భారంవేసి మధురానగరమునకు వెళ్ళిన విష్ణుచిత్తుడు

*నిత్యంబున్న్రతిహారి వాద మగుటన్విజ్ఞప్తి లే కంపఁ దా*
*నత్యూర్జస్వలుడౌట భూపతియు సభ్యవ్రాతమున్శంకయైఁ*
*బ్రత్యుత్థానము జేసి మ్రొక్కఁగ సభాభాగంబు సొత్తెంచి యా*
*న్నత్యప్రోజ్జ్వలరాజ దత్త వర రత్న స్వర్ణ పీఠస్థుడై*

మత్స్యధ్వజుడు తనకు తగిన దైవమును చూపినవారికి బహుమానమును ప్రకటించిన నాటినుండీ ప్రతిరోజూ పండితులు రావడం పాండితీ వాదాలు జరగడం చూస్తున్నవాడు కనుక విష్ణుచిత్తులవారిని చూడడంతోనే ఈయన కూడా పాండితీ వాదము కోసమే వచ్చాడు అని గ్రహించి 'తమరి దర్శనము కొరకు ఎవరో పండితుడు వచ్చాడు ప్రభూ' అని విజ్ఞప్తి చేయకుండానే విష్ణుచిత్తులవారిని లోపలికి పంపించాడు. యిందులో ఒక చమత్కారము ఉన్నది. లోపల మహారాజు తన సభలో జరుగుతున్న వాదోపవాదాలను విని విసుగు చెంది ఉన్నాడు, ఎవరి వాదము చేతా ఆయనకు సంతృప్తి కలుగలేదు, వచ్చే వాళ్ళు పోయే వాళ్ళతో ఈ ప్రతీహారి కూడా విసుగు చెంది ఉన్నాడన్నమాట, అందుకే వచ్చిపోయే వాళ్ళను చూస్తూ కూర్చునే స్థితికి వచ్చి నిర్లిప్తముగా తయారయ్యాడు, అదీ సూచన. అప్పటికే మహావిష్ణు కరుణా ప్రభావము చేత 'అత్యూర్జస్వలుడు' అంటే మహా తేజస్సును కలిగినవాడైనాడు విష్ణుచిత్తులవారు, కనుక మహారాజు, యితర సభ్యులు ( సభికులు అని ఎక్కడా వాడకూడదు, రాయల సాహిత్య పరిశీలనలో అసలు వాడకూడదు, సభికులు అంటే 'గాడిదలు' అని అర్థం, ఈనాడు ప్రతిసభలోనూ సభికులు అనే వాడుతున్నారు, బహుశా అదే సమంజసము అనో, లేక తెలియకనో!) అందరు కూడా ఈ వచ్చినవారెవరో మహాత్ముడు అని భావించి లేచి నిల్చుని మ్రొక్కగా, వెళ్లి, సభమధ్యలో ఉన్న ఎత్తైన, స్వర్ణ మయమైన సింహాసనాన్ని మహారాజు చూపించగా, అందులో కూర్చున్నాడు. ప్రతీకాత్మకంగా విష్ణుచిత్తుల వారి భావివిజయాన్ని సూచిస్తున్నాడు రాయలు.

*కతిపయోక్తులకే వారి ప్రతిభఁ దెలిసి*
*నగవు తలుకొత్త రాజు నెమ్మొగము జూచి*
*'యీవు మాధ్యస్థ్యమున నున్న నేముఁ గొన్ని*
*నొడివెదము మాట'లని తదనుజ్ఞ వడసి*

కతిపయోక్తులకే అంటే కొన్ని మాటలలోనే వారి ప్రతిభను తెలుసుకున్నాడు, ఒక్క మెతుకు పట్టుకుంటే చాలు కదా అన్నం అంతా ఉడికిందీ లేనిదీ తెలిసికొనడానికి, లీలగా 'అమాయకులు!' అన్నట్టు నవ్వుతూ రాజు ముఖమును చూస్తూ ' మహారాజా! తమరు మధ్యవర్తిగా అంటే తటస్థముగా ఉంటానంటే నేను కొన్ని పలుకులు పలుకుతాను అని, దానికి మహారాజు అనుమతించగా ప్రారంభించాడు విష్ణుచిత్తులవారు తన వాదాన్ని. ఆ పాండితీ వాదము మహారాజు తనకు మోక్షమును ప్రసాదించ గలిగిన దైవమును

చూపించడం కొరకే ఏర్పాటు చేశాడు కనుక, అయన సంతృప్తి చెందడమే ప్రధానము కనుక, సహజముగా ఒక పండితుడు మరొక పండితుని వాదన ఎంత సత్యమైనా ఉన్నతమైనా అంగీకరించడు కనుకా,మహారాజునే మధ్యవర్తిగా ఉండమని కోరి, అంతవరకూ తను జన్మలో ఎరుగని లౌక్యాన్ని ప్రదర్శించాడు విష్ణుచిత్తులవారు, విష్ణుమాయ!

అంతవరకూ వాదన చేస్తున్న పండితులను ఒక్కొక్కరినే 'మీరేమన్నారు? మీరేమన్నారు? అని వారి వాదనలను విని, ఒక్కొక్కరి వాదనలలోని లోపాలను వారికి వారే గుర్తించి మౌనము వహించేట్లు చేసి,ఒక్కొక్కరి వాదాన్నే చిరునవ్వుతో, తొట్రుపాటు లేకుండా, మిగిలినవారు మెచ్చుకునే విధముగా ఖండిస్తూ ఒకరి వాదాన్ని వింటున్నప్పుడు వేరే ప్రక్కవారి మాటలను ఆలకించకుండా అంటే తన ధ్యాసను తన ఎదురుగా ఉన్న వాది మాటలపైననే నిలుపుతూ, అందరినీ సమాధానపరచి, మరలా మొదలు ప్రారంభించిన పండితుని వద్దకు వెళ్లి, అక్కడినుండీ వరుసగా తన ఉపమానాలను వేదములనుండీ, స్మృతులనుండీ, ధర్మ శాస్త్రములనుండీ, బ్రహ్మసూత్రముల నుండీ వినిపిస్తూ ఒక్కొక్కరినీ మొదలు వారి వారి వాదాలను ఖండించి తర్వాత తన వాదాన్ని వినిపించి, నిరూపించి అందరినీ ఓడించాడు. ఒక్కొక్క పండితుడు ప్రస్తావించిన దేవీ దేవతలకు కూడా ఆరాధ్యుడు శ్రీ మహావిష్ణువే అని నిరూపించాడు.

అన్నిటికీ ప్రకృతియే కారణమనే సాంఖ్య వాదాన్ని సమర్ధించిన వారిముఖాలను 'ఈక్షత్య' మొదలైన సూత్రములతో ఖండించి, పరాభవ భారముతో వికృతముగా చేశాడు. నేనే ఈశ్వరుడిని అని వాదించే అద్వైతులకు 'భోగమాత్ర' మొదలైన సూత్రములతో రోగం కుదిర్చాడు. మీమాంసకులు మీసములు దించుకునేలా 'ఫలమత' మొదలైన సూత్రాలను ఫలవంతములుగా ప్రయోగించాడు. పరమాణువులే ఉత్పత్తికి కారణం అని పిడికిళ్ళెత్తి వాదిస్తున్న వారి కణుపులను 'శాస్త్ర యోనిత్వాత్' మొదలైన సూత్రములతో విరగ్గొట్టాడు. శూన్యవాదులైన బౌద్ధులకు 'నిత్యో నిత్యానాం' అనే శ్రుతిపలుకులతో బుద్ధి చెప్పాడు. కంటికి కనిపించే, శక్తివంతుడైన రాజే దైవము అని పలికే ప్రత్యక్ష వాదులైన చార్వాకుల చపలత్వాన్ని 'అనుపపత్తేః న' అనే సూత్రముతో చక్కదిద్దాడు. మహావిష్ణువు కన్నా మిన్న ఐన దైవము, విశిష్టాద్వైతము కన్నా మిన్నయైన మతము లేదని సర్వ సమ్మతముగా వాదించి, ఓడించి, గెలిచాడు.

అద్భుతంగా పది పద్యాలలో విష్ణుచిత్తులవారి వాదనా పటిమను, తన ఆధ్యాత్మిక సంపదనూ వెల్లడించాడు రాయలవారు. యిది ఒక ప్రత్యేకత అయితే, నిత్యమూ తన సభలో పెద్దన, రామకృష్ణుడు యితర ఉద్దండులతో, తన ఆధ్యాత్మిక గురువైన వ్యాసరాయలతో జరిగే సాహిత్య, ఆధ్యాత్మిక చర్చల,వాదోపవాదాల అనుభవముతో, తన విశేష లోకపరిశీలనానుభవముతో శాస్త్ర చర్చ జరగవలసిన విధానాన్ని, ఈరోజు ప్రపంచ వ్యాప్తముగా గుర్తింపు పొందిన 'కమ్యునికేషన్ స్కిల్స్' అని పిలువబడుతున్న సంభాషణా చాతుర్యాన్ని వర్ణించాడు రాయలవారు. చర్చలో ఆవేశపడకూడదు, ఎవరైనా, ఎవరితోనైనా, ఏ అంశము గురించి అయినా, చిరునవ్వును చెదిరిపోనీయకూడదు, ఎవరితో మాట్లాడేప్పుడు వారి మీదనే ధ్యాసను పెట్టాలి, శ్రద్ధగా వినాలి, ఎదుటివారి వాదనలోని లోపాలను మొదలు వారే గుర్తించేలా

చేయాలి, ఆత్మవిశ్వసముతో, స్పష్టముగా, సరైన ఉదాహరణలతో తన భావాలను ప్రకటించాలి. వారు నోళ్ళెత్తకుండా చేయాలి, అదే చేశాడు విష్ణుచిత్తులవారు. అనంతరం ఒక కథను చెప్పడం ప్రారంభించాడు. ఖాండిక్యుడు, కేశిధ్వజుడు అనే నిమివంశానికి అంటే జనకుని వంశానికి చెందిన యిద్దరు మహారాజుల సంవాదాన్ని చెప్పడం ప్రారంభించాడు.

ఖాండిక్య కేశిధ్వజులు అనే యిద్దరు చక్రవర్తులు 'నిమి' వంశానికి చెందినవారు. శ్రీరాముని వంశంలో ప్రసిద్ధుడైన ఇక్ష్వాకు మహారాజు కుమారుడు నిమి (తన కులగురువైన వశిష్టుని శాపకారణంగా శరీరహీనుడు అయినాడు ఇతను. బ్రహ్మదేవుని దయవలన ' శరీరం లేకున్నా అతి ముఖ్యమైన ధర్మాన్ని, కర్మాన్ని నిర్వహించే వరం యిస్తున్నాను, ప్రాణుల కంటిరెప్పుల యందు నివశించుమని వరమును పొంది, ప్రాణుల కంటిరెప్పులయందు నివసిస్తున్న కారణంగా కంటిరెప్ప ఒకసారి మూసి తెరవడానికి పట్టే కాలం నిమేషం అని పిలవబడుతున్నది.) ఆ నిమి వంశంలో ధర్మధ్వజుడు అనే రాజుకు 'మితధ్వజుడు', 'కృతధ్వజుడు' అనే యిద్దరు కుమారులు. వీరిద్దరికీ చెరొక కుమారులు కలిగారు. ఆ కుమారులు 'ఖాండిక్యుడు', 'కేశిధ్వజుడు'. అన్నదమ్ముల కుమారులైన వీరికి దాయాదులకు సహజమైన వైరం కలిగి ఒకరి రాజ్యాన్ని మరొకరు ఆక్రమించుకోడానికి ప్రయత్నం చేయడంతో చాలారోజులు పెద్ద యుద్ధం జరిగింది.

*పలపల వేగ నిచ్చలును బౌఁజులు దీర్చి యతండు నాతడున్*
*వెలువడి వచ్చి యిక్షుమతి వేణిక యేపిరికాఁగ వీఁగుచున్*
*దలపడుచుం బెనంగఁగఁ గృతధ్వజనందనుసైనికావళీ*
*హాళహాళికిం జెడన్విరిగె నార్తి మితధ్వజ నందనుం డనిన్*

తెల్లవారగానే (పలపలన్) సైన్యాలను తీర్చి ఆ యిద్దరూ శిబిరాల్లోనుంచి బయటకొచ్చి యిక్షుమతీ నది ఒడ్డున ఆ నది తల్లడిల్లేలా పోరుసలుపుతుండగా కృతధ్వజుని కుమారుడైన కేశిధ్వజుని సైన్యం యొక్క 'ఒత్తిడికి'(హాళహాళికిన్) తట్టుకోలేక, మితధ్వజుని కుమారుడైన ఖాండిక్యుడు ఆర్తితో యుద్ధాన్ని వదిలి పారిపోయాడు(చెడన్ విరిగెన్)

*చెడవిఱిఁగియడవిఁ బడి యెడ*
*నెడ గట్టులతుదలఁ గోటి యిడి లోఁ గడకున్*
*దడుకుఁ బొడిపించి యాకుల*
*గుడిసెల వసియించె మంత్రిగురుభటయుతుడై*

యిది ఒక చమత్కారపు పద్యం. పదబంధాన్ని బట్టి మాత్రమే కాక, సహజంగా రాజుల విధానాన్ని చెప్పాడు యిందులో. పారిపోయిన ఖాండిక్యుడు ఒక అడవిలో ప్రవేశించి, అక్కడక్కడ, కొండకొనలమీద వేగులవాళ్ళను నియమించి(గట్టులతుదలన్ 'కోటి'యిడి, 'కోటికాడు' అంటే వేగులవాడు అని) చుట్టూ లోతుగా కంప పాతించి( లోనన్ కడకు తడుకున్ పొడిపించి, తడుకు అంటే కంప)ఆకుగుడిసెలలో (పర్ణశాల అనే పదాన్ని మక్కీకి మక్కీ తేలికజేసిన జానపద తెలుగులో ఆకుగుడిసె అన్నాడు!) తన మంత్రి, గురువు, భటులు మొదలైన వారితో నివసించడం మొదలుబెట్టాడు. అక్కడ కేశిధ్వజుడు ఖాండిక్యుని రాజ్యము స్వాధీనమైన తర్వాత, ఆ రాచరికంతో సంతృప్తి పడక,

*ఆ కేశిధ్వజుఁడంత నా నృపుని రాజ్యంబెల్లఁ జేరన్ఫలం*
*బాకాంక్షింపక గెల్తు మృత్యువునవిద్యన్బుట్టకుండం దుదన్*
*జా కుండ న్వలె నంచు యోగ నిరతిం జ్ఞానాశ్రయుండై మఖా*
*నీకంబుల్రచియించు చం దొకటికిం దీక్షించి తానున్నచోన్*

ఫలమును ఆకాంక్షింపక, అంటే లౌకికమైన ఫలితములను కోరుకోక, మృత్యువును గెలవాలి, అజ్ఞానముతో మరల మరలా పుట్టడం, చావడం కాకుండా, అని యోగనిరతితో అనేకములైన క్రతువులను చేస్తూ, ఆ క్రమంలో ఒకానొక క్రతువు చేయడానికి దీక్ష పూనుకున్నప్పుడు,

*పులు మఖశాలికానికట భూముల మేయుచు నేటివెంటఁ బె*
*ల్ల లయెడునీఱముం దఱిసి యామ్య పతాకన ఘర్మ ధేను వా*
*కెలవుల నాడు వాలభుజగిం గని గోండ్రని యంగలార్చుచున్*
*గలగత ఘంట మ్రోయ నురుకం బిడుగుం బలెం దాఁకి యుద్ధతిన్*

ఆ యాగధేనువు(ఘర్మధేనువు, ధర్మధేనువు) యజ్ఞ వాటికా సమీపములోని భూములలో మేత మేస్తూ (మఖశాలికానికట భూముల మేయుచు) ఏటి ఒడ్డున ఉన్న పెద్ద పొదరింటిని సమీపించి, ఆ పొదలో యముని జెండాలాగా ఉన్న పెద్దపులిని, కాలసర్పంలాగా ఉన్న తోకను ఆడిస్తూ ఉన్న పెద్దపులిని చూసి, మెడలోని ఘంటలు మ్రోతలు చేస్తుండగా పరుగెత్తి తప్పించుకుపోదామని ప్రయత్నిస్తున్నా వదలక, గోండ్రుమని గర్జన చేస్తూ పిడుగువలె వడిగా వచ్చి తాకింది ఆ పెద్దపులి. ముఖానికి ముసురుకుంటున్న జోరీగలతో, దుర్వాసన వెలువరిస్తున్న నోటితో, చుట్టుపక్కల ఉన్న చెట్ల ఆకులు రాలేట్లు చెట్లను దూకుతూ, దాటుతూ వర్షాకాలపు మేఘంలాగా బొబ్బరింతలు పెడుతూ వచ్చిన ఆ పెద్దపులిని చూసి ఆ ఆవును కాస్తున్న గొల్ల పిల్లడు చెవులు దిబ్బడలేసి, భయంతో వణుకుతూ స్పృహతప్పి పడిపోయాడు. ఆ ఆవు గొంతును కరిచిపట్టుకుని, దాట్లుకొడుతూ ఈడ్చుకుపోయింది ఆ పెద్దపులి.

***తనువుఁ గొమ్ము గొరిజఁ గొనకుండ మలఁపుచుఁ***

***జప్పు డెసఁగఁ దోఁక నప్పళించి***

***శోణితంబుఁ గ్రోలుచునె నేర్పుమై ఘర్మ***

***గవిని గవికి నీడ్చు నవసరమున***

తన శరీరానికి ఆ ఆవుయొక్క కొమ్ములు గిట్టలు తగలకుండా దానిని మరలిస్తూ పొర్లిస్తూ, చప్పుడయ్యేలా తోకను నేలకు తాటిస్తూ దాని నెత్తురు తాగుతూనే నేర్పుగా ఆ ఆవును తన గుహకు ఈడ్చుకు పోతుండగా,

*పొలమరులందుఁ గూఁతలిడు భూసురులన్నది వార్చి వార్చి ప్రా*

*కుల తుద లెక్కి చప్పటలు గొట్టి యదల్పఁగ, సాహిణీలు మా*

*వులఁ బఱవంగ వైచి సెలవు ల్విస నాకుచుఁ బోయె వృక్ష మం*

*డలికయి తూలుచున్ఘుటఘుటధ్వని సారె మలంగి చూచుచున్*

ఈ పులి గాండ్రింపులను, ఆవు అంబా రావాలను, పొదల చప్పుడులను విని, ఆ దృశ్యాన్ని దూరంనుండి చూసిన సమీపంలోని పంటచేల కాపరులు హెచ్చరికగా కూతలు వేయగా, ఆ ఏటిలో సంధ్య వార్చి వస్తున్న ఆ క్రతువు బ్రాహ్మణులు దగ్గరలో ఉన్న చెట్లెక్కి పెద్దగా అరుస్తూ చప్పట్లు కొడుతూ ఆ పెద్దపులిని అదిలించడానికి ప్రయత్నాలు చేశారు. కొందరు భటులు గుర్రాలెక్కి ఆ పులిని వెంటబడి తరిమారు. ఈ ఎదురుదాడితో ఆవును వదిలిపెట్టి పెదవులు నాక్కుంటూ, వెనక్కు తిరిగి తిరిగి చూస్తూ, గుర్రుగుర్రుమంటూ, బరువైన శరీరము ఊగుతుండగా (తూలుచున్) వేగంగా సమీపంలోని వృక్షముల మధ్యలోకి వెళ్ళింది పెద్దపులి.

ప్రత్యక్షముగా ఎన్నోసార్లు వేటకు వెళ్ళి క్రూరమృగాలను సమీపమునుండి చూసిన అనుభవము, పరిశీలనా శక్తితో రోమాంచితంగా వర్ణించాడు రాయలు ఈ దృశ్యాన్ని.

*జుఌజుఌకున నెత్తురు వెలి*

*కుఌకుచు రొద సేయ నఱితి యొడపిన యూర్పుల్*

*పఱవ మిడిగుడ్లు వడఁకఁగఁ*

*గొఱ ప్రాణముతోడఁ దన్నికొను నమ్మొదవున్*

మెడకు ఐన గాయము సుర సురమని ధ్వని చేస్తూ నెత్తురును వెలువరిస్తుండగా, పెద్దగా ఊర్పులు వదలుతూ, మిడిగుడ్లు వేసి, కొసప్రాణముతో తన్నుకుంటున్న ఆ గోవును చూసినవారు వెళ్లి ఈ వృత్తాంతమును రాజుకు(కేశిధ్వజునికి)విన్నవించారు. యజ్ఞ ధేనువు మరణించింది. యజ్ఞానికి విఘ్నము కలిగింది. దీనికి ప్రాయశ్చిత్తము ఏమిటి అని రాజు ఋత్విక్కులను అడిగాడు. వారు తమకు

తెలియదు అని, కశేరువు అనే ఋషిని అడగమని చెప్పారు. అతడిని అడిగితే నాకు కూడా తెలియదు, శునకుడు అనే ఋషిని అడగవలసింది అని చెప్పారు. ఆ శునకుడు అనే ఋషి నాకే కాదు, మాకెవ్వరికీ తెలియదు, తెలిస్తే గిలిస్తే, ఎవరు తన సప్తాంగములు ఐన స్వామి, అమాత్య, సుహృత్, కోశ, రాష్ట్ర, బల, దుర్గములను అన్నింటినీ నీకు వదిలిపెట్టి చెట్టూ పుట్టా పట్టి తిరుగుతున్నాడో ఆ ఖాండిక్యునికే తెలిసి ఉండవచ్చు, అతను మహా జ్ఞాని, ప్రాయశ్చిత్తము ఏమిటో అడగడం, ఆచరించడం తప్పదు అనుకుంటే వెళ్లి అతడినే అడుగు అని చెప్పాడు. అంటే ఆ ఋషి ఒక చిన్న విసురు విసిరాడు, నీ దర్పాన్ని, అహాన్ని వదిలిపెట్టి వెళ్లి అతడినే అడుగు, నీ వలన పాపం మహాజ్ఞాని అలా అడవుల్లో పడి ఖ్రుగ్గుతున్నాడు అని! దానికి,

*నరపతి పల్కె, మౌనివర నారిపు నిష్కృతి వేడఁబోయిన*
*న్ధర హతుఁ జేసెనేని సవనంపు ఫలం బొడఁగూడు గా క మ*
*త్సరగతిఁ జెప్పెనేని మఖ తంత్ర మతంత్రముఁ గాక పూర్ణమౌ*
*నిరు దెఱఁగు న్మదీప్సితమె యేఁ గెదనంచు రథాధి రూఢుడై*

ఓ ముని వర్యా! నా శత్రువు ఐన ఖాండిక్యుడిని ప్రాయశ్చిత్త మార్గమును తెలుసుకోవడానికి వెళ్తే నన్ను చంపేస్తాడా, యజ్ఞము చేస్తూ మరణించిన కారణముగా నాకు పుణ్యము, యజ్ఞమును చేస్తున్నవాడిని చంపినందుకు ఆతడికి పాపమూ! అలా కాక, అమత్సర గతితో, అంటే నాయందు ఈర్ష్య లేకుండా మార్గము చెప్తాడా, ఈ మఖతంత్రము అతంత్రము కాకుండా పోతుంది, అంటే ఈ యజ్ఞము క్రమము తప్పదు, సక్రమముగా నడుస్తుంది, అప్పుడూ నాకు పుణ్యమే. కనుక ఉభయత్రా నాకు సమ్మతమే, కనుక వెళ్లి అడుగుతాను అని బయలుదేరాడు కేశిధ్వజుడు.

ధార్మిక మర్మాలు, వ్యవహార కౌశల్యము కేశిధ్వజుని ద్వారా వెల్లడించాడు రాయలు.

కేశిధ్వజ మహారాజు తన నిశ్చయాన్ని తన మంత్రులకు తెలిపి,

హరిణాజినోత్తరీయుఁడు
నిరాయుధుఁడు నగుచు నతని నెలవగు నడవిన్
జొరఁ గొట్టికాండ్రు టెక్కెము
బరికించి ఎరింగి కలయఁబడి కూఁతలిడన్

జింక చర్మాన్ని ఉత్తరీయముగా కప్పుకుని, ఏ ఆయుధములూ లేకుండా ఆ ఖాండిక్య మహారాజుకు నివాసస్థలమైన అడవికి వెళ్ళాడు కేశిధ్వజుడు. ఆతని రాకను గమనించిన ఖాండిక్యమహారాజు యొక్క వేగులవాళ్ళు, ఆతని జండా కొయ్యను, జండాపైనున్న చిహ్నములను గమనించి, వచ్చేది కేశిధ్వజుడు అని తెలుసుకుని, కలయబడి అంటే అందరూ కలిసి బిగ్గరగా కూతలు పెట్టారు. అడవులలోనో, వేరే యితర స్థలాలలోనో రహస్యముగా నివశించేవాళ్ళ అనుచరులు గూఢచారులు రకరకాల కూతలతో అరిచి శత్రువుల రాకను గురించి హెచ్చరించడం నిరంతరమూ పోరాట రంగంలో ఉన్న వాళ్ళకు అత్యవసరమైన ఏర్పాట్లలో ఒకటి. దాన్ని సూచిస్తున్నాడు రాయలు.

ఆ కూతల మర్మమును తెలిసిన ఖాండిక్యుని అనుచరులైన ప్రజలు, ఆతనితో అడవులకు వచ్చినవాళ్ళు భయపడుతుంటే, ఖాండిక్యుడు బెదరకుండా ఆ ప్రజలను ఓదార్చడానికి, వారికి ధైర్యము చెప్పడానికి కొందరిని నియమించి, కొందరు విలుకాళ్ళను కొమ్మలమాటున, కొండచరియల మాటున నియమించి, కోపముతో బయటికి వచ్చాడు. తన రాజ్యాన్ని స్వాధీనము చేసుకుని, తనను అడవులపాలు జేసి అంతటితో ఆగక మరలా తన మీదికి వస్తున్నాడు అనే కోపముతో, రోషముతో, ధనుస్సును అందుకుని, బాణమును తొడుగుతూ

**ధన ధాన్య ద్విరదాశ్వ గోధన సమేతంబెల్ల సామ్రాజ్యమున్**
**గొనియుం జాలక తాటకేయ పలభు క్కూటాకృతిం జింకతో**
**లున నాఛ్ఛన్నుఁడవై ప్రశాంతుగతి మాలోఁ జొచ్చి ప్రాణంబులున్**
**గొన నేతెంచితె దుర్మతీ కెడపెదస్ఘ్గూరంపు భల్లంబునన్**

ధనము, ధాన్యము, ఏనుగులు, గుర్రములతో సమస్త సామ్రాజ్యాన్నీ తీసుకున్నది చాలక, తాటక కుమారుడైన, మాంసాహారి ఐన మారీచుడిలా, దొంగ జపం చేసుకునే మునిలా, ఋషిలా ఒక జింకతోలు కప్పుకుని, పెద్ద శాంతుడిలా వచ్చి మాలో దూరి ప్రాణములుకూడా తీద్దామని వచ్చావా? అంటే యింతకుముందే ధనమానాలు దోచుకున్నావు, చాలలేదా, ప్రాణములు కూడా తీస్తావా అని ధ్వని. ఓరి దుష్ట బుద్ధీ, ఈ క్రూరమైన బాణంతో నిన్ను నేలగూలుస్తా! అన్నాడు. ఆ మాటలను విన్న కేశిధ్వజుడు పెద్దగా '' త్వరపడకు, వెనకాముందూ ఆలోచించకుండా చంపడానికి నేను ఆకతాయిని కాను, నేను తలపెట్టిన యజ్ఞమునకు దురదృష్టవశాత్తూ విఘ్నము కలగడం వలన, ప్రాయశ్చిత్తమును తెలుపుమని ఋత్విక్కులను వేడితే, 'ఆ ఖాండిక్యమహారాజుకు తప్ప ఈ విఘ్నమునకు తగిన ప్రాయశ్చిత్తము వేరెవరికీ తెలియదు' అనడంతో వచ్చాను నేను, కోపముతో బాణం వేస్తానంటే వెయ్యి, నన్ను చంపినా, ఉపాయము చెప్పి పంపినా రెండు రకాలుగా నాకు మేలే నీ యిష్టం' అన్నాడు.

ఆ మాటలు విన్న ఖాండిక్యుడు ఆగిపోయాడు. చెట్ల చాటుకు వెళ్లి, తన మంత్రి, పురోహితుడు, శ్రేయోభిలాషులు ఐన వారందరికీ ఈ సంగతి చెప్పాడు. వారందరూ కూడబలుక్కున్నట్లు యిలా అన్నారు.

**పాలుగలవాఁ డు మనకొక**

**జాలి యిడక తానె తారసానకు వచ్చెన్**

**వేళ యిదె లెమ్ము నృప కృప**

**చాలు న్గారాకు మేపి చంపకు ప్రజలన్**

పాలివాడు మనను దయతలిచి, జాలి చూపించి, పెద్దగా కష్టపెట్టకుండా, తనంత తానే కయ్యానికి  ఒక్కడూ మన ముందుకు వచ్చాడు. యిదే సమయము. లేవయ్యా! చూపించిన దయ చాలు. ఆకులూ అలములూ మేపి జనులను చంపకు, వీడిని చంపి, హాయిగా మన రాజ్యానికి మరలా తీసుకెళ్ళి , విందు భోజనాలు తినిపించు! దాయాది దొరికాడు వేశేయ్, దయా, గియా పక్కన వేశేయ్ అన్నారు.

**అన్యాయంబున దుస్సహ**

**మన్యుండగు ప్రబలరిపుని మడియించిన ధ**

**ర్మన్యక్క్రుతి కగు నిష్కృతి**

**సన్యాయంబుగఁ బ్రజాళి సంరక్షింపన్**

యిలా ఒక్కడై, మన ఉపకారమును, సలహాను కోరివచ్చిన బలవంతుడైన శత్రువును నేరుగా ఎదిరించలేక, అన్యాయముగా కూటనీతిచేత చంపడం ధర్మమును తిరస్కరించడం అవుతుంది అంటావేమో, అలా చంపినా తర్వాత రెండు రాజ్యాల ప్రజలను న్యాయ మార్గములో ప్రేమగా పరిపాలించడం వలన ఆ అధర్మానికి నిష్కృతి, విరుగుడు చేసినట్లే అవుతుంది. కనుక, వీడిని అన్యాయముగానైనా సరే చంపేయ్! అని సలహానిచ్చారు.

**తనరాష్ట్రము చెడ వచ్చిన**

**ననిమిషపతి విప్రుఁ డనక యాచార్యుఁ  డ్రిశీ**

**ర్మనిఁ దునుమఁడె విడువుము దయ**

**నిను నమ్మిన ప్రజలు నవయ నీ దయ యేలా?**

తన రాజ్యము చెడిపోయినప్పుడు, అనిమిషపతి ఐన దేవేంద్రుడు బ్రాహ్మణుడు అని కూడా చూడకుండా, తనకు సాక్షాత్తూ గురువైన త్రిశీర్షుని చంపలేదా? దేవేంద్రునికే ఒక బ్రాహ్మణునిమీద లేని దయ నీకు నీ శత్రువైనవాడి మీద ఎందుకయ్యా, నిన్నే నమ్ముకొని నీతో వచ్చినవాళ్ళు నవిసిపోతుంటే నీ దయ ఏంటయ్యా అనవసరంగా? అన్నారు వారందరూ.

( విశ్వరూపుడు అనే మహర్షికి మూడు తలలు ఉండడం వలన త్రిశీర్షుడు అని కూడా పేరు. ఒకసారి దేవేంద్రుడు తన గురువైన బృహస్పతిని సరిగా గౌరవించకపోవడం వలన బృహస్పతికి కోపం వచ్చి కనిపించకుండాపోయాడు. గురువుగారి దయను కోల్పోవడం వలన దేవేంద్రునికి అసురులను అణచేశక్తి లేక, రాజ్యాన్ని, వైభవాన్ని, తేజస్సునూ కోల్పోయాడు. వెళ్లి బ్రహ్మగారిముందు వాపోయాడు. ఆయన త్వష్ట ప్రజాపతి కుమారుడైన విశ్వరూపుని ఆశ్రయించి ఆయనను ప్రస్తుతానికి గురువుగా స్వీకరించవయ్యా అంటే అలాగే చేశాడు దేవేంద్రుడు. విశ్వరూపుడు గురువై నారాయణ కవచాన్ని ఉపదేశించాడు దేవేంద్రునికి.

దేవేంద్రుడు మరలా పూర్వపు వైభవాన్ని, రాక్షసులమీద విజయాన్ని సంపాదించాడు. విశ్వరూపుని తల్లి రచన, తండ్రి త్వష్ట ప్రజాపతి. రచన దితి కుమార్తె. అంటే దైత్యుల సోదరి. కనుక తన మేనమామలైన దైత్యులను చూసీ చూడనట్టు పోతున్నాడేమో అనే అనుమానంతో విశ్వరూపుని మూడు శిరస్సులనూ దేవేంద్రుడు ఖండించి వధించాడు, బ్రహ్మహత్యా పాతకాన్ని పొందాడు. ఆ తర్వాత తపస్సు చేసి, ఆ పాతకాన్ని, ఆ అశుచిని నాలుగు భాగాలుగా చేసి, భూమిలో చవిటి నేలగా, నీళ్ళలో నురుగుగా, చెట్లకు జిగురుగా, స్త్రీలకు రజోదోషంగా పంచి, మరలా బృహస్పతిని శరణు వేడి, ఆయనను తిరిగి గురువుగా పొందాడు అని పురాణగాథ. రాయలవారి పురాణ విజ్ఞానానికి దృష్టాంతముగా క్లుప్తముగా త్రిశీర్షుని గాథను తెలియజేశాను)

**శిష్టు నిను నింత చేసిన**

**దుష్టాత్ముని బిలుకుమార్చి దురితము పిదపన్**

**నష్టంబుగ భూవల్లభ**

**యిష్టాపూర్తములు సేసి ఎసఁగఁగ రాదే!**

నీలాంటి సజ్జనుడికి యింతలు, వంతలు కలుగజేసిన ఆ దుర్మార్గుడిని అన్యాయముగానైనా సరే, వధించి, అంతకు కాకుంటే ఆ పాపాన్ని యిష్టాపూర్తాలు చేసి, అంటే యజ్ఞ యాగాదులు, బావులు,చెరువులు త్రవ్వించి దూరం చేసుకోరాదూ! అని సలహానిచ్చారు

ఖాండిక్యుని మంత్రులు, పురోహితులు, హితైషులు. రాక్షసనీతిని ఎలా రాజనీతిగా రాజుల చుట్టూ ఉన్న ఆశ్రితులు బోధిస్తారో, ఎలా తేలిగ్గా ఉపాయాలు, నివారణలు సూచిస్తారో తెలియజేశాడు రాయలు యిక్కడ. అంతే కాదు, చెప్పేవాళ్ళు ఎన్ని చెప్పినా ప్రభువు ఐన వాడు అందరినీ విని, తన మార్గాన్ని ధర్మ మార్గముగా, న్యాయ మార్గముగా ఎలా ఎంచుకుని మనుగడ సాగించాలో పరిపాలన కొనసాగించాలో కూడా ముందు ముందు ఖాండిక్యుని పలుకుల ద్వారా తెలియజేస్తాడు రాయలు.

రచనా సంవిధానములో ఒక చమత్కృతిని పొదిగాడు యిక్కడ. ఈ సలహాలు యిస్తున్నవాళ్ళు అందరూ గబగబా ఆత్రుతగా శత్రువును చంపెయ్యమని అడుగుతున్నారు, అలాంటప్పుడు తీరిగ్గా, నింపాదిగా దీర్ఘ వృత్తాలలో కాకుండా కందము, ఆటవెలది, తేటగీతులను ఉపయోగించడం రసజ్ఞత.అదే చేశాడు రాయలు, కంద పద్యాలలో గడ గడా సలహాలను గుప్పించాడు వారి నోళ్ళ వెంట.

ఖాండిక్యుని సహచరులు, మంత్రులు, శ్రేయోభిలాషులు ఆతనికి ఆలోచించడానికి, తాము గుక్క తిప్పుకోడానికి సమయం లేకుండా అవకాశము వచ్చినదే అరుదు అని తమ సలహాలను కురిపించారు.

**అవమతిఁ బితృఘ్ను లగుభూ**

**ధవుల వెదకి పిల్లపిల్ల తరము తునిమి భా**

**ర్గవుఁడు మునియయ్యె మరి వై**

**భవము వలదు శాంతికైనఁ బగ దెగ కగునే**

దుష్ట బుద్ధితో తన తండ్రిని చంపిన రాజులను వెతికి వెతికి పిల్ల పిల్ల తరము కూడా మిగలకుండా సంహరించి కూడా పరశురాముడు మునికాలేదా? కనుక నీ శత్రువును సంహరించిన తర్వాత కూడా నువ్వు మునివై ప్రశాంతంగా తపస్సు చేసుకో కావాలంటే. రాజ్యవైభవము నీకు అక్కర్లేదు, సరే, కానీ నీ పాలనను కోరుకునే నీ ప్రజలు శాంతితో జీవించడం కోసం అయినా పగ తీర్చుకోవడం అవసరము కదా. అంతే కాదు.

**పగయు వగయును లేక యేపాటి గన్న**

**నలరు సామాన్య సంసారి యగుట మేలు**

**మరి తగిలె నేని శాంతిచే మఱవఁ దగదు**

**రాజ్యభూమికఁ దాల్చిన రాజునకును**

పగ, వగ లేక ఏమాత్రము లభించిననూ ఆనందించే (యేపాటి గన్నన్ అలరు ) సామాన్య సంసారి అవడం మంచిదే, కాదనము, కానీ, రాజ్య భారాన్ని వహించే రాజుకు పగ వగ అంటుకుంటే శాంతి మంత్రాన్ని పఠించడం, పగను వగను మరచిపోవడం తగినపని కాదు. ఒక క్షత్రియునిగా తన భావాలను వెల్లడిస్తున్నాడు రాయలు ఇక్కడ. నాటకీయతతో ఖాండిక్యుని, ఆతని శ్రేయోభిలాషుల సంభాషణల ద్వారా సాహితీ సమరాంగణములమధ్య ఊయలలూగిన తన మనసును, తన యుద్ధవిజయ కాంక్షల వెనుక ఉన్న కర్తవ్య బాధ్యతల ఆంక్షలను తెలియజేస్తున్నాడు.

సమాజం శాంతియుతంగా ఉండాలి అంటే అశాంతికి కారణము ఐన వాడిని రాజు ఏరి పారేయాలి. కన్నుల పంటగా పంట పండాలంటే కలుపుమొక్కలను కర్షకుడు ఏరి పారెయ్యాలి. సైనికుడికి శాంత గుణం బలహీనత, బలము కాదు. మునికి తామసగుణము బలహీనత, బలము కాదు. పాత్రనుబట్టి పాత్రధారి ప్రదర్శన ఉండాలి. రాజు రాజుగానే ఉండాలి, అర్చకుడు అర్చకునిగానే ఉండాలి. సైనికుడు సైనికునిలా కరకుగానే ఉండాలి, ఉపాధ్యాయుడు జ్ఞానియై ప్రసన్నుడై ఉండాలి. బెరుకుగా ఉండడం రక్షక భటునికీ, కరకుగా ఉండడం జ్ఞానికీ నప్పదు. ఎవరి పని వారు ఏకాగ్రతతో చేయాలి, ప్రేమగా చేయాలి, బాధ్యతగా చేయాలి, అప్పుడు సమాజం అన్ని రంగాలలో ఆనందమయంగా ఉంటుంది, ప్రశాంతంగా ఉంటుంది. కనుక ఏ కాలంలో అయినా సమాజము మొత్తానికి ఒకే ఆదర్శము ఉండకూడదు, ఉండదు. వైదికమార్గఅనుయాయుల వికృత ధోరణులకు పరిష్కారముగా బుద్ధుని శాంతిమార్గం కొత్త బాటలు వేసింది. కానీ క్షత్రియులు కూడా శాంతి కాముకులై, యుద్ధ విరక్తులై, మధ్యభారత వీరయోధుల క్షాత్రం చచ్చిపోవడం వల్లనే వరుసగా విదేశీ దండయాత్రల పరంపర మొదలైంది. ఆసమయానికి జ్ఞానమార్గంలో ఉండాల్సినవాడు భ్రష్టుడైనాడు, వీరమార్గంలో ఉండాల్సినవాడు నిర్వీర్యుడైనాడు, తేలికగా విదేశీ ముష్కరులకు లొంగిపోవడం ప్రారంభము ఐంది. ఆ ప్రమాదమునుండే అర్జునుడిని శ్రీకృష్ణుడు రక్షించాడు, కేవలం మానవ మాత్రులైన క్షత్రియులుగా వారిని చూసినప్పటికీ.

వారిని వారించకుండా వారు చెప్పదలచినది అంతా చెప్పేదాకా ప్రశాంతముగా విన్నాడు ఖాండిక్యుడు. వారు ఆగిపోయినతర్వాత చిరునవ్వుతో తను మొదలుబెట్టాడు.

**మీ నొడివినయది కార్యం**

**బౌ నిప్పని సేయ రాజ్యమంతయు మనకున్**

**వానికిఁ బరలోకము జిత**

**మౌ నొక్కట, నిందు వాసు లరయఁగ వలయున్**

నిజమే. మీరు చెప్పినది చేయదగినదే. యిలా చేయడం వలన మనకు రాజ్యమంతా, వాడికి స్వర్గలోకము ఒకేసారి లభిస్తాయి. వీటిలో, రాజ్యము-స్వర్గము అనే ఈ రెండిటిలో తారతమ్యాన్ని గమనించవలసి ఉంది. నిజమైన నాయకుడు సంభాషించవలసిన తీరు యిది అని చెప్తున్నాడు రాయలు. మెత్తగా వారి వాదనలోని దోషాలను చెప్తున్నాడు రాజు.

**పరలోకసుఖము శాశ్వత**

**మరయ మహిరాజ్యసౌఖ్యమల్పానేహః**

**పరిభోగ్యం బిందుల కై**

**దురితము కావించి తొలగుదునె పరమునకున్?**

సరిగా చూస్తే పరలోక సుఖము శాశ్వతము. భూపాలకుడినై అనుభవించే సుఖము స్వల్పకాలికమైనది. (అల్పానేహః పరిభోగ్యంబు) అలాంటి తాత్కాలికమైన ఇహలోకపు సుఖము కోసం శాశ్వతమైన పరలోక సౌఖ్యాన్ని పోగొట్టుకుంటానా? (పోగొట్టుకోను!)

**బద్ధాంజలిపుటు దీనున్**

**గ్రుద్ధతఁ దనమఱుఁగు సొరఁగ గూల్చుట కడుఁ గీ**

**డుద్ధతి పరలోకార్జన**

**బుద్ధికి నను కండువాక్యములు తలఁపరొకో**

అంజలి ఘటించి దీనుడై తన ఆశ్రయముకోసం వచ్చినవాడిని క్రుద్ధుడై, గర్వించి, చంపడం పరలోకసౌఖ్యాన్ని కోరుకునేవాడికి మిక్కిలిగా కీడు కలిగిస్తుంది అని కండుమహర్షి పలుకులను గుర్తుకు తెచ్చుకోరా?

**అనుచు వెడలి వచ్చి యా రాజు నడిగి త**

**ద్ధర్మ నైచికీ వధక్రమంబు**

**దెలిసి, తగిన నిష్కృతి వచింప, నాతండు**

**మగుడఁ గ్రతువు సాంగముగ నొనర్చి**

ఆ విధముగా తన మంత్రుల, శ్రేయోభిలాషుల పలుకులలోని అధర్మాన్ని, తన ధార్మిక చింతనలోని మర్మాన్ని మృదువుగానే ఐనప్పటికీ, సునిశ్చయముగా తెలియజేసిన ఖాండిక్యమహారాజు బయటకు వచ్చి, కేశిధ్వజుడిని సమీపించి, యాగధేనువు మరణించిన కారణాన్ని వివరముగా అడిగి తెలుసుకుని, ఆ దోషానికి తగిన ప్రాయశ్చిత్త మార్గాన్ని తెలియజేయగా, కేశిధ్వజుడు తన రాజధానికి తిరిగివచ్చి, యాగశాలలో ప్రవేశించి, ఖాండిక్యమహారాజు చెప్పిన విధముగా చేసి, క్రతువును పూర్తిచేశాడు.

నిర్విఘ్నముగా యాగమును పూర్తి చేసుకుని, యాగానంతరం చేసే అవబృధస్నానం చేసి, ఋత్విక్కులకు పండితులకు ఇతరులందరికీ అనేక కానుకలిచ్చి, సంతృప్తి పరచి, అయ్యో! ఈ యాగమును నేను పూర్తి చేయగలిగానంటే ఆ ఖాండిక్యుని ఉపదేశముచేతనే కదా! ఆయనకు గురుదక్షిను ఇవ్వలేదు కదా, గురుదక్షిణ లేని యాగం ఎలా పరిసమాప్తం ఐనట్లు? అని ఆలోచించుకుని, మరలా అడవి బాటను పట్టాడు. మరలా వచ్చిన ఇతనిని చూసి నివ్వెరపోయిన ఖాండిక్యుని 'కంగారుపడకు మహానుభావా! నువ్వు గురువువై నాకు ఉపదేశం చేయడం వలననే నా యాగం నిర్విఘ్నముగా పరిసమాప్తం ఐంది, కనుక గురుదక్షిణ ఇవ్వడానికి వచ్చాను, నీకు ఏది కావలెనో అడగవయ్యా, ఇచ్చి ధన్యుడిని అవుతాను' అన్నాడు. ఖాండిక్యుడు మరలా తన వారిని సంప్రదించాడు. వారు సంతోషంతో ఎగిరి గంతులేసి, ఇన్నాళ్ళకు మనకు అదృష్టం కలిసివచ్చింది! ఇక ఆలోచించక నాలుగు సముద్రముల మధ్యనున్న భూమండలమునంతా గురుదక్షిణగా అడుగవయ్యా, మన దరిద్రం తీరిపోతుంది, సందేహించకు, బంధు మిత్ర జన రక్షణం కన్నా మిన్న ఐన ధర్మం ఏముంది?

**ఎన్నఁడు లావు గూడు మన? కెన్నఁడగుస్దరి? యయ్యె నేని పో**
**రెన్నిక యౌనె? పోరిన జయింప నశక్యము నీదు భాగ్యసం**
**పన్నతఁ జేరెఁ గార్య మిటు బంధు సుహృత్తతి కొక్క కీడు రా**
**కున్నటులుండఁ నె సిరులూరక చావక నోవ కబ్బునే?**

మనకెన్నడు బలము, బలగము సమకూరుతుంది, మనకెన్నడు సరి ఐన సమయం వస్తుంది పోరాటం చేసి ఈ కేశిధ్వజుని ఓడించడానికి! ఒకవేళ సమయము, బలగము సమకూరినా యుద్ధము చేయడానికే ఎంచుకోవడం వివేకమైన పని కాదు కదా, ఇంతకుముందు అన్నీ సమకూర్చుకునే వీడితో యుద్ధం చేసి కూడా పరాజయం పాలై అడవులవెంటబడి తిరుగుతూనే ఉన్నాము కదా!

నీ అదృష్టంకొద్దీ, మా అదృష్టంకొద్దీ యిలా కార్యము సానుకూలమయ్యే సమయము కలసివచ్చింది. బంధుమిత్రులకు ఏ కీడు వాటిల్లకుండా, ఎవరూ చావకుండా, నొవ్వకుండా రాజుకు సిరులు కలిసి రావడం అంటే ఎంత అదృష్టం! కనుక రాక రాక వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవయ్యా, రాజ్యాన్ని కోరుకోవయ్యా అన్నారు వారు.

ఖాండిక్య కేశిధ్వజ కథలోని పద్యాలను చదువుతున్నప్పుడు పోతన మహానుభావుని భాగవతంలోని వామనావతార ఘట్టంలో బలి, శుక్రాచార్యుల సంవాదం గుర్తుకొస్తుంది, ఖాండిక్యుని ఆప్తుల సలహాలు శుక్రాచార్యుని పలుకులను గుర్తుకు తెస్తే, ఈ పై పద్యం అచ్చు 'ఎన్నడు మాకు దిక్కుగలదెన్నడు దైత్యుని బాధ మాను, మేమెన్నడు వృద్ధి బొందగల మెవ్వరు రక్షకులంచు దేవతా కిన్నర సిద్ధ సాధ్య ముని ఖేచర నాయకులాశ్రయించి రాపన్నగతల్పు భూరి భవబంధ విమోచను పద్మలోచనున్' అనే పోతనగారి ఆంధ్ర మహా భాగవతంలో, సప్తమ స్కంధంలో హిరణ్యకశిపుని దుర్మార్గాలకు తల్లడిల్లే దేవతలు మొదలైనవారు వాపోయే సందర్భంలో చెప్పిన పద్యానికి కవలసోదరుడిలా ఉండడం గమనించవచ్చు. యిది రాయలవారు ఉద్దేశపూర్వకంగా చేసిందే, పోతనమహానుభావునిమీది ప్రేమ గౌరవముల కారణంగా, రాయలు ఆంధ్ర మహాభాగవత ప్రేమికుడు ఐన కారణంగా.

తన సన్నిహితుల మాటలను విని అమాయకులారా అన్నట్లు నవ్వి, మీరు అర్ధసాధన విషయంలో నేర్పరులు కానీ, మహా శాశ్వత సుఖదాయిని ఐన మోక్ష విద్యా మార్గ కుశలురు కారు, ఆ మహానుభావుడిని పరమార్ధ సంబంధమైన విషయాన్ని కోరుకోకుండా రాజ్యమును కోరుకొమ్మంటూన్నారా! నిమిచక్రవర్తి వారసులము, మాకు రాజ్య సుఖం లక్ష్యమా? ఆ కేశిధ్వజుడు ఉత్తమోత్తమ యోగసాధకుడు! ఆతనిని మోక్షవిద్యాసామ్రాజ్యమును దక్షిణ అడగాలి, సామాన్య రాజ్యమును కాదు అని బయటకు వచ్చి, కేశిధ్వజుని సమీపించి,నిజముగా నాకు దక్షిణ ఇవ్వడానికే వచ్చినవాడవైతే 'నాకు సమస్త ప్రాపంచిక దుఃఖములను నివారించే ఆ మహావిద్యను, ఆ యోగవిద్యను, ఆ ఆధ్యాత్మిక విద్యనూ దక్షిణగా ఇవ్వవయ్యా' అని అడిగాడు.ఆశ్చర్యమును, ఆనందమును పొందిన కేశిధ్వజుడు ఆధ్యాత్మిక విద్యను, ఆత్మానాత్మవివేక జ్ఞానవిద్యను బోధించడం ప్రారంభించాడు.

శ్రీకృష్ణదేవరాయల ఆధ్యాత్మిక, లౌకిక జ్ఞానానికి ఈ ఖాండిక్య కేశిధ్వజ ఘట్టం అత్యద్భుత ఉదాహరణ. యుద్ధము చేయని మాసమంటూ లేనివాడు, రాజ్యము చేసిన ఇరవై సంవత్సరాలలో (1509-1529) చేసిన ప్రతి యుద్ధములోగెలిచిన అపరాజితుడైన యోధుడు ఎంత జ్ఞానీ, రాజనీతివేత్త, తత్త్వవేత్త, సాహితీవేత్త అనేది తెలుసుకుంటే, తలచుకుంటే, విస్మయం కలుగుతుంది, వినమ్రులమై పాదాభివందనం చేయాలని కోరిక కలుగుతుంది. ఖాండిక్య కేశిధ్వజుల కథను విష్ణు పురాణంలోనుండి గ్రహించి, మూల కథకు తన రాజనీతి కుశలతతో, ఆధ్యాత్మిక జ్ఞానరహస్య విజ్ఞానంతో వన్నె తెచ్చాడు. రాయలగురించి ఎంత వ్రాసినా, ఎంత పొగిడినా తక్కువే, దైవాంశ సంభూతుడు, ఆధునిక ప్రపంచ మేటి చక్రవర్తులలో అగ్రగణ్యుడు రాయలు.
ఒకప్రక్కన ఈ వ్యాసము మరీ దీర్ఘమైపోతున్నది అనే భావము, మరొక ప్రక్కన విడిచిపెట్టడానికి వీలు లేని ప్రతి పద్యము, ప్రతి ఘట్టమూ కావడంతో క్లిష్టమైన స్థితిలో అత్యంత ముఖ్యమైన పలుకులనే మనం విమర్శ చేసుకుంటున్నాము.

కేశిధ్వజుడు ఉపదేశం ప్రారంభించాడు.

**ఆత్మ కాని మేన నాత్మ బుద్ధియును న**
**స్వంబునందు మిగుల స్వత్వమతియు**
**నవనివర! యవిద్య యను మహాతరువును**
**త్పత్తి కీ ద్వయంబు విత్తు మొదలు**

ఆత్మ వేరు, శరీరము వేరు. శరీరము నశించేది. ఆత్మ నిత్యమై రహించేది. నాది అంటూ ఏదీ లేదు, ఏదీ కాదు, నా శరీరముతో సహా, ఇల్లూ, వాకిలీ, దారా పుత్రాదులు అందరూ, అన్నీ కొద్దికాలపు చక్కిలిగింతలే, వీటినే అంటిపెట్టుకోవడం వల్ల వంతలే! మహా రాజా! శరీరమే ఆత్మ అనుకోవడం - స్వంతం కాని వాటిని స్వంతం అనుకోవడం ఈ రెండూ అవిద్య అనే మహా వృక్షమునకు బీజము వంటివి అని చెప్పడం మొదలుబెట్టాడు కేశిధ్వజుడు. '' అనాత్మన్యాత్మ బుద్ధి ర్యా అ స్వే స్వమితి యా మతిః అవిద్యా తరునం భూతి బీజమేతత్విధా స్థితం '' అనే విష్ణుపురాణం లోని శ్లోకాన్ని ఎంత యథాతథంగా, అలవోకగా, ఒక్క పదం ఎక్కువా తక్కువా లేకుండా సరళంగా అనువదించాడో గమనిస్తే రాయలకు జేజేలు పలుకకుండా ఉండలేము కదా! పురాణ శ్లోకానికి పై పద్యం అనువాదం అయితే 'ఉపనిషత్ శ్లోకాలు రెండింటికి ఈ క్రింది రెండు పద్యములు అనువాదాలు!

**నరనాథ! పాంచభౌతిక**
**శరీరమున దేహి మోహసాంద్రతమతమః**
**పరివృతుఁడై 'యే నిది నా**
**పరికర' మని యవధి లేని భ్రమఁబడి తిరుగున్**

ఓ రాజా! పంచ(మహా)భూతములతో తయారైన ఈ దేహములో మానవుడు దట్టమైన (సాంద్ర తమ) మోహమనే అంధకారంలో చిక్కుపడి(మోహ తమః పరివృతుడై) ' ఇది నేను, ఇది నాది ' అనే అంతం లేని భ్రమలో పడి పరిభ్రమిస్తాడు.

**ప్రాణికోటికెల్ల బంధంబు మోక్షంబు**
**చేరుటకును మనసు కారణంబు**
**విషయసంగియైన విను బంధకారి; ని**
**ర్విషయమైన ముక్తి విభవ కారి**

ప్రాణులకు బంధనాలకైనా, మోక్షానికైనా మనసే కారణమూ అవుతుంది. మనసు విషయ(ఐహిక)సుఖాల వ్యసనము లో తగులుకుంటే బంధకారి అవుతుంది, విషయ సుఖాలనుండి బయటపడగలిగితే ముక్తి వైభవానికి కారణం ఔతుంది. కనుక మనసును పట్టుకోవడంలోను, తుచ్ఛమైన విషయాలవైపు వెళ్ళకుండా ఉగ్గబట్టుకోవడంలోనూ ముక్తికి మూలం ఉంది. 'సా విద్యా యా విముక్తయే' ఏది విముక్తి కలిగిస్తుందో అదే విద్య. ఏది బంధనాలలో కట్టి పడేస్తుందో అదే అవిద్య. కనుకనే శరీరమే ఆత్మ అనుకోవడం, శాశ్వతాలు కానివాటిని శాశ్వతాలు అనుకోవడం అవిద్య, అంటే బంధనం. మన ఏవ మనుష్యాణాం కారణం బంధ మోక్షయోః అన్నది ఉపనిషత్తు. కనుక మనసే అన్నిటికీ, బంధనాలకూ మోక్షానికీ కారణం. అందలాలెక్కించినా, అధఃపాతాళాలకు తొక్కేసినా మనసే కారణం. 'ద్వే శబ్దే బంధ మోక్షాయ మమేతి న మమేతిచ, మమేతి బధ్యతే జంతుర్నమమేతి విముచ్యతే', 'నాది-నాదికాదు' అనే రెండు పదాలే బంధనాలకైనా విముక్తికైనా కారణాలు. 'నాది' అనుకోవడం బంధనానికి కారణం అవుతుంది, నాది కాదు అనుకోవడం విముక్తికి కారణం అవుతుంది, కనుక ఈ జ్ఞానముతో అవిద్యను దూరం చేసుకుని, విద్యను పొందాలి, అజ్ఞాన బంధాలను జ్ఞానమనే ఖడ్గముతో ఛేదించి విముక్తిని పొందాలి అని ఉపదేశించాడు కేశిధ్వజుడు. యమ, నియమాది అష్టాంగయోగ మార్గమును, నిరాకార - సాకార సాధనా విధానమును, మహావిష్ణు ప్రాశస్త్యాన్ని వివరముగా విశదీకరించి తనకు ఆత్మజ్ఞానబోధచేసిన కేశిధ్వజుడిని సాష్టాంగ దండప్రణామాలతో పూజించి, సత్కరించాడు ఖాండిక్యచక్రవర్తి.

నీవు చేసిన ఆధ్యాత్మికజ్ఞానదానము చాలు, అదే నేను కోరుకున్న దక్షిణ, నాకు ఇంకా ఏమీ అవసరము లేదు అని ఎంత వారించినా వినకుండా ఖాండిక్యునికి అంతకుముందు అతనినుండి తాను గెలుచుకున్న రాజ్యాన్ని దక్షిణగా సమర్పించాడు కేశిధ్వజుడు. ఇక్కడ ఒక ధార్మిక మర్మం ఉంది. తాను ఆధ్యాత్మిక జ్ఞానమును ఇచ్చాడు నిజమే కానీ, అది తన స్వార్జితము కాదు, ఆధ్యాత్మిక, వేదాంత జ్ఞాన సముపార్జన చేయడం, దానిని మరలా తరవాతి తరాలకు అందించడం ఒక బాధ్యత, హక్కు కాదు. ఆ ఆధ్యాత్మిక జ్ఞానము గురువులనుండి శిష్యులకు జీవనదిలా నిరంతరమూ ప్రవహించవలసిందే. అయితే ఇక్కడ ఒక అనుమానం రావాలి, ఖాండిక్యుడు చేసినదీ జ్ఞాన వితరణయే అయినా యాగకార్యానికి గురువైనాడు, ఆ యాగం నిర్విఘ్నముగా జరుగ గలిగే సూచనను చేసి, యాగము పూర్తి ఐన తర్వాత దక్షిణ ఇవ్వకుండా యాగ ఫలితము ప్రాప్తించదు కనుక దక్షిణ ఇవ్వడం. వేదవిజ్ఞానమంతా రెండు భాగాలు, కర్మ కాండ, జ్ఞాన కాండ. ఖాండిక్యుడు కర్మకాండకు ప్రతినిధి, కేశిధ్వజుడు జ్ఞానకాండకు ప్రతినిధి. కర్మకాండ అంటే వ్రతాలు, నియమాలు, యజ్ఞ యాగాదులు, పూజలు ఇత్యాదులు కోరుకున్న ఫలములను పొందడం కోసం చేయడం, అంటే ఐహిక ఫలములను కోరుకొనడం(కూడా)ప్రధానమన్నమాట. జ్ఞానకాండ ఏ ఐహిక ఫలితములను కోరుకొనకుండా కేవలం ముక్తిని ఆశించి చేసే సాధనాపరమైనది, ఇదే ఉపనిషత్తులు బోధించే మార్గము. అందుకనే ఈ ఇద్దరి పలుకులలో వారి వారి విధానాలకు సంబంధించిన వర్ణనయే చేశాడు రాయలు. ఖాండిక్యుడు పలికినవి కర్మకాండకు సంబంధించిన మెళకువలు, కేశిధ్వజుడు పలికినవి ఉపనిషత్తుల రహస్యాలు, రమణీయమైన రాయల మార్గంలో.

కర్మకాండా రహస్యాలను తెలిసినవాడు కావడం వలన, కేశిధ్వజునికి యాగ ఫలం దక్కడం కోసం, చేసేది లేక, తన రాజ్యాన్ని స్వీకరించిన ఖాండిక్యుడు వెంటనే దానికి తన పుత్రుడిని రాజుగా అభిషేకించి తాను మరలా అరణ్యమునకు వెళ్ళి యోగ మార్గములో నిరంతర మహావిష్ణు ధ్యానంలో పరమపదమును పొందాడు. కేశిధ్వజుడు తన రాజ్యమునకు వెళ్ళి నిరంతర పుణ్య కర్మలతో పాపక్షయము చేసుకుని, ప్రజా రంజకంగా పరిపాలించి పరమాత్ముని చేరుకున్నాడు.

' కనుక మహారాజా! మత్స్యధ్వజా! మహావిష్ణు భక్తిని మించిన మార్గం మరేదీ లేదు. భక్తి మార్గంలో ఆ స్వామిని అర్చించి తరించవచ్చు. కానీ ఇందులో ఒక ఇబ్బంది ఉన్నది. భక్తిమార్గ ప్రాప్తమైన పుణ్యము అనుభవించడానికి ఆ పుణ్యం కరిగిపోయేవరకూ జన్మనెత్తవలసినదే, 'అవశ్యమేవ భోక్తవ్యం కృతం కర్మ శుభాశుభం' అన్నారు కదా, చేసిన కర్మలు మంచివైనా, చెడ్డవైనా వాటి ఫలితాలను ఇష్టం ఉన్నా లేకున్నా అనుభవించవలసిందే. భక్తితో స్వామిని సత్ఫలితాలను కోరుకొనడం వలన, భక్తి ప్రపత్తులను చూపుతున్నాను అనుకోవడంవలన, నేను చేస్తున్నాను అనే కర్తృత్వ బాధ్యతను స్వీకరించడం వలన ఆ పుణ్యమును అనుభవించడం కోసం జన్మించడం తప్పదు.కనుక అర్జునునికి శ్రీకృష్ణ పరమాత్మ బోధించిన విధానంలో, శరణాగతి మార్గంలో, మంచీ చెడూ అన్నీ నీవే స్వామీ, ఆ కర్మములూ నావి కావు, ఆ ఫలితములూ నాకు వద్దు, చేసేదీ నేను కాదు, అనుభవించేదీ నేను కాదు అని 'కర్తృత్వ భావము'లేకుండా పాలముంచినా నీటముంచినా భారము నీదే అని సేవించి పునరావృత్తి రహితమైన పరమాత్ముని పదమును చేరుకోవచ్చు. కనుక మనసును మణులనుండి, రమణీమణులనుండి మాధవుని పాదములకు మరలించి తరింతువు గాక ' అని విష్ణుచిత్తుడు మత్స్యధ్వజ మహారాజుకు ఖాండిక్య కేశిధ్వజుల కథను వివరించి, మంత్రోపదేశం చేశాడు. ఒక చిన్ని వచనంలో అతి లోతైన ఆధ్యాత్మిక రహస్యాన్ని రమ్యంగా వివరించాడు రాయలు.

**ఊరీకృతపాండవరథ**
**సారథ్య సయూథ్యగోపశాబకసహకే**
**లీరత భక్త ప్రహ్లా**
**దారచితస్తోత్ర పులకితాంచిత గాత్రా!**

అంగీకరింపబడిన అర్జునుని రథ సారథ్యము గలవాడా! చెలికాళ్ళు ఐన గోపబాలకులతో క్రీడించడంలో ఆసక్తి కలిగినవాడా! ప్రహ్లాదునిచేత చేయబడిన ( ప్రహ్లాద ఆరచిత) స్తోత్రముచేత పులకించిన శరీరముగలవాడా! యిది ప్రహరేశ్వరపాత్రుడు మొదలగు అనేక యోధులచే, ఆకాశమును అంటే భారీ ప్రమాణము గల యుద్ధయంత్రములచే సంరక్షింపబడుచున్న 'కొండపల్లి' దుర్గాన్ని కొల్లగొట్టే కాలసర్పమువంటి ఖడ్గకాంతులచే వెలుగొందే మహోద్యమ భుజముగలవాడిని, కృష్ణదేవరాయలు అనే పేరును కలిగిన నాచే హృద్యమైన పద్యములచే రచింపబడిన 'ఆముక్తమాల్యద' అనే గ్రంథములోని మూడవ ఆశ్వాసము, వినుమయ్యా! అని శ్రీకృష్ణదేవరాయలు ఆముక్తమాల్యదలోని మూడవ ఆశ్వాసాన్ని ముగించాడు.

**శ్రీమందిర భుజమధ్యమ!**

**గోమండలకర్షి వేణుగుంఫన! దృప్య**

**ద్భౌమాహృతసురజనయి**

**త్రీ మణితాటంక! వృషగిరిస్థ! ఖగాంకా!**

'శ్రీ'కి, అంటే లక్ష్మీదేవికి మందిరమైన భుజమధ్యము, అంటే రెండుభుజములమధ్య నున్న వక్షస్థలము కలిగినవాడా, లక్ష్మీదేవిని హృదయములో నిలుపుకున్నవాడా! గోమండలాన్ని అంటే గోవుల మందలను ఆకర్షించే వేణు నాదమును పలికించేవాడా! దేవమాత ఐన దితి కుండలాలను లాక్కొని దర్పించేవాడు, భూదేవి పుత్రుడు ఐన నరకాసురుడినుండి తిరిగి స్వాధీనం చేసుకున్న దితి కుండలములను కలిగినవాడా! వృషభాచలవాసా! గరుడుడిని ధ్వజచిహ్నంగా కలిగినవాడా, శ్రీవేంకటాచలపతీ! వినుమయ్యా! అని ఆముక్తమాల్యదలోని నాలుగవ ఆశ్వాసాన్ని ప్రారంభించాడు శ్రీకృష్ణదేవరాయలు.

నూతన ప్రయోగాలకు రాయలు పెట్టింది పేరు అనడానికి ' శ్రీమందిర భుజమధ్యమ' అనే ప్రయోగం చక్కని దృష్టాంతం, ఆధునిక కవిత్వ ధోరణిలా ఉంటుంది ఒకోసారి రాయల దృష్టి, రాయలు తప్ప ఇలా ఆలోచించిన వాళ్ళు, ఇలా విశృంఖలంగా నిర్మోహమాటంగా కొత్త కొత్త ప్రయోగాలు చేసినవాళ్ళు బహుతక్కువ, ప్రబంధకవులలో కానీ, ఇతర పద్యకవుల్లో కానీ అంటే అతిశయోక్తి కాదు.

'గోమండల కర్షి' అనడంలో కూడా శ్లేష ఉన్నది, గోమండలం అంటే గోవుల మంద అని మాత్రమే కాక, 'గోలోక బృందావనం' అని సూచన. గోలోక బృందావనం అనేది వేరొకటి ఉన్నది, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల లోకములకన్నా ఆవల, ఎత్తున ఉన్న లోకం, ఆ లోక పాలకుడే త్రిమూర్తులను, ,మిగిలిన సకల లోకాలను పాలించే ప్రభువు, మిగిలిన దేవీ దేవతలందరూ ఆయనచేత సృష్టింపబడి, శాసింపబడే వారే అని భారతీయ ఆధ్యాత్మికశాస్త్ర సంప్రదాయం.

ద్వాపరయుగంలోని శ్రీకృష్ణుడు ఈ గోలోక బృందావన శ్రీకృష్ణుడు ఒకరు కారు, ఈయన కూడా ఆయన అవతారమే. ఆ గోలోక బృందావన శ్రీకృష్ణుడు నాలుగు వ్యూహాలతో సృష్టిని పాలిస్తాడు అని వైష్ణవ సంప్రదాయం. 'సంకర్షణ, వాసుదేవ, ప్రద్యుమ్న, అనిరుద్ధ' వ్యూహాలు అనేవి ఆ నాలుగు వ్యూహాలు, అందులో సంకర్షణ అంటే ఆకర్షణ అనే అర్ధము. సంకర్షణుడు అంటే బలరాముడు. దేవకీదేవి

గర్భములో ఉన్న ఏడవసంతానం మగశిశువు. ఆ శిశువును యోగమాయ సంకర్షించి అంటే ఆకర్షించి తెచ్చి నందుడి పెద్దభార్య ఐన రోహిణి గర్భంలో ప్రవేశపెట్టి, తను వెళ్లి దేవకీదేవి పొత్తిళ్ళలో పడుకుంది. మరునాడు దేవకీదేవి పొత్తిళ్ళలో ఉన్న ఆమెనుకూడా చంపడానికి కంసుడు నేలకేసి కొడితేనే ఆకాశానికి ఎగిరింది, అలా సంకర్షణ పదానికి బలరాముడిని, అంటే పరమాత్ముడిని సూచించడం కోసం 'గోమండల కర్షి' అనే ఈ రెండు పదాలను ఒకేచోట వేసి గోలోకబృందావన శ్రీకృష్ణ పరమాత్మను సూచిస్తూ, ఆయనే ఈ కలియుగ వేంకటాచలపతి అని చెప్తున్నాడు రాయలు. యిది రాయల ఆధ్యాత్మిక పరిజ్ఞానానికి సూచన. మొదలెట్టిన కథను ప్రారంభానికి అనుకూలంగానే నడిపించడం అనే నిర్మాణ చాతుర్యానికి ఉదాహరణ, ఎందుకంటే ప్రారంభంలోనే '..ఒక్కొక సంకేతముగాక అతడరసన్ నే గానే?' అని శ్రీకాకుళాంధ్ర మహావిష్ణువు అన్నాడు, ఒక్కొక అవతారం ఒక్కొక సంకేతమే గానీ, నిజానికి అన్ని అవతారాలూ నావే, నేనే అన్నీ, అందరిలోనూ నేనే అన్న సంగతి ఇక్కడ మరలా ధ్వనిస్తున్నాడు, అదీ రాయల చమత్కృతి. ఇక నరకాసురుడు దేవతలను ఓడించి, వారిని అవమానించడానికి వారి తల్లి ఐన దితి చెవికున్న కుండలాలను లాక్కోడం, శ్రీకృష్ణుడు నరకాసురుడిని సంహరించి, ఆ కుండలాలను తీసుకుని, మరలా దేవమాతకు అప్పగించడం కూడా పురాణగాథయే. ఇంతటి బహుముఖప్రజ్ఞ రాయలది!

ఎప్పుడైతే విష్ణుచిత్తుడు శ్రీమహావిష్ణువుకు సముడు గానీ ఆయనకన్నా అధికుడు గానీ లేరు అని వేదములనుండి, స్మృతులనుండి ఉపమానాలతో పలికాడో, అప్పుడు

**బలిమిం ద్రెంపఁగఁ బోలెఁ బాయపడుచుం బర్యాయ భంగంబునన్**
**గలనూలెల్లను నంచు మోపఁ దెగి రాగాఁ గొంతసేపుండి తాఁ**
**బెలుచ న్గంటు పుటుక్కునం దునిసి వే ప్రుధ్విం బడె న్జాలె మి**
**న్నుల మ్రోసెన్సుర దున్దుభుల్గురిసెఁ బెన్పోనై విరుల్పోరనన్**

బలవంతముగా ఎవరో తెంపడానికి ప్రయత్నించినట్లుగా పాయలు పాయలుగా క్రమంగా విడిపోతూ, దారాలు అన్నీ చివరిదాకా తెగిరాగా, అలా కొంతసేపు వ్రేలాడుతూ, గట్టిగా ముడేసిన తాడు తెగి, నేలమీద పడిపోయింది, బంగారు నాణాలు ఉంచి వ్రేలాడదీసిన జాలె, సంచీ. సురదుందుభులు మ్రోగాయి, పూల వర్షం కురిసింది ఆకాశంనుండి. దాటేసి పోవడం రాయలు అసలు చేయడు. గట్టిగా ముడి వేసి వ్రేలాడ దీసిన సంచీ ఒక్కొక్క పురి క్రమక్రమంగా తెగుతూ, చివరి దారం కూడా తెగి, త్రాడు పూర్తిగా విడిపోయిన తర్వాత ఒక్కసారిగా సంచీ నేలమీద పడిపోయింది అని చెప్పడం అందుకోసమేకాక, కనులముందు దృశ్యాన్ని కట్టినట్లు చూపించడం!

**వేద వేద్యమైన విష్ణుతత్త్వంబిట్లు**
**వాదు గెలిచి తెలిపి వసుమతీశు**
**భక్తి నోలలార్చి భగవత్ప్రపన్నుఁగాఁ**
**జేసి లోకహితము సేయుటయును**

వేదములలో చెప్పబడిన విష్ణుతత్త్వమును ఇలా తేటతెల్లముగా బోధించి, నిరూపించి వాదమును గెలిచి, రాజునూ భక్తి ప్రపన్నునిగా చేసి లోక హితం చేయగా ఆకాశంలో గుమికూడిన దేవతలు 'నిజం నిజం' అన్నారు, పితృదేవతలు 'అహో!అద్భుతం!' అన్నారు, సిద్ధులు ' ఆహా ' అన్నారు, ' కలియుగం కృతయుగం ఐపోయింది, ఎంత వింత!' అని విద్యాధరులు అన్నారు, 'దుర్జనుల బింకం అణిగిపోయింది' అని కిన్నరులు పలికారు, ఇలా దేవజాతివారందరూ మెచ్చుకున్నారు, ఓడిపోయిన పండితులు నొచ్చుకున్నారు.

ఓడిపోయి, భంగపడిన ఇతర పండితులు అసూయతో, అవమానంతో, యిక అక్కడ ఉండలేక చెప్పులెక్కడ? అంటూ తమ చెప్పులను వెదికే మిషతో కొందరు బయట పడ్డారు సభనుండి. తాము వచ్చిన పల్లకీలను గమనించకుండా 'పల్లకీలెక్కడ' అని పెద్దగా బోయీలను పిలిచారు కొందరు, నగరం దాటి కొంతదూరం వెళ్లి ఒకరినొకరు కలుసుకొనడం కోసం ఆగిపోయారు మరికొందరు. తమకు ఎదురైన పరిచితులను తమ ఇళ్ళు , వాకిళ్ళ సమాచారం అడిగిన కొందరు, ఎదుటివాళ్ళు ఇచ్చే జవాబులను అన్యమనస్కంగానే వింటూ ధ్యాస అంతా సభలో జరిగిన వాదం మీదనే పెట్టారు. వాదం ఏమైంది అని అడిగిన ప్రశ్నలకు, ఏమౌతుంది? రాజు పక్షపాతం చేశాడు, ఆ విష్ణుచిత్తుడు రాజు దయవలన గెలిచాడు అని తమ అసూయను వెళ్లగక్కారు కొందరు.

విష్ణుచిత్తులవారిని ఘనంగా సత్కరించి, ఈ మహానుభావుని ఏనుగుమీద ఊరేగించి ఇంటికి చేర్చండి అని రాజులను, రాజకుమారులను తోడిచ్చి పంపాడు మత్స్యధ్వజుడు. వారు ఏనుగుఅంబారీమీద ఘనంగా పురవీధులలో ఊరేగించి తీసుకెళ్తుండగా

**ఇంగిలికంబునం దడిపి యెత్తు కసీసపు రెంటెమో యన**
**న్నింగి గరుత్పరంపరల నిగ్గున లేఁదొగ రెక్క నంత వీ**
**చెం గలశాబ్ధిమీఁగడల జిడ్డెటిఁగించెడు కమ్మగాడ్పు నిం**
**డెం గడు మ్రోత పెన్దిరువడిం గని రా ఖగరాజు మూపునన్**

ఇంగిలీకపురంగులో, ముదురు ఎరుపురంగుద్రవంలో ముంచి తీసిన నీలిరంగు వస్త్రమో అన్నట్లు ఆకాశం ఎరుపు, నీలము కలిసిన వంగపండు రంగులోకి మారిపోగా, గరుత్మంతుని రెక్కల తాకిడికి అప్పటిదాకా ఆయన పాలసముద్రంలో ఉన్న కారణంచేత పాలమీగడ జిడ్డు గాలి సోకుతుండగా, అంతలోనే పెద్ద మ్రోతతో 'పెరియ తిరువడి' (పెన్దిరువడి)( పెరియ= పెద్ద, ఉత్తమమైన; తిరు= పవిత్రమైన; అడి= పదములు గల) గరుత్మంతుడు కనిపించాడు ఆకాశంలో, తర్వాత ఆయన మూపుమీద శ్రీమహావిష్ణువు కనిపించాడు. కాంతి ధ్వనికన్న వేగమైనది, కనుక ముందు గరుడుని రెక్కల ఎర్రరంగుతో కలిసి వంగపండు రంగులోకి మారిన ఆకాశం కనిపించింది, ఆ తర్వాత ఆ రెక్కల గాలి సోకింది, ఆ తర్వాత రెక్కల చప్పుడు వినిపించింది, అప్పుడు క్రింద వీధులలో ఊరేగుతున్న విష్ణుచిత్తులవారికి గరుడుడు కనిపించాడు, ఆయన వీపుమీది శ్రీమహావిష్ణువు కనిపించాడు ఆకాశవీధిలో.

రాయల ఊహాశక్తికి, పరిశీలనాశక్తికి, వర్ణనావైదుష్యానికి అద్భుతమైన ఉదాహరణ ఈ పద్యం.

**చిగురుఁ బొట్లపుదోయి జెందమ్ములనఁ దార్క్ష్య / హస్తోదరముల దివ్యాంఘ్రులమర**
**నునుఁ గప్పుమేనఁ దోఁచిన తదర్వచ్ఛాయ / లీలఁ దాల్చుపసిండి చేల మెరయ**
**వ్రాలిన యోగివర్గమునిర్మలాంతఃక / రణములువోలె హారములు తనర**
**సిరికిఁ బుట్టింటి నెచ్చెలు లౌఁట మనవికి / డాసెనా మకరకుండలము లమర**

**శ్రిత సిత మరాళ వాత్యాభిహత పరాగ**
**వలయమండిత కల్పశాఖలో యనంగ**
**శంఖచక్రాంచితోరు హస్తములు దనరఁ**
**దోఁచెఁ గమలేక్షణుండు చతుర్భుజుండు**

చివురుటాకు పొట్లాలలో ఉన్న ఎర్రతామరలా అన్నట్లు గరుత్మంతుని అరచేతులలో ఎర్రని పాదములనుంచి, (ఫుట్ బోర్డు మీద కాళ్ళు పెట్టినట్లు!) నీలిమేఘమువంటి శరీరానికి ధరించిన వస్త్రము మీద తను కూర్చున్న గరుడుని పసిడి రంగు ప్రతిఫలించిందా అన్నట్టున్న పట్టువస్త్రాలను ధరించి, భక్తితో వ్రాలిన యోగిగణముల అంతఃకరణములు అన్నట్లు ప్రకాశిస్తున్న, స్వచ్ఛమైన హారములు కలిగి, (మొసళ్ళు నీటిలో పుట్టినవే, శ్రీలక్ష్మి నీటిలోనే పుట్టింది, కనుక ) శ్రీలక్ష్మికి పుట్టింటి వైపునుండి స్నేహితురాళ్ళు కావొచ్చు అన్నట్లు ఏదో మనవి చేయడానికి చెవిదగ్గరికి వచ్చాయేమో అన్నట్లున్న మకరకుండలములను ధరించినవాడు, కల్పవృక్షముయొక్క శాఖలో అన్నట్లు విశాలముగానున్న, భక్తులను రక్షించడానికి సమర్థములైన బాహువులకున్న తెల్లని హంసవంటి శంఖమును, గాలికి ఎగురుతున్న పుప్పొడిని కలిగిన ఎర్రనిపూవేమో అన్నట్లు గిర్రున తిరుగుతూ మెరుపులు ఎగిసిపడుతున్న చక్రమును కలిగినవాడు,

తామరపూవులవంటి విశాలమైన, అందమైనకనులు కలిగినవాడు, చతుర్భుజుడు ఐన శ్రీ మహావిష్ణువు కనిపించాడు, విష్ణుచిత్తులవారి కళ్ళకు.

తన భక్తుని విజయాన్ని తన విజయముగా భావించిన భక్తవత్సలుడైన శ్రీహరి, తన భక్తునికి జరుగుతున్న అపూర్వ సత్కారాన్ని కనులారా చూడడం కోసం ఆకాశవీధులలో ప్రత్యక్షమైనాడు. అది చూసిన విష్ణుచిత్తుడు ఆయనను యిలా ప్రస్తుతించాడు.

**జయ జయ దానవ దారణ కారణ శార్ఙ్ఞ రథాంగ గదాసిధరా**
**జయ జయ చంద్ర దినేంద్ర శతాయుత సాంద్ర శరీర మహః ప్రసరా**
**జయ జయ తామరసోదర సోదర చారు పదోజ్ఝిత గాంగ ఝరా**
**జయ జయ కేశవ కేశి నిషూదన శౌరి శరజ్జలజాక్ష హరీ**

దానవుల సంహారానికి కారణమైనవాడా, శార్ఙ్ఞము అనే ధనుస్సును, చక్రమును(రథాంగము)కౌమోదకి అనే గదను, నందకము అనే ఖడ్గమును ధరించినవాడా నీకు జయము! అయుతి అంటే పదివేలు. శత అయుతి అంటే పదివేల వందలు, అంటే పదిలక్షలు. పది లక్షలమంది చంద్రుల చల్లదనాన్ని, పదిలక్షలమంది సూర్యుల తేజస్సును కలబోసి వెలువరించే కాంతిని కలిగిన శరీరమును కలిగినవాడా నీకు జయము! తన భక్తుల పట్ల చల్లని వెన్నెల వంటి కరుణను వర్షించడంలో చంద్రుని గుణమును కలిగినవాడు. తన శత్రువుల పట్ల తీక్షణమైన తేజస్సును, వేడిమిని, ప్రభావాన్ని కలిగించడంలో సూర్యునివంటి వాడు, కనుక చంద్రుని, సూర్యుని కలబోసిన కాంతిని వెలువరించే దేహమును కలిగినవాడు. ఈ విశేషణము కూడా ప్రత్యేకమైనది.

గోదాదేవి తన 'తిరుప్పావై' పాశురంలో మొట్టమొదటి పాశురంలోనే ' కదిర్ మదియంబోల్ ముగత్తాన్' అన్నది, పరమాత్ముడిని. అంటే చంద్రునివంటి, సుర్యునివంటి ముఖమును కలిగినవాడు అని, అదేభావాన్ని యథాతథంగా ఇక్కడ ఈ దివ్యమైన సంక్షిప్త స్తోత్రములో, కవిరాజవిరాజితము అనే ఛందస్సులో వెలువరించాడు శ్రీకృష్ణదేవరాయలు.
ఇది కూడా ఉద్దేశపూర్వకముగా చేసినదే. విష్ణుచిత్తులవారు చేసిన రెండు మహత్కార్యాలు విష్ణు మహత్యాన్ని ప్రపంచంలో చాటడం, తను చాటడం మాత్రమే కాక ఇంకా అద్భుతంగా, ప్రత్యక్షంగా, సాధనా మార్గంలో గురువులాగా ప్రపంచానికి మధురభక్తి మార్గాన్ని బోధించడానికి గోదాదేవిని పుత్రికగా పొందడం. మొదటిది అంటే మహావిష్ణు మహత్యాన్ని వెల్లడి చేయడం ఐపోయింది, ఇక మిగిలింది గోదాదేవిని కుమార్తెగా పొందడం, ఆమెను పరమాత్మునికి ఇల్లాలుగా చేయడం, కనుక రాయల మనసు వెంటనే గోదాదేవివైపు వెళ్ళింది, అందువలన ఆమె రచించిన పాశురాన్ని అన్యాపదేశంగా ప్రస్తావించాడు. భావి కథనూ సూచించాడు.

దేవగంగానదీ ప్రవాహమును వెలువరించిన, తామర పూవుఉదరములో నివసించే లక్ష్మీదేవికి సోదరుడైన చంద్రుని వంటి, చంద్రుని వెన్నెల వంటి పాదమును కలిగినవాడా నీకు జయము! గోలోకబృందావన నివాసి ఐన శ్రీకృష్ణుని పాదమునుండి గంగా దేవి ఉద్భవించింది అని దేవీ భాగవతములో వ్యాసమహర్షి చెప్పాడు. ఆ పురాణరహస్యాన్ని ఇక్కడ ప్రస్తావించాడు రాయలు. కేశవా, నీకు జయము. సర్వదేవ నమస్కారః కేశవం ప్రతి గచ్ఛతి, అంటే సర్వదేవతలకూ ఉద్దేశించిన నమస్కారములు కేశవునికే చెందుతాయి అని. ఎందుకంటే కేశవ నామములోని కకార, శకార, వకారములకు బ్రహ్మవిష్ణుమహేశ్వరులు ప్రతీకలు, ఆ త్రిమూర్తుల తత్త్వమే సమస్త దేవతలలోనూ నిండి ఉంది కనుక, కేశవా! నీకు జయము అన్నాడు విష్ణుచిత్తుడు. కేశి అనే రాక్షసుడిని సంహరించినవాడా, శరత్కాలములో వికసించిన కమలములవంటి కనులు కలిగినవాడా, హరీ! నీకు జయము అని మంగళాశాసనం చేశాడు విష్ణుచిత్తుడు. అద్భుతమైన సంగీత మాధుర్యానికి ఉదాహరణ ఈ చిన్ని స్తోత్రము, రాయల సంగీత సాహిత్య సమలంకృత రచనా విన్యాసానికి గీటురాయి.

ఇక్కడ విష్ణుచిత్తులవారి ద్వారా దశావతార వర్ణన చేసిన అద్భుతమైన పద్యాలను రాయలు అందించాడు. అన్నీ సాధ్యము కాదు కనుక ముచ్చటగా మూడు పద్యాలనూ మాత్రం రుచి చూద్దాము.

**దివిజద్వేషి నుదారవారిచరమూర్తిం ద్రుంచి చాతుర్య మొ**
**ప్పవడిం జొకపుఁ దెల్ల కొంచుగమి దంభం బొంద మైఁ దాల్చి వే**
**దవిశుద్ధాక్షరపంక్తిఁ గ్రమ్మఱఁగ వేధం జేర్చెదో నాఁగఁ ద**
**ద్భువనం బబ్ధిసితాంబుబిందు లలమంబ్రోద్యద్రుచిం దాఁటవే**

నీవు మత్స్యావతారమును ధరించి, వేదములను అపహరించిన రాక్షసుని సంహరించి, అప్పటికప్పుడే ఆ వేదములను తిరిగి బ్రహ్మకు అప్పగించడానికి అన్నట్లు వేగంగా వెళ్తుంటే ఆ వేగ సంచారానికి ఉవ్వెత్తున ఎగిసిన సముద్ర జలములు సత్యలోకాన్ని ఆక్రమిస్తుండగా, నీవు ఆ లోకాన్ని దాటితివి, అప్పుడు నీ మీన శరీరముమీది పొలుసులు తెల్లగా మెరుస్తూ శుద్ధ జ్ఞానపు చినుకులైన వేదపు పలుకులవలె తళతళలాడుతూ ఉన్నవి!

**పవిధారాపతనంబుఁ గైకొనని యప్పాలస్త్యుమైసప్తధా**
**తువులం దూఱఁ బరిశ్రమంబునకు నుద్యోగించె నా సప్తసా**
**లవిభేదం బొనరించి నిలవక సలీలంజన్న యుష్మన్మరు**

**జ్జవనాస్త్రం బొసఁగు న్సిరుల్ రఘుకుల స్వామీ రమావల్లభా!**

వజ్రాయుధపు వాడి అంచుల దెబ్బలను కూడా లెక్కచేయని ఉక్కు శరీరుడు రావణుని సప్త ధాతువులను అవలీలగా ఛేదించి నీకు సంతోషాన్ని చేకూరుస్తాను, నా బలం మీద, నా మాటలమీద నమ్మకం లేకుంటే , ఇదిగో చూడు అని సుగ్రీవునికి నమ్మకం కలగడంకోసం నీవు ప్రయోగించిన నీ బాణం, సప్త సాలవృక్షములనూ ఛేదించి అవతలికి దూసుకుపోయిన నీ రామబాణం మాకు సిరులను ప్రసాదించును గాక రామచంద్రా, లక్ష్మీపతీ! రామచంద్రుడిని రమావల్లభా, లక్ష్మీ పతీ అని సంబోధించడం విచిత్రంగా ఉండొచ్చు, గానీ వాల్మీకి వారు 'సీతా శ్రీరివ రూపిణీ!' సీత సాక్షాత్తూ శ్రీమహాలక్ష్మియే అని పలికారు, దాన్ని ఇక్కడ చమత్కారంగా ధ్వనిస్తున్నాడు శ్రీకృష్ణదేవరాయలు.

**ఆయత యుష్మదాక్రుతి కరాగ్ర నగాంచలవాంత వారి ధా**
**రాయుతచంద్ర కాంత ఫలకావళి బింబిత యై వెలుంగ నా**
**రాయణమూర్తి మత్కవచ రత్నముచే బరిరక్షఁ గాంచె నా**
**నోయదువీర! వృష్టిఁ బసి యూఅడ బ్రోవవె సప్తరాత్రముల్**

దేవేంద్రుడు నీమీద కోపముతో ఏడు రాత్రులు ఏకధారగా వర్షమును కురిపించినపుడు, గోవర్ధన పర్వతమును చేతి వ్రేలి కొసన ధరించి గోపకులను, గోవులను కాపాడినపుడు, నీ చేతివ్రేలి మీదుగా, పర్వతము మీదుగా, ఆ పర్వతమునందున్న చంద్రకాంత శిలలమీదుగా ఆ వర్షపు చినుకులు చుట్టూ జారిపోతున్నప్పుడు ఆ నీటి ధారలలో నీ రూపే ప్రతిబింబించి ఎటు చూసిననూ నీ రూపే కనిపించి, చుట్టూ నీ నారాయణమూర్తి ఒక కవచముగా, ఆ నారాయణకవచము ఆ గోవులను గోపకులను రక్షించినదేమో అన్నట్లు వెలుగొందినావు స్వామీ! నారాయణుడు అంటే నరములయందు అంటే నీటియందు నివశించేవాడు కనుక నారాయణుడు నీటిలో ప్రతిఫలించి కనిపించడం వలన నారాయణమూర్తి అనేది ఆయనకు సార్ధక నామధేయము ఐంది, నీటిలో కనిపించడం వలన అని రాయలు చమత్కారం చేస్తున్నాడు ఇక్కడ.

విష్ణుచిత్తులవారు ఆకాశ వీథిలో తనకు దర్శనమిచ్చిన శ్రీమహావిష్ణువు దశావతార ప్రస్తుతి చేస్తున్నాడు. ఈ పద్యం కల్క్యావతార వర్ణన. రాయల పాషాణ సదృశమైన పదబంధానికి, విచిత్రమైన కల్పనకు, మధ్య మధ్య ఇమిడ్చే ధార్మిక రహస్యాలకు చక్కని ఉదాహరణ ఈ పద్యం.

**ఘోరాపారమహాఘపంచకముఁ జక్కు ల్సేయఁగా నేర్పనా**

**ధారా పంచక ధావనం జెలఁగు గంధర్వంబుఁ ద్రొక్కించు బ**

**ల్బీరంపున్నెఱరౌతుఁ గీకట శరాళీవారవాణీ భవ**

**ద్దోరుద్భ్రాంతక్రుపాణికాద్వితయ విద్యుద్గ్రంధి నిం గొల్చెదన్**

ఘోరమైన, అపారమైన మహా అఘ పంచకం అంటే ఘోరమైన నీచమైన ఫలితాన్ని దాటడానికి శక్యం కానీ పంచమహా పాపాలు. 'బ్రహ్మహా హేమహారీచ సురాపో గురుతల్పగః మహా పాతకినోహ్యేతే తత్సంసర్గీచ పంచమః' అని వేదవ్యాసులవారు కూడా దేవీభాగవతంలో చెప్పారు. ఇతరత్రా కూడా పంచ మహాపాతకాలు అని పిలువబడే ఐదు మహా పాపాల జాబితా ఉంది. బ్రహ్మహత్య, బంగారాన్ని దొంగిలించడం, సురాపానం చేయడం, గురుతల్పాన్ని పంచుకోవడం అంటే గురుపత్నితో కామసుఖాన్ని పొందడం యివి నాలుగు మహా పాపాలు. ఈ పాపాలలో దేన్నైనా చేసినవాడితో కలిసి తిరగడం, స్నేహం చేయడం ఐదవ మహాపాపం! గురుపత్ని అంటే కేవలం విద్య నేర్పిన గురువుగారి భార్య అని మాత్రమే అర్థం కాదు. జన్మనిచ్చినవాడు, పిల్లనిచ్చినవాడు, అన్నం పెట్టినవాడు, ప్రాణ రక్షణ చేసినవాడు, విద్యనేర్పినవాడు ఈ ఐదుగురూ గురుస్థానీయులు, మహా గురువులు అని ధర్మశాస్త్ర నిర్దేశం. వీరి స్త్రీలను అంటే కుమార్తెలు కానీ, భార్యలుకానీ, వారిని కామించడం మహాపాపం, కనుకనే కచుడు దేవయానిని బ్రతిమిలాడి తిరస్కరించాడు.

ఈ ఐదు రకాలైన మహా పాపాలను చెక్కులు చెక్కులుగా ఖండించడం నేర్పడానికి అన్నట్లు ఐదురకాలుగా తన అశ్వాన్ని గంధర్వంబు త్రొక్కించే భలే బీరపు నెర రౌతు(అశ్వికుడు) అంటే కల్కి. గంధర్వము అంటే గుర్రం. ధార అంటే గుర్రపు పరుగు అని ఒక అర్థం. గుర్రపు పరుగు ఐదు రకాలు అని పెద్దల వివరణ. అస్కందితము, ధౌరితకము, రేచితము, వల్లితము, ప్లుతము అనే ఐదురకాల పరుగులు తీస్తుంది అశ్వము. ఐదురకాల మహా పాపాలను తుత్తునియలుగా ఖండించడం నేర్పడానికా అన్నట్టు ఐదురకాల పరుగులు తీస్తున్న గుర్రమునెక్కి కీకటులు అంటే మ్లేచ్చుల శరపరంపరను అడ్డుకుంటున్న కవచము(వారవాణి)లాగా ఉన్న భుజములయందు రెండు విచ్చుకత్తులను తిప్పుతూ మెరుపులమాలికముడిలా ఉన్నవాడవైన నిన్ను కొలిచెదను స్వామీ!

తనమీదికి వస్తున్న శరపరంపరను అడ్డుకోడానికి రెండుచేతులలో విచ్చుకత్తులను ధరించి వాటిని గుండ్రంగా తిప్పుతుంటే, ఆ ఖడ్గ చాలనమే ఒక కవచంలా ఉండి బాణాలు తగులకుండా, గాయపడకుండా కాపాడుతున్నాయి ఆ అశ్వికుడిని, కల్కిని. గుండ్రంగా విద్యుల్లతలలా మెరుపులు మెరుస్తూ ఆ విచ్చుకత్తులు తిరుగుతున్నాయి ఒక మాలలా. ఆ మాలమధ్యనుండి కనిపిస్తున్న శిరసు ముడిలా ఉంది కనుక విద్యుద్గ్రంధి అంటే విద్యుత్తు ముడిలా ఉన్నాడు కల్కి. పంచమహాపాపాచరణము జీవనవిధానమైనప్పుడు, ఆ పాపులను సంహరించడానికి అవతరించే కల్కిని ఈ రకంగా భక్తుడు స్తుతి చేస్తే, భగవంతుడు ఇలా అంటున్నాడు.

అని నుతియింపఁగా హరి సుధాశనవర్ధకిఁ జూచి 'పాండ్యుఁ డి
చ్చినధన మిమ్మునీశ్వరుఁ డశేషము భాగవతాస్మదీయ గే
హనివహసాత్కరించి యకటా! కడు రిక్తత నొందు నే తదీ
యనిలయ మప్పురిన్మణిమయంబును సార్థము జేయు నావుడున్

ఆ విధముగా కల్క్యావతారములో దర్శనమిచ్చే తనను నుతి చేయగా, హరి 'సుధాశనవర్ధకి'ని అంటే అమృతమును ఆహారముగా కలిగిన దేవతల వర్ధకి అంటే వడ్రంగి, అంటే విశ్వకర్మను చూసి, పాండ్య రాజు యిచ్చిన ధనమును యితడు భాగవతులకు, అస్మదీయ గేహమునివహములకు అంటే దేవాలయాలకు సాత్కరించి అంటే ఖర్చు జేసి, ఏమీ మిగలకుండా చేస్తాడు, నువ్వెళ్ళి అతని నిలయాన్ని, ఆ పురాన్ని మణిమయంగా, ధనసహితమైనదానిగా చేయవయ్యా అని ఆజ్ఞాపించాడు.

**విశ్వకర్మయునట్ల కావించె నంత**
**నంబుజాక్షుఁడు నమ్ముని నాదరించి**
**యీక్షణాగోచరుండయ్యె ఋషియు నేఁగి**
**పౌరులు భజింప విల్లిపుత్తూరి కరిగె**

శ్రీహరి ఆజ్ఞ ప్రకారము అలాగే చేశాడు విశ్వకర్మ. కమలలోచనుడైన కమలాకాంతుడు ఆ మునిని(విష్ణుచిత్తుడిని) ఆదరించి, ఆశీస్సులందించి అంతర్ధానం చెందాడు. విష్ణుచిత్తుడు తనను పౌరులు సేవిస్తుండగా విల్లిపుత్తూరుకు చేరుకున్నాడు.

స్థానికులు తన్ముని దిద్రు
క్షా నందితు లగుచుఁ బురముఁ గైసేసి ప్రజ
ల్తో నరుగ నాగవాసము
తో నెదురుగ నేఁగి రంత తూర్యములులియన్

విల్లిపుత్తూరు పట్టణ స్థానికులు ఆ ముని(తుల్యుడైన) విష్ణుచిత్తుల దర్శనము చేత ఆనందపడ్డారు. స్థానికులు అంటే దేవస్థాన అధికారులు అని ఒక విశేష అర్థము కనుక విల్లిపుత్తూరు దేవాలయ అధికారులు, ఆ పట్టణ సామాన్య ప్రజలు కూడా ఆయనను దర్శించుకుని ఆనందపడ్డారు, తమ దేవాలయానికి, తమ పట్టణానికి అంతటి కీర్తిని తెచ్చిన మహాభక్తుడు తమ ఊరి వాడైనందుకు.

కైసేసి అంటే అలంకరించి అని. ఆయనకు స్వాగత సత్కారాలు చేయడం కోసం పట్టణాన్ని చక్కగా అలంకరించారు. దేవాలయ అధికారులు పౌరులను వెంటబెట్టుకుని, బోగమువారి మేళముతో (నాగవాసము) ఎదురేగి, మంగళ వాయిద్యములు మ్రోగుతుండగా స్వాగతం పలికారు.

ఇక్కడ పదిహేను వాక్యముల సమ్మిళితమైన ఒక మహా వచనములో ఆ స్వాగతము పలికిన తీరును, ఊరేగింపును గొప్పగా వర్ణన చేశాడురాయలు. రాయల వర్ణనా వైచిత్రికి గొప్ప ఉదాహరణ యిది.

ఎదురేగి, పరివట్టం, పవిత్రమైన తీర్థము, భగవత్ప్రసాదములను కానుకలుగా విష్ణుచిత్తులకు సమర్పించి సాష్టాంగ దండప్రణామములు చేసి, లేచి, బంగారంతో చేసిన బ్రహ్మరథం పట్టారు. బ్రాహ్మణులచేత లాగబడే రథము బ్రహ్మరథము! ఆ బ్రహ్మరథములో కూర్చోబెట్టి ఊరేగింపుగా తీసుకువెళ్తుంటే ఆ పట్టణవాసులు, చుట్టుప్రక్కల పల్లెలవాళ్ళు వెంట నడిచారు.

మృదంగము, తోలుతిత్తి వంటి వాయిద్యము, రుంజ, తంబుర, కంచు తాళాలు, ఉరుమ, కిన్నెర అనబడే తంత్రీ వాయిద్యము, సన్నగాళె, వీణ, ముఖవీణ(మోర్సింగు)పిల్లనగ్రోవి, డోలు, నాగసరం, భేరి, కాహళి,తుడుము, తప్పెట్లు, తాళములు, మొదలైన వాయిద్యములు లెక్కలేనన్ని గొప్పగా మ్రోగుతుండగా నృత్తగీతములు, వాయిద్యములు, నాట్యము అనే మూడువిధములైన మంగళ సూచకములైన కళారూపాలతో ఊరేగింపు జరిగింది.

మధ్య మధ్య నాట్యగత్తెలు ఎదురెదురు తిరుగుతూ నాట్యం చేస్తుండగా, దూరపట్టణాలనుండి తెచ్చిన ఏనుగులు, గుర్రముల కంఠములలోని ఘంటల మ్రోతకు జోడువాయిద్యాల్లాగా సుందరీమణుల అందెలు ధ్వనులు చేస్తుండగా మెల్ల మెల్లగా ఊరేగింపు సాగింది.

రంగురంగుల కంబళ్ళు కప్పి అలంకరించిన ఆడ మగ ఏనుగులు, బంగారు అంకుశములను ధరించిన మావటివాళ్ళు, దేశ దేశాల రాజులూ, సామంతుల గుంపులను చూసి ఒకరిని ఒకరు అతిక్రమించి దండాలు పెడుతూ, కండ్లు మెరిసిపోతుండగా ఎదురు తిరిగి తిరిగి పొగడ్తలు చేయడానికి పోటీ పడుతూండగా బ్రహ్మాండమైన ఊరేగింపు జరిగింది.

ఆ రాజకుమారులు తమకు, అక్కడి స్త్రీలకు 'పాత పరిచయాలున్నవారు' కావడంచేత పరిహాసంగా బోగం మేళం లోని వేశ్యా స్త్రీలపై వేస్తున్న నెపంతో తమకు గ్రామ గ్రామాల అధికారులు తెచ్చి ఇచ్చిన నారింజలు, మాదీఫలాలు, నిమ్మపండ్లు, మొల్లల బంతులను అంతకుముందే తాము అనుభవించి ఆనందించి పరిచయం ఉన్న చంద్రముఖులపై వేస్తూ నడుస్తుండగా సరసంగా ఊరేగింపు జరిగింది.

ఆ పండ్ల, పూల విసురులను తప్పుకుంటూ, సాభిప్రాయమైన, చంచలములైన చూపులను, తొట్రుపాటుతో ప్రసరిస్తూ, విశాలమైన కనుల చివరలనుండి చూస్తూ, కొప్పులు తొలిగిపోతుంటే, ఆ సమూహంలో మద్దెలలు వాయిస్తున్న వారి చాటున దాక్కుని మాయమైపోతూ, ఆ పట్టణ బోగంమేళంలోని స్త్రీలు, నాగరికులు చూస్తుండగా కోపంవచ్చినట్లు, ఆశ్చర్యాన్ని నటిస్తున్నట్టు, చిత్ర విచిత్ర గతులలో అడుగులేస్తూ

మద్దెలలు వాయిస్తున్నవారు వాయించడానికి ముందుకు వంగినప్పుడు ఇక తప్పించుకోలేక కంటబడుతూ, తమ మీదికి విసురుతున్న నారింజలు, నిమ్మపండ్లు, పూలు మొదలైన వాటిని వారించడంలో ఆసక్తి లేనట్టు కొప్పులు సవరించుకుంటున్నట్లు నటిస్తూ, చెవులకు ఉన్న ఆభరణాలు కదులుతుండగా, చెక్కిళ్ళపై మల్లెమొగ్గలవంటి నవ్వుల వెన్నెలలు కురిపిస్తున్న కుందనపు బొమ్మల కూర్పుతో ఊరేగింపు సాగింది.

ఆ ఊరేగింపులో వస్తున్న వాక్చాతుర్యము గల వృద్ధవేశ్యలను, వారి ప్రక్కన నడుస్తున్న తరుణీమణులను చూసి, వృద్ధవనితలు నమస్కరిస్తుంటే ఆ యవ్వనవతులు తమకు వీరికి అంతకుముందు కలిగిన సంపర్కాన్ని, పొందును గుర్తు చేసుకుని నమస్కరించకుండా నడవడం చూసి, తమ చుట్టుప్రక్కల తమతమ ప్రభువులు లేకపోవడం వలన సామాన్యజనులను లక్ష్యపెట్టకుండా ' నృత్య గీత వాద్య గాన కళలలో అనుభవమున్నవాళ్ళు వయసులో పెద్దవాళ్ళు మీరు నమస్కరిస్తుంటే ఈ లేత జవరాళ్ళు నమస్కరించరేమిటి? వాళ్ళతో నమస్సులు చేయించండి' అని బింకపు సరసాలాడుతూ నడుస్తున్న సరదారాయుళ్ళతోకూడిన సరసపు ఊరేగింపు జరిగింది.

చప్పున లేత నవ్వులు మొలుస్తుండగా, ఆ నవ్వును అందంగా అదిమిపడుతూ, ఆ రాకుమారులకు – తమకు చనువు, పరిచయం, సంబంధం ఉన్న కారణంగా తమ తమ గొప్పదనాన్ని ప్రక్కల నడుస్తున్న ఇతర సుందరీమణులకు తెలిసేట్లుగా నిర్లక్ష్యంగా, కొంత ఆశ్చర్యంగా చూస్తూ, ' ఏ .. పో ' అన్నట్లు మూతులు ముడిచి, పెదాలు బిగించి ఈసడింపుగా ధ్వనులు చేస్తున్న యవ్వనవతులైన వారకాంతలను ఆ వృద్ధ వేశ్యాస్త్రీలు ' అర్రర్రే! సంపద దొరుకుతున్నది! మన పంట పండబోతున్నది అనే ఉద్దేశంతో 'మన పాలిటి పెన్నిధులు, మన ప్రభువులు, హన్నా! ఏంటానిర్లక్ష్యం? మొక్కండి, మొక్కండి ' అని ముందుకు నెడుతుండగా ముచ్చటైన ఊరేగింపు సాగింది.

సిగ్గుతో కనులు చలించిపోతుండగా, ఆ వృద్ధస్త్రీలు బలవంతంగా దండాలు పెట్టిస్తుంటే, విరసంగా వ్రేళ్ళు ఎడంగా, ఎడమొగం పెడమొగంగా మొక్కి, ఆ వృద్ధస్త్రీల సల్లాపాలు ఎంతకూ తెగకుండా జిగురుకండెల్లా సాగుతుంటే, గొల్లుమని నవ్వుతున్న ఆ ముసలి స్త్రీలను కపటకోపంతో కొడుతూ, దొంగకోపంతో ఆ రాజకుమారులను కడగంటి చూపులు చూస్తూ మాయమవుతున్న ఆ జింకకన్నుల వన్నెలాడుల కరభూషణధ్వనులు చేస్తున్న క్రేంకారములు ఆ పద్మముఖుల ముఖపరిమళములకు వచ్చి చేరిన తుమ్మెదలు చేస్తున్న ఝుంకారములను ధిక్కరిస్తుండగా సరసశ్రీకారమైన ఊరేగింపు సాగింది.

చెవులకు సంకుపూసలు, లోపలి వంచుకున్న భుజాలకు కావిపట్టిన దుప్పట్లు కలిగి, వంకర సిగలతో, వృద్ధాప్యములో స్వస్థలాలను వదిలి, ఆ విల్లిపుత్తూరు చేరుకొని, అక్కడి సజ్జనుల స్నేహము వలన బంధువులను, మిత్రులను మరిచిపోయి, బుక్కాయి చేయడం, పుష్పమాలికలను చేయడం శ్రద్ధగా నేర్చుకుని చేస్తున్న, ఆంధ్ర దేశమునుండి వచ్చిన బుక్కాయివాళ్ళు చిన్నిచిన్నపద్యాలతో, స్తోత్రాలతో చేతులుసాచి చేస్తున్న దండాలతో, ఏనుగులు గుర్రాలమీద వస్తున్న రాకుమరులమీద, యువతీ మణుల మీద కురిపిస్తున్న బుక్కాయి ఆకాశాన్ని కప్పేస్తుండగా, పన్నీటి తిత్తులతో ధారలుగా కురిపిస్తున్న పన్నీటికి వాయిద్యాలు తడిసిపోయి వాటిని వెచ్చన చేయడానికి నిప్పుకోసం వెదుకుతున్న వాద్యగాళ్ళతో కూడిన విశిష్టమైన ఊరేగింపు కొనసాగింది.

ఆ సమయంలో సాగుతున్న నాట్యమును చూడడానికి వచ్చి మెల్లమెల్లగా అడుగులేస్తున్న యువతీమణులు తాము, ఆ విటులు సమయాన్ని చూసి, మార్గ మధ్యంలో ఉన్న ఉద్యానవనములలోని వృక్షములను ఒరుసుకుంటూ పారుతున్న కాలువలలోకి దిగారు. ఆ కాలువలలో చెంగలువలు విరబూసిఉన్నాయి. ఒడ్డున విరగబూసిన రెల్లుపూల తెల్లదనం ప్రతిబింబించి తెల్లగా మనోహరంగా ఉన్నది ఆ కాలువలలోని నీరు. గేదె పెరుగు, మీగడతో దట్టంగా కలిపి, ఉప్పుతో ఎండబెట్టిన నారింజలు, అల్లపు ముక్కలతో కలిపిన చద్దిని పోకపొత్తులలో పెట్టుకుని తినడానికి కూర్చున్నారు.

ఆ తినడానికి కూర్చున్నవారిని తిండి కోసం తిరిగి తిరిగి యాచించే దాసరివాళ్ళ గుంపు 'గోపాల భిక్ష' వేయండి అని అడిగి, ఒడ్డున ఉన్న దీపపు స్తంభాల వద్దకు చేరి తింటున్నారు. ఆ దీపపు స్థంభాలకు ఉన్న కుండీలనుండి పడుతున్న ధగ ధగలాడే దీప జ్వాలల వేడిమికి, కుండీలలో ఉంచిన సాంబ్రాణి కోసం ఉన్న నిప్పులకు వాయిద్యాలు తడిసిపోయిన వాళ్ళు తమ తమ వాయిద్యాలను వేడి చేసుకుని నాదాన్ని పరీక్షించుకుంటున్నారు. ఆ ధిమి ధిమి ధ్వనులకు కాలువకు ఇవతలివైపు, అవతలివైపు ఉన్న ఉద్యానవనములలోని చిలుకలు బెదిరి అటునుండి యిటు, యిటు నుండి అటు అదేపనిగా ఎగురుతూ ఉంటే పచ్చని తోరణాలలాగా కనిపిస్తున్నాయి. వాయిద్యాల సంగీత ధ్వనులకు తలలూపుతూ, చప్పట్లు కొడుతూన్న ధ్వనులుతప్ప పాటలు ఎంతమాత్రమూ వినబడకుండా పోతున్నాయి. ఆ ఊరేగింపును అనుసరించి భాగవతులు మైమరచి వస్తున్నారు.

గ్రామాలలో జరిగే సంతలకు వెళ్ళడంకోసం గొప్పింటి వాళ్ళు కొన్న ఆడ గుర్రాలు ప్రసవించిన గుర్రపు పిల్లలు, పొడవాటి త్రాళ్ళచే కట్టబడి, చవిటి నేలలలో పచ్చికను కొరుకుతూ నీడను చూసినా బెదిరిరిపోయే గుర్రపు పిల్లలు చక్కని జీనులచే, గజ్జెలచే అలంకరింపబడి ఉన్నాయి. చలువచేసిన అందమైన తెల్లని వస్త్రాలతో అలంకరించుకున్న సాలెవాళ్ళు, అగసాలేవాళ్ళు(స్వర్ణకారులు)పట్నాలు సాలెవాళ్ళు, పల్లె కోమట్లు, గోనెలు నేసేవాళ్ళు, చాపలు నేసేవాళ్ళు, వారి వారి స్త్రీలు ఆ ఊరేగింపులో గుంపులు గుంపులుగా వస్తున్న ఏనుగులు, గుర్రాలను చూసి బెదిరి ఎత్తి పడేస్తూ, అడ్డు వచ్చిన వాళ్ళను తొక్కుతూ పారిపోతున్న పిల్ల గుర్రాల వలన, పల్లీయులు తొక్కిసలాడుతూ ఊరేగింపును ఉత్సవాన్ని చూడకుండానే పారిపోతున్నారు.

ఆ తొక్కిసలాటకు ముసలి స్త్రీలు, యువతులు, రోగపీడితులు, బలహీనులు ఇబ్బందిపడుతూ తిట్లు లంకించుకుంటుంటే కిమ్మనకుండా ప్రాణాలు అరచేతులలో పట్టుకుని పారిపోతూ, సమీపంలో ఉన్న దమ్ము చేసిన వరిమళ్లలో దిగబడి, పైకి రాలేక, లోపలి పోలేక సతమతమై పోతున్న వాళ్ళను చూస్తూ చప్పట్లు కొడుతూ పరిహాసం చేస్తూన్న ధ్వనులు చుట్టుప్రక్కలనున్న వనాలలో, ఉపవనాలలో ఉన్న చెట్లలో ప్రతిధ్వనిస్తున్నాయి. ఈ విధముగా కొనసాగిన ఊరేగింపులో విష్ణుచిత్తముని వైభోగముగా, దేవాలయ అధికారులు తెచ్చిన స్వర్ణమయమైన రథంలో, పురప్రజలందరూ తోడురాగా గొప్ప ఊరేగింపుగా పట్టణానికి చేరుకొని, దేవాలయము ముందు రథమును దిగి, దేవదేవుడిని సేవించి, స్వర్ణమయమైన తన గృహమును చేరుకొని, పూర్వముకన్నా అధికంగా భగవద్భాగవతపూజా దురంధరుడై కాలాన్ని వెళ్ళబుచ్చసాగాడు. ఆయన వెంట పాండ్యమహారాజు పంపిన రాజులూ, రాజకుమారులు కూడా ఉన్నారు కదా, ఇంతకుముందు కథలో చెప్పిన ప్రకారము. వారు..

ఉలుపా ల్పట్టిన యిండ్ల మజ్జన నృపార్హోదారభుక్తి క్రియో
జ్వలులై రే హరికొల్వునన్ వివిధ లాస్యస్పర్ధి సుభ్రూభ్రుకుం
సులవాదు ల్సరి దీర్చి పుచ్చి మణివాసోభూషణ గ్రామముల్
జలజాతాక్షునకున్ సమర్పణము నిష్ఠం జేసి యవ్వేకువన్

ఉలుపాలు అంటే కానుకలు. కానుకలు తెచ్చినవారి ఇళ్ళలో స్నానము, రాజులకు తగిన భోజనాలను ఆరగించి, వెలిగిపోతూ, రాత్రివేళలో దేవాలయమునందు(హరికొల్వునన్) వివిధ లాస్యములయందు అంటే వివిధ నృత్యరీతులయందు స్పర్ధ పడుతున్న అంటే పోటీపడి, వాదోపవాదాలు చేస్తున్న చక్కని కనుబొమలు కలిగిన సుందరీమణుల నర్తకీమణుల(సుభ్రూ) నర్తకుల (భ్రుకుంసుల) వివాదాలను చక్కబెట్టి, వారిని శాంతపరచి, ఒప్పించి బహుమతులు ఇచ్చి పంపారు. ఆ తర్వాత జలజాతాక్షుడైన ఆ విల్లిపుత్తూరు మన్ననారు దేవుడికి మణులు, వస్త్రములు, ఆభరణములు, అనేక గ్రామములు నిష్ఠగా, భక్తితో సమర్పించుకుని, ఆ వేకువజాములో ...

ప్రభువు లరిగిరి క్రమ్మఱఁ బాండ్యనగరి
కమ్మునియు నట్లు వైష్ణవాభ్యర్చనంబుఁ
దనచిరంతనతులసికాదామకరణ
దాస్యమును జేసికొనుచుఁ దత్పరతనుండె

ఆ ప్రభువులు తిరిగి పాండ్య నగరికి వెళ్ళిపోయారు. ఆ ముని (విష్ణుచిత్తముని) ఆ విధముగా తనకు ఎంతోకాలముగా అలవాటైన తులసీమాలికలు అల్లడం, స్వామికి సమర్పించడం, స్వామికి దాస్యము (కైంకర్యము) చేసుకుంటూ ఆ భగవానునిమీద లగ్నము చేసిన మనసుతో కాలము వెళ్ళబుచ్చుతున్నాడు.

ఆ విధముగా ఎప్పటిలానే తన నిత్యపూజా విధిని నిర్వర్తించుకుని, ఒకరోజు మధ్యాహ్నం స్వామికి మాలను సమర్పించి ఇంటికి వెళ్తున్న విష్ణుచిత్తుని చూసి ఆ గరుడతురంగుడు, సంతుష్టాంతరంగుడు తన దేవేరిని చూస్తూ యిలా పలికాడు.

'యామునాచార్యుఁడొక్కఁ డు నీ మహాత్ముఁ
డొక్కఁడును గాదె మన్మతం బుద్ధరించి
రస్మదీయక్రుపాతిశాయమున' ననిన
నిందిరాదేవి తనభర్త కిట్టు లనియె

యామునాచార్యుడు ఒకడు ఈ విష్ణుచిత్తుడు ఒకడు ఈ ఇద్దరే కదా నా మతమును నా క్రుపాతిశయముచేత ఉద్ధరించారు అని పలికాడు. ' నీకెందుకయ్యా భయము? నేనున్నానుగదా, అన్నీ నేను చూసుకుంటాను, నువ్వు కేవలము నిమిత్తమాత్రుడివి, రాజసభకు వెళ్ళు, అక్కడ పండితులతో వాదించి నా మతాన్ని స్థాపించు' అని పలికిన పలుకుల సారాంశాన్ని మరలా యిక్కడ ధ్వనిస్తున్నాడు రాయలు. వాదించేది, గెలిచేది, నిలిచేది అన్నీ తానే, తన మతమే, తన మాయయే అంతా అని భక్తులను మాధ్యమంగా చేసుకుని తానే తన

లీలలను ప్రకటిస్తాడు భగవంతుడు అని చెప్తున్నాడు పరమాత్ముని పలుకులద్వారా. తన భర్త పలుకులను విన్న శ్రీమహాలక్ష్మి తన స్వామితో యిలా అన్నది.

ఇతని కథ యెఱింగినది కా
యతఁ డేమి యొనర్చె? ననిన నబ్జాక్షుం డా
శతపత్రనిలయ కిట్లను
నతివ కలం డొకఁడు మత్పదాశ్రితుఁ డాదిన్

ఇతని కథ తెలిసినదే కదా, ఆతడు ఏమి చేశాడు, ఆతని కథ ఏమిటి తెలిజేయండి స్వామీ అన్నది ఆ 'శతపత్ర నిలయ', వందరేకుల తామరపూవు యందు ఆసీనురాలై ఉండే శ్రీమహాలక్ష్మి. ఆ పుండరీకాక్షుడు ఇలా అన్నాడు...

'అతివా! పూర్వము నా పదాశ్రితుడైన వాడొకడు ఉండేవాడు'...

అతఁడు చిరుతనాఁడె యాచార్యకులమున
వేడ్క వేదశాస్త్రవిద్య లభ్య
సించు చుండ నపుడు చెలువ యిప్పటిపాండ్య
నృపతి పూర్వవంశ్యుడే యొకండు

వెఱ్ఱిశైవంబు ముదిరి మద్వినుతి వినఁడు,
నతి యొనర్పఁడు మామక ప్రతిమలకును,
హరుఁడె పరతత్త్వ మను, మదీయాలయముల
నుత్సవంబుల కులుకు, నెయ్యురును నట్ల

చెలీ! అతడు చిన్ననాడే ఆచార్యుని గృహములో సంతోషంగా వేదములను, శాస్త్రములను, కళలను అభ్యసించుచున్న ఆ సమయములోనే యిప్పటి పాండ్యరాజు యొక్క పూర్వీకుడే ఒకడు రాజుగా ఉండేవాడు. ఆ రాజుకు వీరశైవపు వెఱ్ఱి ముదిరిపోయి, నా కీర్తనను, ప్రశంసనే వినేవాడు కాదు! నా ప్రతిమలకు నమస్కరించేవాడు కాదు, 'శివుడే పరతత్త్వము' అనేవాడు, నా ఆలయములలో ఉత్సవములు జరిగితే ఉలికిపడేవాడు, ఉసూరుమనేవాడు, ఆతని స్నేహితులు కూడా అలాంటివారే, ఆతనిలానే నన్ను ద్వేషించుకునేవారు! స్నేహితులు అనడానికి 'నెయ్యురు' అన్నాడు రాయలు, 'నెయ్యము కలవారు నెయ్యురు' అన్నమాట, విచిత్రమైన, ప్రత్యేకమైన రాయల పదప్రయోగాలకు, మారు మూలలనుండి ఏరి తెచ్చి మాటలగుది గుచ్చే మధురమైన రాయల కవితా శైలికి యిది మరొక ఉదాహరణ!

'ఆచార్యకులము' అంటే గురుకులము. కులము అనే పదానికి నివాసము అనే అర్థము కూడా కనుక గురుకులం అంటే ఆచార్యుని గృహము. పూర్వకాలములో విద్యార్థులను తమ ఇళ్ళల్లో ఉంచుకుని, వారికి ఉచిత భోజన సౌకర్యాలను సమకూర్చి విద్యా 'దానం' చేసేవారు, ఇప్పుడు విద్యా 'వ్యాపారం' చేస్తున్నారు!కన్నతండ్రిలా అన్ని అవసరాలనూ గమనిస్తూ, అన్ని సౌకర్యాలను సమకూరుస్తూ విద్యాదానం చేసే గురువుగారికి పాదసేవతో మొదలెట్టి సమస్త శుశ్రూషలు శిష్యులు చేసేవారు. గురుపత్నిని, గురువుగారిని తల్లితండ్రులలా భావించేవారు! వేదవిద్యను, శాస్త్రములను, కళలను కూడా బోధించేవారు, సమగ్రమైన, సర్వతోముఖ వికాసాన్ని పొందే వ్యక్తిత్వానికి కావలసిన విద్యను నేర్పేవారు. కనుక సర్వేశ్వరుని స్పృహ, లేదూ అంటే సామాజిక స్పృహ కలిగిన సత్పురుషులు ఉండేవారు, 'నిరాశ, నిస్పృహ' నిండిన

వాళ్ళుండేవారు కారు!

అశ్రాంత జంగమార్చా శ్రద్ధ వర్తిలు / వేదవిద్ద్విజపూజ వీటిఁగలిపి;

భౌమవారపు వీరభద్ర పళ్ళెర మిడు / గృహదైవతంబు లిట్టింకు లింక;

షణ్ణవతిశ్రాద్ధచయ మార బెట్టు శం / కరదాస మయ్య భక్త ప్రతతికి

నాద్యంబు లైన దేవాలయంబులు వ్రాల / నవని నిరాశ మఠాలి నిలుపు;

జందె ముత్తరశైవంబుఁ జెంది త్రెంచుఁ

బతితులారాధ్య దేవళ్ళె ప్రాప్యు లనుచు

నుపనిషత్తులు వారిచే నుబ్బి వినుచు

వెండి యే జంగ మెత్తిన వెఱఁగుపడును

ఆ మహారాజు నిరంతరమూ వేదవిదులైన పండితుల పూజ నిరసించి జంగమ దేవరలను శ్రద్ధగా అర్చించేవాడు. ఇలవేల్పులు నీరసించి, ఇంకిపోయి, భయపడగా ప్రతి మంగళవారము వీరభద్రునికి నైవేద్యపు పళ్లెరాన్ని సమర్పించేవాడు. తొంభైఆరు (షణ్ణవతి) పుణ్యతిథులను, ఆయా తిథులలో చేయాల్సిన వైదిక కర్మలను

ప్రక్కనబెట్టి, శివదాసుల సమూహాలకు సంతర్పణలు పెట్టేవాడు. వేదవిద్యకు ఆదిస్థానాలైన దేవాలయాలు శిథిలములై కూలిపోతుంటే, వైరాగ్యాన్ని నిరాశను ప్రతిబింబించే మఠాలను స్థాపించేవాడు! ఉత్తర శైవాన్ని అంటే నూతన వీరశైవాన్ని అంగీకరించి జందెమును త్రెంపి పారేశేవాడు, వేదబాహ్యులైన వారిని, వీరశివారాధ్యులను చేరదగినవారు, పొందదగినవారు అని భావించి, వారిచేత కాల, అగ్ని, రుద్ర ఉపనిషత్తులను చెప్పించుకుని ఉబ్బి తబ్బిబ్బయ్యేవాడు, ఏ జంగమదేవర అయినా శివ ప్రశంస చేస్తే ఆశ్చర్యపడేవాడు, అబ్బురపడేవాడు, ఆసక్తిగా వినేవాడు.

శివలింగము దాల్చినజన

నివహము లేమైనఁ జేయ నిది పాపము తా

నవుఁ గా దనఁ డాసమయము

నవు నను విప్రులక యగ్రహారములిచ్చున్

శివలింగమును ధరించిన శైవులు ఏమి చేసినా, పొరపాట్లు చేసినా, తప్పులు చేసినా ‘ యిది పాపము, యిది యుక్తము, యిది ఆయుక్తము, యిది చేయొచ్చు, యిది చేయకూడదు ‘ అని ఏమీ అనేవాడూ కాదు. పైపెచ్చు వారి అకృత్యాలను సమర్థించిన విప్రులకు, తనను సమర్థించిన విప్రులకు అగ్రహారాలను ఇచ్చేవాడు!

అతఁడు రాజ్యంబుఁ బాలించు నవసరమునఁ

దనవశం బైన యట్టియత్తామ్రపర్ణిఁ

గలుగు నలపుట్టరాని ముక్తామణివర

కులము మాహేశ్వరులకంధరలకుఁ దీఁటె

అతడు ఆ రాజ్యాన్ని పరిపాలించే సమయములో తన అధీనములోనున్న తామ్రపర్ణి నదిలో దొరికే అపూర్వమైన శ్రేష్ఠములైన ముత్యముల సమూహము అంతా ఆ మాహేశ్వరుల, శైవుల మెడలలో వ్రేలాడే రుద్రాక్ష మాలలకే సరిపోయేవి!

అప్పు డిచ్చకు లగుబ్రాహ్మణౌఘ మెల్ల

నాత్మ జనిభూమి విడువ లే కలికభూతి

గడ్డముల నాన రుదురాకలిడ్డ సంది

సూతసంహిత లిఱికించి చొరఁ దొడఁగిరి

అప్పుడు ఆ దేశములోని బ్రాహ్మణసమూహమంతా తమ జన్మభూమిని వదిలి వెళ్ళలేని వారు కనుక, రాజుకు ఇచ్చకాలు చేయడం కోసం (లేకుంటే ఇబ్బందులపాలు చేస్తాడు కనుక) గడ్డముల దాకా విభూతి రేఖలను పూసుకుని, రుద్రాక్షలు ధరించి, చంకలలో 'సూత సంహితా గ్రంధాలను' ఇరికించుకుని, ఇకిలించుకుంటూ రాజసభకు వెళ్ళడం మొదలెట్టారు. బలవంతముగా అయినా రాజు తన నిర్ణయాలను అమలు అయ్యేట్టు చేయగలడు కనుక తామే వీరశైవమత ప్రేమికులలాగా, తమ అంతరంగానికి వ్యతిరేకముగా రాజుకు ఇష్టమైన మతాన్నే తామూ అభిమానించేవాళ్ళ లాగా, అనుసరించేవాళ్ళలాగా నటించేవారు.

శీలముఁ బట్టియు గంజా,

హాల లుపాంశున భుజించునాదముల బైటం

జాలఁడు వైవన్ విప్ర

స్థాలిత్యము బైట వేసి కనుగిఱపు సభన్

(శైవ)దీక్షను తీసుకుని కూడా చాటు మాటుగా గంజాయి, మద్యము తాగుతూ తిరిగే అధములను బయట పెట్టేవాడు కాదు కానీ, బ్రాహ్మణుల క్రియలలో ఏవైనా అరకొర లోపాలున్నా వాటిని బయటపెట్టి, సభలో నిలదీసి, సభికులకు కనుసైగ చేసి హేళన చేసేట్టు, నిందించేట్టు చేసి, శిక్ష వేసేవాడు. అతను యిలాంటివాడు అయితే,

ఆరాజుమహిషి నియతి మ

దారాధనపరత నుండు నట్లుండియు దు

ర్వారవ్యధకుం గానదు,

పారము విభుఁ డస్మదంఘ్రి భక్తుడు కామిన్

ఆ రాజుభార్య నియమముగా నిరంతరమూ నా ఆరాధనలో మగ్నురాలై ఉండేది. తాను నా భక్తురాలై ఉండి కూడా, తన భర్త నాభక్తుడు కాదుకదా యని అంతులేని వ్యధకు గురి అవుతూ ఉండేది. మహారాజు ఎంతటి శైవుడో మహారాణి అంతటి వైష్ణవురాలు. తన భర్త శివభక్తుడు ఐనందుకన్నా విష్ణుద్వేషి ఐన కారణముగా, విష్ణుభక్తులను వేధిస్తున్న కారణముగా ఆ మహారాణి అంతులేని వేదన చెందేది.

భక్త సులభుడైన శ్రీమహావిష్ణువు శ్రీమహాలక్ష్మికి యామునాచార్య చరిత్రను వివరిస్తున్నాడు. ఆ పద్మాలయ తన ముఖపద్మము వికసించగా, నయనపద్మములను విప్పార్చుకుని ఆసక్తిగా వింటున్నది. వీరశైవుడైన పాండ్యచక్రవర్తికి భార్యయైన వీరవైష్ణవురాలైన ఆ పట్టపురాణి

**వింగడం బైనట్టి ముంగిట నెలకొన్న / బృందావనికి ముగ్గు వెట్టుఁదాన**

**దశమినాఁ డేకభుక్తముఁ జేసి యవలినాఁ / డోర్చి జాగరముతో నుండు నిట్టు**

**బారసి పోనీదు పై నిద్రఁ బాఱుట / క్కలుపాడు మత్పుణ్య కథలఁ ద్రోయు**

**నేమంపుమూన్నాళ్ళు కామింప దధినాథు / మఱునాఁడు కన్నును మనసు దనియ**

**నారజపువన్నెఁ బతిసెజ్జ కరుగుఁ గూర్మి**

**నరుగుచో నాభిఁ దుడిచి కప్పురపునాభిఁ**

**బెట్టు నిట్టులు మద్భక్తి పుట్టియును ని**

**జేశు నెడ భక్తి చెడదు మదిష్ట మగుట**

చక్కగా తీర్చి విభజించి ఉన్న ముంగిట్లో ఉన్న బృందావనములో, మహారాణి ఐనప్పటికీ తానే ముగ్గులు పెట్టేది. బృందావనము అంటే తులసి తోట. దశమి తిథినాడు ఒంటిపూట భోజనము చేసి, ఆవలినాడు అంటే ఏకాదశినాడు 'నిట్టుపవాసము' ఉండి జాగారము చేసేది. ఈ విధముగా ద్వాదశి వ్రతమును (బారసి) పడనిచ్చేది, పోనిచ్చేదికాదు, నిష్ఠగా ఆచరించేది, ముంచుకొచ్చే నిద్రను బ్రాహ్మణ స్త్రీలు(పాఱుటక్కలు) పాడే నా పుణ్య కథలను పాడుతూ ఆపుకునేది. ఈ విధముగా నియమపు మూడురోజులైన దశమి, ఏకాదశి, ద్వాదశి తిథుల రోజులలో నిష్ఠగా ఉండేది, ఈ మూడు రోజులలో పతిని కామించేది కాదు, మరునాడు కనులకు, మనసుకు తనివి తీరేలా మనోహరమైన సింగారముతో(ఆరజపు వన్నెన్) ప్రేమగా పతి శయ్యను చేరేది, అలా చేరేప్పుడు నిలువుగా తీర్చుకునే నా కిష్టమైన కస్తూరి తిలకమును తుడిచి, కర్పూరపు చుక్క పెట్టుకునేది, విభూతి రేఖ అని నాథుడు భావించేలా. ఇలా నాపట్ల అచంచలమైన భక్తి కలిగి కూడా, నన్ను ద్వేషించే తన భర్తను ద్వేషించేది కాదు. భార్యలు భర్తలను భక్తిగా, ప్రేమగా సేవించడం నాకు ప్రీతిని కలిగిస్తుంది కనుక భర్తను భక్తిగా ప్రేమగా సేవించేది ఆ మహారాణి.

మూర్ఖుడైన భర్తతో తను కూడా మూర్ఖంగా ప్రవర్తించేది కాదు ఆ మహారాణి అంటూ యితరుల అభిప్రాయాలను గౌరవించడం అనే ఆదర్శం దంపతుల పరస్పర అవగాహనతోనే ప్రారంభం కావాలి అని ఒక సామాజిక జీవన సంబంధమైన సందేశాన్ని యిక్కడ అందంగా ఉపదేశిస్తున్నాడు రాయలు. జీవిత భాగస్వామిని గౌరవించకుండా ఎన్ని వ్రతాలు, నోములు నోచినా వ్యర్థమే అని తెలియజేస్తున్నాడు. ఆ విచక్షణ భర్తకు కూడా ఉండాలి, లేదు కనుకనే ఆ భర్త మూర్ఖుడు అని ధ్వనిస్తున్నాడు. బృందావనంలో తనను సేవించిన ఋషి పత్నులతో 'మీ భర్తలను నా స్వరూపులుగా భావించి వారిని గౌరవించండి, ప్రేమించండి' అని శ్రీకృష్ణుడు పలికిన పలుకులను స్ఫురింపజేస్తున్నాడు.

వనజజరుద్రాదులు మ

**త్తనువుల తత్పూజనంబు తథ్యము మత్పూ**

**జనమ తదీప్సితఫలదా**

**తను నేన యటైన గలవు తరతమవృత్తుల్**

వనజము(కమలము)న జన్మించిన బ్రహ్మ, రుద్రుడు మొదలైనవారు నా శరీరులే, వారూ నా అంతర్భాగములే, వారిని పూజించడం కూడా నన్ను పూజించడమే, వారిని పూజించినా 'ఫలమును' ఇచ్చేది నేనే, ఐనప్పటికీ బ్రహ్మ రుద్రాదులకు, నాకు తరతమ స్థాయీ భేదాలున్నాయి, వారికి, బ్రహ్మరుద్రాదులకు కూడా ఫలమును ఇచ్చేది నేనే, అని తన తత్వాన్ని శ్రీమహాలక్ష్మితో చెప్తున్నాడు శ్రీమహావిష్ణువు, ఆ నెపముతో మహావిష్ణు తత్వాన్ని వీరవైష్ణవుడైన శ్రీకృష్ణదేవరాయలు మనకు చెప్తున్నాడు. 'సర్వదేవ నమస్కారః కేశవం ప్రతి గచ్ఛతి' సర్వదేవతలకు చేసే నమస్సులు అన్నీ సుమనస్సుల మనస్సులలో కొలువై నమస్సులు అందుకునే నారాయణ మూర్తికే చెందుతాయి అనే వేదాంతవాక్యాన్ని ఇక్కడ ప్రతిధ్వనించాడు జ్ఞానిఐన రాయలు. (సుమనస్సులు అంటే దేవతలు)

**కేవలశరీరదృష్టిన**

**దేవతలన్వేఱ కలుగఁ దెలిసినజడులన్**

**నావాసుదేవతాస్థితి**

**భావింపనిపూజ సాంతఫలమైత్రిప్పున్**

కేవలము శరీర దృష్టితో యితరదేవతలకు నాకు భేదమున్నదని అనుకునే మూర్ఖజనులుచేసే పూజ, నా వాసుదేవతత్వాన్ని తెలుసుకోకుండాచేసే పూజ అంతమయ్యే ఫలితాన్ని ఇస్తుంది. అనంతమైన ఫలితాన్ని, అంటే ముక్తిని ఇవ్వదు, అంటే పరిమితమైన పుణ్యఫలితాన్నే ఇచ్చి, వ్యాధి, జరాపీడితమైన జనన మరణ రూపక సంసారచక్రములో త్రిప్పుతునే ఉంటుంది, ఒక దరి, అంతము అనేది లేకుండా అని చెప్తున్నాడు శ్రీమహావిష్ణువు.

'సర్వత్రాసౌ సమస్తం చ వసత్యత్రేతివై యతః అతోస్య వాసుదేవేతి విద్వద్భిః పరి పఠ్యతే' అని విష్ణుమహాపురాణము ఒక శ్లోకములో తెలియజేస్తుంది. అన్నిచోట్ల, అన్నిటిలో వసించియున్న కారణముగా వాసుదేవుడు అని పిలువబడుతున్నాడు. ఇదే భావాన్ని 'వాసనాద్వాసుదేవస్య వాసితంభువనత్రయమ్ సర్వభూతనివాసోఽసి వాసుదేవ నమోఽస్తు తే ' అని విష్ణు సహస్రనామస్తోత్రము చెప్తుంది. ఈ భావాన్ని ఇక్కడ పలికిస్తున్నాడు, వేదాంత రహస్యసుధను ఒలికిస్తున్నాడు శ్రీకృష్ణదేవరాయలు. రాయల ఆధ్యాత్మికజ్ఞానసాగర గంభీరతకు ఇలాంటి పద్యాలూ, సందర్భాలు ఉదాహరణలు.

ఇక్కడ మనోహరమైన ఒక చిన్నివచనములో మహావిష్ణువు తనమతమును స్థాపించుటకు యామునాచార్యులవారిని రాజాస్థానమునకు పంపడానికి నిర్ణయించుకున్న విషయాన్ని వర్ణించాడు రాయలు. రాయల కవనప్రతిభను, వర్ణనా వైచిత్రిని ఇలాంటి వచనములు విభిన్న కోణములలో ఆవిష్కరిస్తాయి కనుక ఆ వచన తాత్పర్యాన్ని తెలుసుకుందాము.

శ్రీమహావిష్ణువు యామునాచార్యుడు పండితవాదము చేసిన సందర్భాన్ని శ్రీమహాలక్ష్మికి వివరిస్తూ " నా వాసుదేవతత్త్వ రహస్యాన్ని తెలుసుకొనలేని ఆ చక్రవర్తి తామసుడై, నా విధేయులగు భక్తులను సామాన్యబుద్ధితో చూస్తూ, వారికి జరిగే ఉపద్రవాలను ఉపేక్ష చేస్తూ వారి రక్షణకు విముఖుడై ఉండడాన్ని చూసి, కలియుగములో కృతమాల – తామ్రపర్ణి నదీ తీరములలో నా భక్తులు తగ్గిపోవడము వలన, ఆ దేశానికి ప్రభువు అతను అవడం వలన, రక్షణ అయినా శిక్షణ అయినా రాజముఖం ద్వారా తప్ప నేను ప్రత్యక్షముగా చేయను కనుక, ఆ రక్షణ చేయాలనే సంకల్పము నాయందు భక్తిచేతనే కలుగుతుంది కనుక, నాయందు భక్తి వాదము జరిగి, నా ఔన్నత్యము ప్రతిపాదింపబడడం వలననే జరుగుతుంది కనుక, నేను ఆలోచించి, చక్రవర్తి ఆస్థానమును చేరి వాదము చేయాలనే కోరికను ఆ విప్రకుమారుడు ఐన యామునాచార్యునకు పుట్టించగా, ఆతను వెళ్లి, నానా దేశాలకు చెందిన దీనులకు, అనాథలకు, వృద్ధులకు, బ్రాహ్మణ కుటుంబములకు ధాన్యము, జింక చర్మములు, వస్త్రములు, బ్రహ్మచారుల పెళ్లిళ్లకు, ఉపనయనములు కానివారికి ఉపనయనములకు, కుంటి, గ్రుడ్డి, చెవిటివారికి ఎద్లు మొదలైన వాహనములను, అంతేగాక, చెరువు ఎండిపోయింది అనే వారికీ, జీర్ణ దేవాలయాలలో పూజలు జరగడంలేదు అనే వారికీ, ఎండలకు దారులలో చలువపందిళ్ళు, చలివేంద్రాలు స్థాపిస్తాము అనే వారికీ,పితృదేవతల తిథులకోసం అనేవారికి, తీర్థయాత్రలకు వెళ్తాము అనేవారికి, ఉద్యాపనలు చేసి వ్రతములను పూర్తిచేసుకుంటాము అనేవారికి, వ్యాధులను నయము చేయించుకుంటాము అనేవారికి, ఆ రాణివాసమునుండి కొన్నిటికి రహస్యముగా, కొన్నిటికి బహిరంగముగా ధనమును తెచ్చి ఇచ్చే వృద్ధ పాషండుల చేతులకు ముసురుకుని, తోరణములవలె సాచినసందిళ్ళతో నిండిన ఏకదండి, త్రిదండి బ్రహ్మచారుల, యతుల దండములకు ఎగురుతున్న కాషాయ వస్త్రముల, కౌపీనముల పరంపరలతో నిండినది, కావలివారి స్తంభములకున్న జెండాల నీడలకు మరిగి, కేవలము దీనత్వముతో యాచించడమే విద్య,

మిగిలినది ఏదీ విద్య కాదు అన్నట్లు వేడుకునే ఇలాంటి అనేకులకు ఆధారమైనది ఐన ఆ అంతఃపుర పడమటిద్వారాన్ని చేరుకొని, ప్రతిదినమూ నా పాదభజనకథాశ్రవణము చేసే ఆ మహారాణికి ద్వారపు కావలివాని ద్వారా ఆశీః పూర్వకమైన అక్షతలను పంపి, 'నేను విదేశీయుడనైన వైష్ణవుడను, వాదించేవారు ఎవరైనా ఉంటే శ్రీమహావిష్ణువే పరదైవము అని వాదించి గెలువగలవాడను, మహారాజు విష్ణుద్వేషి కనుక, ఈ వైష్ణవుని విన్నపాన్ని ఆయనకు వినిపించడానికి అందరూ భయపడుతారు కనుక, మీరు విష్ణుభక్తి కలిగిన సాధ్వీమణులు, పతికి హితముగా నడుచుకునేవారు కనుక, మీకు విన్నవించుకుంటున్నాను, ఈ వర్తమానమును పంపించుకుంటున్నాను, మీ భర్త మీకు విధేయుడు కనుక నా కోరికను ఆయనకు విన్నవించి, నన్ను రప్పించి, వాదము చేయించగలరేని, వాదము చేసి, గెలిచి, మీ భర్తకు భగవద్భక్తి పుట్టించి కృతార్థుడిని చేస్తాను' అని విన్నవించి, వర్తమానమును పంపించాడు ద్వారపు కావలి భటునిద్వారా" అని తెలియజేశాడు.

ఈ చిన్ని వచనములో కూడా చివరన ఒక చమత్కారపు చురక వేశాడు శ్రీకృష్ణదేవరాయలు. ' మీ భర్తకు భగవద్భక్తిని పుట్టించి కృతార్థుడిని చేస్తాను' అని యామునాచార్యుల నోటితో పలికించి, 'భగవంతుడు' అంటే శ్రీమహావిష్ణువే అని అన్యాపదేశముగా తెలియజేశాడు, శ్రీహరి అనో విష్ణువు అనో ప్రత్యేకముగా చెప్పించకుండా!

**గ్రీష్మసమయనిరుత్సాహ కేకిరమణి**

**నవఘనధ్వని కలరుచందమున నలరి**

**యేకతపు నర్మగోష్ఠిఁ బ్రాణేశుతోడ**

**నతని విధ మెఱిఁగింప నిట్టట్టు వడుచు**

గ్రీష్మ సమయములో నిరుత్సాహముగా ఉన్న ఆడునెమలి కొత్త మేఘములు చేసే ధ్వనులకు ఉరుములకు ఆనందపడినట్లు ఆనందంగా, ఏకాంతంలో గుసగుసలతో తన ప్రాణేశ్వరునితో ఆ యామునాచార్యునిసంగతి చెప్పింది మహారాణి. ఆకాశం మేఘావృతము ఐనపుడు నెమళ్ళు ఆనందిస్తాయి, మగ నెమళ్ళు అయితే ఆనందంగా పురివిప్పి నాట్యంకూడా చేస్తాయి. అంటే అప్పుడు వాటి 'మూడ్' బాగుంటుంది కనుక, దగ్గరికి చేరడానికి ఆడ నెమళ్ళకు సంకోచము, భయము ఉండదు, మగనెమళ్ళకు అభ్యంతరము ఉండదు, పైపెచ్చు ఆనందం కలుగుతుంది. కనుక అలా సంతోషంగా ఏకాంతంలో యామునాచార్యుని గురించి ప్రస్తావించగా 'ఆశ్చర్యపడుతూ' (ఇట్టట్టు పడుచున్)

**భూవల్లభుఁ 'డెట్టెట్టూ**

**తా వాదముఁ జేసి శివమతంబు జయింపం**

**గా వచ్చెనొ? చూతముగా,**

**రావింపు'మటన్న నాఁటి రాత్రి చనంగన్**

మహారాజు ఆశ్చర్యపడుతూ ఎట్లెట్లా! తాను వాదము చేసి శివమతమును జయించడానికి వచ్చాడా? చూద్దాము కదా, తాను జయిస్తాడో, నా శైవాచార్యులు జయిస్తారో, రప్పించు! అన్నాడు. ఆ రాత్రి గడిచిపోయి, తెల్లారిన తర్వాత, ముఖ్యులైన కొందరితో పరిమితముగానున్న సభలో కొలువైన భర్త అనుమతితో, ప్రతీహారిని పంపించి ఆ భూసుర కుమారుడిని సభకు పిలిపించింది మహారాణి.

**ద్వారంబు సొచ్చి కీలిత**

**గారుడమహి వజ్ర వేదికం జివురులఁ గెం**

**పారు నొక పిప్పలముఁ గని**

**యా రావి న్వాదసాక్షికై వలగొనుచున్**

యామునాచార్యుడు సభామంటప ద్వారాన్ని ప్రవేశించి, గరుడపచ్చలతో తాపడం చేసిన భూమధ్యభాగములో వజ్రాలతో తాపడం చేసిన వేదికను, ఆ వేదిక మధ్యన కెంపులలాగా ఎర్రని చిగుళ్ళున్న ఒక రావిచెట్టును చూసి, రావిచెట్టు మహావిష్ణు స్వరూపము కనుక(వేపచెట్టు లక్ష్మీ స్వరూపము, కనుక ఈ రెండు వృక్షాలూ కలిసిఉన్నదగ్గర రెండిటికీ కళ్యాణం చేయించడం భారతీయుల సంప్రదాయం, ప్రజల కళ్యాణం కోసం) ఆ రావిచెట్టును తన వాదానికి తీర్పును చెప్పడానికి, సాక్షిగా భావించి ప్రదక్షిణాలు చేసి, నమస్కరించి చుట్టూ కలయజూశాడు..

పాండ్యరాజు సభాస్థలికి చేరుకున్న యామునాచార్యుడు ఆ సభాప్రాంగణంలో ఉన్న రావిచెట్టుకు ప్రదక్షిణాపూర్వకంగా నమస్కరించి చుట్టూ కలయజూశాడు.

పసిఁడిగ చ్చమర సోపానముల్ మూఁటఁ దుం / గితవిశాలితయుఁ జిత్రితయు నైన
సభ మహాకుథముపై శార్దూల చర్మ కం / థావృతుల్ జటిలులు నైన జరఠ
మాహేశ్వరులు చుట్టి రా హారసంధి రు / ద్రాక్షా యుతముఁ దాల్చి యళికభూతి
సురఁటిగాడ్పుల రాల నరుణాయతాక్షుఁడై / కుఱుగద్దె బిల్లఁ బ్రకోష్ఠ మునిచి
నంది ముద్రితపాణియందుఁ జెక్కుఁది యా / గమములు వినుచు హేమము పొదివిన

యలఁతి రుదురొకగమి కుట్టులందు మెఱయ
వెలితపారంబు మించ దువ్వలువగప్పి
యడపమును వాఁడివా లొక్క యతివ తాల్ప
భార్య వింజామ రిడ నొప్పు పాండ్యుఁ గనియె

బంగారపు పూతతో మూడు అంతస్తులుగా మిక్కిలి పొడవూ వెడల్పూకలిగి, వివిధ చిత్తరువులతో అలంకరించబడియున్న దీర్ఘమైన సభామంటపంలో పులితోళ్ళు, కంబళ్ళు కప్పుకున్న వృద్ధులైన లింగధారులు తనను పరివేష్టించియుండగా, రత్నహారముల నడుమ నడుమ రుద్రాక్షలను ధరించి, వింజామరల చిరుగాలులకు తను ధరించిన విభూతికణాలు రాలుతుండగా యెర్రని కన్నులతో చిన్న గద్దెమీద చిన్నదిండు మీద మోచేయి ఆన్చి, నంది రూపు చెక్కిన ఉంగరాలు కలిగిన చేతిని చెంపకు ఆనించి ఆ శైవులు చదువుతున్న ఆగమాలను వింటూ, బంగారపు కుట్టుపోగుతో రుద్రాక్షలు పొదిగిన తెల్లని తలపాగానుధరించి, వాడియైన ఖడ్గమును, తాంబూలపు పేటికను ఒక వనిత ధరించి చెంత నిలువగా, తన భార్య వింజామర వీస్తుండగా దర్పంగా, ఠీవిగా, రాజసంగా వెలిగిపోతున్న పాండ్య చక్రవర్తిని చూశాడు. ఒక చిత్తరువు గీసినట్టుగా చేసిన అద్భుత వర్ణన! అలా దర్పంగా కూర్చున్న రాజును చూసి వినయముగా సమీపించి, ఒక యజ్ఞోపవీతమును కానుకగా సమర్పించి కూర్చున్నాడు యామునాచార్యుడు. ఆ అతిథిని గౌరవంగా సంభావించడం అటుంచి, నేరుగా అహంకారంతో ప్రశ్నించాడు పాండ్యరాజు.

సంగతియె యోయి యిసుమంత లింగణావు
తత్త్వనిర్ణయవాదంబు తరమె నీకు?
నోడితేనియుఁ బట్టి మొఱ్ఱో యనంగ
లింగమును గట్ట కుడుగ, మెఱింగి నొడువు!

పద్ధతేనా? ఏంటి సంగతి? ఇసుమంత వాడివి, భూమికి జానెడు లేవు, తత్త్వనిర్ణయవాదము నీతరమవుతుందా? ఓడిపోయావో, నిన్ను పట్టుకుని, మొఱ్ఱో అన్నా శివలింగమును నీ మెళ్ళో కట్టకుండా వదలము, అది తెలుసుకుని మాట్లాడు అని హేళన, ధిక్కారము, చులకన వ్యక్తం చేస్తూ పలికాడు పాండ్య ప్రభువు. అంతటితో ఆగకుండా చులకనగా యిలా మాట్లాడడం మొదలెట్టాడు.

వాదుల మటంచుఁ జెప్పించి వత్తు రోట
మైన దయ నీరె యేమైన నని విలజ్జ
జాటుఁదనమున సభ లెక్కు చౌరవకాండ్రు
పారువారలసుద్ది సెప్పంగ నేల

మేము వాదులము, వాదించి తత్త్వ నిర్ణయం చేస్తాము అని చెప్పించి ( నీలాగే రాణి తోనో  ఎవరితోనో పైరవీ చేయించి) వస్తారు, ఓటమి చెందుతారు, ఆ తర్వాత సిగ్గు లేకుండా దయతో ఏమైనా యిప్పించండి అని ప్రాధేయ పడతారు, మోసపు మాటలతో (జూటుఁదనమునన్) చౌరవ కలిగిన చోరులు, ఇక ఓడిపోయి పారిపోయేవాళ్ళ సంగతి చెప్పడం ఎందుకు! అని పలికి, దరహాసంతో వ్యంగ్యంగా రాణిని చూస్తూ యిలా అన్నాడు.

అస్మన్మతస్థుఁ డోడిన
భస్మము రుద్రాక్షములును  బాసి యితనిచే
విస్మయముగఁ దప్తపుముర
ఘస్మరచక్రాంకితుండఁ గాఁగలవాఁడన్

రాణివైపు చూస్తూ పరిహాసంగా, పందెంగా , ‘నా మతస్థుడు ఓడిపోతే ఈ భస్మమూ రుద్రాక్షలూ వదిలేసి ఈ కుర్రకుంక చేతులమీదుగా మురాసురుడిని తినేసిన(సంహరించిన అని) సుదర్శన చక్రమును బాగా కాల్చి దానితో గుర్తులు వేయించుకుంటాను, విష్ణు చక్ర శంఖములను బాగా వేడి చేసి వాటి ముద్రలు వేయించుకోవడం ‘సమాశ్రయణం’, అంటే మేము విష్ణుదాసులము అని అంగీకరించి ప్రకటించుకోవడం అనబడుతుంది, కనుక నేను వైష్ణవుడిని అవుతాను.

ఉవిద! యీ నీదువిద్వాంసుఁ డోడెనేని
నీకు నితని కే నన్నపూనికయ యన్న
‘నొప్పితిమి దేవ రానతి దప్పకున్నఁ

జాలు మఱి పంచభూతముల్సాక్షి కాఁగ'

'దేవీ! యీనీ విద్వాంసుడు ఓడిపోతే నీకు ఇతడికి కూడా నేను అన్నట్లే జరుగుతుంది, అంటే బలవంతంగా మెళ్ళో శివలింగాన్ని కట్టి శైవాన్ని అంటగడతాను!' అని అనగానే, రాణి ' మీ పలుకులకు పందానికి ఒప్పుకున్నాము(మేమిద్దరమూ) దేవరవారు తమరు చేసిన వాగ్దానాన్ని తప్పకుంటే అంతే చాలు! పంచభూతాలు మీ మాటలకు సాక్షులుగా ఉన్నాయి సుమా!' అన్నది.

రాజు రాణి యిద్దరూ చేసిన ప్రతిజ్ఞలను, వారి పందాలను వింటున్న బాలకుడు యామునాచార్యుడు ప్రభూ! యిలా మీరు ఆనతి చేయదగదు, నేను కదుపుకూటి నిమిత్తము యాచించుటకు వాదపు మిషతో వచ్చినవాడను గాను. నేను ఎవరికోసం సంపాదించాల్సిన అవసరం ఉన్నది, ఇల్లూ వాకిలీ భార్యా పిల్లలూ ఏమీ ఎవరూ లేని సన్యాసిని, అందునా యాచించడం నా హక్కు, యాచించడం నాకు (సన్యాసికి) విధిగా 'విధి' సృష్టించియే ఉన్నాడు కదా. ఏ సర్వాంతర్యామి ఐన పరాత్పరుడు తన ఆజ్ఞచే ప్రేరేపించాడో, ఆయన ఆజ్ఞయే నన్ను ఇక్కడికి తీసుకువచ్చింది. తెలిసిన నాలుగు విషయాలు చెప్తాను, ఒకవేళ తప్పులుంటే ఆయనవే, ఒప్పులున్నా ఆయనవే, నేను భగవదాజ్ఞానువర్తినై వచ్చినవాడిని కేవలం. ఒకవేళ తమరు అన్నట్లే ప్రతివాదులచేతిలో నేను ఓడిపోయిననూ పోనివ్వండి మహారాజా! మహారాణి తీసుకువచ్చిన విద్వాంసుడు అని అమ్మను(రాణిని) నిందింపనవసరము లేదు, మహారాణి తరపువాడిని అని కనికరము చూపించాల్సిన అవసరమూ లేదు, మీకు ఎలా సమ్మతమైతే అలా చేయండి, పర్లేదు!

అలా పలికి రాజు ఆజ్ఞ తీసుకుని, వాదము మొదలెట్టి ఒక్కరిని సమీపించి వారు పలికిన వాటిని తాను పలికి విశదీకరించి, అప్పుడు వాటిని ఖండిస్తూ తన ఉపమానాలను సోదాహరణముగా శ్రుతులనుండి, స్మృతులనుండి, బ్రహ్మసూత్రములనుండీ ఉటంకిస్తూ, ఒకరితో మాట్లాడేప్పుడు ఇతరులవైపు దృష్టి, ధ్యాస పోకుండా నిగ్రహించుకుంటూ, ఒక్కొక్కరినే ' నీవేమన్నావు? రా! వినిపించు నీ సిద్ధాంతాన్ని' అని ఒక్కొక్కడినే పిలిచి, ఆ తర్వాత వేరే వారిని కూడా ఆహ్వానించి, వారి వారి సిద్ధాంతాలను ఖండించి ఓడిస్తూ, తన సిద్ధాంతాన్ని ప్రతిపాదించి ఒప్పిస్తూ, ఆ బ్రాహ్మణబాలకుడు అందరినీ గెలిచాడు.

ఆయెడను నొక్కపలు కెదు
రై యుండెడు పిప్పలమున నాయెను విన 'నో
హో యిది నిక్కము నృప! నా
రాయణుఁడె పరంబు కొల్వుమతని' నటంచున్

ఆ సమయంలో పరమాద్భుతంగా ఆ సభాస్థలిలో ఉన్న రావిచెట్టు మ్రాను నుండి 'ఓ రాజా! యిది సత్యము! ఈతని పలుకులప్రకారమే, నారాయణుడే పరదైవము, ఆతనిని సేవింపు'మని ఒక పలుకు వినిపించింది. అందరూ ఆశ్చర్య చకితులయ్యారు. శైవ పాషండులు తలలు వంచుకున్నారు. మహారాజు పట్టరాని ఆనందంతో ఆ బ్రాహ్మణబాలకునికి సాష్టాంగవందనం చేసి, వైష్ణవమతమును స్వీకరించి, ఆ బ్రహ్మచారికి తన అర్ధరాజ్యాన్ని ఇచ్చి పట్టాభిషేకం చేశాడు, పాండ్యరాజ్యంలో ఇంటి అల్లునికే రాజ్యాన్ని పొందే హక్కు ఉంటుంది

కనుక తన చెల్లెలిని ఆ బ్రహ్మచారికి ఇచ్చి వివాహం చేశాడు. ఇలా ఆ యామునాచార్యుని బ్రహ్మచర్యము, సన్యాసము రెండూ కావేరిలో కలిసిపోయ్యాయి! సామ్రాజ్యం, మదనసామ్రాజ్యం రెండూ కలిసి వచ్చిపడ్డాయి.

అనంతరం ఆ యామునాచార్యుడు సకల ధనుర్వేదవిద్యా పారంగతుడు కనుక, తన శత్రువులను జయించి, సామ్రాజ్యాన్ని సుస్థిరం చేయమని ప్రార్థించి యామునాచార్యుడిని దండయాత్రకు బయల్దేరదీశాడు, కానీ 'యిది వర్షాకాలం, యుద్ధయాత్రలకు అనువైన సమయము కాదు' అని మంత్రులు, పురోహితులు చెప్పడంతో మహారాజుకు ఆ విషయాన్ని తెలిపి, తన దండయాత్రను వాయిదావేసుకుని అనువైన సమయం కోసం నిరీక్షించడం మొదలెట్టాడు యామునాచార్యుడు!

ఈ సందర్భంలో వర్ష రుతువును, శరదృతువును అనేక పద్యాలను, ఆంధ్రసాహిత్యంలోని అద్భుతమైన ఋతువర్ణనలలో పేర్కొనదగ్గ వర్ణనలు అని ప్రతీతిపొందిన పద్యాలను అందించాడు రాయలు. మచ్చుకు కొన్నిటినిమాత్రం రుచిచూసి ముందుకు సాగుదాం.

వీరశైవుడైన పాండ్య రాజును వైష్ణవునిగా మార్చి, ఆయన సోదరిని వివాహమాడి, అర్ధరాజ్యాన్ని పొంది, దండయాత్ర చేసి శత్రువులను అణిచి వేయమని కోరిన రాజుకు ప్రస్తుతం వర్షాకాలం కనుక, వర్ష ఋతువు వెళ్ళిపోయిన తర్వాత దండయాత్రకు బయల్దేరుతానని చెప్పి ఆగిపోయాడు యామునాచార్యులు. ఇక్కడ వర్షఋతువర్ణన అద్భుతంగా చేశాడు రాయలు. శ్రీకృష్ణదేవరాయల బహుముఖ పాండిత్యానికి, విచిత్రమైన ఊహలకు, కల్పనలకు, ప్రపంచ పరిశీలనా శక్తికీ, కొండొకచో కొద్దిగా కష్టపడితే తప్ప కొరుకుడు పడని ఆయన క్లిష్టమైన శైలికి ఈ వర్షాకాలపు వర్ణనలు అత్యుత్తమమైన ఉదాహరణలు.

**కర్కశుఁ డంటకోర్వ కుదకంబులు వాఃపతి గూర్చినట్లు న**
**య్యర్కుఁడుఁ దాను గూర్చి మఱి యా సలిలాధిపచిహ్నవాహతం**
**బేర్కలగంగ నాతఁ డెలమి న్మకరస్థితిఁ గన్న నీర్ష్యఁ దాఁ**
**గర్కటకస్థుఁ డయ్యె ననఁ గర్కటకస్థితిఁ గాంచె నత్తఱిన్**

తనను 'కర్కశుడు, నిరంతరమూ తన వేడిమితో కష్టపెడతాడు' అని లోకులందరూ అనడాన్ని ఓర్వలేక సూర్యుడు తనపై వచ్చిన మచ్చను దూరం చేసుకోడానికా అన్నట్లు, వరుణుడు జలములను ఉద్భవింపజేసినట్లు తాను కూడా జలములను ఉద్భవింప జేయడానికి అంటే వర్షములను కురిపించడానికి నిశ్చయించుకుని, వరుణుడు మొసలిని వాహనంగా చేసుకుని పవిత్రమైన గంగానదిలో నిరంతరమూ ఉంటాడు కనుక, తాను కూడా ఆ మొసలికి చిహ్నమైన మకర రాశిలో ఉండడం ఏమిటి చిన్నతనంగా అని భావించి, ఈర్ష్యతో అన్నట్లు తాను కర్కాటక రాశిలోకి ప్రవేశించాడు. అంటే వర్ష ఋతువు ప్రారంభం ఐంది. సహజంగా జరిగే వర్ష ఋతు ప్రారంభాన్ని ఇలా చమత్కరించాడు రాయలు.

**వనతతివరాహవాహారివాయుభుగ్వి**

**రోధివారణ వర్షాభులాధిఁ దొఱఁగె**

**నెండ్రి రవి చేర మూఁడవ యెడకుఁ జేరు**

**తరణి ధరణిం బ్రమోద సంధాయి గాఁడె**

సూర్యుడు కర్కాటక రాశిలోకి ప్రవేశించడంతో (ఎండ్రిన్ రవి చేర)వనసమూహము, వరాహములు, మహిషములు (వాహారి)వాయువును భక్షించే సర్పములకు విరోధులైన నెమళ్ళు (వాయుభుగ్విరోధి)ఏనుగులు(వారణ) కప్పలు (వర్షాభులు)మొదలైనవాటికి మనోవ్యధ తీరిపోయింది. 'వే' 'వో', 'వా', 'వీ' అనే అక్షరాలు రోహిణీ నక్షత్రమునకు చెందినవి, వృషభ రాశికి చెందినవి. వృషభరా శికి మూడవ రాశి కర్కాటకరాశి కనుక, 'మూడవ యెడకు' అంటే (తమ జన్మ రాశి ఐన వృషభరాశికి) మూడవ రాశి ఐన కర్కాటక రాశిలోకి సూర్యుడు చేరడంతో , వర్ష ఋతువు ప్రారంభం కావడంతో వనములకు, వరాహములకు, మహిషములకు, వాయుభక్షక విరోధులైన నెమళ్ళకు, ఏనుగులకు, కప్పలకు మనోవ్యధ తీరి సంతోషం కలిగింది. పద్యరచనపై రాయలకున్న పట్టుకు, జ్యోతిషశాస్త్ర పరిజ్ఞానానికి, కాల్పనిక ఊహా శక్తికి, పరిశీలనా శక్తికి ఒక గొప్ప నిదర్శనం ఈ పద్యం!

**వనధిగమనజగర్భార్కజనిత ఘృణులు**

**మఱి ప్రసూతికి నతని ధామంబుఁ జేరె**

**ఘనతఁ జొచ్చినయిండ్లను దనయ లుండి**

**కాన్పునకుఁ బుట్టిని ల్చేరు క్రమము గనమె**

సముద్రముతో కలియడం వలన గర్భాన్ని ధరించి మేఘములైనాయి సూర్యుని కిరణములు. (వనధిగమనజగర్భార్కజనిత ఘృణులు)సూర్యుని కిరణములే మేఘములు అని సంప్రదాయం. లోకంలో గర్భం ధరించిన కన్యలు ప్రసవానికి పుట్టినిల్లు చేరడం సహజమే, అందునా తొలి చూలు పుట్టింట్లో ప్రసవం జరగడం తెలుగువారి సంప్రదాయం కనుక, వర్ష ఋతువు ప్రారంభం కనుక తొలి చూలు ఐన మేఘములు తమ పుట్టిల్లు ఐన సూర్యమండలానికి చేరుకున్నట్లు (మఱి ప్రసూతికి నతని ధామంబుఁ జేరె)ఆకాశం మేఘావృతం ఐంది అని అంటున్నాడు తెలుగుసంప్రదాయ పక్షపాతి ఐన రాయలు.

**అలపర్జన్యుఁడు భానుఁ డన్కొలిమిలో నభ్రంపుఁ బెన్కొప్పెరన్**

**జల మాఁగన్ బిడుగుక్కుజాత్యపుటయస్కాంతంబునత్తున్కలో**

**పలఁ జాప న్మహిమీఁదిలోహరజముల్ పైఁ బర్వె నా లేచె వా**

**త్యలఁ బ్రాగ్దావమషుల్మ్రొగి ల్మొదల గ్రద్దంత్రై దివిం బర్విసన్**

వేసవిలో తీవ్రమైన వేడిమికి గురి ఐన భూమండలం తొలి వర్షాలకు దుమ్ము, ధూళి రేగే సుడిగాలులతో కూడిన వర్షాన్ని పొందడం ప్రకృతిలో సహజంగా జరిగేదే. దాన్నే తన సహజమైన శైలిలో విచిత్ర కల్పనతో ఇక్కడ చెప్తున్నాడు రాయలు. దేవేంద్రుడు అనే కమ్మరివాడు (పర్జన్యుడు) సూర్యుడు అనే కొలిమిలో కాల్చి ఆకాశము అనే పాత్రలో నీరు కారకుండా నిలవడానికి పిడుగు జాతికి చెందిన, అంటే ఇనుప జాతికి చెందిన అయస్కాంత శక్తి కలిగిన ముక్కలను అతికాడు, చిల్లు పడి కారకుండా 'మాటు'వేశాడు. ఆ మహా అయస్కాంతపు శక్తికి ఆకర్షింపబడి భూమి మీది ఇనుపముక్కలు అన్నీ విసురుగా లేచి ఆకాశంలోకి దూసుకెళ్తున్న రీతిగా సుడిగాలి తాకిడికి అంతవరకూ కాలి కాలి

మాడి మసి ఐన భూమి మీది బూడిద వంటి నల్లని ధూళి కణాలు గ్రద్దల్లాగా పైకి ఎగిరి నల్లని మేఘాలను ఇంకా నల్లగా చేశాయి. తొలి వర్షానికి ముందు వీచిన సుడిగాలికి దుమ్మూ ధూళి కణాలు సుడులు సుడులుగా లేచి ఆకాశంలోకి ఎగరడాన్ని ఇలా విచిత్ర కల్పన చేసి వర్ణించాడు రాయలు.

**ఇలకు డిగి చుట్టిచుట్టి దు మ్మెత్తి యెగసి**
**పోయి తము ముంచుసుడిగాలి పుష్కరములఁ**
**గడలినీ రభ్ర కలభముల్ క్రాసె ధరణి**
**నభ్రకరిశిక్ష దివిఁ గాంచి నట్టికరణి**

భూమిమీదికి దిగి సుడులు సుడులుగా చుట్టి దుమ్మెత్తి పోసి, ఎగిరి ఆకాశ మండలానికి చేరుకున్న సుడిగాలులను తమ తొండములతో లాగి వాటిలోని సముద్ర జలాలను గ్రహించి మరలా వర్ష ధారలుగా కురిపించాయి ఏనుగు గున్నలవంటి మేఘాలు. అది, చూడడానికి ఆ ఏనుగు గున్నలవంటి మేఘాలు దేవజాతికి చెందిన ఐరావతము అనే ఏనుగు వద్ద 'తర్ఫీదు' పొందినట్లుగా ఉంది. ఏనుగులు, మరీ ఎక్కువగా గున్న ఏనుగులు దుమ్మును ధూళిని తొండంతో పీల్చి మరలా ఎగజిమ్మడం, నీటిని పీల్చి మరలా బయటకు చిమ్మడం వాటి జన్మ లక్షణం. ఇక్కడ మేఘాలు గున్న ఏనుగుల్లాగా ఉన్నాయి రంగులో, పరిమాణంలో. ఏనుగుల జాతికి గురువు వంటి ఐరావతంవద్ద శిక్షణ పొందిన వాటిలాగా సముద్రపు నీటిని, దుమ్మూ ధూళిని పీల్చి, వెంటనే ధారలుగా వర్షాన్ని కురిశాయి మరలా అంటున్నాడు, సుడిగాలి వీచి వెంటనే ఏనుగుతొండాల ధారల్లాగా ఉద్ధృతంగా వర్షంపడడాన్ని యిలా చమత్కరించాడు రాయలు.

**కృతపయఃపాననవ మేఘపృథుకములకు**
**రాలె నొయ్యన వడగండ్ల పాలపండ్లు**
**మఱి బలాకాద్విజాళిసంప్రాప్తి గలిగెఁ**
**బెరుఁగఁ బెరుగంగా ధ్వనియు గంభీరమయ్యె**

పాలు తాగే పసిపిల్లలకు పండ్లు రాలడం, మరలా పండ్లు రావడం, పెరిగిన కొద్దీ గొంతులో ధ్వని హెచ్చడం లోక సహజం. మేఘములనే పసిపిల్లలు (పృథుకములు)నీరు అనే పాలను తాగి, వడగళ్ళు అనే పాల పళ్ళు రాలి, బారులు తీరిన కొంగలు అనే నూతన

దంతముల వరుసలను పొందాయి. నూతనంగా తొలకరిలో ఉద్భవించిన మేఘములు కనుక శిశువులతో పోల్చాడు. తొలిమేఘాలు కురిసే వానలు వడగళ్ళతో కూడిన వానలు కనుక రాలే వడగళ్ళను పిల్లలకు రాలే పాల పళ్ళతో పోల్చాడు. ఆకాశం మేఘావృతము ఐనప్పుడు ఆకాశవీధిలో బారులు తీరి కొంగలు తమ గూళ్ళకు ప్రయాణం చేయడం మనము చూసేదే. ఆ తెల్లని కొంగలబారును శిశువులకు వచ్చే తెల్లని పలువరుసతో పోల్చాడు.

ఆ మేఘములు అనే శిశువులకు క్రమక్రమంగా 'ఉరుములు' అనే ధ్వని కూడా పెరిగింది అని, శిశువులు పెరిగినకొద్దీ గొంతులో ధ్వని పెరగడంతో పోల్చాడు. యింతటి సహజప్రతిభ, పాండిత్యం, చమత్కృతి, రసికత నిండిన అవిశ్రాంత యోధుడైన ఒక మహాచక్రవర్తి శ్రీకృష్ణ దేవరాయలు. ధర్మబద్ధమైన ఆదర్శ సామ్రాజ్య స్థాపనకోసం నిరంతరమూ యుద్ధభూమిలోనే గడిపిన రాయలకు, ఓటమి అనేది ఎరుగకుండా ఇరవైతొమ్మిది సంవత్సరాలు అటు కదనరంగంలో, యిటు కవనరంగంలో సార్వభౌముడైన శ్రీకృష్ణదేవరాయచక్రవర్తికి, తెలుగుసాహిత్యప్రియులు ఎంతగా నీరాజనాలుపట్టినా తక్కువే!

**దినముల వెంబడిం జడనిధి న్మను గ్రోలిననీరిలోనఁ బే**
**రిన లవణంపుఘట్టముల దృష్యదిరమ్మద దావముల్దవు**
**ల్కొని పెటిలించు నార్భటు లొకో యనఁగా సతటిద్భయంకర**
**స్తనితములన్ సృజించె నతిసాంద్రఘనాఘనగర్భగోళముల్**

రోజులతరబడి త్రాగిన సముద్రపు నీటిలోని ఉప్పు మేఘములలో బిళ్ళలు బిళ్ళలుగా పేరుకునిపోయి, మేఘములు పరస్పరం రాసుకున్నప్పుడు పుట్టిన విద్యుత్తు వలన, నిప్పులో పడ్డ ఉప్పు కావచ్చు అన్నట్లు మెరుపులతో కూడిన 'ఫెటిల్లు' 'ఫెటిల్లు'మనే ధ్వనులను వెలువరించాయి మేఘములు.

**అలపర్జన్యుఁడు కేకిపాత్రముల గుంపాడించుచో మేఘమం**
**డలపున్ మద్దెల గ్రుంగ లేవను మరున్మార్దంగి కుం డర్థి నొ**
**త్త లలి న్నేలకు వ్రాలుచు న్నెగయుచుం దారాడునత్తెల్లజ**
**ల్లులుఁ గెంగుచ్చులు నయ్యెఁ ధారలును దల్లోలేంద్రగోపంబులున్**

ఆకాశం మేఘావృతం ఐంది. ఆనందంతో నెమళ్ళు నృత్యం చేస్తున్నాయి. మేఘుడు (పర్జన్యుడు) నెమళ్ళు అనే పాత్రలతో చేయిస్తున్న నాట్యంలో వాయువు అనే మృదంగ వాయిద్యకాడు (మరుత్ మార్దంగికుడు)మేఘమండలం (మేఘం)అనే మద్దెలను వాయిస్తున్నాడు. గాలికి జల్లులు జల్లులుగా, తెల్లని పరదాల్లాగా, తెల్లని పరదాల దారాల్లాగా నీటి ధారలు పడుతున్నాయి, వర్షం పడడంతో తమ పుట్టల్లోనుండి పైకి ఎగురుతున్న ఎర్రని ఆరుద్ర పురుగులు ఆ తెల్లని పరదాలకు అల్లిన ఎర్రని కుచ్చుల్లాగా కనబడుతున్నాయి!

**గగనరంగస్థలంబున మిగులఁ బ్రౌఢి**

**మమునఁ గాళిక నిల్చి కోలము నటింపఁ**

**బొరి మొగంబున రాలు నిప్పుక లనంగ**

**గుంపులై రాలె మహి నింద్రగోపతతులు**

గగనము అనే రంగస్థలం మీద కాళికాదేవి ప్రావీణ్యంగా గాఢముగా నర్తనం చేస్తుంటే ఆతల్లి కనులనుండి, ముఖమునుండి రాలుతున్న ఎఱ్ఱని నిప్పు కణికలలాగా గుంపులు గుంపులుగా ఎఱ్ఱని ఆరుద్ర పురుగులు ఎగిరిపడుతున్నాయి భూమి మీద.

**స్ఫురణ మొగుళ్ళపై  మొదలఁ బొల్చి జలస్మృతి నాఁడునాఁటికిం**

**గరఁగుచుఁ బుట్టుచుండు మణి కారుక రక్తిమ యెల్ల వెల్లిఁ గె**

**న్నురుగులు గట్టినట్టులు గనుంగొన నయ్యె సురేంద్రగోపముల్**

**గరఁగిన వింటియ ప్పసరుకైవడిఁ దెట్టెలుపెట్టుపచ్చికన్**

జోరున వర్షం కురిసి ఇంద్రధనుస్సు విరియడం జరిగింది. ప్రకాశవంతంగా మేఘములమీద విరిసిన ఇంద్రధనుస్సు ఆ నీటి ఉద్ధృతికి కరిగిపోయింది. వరద ఎత్తి ప్రవాహం ఐనప్పుడు ఆ వరదనీటి ఎర్రని బురద రంగుగా ఇంద్రధనుస్సులోని ఎర్రరంగు కారి మారిపోయిందా అనిపిస్తున్నది. ఆ ఇంద్రధనుస్సులోని ఆకుపచ్చని రంగు కరిగి పచ్చికల రంగుగా మారిందా అన్నట్టు కనిపిస్తున్నది. ఆ పచ్చికలమీద ఎర్రని తివాచీ పరిచినట్లు ఆరుద్ర పురుగులు గుంపులు గుంపులుగా, దట్టంగా పరుచుకున్నాయి.

**ఘనవృష్టికతన ఘణు లే**

**పున నలవల్మీకరంధ్రములు మూయఁగ నె**

**త్తినగొడుగు లనఁగ ఛత్రా**

**కనికాయం బవనినెల్ల కడలం బొడమెన్**

తీవ్రంగా వర్షం కురియడంతో, తమ కలుగులలోకి చేరిన నీరు నిలిచి నివాసం పాడైపోకుండా ఉండడంకోసమా అన్నట్లు ఎత్తిన గొడుగులలాగా భూమిమీద, పుట్టలమీద అంతటా అంతటా కుక్కగొడుగులు మొలిచాయి..

శరదృతువు

ఉ. రాజమరాళలబ్ధగిరిరంధ్రము శాలివనీశరావలీ

వైజననంబు యజ్వహుత వాజహుతాశయ భాస్వదిందిరాం

భోజసమాగమం బుదిత బోధభుజంగశయోపచార నీ

రాజనపుల్లహల్లకసరం బుదయించె శరద్దినం బిలన్

వర్షాకాలం వెళ్ళిపోయింది. శరదృతువు వచ్చింది. క్రౌంచ పర్వత బిలం రాజహంసలను పొందింది(రాజమరాళలబ్ధగిరిరంధ్రము) వర్షాకాలం మానస సరోవర ప్రాంతంలో గడిపిన హంసలు వెనక్కు తిరిగి వచ్చి క్రౌంచ పర్వత బిలంలో ప్రవేశించాయి. ఇతర ప్రాంతాలకు వలసవెళ్ళడంకోసం సిద్ధపడ్డాయి అని భావం. పరశురాముడు, కుమారస్వామి యిద్దరూ పరమశివునివద్ద విలువిద్యను అభ్యసించారు. ఆతర్వాత వారి ప్రతిభకు పరీక్ష జరిగింది. ఆ సందర్భంగా పరశురాముడు బాణంతో క్రౌంచ పర్వతానికి చిల్లి పెట్టాడు. ఆ రంధ్రమునుండి హంసలు వర్షాకాలంలో మానససరోవర ప్రాంతానికి వెళ్లి గడిపి, వర్షాకాలం ముగిసినతర్వాత మరలా అదే బిలమార్గం నుండి వెనక్కు వచ్చి వివిధ ప్రాంతాలకు వలస వెళ్తాయి అని పురాణ గాథ ఆధారంగా ఏర్పడిన కవి సంప్రదాయం. ఆముక్తమాల్యదా ప్రారంభంలోని దశావతార వర్ణనలో పరశురామావతార వర్ణన సందర్భంలో కూడా ఈ విషయం చెప్పాడు రాయలవారు. శాలి(వరి)ధాన్యాలచేలకు, రెల్లుపొదలకు వెన్నులు ఈనే కాలం (శాలివనీశరావలీ వైజననంబు) వచ్చింది. యజ్ఞ యాగాదులు చేసే శ్రోత్రియుల హోమాగ్నుల కాలము (యజ్వహుత వాజహుతాశయ )వచ్చింది. ప్రభాకలితమైన శ్రీ లక్ష్మికి పద్మములకు కలయిక జరిగే కాలం (భాస్వదిందిరాంభోజ సమాగమం) వచ్చింది, శరత్కాలంలో కమలములు విరివిగా విచ్చుకుంటాయి కనుక, కమలములలో నివాసం చేసుకోవడానికి లక్ష్మి వస్తుంది అని రమ్యమైన భావన. మెలకువ వచ్చిన భుజంగ శయనుడు ఐన శ్రీమహావిష్ణువుకు నీరాజన ఉపచారములు చేయడానికి సిద్ధమైన శరదృతువు అనే లక్ష్మి ఎర్రని కనుకొలకులు అన్నట్లుగా విచ్చుకున్న ఎర్రని కలువలు నిండిన సరోవరములతో కళకళ లాడే కాలము (ఉదిత బోధభుజంగశయోపచార నీరాజనపుల్లహల్లకసరం) ఐన శరదృతువు ఉదయించింది. చాతుర్మాస కాలంలో మహావిష్ణువు యోగనిద్రలో ఉంటాడు, ఇప్పుడు మేల్కొంటాడు శరదృతువులో, కనుక ఆయనకు ఉపచారములు చేయడానికి శరదృతువు అనే 'లక్ష్మి'

సిద్ధమైంది! రాయలకు పక్షుల, పంటల, జనజీవన విధానాల, ఆధ్యాత్మిక వివరాల లోతులు ఎంతగా తెలుసో అన్నది, తెలిసినవాటిని ఎంత అందంగా చెప్పగలడో అన్నదానికి గొప్ప నిదర్శనం యిది.

ఆ. సాంధ్యరాగలహరి సామిరంజితములై

తిరిగె మింట నిదుర దెలిసినట్టి

యిందిరాధిపతికి నెత్తుకర్పూరనీ

రాజనంబులన శరద్ఘనములు

శరదృతువులో సంధ్యాకాలంలో సగము (సామి) ఎర్రనైన మేఘాలు అప్పుడే నిద్రలేచిన విష్ణుమూర్తికి పట్టిన నీరాజనంలా కదులుతూ ఉన్నాయి ఆకాశంలో. నీరాజనం ఇచ్చేప్పుడు కదిలే ఎర్రని జ్యోతిలాగా సంధ్యారాగాన్ని అలుముకున్న ఎర్రని మేఘాలు కదులుతున్నాయి.

క. రవి శశి ముకురములు శర

ద్యువతి మెఱుఁగువెట్టుభూతి యో యనఁ బర్వెన్

బవనాహతసప్తచ్ఛద
నివహపరాగంబు దివికి నిర్మలకాంతిన్

సూర్యుడు, చంద్రుడు అనే దర్పణాలకు వర్షాకాలంలో మురికి పట్టింది. శరదృతువులో గాలికి ఎగురుతున్న ఏడాకుల అరటి చెట్ల పుప్పొడి ఆ అద్దాలను తుడవడానికి శరదృతువు అనే యువతి ఉపయోగిస్తున్న బూడిదలాగా ఉన్నది. వర్షాకాలపు నీటి మేఘాలు అనే నిమ్ము, మురికి పట్టింది సూర్యుడు, చంద్రుడు అనే రెండు అద్దాలకు. అద్దములను తుడవడానికి మెత్తని బూడిదను ఉపయోగించడం గ్రామీణ స్త్రీల అలవాటు, ఇక్కడ శరదృతువు అనే గ్రామీణ స్త్రీ ఆ సూర్య, చంద్రులనే అద్దములను తుడవడానికి ఉపయోగిస్తున్న మెత్తని బూడిదలాగా ఉన్నది ఎగురుతున్న ఆ ఏడాకుల అరటి పుప్పొడి.

తే. నీరజేక్షణుడవ్వేళ నిద్ర దెలిసి
యడుగుఁ దనమీఁద మోపనో యవనిరమణి
కంటకిత గాత్రి యయ్యె నాఁగా విపాక
పరుషకంటక శాలిమంజరులు వొలిచె

(నీరజేక్షణుడు) తామరపూలవంటి విశాలమైన కన్నులున్న శ్రీమహావిష్ణువు, తన నాథుడు, నాలుగునెలలు నిద్రపోయి ఇప్పుడే మేల్కొన్నాడు, తనమీద కాలుమోపాడు అనే ఆనందంతో అయన పాదస్పర్శకు పులకించిన భూదేవి దేహంమీది పులకలు అన్నట్లు భూమిమీద పండిన వరిచేల వెన్నులమీది ముళ్ళు కనిపిస్తున్నాయి.

ఉ. హెచ్చినమైత్రిఁ బద్మినుల కెల్ల ఘనాత్యయ కారుకుండు సొ
మ్మచ్చుపడంగఁ జేయుటకు నై యలక్రౌంచనగంబువేలిక
మ్మచ్చున నీడ్చు శర్వగిరియందలి వెండిశలాక పిండు నా
వచ్చి మరాళమాలికలు వ్రాలెఁ గొలంకులఁ జక్ర ఝుంకృతిన్

ఆ శరదృతువులో తెల్లని రాజహంసలు వేగంగా తొందరగా వచ్చి కొలనులలో చేరాయి. పద్మినీజాతి స్త్రీలనే కొలనులకు(పద్మములున్న కొలనులు కనుక) ఆభరణాలు చేసి ఇవ్వడానికి క్రౌంచ పర్వతము అనే కమ్మచ్చు రంధ్రమునుండి శరదృతువు అనే కంసాలి లాగుతున్న వెండికొండ (కైలాసము) అనే వెండి తీగలలాగా ఉన్నాయి ఆ హంసలు.

తే. కొలనఁ గరిదంపతులు పద్మకళిక లొకటి
కొకటి యానెత్త మకరంద మొలుక నమరె
నివి శరత్పద్మ నిలయకు నెలమితోడఁ
గావల నభిషేకమున కెత్తు కడవ లనఁగ

ఆ శరదృతువులో నిర్మలంగా ఉండే సరస్సులోజలక్రీడలాడడంకోసం దిగిన ఏనుగుల జంట ఒకరికొకరు ప్రేమతో ఇవ్వడం కోసం అన్నట్టు పద్మములను పైకెత్తి పట్టుకోవడంతో ఆ పద్మములలోని మకరందం జాలువారుతున్నది. పైకెత్తిన ఆ పద్మములు కడవలలాగా ఉన్నాయి. కారుతున్న ఆ మకరందం పద్మనిలయయైన శ్రీమహాలక్ష్మికి అభిషేకం చేయడానికి జాలువారుతున్న తేనెలా( శుద్ధోదకంలానో) ఉన్నది. యిది అత్యద్భుతమైన ఆధ్యాత్మిక రహస్యం ఉన్న అందమైన పద్యం. ఇదే భావాన్ని ఆముక్తమాల్యద ప్రారంభంలో శ్రీవిల్లిపుత్తూరులోని గృహముల వర్ణనలో చేశాడు అని తెలుసుకున్నాము.

‘ లక్ష్మీర్దివ్యైర్గజేంద్రై ర్మణిగణ ఖచితైః స్నాపితా హేమకుంభైః నిత్యం సా పద్మహస్తా మమ వసతు గృహే సర్వ మాంగల్య యుక్తా ’ అని శ్రీసూక్తం చెప్తుంది, అమ్మవారి అభిషేకం చేసేప్పుడు చెప్పే మంత్రం యిది(ఆస్తికులైనవారికి)అలా చేయడం శ్రీప్రదం, అది ఒక సూచన. మరొకటి ఆదిశంకరాచార్య విరచితమైన కనకధారాస్తోత్రంలో కూడా చెప్పబడిన శ్రీలక్ష్మీఉపాసనలోని రహస్యాన్ని ఇక్కడ చెప్పాడు శ్రీకృష్ణదేవరాయలు. ‘దిగ్గస్థిభిః కనకకుంభ ముఖావసృష్ట స్వర్వాహినీ విమల చారు జలాప్లుతాంగీం ..’ అన్నాడు ఆదిశంకరుడు, రెండుప్రక్కలా దిగ్గజాలు స్వర్ణ కలశాలతో (దేవగంగా) జలంతో అభిషేకిస్తుండగా పద్మాలయయైన శ్రీమహాలక్ష్మీ ధ్యానము, ఉపాసన ఆమెకు అత్యంత ప్రీతికరమైన ఆరాధనా విధానము, సాధకులకు సర్వార్థప్రదాయకం. దాన్ని ఇక్కడ ప్రత్యక్షముగా సూచిస్తున్నాడు రాయలవారు. ఆతర్వాత యామునాచార్యులవారికి యుద్ధములో లభించే విజయలక్ష్మికి , ఆ తర్వాత ఆధ్యాత్మికప్రపంచంలో లభించబోయే శాశ్వతమైన మోక్షలక్ష్మికి యిది సూచన, యిలా శ్రీమహాలక్ష్మిని భావించి ఉపాసించడం వలన ‘ గుణాధికా గురుతర భాగ్య భాగినో భవంతి తే భువి బుధ భావితాశయాః’ సద్గుణ సంపత్తిచేత మహాజ్ఞానులు, విద్వాంసులచేత కూడా స్తుతింపబడే ఉత్తమమైన యశస్సు అనే ఐశ్వర్యం లభిస్తుంది అని కూడా కనకధారాస్తవ ఫలశ్రుతిలో ఆదిశంకరుడు చెప్పాడు, ఆ శాశ్వతసిరి సంప్రాప్తించబోతున్నది యామునాచార్యులకు ముందుముందు, అది ధ్వని!

ఇటువంటి శరదృతువు వచ్చింది. సరస్సులు నిర్మలములైనాయి. బురదనేలలు ఎండిపోయాయి. యుద్ధయాత్రకు అనువైన సమయము వచ్చింది. ఇచ్చిన మాటప్రకారము శత్రురాజులను లొంగదీయడానికి బయల్దేరాడు యామునాచార్యులు.

శరదృతువు వెళ్ళిపోయినతర్వాత, తను క్షత్రియధర్మాన్ని అంగీకరించాడు కనుక, మహారాజుకు మాట ఇచ్చాడు గనుక చతురంగ బలాలతో కూడిన మహాసైన్యముతో దండయాత్రకు వెళ్లి, శత్రురాజులందరినీ జయించి,

**జన్నములు చేసి దానము**

**ల న్నానాదేశవిప్రులం దనిపి సుసం**

**పన్నత ననిశము బహుభో**

**గోన్నతుడై యాదమరచి యుండె నశంకన్**

యజ్ఞములు చేసి, నానాదేశములనుండి వచ్చిన విప్రులకు దానములను చేసి, తృప్తినొందించి, భోగభాగ్యములతో సమృద్ధిగా నిరంతరమూ నిశ్శంకగా ఆదమరిచి అంటే ప్రశాంతముగా, ఏ విచారమూ లేక గడుపసాగాడు, అంటే ఆ రాజభోగాలలో మునిగి భక్తిజ్ఞానవైరాగ్యములను విస్మరించి గడపసాగాడు. ఆతని రాజ్యము సకల సమృద్ధిగా ఆనందమయంగా ఉన్నది.

యామునాచార్యుని పితామహుడు నాథముని అనే మహా జ్ఞాని, ఆచార్యుడు. ఆయనకు శిష్యుడు పుండరీకాక్షుడు అనే మహానుభావుడు. ఆ పుండరీకాక్షుని శిష్యుడు శ్రీరామమిశ్రుడు అనే యోగి, మహాజ్ఞాని. తన గురువుగారికి గురువుగారైన నాథమునికి మనుమడు, జ్ఞాని, విరాగి ఐన యామునాచార్యుడు రాచరికపు భోగాభాగ్యాలలో మునిగి తన ఆధ్యాత్మికసంపత్తిని కోల్పోయి విలాసవంతమైన జీవితంలో మునిగిపోవడం పట్ల తీవ్రంగా బాధపడ్డాడు. ఎలాంటి మహానుభావుని మనుమడు ఎలా భ్రష్టుడైపోయాడు అని చింతించి, ఎలాగైనా యామునాచార్యుడిని పూర్వపు ఆధ్యాత్మిక మార్గంలోకి మళ్ళించాలి అని నిశ్చయించుకున్నాడు.

**తొడిఁబడి విషయాతురు నవి**

**విడువు మనుటకంటెఁ గలదె వేరేపగ నే**

**ర్పడరఁ గథాదుల నొకవెం**

**బడి దోఁపం బలికి మైత్రి వాపుట యొప్పున్**

తొందరపడి విషయాసక్తుడైనవాడికి వాటిని విడిచిపెట్టుమని చెప్పడం కంటె పగ కోరి కోరి కొనితెచ్చుకోడం వేరే ఏదన్నా ఉంటుందా? అందునా మహారాజు ఐన వాడికి రాజభోగాలను విడిచిపెట్టుమని చెప్పడం ఇంకా ప్రమాదకరం కదా, అందుకని ఉపాయంగా, ఏవో కథలు ఉపమానాలు చెప్పి బుద్ధి మరలించడం మంచిది అనుకున్నాడు శ్రీరామమిశ్రుడు. ఉపాయంగా ప్రతిరోజూ 'ముళ్ళముస్తె కూర' ను తీసుకుని వెళ్లి, ఒక వైష్ణవుడు మహారాజుకు భోజనంలో వండిపెట్టడం కోసం తెచ్చి ఇచ్చినట్లు చెప్పి వండండి అని మహారాజుకు వండిపెట్టే వంటబ్రాహ్మణులకు ఇవ్వడం మొదలుబెట్టాడు. వారు అలాగే వండిపెట్టడం మొదలెట్టారు. అలా ఆ ముండ్లముస్తె కూరకు అలవాటుపడ్డాడు యామునాచార్యుడు. ఒకనాడు భోజనం చేస్తూ ఆ ముండ్లముస్తె కూర రుచికి ఆనందించి, నిత్యమూ దీన్ని తెచ్చి ఇస్తున్న ఆ భాగవతుడిని మా భోజనానంతరము పిలిపించి మాకు చూపించండి అని ఆజ్ఞాపించాడు యామునాచార్యుడు. అలాగే శ్రీరామమిశ్రుడికి మహారాజ దర్శనం చేయించారు భటులు. ఆయనకు నమస్కరించి ' మీ కోరిక ఏమిటి? ప్రతిరోజూ మాకు రుచికరమైన ఆ కూరను సమర్పిస్తున్నారు, మానుండి మీరు ఆశించునది ఏమైనా ఉన్నదా? అని అడిగాడు యామునాచార్యుడు.

**మీపెద్దలు గూర్చిన ని**

**క్షేప మొకటి సహ్యజనిత సింధుజలాంత**

**ర్ద్వీపమున నుండ నీకుం**

**జూపంగా వచ్చితిని వసుమతీ నాథా!**

మహారాజా! మీ పెద్దలు కూడబెట్టి, భక్తితో సేవించి, సహ్యపర్వతములో పుట్టిన కావేరీ నదీప్రవాహము మధ్యలోనున్న ఒక దీవిలో పాతిపెట్టిన నిధిని మీకు చూపించాలని నా కోరిక మహారాజా, అందుకే ప్రతి రోజూ వస్తున్నాను, ఆ ముండ్లముస్తెకూర తెస్తున్నాను, ఈ రోజూ అందుకే వచ్చాను, అందుకే తెచ్చాను అన్నాడు శ్రీరామమిశ్రుడు.

**నా కేటికి నిక్షేపము**

**నాకు నిధియు నాకరంబు నరనాథులసొ**

**మ్మేకాన విన్నవించెద**

**నాకర్ణింపుము తదీయమగువిధ మెల్లన్**

నాకెందుకు నిధి నిక్షేపాలు, భాగవతుడికి? నీవు మాత్రము నాకెందుకు నిధినిక్షేపాలు అని పలుకవద్దు, ('నాకు' అంటే అలా అనకు అని కూడా)మహారాజా! నిధినిక్షేపాలు గనులు సంపద అన్నీ ప్రభువుల ఆస్తులే, వారికి చెందవలసినవే గనుక, ఆ నిధి వివరాలు మొత్తం చెబుతాను వినండి.

**స్ఫటల మణుల్మీర శాంతమై శ్వేతమై**

**నట్టిత్రాఁ చొక్కటి చుట్టియుండు**

**రక్షోగృహీత మన్మథ తొల్లి గల దది**

**పాలయ దం దేఁడారు నెలలు గాని**

**యేపాటిబలి యైనఁ జేపడుఁ బ్రాణిహిం**

**సాదిపూజనముల కాసపడదు**

**తనవెలుం గొగి నిరంజనదృష్టికినె లక్ష్య**

**మై యుండు నయ్యు నింతంత గాదు**

**రత్న మొక్కటిపై నపూర్వంబు మెఱయుఁ**

**గలదు పద్మంబు శంఖంబు పలుకు లేటి**

**కక్షయ మనంత మాద్య మే కాంతమందు**

**భూప నీ కొక్కనికె కాక చూపరాదు**

మహారాజా! పడగలలో మణులు ప్రకాశిస్తుండగా శాంతమైన, తెల్లని త్రాచుపాము ఒకటి ఆ నిధిని చుట్టుకుని ఉంటుంది. నిధి నిక్షేపాలను నాగులు రక్షిస్తూ ఉంటాయి అని నమ్మకం, అనుభవములో ఎందఱో కనుగొన్నది కూడా. తెల్ల త్రాచులు, శ్వేతనాగులు ప్రాచీన నిధి నిక్షేపాలున్నచోట రక్షగా ఉండడం ప్రసిద్ధము. నిధి అంటున్నాడు కనుక తెల్ల త్రాచు చుట్టుకొని ఉండడం న్యాయమే. అంతరార్థం శ్రీమహావిష్ణువు తనను శయ్యగా చేసుకని నిదురిస్తాడు కనుక ప్రశాంతంగా ఏ కదలికలూ లేకుండా శయ్యయై ఉండే తెల్లని తరచి ఆదిశేషుడు తన పడగలమీది మణులు మెరుస్తుండగా చుట్టాలు చుట్టుకుని తెల్లని పానుపులాగా ఉంటుంది అని. మరొక చమత్కారము శయ్యకు ఉండాల్సిన లక్షణాలలో తెల్లగా స్వచ్ఛముగా ఉండడం ఒకటి. కనుక తెల్లని శేషుని తెల్లని పానుపన్నమాట!

రాక్షసునిచేత గ్రహింపబడినది అన్న ప్రసిద్ధి ఉన్నది ఆ నిధికి. నిధి నిక్షేపాలను అసురులు బలవంతముగా నైనా అనుభవిస్తారు అని చమత్కారము, బలవంతంగా స్వంతం చేసుకోవాలి అనుకునేవాడు రాక్షసుడు అని చురక. శ్రీరామచంద్రుడు తన పట్టాభిషేక సందర్భముగా అందరికీ అనేక రకాల కానుకలిచ్చాడు, విభీషణునికి ఇక్ష్వాకుల పూజామందిరములోని శ్రీరంగనాథుని మూర్తిని బహూకరించాడు, దానిని తీసుకుని వెళ్తూ సంధ్యావందన సమయమైంది అని కావేరీ నదీ తీరంలో ఇసుకతిన్నెల మీద దానిని ఉంచి, తన సంధ్యావందన విధులు పూర్తిచేసుకున్నతర్వాత ఎంత ప్రయత్నించినా ఆ విగ్రహమును లేపలేక బాధపడుతుంటే, తనను అక్కడే ప్రతిష్ఠించి వెళ్ళమని ఆ రంగనాథుని మూర్తి ఆదేశించడంతో అలాగే చేసి వెళ్ళాడు విభీషణుడు అని ఐతిహ్యం, కనుక రాక్షసునిచేత గ్రహించబడింది అని అంతరార్థం. ఆ రాక్షసుని పొందును ఏడాదికో ఆరు నెలలకో పొందుతుంది ఆ నిధి. శ్రీరంగనాథుని ప్రతిమను అక్కడే ప్రతిష్ఠించి ఆరునెలలకు ఒకసారి, సంవత్సరానికి ఒకసారి వచ్చి పూజలు చేస్తాడు, ఇప్పటికీ, ఆయన చిరంజీవి కనుక అని ఐతిహ్యం, అది అంతరార్థం.

ఏమాత్రమూ బలి, ప్రాణిహింస అనేది కోరదు ఆ నిధి. సామాన్యంగా నిదినిక్షేపాలను స్వంతం చేసుకోడానికి బలులిస్తుంటారు లోకంలో, కానీ ఈ నిధి ఏ బలినీ కోరదు, సులభముగానే వశమవుతుంది. అంజనము అంటే కాటుక, నిరంజనము అంటే కాటుక లేకుండా అని, నిధి నిక్షేపాలను కనుక్కోడానికి మంత్రించిన అంజనమును కనులకు పెట్టుకుంటారు మంత్ర తంత్రాల సాధన చేసేవాళ్ళు, ఈ నిధిని కనుక్కొనడానికి అదేమీ అవసరములేదు. తన వెలుగులను ప్రసరించి, కాటుక వంటి అజ్ఞానము అంధకారమును తొలిగించి తనే దర్శనమిస్తుంది, సంప్రాప్తిస్తుంది ప్రాప్తమున్నవాళ్లకు. అట్లాంటిది, ఇట్లాంటిది కాదు, చవకైనది, నాసి ఐనది కాదు, అది మహానిధి. అంతలు ఇంతలు అని చెప్పడానికి వీలు లేని అనంతమైన మహిమగల శ్రీరంగని నిధి అది.

అదొక అపూర్వమైన పూర్వపు రత్నము. పురాతనుడైన శ్రీ రంగడు అనే రత్నము. శంఖము పద్మము మొదలైన నిధులు గలది. నవనిధులలో శంఖము, పద్మము అనే నిధులు భాగాలు. శ్రీ రంగనాథుని పరంగా అయన చేతిలో శంఖము ఉంటుంది, ఆయన నాభిలో పద్మము, తామరపూవు ఉంటుంది, బ్రహ్మదేవుడు ఆ తామరపూవునుండే జన్మించాడు మరి. వేల మాటలు ఎందుకు, ఆ నిధి అక్షయమైనది, తరిగిపోనిది. అనంతమైనది, ఇంతా అంత అని చెప్పలేని అనంతమైన నిధి. ఆది ఐనది, ఆది దేవుడైన శ్రీ రంగనాధుడు అనే నిధి అది. అది ఏకాంతములో తప్ప, అదీ నీకు తప్ప వేరెవరికీ చూపించారనిది మహారాజా! అన్నాడు శ్రీరామమిశ్రుడు. ఆ వివరాలకు అబ్బురపడి, ఆనందించి,

సేనాసమేతుడై ఆ స్థలానికి, శ్రీరంగానికి వెళ్లి, ముందు కావేరిలో స్నానం చేసి, పునీతుడై, రంగనాథుని దర్శించి సేవించి, ఎక్కడ ఆ నిధి అన్నట్లుగా సాభిప్రాయంగా శ్రీరామమిశ్రునివైపు చూశాడు. శ్రీరామమిశ్రుడు చిరునవ్వులు చిందిస్తూ ఇలా అన్నాడు.

**మీపెద్దలు గూర్చనని**

**క్షేపమ్మిది కొమ్మటంచు శ్రీరంగపతి**

**శ్రీపదయుగ్మముఁ జూపిన**

**నాప్రుథివీపతిహతాదపాస్తభ్రముడై**

మీపెద్దలు దాచిపెట్టిన, పాతిపెట్టిన నిధి యిదే, చూడండి మహారాజా, తీసుకోండి, అని శ్రీరంగనాథుని పాదపద్మములను చూపించాడు. అదిరిపాటుతో అంతవరకూ తను పొందిన భోగభాగ్యాలు అనే భ్రమను పోగొట్టుకున్నవాడైనాడు (అపాస్త భ్రముడు) యామునాచార్యుడు. వెంటనే శ్రీరంగనాథసేవామయమైన తన పూర్వపు స్థితిని గుర్తుచేసుకున్నాడు. కన్నీరు కారుస్తూ ' మీరెవరు' అని అడిగాడు శ్రీరామమిశ్రుడిని. మహారాజా! నేను మీ తాతగారైన నాథమునికి శిష్యులైన పుండరీకాక్షులవారి శిష్యుడను. మీ తాతగారు మీ భావిజన్మను, భవిష్యత్తులో మహాభక్తునిగా తమ జన్మను తెలిసికొని, మీచేతనే ఈ విశిష్టాద్వైతము సకలభూతహితమై వెలుగొందగలదు అని తెలుసుకుని, మీకు ఉపదేశింపుమని తనశిష్యునికి అనగా నా గురుదేవులైన పుండరీకాక్షులవారికి 'ద్వయ మంత్రమును' ఉపదేశించారు. ఆయన ఆ మంత్రాన్ని నాకు ఉపదేశించి, దానిని మీకు ఉపదేశించుమని నాకు ఆదేశం చేసిన కారణంగా మీ వద్దకు వచ్చాను మహారాజా! అనగా, యామునాచార్యుడు శ్రీరామమిశ్రునకు సాష్టాంగ దండ ప్రణామం చేసి, పంచ సంస్కారములను పొంది, మంత్రోపదేశం పొంది, అంతటితో ఆగక,రాజ్యానికి తిరిగివచ్చి, తన కుమారునికి రాజ్యపట్టాభిషేకము చేసి, కుమారునికిరాజనీతిని ఉపదేశం చేశాడు.

శ్రీరంగని పదసన్నిధి అనే పెన్నిధిని పొందిన యామునాచార్యుడు ఇహలోకపు నిధులమీద, భోగభాగ్యాల మీద విరక్తి పొందాడు. శ్రీరామ మిశ్రునికి వందనము చేసి రాజ్యానికి తిరిగివెళ్ళి కుమారునికి పట్టాభిషేకము చేసి ఆతనికి 'రాజనీతి'ని ఇలా బోధించాడు.

**ఏపట్టున విసువక ర**

**క్షాపరుఁడవు గమ్ము ప్రజల చక్కి విపన్ను**

**ల్గాపెట్టిన విని తీర్పుము**

**కాపురుషులమీఁద నిడకు కార్యభరంబుల్**

ఏ సమయములోనూ విసుగు అనేది రానీయక ప్రజలను రక్షించుము, ఆపన్నులు మొరపెడితే వారి గోడును విని, వారి ఆపదలను తీర్చుము, దుర్జనులకు, కుత్సితులకు గొప్పవైన కార్యాలను అప్పజెప్పకు. రాజ్యపాలన అనేది హక్కు కాదు, బాధ్యత, నిరంతరమూ నెరవేర్చాల్సిన బాధ్యత. కార్యసాధనకోసం ఉత్తములైన, నిజాయితీపరులైన కార్యకర్తలను ఎంచుకో!

**మొదలఁ బెనిచి పిదపఁ గుదియింప నెవ్వాఁడుఁ**

**దనదు తొంటిహీన దశఁ దలంపఁ**

**డలుగుఁ గాన శీల మరయుచుఁ గ్రమవృద్ధిఁ**

**బెనిచి వేళవేళఁ బనులు గొనుము**

ఎవడినైనా సరే, వాడి స్థితిని మొదలు పెంచి, తర్వాత తగ్గిస్తే తన మొదటి తక్కువ స్థితిని గుర్తుంచుకోడు, తగ్గించబడిన తన ఉన్నత స్థితినే గుర్తుంచుకుంటాడు, ఆ స్థితిని తగ్గిస్తే అలుగుతాడు. ఎవడైనా తనకొచ్చిన ప్రమోషన్లను గుర్తుంచుకోడు, రానివాటినే గుర్తుంచుకుని అలుగుతాడు, కనుక వారి వారి శీలాన్నిబట్టి నెమ్మది నెమ్మదిగా ఉన్నతిని పెంచుతూ, ఇవ్వబోయే మరిన్ని ఉన్నతులను చూపిస్తూ, ఊరిస్తూ వారితో పనులు చేయించుకోవాలి, ఒకేసారి ఎక్కువగా ఇవ్వకూడదు, కొద్ది కొద్దిగా, క్రమక్రమంగా లబ్ధిని ఇస్తూ, తన చెప్పుచేతల్లో ఉంచుకోవాలి. ఎంత తెలివైన నీతి, ఆచరణ సాధ్యమైన నీతి, అద్భుతమైన ఫలితాలను ఇచ్చే నీతి!

**చదివి యధర్మ భీరు నృపశాస్త్ర విధిజ్ఞతల న్వయస్సు డె**

**బ్బదిటికి లోను నేఁబదికి బాహ్యమునై యరుజస్స్వపూర్వులై**

**మద మఱి రాజప్రార్థన నమాత్యతఁ గైకొని తీర్చపాఱువా**

**రొదవిన నంగముల్మిగుల నూర్జితమౌటకుఁ బూఁట సాలదే**

శాస్త్రములను బాగా చదువుకున్నవాడు, అధర్మము అంటే భయమును కలిగినవాడు, రాజనీతిశాస్త్ర విధులను తెలిసినవాడు, వయసులో డెబ్భైకి లోపు, యాభైకి పైన ఉన్నవాడు, అనారోగ్యము, రోగాలు లేనివాడు, తమ పూర్వీకుల కాలము నుండీ తెలిసినవాడు, విధేయుడైనవాడు, రాజు ప్రార్థనను మన్నించి అమాత్య పదవిని అంగీకరించి పనులను చక్కబెట్టేవాడు ఐన విప్రుడు, బ్రాహ్మణుడు, విద్వాంసుడు మంత్రిగా లభిస్తే రాజ్యాంగములు అనబడే స్వామి, అమాత్య, సుహృత్తు, కోశ, రాష్ట్ర, దుర్గ, బలములనేవి వృద్ధి పొందదానికి ఒక పూట చాలదూ, కనుక ఈ లక్షణాలను కలిగిఉన్నవాడినే మంత్రిగా నియమించుకోవాలి!

**కార్య మొక్కఁడు కనిన మాత్సర్యమున నొ**

**కండు గా దని ఖండించుఁ గ న్నెఱింగి**

**యిరువురను గా దనక కొల్వు విలిసి మీఁద**

**నల్ల వాఁ డెన్నినది సేయ నగు శుభంబు**

ఒకపని గురించి తెలిసినవాడు ఒకడు ఇలా చేస్తే బాగుంటుంది అని చెప్తే, ఈర్ష్యతో ఇంకొకడు అలా కాదు,ఇలా చేస్తే బాగుంటుంది అని ఖండిస్తాడు. ఇద్దరి తీరునూ కనిపెట్టి, ఎవరినీ ఖండించకుండ అప్పటికి కొలువును చాలించి, ఆ చర్చను ముగించి, ఆ తర్వాత మొదట అన్నవాడి, ఈర్ష్యలేని వాడి సూచనను పాటించడం వలన శుభము కలుగుతుంది. అంటే అందరు చెప్పేదీ వినాలి, తన ఆలోచనతో ఆచరించాలి, ఎవరినీ వెనకేసుకుని రాకూడదు, ఎవరినీ నొప్పించకూడదు!

**పగ వెలిఁ గని లోదస్యులఁ**

**జిగురింపఁగఁ జేసి నృపతి చిక్కువడఁ బను**

**ల్దగి సేయక తారే ది**

**క్కుగ నడతు రశంక నల్లికొని దుస్సచివుల్**

రాజుకు శత్రువులైన వారి అండను పొంది, వారిని వృద్ధిజేసి, రాజుకు శత్రువులను పెంచి, రాజు చిక్కులోపడి, ఏ పనినీ తనంత తానుగా స్వంత నిర్ణయాలతో చేయలేని స్థితిలో చిక్కుకునేట్లు చేసి, తామే రాజుకు దిక్కై, కొంతమందిని తమతో కూడగట్టుకుని నడుస్తుంటారు దుష్టులైన మంత్రులు, కనుక వారిపట్ల రాజు జాగరూకుడై ఉండాలి, రాజే కాదు, ఏ నాయకుడైనా సరే!

**భండారముతో హయమద**

**శుండాలఘటాళి దనదు సొమ్మై పొగా**

**నుండిన నంతటఁ బాయదె**

**పండితుఁడును బిరుదునైన పతికిని బయలై**

బొక్కసం బలంగా ఉండి, గుఱ్ఱాల, ఏనుగుల సంపత్తి బలంగా ఉండి, పాండిత్యము అంటే తెలివి తేటలు, విచక్షణ, శౌర్యము కలిగిన రాజుకు దుష్టులైన మంత్రులు చేసే చెడు ప్రయత్నాలు విఫలములై దూరంగా ఉంటాయి, అతడిని ఏమీ చేయలేవు. కనుక అంగబలము, అర్థ బలము, మేథో బలము అన్నీ ఉన్న రాజునూ ఏ దుష్టులూ ఏమీ చేయలేరు.

**క న్నొకటి నిద్రవోఁ బెఱకంట జాగ**

**రంబు గావించు భూరుహాగ్రంబుమీఁది**

**యచ్ఛభల్లంబు గతి భోగమనుభవించు**

**నెడను బహిరంతరరులపై దృష్టివలయు**

చెట్టునెక్కి కూర్చున్న ఎలుగుబంటి ఒకకన్నుతో నిద్రబోతూ, మరొక కన్నుతో మేల్కొని ఏ చిరుతపులో దాడిచేసి తనను చంపితినకుండా జాగ్రత్తపడినట్లు రాజు భోగభాగ్యాలను అనుభవిస్తూనే తన ఆంతరంగిక శత్రువులను(కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలను) బహిరంగ శత్రువులను గమనిస్తూ జాగ్రత్తగా ఉండాలి. ఆంతరంగిక శత్రువులు అంటే తన పక్షములోనే ఉన్నట్లు నటిస్తూ తన శత్రువులకు సహకరించే యింటి దొంగలు అని కూడా శ్లేష. ఈ విధముగా రాజు తన రాజ్యాన్ని జీవితాన్ని అనుభవించాలి.

**హదను వచ్చుదాఁక నపరాధిపై రోష**

**మాఁగి చెరుపవలయు హదను వేచి**

**లక్ష్యసిద్ధిదాఁక లావున శర మాఁగి**

**కాఁడ విడుచు విలుకాఁడు వోలె**

ధనుస్సును ఎక్కుపెట్టి, బాణమును చెవిదాకా లాగిపట్టి, తన గురి కుదిరేదాకా, తన లక్ష్యము ఐన శత్రువో జంతువో చిక్కేదాకా ఓపికపట్టి, అదనువచ్చినప్పుడు బాణాన్ని వదిలిపెట్టే విలుకాడిలాగా రాజు కూడా తనకు అపరాధము చేసినవాడిని అదనువచ్చేదాకా ఓపికపట్టి ఆ అదనువచ్చినప్పుడు వాడిని శిక్షించాలి, నాశనము చేయాలి!

యామునాచార్యుడు తన కుమారునికి రాజనీతిని బోధిస్తున్నాడు, యామునాచార్యుని సాధనముగా చేసుకుని శ్రీకృష్ణదేవరాయలు తన రాజనీతికౌశల్యాన్ని తెలియజేస్తున్నాడు. ఈ ఘట్టాన్ని చదివితే చాలు, శ్రీకృష్ణదేవరాయలు భారతదేశమే కాదు, ప్రపంచము మొత్తము చూసిన మహా చక్రవర్తులలో ఒకడని ఎందుకు భావిస్తామో తెలుస్తుంది.

**అహితుడు వేఁడిన నేలెడు**

**మహి సగమే నిచ్చి తెగని మైత్రి గొని విభుం**

**డహిభయము మాన్పికోఁ దగు**

**నహిభయ మహిభయముకంటె నధికము గాదే**

తనకు అహితుడైనవాడు వేడుకుంటే వాడికి తన రాజ్యములో సగభాగాన్ని ఇచ్చైనా సరే, తెగని స్నేహాన్ని చేసుకోవాలి. శత్రు భయాన్ని మాన్పుకోవాలి. శత్రువు పాముకన్నా దుర్మార్గుడు, శత్రుభయము పాము భయముకన్నా తీవ్రమైనది. 'అహిభయము' అంటే రాజులకు తమ స్వపక్షము లోని శత్రువుల వలన కలిగే భయము అని కూడా అర్థము, కనుక, స్వపక్షములో నున్న శత్రువులను గుర్తించడం ఎలాగూ కష్టమే,

ఇంటిదొంగను ఈశ్వరుడు కూడా పట్టుకోలేడు కదా, స్వపక్షములోని వారిని చాకచక్యముగా ఎదుర్కొనడానికి బయటి శత్రువులను మిత్రులుగా చేసుకుని, సమర్థులైన వారిని తన పక్షము వారిగా చేసుకొనడం మంచిది.

**బెదరి చేరని బలియుని బిగియఁ బట్ట**
**కతనిమైవడినే వచ్చి హత్తఁ జేఁత**
**క్రమము పెనఁగెడు బలుమీను త్రాటఁ జేఁదు**
**నొడ్డుగాలంపు వేఁటకాఁడుపమ గాడె**

బెదిరి తనంత తానుగా దాడికి రాకుండా ఉన్న శత్రువును నానాకష్టపడి పట్టుకునేకంటే వాడిని ఏదోరకంగా ఉసిగొలిపి వాడికి వాడి వచ్చి చిక్కుకునేలా చేయాలి, అతి తక్కువ శ్రమతో అతి ఎక్కువ ఫలితాన్ని రాబట్టాలి, పట్టూ విడుపూ కావాలి, ఉపాయం కావాలి. ఈ విషయములో తన గాలానికి చిక్కుకున్న పెద్దచాప పెనగులాడుతూ, లాక్కుపోవడానికి ప్రయత్నిస్తుంటే ఒక్కసారే తాడును తెగేదాకా లాగకుండా, అనవసరముగా అలసిపోకుండా, తాడును, గాలాన్ని నెమ్మదిగా లాగుతూ, వదులుతూ నిదానంగా చాపను వడ్డుకు లాగి బల్లెంతో పొడిచేసే తెలివైన జాలరి మనకు ఉదాహరణ కాదూ!

**అడవులు గడిదేశములవి**
**దడములుగాఁ బెంపు మాత్మ ధరణీస్థలికిన్**
**నడుములవి పొళ్లుపొళ్లుగఁ**
**బొడిపింపుము దస్యుబాధ పొందక యుండన్**

ఎల్లలలో, సీమలలో (ఇతర రాజ్యాల సరిహద్దులలో) అడవులను వృద్ధి జేయాలి, శత్రువులకు జొరబడడానికి కష్టంగా ఉంటుంది. తన రాజ్యములో దేశ మధ్యంలో ఉన్న అడవులను ముక్కలు ముక్కలుగా నరికేయాలి, చోరులకు మాటు లేకుండా ఉంటుంది, క్రూర జంతువులకు నెలవు లేకుండా ఉంటుంది.

**సింధుర మహాశ్వ ముఖ్యము ల్చేర్చు దొాల**
**దీవివణిజుల కూళ్ళు సద్మహములు పురిఁ**
**గొలువుఁ దేజంబు వెల మేలు గలుగఁ బ్రాఁత**
**వారిఁగాఁ జేయు మరి నవి చేరకుండ**

ఏనుగులు, మంచి జాతి గుఱ్ఱాలు మొదలైనవాటిని తీసుకొచ్చే దూరదేశపు వ్యాపారులకు ఊళ్లు, ఇళ్ళు, నీ కొలువులో సేవ, తేజస్సు(కీర్తి) వెలిగేలా ఏర్పాటు జేసి వారిని పాత వారిగా అంటే నీ చిరపరిచితులుగా అంటే స్నేహితులుగా ఉండేట్లు చేసుకో. ఆ మేలుజాతి ఏనుగులు, గుఱ్ఱాలు నీ శత్రువులకు అందుబాటులో లేకుండా చూసుకో!

**తా నవంబుగ దొరఁ జేయువాని మంత్ర**

**మునకు వేగమె లోఁ జేయఁ జనదు వాఁడు**

**క్రొత్తమన్నన రహి ననుగులకుఁ జెప్ప**

**నయిన నదిచెడు మరి వాఁడు నడఁగుఁ గాన**

క్రొత్తగా దొరతనాన్ని పెద్ద ఉద్యోగాన్ని ఇచ్చి పెంచినవాడిని వెంటనే ముఖ్యమైన మంత్రాంగ విషయాలలో, ఆలోచనలలో భాగస్వామిగా చేయకూడదు. వాడు కొత్తగా వచ్చిన పెద్దరికం, పదవి ఇచ్చిన సంతోషంలో ఆ విషయాన్ని తన వారితో గొప్పగా చెప్పుకుంటాడు, సమాచారం బయటపడిపోతుంది. గోప్యత ఉండదు. దానివల్ల వాడైనా చెడిపోతాడు, ఆ కార్యమైనా చెడిపోతుంది, రెండూ చెడిపోవచ్చు కూడా. కనుక క్రొత్తగా పదవులలోకి తీసుకున్నవారిని జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలి.

**ప్రతిన వలదు వైరి పట్టున నృపతికి**

**దండువెడలఁ దీర కుండుఁ దీరుఁ**

**గాక యుండియుండి కాలాంతరమున నౌఁ**

**గార్యకాఁడొ యనక గాఁడొ నృపుడు**

శత్రువు పట్ల రాజుకు మొండి పట్టు ఉండకూడదు. దండయాత్రకు, యుద్ధానికి వెళ్ళినప్పుడు అప్పుడు పని కాకపోవచ్చు, కావొచ్చు, లేదా తర్వాత కొంతకాలానికి కావొచ్చు, అంటే, విజయము అప్పుడే లభించవచ్చు, లభించకపోవచ్చు, కొంతకాలము తర్వాత లభించవచ్చు, ఏదీ కచ్చితంగా చెప్పలేము. రాజు కార్యశీలుడో? సమరశీలుడో? అంటే రాజు కార్యసాధకుడా? విజయసాధకుడా? కార్యసాధకుడే అయి ఉండాలి, కార్యసాధకునికి పట్టూ విడుపూ ఉండాలి అని ధ్వని.

కుమారా! ఈ విధముగా రాజు సకల విషయములలోకుశలుడై ఉండాలి. ఒకరు చెప్పకుండానే, యోగ్యులకు తగిన దానములను, మాన్యతను ఇవ్వాలి. దేవ, పితృ కార్యాలలో పితృ కార్యాలు ఉన్నతమైనవి కనుక వాటిని తప్పక చేయాలి. దేవకర్యాలు కూడా చేసి దైవానుగ్రహాన్ని పొందాలి. దానముచేత విప్రులకు, జ్ఞానముచేత తనకు రక్షణ కలిగేట్లు రాజు మెలగాలి.

**కరధృతదరారివితరణ**

**పరిపాలిత తొండమాన్నృపాలక!పునరు**

**త్తరిత నర నప్నృబాలక!**

**శరణాగతసేవధీ! భుజంగాశరధీ!**

శ్రీ వేంకటేశ్వరుని శ్రోతగా చేసుకుని, వినూత్నమైన, విచిత్రమైన వర్ణనలతో ఐదవ ఆశ్వాసాన్ని వినిపించడం మొదలుబెట్టాడు రాయలవారు.

శ్రీనీళాజాంబవతీ
మానసతామరసవిహరమాణమిళిందా!
భానద్యుదయకళిందా!
నానాంఘ్రిశిరోక్ష! శేషనగహర్యక్షా!

కావ్యం సాగుతున్నకొద్దీ కథనంలో పెరుగుతున్న వడికి, ఈ ఆశ్వాసములోని ప్రధాన అంశమైన గోదా రంగనాథుల ప్రణయప్రవాహవేగానికీ సూచనగా ఒక్క ఉదుటున దీర్ఘ సమాసాలతో మొదలుబెట్టాడు రాయలవారు.

శ్రీదేవి, నీళాదేవి, జాంబవతీదేవి అనే ముప్వురి మనసులనే తామరలయందు విహరించే మద భృంగమా! నీ శరీరకాంతి అనే నల్లని కాళిందీ ప్రవాహానికి పుట్టుకస్థానమైన కళింద పర్వతమువంటివాడా! అనేక పాదములు, శిరస్సులు, కన్నులు కలిగినవాడా! శేషాచలముపై వెలసిన సింహమా! అవధరించుమయ్యా అంటున్నాడు. గోదాదేవి కళ్యాణగాథను చెప్పడం మొదలెట్టి నాలుగు ఆశ్వాసాలు పూర్తి ఐనతర్వాత ఈ ఐదవ ఆశ్వాసములో ఆమెపాత్రను ప్రత్యక్షముగా పరిచయము చేస్తున్నాడు రాయలు. యిది ఒక విచిత్రము అయితే, ఆమె పాత్రను ప్రవేశపెట్టడం అన్న ఆలోచనతోనే రుక్మిణి(లక్ష్మి), నాగ్నజితి(నీళాదేవి) జాంబవతి గుర్తుకొచ్చారు రాయలకు, యమునానది(కాళింది)గుర్తుకొచ్చింది. యమునానదీ తీరములోనే కాత్యాయనీవ్రతం చేసి గోపికలు శ్రీకృష్ణుని భర్తగా పొందారు, గోదాదేవి కూడా ఆ వ్రతాన్నే ధనుర్మాసములో ఆచరించింది, దేవదేవుని పతిదేవునిగా పొందడానికి, తనను గోపికగా భావించుకుంది, విల్లిపుత్తూరును వ్రేపల్లెవాడగా భావించింది, కనుక యమునానది గుర్తుకొచ్చింది, స్వామి నల్లని శరీరకాంతి అనే ప్రవాహాన్ని పోల్చడానికి. అంతే కాదు, యమున మోహానికి చిహ్నం, ప్రేమకు చిహ్నం, స్వామి గోదాదేవి మోహపాశములో చిక్కుకున్నాడు, ఆమె కూడా ఆయనను ప్రేమించింది కనుక యమునానది గుర్తుకొచ్చింది.

ఎప్పటిలానే తనమానాన తాను స్వామికి మాలాకైంకర్యము చేసుకుంటూ నిరంతరమూ స్వామిస్మరణలోనే గడుపుతున్న విష్ణుచిత్తులవారు ఒకరోజు తులసీదళములకోసము, పూవులకోసము తన తోటలోకి వెళ్ళాడు. ఇక్కడ ఆ తోటను ఒక శృంగారరస భరితమైన 'మహా స్రగ్ధర'లో చెప్పాడు రాయలవారు, యిక ముందు ముందు అంతా శృంగార, ప్రేమరస ప్రవాహమే కనుక.

ఒకనాఁడామ్రాంకురౌఘుంబురు కుసుమ కుడుంగోదరక్ష్మోణిఁ దల్ప
ప్రకరం బై కాంక్షచే మున్ పతులఁబదరి పైఁబ్రౌఢి వాటించి నిట్టూ
ర్పెకదొట్టన్ డస్సి వీరాయిత మఱి  మఱి తా రెట్ల మున్నట్లయౌనా
యికలం గందర్పుఁడోటం బెఱిఁగి తఱిమి వీఁపేసె నా నంటు తోఁటన్

ఆ తోటలో మావిడి చివుళ్ళ సమూహము, విరివిగా పూపొదరిళ్ళు ఉన్నాయి. ఆ పొదరిళ్ళ మధ్య మదవతులు తమ మగవారిని పెనగి క్రిందికి తోసి, తాము మీద్దై ఉపరతి చేసి చేసి అలసి, ఆయాసపడి, ఇక చేతగాక మరలా తమ మగవారిని మీదకు లాక్కుని తాము క్రింద్దై రతిపారవశ్యాన్ని పొందారేమో, అలా రతిక్రీడలో తాము ఆధిక్యాన్ని ప్రదర్శించడానికి ప్రయత్నించి ఓడిపోయి, మరలా 'క్రింద్దై' పోవడం వలన, ఆటలలో ఓడిపోయినవారి వీపులమీద గెలిచినవారు 'చరిచి' గెలిచేయడం మామూలే కనుక, ఆ ఓడిపోయిన స్త్రీల వీపులమీద మన్మథుడు చరిచినప్పుడు పడిన కమిలిన కందిన గుర్తుల్లాగా, ఆ నేలమీద రాశులుగా పడిన చివుళ్ళు కనిపిస్తున్నాయి, అటువంటి తోటలోకి అడుగుబెట్టాడు విష్ణుచిత్తులవారు. ఆ పొదరిళ్ళమధ్యనున్న నేలమీద రాలిన లేత లేత ఎఱ్ఱని చివుళ్ళు ఆ మదవతుల వీపులమీద మన్మథుడు చరిచినపుడు ఏర్పడిన గాయాల్లా ఉన్నాయి.

వింగడ మైన యొక్కవనవీథిఁ గనుంగొనె నీడ సున్నపున్
రంగుటరంగు పచ్చల యరం గయి పో వెలిదమ్మిబావికిం
జెంగట నుల్లసిల్లు తులసీవనసీమ శుభాంగి నొక్క బా
లం గురువింద కందళ దళ ప్రతిమాంఘ్రి కరోదరాధరన్

అటువంటి తోటలోకి, వింగడమైన అంటే చక్కగా పండ్లనిచ్చేచెట్లు ఒకప్రక్కన, కూరగాయలనిచ్చే చెట్లు ఒకప్రక్కన, పూవులనిచ్చే లతలు, చెట్లు ఒకప్రక్కన, తులసీ వనము ఒకప్రక్కన, ఏ జాతికి ఆ జాతి ఒకప్రక్కన ఉండేట్లుగా ప్రత్యేకముగా విభజింపబడి, శ్రద్ధగా పోషింపబడుతున్న తోటలోకి అడుగుబెట్టాడు విష్ణుచిత్తులవారు. తోటలను, ఉద్యానవనములను పెంచవలసిన పద్ధతి యిది. ప్రతి వృక్షానికి, ప్రతి లతకు, ప్రతి పుష్పానికి ప్రత్యేకమైన లక్షణం ఉంటుంది. అందుకని వేరువేరుగా పెంచాలి. పూజకు సేకరించే పూలను కూడా విడివిడిగా సేకరించి, వేర్వేరు సెజ్జలలోనో, పళ్ళాలలోనో ఉంచి పూజ చేయాలి. పుష్పచింతామణి అనే ఒక ప్రాచీన గ్రంథం ఉన్నది, ఏయే పుష్పాలకు ఏమేమి లక్షణాలు, ఏమేమి ఫలితాలు ఉంటాయో అన్న సంగతి చెప్తుంది. సమస్త శాస్త్రములనూ అభ్యసించిన మహా జ్ఞాని రాయలు, కనుక 'వింగడమైన వనవీథి' అన్నాడు.

ఆ తోటలో తెల్లని సున్నపురంగులో ఉన్న పాలరాతి అరుగు ఒకటి ఉన్నది. చుట్టూ ఉన్న చెట్లనీడ దానిమీద ప్రతిఫలించి పచ్చలు తాపిన అరుగులాగా ఆకుపచ్చరంగులో మెరిసిపోతున్నది ఆ తెల్లని అరుగు. ఆ అరుగు సమీపములో విరివిగా తామరలు వికసించిన ఒక దిగుడుబావి ఉన్నది. ఆ దిగుడుబావికి సమీపంలో తులసీవనము ఉన్నది. ఆ తులసీవనములో ఒక శుభాంగిని, పగడపు తునకలవంటి లేత లేత ఎఱ్ఱని పాదములను, కరములను, అధరమును, ఉదరమును కలిగిన బాలికను చూశాడు విష్ణుచిత్తులవారు.

కావ్యప్రారంభము శార్దూలవిక్రీడితంతో చేయడం అనే సంప్రదాయాన్ని ప్రక్కనబెట్టి, ఉత్పలమాలతో మొదలెట్టిన సంగతిని, అందుకు గల కారణం( ఈ వ్యాసకర్త ఉద్దేశములో) ఈ సుదీర్ఘవ్యాస ప్రారంభములో చర్చించుకున్నాము. నాలుగు ఆశ్వాసాలు, ఐదువందల డెభ్భై పద్యాలూ ఐపోయినతర్వాత, యిప్పుడు ప్రత్యక్షముగా గోదాదేవి పాత్రను ప్రవేశపెడుతున్నాడు రాయలవారు. ఇక్కడకూడా ఉత్పలమాల పద్యముతోనే గోదాదేవిని పరిచయము చేస్తున్నాడు. దీనికి కూడా ఈ వ్యాసప్రారంభములో ఉదహరించిన విషయమే కారణము. ఉత్పలము అంటే కలువ. మన్మథునికి ఉన్న ఐదు బాణాలు అరవిందము, అశోకము, మామిడి, నవమల్లిక, నల్లకలువ. వీటిలో ఒక్కొక్క పువ్వుకు(ఒక్కొక్క బాణానికి)ఒక్కొక్క లక్షణము ఉన్నది. నల్లకలువకు నిశ్చేష్టులుగా చేయడం లక్షణము. గోదాదేవి తను ధరించి విడిచిన పూమాలకు స్వామిని మరిగించి, ఆయనను మోహపాశములో బంధించి, నిశ్చేష్టుడిని చేసింది, లొంగదీసుకుంది, కనుక ఆవిడ సమర్పించిన మాల నీలోత్పలమాల, దానికి సూచనగా రాయలు వాడుకున్నది ఉత్పలమాల. ఇంతవరకూ చెప్పిన నాలుగు ఆశ్వాసాలలో ఏ ఆశ్వాసములో కూడా ప్రధానమైన విషయాన్ని 'ఉత్పలమాల' తో ప్రారంభము చేయలేదు రాయలు, ఉద్దేశపూర్వకముగానే.

కనుఁగొని విస్మయం బొదవఁగా గదియం జని సౌకుమార్యమున్
దనురుచియున్సులక్షణవితానముఁ దేజముఁ జెల్వుఁ గొంత సే
పనిమిషదృష్టిఁ జూచి యహహా యనపత్యునకమ్ముకుందుఁడే
తనయఁగ నాకు నీ శిశువుఁ దాఁ గృప సేసె నటంచు హృష్టుఁడై

తులసీవనములో ఆ బాలికను చూసి, విస్మయము చెంది, దగ్గరికి వెళ్లి, ఆ శిశువుయొక్క సౌకుమార్యాన్ని, శరీర కాంతిని, శరీర శుభలక్షణములను, తేజస్సును కొంతసేపు రెప్పవాల్చకుండా చూసి, 'ఆహా! సంతానము లేని నాకు ఆ ముకుందుడే ఈ శిశువును కుమార్తెగా ప్రసాదించాడు' అని సంతోషించాడు విష్ణుచిత్తులవారు.

కొనిపోయి ధర్మగేహిని
కనురక్తి నొసంగఁ బొంగి యాయమయును జేఁ
పు నిజస్తన్యంబుల చేఁ
బెనిచె న్గో మొప్ప నిట్లు పెరుఁగఁ గ్రమమునన్

ఆ శిశువును తీసుకెళ్ళి తన భార్యకు అప్పగించాడు. ఆమెకు కూడా పట్టరాని ఆనందము కలిగి, పాలు చేపి, తన స్తన్యముతోనే గారాబముగా ఆ శిశువును పెంచసాగింది. సంతానములేని వారు శిశువును ఎవరినైనా పెంచుకుంటే మాతృత్వపు అనుభూతి, మమతానురాగాలు జనించి, శారీరక, మానసిక పరిస్థితులు మారి, సంతానార్హత కలుగుతుంది అని మన పూర్వీకుల అనుభవపూర్వక నానుడి. కనుకనే మాతృత్వమును ఎరుగని ఆవిడకు కూడా పాలు చేపాయి, అదీ రాయలవారి లోకపరిశీలనా దక్షత. ఆ బాలిక క్రమక్రమంగా ఆ దంపతుల పూర్వపు పున్నెములపంటగా కన్నులపంటగా పెరుగసాగింది.

కృష్ణుని పక్షము తప్ప, కృష్ణపక్షము తెలియని శుక్లపక్ష చంద్రునివలె తల్లిదండ్రులకు కన్నులపంటగా ఎదుగుతున్నది గోదాదేవి . ఆమెను బాల్యం విడిచిపోయింది, యవ్వనం చేరుకున్నది. ఆమె యవ్వనాన్ని సంతరించుకున్న విధానాన్ని అద్భుతమైన శ్లేషతో, తనకే సాధ్యమైన చమత్కృతితో, సరసభావసమ్మిళితంగా చెప్తున్నాడు రాయలు.

**వా తెర తొంటికైవడి మాటలాడదు / కుటిలవృత్తి వహించెఁగుంతలంబు**

**లక్షులు సిరులు రా నరచూడ్కిఁ గనుఁగొనె / నాడించె బొమగొని యాననంబు**

**చనుగొమల్నెగయ వక్షముపేక్షఁ గడకొత్తెఁ / బాణిపాదము లెర్రవారఁ దొడఁగె**

**సారెకు మధ్యంబు దారిద్ర్యముల చెప్పె / రొచ్చోర్వ కిటులోగ జొచ్చె మేను**

**వట్టిగాంభీర్య మొక్కఁడు వెట్టుకొనియె**

**నాభి నానాఁటి కీగతి నాఁటిపొందు**

**చవుకయైనట్టి యిచ్చటఁ జనదు నిలువ**

**ననుచు జారినకరణి బాల్యంబు జారె**

నోటికి తెర పడ్డట్టు అంతకుముందులా గలగలా మాట్లాడ్డం మానేసింది. మౌనం ప్రదర్శిస్తున్నది. ఏపుగా నల్లగా ఎదుగుతున్న శిరోజాలు కుటిల వృత్తిని వహించాయి, అంటే వంకర్లు తిరిగిపోయాయి, నొక్కుల నొక్కుల జుత్తు వచ్చింది. నడమంత్రపుసిరి వచ్చినపుడు నిర్లక్ష్యంగా, చూసీ చూడనట్టు చూసినట్లు కనులు చూడడం మొదలెట్టాయి. కనుబొమలు ముడిచి నిర్లక్ష్యంగా, అసహనంగా చూడడం మొదలైంది. చనుకొమ్మలు అంటే వక్షోజ శిఖరాలు గర్వంగా తలెత్తడంతో రొమ్ము ఉపేక్షకు గురి అయింది, కుచించుకుపోయింది. అరచేతులు, అరికాళ్ళు ఎర్రబారడం మొదలెట్టాయి. నడుము మాటిమాటికీ దారిద్ర్యాన్ని వెళ్ళబోసుకుంటున్నది, అంటే నడుము చిక్కి సన్నమైపోయింది. అందరిలో ఉండడానికి, రాసుకుంటూ పూసుకుంటూ తిరగడానికి ఒళ్ళు నిరాకరిస్తున్నది, అంటే ఇతరుల స్పర్శకు ఇబ్బంది పడుతున్నది. నాభి ఉత్తుత్తి గాంభీర్యాన్నిపెట్టుకుని మిన్నకుండిపోయింది, అంటే నాభి లోతై, అగాధమై, గంభీరమైపోయింది. నడమంత్రపు సిరి వచ్చినవాడు అహాన్ని ప్రదర్శిస్తుంటే అంతవరకూ కలివిడిగా తిరిగిన స్నేహితుడు, ఈ టెక్కు ఈ నిక్కు మనకెందుకు, ఇంతకుముందులాగా చనువు, సరదాల్లేవు నాతో, గోప్పోళ్ళతో మనకెందుకు, ఎక్కడుండేవాళ్ళు అక్కడే ఉండాలి అని దూరమైపోయినట్లుగా, కొత్తగా వచ్చిన యవ్వనము అనే సిరిని చూసి బాల్యం జారిపోయింది, పారిపోయింది గోదాదేవినుండి!

**హేమాభాంగవిభాధరారుణిమవక్త్రేందుప్రభాశ్రీలఁ ద**

**ద్భామారత్నము వొందదయ్యె ముసు దత్తద్వర్ణయుక్తాఖ్యలన్**

**శ్యామాత్వం బళిగర్వధూర్వహ కచచ్ఛాయాచ్ఛటం గాంచె నొఁ**

గా ముస్నుర్వి 'శిరఃప్రధాన' మను వాక్యం బెమ్మెయిన్ దప్పునే?

ఆ భామారత్నము, గోదాదేవి శరీరము పచ్చని బంగారపు వర్ణములో ఉన్నది. అధరము ఎర్రగా ఉంది. ముఖం చంద్రునివన్నెలో ఉన్నది. అయినా ఆ పచ్చని రంగువలన, ఎఱ్ఱని రంగువలన, చంద్రకాంతి వలన ఆ రంగులకు తగ్గట్టు పేరు రాలేదు ఆమెకు. ఆమె హరిణి కాలేదు శరీరపు ఛాయనుబట్టి, అరుణ కాలేదు పెదవుల కాంతిని బట్టి, పూర్ణిమ కాలేదు పూర్ణచంద్రుడిని బోలిన ముఖాన్నిబట్టి. నల్లని కాంతులతో మెరిసిపోతూ తుమ్మెదల గర్వాన్ని అణిచివేసే శ్యామలవర్ణంలో ఉన్న తలవెంట్రుకల కారణంగా ఆమెకు 'శ్యామ' అన్న పేరు సార్ధకం ఐంది, నిజమే, శరీరములో శిరస్సే ముఖ్యమైనది అన్నిటికన్నా అని పూర్వపు నానుడి తప్పు అవుతుందా ఎప్పుడైనా!

శరీరంలో తల ముఖ్యమైనది కనుక, ఆ తలపై తుమ్మెదల బారువంటి నల్లని కుటిల కుంతలములు ఉన్నాయి కనుక, ఆ నల్లని రంగువలన 'శ్యామ' ఐంది అనడంలో ఒక అందమైన శ్లేషను పొదిగాడు రాయలు. శ్యామ అంటే యవ్వనమధ్యస్థ ఐన స్త్రీ అని అర్ధం, కనుక ఆమె యవ్వనమధ్యంలో ఉన్నది యిప్పుడు, నేటి పరిభాషలో మిడ్ టీన్స్, అంటే కచ్చితంగా పదహారేళ్ళ పడుచు వయసు అన్నమాట!

ఈ శ్లేషకన్నాకూడా గొప్పదైన ధ్వని ఉన్నది ఈ పద్యంలో, ఈ వ్యాసకర్త ఉద్దేశంలో. ముఖ్యమైన అవయవం గురించే చెప్పాలి అనుకుంటే, కనులగురించి కూడా చెప్పొచ్చు, సర్వేంద్రియాణాం నయనం ప్రధానం అని చెప్పుకోడానికి. కానీ ఉద్దేశపూర్వకంగా ఆ 'తలవెంట్రుకల' గురించి చెప్తున్నాడు రాయలు. ఆ తలలో, ఆ వెంట్రుకలలో అలంకరించుకున్న పూమాలను స్వామికి సమర్పించింది కనుకే ఆమె 'ఆముక్తమాల్యద' ఐంది.

ఆ పూమాలకు మరిగి, ఆమెకు వశుడై మదన జనకుడు మదనభావదాసుడు అయినాడు కనుకే ఈ కథ జరిగింది. కనుక ఆ తలకట్టు, దాని కనికట్టు కనిపెట్టిన రసపట్టు రాయల కవితకు ఆటపట్టు. శ్రీకృష్ణదేవరాయ కవికన్నా రసికుడు, భావుకుడు, మార్మికుడు, స్వాప్నికుడు, చతురుడు ఐన కవి ఉన్నాడా?

ఆయతభుజైక చక్రుం
డాయదుపతి దొమ్మిఁ గెలువ నదరు మరునికా
లాయాసచక్రపరంపర
లో యన నుంగరపుఁగురులు యువతికినమరున్

విశాలమైన భుజములు కలిగినవాడు, ఒక్కటంటే ఒక్కటే చక్రమును(సుదర్శనం) కలిగినవాడు శ్రీకృష్ణుడు. ఆ యదుపతిని(శ్రీకృష్ణుని) యుద్ధంలో, మదనకదనంలో గెలువగలిగినదానిలా ఉన్నది గోదాదేవి. నల్లని ఉక్కుముక్కలతో చేయబడిన మన్మథుని చక్రముల పరంపరలో అన్నట్లు నల్లని ప్రకాశవంతమైన ఉంగరాల తలవెంట్రుకలు అనే అనేక చక్రాలు ఉన్నాయి ఈమెకు, ఆ శ్రీకృష్ణునికి ఉన్నది ఒక్క చక్రమే! ఇన్ని చక్రాలు మోహచక్రబంధంలో ఇరికించి దాడిచేస్తే ఒక్క చక్రమే ఉన్నవీరుడు లొంగిపోకుండా ఎలా ఉంటాడు?

ఆ ఉంగరాల శిరోజాలు, వాటి పరిమళం, వాటిలో ధరించిన పూమాల గింగిరాలు తిరిగేట్లు చేసి స్వామిని దాసుడిని చేసుకున్న సంగతిని మరలా ధ్వనిస్తున్నాడు రాయలు.

**సకలసీమంతినీలోక సమతిశాయి**

**భాగ్యవర్ణావళులు వ్రాసెఁ బద్మగర్భుఁ**

**డనఁగ గర్పూరతిలక రజోవదాత**

**ఫాలమునఁ గుంతలశ్రేణి పడఁతి కమరు**

కర్పూరతిలకము పొడి అంటుకుని తెల్లని కాంతులతో మెరిసిపోతున్నది ఆమె ఫాలభాగము. ఆ తెల్లని నుదుటిపై నల్లని నొక్కుల నొక్కుల ముంగురులు పడుతున్నాయి. చూడడానికి బ్రహ్మదేవుడు ఆమెకు సమస్త స్త్రీల, ముత్తైదువుల భాగ్యాన్ని మించిపోయే అదృష్టపు అక్షరాలను ముద్దుగా, ముచ్చటగా, గుండ్రంగా వ్రాసినట్లుగా గుండ్రంగా ఉన్నాయి ఆ నొక్కుల ముంగురులు.

యిది ఆముక్తమాల్యద లోని గొప్ప పద్యాలలో ఒకటి. తలరాత, బ్రహ్మ దేవుడు రాసిపెట్టినట్లే జరుగుతుంది అనే జనసామాన్యమైన లోకోక్తి ఉన్నది ఇందులో. సమస్త స్త్రీలోకం అంటే మానవకాంతలు, దేవకాంతలు అసలు ఏ జాతికి చెందిన స్త్రీలు అయినా అని విరుపు. స్త్రీలందరి అదృష్టాన్ని మించిపోయే అదృష్టము అంటే సాక్షాత్తూ శ్రీకాంతుడు కాంతుడు గావడమే. అలాంటప్పుడు ఆయనను అంతకుముందు పొందినవారు ఎందరున్నారని! వారందరిలోకీ గోదాదేవి గొప్ప ఏంటట? గోదాదేవి గొప్పదనం ఉన్నది, దాన్ని చెప్పగలిగిన రాయల గొప్పదనం అనే గొప్పధనమూ ఉన్నది తెలుగువారికి!

లక్ష్మీదేవి తనంత తానే స్వయంవరంలో ఆయనను వరించింది. రుక్మిణి ఆయననే ప్రేమించి నువ్వు కాకుంటే మరణిస్తాను, వేరే వాడికైతే దక్కను అని పిలిపించుకుని వరించింది. సత్యభామను ఆమె తండ్రి కానుకగా, ప్రాయశ్చిత్తంగా స్వామికి సమర్పించాడు. జాంబవతిదీ అదే కథ. నాగ్నజితి శ్రీకృష్ణునికి మేనమరదలే. స్వామిని ప్రేమించి ఆయనను తప్ప వేరే ఎవరినీ పెళ్లిచేసుకోను అని మొండిపట్టు పట్టింది. కృష్ణద్వేషి ఐన ఆమె తండ్రి ఏడు మదించిన ఆంబోతులను నిరాయుధుడై లొంగదీసినవాడికే నిన్ను ఇచ్చి చేస్తాను అని పోటీ పెట్టాడు. ఆమె వర్తమానం అందుకున్న శ్రీకృష్ణుడు ఆంబోతులను లొంగదీసి ముక్కులకు తాడు వేసి, ఆమె కోరికను చెల్లించి వివాహం చేసుకున్నాడు. 'కాళిందీ' నదీ తీరంలో ఆయనకోసం తపస్సు చేసి ఆయనను భర్తగా పొందింది కాళింది. మిగిలినవారివీ ఇలాంటి కథలే. పదహారువేలమంది గోపికలు నరకుడి చెరవీడిన తర్వాత, మా యిళ్ళకు తిరిగి వెళ్ళము, నీతోనే వస్తాము, నువ్వే తీసుకెళ్ళు అని భార్యలైనారు. ఒక్క గోదాదేవి మాత్రమే స్వామికి తను ఎంగిలిచేసి వదిలిన పూమాలను ఎరగా వేసి, ఆయననే మోహింపజేసి, వలచి, గెలిచి, వశుడిని చేసుకుంది. కనుక ఆమె గొప్పదనం ఎవరికీ లేదు. కనుకనే అదృష్టవతులు అందరికన్నా అదృష్టవంతురాలు, సౌభాగ్యవతులు అందరికన్నా సౌభాగ్యవతి గోదాదేవి అని చమత్కారం.

యవ్వనవతి ఐన గోదాదేవి సౌందర్యాన్ని వర్ణిస్తున్నాడు రాయలు. శ్రీకృష్ణ దేవరాయల వినూత్నమైన ఊహలకు, కొద్దిగా సంక్లిష్టమైన ఆయన వర్ణనాశైలికి మరొక మంచి ఉదాహరణ ఈ పద్యం.

**సైరంధ్రు ల్పయికెత్తి కజ్జలముఁ బక్ష్మశ్రేణికం దీర్ప వా**
**లారుంగన్నులమీఁదఁ జూచుతఱి ఫాలాంచచ్చతుర్థీనిశా**
**స్ఫారేందుం గనె వక్త్ర మక్కనుటఁ పర్వేందుఁ డాత్మప్రభా**
**చోరుం డుండఁగఁ దన్నుఁ దద్గత విభా చోరంబనున్ లోకముల్**

గోదాదేవికి అలంకారం చేయడం కోసం నియమించుకున్న స్త్రీలు(సైరంధ్రులు) అలంకరించేప్పుడు కనురెప్పలకు కాటుక పెట్టడం కోసం గడ్డం కింద చేయిపెట్టి ముఖాన్ని కొద్దిగా పైకిఎత్తి కాటుక పెడుతుంటారు. అలా ముఖాన్ని పైకెత్తినప్పుడు విశాలమైన కనులతో పైకి చూస్తున్నప్పుడు గోదాదేవికి తన నుదురు కన్పించింది. ఆ నుదురు  చవితినాటి చంద్రునిలా ఉంది. చవితినాటి చంద్రుడిని చూడడంవలన నీలాపనిందలు వస్తాయి కదా, ఆ కారణంగా, పున్నమి చంద్రుని కాంతిని ఈమె ముఖం దొంగిలించింది కనుక ఆమె ముఖం పున్నమినాటి చంద్రునిలా ఉంది అని నీలాపనిందలు వచ్చాయి ఆమెకు. నిజానికి ఆమె ముఖకాంతులనే పున్నమి చంద్రుడు దొంగిలించి అంతగా కళకళలాడుతూ వెలిగిపోతున్నాడు. ఆమె ముఖానికి పున్నమి చంద్రునికి ఏమాత్రమూ తేడా లేదు అని చమత్కారం. కనురెప్పలకు కాటుక పెట్టేప్పుడు ముఖం పైకెత్తి కనుగుడ్లు పూర్తిగా పైకి లేపి చూడడం లోక సహజం, ఆ వర్ణన స్త్రీల అలంకరణను కూడా ఎంత నిశితంగా సన్నిహితంగా పరిశీలించగలడు కవిరాయలు అనే దానికి దృష్టాంతం. నుదురు చవితినాటి చంద్రునిలా ఉండడం వలన చవితి చంద్రుని చూసిన కారణంగా గోదాదేవి చంద్రప్రభలను దొంగిలించింది అని నీలాపనిందలు వచ్చాయి అనే ఆధ్యాత్మికసంబంధమైన చమత్కారం.

ఇక కన్నుల వర్ణన.

**నవ వయస్సీధుమదముచే శ్రవణకూప**
**ములఁ బడెడు శంక నలువ చాపలము లుడుగ**
**నిడిన శృంఖల లనఁ గాటుకిడిన దీర్ఘ**
**పక్ష్మరేఖలఁ గనుదోయి పడఁతి కలరు**

మదపుటేనుగులు తమ చెక్కిళ్ళపై ధారలుగా కారుతున్న మదజలంచేత కనులు కానరాక బావులలో గోతులలో పడడం సహజమే. ఏనుగుల కాళ్ళకు సంకెళ్ళు వేయడమూ లోక సహజమే. గోదాదేవికి యవ్వనం వచ్చింది. ఆ నూత్న యవ్వనపారవశ్యంలో చెమ్మలు కమ్ముతున్న తడికన్నులు మదించిన ఏనుగులలాగా ఉన్నాయి ఆ ఆర్ద్రత మదజలంలా ఉంది. ఆ కన్నులు విశాలంగా చెవులదాకా ఉన్నాయి.

ఎక్కడ అలా వెళ్ళి, ఆ యవ్వనమదంతో, మదించిన ఏనుగుల్లాంటి కనులు చెవులు అనే కూపాలలో పడతాయో అనే భయంతో బ్రహ్మదేవుడు బిగించిన సంకెళ్ళలాగా నల్లటి కాటుక రేఖలు కనురెప్పలకు తీర్చి ఉన్నాయి.

**కడిఁది విలు చేఁది గుఱి కీలకఱచి నిలుపు**
**మరుని కువలయశరము కంపములఁబోలుఁ**
**దార కడకంటికై సారె చేరిచేరి**
**వేగా మగుడ సలజ్జదృగ్విభ్రమములు**

యవ్వనంలో అప్పుడప్పుడే అడుగిడిన ఆ సుందరి కన్నులు ఆదరిపడుతున్నాయి. సిగ్గుతెరలు కమ్ముకుంటున్నాయి. కనుగుడ్లు కనుల చివరలకు చేరి కడకంటి చూపులు మాటిమాటికీ ప్రసరిస్తున్నాయి. కనులు సిగ్గుతో కూడిన చూపులను ప్రసరించి వెంటనే చూపులు తిప్పుకుంటున్నాయి. ఆ చూపులను చూస్తున్న కన్నులు మన్మథుడు బలమైన వింటిని ఎత్తి, పళ్ళు కరిచిపట్టుకుని, నారిని చెవిదాకా లాగి గురిచూసి కొట్టడానికి ఉపయోగిస్తున్న 'కలువపూబాణం'లాగా ఉన్నాయి, ఆ కలువబాణంలా సంచలిస్తున్నాయి. మరలా మన్మథుని నల్లకలువ పూబాణమును ప్రస్తావిస్తున్నాడు రాయలవారు!

ఈ నల్లకలువల నాలి కథలు ఇంతకు ముందు మనం విన్నవే.

**అనయము రాగమొప్ప సహజానన చంద్ర కటాక్ష పంక్తి ప**
**ర్వీన నఘశంకఁ గర్ణమను శ్రీ మరువెట్టుఁ జెలంగి చెండుఁగొ**
**ట్ట నవనిఁబడ్డకమ్మ మగుడం గొనునంతకు నంసపాళి నం**
**గన యిది దాచుఁపేరఁ బెరకర్ణముకమ్మ పయిం దళుక్కనన్**

గోదాదేవి ముఖము చంద్రునిలా ఉంది. ఆమె చెవులు శ్రీ చుట్టినట్లుగా 'శ్రీకారం' ఆకారం దాల్చినట్లున్నాయి. గోదాదేవి చెండు ఆడుతున్నప్పుడు (పూ)బంతులాడుతున్నప్పుడు చెవికి (పూ)బంతి తగిలింది. చెవికమ్మ ఆ ఉదుటుకు కిందపడింది. ఆడపిల్లలు, కన్యలు చెంపల మీదకు ముసురుకుంటున్న ముంగురులను, మోచేతి పైభాగంతో, భుజాలతో రుద్దుకుంటూ వెనక్కు తోసుకోవడం లోకసహజమైన విషయం. అలా చెంపలమీదకు వాలుతున్న జుత్తును భుజంతో వెనక్కు తోసుకుంటూ గోదాదేవి క్రిందపడ్డ తన చెవికమ్మను తీసుకోడానికి ముందుకు వంగింది. ముఖాన్ని ఒకప్రక్కకు త్రిప్పడంవలన రెండోప్రక్కనున్న చెవికి ఉన్న కమ్మ తళుక్కున మెరిసింది. యిదీ శ్రీకృష్ణదేవరాయలు కల్పించుకున్న ఈ సన్నివేశం. ఈ రమ్యమైన కల్పనకు తన అనన్యసామాన్యమైన ప్రతిభను, చమత్కారాన్ని, వర్ణనావైదుష్యాన్ని జోడించి అత్యద్భుతమైన ఈ పద్యాన్ని చెప్పాడు. అందులో ఒక లోకోక్తిని, ఒక ధార్మిక మర్మాన్ని కూడా సరసంగా జోడించాడు.

సుమంగళులైన తోబుట్టువుల చెవులు శూన్యంగా ఉండడాన్ని సోదరులు చూడకూడదు. బోసి చెవులున్న తోబుట్టువులను చూడడం పాపం, తప్పు, సిగ్గుచేటు, అందుకని వారికి చెవులకు అందంగా కమ్మలను, కర్ణాభరణములను ఉండేట్లుగా సోదరులు చూడాలి. యిది లోకమర్యాద. గోదాదేవిముఖం చంద్రుడిలా ఉందికదా, చెవులు 'శ్రీ' ఆకారంలో ఉన్నాయి కదా, 'శ్రీ' అంటే లక్ష్మి కదా, చంద్రుడు, లక్ష్మీ అక్క తమ్ముళ్ళు కదా, (పూ)బంతులాడుతున్నపుడు చెవి కమ్మ క్రింద పడిపోయింది కదా, అందుకని ఆభరణములు లేని లక్ష్మీదేవి లాంటి ఆ చెవిని తమ్ముడైన చంద్రుని లాంటి ముఖానికి కనపడకుండా ఒక చెవిని ముఖం ప్రక్కకు తిప్పి దాచుకున్నట్లుగా, రెండవప్రక్కన ఉన్న చెవి కమ్మ మెరిసింది అని 'నభూతో నభవిష్యతి' అనే కల్పన, ఏమనగలము ' కవిరాయా! వందనములు' అనడం తప్ప!

అనితరసాధ్యమైన శైలిలో గోదాదేవి అందచందాలను వర్ణించాడు శ్రీకృష్ణదేవరాయలు. గోదాదేవి సౌందర్యాన్ని శృంగార రసభరితంగా వర్ణించాడు. ప్రబంధ సంప్రదాయం ప్రకారం నాయికల సౌందర్య వర్ణన కొత్తదేమీ కాదు, కానీ రాయలు వర్ణించిన తీరు, ఆయన తీసుకొచ్చిన పోలికలు వేరెక్కడా లేనివి, ఆలోచింపజేస్తూ ఆనందింపజేసేవి.కొన్నిటిని పరిశీలిద్దాము. కనుల వర్ణన తర్వాత ఆమె నాసికను వర్ణిస్తున్నాడు.

నాసాచంపకతస్సుగంధ మచటన్ రా భృంగముల్ గ్రోల సం
త్రాసం బందియు బల్కుచో నలము వక్త్రం బేల నా నేల యం
దే సౌరభ్యము లేదు? కుందములు గావే దంతముల్గాని నా
డాసక్తిన్ ప్రతిబింబ దంభమున నేలా వరాల దజ్జాతికిన్?

ఆమె ముక్కు సంపెంగలా ఉన్నది. ముక్కును సంపెంగతో కవులు పోల్చడంలో ఒక చమత్కారము ఉన్నది. సంపెంగ పూవును కాడను పైకి ఉండేట్లు దళములు క్రిందికి ఉండేట్లు చేసి చూస్తే కాడలాంటి సన్నని పొడవైన ముక్కు, దళముల లాంటి ముక్కుపుటలు అని పోలిక అని అర్థం అవుతుంది. సరే, ముక్కు సంపెంగలా ఉన్నది. సువాసనలను వెదజల్లే ఆమె ముఖానికి ముసురుకుందామని తుమ్మెదలు ఆశపడడం జరుగుతున్నది. కానీ ముక్కు సంపెంగ అయ్యేప్పటికి వాటికి ఆశాభంగము అవుతున్నది, ఎందుకంటే సంపెంగ పూల వాసన తుమ్మెదలకు పడదు. ఐతేమాత్రం వాటికి ఊరటగా ఆమె ముఖంలో ఏ సౌరభము లేదని? అన్ని సౌరభాలూ రాశిపోసుకున్న అందగత్తె ఆమె. ఆమె దంతములు మొల్లలు, ఆమె మాట్లాడుతున్నప్పుడు ఆ దంతముల సౌరభము ఎగసిపడుతుంటే, ఆ సౌరభానికి మత్తెక్కి ఆమె ముఖానికి ముసురుకుంటున్నాయి తుమ్మెదలు.

తెల్లని మొల్లల లాంటి స్వచ్ఛమైన ఆమె దంతములలో ఎగురుతున్న తుమ్మెదల ప్రతిబింబాలు కనిపిస్తున్నాయి! ఆ పరిమళము కోసం కాకుంటే, తుమ్మెదలు ఎందుకు ముసురుకుంటాయి ఆమె ముఖానికి, అద్దంలో అందచందాలు చూసుకున్నట్లు ఆమె దంతములపై తమ ప్రతిబింబాలు చూసుకోడం అనే వంకతో ఆమె దంతముల పరిమళం కోసమే ఆ తుమ్మెదలు ముసురుకుంటున్నాయి.

శంఖ సామ్యమ్ము రా మున్ను జలజభవుడు
సరసిరుహపత్త్ర నేత్ర కంధర యొనర్చె

జవ్వనము వచ్చి వెండి సాక్షాత్కరించు
శంఖమున చేసె నును గంధసార చర్చ

ఆమెను చేసేప్పుడే బ్రహ్మదేవుడు ఆమె కంఠము శంఖాన్ని పోలేట్లుగా ఉండేట్లు చేశాడు. ఇంతలో ఆమెకు యవ్వనం వచ్చింది. గంధపు పూత తెచ్చింది. దాంతో నిజంగానే శంఖం ఐపోయింది ఆమె కంఠం. బాల్యం విడిచి యవ్వనం రావడంతో అలంకరణ, సోకులు తెలిశాయి కనుక గంధం పూసుకోవడం మొదలైంది, దాంతో ఆకారంలోనే కాక రంగులో, అందంలో కూడా నిజంగానే శంఖం ఐంది ఆమె కంఠం.

కమలదళేక్షణ సంగీ
తమున నిగుడు మంద్ర మధ్య తార త్రి స్థా
నములకు దీర్చిన రేఖల
క్రమమగు రేఖా త్రయమున గంఠం బమరున్

ఆ పద్మాక్షిపాడుతున్నప్పుడు సంగీతంలో ఉండే మంద్ర, మధ్య, తారా స్థాయిలకు ఆమె కంఠం పుట్టుకస్థానం అని చెప్తున్నట్లుగా ఆమె కంఠం మీద ముచ్చటగా మూడు ముడుతలు ముద్దుగా ఉన్నాయి. అసలే నాదానికి శ్రేష్ఠమైన శంఖం కదా ఆమె కంఠం, ఆ శంఖానికి ఉన్నట్లే, ఆమె పాడేప్పుడు సంగీత శాస్త్రం నిర్దేశించినట్లే మూడు స్థాయిలు ఆమె గొంతుకలో పుట్టాయి అన్నట్లుగా మూడు ముడుతలు ఆమె కంఠంమీద ఉన్నాయి.ఇందులో యింకొక చమత్కారం ఏమిటంటే, స్త్రీకి కంఠం మీద మూడు ముడుతలు ఉండడం శీలానికి, పాతివ్రత్యానికి చిహ్నం, అదే పురుషులకు ఉంటే ఠీవికి రాచరికానికి చిహ్నం అని శరీర సాముద్రికాశాస్త్ర సూచన.

లలన మృదు బాహుబిసలతలు గడగి
బిసలతా శ్రీలనెల్లను వెస హరించె
మరి హరింపంగ గా యవి నెరులు విరిగి
సారె దనుయాత్ర దంతుల జరపుచుండు

ఆమె బాహువులు పొడవుగా, సున్నితంగా తామర తూడుల్లా ఉన్నాయి. ఆమె బాహువుల నాజూకుదనం, అందం తామర తూడుల 'శ్రీ'ని, వాటి వైభవాన్ని, ప్రతిష్టను కాజేశాయి. వాటి నడుములు విరిగిపోయాయి, వెన్నులు చచ్చుబడ్డాయి, తూడులు వాలిపోయాయి, దాంతో ఆ తామరలు తూడుల మధ్యన ఉండే సన్నని దారములాంటి దాంతోనే జీవనం గడుపుకోవడం మొదలెట్టాయి, చేసేదిలేక! ఆమె 'బిసతంతుతనీయసీ'అని పొగడబడిన 'అమ్మవారి' ప్రతిరూపమే కదా మరి!

**తళుకొత్తున్ భుజ కీర్తి వజ్ర ఘ్రుణిసూత్ర స్యూత హార స్ఫుర**

**త్కళికా చిత్ర కుచద్వయోపరి గలాధస్స్వల్పవిస్తార దై**

**ర్ఘ్య లసత్త్రిర్యగురస్తటం బను వివాహాంచన్మనో జాత పా**

**టల దంతచ్ఛదబోడబాసికము దండల్వోలె గేళ్ళింతికిన్**

గోదాదేవి కంఠము క్రిందుగా వక్షస్థలం వరకూ ఉన్న శరీర ప్రదేశం విశాలమైనది, సుందరమైనది. అది చూడడానికి, మన్మథుడు రతీదేవిని వివాహము చేసుకున్నపుడు రతీదేవికి కట్టిన బాసికంలాగా ఉన్నది. అటుప్రక్క ఇటు ప్రక్క పొడవైన, వజ్రములు, హారములు పొదిగిన కేయూరములతో తళతళలాడే సుందరమైన, కోమలమైన బాహువులు, వ్రేళ్ళాడుతున్న పూలహారాలలాగా ఉన్నాయి.

**ఒదవెడు జవ్వనంబు వెలికొత్తగ బయ్యెద సిగ్గు గూడి బి**

**ట్టదుమగ లేత లొాట దిగ నాకకుమీరను లేక వక్షపుం**

**జదుపున బ్రక్కలన్మెరసి చప్పటలై మరి లావుగూడ బై**

**బొదలె ననంగ బిక్కటిలె బొల్తుక చన్నులు నాడునాటికిన్**

ఆమెకు యవ్వనము వచ్చి కూడింది. దానితోపాటు పుట్టుకొచ్చిన చన్నులను ఆ యవ్వనం పైకి, బయటకు నెట్టేసింది. కానీ యవ్వనంతో పాటే వచ్చిన సిగ్గు పైటను తెచ్చిపెట్టింది. ఆ పైట చన్నులను అదిమిపెట్టింది, బిగించి పట్టింది. దానితో పాపం ఆ వక్షోజములకు లోపలికి పోవడానికీ బయటకు రావడానికీ వీలుకాక, ప్రక్కలకు వ్యాపించినట్లు ముద్దులుగా ప్రక్కలకు వ్యాపించి, నానాటికీ విశాలములు అయినాయి.

**వృతరఘూత్తమ శాపమొక్కింత విడిచి**

**విడిచి కడకేగ నప్పుడప్పుడకవిసెడు**

**చక్రయుగ మన రొమ్మొయ్యనాక్రమించి**

**కొమిరెచన్నులు పృథుచూచుకముల నమరె**

శ్రీరాముడు సీతాదేవి వియోగాన్ని అనుభవిస్తున్నప్పుడు చక్రవాక పక్షులకు శాపం ఇచ్చాట్ట. నేను నా ప్రియురాలి వియోగాన్ని అనుభవిస్తుంటే మీరు హాయిగా సంయోగానందాన్ని నా కన్నుల ఎదురాగానే అనుభవిస్తూ, నన్ను ఉడికిస్తూ వెక్కిరిస్తూ బాధిస్తున్నారు, భడవల్లారా, మీకు రాత్రిపూట ఎడబాటు కలుగుగాక, పగటిపూటే మీకు ఒకరినొకరు చూసుకోడం, కలుసుకోడం జరుగుగాక అని శాపం ఇచ్చాట్ట. ఆ శాప ప్రభావం వలన పగటిపూట కలుసుకున్న చక్రవాక పక్షులు ఆనందంగా కౌగలించుకుని ముక్కులు రాసుకున్నట్లు గోదాదేవి వక్షోజములు ప్రక్కలకు పెరిగి పెరిగి ఒకదానినొకటి ఒరుసుకుంటున్నాయి. ఆ చక్రవాక పక్షుల ముక్కుల లాగా ఆమె చూచుకములు రాసుకుంటున్నాయి! శ్రీరాముని గాథలోని పౌరాణిక అంశాన్ని, ప్రకృతిలోని ఒక విచిత్రమైన విషయాన్ని కలిపి ఈ పద్యంలో అందంగా

పొదిగాడు శ్రీకృష్ణదేవరాయలు. చక్రవాక పక్షులు సూర్యోదయముకాగానే ఒకదానిని ఒకటి చేరుకొని మురిసిపోవడం వాటి జీవన విధానం. రాత్రిళ్ళు అవి చీకటిలో విడిపోయి, ఒకదానికోసం మరొకటి దిగులుపడి, తెల్లవారగానే గూడును జోడును చేరుకోవడం అనేది భారతీయ కవిలోక సంప్రదాయం. మహానుభావుడు మయూరుడు కూడా తన 'సూర్యశతకం' లో ఈ అంశాన్ని వర్ణిస్తూ అద్భుతమైన శ్లోకాన్ని చెప్పాడు. ఇంతటి సమస్త శాస్త్ర పరిచయము రాయలవారిది.

**తా రె ట్లట్లుగ దమ్ముం**

**జేరిన ముత్తెంపుసరుల జేడియచన్నుల్**

**లోరెంట లుడిపె ఘనమగు**

**వారు నిజార్ణవము జేరు వాలికి నీరే**

ఉత్తములైనవారు వారిని ఆశ్రయించిన వారికి తమ ధైర్యాన్ని, సత్త్వాన్ని, లక్షణాలను అందించినట్లు, యజమానుల లక్షణాలు సేవకులకు వచ్చినట్లు గోదాదేవి వక్షోజాలను ఆశ్రయించిన ఆభరణాలకు ఆ వక్షోజాల లక్షణాలు వచ్చాయి. విపరీతమైన వైశాల్యం వలన ఆ వక్షోజాలు ఒకదానికొకటి అంటుకుపోయాయి. ఆమె ధరించిన ఆభరణాలు ఆమె వక్షోజాల మధ్యలో ఇరుక్కుపోవడం వలన, పేటలన్నీ ఒక్కటిగా ముడిపడి, ఒక్కటై పోయాయి. యిదీ రాయల వర్ణనా వైదుష్యం, విచిత్రమైన ఊహలకు పోలికలకు ఉదాహరణ.

గోదాదేవి సౌందర్యాన్ని వర్ణిస్తున్నాడు శ్రీకృష్ణదేవరాయలు.

**విరహతతిమీఁది కోపాన మరుఁడు దివియ**

**వేగమై పైఁడియొరతోన విసరఁ గుట్లు**

**దునిసి బైటికి నసిధార దోఁచె ననఁగఁ**

**గనకరుచి మధ్యలత నారు కాంత కలరు**

బొడ్డుపైనుండి వక్షస్థలంమీదకు, వక్షోజముల మధ్యవరకు ఉండే చిన్ని రోమముల వరుసను నూగారు, నూగారులత అని వర్ణించడం కవిలోక సంప్రదాయం. శ్రీకృష్ణదేవరాయలు గోదాదేవి నూగారు లతను వర్ణిస్తున్నాడు ఈ పద్యంలో.

మన్మథునికి జంటలు జంటలుగా రతికేళిలో క్రీడించేవారంటే ఇష్టం. వారిమీదికి తన పూల బాణాలను విసురుతాడు. పరస్పరం దూరంగా చెరొక చోట చేరి వృథాగా విరహగీతాలను పాడుకునే వాళ్ళంటే కోపం. అలా విరహగీతాలు పాడుకునే వాళ్ళమీదకు కోపంతో తన బంగారు బాకును విసురుదామనుకుని, ఒరలోనుండి బాకును తీసి విసిరే నిదానం కూడా లేనంత కోపం వచ్చి, ఒరతో సహా బాకును విసిరినప్పుడు ఆ ఉదుటుకు ఆ ఒరకు ఉన్న కుట్లు తెగిపోయి, పిగిలిపోయి, ఆ సందులోనుండి లోపలి బంగారపు బాకు యొక్క పదునైన

అంచులు మెరుస్తూ కనిపిస్తున్నాయేమో అన్నట్లు గోదాదేవి నూగారులతలోని రోమాలు మెరుస్తున్నాయి.

**అండజగామిని యూరుపుఁ**

**బిండువలపు లాన నాభిబిలము వెడలి చ**

**న్గొండల నడుమను బ్రాఁకెడు**

**కుండలియో యనఁగ నారు కొమరొప్పారున్**

కుండలిని అంటే పాము అనే అర్థముతో చమత్కారమైన వర్ణన చేస్తున్నాడు ఈ పద్యంలో. ఆమె హంసనడకల అందగత్తె. ఆమె ఉఛ్ఛ్వాస నిశ్వాసములు చేస్తున్నప్పుడు దివ్యమైన పరిమళపు వాయువులు వెడలుతున్నాయి. ఆమె నోటినుండి, ఆమె పలువరుస మొల్లల వరుసలా ఉన్నదికదా మరి. పాములు గాలిని తిని బ్రతుకుతాయి. ఈమె నోటినుండి వచ్చే గాలిని తినడానికి, ఆస్వాదించడానికి, ఆమె వక్షోజములు అనే కొండల మధ్యన పైకి పాకుతున్న పాములా ఉన్నది ఆమె నూగారు లత, అంటే గోధుమవన్నె త్రాచు అన్నమాట, బంగరు రంగులో మెరిసిపోతున్నాయి అని అంతకుముందు అన్నాడు కనుక.

**అంగన నిలిచిన బాహువు**

**లుం గౌనును నేరుపరుచు లోకమునకు ర**

**త్నాంగద కాంచీభేదము**

**లుం గెళవుల నడిమి యునుకులు న్నూగారున్**

గోదాదేవి బాహువులు సన్నగా నాజూగ్గా తామర తూడుల్లా ఉన్నాయి. నడుము కూడా సన్నగా కృశించి ఉన్నది. ఆమె బాహువులు, నడుము ఒక్కరకంగా ఉన్నాయి, తేడా తెలియకుండా. ఆమె భుజములకు ఉన్న రత్నాంగదములు, భుజకీర్తులు, నడుముకున్న వడ్డాణము, ముచ్చటైన నూగారు లత, యివి మాత్రమే యివి బాహువులు, యిది నడుము అని తేట తెల్లం చేస్తున్నాయి తప్ప ఆమె బాహువులు, నడుము ఒక్కతీరుగా ఉన్నాయి!

**తనుమధ్యవళీభంగము**

**లను గూర్పఁగ నవియుఁ దత్కులములయగుటఁ గం**

**తుని యిడిన పత్త్రిరేకనఁ**

**జను నొడ్డాణమున నడుము చామకు నమరున్**

క్రుశించిపోయిన ఆమె నడుము విస్తారమైన విపులమైన వక్షోజముల బరువుకు విరిగిపోయిందేమో బహుశా అన్నట్లు, సన్నని పగుళ్ళు అన్నట్లుగా ఆమె నడుము మీది ముడుతలు ఉన్నాయి. మన్మథుడు ఆ పగుళ్ళను కలిపి బంగారురేకుతో బలంగా దగ్గరకు లాగి, బిగించి

కట్టినట్లుగా ఉన్నది ఆమె నడుముకున్న వడ్డాణము. బంగారపు వన్నెతో మెరిసిపోతున్న ఆమె నడుముకు ఉన్న ముడుతలు బంగారపు రంగులోనే ఉన్నాయి. బంగారాన్ని బంగారంతోనే అతకడం సాధ్యము, శ్రేష్ఠము కనుక మన్మథుడు బంగారపు రేకుతో ఆమె నడుమును బిగించి కట్టాడు అన్నట్లు ఉన్నది ఆమె వడ్డాణము. ఆ సౌందర్యవతి ( ఆ మాటకొస్తే ఏ సౌందర్యవతి అయినా సరే) మన్మథుని ఆయుధం, సుందరమైన అవయవ భాగాలు కూడా మన్మథుని సొత్తే, పరికరాలే, వాటితోనే పురుషోత్తముడిని గెలువ వలసి ఉన్నది మరి, కనుక ఆమె నడుముయొక్క బాధ్యత మన్మథునిది, కనుక మన్మథుడు బిగించి కట్టిన బంగారు కట్టులా ఉన్నది ఆమె నడుముమీది బంగారు వడ్డాణము అంటున్నాడు శ్రీకృష్ణదేవరాయలు. జగద్గురు ఆదిశంకరుల 'సౌందర్యలహరీ' శ్లోకాన్ని గుర్తుకు తెస్తుంది ఈ శ్లోకం. ఆ శ్లోకమే స్ఫూర్తి అన్నా ఆశ్చర్య పడవలసిన అవసరము లేదు, రాయలవారు పఠించనిది సాహిత్యంలో లేదు కనుక.

'కుచస్సద్య స్విద్య త్తటఘటిత కూర్పాసభిదురౌ కషంతౌ దోర్మూలే కనక కలశాభౌ కలయతాం తవ త్రాతుం భంగాదలమితి వలగ్నం తనుభువా త్రిధా నద్ధం దేవి త్రివళి లవలీ వల్లిభిరివ' అన్నాడు జగద్గురువు ఆదిశంకరాచార్యులు 'సౌందర్యలహరి' స్తోత్రంలో. బాహుమూలాల వద్ద రవిక కుట్లు పిగిలిపోయేట్లు, విశాలంగా, బంగారు కలశాలలా ఉన్న అమ్మవారి వక్షోజముల బరువుకు ఆమె సన్నని నడుము విరిగిపోతుందేమో అన్న భయంతో, ఆమె కడుపులో ముల్లోకాలు ఉన్నాయి కనుక ముల్లోకాలకు ఆపద వాటిల్లుతుందేమో అన్న భయంతో, ముల్లోకాలను రక్షించడానికి, యాలకుల తీగలు మొదలైన వాటితో ముప్పేటలుగా ఆమె నడుమును మన్మథుడు బిగించి కట్టాడేమో అన్నట్లు, అమ్మవారి నడుము మీది మూడు ముడుతలు శోభిస్తున్నాయి, అని. వర్ణనలలో రాయలవారి స్థాయి ఆదిశంకరులను తలపించే స్థాయి అని చెప్పడం కోసం ఈ ఉదాహరణ!

అపూర్వమైన, విచిత్రమైన ఊహలకు కల్పనలకు శ్రీకృష్ణదేవరాయల కవిత్వం పెట్టింది పేరు. ఆయనలాగా స్వతంత్రించి కొత్త కొత్త పద ప్రయోగాలను,ఉపమానాలను చెప్పినవాళ్ళు లేరు అని పండితలోకం కొనియాడడానికి కారణం ఏమిటో గోదాదేవి అందచందాల వర్ణనలలో సులువుగా తెలుసుకోవచ్చు.

**లేఁగౌఁదీఁగె నితంబము**
**వ్రేఁగునఁ ద్రెవ్వుటయుఁ గని విరించి బిగింపన్**
**లోఁ గి ముడియిడియె వదలుగ**
**నాఁ గోకస్తని గభీర నాభి చెలంగున్**

ఆమె నడుము నాజూకుగా తీగలాగా ఉన్నది. వక్షోజముల భారమే కాక పిరుదుల భారం కూడా మోయలేక ఆ సన్నని నడుము ఎక్కడ విరిగిపోతుందోఅన్న భయముతో 'బ్రహ్మదేవుడు' ఆమె నడుమును బిగించి కడదాము అనుకున్నాడు. మరీ తెగిందాకా లాగకూడదు, ఎక్కడ కట్టు తెగి, మొత్తం ప్రయత్నం వృథా అయిపోతుందో అని, నడుమును బిగించి కట్టి, ముడిని కొద్దిగా వదులుగా వదిలాడేమో అన్నట్లు పెద్దగా, సుడులుగా ఉన్నది ఆమె నాభి!

**వెలఁది కటిపేర నిల నొక**

**పులినము దిగఁబడియె సింధు పులినపుఁబజ్క్తిన్**

**నలువ యది వడఁగఁగాదే**

**తెలియుట కం దంచపదము దిరముగా నిలిపెన్**

లోకవ్యవహారాల్లో, ఇచ్చిపుచ్చుకోటాల్లో చేసే రాత కోతల్లో చేతి వ్రాతలో ఎక్కడన్నా ఒకటీ అరా అక్షరాలుతప్పిపోతే ( దిగబడితే) ఇక్కడ ఫలానా అక్షరంతప్పిపోయింది అని గుర్తుగా అక్కడ 'హంసపాదు' అనే ఒక చిహ్నాన్ని ఉంచడం తెలిసిందే. దీన్ని ఒక నాయిక పిరుదులకు పోల్చి చెప్పగలరా ఎవరైనా,ఇంత పూర్తి వినూత్నమైన పోలిక కేవలం శ్రీకృష్ణదేవరాయలకే స్ఫురించే అవకాశం ఉన్నది. అందుకు ఉదాహరణం పైన ఇచ్చిన చిన్ని పద్యం.

ఇసుకతిన్నెలలో, ఇసుకతిన్నెలతో కలిసిపోయే గోదాదేవి పిరుదులభాగం ప్రపంచంలో ఒక ఇసుకతిన్నెను తప్పిపోయేట్టు చేసింది, అంటే ఇసుకతిన్నె ఒకటిసముద్ర తీరంలో తప్పిపోయింది, లేకుండా పోయింది, వచ్చి గోదాదేవి పిరుదుల భాగంగా చేరిపోయింది.తప్పిపోయిన ఇసుక తిన్నెకు గుర్తుగా ఉంచిన హంసపాదంగా ఇసుక తిన్నెల మధ్యన హంసల పాదాల గుర్తులుమిగిలిపోయాయి సరస్సుల, నదుల తీరాలలో. నదుల తీరాలలో, కొలనుల తీరాలలోఇసుకలలో హంసలుసంచరిస్తున్నప్పుడు వాటి అడుగుల గుర్తులు ఇసుక తిన్నెలమధ్య కనబడడం జరిగేదే. ఇదీ అద్భుతమైన రాయల ఊహాచాతుర్యం!

**కదళి తివియించె నాగ్రాంఘ్రికంబు తొడల**

**పెనుపు నె ట్లన్నఁ బొరల శోధన నడంచు**

**కొన్న యాఁదోఁకపాటును గొప్ప విప్ప**

**మెరయు గోర్కుచ్చులును గెంపు గురులు గావె**

అరటి బోదెలు గోదాదేవి ఊరువుల లావణ్యాన్ని దొంగిలించాయి, సందేహం లేదు. ఎందుకంటే నునుపు, ఆకృతి, అందంలో అరటి బోదెలు అచ్చు గోదాదేవిఊరువుల్లానే ఉంటాయి. గోదాదేవి ఊరువులు అరటి బోదేలలా ఉండడం కాదన్నమాట! ఇంకొక సాక్ష్యం ఏమిటంటే, ఆ అరటి బోదెల పై తొనలు, బెరడువిడదీస్తే లోపలి బోదెల ఎర్రనెర్రని బెరడులు కనబడతాయి, గోదాదేవి ఎఱ్ఱని ఊరువులలాగా. కనుక, ఎవరూ సందేహించనక్కర్లేదు, లోకంలో అరటి బోదెలుఅన్నీ గోదాదేవి ఊరువుల అందాన్ని దోచుకున్న కారణంగానే అలా అందంగా, నునుపుగా, నాజూగ్గా, లేత ఎఱ్ఱని రంగులో మిసమిసలాడిపోతుంటాయి!

**వసుధలో నెట్టి శ్రీ గలవారివేని**

**కరభములు దాస్యములు చేయు సరసిజాక్షి**

**యూరువుల కెట్ల టన్నఁ బైఁ దారు మోచు**

**గొడుగులును నల్ల కలశముల్ గురులు గావె**

లోకంలో ఎంతటి సంపన్నులైన స్త్రీల చేతులైనా, గోదాదేవికి, ఆమె ఊరువులకు దాస్యం చేయడానికి నోచుకున్నవే. అంటే ఆమెకు దాస్యం చేయడానికినోచుకున్న చేతులున్నవారందరూ శ్రీమంతులే! ఎందుకంటే, హస్త సాముద్రికా శాస్త్రం ప్రకారం చేతులలో చత్ర, కలశ, అంకుశ మొదలైన చిహ్నాలుఉండడం వలన సిరి గలవారు అవుతారని హస్త సాముద్రికా శాస్త్రం చెప్తుంది కదా, ఆ గొడుగుల గుర్తులు ఉండడం గోదమ్మవారికి గొడుగు పట్టడం కోసమే, ఆ కలశాల గుర్తులు ఉండడం ఆమెకు అభిషేకం కోసం, స్నానంకోసం, పాద ప్రక్షాలనకోసం నీటిని నింపిన పూర్ణ కలశాలను పట్టుకొనడంకోసమే. కనుకఆ చిహ్నాలు ఉన్నవారు ఆ సేవలను చేయడానికి నోచుకున్న శ్రీమంతులే, అవును, ఇందులో ఏ సందేహమూ లేదు!

ఆముక్తమాల్యద ప్రబంధ నాయిక ఐన గోదాదేవి నాలుగు ఆశ్వాసాల తర్వాత ఐదవ ఆశ్వాసంలో మాత్రమే పాఠకుల ముందుకు వచ్చింది. విశేషించి రాయల వర్ణనా చమత్కృతి ఔన్నత్యంలో ఆకాశాన్ని తాకింది ఈ ఆశ్వాసంలో. అందుకని కొద్దిగా వివరంగా ఈ ఆశ్వాసాన్ని పరిశీలిస్తున్నాము మనం.

ఉవిదనిద్దంపుజంఘల సవతుఁ గోరి
కలమగర్భంబు లడఁచు లోఁ గంటకములు
చాతురుల మించి మరి దివసక్రమమున
నిలువ కవి బాహిరములైనఁ దలలు వంచు

జంఘలు అంటే పిక్కలు. కలమ గర్భములు అంటే 'వరి' పొట్టలు, వరి కంకులు. వరి కంకులు ఆకారంలో పిక్కల్లాగా ఉంటాయి! కానీ వారి కంకులకు చిన్ని చిన్ని ముళ్ళు ఉంటాయి. మేమూ ఆమె పిక్కల్లానే ఉన్నాముకదా, మాకేం తక్కువ అని కాబోలు ఆ వరికంకులు ఆమె పిక్కలతో పోటీ పడడానికి, సాటి రావడానికి ప్రయత్నిస్తూ తమ దోషము ఐన ముళ్ళను దాచిపెట్టడానికి ప్రయత్నం చేస్తున్నాయి, కానీ ఎంతకాలం అలా చేయగలవు? పూర్తిగా పొట్టలకు వచ్చిన కంకులు తమ ముళ్ళను దాయలేక, అవి బయట పడేప్పటికి, సిగ్గుతో తలలు వంచుకుంటాయి, తమ ముళ్ళను చూసి ఆత్మన్యూనతా భావంతో. యిది అందమైన చమత్కారం ఈ పద్యంలో. ఇంతవరకూ బాగానే ఉంది, ఇందులో మరీ చమత్కారమైన విశేషం ఏమిటంటే పిక్కలమీద, చేతులమీద రోమాలుఉండడం స్త్రీలకు అందమూ కాదు, శరీర సాముద్రికా శాస్త్రం ప్రకారం శుభ లక్షణమూ కాదు, అది ధ్వనిగా తెలియజేస్తున్నాడు రాయలు!

ఇల గల వస్తు సంతతుల కెల్లను గచ్చిదు మత్స్యభావ పా
టలరుచి యింక వేర యొక డా లిడవచ్చునె లక్కనీట మ
మ్మలమిన దెంతముగ్ధ యిది యంచు బదాబ్జము లంగులీముఖం
బుల నగునట్లు మించు నఖముల్మెరయన్ గొమరారునింతికిన్

నూతన యవ్వనప్రాంగణంలోకి అడుగుబెట్టిన బాలిక కనుక, సౌందర్యంపై శ్రద్ధ ఉండడం సహజమే. అందుచేత తన పాదాలకు రంగు, మెరుపు రావడంకోసం, పాదాలకు ఏ అనారోగ్యమూ రాకుండా ఉండడంకోసం కూడా, గోదాదేవి తన పాదాలను లక్కనీటితో అలంకరించుకున్నది. అది గమనించాయి ఆమె పాదాలు. ప్రపంచంలో ఉన్న 'వస్తువులు అన్నిటికీ వన్నెను ఇచ్చే ఎఱ్ఱని పాదాలము మేము, మాకే వేరే లక్కనీటితో అందాన్ని ఇవ్వడానికి ఈ పిచ్చి పిల్ల ప్రయత్నిస్తున్నది' అని ' లేత ఎఱ్ఱని గోళ్ళు అనే దంతాలు కనిపించేట్లు' ఆ ఎఱ్ఱని పాదాలు నవ్వుతున్నాయి అన్నట్లు, ఎఱ్ఱని పాదాలు, లేత ఎఱ్ఱని గోళ్ళు ఉన్నాయి ఆమెకు!

లలనోపరిపదకచ్ఛప
ములు బలిమిమెయిన్ గజప్రభూతగతి శ్రీ
విలసనము గొనగగాదే
కలిగెన్ గజ కచ్ఛపోగ్ర కలహంబుర్విన్

గజ కచ్ఛప కలహము అనే నానుడి, ఐతిహ్యం ఉన్నది ప్రపంచంలో. అంటే ఏనుగుకూ, తాబేలుకు జరిగిన యుద్ధం. గోదాదేవి మీగాళ్ళు తాబేటి చిప్పల్లా ఉంటాయి. ఆమె నడక మత్త గజపు నడకలా ఉంటుంది, ఆమె ఊరువులు ఎలాగూ ఏనుగు తొండాల్లా ఉండే సంగతి తెలిసిందే, కనుక సహజంగానే ఆమె మీగాళ్లకు ఊరువులకు పరస్పరం అసూయ వలన కలహం కలిగింది. ఆ కలహాన్నే గచ కచ్ఛప కలహం అని చెప్పుకుంటున్నది ప్రపంచం!

తరుణితనుకాంతియెదుట నూతన హరిద్ర
తులకురాలేక యత్యంత మలినమయ్యె
నౌటఁగా రాత్రి యన నిశ యనఁ దమిస్ర
యన నిశీథిని యన క్షప యనఁగఁ బరఁగె

హరిద్ర అంటే పసుపు, నూతన హరిద్ర అంటే కొత్త పసుపు, అంటే అప్పుడే పిండిగా కొట్టిన పసుపు. పసుపును తడిచేసిన తర్వాత, అది ఎండిన తర్వాత క్రమక్రమంగా పైనుండి నల్లగా మారుతుంది. గోదాదేవి శరీర కాంతి మిసమిసలాడే పసుపు రంగులో ఉంటుంది. ఆ శరీర కాంతితో పోటీ పడి సాటి రాలేక, కొత్త పసుపు బాధతో మలినమయ్యింది, పసుపు ముఖం మ్లానమయ్యింది, ఆ నల్లని పసుపే రాత్రిగా

మారింది, దాన్నే ఆ రాత్రినే, నిశ, తమిస్రము, నిశీథిని, క్షప అని రకరకాల పేర్లతో పిలుస్తున్నారు!

అయ్యిందువదన ధరాంగన కావున / బ్రాహ్మైత్రి బొరుగుల భాగవతుల
గృహములందు మరాళికైకావళీ హరి / ణీ మనోజ్ఞా స్రగ్విణీసమాఖ్య
లమర జనించి వయస్య లై నాగక / న్యలు పుత్రికా వివాహములయందు
బాడు పద్మాలయా పరిణయామేయ గే యముల ననంతకళ్యాణగుణము

లద్భుతం బొప్ప విని విని యతని గవయు
బుద్ధి ప్రాగ్జన్మసంస్కరమున జనింప
దదవతారానుమేయ కథాసుథాసు
కలితలీలానుకృతుల వర్తిలుచు నుండి

ఆ చంద్రముఖి ఐన గోదాదేవి భూదేవి అవతరము కనుక పూర్వజన్మలనుండి సంక్రమించిన స్నేహం కారణంగా నాగకన్యలు ఆమెతోపాటే ఆమె స్నేహితురాళ్ళుగా ఇరుగు పొరుగు భాగవతుల ఇళ్ళల్లో జన్మించారు. వారి పేర్లు మరాళిక, ఏకావళి, హరిణి, మనోజ్ఞ, స్రగ్విణి. వారు కూడా గోదాదేవితోపాటే పెరిగి పెద్దవారై యిప్పుడు యుక్తవయస్కలు అయినారు. వారు పెళ్ళిళ్ళలో ఉత్సవాలలో అమ్మవారి కళ్యాణపు విశేషాలను, పద్మాలయ ఐన శ్రీమహాలక్ష్మి శ్రీమహావిష్ణువును వివాహము చేసుకున్న కథను పాటలుగా పాడేవారు. శ్రీమహావిష్ణువుయొక్క అనంతకళ్యాణగుణములను అద్భుతంగా గానం చేసేవారు. ఇక్కడ కూడా ఒక చిన్ని మెరుపు ఉన్నది. శ్రీమహాలక్ష్మి క్షీరసాగర మథనం జరుగుతున్నపుడు జనించింది, చేతిలో వరమాలతో జన్మించింది, వరుడుగావడానికి అందరూ నేనంటే నేను అని ఉవ్విళ్ళూరుతుంటే, ఆమె శ్రీమహావిష్ణువును చూసి మోహించి, నేరుగా ఆయనను సమీపించి, ఆయనమెడలో ఆ 'మాలను వేసి' వరించింది. ఆ మాల, ఆ మాధవుడు, ఆ పరిణయము అన్నీ బాల్యమునుండీ గోదాదేవి పాటలుగా, కథలుగా వింటున్నది, ఆమె మనసు కూడా 'అలానే' మాలవేసి, వలపులమాలలో బందీని చేసి ఆ మాధవుడిని చేపట్టాలి అని ఉవ్విళ్ళూరసాగింది. పూర్వజన్మసంస్కార ఫలితముగా మరలా ఈ జన్మలో తన నాథుడిని పొందాలి అని కోరుకోవడం ఒక విషయము అయితే, శ్రీమహావిష్ణువు అవతారాలను, ఆయన విజయగాథలను బాల్యమునుండీ వినీ వినీ ఆయనే మనసులో నిలిచిపోయాడు అనేది మరొక విషయము. యిది మనస్తత్వపరిశీలన, రాయలవారు పరిశీలించనిది ఏమున్నది కనుక?

తమతండ్రి శ్రీశదత్తశ్రీలు గృహమున / ద్రవ్వితండములయ్యు దనదు తొంటి
స్రగ్వినిర్మాణదాస్యం బనుత్సేకత / జరపుచు బ్రజ్ఞ వైష్ణవపురాణ
సంహితావ్యాఖ్యారచన బ్రొద్దు గడపుచు / గట్టెదుకమ్మచెంగలువవిరుల
తోమాలె లలకలు దువ్వి కంతునకు బా / ర్థనిబద్ధఖేటకం బనగ నీల

వృషకకుద్రేఖ నెడమకొక్కింత యొరగ
నిడిన ధమ్మిల్లవలయంబు నడుగునందు
గొంతసే పర్థి గీలించి కూపవారి
నీడ వీక్షించి క్రమ్మర గూడ నునుచు

శ్రీమహావిష్ణువు కరుణించి ప్రసాదించిన సిరులు ఉన్నప్పటికీ ఆయన సేవకు నిత్యమూ సేకరించే విరులు ప్రీతిపాత్రములు అయినాయి విష్ణుచిత్తులవారికి. మొదటినుండీ ఎలా పూమాలలు అల్లి స్వామివారికి సమర్పించేవాడో అలానే సమర్పించడం, విష్ణుపురాణ వ్యాఖ్యానముతో సమయాన్ని గడపడమూ చేస్తున్నాడు. ఘుమఘుమలాడే చెంగలువపూలతో (కమ్మ చెంగలువ విరులు) దండలు(తోమాలెలు) నేర్పుగా, భక్తితో అల్లేవాడు. గోదాదేవి చక్కగా కురులను దువ్వుకుని, మన్మథునికి ఆయుధముగా(?) తయారుచేసిన నెమలీకల తోరణమో, రానున్నది మన్మథుని తండ్రితో జరపబోయే వలపుల'రణమో' అన్నట్లు, ఆ పూలమాలను, స్వామివారికి అలంకరించడానికి విష్ణుచిత్తులవారు తయారుజేసిన పూమాలను, తన కొప్పులో అలంకరించుకునేది తండ్రి చూడకుండా.

కొద్దిగా ఎడమప్రక్కకు వాలిన ఆమె కొప్పు నల్లని వృషభముయొక్క మూపురంలా ఉండేది. వృషభముయొక్క మూపురముతోనే పోల్చడం ఎందుకు? వృషభము ధర్మానికి ప్రతీక కనుక. గోదమ్మ యిప్పుడు కాదు, ఎప్పటినుండో ఆ స్వామికి ధర్మపత్ని కనుక.

మరొక కారణమూ ఉన్నది, ఈ అల్పమాత్ర ప్రజ్ఞుని ఉద్దేశములో. వృషభమును అంటే ఎద్దును, ఆంబోతును ఆవులన్నిటికీ భర్తగా అంటే ఆ ఊళ్ళో ఉన్న గోవులకు సంతానాన్ని కలిగించి 'గో'సంపదను వృద్ధి చేయడం కోసం స్వేచ్ఛగా వదిలిపెడతారు. తెలుగు జానపదులు 'వెంకన్న ఎద్దు' అని ఆ ఆంబోతును వేంకటేశ్వరుని ప్రతిరూపముగా భావిస్తారు. కలలో ఎద్దు, ఆంబోతు దర్శనమైతే వేంకటేశ్వరుని కరుణగా భావిస్తారు! ఈ సమస్త విశ్వమూ ఒక గోకులము. జీవులన్నీ స్త్రీలే, గోవులే! పురుషోత్తముడు ఒక్కడే పురుషుడు. ' వృషాహీ వృషభో విష్ణుర్వాసుదేవో' అని కీర్తింపబడే పురుషుడు, పురాణ పురుషుడు, పుండరీకాక్షుడు శ్రీహరి. గోవులు అంటే సాధువులు, భక్తులు, జ్ఞానులు అని కూడా. ఆ గోకులాన్ని, ఆ సాధువుల, భక్తుల, జ్ఞానుల సమూహాన్ని ఉద్ధరించడానికి, వృద్ధి చేయడానికి జన్మించిన 'గోమాత' గోదాదేవి కనుక. గోవు 'భూదేవత'కు చిహ్నము కనుక, పూర్వజన్మలో గోదాదేవి 'భూదేవి' అని చెప్పాడు కనుక, వృషభము, వృషభ మూపురము అనే పోలిక

తెచ్చాడు శ్రీకృష్ణదేవరాయలు, ఆయన పాదములకు శతసహస్ర ప్రణామములు!

ఆ కొప్పులో ధరించిన పూలమాలతో మిసమిసలాడుతున్న తన సొగసును పెరట్లోని నూతిలో చూసుకునేది గోదాదేవి. నూతిలో ఎందుకు, ఇంత అలంకరణ చేసుకుంటున్న యువతి ఇంటిలో, అంత సంపన్నుడైన తండ్రి ఇంటిలో కనీసం అద్దముకూడా లేదా అంటే, నూతి అయితే ఎక్కడో పెరటిలో ఉంటుంది, తండ్రి గమనించకుండా చూసుకోవచ్చు అని! అదీ రాయలవారి ఔచిత్యము.

అలా మురిపెముగా కొంతసేపు ఆ పూమాలతో తన అందచందాలను చూసుకుని, మరలా ఏమీ తెలియనట్లే, మామూలుగా ఆ పూమాలను దాని స్థానంలో దాన్ని ఉంచేది, యిదంతా తెలియని ఆమె తండ్రి ఆ పూమాలను తీసుకెళ్ళి కోవెలలో స్వామివారికి అలంకరించేవాడు. యిలా కాలము జరుగుతున్నది, నానాటికీ గోదమ్మకు విష్ణువ్యామోహము పెరుగుతున్నది, మాధవుని తలపుతోనే ఆమె తనువంతా కరుగుతున్నది!

గోదాదేవి పరమాత్ముడిని వలచి ఆయననుపొందే మార్గం కోసం పరితపిస్తున్నది. పొందలేకపోవడం చేత విరహముతో అలమటిస్తున్నది. ఆయనను నిష్ఠురోక్తులతో నిందారూపకంగా ప్రస్తుతి చేస్తున్నది. ఏదోరకంగా తనకు నచ్చినవాడిని పదేపదే గుర్తుచేసుకోవడం సహజమే కదా!

ప్రళయార్కోగ్రకుఠారకోణము నృప త్రైవిధ్యవత్పీఠికా
ఖ్యలఁ ద్రిస్థానము లేడుమార్లు వరుసన్ఘట్టించు దోశ్శక్తిఁ గీ
ర్తిలసద్వల్లకి మ్రోయ రక్తయయి యెంతే వశ్యయౌ భూసతీ
తిలకంబుం దుదఁ ద్రోవఁ గశ్యపున కార్తిం బిడ్డయై పోవదే?

శ్రీకృష్ణదేవరాయలవారి బహుముఖప్రజ్ఞకు, ఆయన మాత్రమే చేయగలిగిన ఊహలకు ఈ పద్యము మంచి ఉదాహరణము. ఈ పద్యములో పరశురాముడి శత్రు సంహారమును వీణ వాయించడంతో పోలుస్తున్నాడు. ఇరవైఒక్కసార్లు దండయాత్ర చేసి భూమి మీద ఉన్న రాజులందరినీ సంహరించి భూమిని క్షత్రియ శూన్యము చేశాడు ఆయన. పరశురాముని ప్రళయకాల సూర్యునివంటి ఉగ్రమైన గండ్రగొడ్డలియొక్క పిడిని/కర్రను (ప్రళయార్కోగ్రకుఠారకోణము) వీణతో పోలుస్తున్నాడు. 'కోణా వీణాదివాదనం' అని కోణము అంటే వీణ అని అర్థము, సంస్కృతంలో. శత్రు, మిత్ర, ఉదాసీనులు అనే మూడు రకముల రాజ సింహాసనములు, రాజులూ అని చెప్పబడింది. అంటే ఒక రాజుకు శత్రువు, మిత్రుడు, ఉదాసీనుడు అనే విధాలుగా స్థాయీ భేదములతో వేరే రాజులు ఉంటారు. ఆ మూడు విధముల స్థాయీ భేదములు వీణ అనే వాయిద్యానికి సంబంధించి సంగీతశాస్త్ర పరంగా మంద్ర, మధ్యమ, తారస్థాయిలు అనే మూడు స్థాయీ భేదములు అయినాయి. వీణకు ఉన్న మూడుతంత్రులు అయినాయి. 'స' 'రి' 'గ' 'మ' 'ప' 'ధ' 'ని' అనే సప్తస్వరాలు వరుసగా మంద్ర, మధ్యమ, తారస్థాయిలలో వాయించడంతో మూడు ఏడులు ఇరవై ఒక్కటి అయినాయి సంగీత ధ్వనులు. పరశురాముని యిరవైఒక్క దాడులు ఈ యిరవైఒక్క సంగీతధ్వనులు అయినాయి. అలా ఇరవై ఒక్క స్వరాలూ వాయించినట్లు ఇరవైఒక్కసార్లు దాడి చేసి రాజులను వాయించాడన్నమాట!

అలా తన భుజ శక్తి చేత తన కీర్తి అనే వీణను వాయించాడు పరశురాముడు( దోశ్శక్తిఁ గీర్తిలసద్వల్లకి మ్రోయ)భూదేవి 'రక్తయై' వశ్య ఐంది ఆయనకు. రాజుల రక్తంతో భూమింతా తడిసిపోయింది అని ఒక అర్థం. భూదేవి ఆయనపట్ల అనురక్త ఐంది, అనురాగమును పొందింది అని మరొక

అర్థం. కానీ యింతా చేసి రాజులందరినీ చంపి, భూదేవిని తను 'ఏలుకున్నాడా' అంటే లేదు. ఆమెను కశ్యపునికి ధార పోసి, తను ప్రశాంతంగా ముక్కు మూసుకుని తపస్సు చేసుకోడానికి వెళ్ళిపోయాడు. అనురక్తితో పరశురామునికి భార్యకావలసిన భూదేవి ఆర్తితో కశ్యపునికి కుమార్తె ఐంది. అందుకే భూమిని కశ్యపి అని కూడా పిలుస్తారు, కశ్యపుని కుమార్తె కనుక. అటు రాజులందరినీ సంహరించి వారి భార్యలను భర్తలకుకాని వాళ్ళను చేసి వారిని ఏడిపించాడు, యిటు భూదేవిని నిరాకరించి ఈమెనూ ఏడిపించాడు, అదమ్మా, ఆ పరశురాముని నిర్వాకం.

చెలువముఁ దాల్చి త న్గవయఁ జేరిన రాగిణి రావణస్వసన్
నలువురు నవ్వ నత్తెఱఁ గొనర్పక ఏలిన వియ్య మై యతం
డలుగఁడు సీత కిట్టి తలఁపొత్మఁ దలంపక యాయమ న్వృథా
కలహమునం దనుం దొఱఁగు కాఁకకు నాఁకకు లోను సేయఁడే?

యిక ఆ శ్రీరాముడి కథ చెప్తాను వినండేం! మంచి సౌందర్యాన్ని పుచ్చుకుని, అంటే సుందరిగా మారి, తనను పొందడానికి వచ్చిన ఆ రావణుడి చెల్లెలిని నలుగురు నవ్విపోయేట్లు అలా చేయకుంటే, ముక్కూ చెవులు కోసి పంపకుంటే, రావణుడు వియ్యమయ్యేవాడు. బావమరిది అయ్యేవాడు. తనమీద అలిగేవాడు కాడు. సీత పట్ల అలా ఆలోచించేవాడు కాదు. ఆమెను అపహరించేవాడు కాడు. తనకు దూరమై తాపానికి, చెరకు ఆమె  లోనయ్యేది కాదు. కానీ మీ రామచంద్రుడు ఏం చేశాడు?

ఫీట్కారస్రవదస్రమై పెదవి కంపింప న్మొర ల్గిట్టి ప్రా
వృట్కాలాంబుదగర్జ గెల్వఁగ వలచ్ఛ్రీఖండ శాఖాసిత
త్విట్కుంభీనసరేఖఁ గే లసిలతా ధృత్బాహు వేష్టింప మున్
రాట్కంఠీరవ మై యొనర్చె వడి సోణాలంట ఘోణాచ్ఛిదన్

'ఫీ ఫీ' అని భయంకరంగా ఫీట్కారాలు చేస్తూ, పెదవులు వణికిపోతుండగా మొరలు పెడుతూ, వర్షాకాలపు మేఘంలాగా గర్జనలు చేస్తుండగా, చందనపు చెట్టు కొమ్మ మీది నల్ల త్రాచుపాములాగా, చుట్టుకున్న చేతిలో ఉన్న లతలాంటి ఖడ్గముతో అడుగంటా ముక్కును కోసిపారెయ్యలేదూ(యొనర్చె వడి సోణాలంట ఘోణాచ్ఛిదన్) తను రాజసింహమై, స్త్రీల మాన ప్రాణాలకు రక్షణ కల్పించవలసినవాడై ఉండి కూడా అలాంటి పాడుపని చేశాడు. శూర్పణఖ ముక్కూ చెవులు కోసింది లక్ష్మణుడు అయినా, రాముడి ఆజ్ఞమేరకే అలా చేశాడు కనుక అది రాముడి దోషమే. పనిలో పనిగా ఇక్కడ ఒక చిన్ని చమత్కారాన్ని పొదిగాడు రాయలవారు.'ఘోణ'అంటే ముక్కు, ముట్టె అని అర్థాలు. ఘోణి అంటే పంది అని అర్థం, పెద్దగా వికృతంగా విచిత్రంగా ముక్కు, ముట్టె ఉంటుంది కనుక. 'ఫీ..ఫీ' అని ధ్వనులను చేస్తున్నది అని కూడా అన్నాడు. వేటగాళ్ళు, ఊళ్ళల్లో పందులను కాసుకునే వాళ్ళు వాటిని వలలలో బంధించినపుడు అవి చేసే ధ్వనులు 'ఫీ ..ఫీ..' అని ఫీట్కారాలలాగే వినిపిస్తాయి, శూర్పణఖను గోదాదేవి జాలిగా పరికిస్తున్నది, కనుక నేరుగా ఆమెతో తిట్టించడం సమంజసం కాదు, కనుక కవిగా యిలా శూర్పణఖను పోల్చాడు ధ్వనిపూర్వకంగా!

ఆముక్తమాల్యద ప్రబంధాన్ని పూర్వము సమీక్ష చేసిన మహానుభావులు, చివరి పాదము తప్ప, ఈ పద్యము మొత్తమూ శూర్పణఖ పరంగా చెప్పిందే అని భావించారు. సరస్వతీమూర్తులైన వారి పాదరేణువు మాత్రం కూడా నేను చేయను, కానీ, నాకు మాత్రం అలా అనిపించలేదు. చందనపు చెట్టుకొమ్మవంటి బాహువు లక్ష్మణుడి బాహువు. అది లతలాగా చుట్టి శూర్పణఖను కదలకుండా పట్టుకుంది. ఆ చేతిలోని నల్లత్రాచువంటి నల్లని

ఖడ్గం/బాకు శూర్పణఖ ముక్కు, చెవులు కోసేసింది. శ్రీ చందనం అంటే ఎఱ్ఱ చందనం, లక్ష్మణుడు ఎఱ్ఱని శరీరకాంతి కలిగినవాడు, కనుక ఆ పోలిక లక్ష్మణుడికే సరిపోతుంది అని ఈ 'బాలకుని' ఉద్దేశం.

యింతేగాక వాల్మీకి రామాయణంలో అరణ్యకాండలో పదిహేడు, పద్దెనిమిది సర్గలలో శూర్పణఖ రామలక్ష్మణులను సమీపించి సంభాషించడం ఉన్నది. నిజానికి ఆమె తన రూపాన్ని మార్చుకుని ఏమీ శ్రీరాముడిని సమీపించలేదు. పరిహాసపూర్వకంగా 'ఓ సుందరీ! నీకు నేను తగినవాడను కను, నా తమ్ముడు అందగాడు. నాకు భార్య ఉన్నది, నీకు సవతిపోరు ఉంటుంది, నన్ను చేసుకుంటే. కనుక నా తమ్ముడిని చేపట్టు' అన్నాడు శ్రీరాముడు. ఎవరైతేనేమి, మగాడు అయితే చాలు అనుకున్నది కనుక శూర్పణఖ లక్ష్మణుడిని అడిగింది. నేను నా అన్నకు దాసుడిని. నన్ను చేసుకుంటే నువ్వు కూడా దాసివి అవుతావు, 'యింత అందమైన దానివి, నీకు దాసిగా ఉండే కర్మ ఏమిటి?' అని లక్ష్మణుడు కూడా పరిహాసంగా అనేప్పటికి రాముడివైపు తిరిగి, 'దీన్ని చూసుకుని నన్ను నిరాకరిస్తున్నావు కదూ, యిప్పుడే నీ కళ్ళెదుటే దీన్ని తినేస్తాను, నీతో హాయిగా సుఖిస్తాను' అంటూ శూర్పణఖ ఉల్క లాగా సీత మీదికి వచ్చింది.అప్పుడు శ్రీరాముని మాట మేరకు, రాముని ఖడ్గమును తీసుకుని శూర్పణఖ ముక్కు చెవులు కోసివేశాడు లక్ష్మణుడు. ఉత్తి చేతులతోనే సీతమీడికి వెళ్ళింది శూర్పణఖ, ఆమె చేతిలో ఏ ఖడ్గమూ లేదు, కనుక కూడా నల్లత్రాచు వంటి ఖడ్గమును ధరించిన ఎఱ్ఱచందనపు కొమ్మవంటి బాహువు లక్ష్మణమూర్తి బాహువే అని నా ఉద్దేశం.

ఒల్లఁ బొమ్మన్నఁ బోదె తా నుల్లసముల
నేఁప నది రక్కసియ యౌట నెగ్గె వలచి
స్త్రీలు తలవంపఁ దాన వచ్చె నది చాల
కాఁదుదాని బజీతు సేయంగ నగునె

నిన్ను ఒల్లను, పొమ్మంటే దాని దారిన అది పొయ్యేది కదా, పరిహాసాలతో దాన్ని ఉడికించడం ఎందుకు? అది రాక్షసి కావడం దాని నేరమా, దేవుడు అలా పుట్టించాడు, అలా పుట్టింది! ప్రేమించి, ప్రపంచంలోని స్త్రీ జాతి సిగ్గుతో తలదించుకునేట్లు తనంత తానె వచ్చి కోరింది, అది చాలక ఆడదాని బతుకు బజారుపాలు చేయడం ఏమన్నా బాగుందా? అదమ్మా మీ రాముడి నిర్వాకం అని సాధిస్తున్నది గోదాదేవి. పరమాత్ముడిని నిష్ఠురోక్తులతో నిందిస్తున్నది, తనకు అందడంలేదు, తనను పొందడంలేదు అన్నఉక్రోషముతో. ఆయన ఎన్నడు స్త్రీలను సుఖపెట్టాడు కనుక, సంతోషపెట్టాడు కనుక? ఎప్పుడూ స్త్రీలను వేదనకు గురిచేయడమే ఆయన చేసిన ఘనకార్యము అంటున్నది.

తను నంటన్ సతు లౌట గోరు మునిబృందంబుం దదాపాదిప
ద్వనజక్షోదము గల్గియున్నెరజనిం దా వల్లవ స్త్రీలగా
జననం బందగ జేసి కూడియును నాసక్తాత్మలం గాందినీ
తనయప్రేరణ బాసె భోజపుర యాత్రాదంభసంరంభియై

తనను స్పృశించడానికి ఉవ్విళ్ళూరి తనకు భార్యలు కావాలని కోరుకున్న మునుల(తను నంటన్ సతు లౌట గోరు మునిబృందంబుం)కోరికను ఆయన మన్నించలేదు. వారుకోరుకున్నట్టు స్త్రీలుగా మార్చగలిగిన పదములు కలిగినవాడే, అయినా ఆ పద ధూళిని ఆ మునులపై సోకనీయలేదు. యిది శ్రీరామావతార ప్రశస్తి, ప్రసక్తి.

యిదివరకు రాయిగా పడిఉన్న అహల్యను నాతిగా చేసిన పాదాలు ఆ రామునివి. శ్రీ రాముని సౌందర్యానికి అన్నింటినీ వదిలి ముక్కులు మూసుకుని మౌనంగా తపస్సు చేసుకునే మునులు కూడా మోహితులు అయినారు. 'రామః సర్వాంగ సుందరః', ' రూపౌదార్య గుణైః పుంసాం దృష్టి చిత్తాపహారిణం ' 'పుంసాం మోహనరూపాయ పుణ్యశ్లోకాయ మంగళం' అని పొగడబడిన లోకైక సౌందర్యమూర్తి శ్రీరామచంద్రుడు. ఆయన సర్వాంగ సుందరుడు. రూపంతో, ఉదార గుణాలతో పురుషులకు కూడా మోహాన్ని కలిగించినవాడు. ఆయన పురుషుల దృష్టిని మనస్సును కూడా దొంగిలించిన సుందరుడు. యితర పురుషులను మెప్పించగలిగిన పురుషుడు గొప్ప పురుషుడు. యితర స్త్రీలను మెప్పించగలిగిన స్త్రీ గొప్ప స్త్రీ.

శ్రీరామావతారంలో ఉన్నప్పుడు మునులు ఆయనను స్పృశించి, ఆయనతో కలిసి తిరగాలని కోరుకున్నారు. 'మీ కోరిక నా తదుపరి అవతారంలో తీరుతుంది' అని వరమిచ్చాడు శ్రీరామచంద్రుడు. యిది ఉపనిషత్తులోని రహస్యం! అధర్వణ వేదాంతర్గతమైన 'కృష్ణోపనిషత్' అన్న ఉపనిషత్తులో యిది ఉన్నది. వేద వేదాంగాలను క్షుణ్ణంగా తెలుసుకున్నవాడు శ్రీకృష్ణదేవరాయలు అనడానికి యిది మరొక ఋజువు. ఆ వరప్రభావం వలన ఆ మునులు బృందావనంలో గోపికలుగా జన్మించారు. మునులేంటి, బ్రహ్మదేవుడు గోవులను కట్టుగొయ్యగా జన్మించాడు. సంగీతనాద దేహుడు ఐన శివుడువెదురుగా జన్మించి వేణువు అయినాడు. వేదవాఙ్మయం వసుదేవునిగా జన్మించింది. బ్రహ్మానందం నందునిగా జన్మించింది. ముక్తికాంత యశోదగా జన్మించింది. పదహారువేల నూట ఎనిమిది వేద ఋక్కులు స్త్రీలుగా జన్మించాయి. పాలసముద్రం పాలకుండలు ఐపోయింది. 'సత్యము' అక్రూరునిగా జన్మించింది. యిలా సమస్త దేవీ దేవతలు, శక్తులు, తత్త్వములు అన్నీ ఎవరికి ఏ రూపంలో అవకాశం దొరికితే ఆ రూపాన్ని పొంది శ్రీకృష్ణుడి దర్శన, స్పర్శన భాగ్యాన్ని పొందాయి. ఆ రహస్యాన్ని సూచిస్తున్నాడు సమస్తశాస్త్ర రహస్యవేది ఐన శ్రీకృష్ణదేవరాయ చక్రవర్తి.

సరే, ఇంతా చేసి, అలా స్త్రీలుగా జన్మించినవారిని యేలుకున్నాడా అంటే అదీ లేదు. వారిని మధ్యలోనే వదిలిపెట్టి 'కాందినీ తనయ ప్రేరణ' వలన (అక్రూరుని తల్లిపేరు 'కాందిని') అట్టహాసంగా మధురానగారానికి వెళ్ళిపోయాడు. అదీ ఆయనగారి నిర్వాకం అంటున్నది గోదాదేవి.

హతల నొనర్చె మోహితల నల్ల యయోముఖి నా పులస్త్యభూ
సుతను విరూప లౌట ననుచో ముసలిన్బెద నిట్ట తాడువం
టతివ రమించె దా ముసలి యయ్యు రహిన్మరుగుజ్జుప్రేష్యకై
ధృతిసెడి యుగ్రసేనునకు బ్రేష్యత నొందియు దిద్ది యేలడే?

ఆ పులస్త్యవంశానికి చెందిన శూర్పణఖను, ఆ అయోముఖి అన్న దానిని, తనను మోహించినవారు ఐనప్పటికీ దెబ్బ తీశాడు. వాళ్ళు కురూపులు కావడం వలన అని సర్ది చెప్పడానికి ప్రయత్నం చేయకండి. ముసలిది, పెద్ద నిలువు తాడిచెట్టంత ఉన్న రేవతీ దేవితో తానూ ముసలివాడు అయివుండీ , బలరాముడిగా రతిక్రీడలు చేయలేదా? మరుగుజ్జు, దాసీ ఐన కుబ్జను అందంగా తీర్చి దిద్ది తానూ ఉగ్రసేనుడి దాసుడు అన్నట్టు, యిద్దరికీ అన్నీ సరిగ్గా సరిపోయినట్లు యేలుకోలేదా? తనకు నచ్చాలి అంతే. నచ్చితే మురిపిస్తాడు, నచ్చకుంటే విసిరేస్తాడు ఆతని తత్త్వమే అంత అంటున్నది గోదాదేవి.

అయోముఖి కూడా శూర్పణఖ లాంటిదే, రాక్షస స్త్రీ. దండకారణ్యములో ఉండగా శ్రీరాముడిని కోరి అఘాయిత్యం చేయబోతే లక్ష్మణుడు తగిన శాస్తి చేసి తరిమేశాడు. ముసలిది, పెద్ద తాడిచెట్టువంటి రేవతీదేవి అంటున్నాడు రాయలు. యిందులో అద్భుతమైన పౌరాణిక రహస్యాల చమత్కారం ఉంది.

కృతయుగంలో ఋతవాక్కు అనే ఋషి ఉండేవాడు. ఆయనకు రేవతీ నక్షత్రంలో ఒక కొడుకు పుట్టాడు. వాడు దుర్మార్గుడు అయినాడు. ఋషికి ఆ నక్షత్రం మీద కోపం వచ్చింది, నీ ఫలితంగానే యిలా ఐనాడు కనుక నువ్వు నేలమీద పడిపో అని శపించాడు. రేవతీ నక్షత్రం ఒక కొండమీది కొలనులో పడింది. ఆమె పేరుమీద ఆ కొండ 'రైవతక పర్వతం' అయ్యింది. కొలనులో బాలికగా జన్మించిన ఆమెను ప్రముచుడు అనే ముని పెంచుకున్నాడు. ఆమెను దుర్గముడు అనే వాడికిచ్చి వివాహం చేశాడు. వారికి కలిగిన కుమారుడు 'రైవతుడు' ఐదవ మనువుగా పరిపాలించాడు. ఆ మనువుకు పుట్టిన కుమార్తె 'రేవతి' అయ్యింది. ఆమె ఆజానుబాహువు, తనతో సాటి వచ్చేవారు లేరు ఎందులోనూ. ఆమెను తీసుకుని బ్రహ్మదేవుని వద్దకు వెళ్ళాడు రైవత మనువు. ఈమెకు తగిన వరుడిని సూచించండి అని ప్రార్థించాడు. ఈ నాలుగుమాటల్లోనే భూలోకంలో యుగాలు గడిచిపోయినాయి నాయనా, యిప్పుడు ఆదిశేషుడు బలరామునిగా అవతరించి ఉన్నాడు భూలోకంలో. ఆయనే ఈమెకు తగిన వరుడు అని బ్రహ్మదేవుడు శెలవిచ్చాడు. అలానే ఆమెను బలరామునికి ఇచ్చి వివాహం చేశాడు రైవత మనువు. అలా యుగాల పర్యంతమూ ఉన్నది కనుక రేవతీదేవి వృద్ధురాలు అయ్యింది. అంతకన్నా ముందే ఎప్పుడు పుట్టాడో ఎవరికీ తెలియని ఆదిశేషుడు కనుక బలరాముడు వృద్ధుడు అయినాడు. ముసలము అంటే నాగలి అని కూడా అర్థం కనుక, ముసలమును ధరించినవాడు 'ముసలి' అని కూడా చమత్కారం చేశాడు రాయలు, చక్రమును ధరించినవాడు చక్రి అన్నట్లు. అదీ శ్రీకృష్ణదేవరాయల సమస్తశాస్త్రరహస్య గ్రహణాపారీణత.

గోదాదేవి విరహబాధతో తన మనోనాథుడిని నిందిస్తున్నది. నందగోకులంలో, బృందావనములో తననే వలచి వచ్చినవారిని ఆయన ఎలా వేధించాడో చెబుతున్నది.

తనకు నందబుఁ గూర్ప బృందావనమున  
నొకతె రతిఁ దేల్చి కాఁక నొండొకతెఁ బ్రేల్చి  
యంత రాధకు మేలువాఁడై మురారి  
యెల్ల సతులకు నెద నుడుకే యిడండె

గోపికలు అందరూ తనకై కూడివస్తే, ఒకామెను రతిలో తేల్చి మరొకామెను కాకలో, మదన తాపంలో పేల్చాడు, పక్షపాతి. రాధమీద ప్రేమతో, పక్షపాతంతో ఆమెను దగ్గరికి తీసి, మిగిలినవారి గుండెల్లో మంటలను రేపాడు. అదీ ఆయనగారి నిర్వాకం, యిలా ఎన్ని ఉదాహరణలు ఆయన స్త్రీలను ఎలా వేపుకుతిన్నాడో చెప్పడానికి అన్నది. ఆవిడ స్నేహితురాళ్ళు నవ్వి, యిలా అన్నారు.

ఎవ్వరు నట్లుపో నెరసు లెన్నకమానరు ప్రాణభర్తలన్  
దవ్వుల నున్నఁ గాఁక కతనన్మఱి వారలు వశ్యులైనఁ దా  
నెవ్వరి నొల్ల కొక్కటయి యింద్రుఁడు చంద్రుఁడుడటంద్రు బోటి తా  
నివ్వలఁ దేరకత్తె యగు నిట్టివి నీతలవేగెనే చెలీ.

ఎవరైనా అంతేనమ్మా, తమ ప్రాణేశ్వరులు తమకు దూరంగా ఉన్నపుడు కోపంతో, విరహతాపంతో వంకలు పెట్టకుండా ఉండరు.

అదే వాళ్ళు చేరివచ్చినప్పుడు, తమకు వశులు ఐనప్పుడు వారినే 'ఇంద్రుడు' 'చంద్రుడు' అని పొగుడుతారు. చివరికి వారూ వారూ ఒక్కటైపోతారు. అంతవరకూ చేదోడు వాదోడుగా ఉన్న చెలికత్తెలు పరాయివాళ్ళు ఐపోతారు. ఇలాంటి తలపులే నీకు వచ్చాయిలే ఇప్పుడు అన్నారు. ప్రేయసీ ప్రియులమధ్యన భార్యా భర్తల మధ్యన తల దూరిస్తే తల వాచిపోక తప్పదు, నిజమైన అనురాగము వారి మధ్యన ఉంటె, అన్న లోకోక్తిని చెప్తున్నాడు శ్రీకృష్ణదేవరాయలు. స్త్రీల మనస్తత్వాన్ని తేటతెల్లం చేస్తున్నాడు.

అనుటయు నెలనగ వడఁచుచుఁ
గన లించుక తెచ్చి యొాడుగఁఱచుచు నయ్యం
గనలన్ కందుకనికరముఁ
గొని వ్రేయుచుఁ గెలను చూచుకొనుచుం బలికెన్

ఎంతైనా చివరికి మీరూ మీరూ ఒక్కటేనమ్మా, చివరికి మేమే పిచ్చివాళ్లము ఐపోతాము అంటున్న చెలికత్తెలను చూస్తూ, మొలకెత్తుతున్న చిరునవ్వులను అణిచిపెట్టుకుంటూ, తెచ్చిపెట్టుకున్న చిరుకోపముతో, బంతులను తీసుకుని వారి మీద విసిరి వేస్తూ, కొనగంటి చూపులతో చూస్తూ యిలా అన్నది.

విడువక మీ గానము సొాగ
సిడుటయు, మఱి పాడుఁడనుట యెగ్గే! పాసెం
బడిగిన వారే పేదలె?
కొడిమెలు గట్టకుఁడి యతనిఁ గొని పని యేలా

మీరు ఆయనను(శ్రీ హరిని) వదలకుండా భజనలు చేస్తూ పొగుడుతుంటే, ఆతని కథా కమామిషూ చెప్పడం కూడా తప్పేనా? పాసెం పెట్టుమని అడిగిన వాళ్ళే పేదలు, తిండికి లేని వాళ్ళూ ఐపోతారా? రుచికి మెచ్చుకుని తీయని పదార్థాన్ని పెట్టుమని అడిగినంత మాత్రాన తిండికి లేనివాళ్ళు ఐపోతారా, అడిగినవాళ్ళు? చిలవలు పలవలు చేర్చి ఆయనతో ఏదో అనుబంధం ఉంది అని కల్పించకండి, అసలు ఆయనతో పనేమిటి?(నాకూ- మీకూ) పోనియ్యండి అన్నది.

పోనిండన్న వయస్య లిట్లని రగుం బోనిక్క మింకిప్పుడే
గాని మ్మిం కొక కొంతసేపునకునే గానీ సఖీ యెల్లి యే
గానీ నీనుడిఁ దన్మనోజ్ఞగుణముల్గానీ తదన్యాయము
ల్గానీ డిందినఁ జింత నీకతనిపై గా కెవ్వరిం దేల్చెదే?

పోనియ్యండి అనగానే, పోనియ్యక యిప్పుడు చేస్తున్నది ఏమున్నదని? యిప్పుడో, ఇంకొంత సేపటికో, రేపో, మాపో ఆయన సుగుణాలు కానీ లోపాలు కానీ, ఆయనగారి అన్యాయాలు దుర్మార్గాలు కానీ, ఆయన మీద తప్ప నీకు ఎవరిమీద ఆలోచన, ఇంకెవరిని పలవరిస్తావు, చురకలేస్తావు, కానియ్ అన్నారు. వారు అన్నట్లుగానే గోవిందుని తలపులతో, వలపులతో గోదాదేవి విరహము అహరహము

కొనసాగుతున్నది. వేదన పెరిగిపోతున్నది. ఆమెను చెలికత్తెలు ఆటపట్టిస్తున్నారు. ఒక చెలికత్తె యిలా అంటున్నది. అద్భుతమైన సుకుమారమైన భావనల మేళవింపు, శబ్ద సౌందర్యము, వర్ణనా చమత్కృతులను రాశులుగా పోశాడు రాయలవారు ఈ పద్యంలో.

నఖముఖోర్జ్ఝిత పరాఙ్ముఖ ముక్త బాష్పాంబు
పటిమ దీపపు జిటచిటలు దెలుప
పొరినుపాంశూత్సృష్ట పూత్కృతుల్కృశమధ్య
పార్శ్వముహుః ప్రకంపనలు తెలుప
నొదవెదుగాద్గద్య మదరిపాటునఁ బల్క
రింపఁ బుట్టెడు కేకరింత తెలుప
వలవంత విసువు కాంతల పుట్టు దూషించు
కారణంబుల తొంటి కథలు తెలుప

నలఁతఁ బానుపుపైఁ బొరలాట తెలుపఁ
దెగువ లోలోననే నవ్వు నగవు తెలుపఁ
గలఁక మామీఁదిపనిలేని కసరు తెలుపఁ
బొలఁతి రేలు నీయున్కియే పులుగుగాదె

ప్రక్కకు తిప్పుకున్న ముఖము నుండి కారుతున్న కన్నీటిని కొనగోటితో విదిలిస్తున్నపుడు ఆ కన్నీటి బిందువులు దీపజ్యోతిమీద పడి చిటచిటలాడుతుంటే కన్నీటి పటిమ తెలుస్తున్నది, చిటచిటలు తెలుస్తున్నాయి. ఏకాంతములో విడుస్తున్న నిట్టూర్పుల పూత్కారములు కృశించిన నడుము అదిరిపడుతుండడంవలన తెలుస్తున్నాయి. ఎవరైనా పిలిచినప్పుడు ఉలికిపాటుతో గొంతును సవరించుకుని జవాబివ్వడం గద్గదికమును దాచిపెట్టడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలుపుతున్నది. స్త్రీ జన్మను నిందిస్తూ అంతకుముందు చెప్పిన కథలు విరహతాపముతో వచ్చిన విసుగును తెలుపుతున్నాయి. పానుపుమీద పొర్లడం వలన లోలోపలి నలత, కలత తెలుస్తున్నది. విరక్తిగా లోలోన నవ్వుతున్న నవ్వు మొండితనాన్ని తెలుపుతున్నది. విసుగును చిరాకును ఉత్తుత్తిగా మామీద కసురుకోవడమే తెలియజేస్తున్నది. ఓ మగువా! గోదా! రాత్రులలో నీ ప్రవర్తనయే గుర్తు గదా (నువ్వు శ్రీహరి వలపులోపడ్డావు అని) అని ఆ చెలికత్తె ముగించగానే మరొక చెలికత్తె అందుకున్నది.

ఎరుగరుగా యొకద్భుతము నీ చెలి దీర్ఘికఁ దీర్థమాడ నా
యరుతఁ దగిల్చి పోవుఁ దన హారము వోయిన నేను బోవుదున్
మరువక వెంటఁ బోవ జలమగ్నత నౌ నది సున్నమైనఁ దాఁ
గరకరిపెట్టి సొమ్మడుగు గాని నిజార్తి యెరుంగ దేమియున్

మీకొక విచిత్రము తెలియదుగా! చెబుతాను వినండి. ఈ చెలియ (గోదాదేవి) పెద్ద దిగుడుబావిలో స్నానం చేయడానికి వెళ్తూ ఆమె కంఠహారాన్ని నా మెడలో ( నా అరుతన్) వేసి వెళ్ళింది. నేనూ స్నానం చేయడానికి వెళ్లాను. వెళ్లి నీళ్ళలోకి దిగగానే ఆ హారం పెట్లిపోయి పొడుము పొడుము అయ్యింది, అంతవరకూ ఆమె శరీర తాపానికి ఎండిపోయి పెళుసుగా ఉన్నది మరి. విరహముతో అంతగా కాగిపోతున్నది ఆమె! సరే, తన హారము తన తాపంచేత పొడి పొడి అయితే, 'నా హారాన్ని ఎలా నీకిచ్చానో అలానే నాకివ్వు' అని నన్ను బాధిస్తుంది కానీ, విరహముతో తను ఎంత బాధపడుతున్నదో తెలుసుకోదు ఎంత చోద్యమో! అన్నది ఈ చెలికత్తె. మరొక చెలికత్తె అందుకున్నది.

అనిన మరాళి పల్కు వినవా హరిణీ యొకనాడు కస్తురిం
గొని యిడు బొట్టు నా కనుచుఁ గూర్మి నొసంగినఁ బెట్టుచుండఁ జు
ర్రనుచు మొగంబు వ్రేసినటు లౌ తనయూర్పుల నింకి యింకి పో
యిన పలుబేంట్లు గోరఁ గొని యెత్తనె పట్టెను మాటిమాటికిన్

మరాళి అనే ఈ చెలికత్తె యిలా అంటున్నది. 'హరిణీ! యిది వినవే. ఒకరోజు కస్తూరి తీసుకుని నాకు బొట్టుపెట్టుమని చనువుగా అడిగింది. సరేనని బొట్టు పెట్టడం ప్రారంభించానా, ముఖం మీద కస్తూరి బొట్టు పడ్డది పడ్డట్టు చుర్రుమని ఇంకిపోతూనే ఉన్నది, వేడి పెనం మీద పడ్డట్టు, తన నిట్టూర్పుల వేడికి. ఇంకిపోయి బీటలు బారిన ఆ కస్తూరి బొట్ల పెచ్చులను మాటిమాటికి గోటితో లేపి తొలిగించడమే పట్టింది, యింక బొట్టు పెట్టడమా ఏమన్నానా? యిలా చెలికత్తెలు ఒకరితర్వాత మరొకరు గోదమ్మను గోలపెడుతున్నారు.

గోదాదేవి విరహతాపముతో నలిగిపోతుంటే చెలికత్తెలు వెళాకోళం చేస్తూ చెలరేగిపోతున్నారు. స్రగ్విణి అనే చెలికత్తె అందుకుని యిలా అంటున్నది.

**అనినస్రగ్విణి వల్కె దన్ను జెలులారా నే లతాడోల జి**
**క్కన నూపం దెగి వ్రాల దీని చనువ్రేకం బేక్రియం దాల్తునో**
**యని పట్టం దినమధ్యమార్కరుచిఖిద్యన్మంజరుల్వోని వా**
**డినపాలిండ్లను బెండుబొమ్మగతి నుండె న్స్పందిటం జుల్కనై**

ఒకనాడు నేను ఈమెను లతల ఉయ్యాలలో ఊపుతుంటే, బహుశా ఆమె శరీరపు తాపానికి కాబోలు, ఆ లతలు తెగి, ఈమె క్రింద పడబోయింది. పడకుండా పట్టుకుందామనుకుంటూ ఈమె వక్షోజభారాన్ని నేనెలా మోయగలనో అని భయపడుతూ ఈమెను పట్టుకోగా బెండుతో చేసిన బొమ్మలాగా, తేలిగ్గా ఉన్నదీమె, మధ్యందిన మార్తాండుని వేడిమికి వాడిపోయిన పూలగుత్తులవలె వాడిపోయి, వడలిపోయి ఉన్నాయి ఈమె కుచములు! అంత విరహతాపం తల్లీ, ఈ తల్లికి అన్నది. గోదాదేవికి చిరుకోపం వచ్చింది.

**ఆర్పగ దీర్పగ మిక్కిలి**
**నేర్పుగల వయస్యలట్లు నెలతలు మీ మీ**
**నేర్పున బలికెద రక్కర**

**యేర్పడ మీ కీ విచార మేటికి జెపుడీ**

పెద్ద ఆర్చేవాళ్ళ లాగా తీర్చేవాళ్ళ లాగా మాట్లాడుతున్నారు, నాకు కదా బాధ, మీకీ విచారమెందుకు చెప్పండి అని చిరు కసరు కసిరింది. అలా కసిరి వాళ్ళను పంపడమో, తేలికగా వాళ్ళ నోళ్ళకు తాళం వెయ్యడమో చేస్తుంది కానీ, ఒకోసారి రాత్రుళ్ళు విరహతాపాన్ని తట్టుకోలేక గోవిందుని యిలా నిష్ఠూరా లాడుతుంది గోదాదేవి.

**అభినవకువలయ శ్యామకోమలమైన**

**డామూపు మకరకుండలము దాల్ప**

**నిస్తులాస్యశ్రీ వయస్స్తంభనిక్షిప్త**

**నింబచ్ఛదభ్రువల్పంబు నిక్క**

**బరువంపు మంకెనవిరి వంపు నరవంపు**

**వాతెర చెంద్రంపు వాన గురియ**

**నందంపు మెరుగు వాలారు కన్గవ చూడ్కి**

**శ్రవణ కుండల కాంతి సవతు గాగ**

**సప్తభువనాంగనానురంజనకు సప్త**

**విధ పరీవాహముగ గానసుధ వెలార్చ**

**మూడ్కి వేణువుపై వ్రేళ్ళు మార్చి మార్చి**

**మరులుకొలిపితె గోవింద మందసతుల**

తెలుగు సాహిత్యంలో అత్యద్భుతమైన శ్రీకృష్ణ వర్ణనలలో యిది ఒకటి అని, పోతనకు శ్రీకృష్ణ వర్ణనలలో ప్రథమస్థానం అని ఈ వ్యాసకర్త ఉద్దేశం. ఆంధ్ర మహాభాగవతంలో దాదాపూ ఇలానే ఉన్న పద్యము ఒకటి ప్రసాదించాడు పోతన, శ్రీకృష్ణ దేవరాయ చక్రవర్తి యిక్కడ ఆముక్తమాల్యదలో పొదిగాడు. వేణుగానం చేస్తున్న శ్రీకృష్ణుని వర్ణచిత్రం, రాయల వర్ణనా విచిత్రం ఈ పద్యం. కొత్త నల్లకలువను అంటే అప్పుడే విచ్చుకున్న నల్లకలువను బోలిన నల్లని ఎడమ భుజము (అభినవకువలయ శ్యామకోమలమైన డామూపు) పైన శ్రీకృష్ణుని మకరకుండలము ఉన్నది. ఎందుకంటే ఆయన ముఖం కొద్దిగా ఎడమ ప్రక్కకు వాలి ఉన్నది. ఆయన సాటిలేని ముఖ కళకు దృష్టి దోషం తగిలి ఆ ముఖకళకు వయసు తగ్గకుండా దిష్టి తీయడానికి ఉంచిన వేపాకులాగా ఆయన భ్రుకుటి కొద్దిగా పైకిలేచి ఉన్నది(నిస్తులాస్యశ్రీ వయస్స్తంభనిక్షిప్త నింబచ్ఛదభ్రువల్పంబు నిక్క) పీడలూ పిశాచాలూ సోకకుండా వేపమండలను కట్టడం జానపదుల జీవనవిధానంలో ఒక అంశం, వేపాకు వలన వయసు సడలిపోకుండా ఉంటుంది అని ఆరోగ్య సూత్రము ఇందులో నిక్షిప్తం చేశాడు రాయలవారు. వేణుగానం చేస్తున్నందువలన గమకాలకు అనుగుణంగా ఎగసిన కనుబొమ వర్ణన! విచ్చిన కారణంగా వయసు వచ్చినకారణంగా మిడిసిపడుతున్న బంధూక పుష్పం లాంటి ఎర్రని క్రింది పెదవి ఎర్రనెర్రని కాంతులను కురిపిస్తున్నది,ఆ పూవు యొక్క అతిశయాన్ని చులకన చేస్తున్నది, దాన్ని వెర్రిదాన్ని చేస్తున్నది. ఆ క్రింది పెదవి వేణువును వాయిస్తున్న కారణంగా సగం వాలి, సగం తెరిచి ఉన్నది.(బరువంపు మంకెనవిరి వంపు నరవంపు వాతెర చెంద్రంపు వాన గురియ) అందంగా మెరుస్తున్న వాలుగన్నుల చూపుల కాంతి భుజము మీదికి వాలిన చెవికుండలముల కాంతితో పోటీ పడుతున్నది(నందంపు మెరుగు వాలారు కన్గవ చూడ్కి శ్రవణ కుండల కాంతి సవతు గాగ)యిలా ఏడులోకాలలోని స్త్రీల మనసులను

రంజింపజేయడం కోసం ఏడు విధములైన స్వరసమ్మేళనంగా, గానము అనే ఏడు విధముల ప్రవాహాన్ని పారిస్తూ, వ్రేళ్ళను మార్చి మార్చి వేణువుపై ఆడిస్తున్నావా గోవిందా? వ్రేళ్ళకొసలపై ఆడించినట్టు గొల్ల మందల సతులను (మందబుద్ధులు వెర్రివాళ్ళు ఐన స్త్రీలను అని కూడా చురక) మోహింపజేసి వారికి మరులు కొల్పుతున్నావా గోవిందా అని గోవింద నామస్మరణం చేస్తున్నది గోదాదేవి. ఏడు లోకాలు అంటే ఏడు ఊర్ధ్వ లోకాలు. ఊర్ధ్వ లోకాలు అంటే ఊర్ధ్వ దిశకు, అంటే ఉన్నతికి దారి తీసే లోకాలు. అవి భూలోకము, భువర్లోకము, స్వర్లోకము, మహర్లోకము, జనలోకము, తపోలోకము, సత్యలోకము.

ఊర్ధ్వదిశన ఉన్నలోకాలు, ఉన్నతమైన ముక్తిని ఇచ్చే లోకాలు యివి. అధోలోకాలు, అంటే క్రిందికి ఉన్న లోకాలు, అంటే ఉన్నతికి నోచుకోని జీవులున్న లోకాలు ఉన్నాయి, అతల, వితల, సుతల, రసాతల, తలాతల, మహాతల, పాతాళ లోకాలు. ఈ క్రిందిలోకాల వారు ఆయనకు మోహితులు కారు, వారికి ఆయనవైపు మనసు పోదు, ఉన్నతి పొందరు, అందుకని వారివి అధోలోకాలు. ఏడు లోకాలలోని స్త్రీలు అంటే ఏడు లోకాలలోని జీవులు అందరూ అని ఒక మెరుపు. ఎందుకంటే జీవులందరూ స్త్రీలే, పురాణ పురుషుడు, ఏకైక పురుషుడు శ్రీకృష్ణుడు ఒక్కడే కనుక. కనుక ఊర్ధ్వ దిశను, దశను పొందాలనుకునే ఏడు లోకాల స్త్రీలు శ్రీకృష్ణుని వైపు చూడవలసిందే, ఆయన మోహంలో పడవలసిందే, ఆయనవల్లనే రంజిల్లవలసిందే, అదీ నిర్దేశపూర్వకమైన రహస్యపు వెల్లడి. సప్తస్వరాలు అందరికీ తెలిసినవే. ప్రవాహము అంటే ప్రవహించేది. అంటే నది అని అర్ధం. నది అంటే గంగా నది అని విశేషం. ఆ గంగ కూడా శివుని శిరసునుండి ఏడు పాయలుగా ఏడు పేర్లతో భూమి మీదకు ప్రవహించింది. ' నా ధాటికి శివుడు తట్టుకుంటాడా? చూస్తాను' అని గర్వంతో శివుని శిరస్సుమీదికి దూకింది గంగ. అది కనిపెట్టిన పరమశివుడు తన జటాజూటాన్ని బిలంలాగా పెంచి ఒక్క బిందువును పట్టుకున్నట్టు గంగను పట్టి ఉంచాడు. మరలా భగీరథుని ప్రార్ధనలకు కరిగి నెమ్మదిగా, హిమశైల శిఖరంమీద బ్రహ్మదేవుడు నిర్మించిన బిందు సరస్సులోకి గంగను వదిలిపెట్టాడు. అక్కడినుండి ఏడు పాయలుగా గంగ ప్రవహించింది. హ్లాదిని, పావని, నళిని అనే మూడు పాయలు తూర్పుదిశకు, సీత, సుచక్షువు, సింధువు అనే మూడుపాయలు ఉత్తరదిశకు ప్రవహించాయి.

ఏడవ పాయ భగీరథుని అభీష్టాన్ని తీర్చడంకోసం ఆతనివెంట నడిచి భాగీరథి ఐంది. కనుక ఏడు లోకాలలోని స్త్రీలు, ఏడు స్వరాలు, ఏడు ప్రవాహాలు అని సమంజసంగా, సరసంగా, రమణీయమైన రహస్యాలను ఈ పద్యంలో రాశులుగా పోశాడు రాయలవారు. గోదాదేవి విరహంతో పలవరిస్తున్నది.

**అక్కట రాధ నీకు దగవా మగవారల నత్త మామలం**
**దక్కి ముకుందవేణుకలనాదపుటీలకు లేటి మెత్తమై**
**త్రెక్కొను కాకచే నడికి రే లరుదెంచిన గోపికావళిన్**
**బొక్కగజేసి తద్రుచిర భోగము గుత్తగ నీవ గైకొనన్**

తాము వలచినవారిని తమకు కాకుండా దక్కించుకున్న వారిని అసూయతో నిందించడం సహజమే. అందుకని రాధను నిష్ఠూరాలు ఆడుతున్నది. 'అయ్యో రాధ! నీకిది తగునా? తమ మగవారిని, అత్తమామలను ఎలాగోలా తప్పించుకుని, ముకుందుని వేణు గానానికి మెత్తబడి, మనసు తనువూ వేడెక్కి అర్ధరాత్రుళ్ళు ఇల్లువదలి వచ్చిన గోపికలను కుమిలేట్లు చేసి ఆ ముకుందుని భోగమును గుత్తగా, మొత్తంగా నువ్వే అనుభవించడం న్యాయమా?' అని అడుగుతున్నది.

రాధాదేవి వ్యామోహంలో పడి మీ అందరినీ నిర్లక్ష్యం చేసినా పిచ్చిగా ఆయన వెంటే బడదానికి మీకెందుకు అభిమానము, లజ్జా లేదు అని మిగిలిన గోపికలను నిందిస్తున్నది.

**అక్కమలాక్షు డొక్కతె నిజాంసమునం దిడి కుంజపుం**
**జక్కికి గొంచుబోవ బెరచాన లినాత్మజవెంట వ్రేగున**
**న్మిక్కిలి డిగ్గు పాదసరణిం జని రోయుదు రట్టె రోసి తా**
**రక్కడ గాంచు టేమి వలదా యభిమాన మొకింత యింతికిన్**

ఆ కమలాక్షుడు ఒకామెను(రాధాదేవిని) వీపు మీదకు ఎక్కించుకుని పూపొదరిళ్ళలోకి వెళ్ళినపుడు మిగిలిన గోపికలు ఆ యమునానది ఒడ్డువెంట(యినాత్మజవెంట– సూర్యుని కుమార్తె ఐన యమునానది వెంట) ఆ యిసుకలో బరువుగా లోతుగా పడిన కాలిగుర్తులను గమనిస్తూ విలపిస్తూ వెళ్లి, అక్కడ చూడడం ఏమిటి? ఆ పూపొదరిళ్ళలో, ఆ ఇసుకలో బడి మొత్తుకుంటూ తిరిగి చూసేదేముంది, ఆయన ఆమెతో సలిపే శృంగార క్రీడలే కదా? ఆడదానికి కొంచెం అభిమానం రోషం ఉండొద్దూ? అని మందలిస్తున్నది.

వీపున రాధను ఎక్కించుకుని మోస్తూ పరుగులు తీస్తున్నాడు కనుక ఆయన ఒక్కడి పాద ముద్రలే, బరువుగా, లోతుగా దిగబడి యమున ఒడ్డున తడి ఇసుకలో కనిపిస్తున్నాయి. రాధాదేవి సమస్త జీవులకూ ప్రతీక ఐన జగన్మాత. 'గోలోక బృందావనం' అనే లోకం ఉన్నది. సృష్టిలో అన్నిటికంటేపైన ఉన్నది, అన్నిటికంటే ఉన్నతమైనది. అక్కడ బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు ప్రభువు ఐన శ్రీకృష్ణుడు ఉన్నాడు. అక్కడ ఆయన సతి రాధాదేవి. ఆమె లక్ష్మి, సరస్వతి, పార్వతి, గాయత్రి మొదలైన అమ్మలందరికీ 'మూలపుటమ్మ'. ఆమె ఆ శ్రీకృష్ణుని శరీరంలో ఆత్మలో సగభాగం, ఆమెయే శ్రీకృష్ణుడు, శ్రీకృష్ణుడే ఆమె! ఆమె ఆయననే నమ్ముకున్నది కనుక ఆమె బాధలన్నిటినీ తీరుస్తాడు, నెత్తికెక్కించుకుని మోస్తాడు. జీవులందరూ స్త్రీలే అని తెలుసుకుని, ఆయనే పతి అని తెలుసుకుని, ఆయననే నమ్ముకుంటే ఎవరినైనా, ఎందరినైనా ఆయనే చూస్తాడు, మోస్తాడు, దరికి తీస్తాడు, దరి జేరుస్తాడు. అదీ రాధాకృష్ణుల రహస్యం. ఇక్కడ అప్రస్తుతం కాదేమో అని యిస్తున్నాను. అజ్ఞాత ఆంగ్ల కవి ఒకరు ' ఫుట్ ప్రింట్స్' అని ఒక ఆంగ్ల దీర్ఘ కవిత వ్రాశారు, అందులో యిదే ప్రతీక. ' నన్ను నమ్ముకో, నీ వెంటే నడుస్తాను అన్నావు, భారంగా యింత పయనమూ చేసి వెనుదిరిగి చూస్తే నా ఒక్కడి కాలి గుర్తులే కనిపిస్తున్నాయి' అంటాడు తను నమ్మిన దైవంతో. ఆ దైవం చిన్న నవ్వు నవ్వి, ' అమాయకుడా ఆ ఒక్కడిని నేనే, ఆ కాలిగుర్తులు నావే, నిన్ను మోస్తూ నేనే నడిచాను యింతవరకూ, నీ పయనము నేనే చేశాను' అంటాడు! భాష ఏదైనా భావం ఉన్నతం అయితే తెలుసుకుని ఆనందించడం సాహిత్య ప్రేమికుల లక్షణం కనుక ఉదహరించాను.

**ఇలు కలనైన వెల్వడని యీలుపుటాంధ్రకు దాపికత్తెవై**

**యులు కెడలించి శౌరితను యోగపు వాచవి జూపి మీద బె**
**ల్ల లము వియోగవహ్ని భవదంతర సైకత పఙ్క్తి పొంత వం**
**తల బొరలించి తౌదు శమనస్వస వుగ్రమయూఖనందినీ**

గోపికలను తిట్టడం అయిపోయిన తర్వాత యింతకూ కారణమైన యమునా నదిని పట్టుకున్నది. కలలో కూడా ఇల్లు వదిలి వెళ్లి ఎరుగని అభిమానవతులు ఐన గోపికలకు తార్పుడుకత్తెవై, ఆయన శరీర మాధుర్యాన్ని రుచి చూపించి, వియోగ భారంతో నీ యిసుక తిన్నెలవెంట పడి, వంతలతో పొర్లిగింతలు పెట్టించావు, అవునులే, నీవు యముడికి చెల్లెలివి(శమనస్వస) ఉగ్రమైన కిరణాలతో మాడ్చేసే సూర్యునికి కుమార్తెవు(వుగ్రమయూఖనందిని)నీకు దయ, జాలి ఎలా ఉంటాయి చెప్పు!

**నాడు మన మున్న నెట్లొ పూబోడులార**
**యనిన వారలు మగుడ నా యమకు ననిరి**
**యింతి నా డుండ కెందు బోయితివి నీ వ**
**టన్న నచ్చెరువడి వారి కతివ పలికె**

మరలా దిగులుగా, గుబులుగా ' ఆహా, అప్పుడు కనుక మనముంటే ఎలా ఉండేదో, ఆయనను పొందగలిగే దాన్నేమో' అన్నది. అప్పుడు ఆమె చెలికత్తెలు 'అప్పుడు నువ్వు లేకుండా ఎక్కడికి పోయావు? నీవు అప్పుడూ ఉన్నావు, అక్కడా ఉన్నావు' అన్నారు. గోదాదేవి ఆశ్చర్యంగా అడిగింది.

**సకియలార త్రైకాలిక జ్ఞానవంతు**
**లైన ఋషులట్లు పలికెద రంత యెరుక**
**యెద గలిగినేని యెరిగింపు డేను మొదల**
**నెవ్వతె నన్న మరి వారలిట్టు లనిరి**

త్రికాలజ్ఞానులు ఐన ఋషులలాగా చెప్తున్నారు, అంత తెలిస్తే అప్పుడు, మొదలు నేనెవరిని చెప్పండి అని అడిగింది అనుమానంగా, కుతూహలంగా, ఆశ్చర్యంగా, పరిహాసంగా! వారు చెప్పడం మొదలెట్టారు.

గోదాదేవికి చెలికత్తెలు ఆమె పూర్వజన్మను గురించి చెప్పడం మొదలుబెట్టారు.

దివిజద్రుప్రసవంబుఁ గాంచిన సపత్నిం జూచి చూపోప కిం
తవుజిల్గుంబని యంత సేసి మది నీర్ష్యాక్రోధము ల్పందడిం
ప విరిం బోక ద్రుమంబుఁ గైకొనఁబతి న్మందన్న మ్రానెల్లఁ దే
నవథిం బెట్టిన సత్య వీ వహహ కావా భామినీ నావుడున్

దేవవృక్షపు పుష్పాన్ని, పారిజాత పుష్పాన్ని పొందిన సవతిని రుక్మిణిని జూసి, సహించలేక, చిన్న విషయాన్ని పెద్దలుగా జేసి, మనసులో ఈర్ష్య, క్రోధము చెలరేగి, పూవుతో పోనీయకుండా ఏకంగా చెట్టుకు చెట్టునే పొందిన దానివి, ఔషధం కోసము చెట్టుకు చెట్టునే తీసుకురావాల్సిన శ్రమను భర్త ఐన శ్రీకృష్ణ పరమాత్ముడికి కలిగించిన సత్యభామవు నీవే కదా, ఆహాహా! అని ఆశ్చర్యంగా అన్నట్లుగా, నవ్వుతూ అన్నట్లుగా అన్నారు చెలికత్తెలు.

చీకటింట్లో దీపాన్ని వెలిగిస్తే ఇంట్లోని వస్తువులు ఒక్కొక్కటే కనిపించినట్టు పూర్వజన్మ స్ఫురణతో పూర్వ జన్మలో పరమాత్మునితో పొందిన ఆనందం, ఆ అనుభవాలు అన్నీ గుర్తుకొచ్చాయి గోదాదేవికి.

వాలిక కన్నులం బొడమ వారి సకజ్జల మాశ్రితశ్రవో
గోళక మై తదంతికపుఁ గుంతలవల్లికిఁ దల్లిఁదోడుగా
మైలవలి న్నన ల్నిగుడు మైఁ బులకల్పొడమన్ శ్లథాంగియై
సోలినఁ జూచి డెందములు సుర్రన హా యని బోటు లర్మిలిన్

విశాలములైన సోగకన్నుల నుండి ఊరుతున్న నీరు కంటికాటుకతో కలిసి చెవులనే గోళములను ఆశ్రయించాయి. ఆ చెవుల సమీపంలోనే ఉన్న తలవెంట్రుకలు అనే తల్లికి తోడుగా, ఆ తలవెంట్రుకలను తడిపేశాయి. ఆమె శరీరము అనే ఏలకి తీగకు పూచిన మొలకల్లాంటి మొగ్గలలాంటి పులకలు కలిగాయి.

శరీరము క్రుశించినట్లు, నీరసించినట్లు మూర్ఛ పోయింది. అది చూసిన చెలికత్తెలకు బాధకలిగింది. ఆమె మీది ప్రేమతో యిలా బాధపడ్డారు.

ఎంతకుఁ దెచ్చెనే సరసిజేక్షణచెయ్దము లందుమీద జ
న్మాంతరవర్తనంబు హృదయంబున కిత్తరి నెచ్చరించి గో
రంతలు కొండలంత లగునట్లుగఁ జేసితి మంచుఁ జేటికా
వాంతసతాళవృంతమృదువాతహిమాంబుకనాళిఁ దేర్చినన్

ఈ పద్మాక్షిచేతలు ఎంతకు దెచ్చాయి! వాటిమీద ఆమె జన్మాంతర పోకడలను ఈ సమయంలో గుర్తుజేసి గోరంతలు కొండంతలుగా జేశామే! అని బాధపడుతూ చెలికత్తెలు విసనకర్రలతో చల్లని గాలిని వీచి, చల్లని నీటిని చిలుకరించి ఆమెను మూర్ఛనుండి తేల్చారు. మూర్ఛనుండి తేరుకున్న గోదాదేవి యిలా అన్నది.

తెలిసి కను దెఱచి వెండియు
జలజేక్షణ తన్ముకుంద చరణ స్మృతిని
శ్చలతఁ గను మొగిచి మరి య
శ్రులు రెప్పలఁ దోఁపఁ దెఱచి చూచి సఖులతోన్

తెలివి వచ్చి, కనులు తెరిచి మరలా ముకుందుని చరణములను గుర్తుచేసుకుని నిశ్చలంగా కనులు మూసుకుని కొద్దిసేపు మౌనంగా ఉండి, రెప్పలమీద కన్నీరు కనిపిస్తుండగా కనులు తెరిచి చూస్తూ చెలికత్తెలను ప్రశ్నించింది.

మీ రెవ్వ రనుటయును శ్యం
గారిణి మే మురగకన్యకల మింతకు ము
న్ధారుణి కేతెంచితి మన
నారామలఁ గౌగిలించి యార్తి న్బలికెన్

నేను పూర్వజన్మలో సత్యభామను, సరే, మీరెవ్వరు అని ప్రశ్నించగా, ఓ సుందరీ! మేము ఇంతకు ముందు నాగకన్యలము, భూలోకానికి యిలా వచ్చాము( మేము నాగకన్యకలము, నీకంటే ముందుగా భూలోకంలో జన్మించాము, నీ కోసం) అనగానే గోదాదేవి ఆర్తిగా వారిని కౌగిలించుకున్నది. గోదాదేవికి ఆమె పూర్వజన్మలో సత్యభామయై శ్రీకృష్ణుని పతిగా పొందిన  సంగతిని ఆమెకు ఈ జన్మలో చెలికత్తెలుగా జన్మించిన నాగకన్యలు మరాళిక, ఏకావళి, స్రగ్విణి,హరిణి, మనోజ్ఞ అనే ఆ చెలికత్తెలు తెలియజేయగానే మూర్ఛపోయి,తేరుకున్న గోదాదేవి విలపించడం ప్రారంభించింది.

అట్టి మురారి కప్పు డనుఁగై మరి యీకలివేళఁ గ్రమ్మరం
బుట్టి వియోగ వేదనలఁ బొక్కెడు నీ తను వేల తండ్రి తా
నిట్టగు నన్ను నింకొకని కియ్యక తొల్తన యోగశక్తిఁ బోఁ
బెట్టెద దీని వెండియు నుపేంద్ర పదాంబురుహంబు పట్టెదన్

'అటువంటి' మురారికి ఆ జన్మలో ప్రియురాలనై, ఈ కలికాలంలో యిలా మరలా జన్మించి, యిలా వియోగ వేదనలో కుమిలిపోయే ఈ జన్మ ఎందుకు? ఇలాంటి నన్ను నా తండ్రి ఇంకొకరికి ఇచ్చి పెండ్లి చేయకముందే యోగమార్గంలో ఈ శరీరాన్ని త్యజిస్తాను. మరలా ఉపేంద్రుని పదకమలములనే పట్టుకుంటాను అని శరీరాన్ని త్యజించడానికి సిద్ధపడింది గోదాదేవి. 'అటువంటి మురారి' అనడంలో ముద్దులభార్య కోసం కేవలం పూవునే గాక చెట్టుకు చెట్టునే తెచ్చి పెరటిలో పాతిన శ్రీకృష్ణుడు అన్న మురిపెం ఉంది. అంతకుముందు పై పై కోపంతో తను నిందించిన అవతారాల ప్రసక్తి ఉంది. ఆదివరాహుడై భూదేవిని మన్నించి ఏలుకున్నవాడు, శ్రీరాముడై పత్నికోసం పరితపించి

పదితలల పురుగును ఏరిపారేసినవాడు, శ్రీకృష్ణుడై పదహారువేల కన్యలను, ఎనిమిదిమంది పట్టమహిషులను అలరించిన శ్రీకృష్ణుడు, అందరికన్నా గారాబంగా 'తనను' చూసుకున్న నాథుడు అన్న బెంగ ఉన్నది.

అనిన వారలు పల్కి రా యదువతంస
మెందు జన్నాడు విను రంగమంద నిల్చె
వేగపా టేల యతడ నీ విభుడగుటకు
నర్చనాదుల నిప్విటి హరి భజింపు

నా శరీరాన్ని త్యాగం చేస్తాను అన్న గోదాదేవితో ' ఆ యదుభూషణుడు ఎక్కడికి పోయాడని? శ్రీరంగము లోనే రంగనాథుడై నిలిచాడు. తొందరపాటు ఎందుకు? ఆ స్వామియే, ఆ రంగనాథుడే నీ భర్త కావడం కోసం అర్చనాదులతో ఈ పట్టణంలోని హరిని, విల్లిపుత్తూరులోని 'మన్నారు' స్వామిని సేవ చేయవమ్మా' అని సలహాను ఇచ్చారు, ఉపదేశమును చేశారు చెలికత్తెలు. ఆమెను ఆత్మత్యాగపు ఆలోచనల నుండి తప్పించారు. గోదాదేవికి విరహతాపము ఇంకా ఎక్కువైంది, తను ఎవరో తెలిసి, ఏం పోగొట్టుకున్నదో తెలిసి.
ఇక్కడ కొన్ని అద్భుతమైన వర్ణనలు చేశారు రాయలవారు. యివి విచిత్రములైన ప్రయోగాలు, వినూత్నములైన ప్రయోగాలు, కొద్దిగా క్లిష్టత ఉన్నప్పటికీ రసాశ్లిష్టములైన ప్రయోగాలు, మచ్చుకు ఒకటి రెండు చూద్దాం.

అలుకకు మన్నఁ దేరి మరి యంతటనుండియు వేళవేళ నె
చ్చెలు లిడు తెల్వులన్నగుడఁ జింతల సంతమసంబుల న్నమా
కలితత మించె సొమ్ములని కార్శ్యమునన్ హృదయంబున న్సదా
పలపలగాక నీలముల బన్నసరంబయి నిర్మలాంగికిన్

'అలుకకు' అంటే భయపడకు అని చెలికత్తెలు ఊరడించడం వలన కొద్దిగా తేరుకున్నది. అలా ప్రతిసారీ వారు ఊరడించినప్పుడు ఊరట పొంది, వారి జ్ఞాన బోధలు, సూచనలు అనే తెల్లని వెలుగులు కలుగుతాయి. మరలా అంతలోనే చింతలు అనే నల్లని కాంతులు అలుముకుంటాయి. యిలా మనోవేదనతో కృశించిపోయి, ఆభరణాల, అలంకరణాల కోరిక నశించిపోయిన గోదాదేవికి, ఏ ఆభరణాల లోటూ లేకుండా, ఆ ఆనందము అనే తెల్లనికాంతుల మంచి ముత్యాలు, నల్లనయ్యమీది దిగులు అనే నల్లని కాంతుల నీలమణులు ఆభరణాలుగా ఉన్నాయి. ఒకసారి ఆశల మెరుపులు, మరొకసారి నిరాశల నీలిమలు ఆమెను కమ్ముకుంటాయి. ఆ జాడలు పైకే తెలుస్తాయి, ఎందుకంటే ఆమె నిర్మలాంగి కనుక, అంటే స్వచ్ఛమైన దేహమును కలిగినది కనుక. స్వచ్ఛమైన దేహము కనుక పారదర్శకంగా లోపలి హృదయాన్ని, దాని ఆనందాన్ని, ఆవేదనను పైకే వ్యక్తం చేస్తుంది. స్వచ్ఛమైనది అంటే నిర్మలమైనది, అంటే కల్లా కపటము తెలియనిది కూడా, కనుక తన భావాలను దాచిపెట్టుకోవడం చేతగాక, పైకే వ్యక్తం చేయడం వలన, ఆ ఆనందము, ఆ ఆవేదన యివే ఆమెకు ఆభరణాలుగా కనిపిస్తాయి, వేరే ఆభరణాల అవసరము లేకుండా, యిదీ రాయల ప్రయోగ వైచిత్రి, వర్ణనా చమత్కృతి.

ఎలసి యేప్రొద్దుఁ గనువొందనీక మరుఁడు
కలహమున కంక కాఁడయి కాలు ద్రవ్వఁ
బొండుబహుళక్షపాపరంపరలు వెడల
కింటిలో నేదుముల్లయ్యె నిందుముఖికి

ఏ పొద్దూ వదలకుండా కాచుకుని మన్మథుడు కలహానికి పంతంపట్టి (అంకకాడు అయి) కాలుదువ్వుతున్నాడు ఆమె మీదికి. పాండుపక్షము అంటే పున్నమి రోజుల పదిహేను రోజులు. బహుళపక్షము అంటే అమావాశ్యరోజుల పదిహేను రోజులు. నిజానికి ఈ రెండిటికీ తేడా ఉండాలి. పున్నమి రోజులలో పోనుపోనూ కాంతి పెరుగుతుంది, అమావాశ్య రోజుల్లో పోనుపోనూ చీకటి పెరుగుతుంది. గోదాదేవికి మాత్రం అలా 'వెడలక' అలా జరుగక, అన్ని రోజులూ ఒక్కతీరుగానే జరుగుతున్నాయి, ఏ మార్పూ లేదు, అంటే ఆమెకు బాహ్యప్రపంచాపు ధ్యాసే లేదు. 'ఏదు' అంటే ముళ్ళపంది. ముళ్ళపంది ముల్లు యింట్లో వుంటే జగడాలు ఉంటాయి అని గ్రామీణుల విశ్వాసం. యింటిలో ముళ్ళపంది ముళ్ళు ఉన్నట్టుగా నిరంతరమూ కలహమే అయింది ఆమెకు, మన్మథునితో.

యింకా లోతుగా పరిశీలిస్తే ముండ్లపంది ముళ్ళు కొన్ని తెల్లతెల్లగా ఉంటాయి, పందు ముళ్ళు అన్నమాట, రాలిపోయేవి, కనుక తెల్లగా ఉంటాయి, కొన్ని నల్లగా ఉంటాయి, ముళ్ళు అని మనము అంటాము కానీ అవి దాని రోమాలే. రాలిన రోమాలు, కేశాలు జంతువులవైనా, మనుషులవైనా యింట్లో ఉండడం అశుభం అని పెద్దల విశ్వాసం, కనుకనే యింట్లో, గృహమధ్యంలో, గడ్డాలు గీసుకోవడం, మీసాలు కత్తిరించుకోవడం చేయవద్దు అని మన సంప్రదాయము. ముళ్ళపంది తెల్లని ముళ్ళలా, తెల్లని రోమాలలాగా తెల్లని వెన్నెలరోజుల కిరణాలు ఉన్నాయి. ముళ్ళపంది నల్లని ముళ్ళలాగా, నల్లని రోమాలలాగా నల్లని అమావాశ్యరోజులు ఉన్నాయి. నల్లనివైనా, తెల్లనివైనా ముళ్ళపంది ముళ్ళు కనుక, నిరంతరమూ మన్మథుడు ఆమెతో కయ్యానికి కాలుదువ్వుతూనే ఉన్నాడు, కనుక కూడా గోదాదేవికి పున్నమి రోజులకూ, అమావాశ్య రోజులకూ తేడా లేకుండా కాలం జరుగుతున్నది. అదీ రాయలవారి ఊహాశక్తి.

గోదాదేవి పడుతున్న అవస్థను వర్ణిస్తున్నాడు శ్రీకృష్ణదేవరాయలు.

*సురుచిరవితానదంభ కౌసుంభ ధారి*
*తుహినధారాగృహాంగి బిందువులు సెదర*
*పొంత ఘటయంత్రసరము ద్రిప్పుచు జపించు*
*మగువధృతి దూల మధ్యాహ్న మంత్రవాది*

మధ్యాహ్నము అనే మంత్రగాడుమెరిసిపోతున్న కాషాయవర్ణములో నున్న వస్త్రాన్ని ధరించి, ఘటయంత్రము అనే జపమాలికను త్రిపుతూ మంత్రజపము చేస్తున్నాడు, ఆమెను విహ్వలను చేయడానికి, వివశురాలిని చేయడానికి. మంచుతుంపరల వంటి జల్లులను వెలువరిస్తున్న నీరు తోడే యంత్రాలను త్రిప్పుతూ నీటి జల్లులు పడుతుండగా ఘటయంత్రము అనే జపమాలికను త్రిపుతూ మంత్రజపము చేస్తున్నాడు, ఆమెను విహ్వలను చేయడానికి,

వివశురాలిని చేయడానికి. చాలా విచిత్రమైన, క్లిష్టమైన పద్యం యిది. పగలూ రేయీ ఒక్కతీరుగా విరహ తాపం పొందుతున్నది గోదాదేవి. మధ్యాహ్న సమయాలలో లోని తాపము, బయటి తాపము రెండూ కలిసి మరింతగా తపింపజేస్తుంటే మోటబావి వద్ద ఉన్న కుటీరంలోకి చేరుకుంటుంది. అక్కడ ఘటయంత్రం ఉంటుంది. అంటే యంత్రం ద్వారా నడిచే, నీళ్ళు తోడిపోసే కుండలు బావిలోకి పైకీ క్రిందకూ తిరుగుతూ నీళ్ళు చేదిపోస్తుంటాయి. క్రిందికి వెళ్ళినపుడు కుండలు వంగి మునిగి నీళ్ళను నింపుకుంటాయి. పైకి వచ్చినప్పుడు వంగి నీళ్ళను గుమ్మరిస్తాయి. అలా గుమ్మరించినప్పుడు ఆ తాకిడికి నీటి తుంపరలు ఎగిసి పడుతుంటాయి. న్యాయానికి ఆ చల్లని జల్లులు హాయిని కలిగించాలి. కానీ శ్రీకృష్ణవిరహాకులచిత్త ఐన గోదాదేవికి ఆ నీటి తుంపరలు ఇంకా వేడిమిని కలుగజేస్తాయి. భూమి వేడెక్కి ఉన్నప్పుడు పడే చిరుజల్లులవలన లోని తాపం బయటకు వచ్చి ఇంకా ఉక్కగా వేడిగా వుంటుంది కదా, అలా అన్నమాట. యిలా యిబ్బంది పెడుతున్న ఆ ఎర్రని మధ్యాహ్నం కాషాయ వస్త్రాన్ని ధరించిన ఒక మంత్రగాడిలాగా ఉన్నది. నిరంతరమూ పైకీ క్రిందికీ తిరుగుతున్న ఆ నీటి కుండలు ఆ మంత్రగాడి చేతిలో తిరుగుతున్న మంత్రజపమాలలాగా ఉన్నాయి. ఆమె ధైర్యం సడలిపోవడం కోసం చేస్తున్న మంత్రకట్టులాగా ఉన్న మంత్ర ఉచ్చారణ వలన ఆ మంత్రగాడి నోటి తుంపరలు పడుతున్నట్లుగా కుండలు గుమ్మరిస్తున్న నీళ్ళ తుంపరలు ఉన్నాయి. యిక్కడ రాయలవారు మాత్రమే వ్రాయగలిగిన క్లిష్టమైన పద్యంలో కూడా ఒక చమత్కారాన్ని పొదిగాడు రాయలవారు.బిగ్గరగా ఉచ్చరిస్తూ చేసే ఆ మంత్రోచ్చారణ వలన చిందుతున్న నోటి తుంపరలు, ఆ ఎర్రని వస్త్రాలు 'మాయల పకీరు' లాంటి క్షుద్ర మంత్రోచ్చారణ చేస్తున్న ఒక క్షుద్ర మాంత్రికుడిని చూపిస్తున్నాయి, ఆ మంత్ర శబ్దాలను విని,ఇంకా ధైర్యము చెడి వివశురాలు అవుతున్నది కనుక మధ్యాహ్నము అనే 'మంత్రవాది' అన్నాడు. క్షుద్ర శక్తులు ఉన్నాయని నమ్మినవారు, అవి సోకినాయేమో అనుకునేవారు ఏం చేస్తారు? చేతబడి జరిగిందేమో అనుకునే వారు ఏం చేస్తారు? దైవ శక్తిని ఆశ్రయిస్తారు, విరుగుడుగా ప్రతిక్రియ చేసుకుంటారు, ముందు ముందు గోదాదేవి అదే చేయబోతున్నది, విష్ణుదాస్యం, అర్చనం, జపము చేయబోతున్నది.

యిలా సర్వకాల సర్వావస్థలలో ఊరట లేనిదై, యిక యిలా కాదు అనుకుని, ఆ విల్లిపుత్తూరు లోనున్న విష్ణుమూర్తిని ఆరాధించి, ఆయనను ప్రసన్నుడిని చేసుకుని శ్రీహరిని భర్తగా పొందడానికి నిశ్చయించుకున్నది. అంతకుముందు చెలికత్తెలు చెప్పినట్లుగా చేయడానికి నిర్ణయించుకున్నది.

*పద్మాస్య ప్రతిదిన ప్రత్యూషమును మౌన*
*నియతి మేల్కొని సఖీచయము ప్రోల*
*హేమపాత్రిక హరిద్రామలక్యాదిక*
*స్నానీయవస్తువ్రజంబు గొనుచు*
*ధౌతాంశుకంబులు తడి యొత్తులును దేర*
*నంతః పథంబున నరిగి నిజగృ*
*హారామ దీర్ఘిక ననుసంహిత ద్రావి*
*డామ్నాయయై స్నాన మాచరించి*

*పర్జనీ లేశ పూర్ణ సౌభాగ్యదాంగ*
*ధూతి చకచక లీ రెండ తోడ మారు*
*మలయ నిడువెంద్రుకలగుంపు మలచివైచి*
*వేగ వెడవెడ దడియొత్తి విధియుతముగ*

ఆ పద్మముఖి ప్రతిరోజూ మౌనవ్రతంతో లేచి, చెలికత్తెలు ముందు నడుస్తుండగా, పసుపు, ఉసిరికలు మొదలైన స్నానానికి తగిన వస్తువులను బంగారు పళ్ళెంలో ఉంచుకుని, ఉతికిన వస్త్రాలు, తడి ఒత్తుకోడానికి వస్త్రాలను చెలికత్తెలు తెస్తుండగా పెరటిత్రోవలో వెళ్ళి, యింటి వెనుకనున్న వనంలో ఉన్న దిగుడుబావికి వెళ్ళి, ద్రావిడవేదమును అనుసంధానము చేస్తూ స్నానంచేసి, పసుపు పొడికి కూడా అందాన్ని తెచ్చే పచ్చని, అందమైన శరీరము వణుకుతుండగా నీరెండకు కాచుకుంటూ, దీర్ఘ కేశములను మలచి వెనుకకు వేసుకుని త్వర త్వరగా పైపైన తడి తుడుచుకుని విధివిధానంగా ఊర్ధ్వపుండ్రాలను ధరిస్తుంది. అంటే ద్రావిడ వేదం చెప్పినట్లు కేశవాయనమః అనే మంత్రంతో మొదలుబెట్టి, ఓం దామోదరాయ నమః అనే మంత్రము వరకూ ఉన్న పన్నెండు నామములను స్మరిస్తూ 'పుండ్ర ధారణ' అంటే బొట్టు పెట్టుకొనడం చేయాలని వైష్ణవ సంప్రదాయం. అలా పన్నెండు నామ మంత్రములను మననం చేస్తూ పన్నెండు చోట్ల పుండ్రములను ధరించి, '.. .. నామ ద్వాదశ పంజరం ప్రవిష్టోహం న మే కించిత్ భయమస్తి కదాచన' అని పన్నెండు నామముల పంజరంలో భద్రంగా రక్షణ పొందుతాడు వైష్ణవమార్గానువర్తి. 'లలాటే కేశవం ధ్యాయేత్..' అని విధి, అంటే ' పురస్తాత్ కేశవః పాతు చక్రీ జాంబూనద ప్రభః' అని కేశవుడిని మననం చేస్తూ లలాటం మీద, నుదుటిమీద ఊర్ధ్వపుండ్రమును ధరించాలి కనుక, అలా స్మరిస్తూ, మననం చేస్తూ నుదుట తిరుమణి తీర్చి దిద్దుకుంటుంది గోదమ్మ అని తెలియజేస్తున్నాడు తర్వాతి పద్యానికి అనుసంధానంగా.

*కుందరదాగ్ర నెన్నొసల గుమ్మడిగింజ తెరంగు పొందు మృ*
*ద్బిందువుఁ దీర్చి చెందిరము పేచక శీర్షముపైఁ బలె న్గటిం*
*జందుర కావిజీ బమరఁ జల్లని రేయిటి తట్టుపున్గళు*
*ల్విందులఁ దేల నూనెముడి వెంద్రుకలం దడి తావు లీనగన్*

మొల్ల మొగ్గల్లాంటి దంతములున్న ఆ సుందరి నుదుటిమీద గుమ్మడిగినాజ ఆకారంలో తిరుమణి తిలకాన్ని పెట్టుకుంటుంది. ఎత్తైన విశాలమైన పిరుదులమీద సిందూరవర్ణ వల్కలాన్ని ధరిస్తుంది. అది చూడడానికి ఏనుగు కుంభస్థలం మీద సిందూరం పూత పూసినట్లు కనిపిస్తుంది. గతరాత్రి అలదుకున్న పరిమళ ద్రవ్యములసువాసనలకు తుమ్మెదలు శరీరానికి మూగుతుండగా, అంతకుముందు ఎప్పుడో రాసుకున్న నూనెవెంట్రుకలకు తడి అంటుకుని, అంటుకొనక వింత శోభలను చేకూరుస్తుంటాయి. అలా దురితలతా లవిత్రయై, విచిత్ర పవిత్ర పరిమళసముచ్చయంగా కోవెలకు బయలుదేరుతుంది. శ్రీహరిని భర్తగా పొందడంకోసం గోదాదేవి వ్రతంచేయడం ప్రారంభించింది.

*బోటి గట్టిన చెంగల్వ పూవుటెత్తుఁ*
*దరు పరిణ తోరుకదళిమంజరియుఁ గొనుచుఁ*
*బోయి గుడి నంబి విజనంబుఁ జేయఁ జొచ్చి*
*మ్రొక్కి వేదికఁ బలువన్నె మ్రుగ్గు వెట్టి*

చెలికత్తె కట్టి ఇచ్చిన పెద్ద ఎర్రకలువల పూదండను, చెట్టుమీదే పండిన అరటిగెలను (తరు పరిణత ఊరు కదళి మంజరి) పట్టించుకుని పోయి, గుడిలో అర్చకుడు(నంబి) జనులనందరినీ పంపివేసిన తర్వాత ఏకాంతంగా, ప్రశాంతంగా కోవెలలోకి ప్రవేశించి, స్వామికి నమస్కరించి, వేదిక మీద రంగు రంగుల ముగ్గులు పెడుతుంది. జనులనందరినీ పంపించి వేయడం అంటే వెళ్ళగొట్టడం కాదు, చిరు పూజలున్నవారిని వారి వారి పూజలు చేయించి పంపించి, విశేష పూజలు అర్చనలు చేసేవారిని తర్వాత లోపలి రప్పించి వారి పూజలు నిర్వహించడం సహజమే కదా, అదీ విశేషం.

*కపిలగవిసర్పిఁ బృథు దీపకళికఁ దీర్చి*

*ద్వయముతో వక్షమునఁ గల్వదండసేర్చి*
*యగరు ధూపంబు లిడి శర్కరాజ్య యుక్త*
*హృదయ కదలీఫలాళి నైవేద్యమిచ్చి*

కపిలధేనువు పాలను కాచి, వెన్నను తీసి కరిగించి చేసిన నేయితో పెద్ద దీపమును వెలిగించి, ద్వయమంత్రమును పఠిస్తూ స్వామి వక్షస్థలము మీద ఎఱ్రకలువల దండను అలంకరించి, అగరు పొడితో ధూపం ఇచ్చి, చక్కర, నేయి, అరటిపండ్లను నైవేద్యం పెడుతుంది.

*ఖండిత పూగీ నాగర*
*ఖండంబులు ఘన శశాంక ఖండంబులచే*
*హిండితములు గావించి య*
*ఖండస్థిరభక్తి నొసఁగి కదలి చెలులతోన్*

కత్తిరించిన పోకచెక్కలు, సొంటిముక్కలు(నాగర) శ్రేష్ఠమైన కర్పూరపు తునుకలతో (ఘన శశాంక ఖండంబులు) కలిపి అఖండమైన భక్తితో తాంబూలాన్ని స్వామికి సమర్పించి చెలికత్తెలతో కదలిపోతుంది.

*చెలువ గర్భగృహ ప్రదక్షిణముఁ జేసి*
*వినతయై మౌళి శఠకోపమును ధరించి*
*చరణతీర్థముఁ గొని తత్ప్రసాద లబ్ధ*
*మయినమాల్యముఁ దాల్చి గేహమునకరుగు*

ఆ సుందరి గర్భగృహానికి ప్రదక్షిణ జేసి, వినమ్రంగా శఠకోపమును తీసుకుని స్వామి చరణతీర్థమును తీసుకుని ఆ స్వామి ప్రసాదముగా అర్చకస్వామి ఇచ్చిన మాలను తీసుకుని ధరించి, యింటికి వెడుతుంది.

*ప్రతిదినము నిట్లు చని య*
*చ్యుత పూజ యొనర్చి వచ్చి సుదతి వియోగ*
*చ్యుతధైర్య యగుచు నయ్యదు*
*పతిగుణములు ద్రవిడభాషఁ బాడుచునుండున్*

ప్రతిదినమూ యిలాగే కోవెలకు వెళ్ళి అచ్యుతుని పూజ చేసి వచ్చి ఆమె వియోగ బాధచే సడలిన ధైర్యముతో ఆ యాదవప్రభువు గుణములను, శ్రీకృష్ణుని గుణములను ద్రావిడ భాషలో పాడుతూ ఉంటుంది. యిలా ఆమె ఆ ద్రావిడ భాషలో పాడిన పాటలే(పాశురములే) తిరుప్పావై. యిలా కేవలం రెండు ముక్కల్లో అమ్మవారి దివ్యసారస్వతమైన తిరుప్పావైని లీలామాత్రంగా సూచించాడు శ్రీకృష్ణ దేవరాయలు. రాయలవారి సర్వతంత్రస్వతంత్రసార్వభౌమ లక్షణానికి యిది ఒక ఉదాహరణ. ఎందుకంటే వేరే ఎవరైనా గోదాదేవి నాయికగా ఉన్న కావ్యములో తిరుప్పావైని విస్తృతంగా ఉదాహరించకుండా

ఉండడం అంటే భయపడేవారు, విమర్శలకు, భక్తితో కూడా. కానీ యిది ఆధ్యాత్మిక గ్రంథం కాదు, ప్రబంధం. కనుక ప్రబంధ లక్షణాలకే ప్రాధాన్యతను ఇచ్చారు రాయలవారు. యింతలో వసంత ఋతువు ప్రవేశించింది.

గోదాదేవి శ్రీహరిని తన నాథునిగా పొందదలచి ఆయనను విశేష మార్గంలో అర్చించడం మొదలెట్టింది. ఇంతలో వసంతఋతువు ప్రవేశించింది. ఋతువర్ణన ప్రబంధ లక్షణాలలో ఒకటి. ఇంతకుముందు గ్రీష్మ ఋతువును, వర్ష ఋతువును, శరదృతువును వర్ణించిన రాయలవారు ఇప్పుడు వసంతవర్ణనాసుమ లతాంతాల వర్షం కురిపిస్తున్నాడు. అరవై ఆరు పద్య గద్య ఆశ్వాసాంత పద్యాలతో కూడిన ఈ భాగం మాటలకందని చమత్కృతికి, కల్పనలకు నిలయం. మచ్చుకు కొన్ని ముఖ్యమైన ఘట్టాలను రుచి చూసి ఆ తర్వాత ఈ ప్రబంధంలోని చివరిదైన ఆరవ ఆశ్వాసానికి వెళ్దాము.

**మొదల నాముక్తమాల్యద మదనతాప**

**తరణి పెనువెట్ట వేఁగిన దక్షిణాశ**

**మత్కృతోష్మకుఁ దుదముట్ట మాఁడు ననుచుఁ**

**దొలఁగె నన నుత్తరాశకు దొలఁగెఁ ధరణి**

మొదలే 'ఆముక్తమాల్యద' కు కలిగిన మదనతాపమనే సూర్యుడు 'రెచ్చిపోవడం'తో వేగిపోయిన దక్షిణాకాశం నా వేడిమికి పూర్తిగా మాడిపోతుంది, ఎందుకులే పాపం అన్నట్లుగా ఉత్తరాకాశానికి తొలిగిపోయాడు ఆకాశంలో సూర్యుడు. అంటే ఉత్తరాయణం ప్రవేశించింది. చాలా చిన్ని పద్యం, కానీ పెనుచమత్కారాల రసరమ్యం. చాలా సరసమయమైన రహస్యాలను కష్టపడకుండా తెలుసుకునే విధంగా సున్నితంగా, సరళంగా, క్లుప్తంగా చెప్పిన అరుదైన రాయలవారి పద్యాలలో యిదొకటి.

'ఆముక్తమాల్యద' అనే గ్రంథ నామధేయంతో వసంతఋతువు మొదలైంది. ఆముక్తము అంటే వదిలిపెట్టినది, అంటే ధరించి విడిచిపెట్టినది. మాల్యము అంటే మాలిక, తెలిసినదే, 'ద' అంటే యిచ్చినది. అంటే తను ధరించి విడిచిపెట్టిన, ఎంగిలిచేసిన, అనుభవించి యిచ్చిన మాలను పరమాత్మునికి యిచ్చింది కనుక 'ఆముక్తమాల్యద' ఐంది ఆవిడ. నిజానికి ఈ గ్రంథానికి 'విష్ణుచిత్తీయము' అనే మరొక పేరు కూడా ఉన్నది. విష్ణుచిత్తుని కథ కనుక. మొదటినుండీ చివరివరకూ ప్రతి ఆశ్వాసములోనూ ఆయన ఉన్నాడు కనుక. కానీ ఆయన తన పరమాత్మునిలానే కనిపించీ, కనిపించక ఉన్నట్టే అనిపిస్తుంది. గోదమ్మ విశ్వరూపంతో నిండిపోతుంది, ఈ కథ తెలిసిన వారే, కథను ప్రేమించేవారే దీన్ని చదువుతారు గనుక. ఖచ్చితంగా ఉన్నదున్నట్టుగా గ్రంథ నామధేయాన్ని యిలా పద్యరూపములో ఇచ్చిన ప్రబంధం వేరే ఏదీ సామాన్య పాఠకుడైన ఈ వ్యాసకర్తకు కనబడలేదు. మనం ఈ రోజుల్లో 'టైటిల్ సాంగ్' అని అనుకుంటున్నట్లు యిది 'టైటిల్ పద్యం'. యిది ఒక చమత్కారం.

వసంతంలో కొత్త ఆశలు మోసులెత్తుతాయి. కొత్త చివుళ్ళు తలలెత్తుతాయి. వసంతంలో తొడిగిన ప్రతి చివురు, ప్రతి సుమము శోభిస్తుంది. మిగిలిన ఋతువుల్లో ఎంత ప్రయత్నించి, ప్రేమించి సాకినా కళ, ఈ జీవము ఉండదు లతలలో, వృక్షాలలో, పూలలో, గాలిలో ప్రకృతిలో కూడా. వేడి ఎక్కువై ఎండాకాలంలో, తడి ఎక్కువై వర్షాకాలంలో, సూర్యకాంతి తగ్గి శరదృతువులో, మరీ క్షీణించి హేమంత ఋతువులో, శిథిలమై శిశిర ఋతువులో ఆకులు, పూలరేకులు, చివుళ్ళు మాడిపోతాయి, నానిపోతాయి, నలిగిపోతాయి, రాలిపోతాయి. యిది ఋతుపరమైన రహస్యం, ఈ రహస్యాన్ని అమ్మ కోర్కెపరంగావాడుకున్నారు కవనసార్వభౌమ రసికరాయలు, కనుకనే ఆమె కామనల వసంతమిది, ఫలిస్తుంది.

ఆమె కామనల వసంతఋతువును సూచించడానికే ఆమె పేరుతో మొదలెట్టాడు. ఆపేరు కూడా ఆమె ఏ రకంగా పరమాత్ముడిని లొంగదీసుకుందో తెలియజేసే పేరే పెట్టాడు. ఒక చమత్కారం ఏమిటంటే ' ఈ పాటికే వధూవరులు దండలు మార్చుకోవడం' పూర్తి ఐంది. ముందు ఆమె చాటుగా ధరించి వదిలివేసిన మాలను పరమాత్మునికి యివ్వడాన్ని గురించి చెప్పాడు. ఈ ఆశ్వాసంలో పరమాత్ముడు ధరించిన మాలను నిర్మాల్యంగా, ప్రసాదంగా అర్చకస్వామి యిస్తే ధరించింది అని చెప్పాడు. అమ్మ ఇంకా నేరుగా అయ్యను చేరుకోలేదు, భక్తురాలి స్థాయిలో ఉన్నది, కనుక మధ్యన అర్చకస్వామి కరుణ అవసరము ఐంది. భగవంతునికి, భక్తునికి మధ్యన గురువుగా, అనుసంధానకర్తగా ఒకరు అవసరం, కనుక అర్చకస్వామి(నంబి) యిచ్చిన మాలను ధరించింది అని స్పష్టంగా చెప్పాడు. యికపై విశ్వంలో అదృష్టవంతులు కావాలనుకునే భక్తులెవరికీ వేరేవారి అవసరము లేదు, ఉండదు. గురువుగా, సంధానకర్తగా, అమ్మగా, పురుషకారిణిగా గోదమ్మ జీవులను, జీవికలను తరింపజేస్తుంది యిక, కనుక ఆమె ఆశల వసంతము, విష్ణుమోహితుల ఆశలకు కూడా యిది వసంతము.

స్వామివారి విరహతాపం అనే సూర్యుని వేడికి ఆముక్తమాల్యద ఈసరికే మాడిపోయింది, ఎండాకాలంలో లాగా. ఆమె కన్నీరు మున్నీరైంది వర్షాకాలంలాగా. నిర్మలమైన ప్రేమ చిగిర్చింది శరత్కాల నదీ నదాల, సరసుల జలములలాగా. స్వామి మీది కోపం, అనుమానము, ఉక్రోషము, ఈర్ష్య, మత్సరము, సాధింపులు  అనే మంచుతెరలు కప్పుకున్నాయి, హేమంత ఋతువులోలాగా. యిక ఏ ఆశా లేదు, ఇక ఈ జీవితం వ్యర్థం అనుకుని శిథిల శిశిర పర్ణమై, వివర్ణమై, వ్యథావిశీర్ణమైపోయింది శిశిరఋతువులోలాగా. అప్పుడు కారణజన్ములు ఐన (నాగకన్యలు) చెలికత్తెలు గురువులైనారు, మార్గదర్శకులైనారు, ఆశాజ్యోతులైనారు, పరమాత్ముని చేరుకునే మార్గం చూపించారు, ఆమెలో ఆశ కలిగింది, ప్రకృతికి వసంతంలో కలిగినట్లుగా. ఆ మూల ప్రకృతికి తానేంటో తెలిసింది, తనకు ఏం కావాలో తెలుసుకుంది, దాన్ని పొందడం ఎలా సాధ్యమౌతుందో తెలిసింది, యిక ఎప్పుడు అన్నదే మిగిలింది. త్వరలోనే అన్న ఆశల వసంతం ఏతెంచింది. ఔను, యిక ఈ ప్రకృతి తన పురుషుడిని, ప్రథమపురుషుడిని, ఏకైక పురుషుడిని చేరుకునే ఆశలు ఫలించే వసంత తరుణం వచ్చింది. యివన్నీ లలిత లలితంగా వసంత మలయమారుతంలాగా గుసగుసగా రహస్యంగా చెప్తున్నారు రాయలవారు ఈ చిన్ని పద్యంలో.

గోదాదేవి విరహతాపమువలన దక్షిణ దిక్కు వేడెక్కి మాడిపోయింది అనడం ఆమె ప్రకృతి అనడం, తన పురుషుడిని చేరుకునే ఆశ చిగిర్చడం వసంతం అరుదెంచడం. అసలే ఈమె విరహతాపానికి వేడెక్కి ఉన్న దక్షిణ ఆకాశాన్ని ఇంకా వేడెక్కించడం ఎందుకు అని ఉత్తర ఆకాశానికి చేరుకున్నాడు సూర్యుడు. దక్షిణాయనం ముగిసి ఉత్తరాయణం ప్రవేశించింది అని సూచన. దక్షిణ నాయకుడు, అమ్మకు దక్షిణ నాయకుడైన ఆకాశనీలిమ ఐన పరమాత్ముడు కూడా ఈమె విరహంతో వేగిపోతూనే ఉన్నాడు, యిక చాల్లే, నేను కూడా వేగించడం ఎందుకు అన్నట్లు ఉత్తరాకాశానికి చేరుకున్నాడు సూర్యుడు. క్రమక్రమంగా ఉత్తరాయణం ప్రవేశించింది, మార్గశిరం ప్రవేశించింది, ధనుస్సంక్రమణం జరిగింది, మకరసంక్రమణం జరిగింది, వసంతం ప్రవేశించింది. ప్రకృతిలోని ఋతువుల పరంగా క్రమ పరిణామ దశ యిది. మార్గ శీర్షంలోనే విష్ణువును చేరుకునే మార్గశీర్షమైన, మార్గములన్నింటిలోనూ అత్యంత తేలికైన, సుఖమైన, సురక్షితమైన మార్గమైన ప్రపత్తి మార్గాన్ని, సంకీర్తనా మార్గాన్ని అమ్మ అనుసరించింది, అనుసరింపజేసింది. తిరుప్పావై వ్రతాన్ని చేసి, దివ్య పాశురములను రచించి పాడి, తన ఆశలు అందంగా కుసుమించి, ఫలించే వసంతం వచ్చింది గోదమ్మకు అని సూచన జేస్తున్నాడు రాయలవారు. గోదాదేవి విరహతాపంతో వేడెక్కిపోయింది. ఆమె ప్రకృతి, పురుషోత్తముడు పురుషుడు. కనుక ఆమె బాధ ప్రకృతికంతకూ బాధ. ఆమె దైన్యము ప్రకృతికి అంటుకుంది. కనుక చమత్కారంగా యిలా అంటున్నాడు.

**తెలియఁగ వచ్చె నట్టితఱిఁ దిగ్మకరుండు ధనాధిపాశకై**

**తొలఁగినకారణం బతివ దుర్వహ దీర్ఘవియోగవహ్ని పె**

**ల్లలమిన తద్దిశం దగిలినట్టి తనూష్మ ఘనీభవన్మహో**

**జలమయశంకరశ్వశురశైలముకోనల చల్వఁ దీర్చకోన్**

తిగ్మకరుడు అంటే సూర్యుడు. ధనాధిపుడు అంటే కుబేరుడు. ఆశ అంటే ఆకాశము. ధనాధిప-ఆశ అంటే కుబేరుని దిశ ఐన ఉత్తర దిశ. ఉత్తరాయణం ఎందుకు ప్రవేశింది, సూర్యుడు ఉత్తర దిశకు ఎందుకు తొలిగిపోయాడు అనేది తెలిసిపోయింది తనకు అంటున్నాడు 'కవి'రాయలు. దక్షిణ దిశలో ఉన్నప్పుడు దక్షిణాయనంలో, వసంతఋతువు ప్రవేశించకముందు, గోదాదేవియొక్క విరహతాపముతో సోకిన కాకను చల్లబరుచుకోడానికి ఘనీభవించిన అపార జలమయమైన శివునిమామను, అంటే హిమవత్పర్వతాన్ని ఆశ్రయించాడు, ఉత్తర దిశకు వెళ్లి. ఆ హిమాలయ చరులను ఆశ్రయించాడు చల్లబడడానికి.

అమ్మ దక్షిణ దిశకు దృక్కులు సారిస్తూ ఉన్నది, దక్షిణ నాయకుని కోసం, నాథుని కోసం, హరికోసం, కనుక ఆవిడ చూపుల, తలపుల, శరీర వేడిమి, విరహ తాపము దక్షిణానికి సోకింది. అంతవరకూ అక్కడున్న సూర్యనారాయణమూర్తి ఉత్తరానికి వెళ్లి హిమవంతుడిని ఆశ్రయించాడు. సూర్యుడూ నారాయణుడే, సుర్యమండలాంతర్వర్తి ఐన నారాయణమూర్తి సాక్షాత్తూ శ్రీహరియే. చల్లదనం కోసం మాత్రమే అనుకోవడం సామాన్య విషయము.

హిమవంతుని కుమార్తె ఐన కాత్యాయనిని ఆశ్రయించి కాత్యాయనీ వ్రతము చేసి అలనాడు గోపికలు బృందావనంలో శ్రీకృష్ణుని పతిగా పొందారు. అలాగే నీవూ చేసి హరిని పతిగా పొందవమ్మా అని చెలికత్తెలు సలహా ఇవ్వడంతో 'కాత్యాయనీ వ్రతం' చేస్తున్నది గోదాదేవి. కనుక అమ్మ తరపున రాయబారిగా సూర్యుడు, తన స్వార్థంతో సూర్యనారాయణుడు అటునుంచి నరుక్కొస్తున్నారు, కార్యం సానుకూలం గావడానికి, ఎందుకంటే గోపికల విషయములో మనకు తెలియదు గానీ, గోదాదేవి విషయములో శ్రీ హరి కూడా వేగిపోయాడు, గోదమ్మను 'సతి'గా పొందడానికి. యిది రాయల పలుకుల అంతరార్థం.

'లౌకికానాం హి సాధూనాం అర్థం వాగనువర్తతి, ఋషీనాం పునరాద్యానాం వాచమర్థోనుధావతి' అన్నాడు మహానుభావుడు భవభూతి 'ఉత్తర రామచరితము' అనే గొప్ప నాటకంలో, అంటే , లౌకికులైన సాధువులవాక్కులకు అర్థం అనుసరించి వస్తుంది, అంటే వారి వాక్కులు అర్థవంతములుగా ప్రయోజన పూర్వకములుగావుంటాయి, కానీ, ఋషులకు అర్థములను బట్టి వాక్కు తనంత తానుగా అనుసరించి వస్తుంది, అంటే వారిమనసులోని అర్థాన్ని అనుసరించి పలుకులు తమంత తాముగా మేమంటే మేము అని వస్తాయి. సామాన్య కవిపండితులలాగా వాక్కులకోసం వెదుక్కునే, పలుకులకోసం పలవరించే పరిస్థితి వారికి ఉండదు. వాక్కులే వారిబంట్లవలె ఎదురుచూస్తూంటాయి వారిమనసులోని అర్థానికి అక్షరరూపాన్ని ఇవ్వడంకోసం. మంచి ఉపన్యాసకుల పలుకులకు మంచి అర్థాలు వస్తాయి, మహావక్తలకు మంచి అర్థాలనిచ్చే పలుకులు పరుగెత్తివస్తాయి. శ్రీకృష్ణదేవరాయలు ఋషితుల్యుడే, కనుక ఆయన పలుకులకు అమేయ ప్రభావ సంపన్నములైన అంతరార్థములు. వాటిని పట్టుకొనగలిగితే అనిర్వచనీయమైన అలౌకికానందం! సాహిత్య పఠనము యొక్క అత్యున్నత ప్రయోజనం అలౌకికానందమే కదా, మిగిలినవాటితో పాటు.

**కినిసి వలఱేఁడు దండెత్తఁ గేతు వగుట**

**మీన మిల దోఁచు టుచితంబ మేష మేమి**

**పని యనఁగ నేల? విరహోష్మఁ బాంథయువతి**

**దాహమున కగ్గి రాఁగఁ దత్తడియు రాదె?**

'వలతేఁడు' అంటే మన్మథుడు. వచ్చింది వసంతఋతువు గనుక మన్మథుడు దాడికి రావడం సహజమే. ఆయనకు శరీరం లేదు గానీ శరీరాలను, మనసులను మంటబెడతాడు. ఆయన జెండాగుర్తు మీనము, చాప. ఆయన వచ్చాడు గనుక రథం మీదే వస్తాడు గనుక రథ ధ్వజం కూడా వచ్చింది, దానిమీద ఉండే చాప కూడా వచ్చింది. అది సమంజసమే! మరి మేక(మేషం) ఎందుకొచ్చింది? దానికేంపని?

అంటే మకర సంక్రమణం తర్వాత మీన సంక్రమణం వచ్చింది, మకర సంక్రాతి తర్వాత మీన సంక్రాంతి. యింతలోనే మేషం కూడా, మేక కూడా వచ్చింది, దానికేంపని రావడానికి? అంటే.. మకర సంక్రమణం తర్వాత కుంభ సంక్రమణం, తర్వాత మీన సంక్రమణం, కనుక మీనం వచ్చింది.ఆ తర్వాత మేష సంక్రమణం, కనుక మేషం వచ్చింది. అంతే గాక అగ్నిదేవుడు మేషవాహనుడు, మేకను ఎక్కి తిరుగుతుంటాడు. ఆ అగ్ని యిప్పుడు విరహాగ్ని రూపంలో గోదమ్మను దహించడానికి వచ్చాడు కనుక ఆతనికి వాహనమైన మేషం కూడా వచ్చింది. రాదా మరి? మకర సంక్రమణం, మకర సంక్రాంతితో ధనుర్మాసం పూర్తి అవుతుంది, మార్గళి నెల, మార్గశీర్ష మాసం పూర్తి అవుతుంది. ఆ తర్వాత కుంభ సంక్రమణం, కుంభమాసం, అంటే మాఘమాసం. దాని తర్వాత మీన సంక్రమణం, అంటే మీన మాసం, అంటే అంటే ఫాల్గుణమాసము. ఆ తర్వాత మేష సంక్రమణం, అంటే మేష మాసం, అంటే చైత్రమాసం, చైత్రం, వైశాఖం రెండూ వసంత ఋతువు, కనుక వసంత ఋతువు ప్రవేశించింది. క్రమ క్రమంగా ధనుర్మాస వ్రతం పూర్తి చేసిన తర్వాత, హేమంత ఋతువు ముగిసిన తర్వాత, శిశిరఋతువు గడిచి, ఆమె ఆశల వసంతఋతువు ప్రవేశించింది అని చెబ్తూ, ఋతుపరంగా, జ్యోతిష శాస్త్ర పరంగా చమత్కరిస్తున్నాడు రాయలవారు. ఆయన సమస్తశాస్త్ర పారంగతుడు అనడానికి, ఆయన రాసిక్యానికి, పాండిత్యానికి, వ్యుత్పత్తికి, ప్రతిభకు యివి మచ్చుతునకలు.

వసంతఋతువు వర్ణన చేస్తున్నాడు శ్రీకృష్ణదేవరాయలవారు.

*మలయకటకోటజస్థిత*
*కలశిసుత సేవ నిట్లు గనెనొ తదాశా*
*నిలు డనగ నలసవృత్తిన*
*మెలగుచు నాపోశనించె మిహికాజలధిన్*

మలయపర్వత సానువులయందు పర్ణశాలలో ఉన్న అగస్త్యుడు( మలయ కటక ఉటజ స్థిత) సముద్రాన్ని ఒక్క గుక్కలో త్రాగేశాడు. ఆ పర్వతం దక్షిణ దిశలో ఉంటుంది. ఆ అగస్త్యుని సేవ జేశాడేమో బహుశా, అదే దక్షిణ దిక్కునున్న అనిలుడు (పవనుడు) తన గురువుగారిలా సముద్రాన్ని గాకున్నా, మంచు అనే సముద్రాన్ని ఆనవాల్లేకుండా త్రాగేశాడు. వసంతఋతువులో మంచు తెరలు మాయమవుతాయి, ఆ తర్వాత రానున్న గ్రీష్మ ఋతువు లక్షణాలు కొద్దిగా ఉంటాయి, వసంతఋతువులో. చలి నశించిపోతుంది. మంద మలయపవనాలు వీస్తాయి. ఈ ప్రకృతిరహస్యాన్ని పౌరాణిక రహస్యంతో ముడిపెట్టాడు.

అగస్త్యుడు భారతీయ పురాణ ప్రసిద్ధ మహర్షి. వాతాపి ఇల్వలులను అంతంచేయడం, వింధ్యపర్వతాన్ని అణిచివేయడం మొదలైన అద్భుతాలు చేసినవాడు. మరొక సందర్భములో సముద్రంలో దాక్కుని ఆగడాలు చేస్తున్న కాలకేయులు అనే రాక్షసులను నాశనం చేయడంకోసం సముద్రాన్ని మొత్తంగా ఒక్క గుక్కలో త్రాగేశాడు, అక్కడ దాక్కున్న రాక్షసులు బయటపడ్డారు, దేవతల చేతుల్లో నాశనం అయ్యారు. కొసరూ పిసరూ మిగిలినవాళ్ళను ఆతర్వాత అర్జునుడు ఏరి పారేశాడు. కశ్యప ప్రజాపతికి కాల అనే భార్యతో కలిగినవారు కాలకేయులు. ఈ పౌరాణిక గాథను పరామర్శచేశాడు సమస్త్ర శాస్త్రవేది ఐన రాయలవారు.

*అరుణాంశుండు హిమర్తువన్ రజని డీలై క్రుంకి పుష్పర్తు వా*

*సర కల్యోదితు డౌచు మున్న యిదుటన్యామాకుచాలేపసం*
*కరసాంద్రాగ్నిశిఖారుణప్రభ గొనెన్ గాకున్న గాలజ్ఞప*
*త్రి రుతం బెట్లు చెలంగు మానకుపిత స్త్రీ కర్ణ దంభోళి యై*

సూర్యుడు(అరుణాంశుడు) సహజంగానే రాత్రుళ్ళలో బలహీనుడు అవుతాడు, హేమంతఋతువు అనే రాత్రివేళ బలహీనుడై అస్తమించిన సూర్యుడు వసంతఋతువు అనే రోజున ఉదయాన్నే బలవంతుడు అయినాడు, ఉదయించాడు. హేమంతఋతువులో ఆయన వేడి స్త్రీల కుచములయందు దాక్కుంది. వారు వక్షోజాలకు అలదుకునే కుంకుమపూల యందున్న ఎర్రదనంలో సూర్యుడి 'అరుణ'దనం దాక్కుంది. ఆ తర్వాత వచ్చిన వసంతఋతువులో కాశ్మీర కుంకుమ పూలను, పూల పొడిని అద్దుకోవడం మానేశారు. కనుక మరలా తన ఎర్రదనాన్ని, వేడిమిని తాను పొందాడు సూర్యుడు.

ఎండాకాలంలో చల్లగా, శీతాకాలంలో వెచ్చగా ఉంటాయి స్త్రీల వక్షోజాలు, యిది శరీరసంబంధమైన సరసపు విసురు, కుంకుమపూలు, కస్తూరి మొదలైన వాటిని అలదుకోవడం ఉష్ణాన్ని యిస్తుంది శీతాకాలంలో, అనే ఆరోగ్యరహస్యం, రాయలకు నమస్సులు!(చందనం, మంచిగంధము అలదుకోవడం చల్లదనాన్ని యిస్తుంది) అస్తమించే సూర్యుడు తన వేడిమిని, ప్రకాశాన్ని అగ్నిలో నిక్షేపం చేసి శెలవు తీసుకుంటాడు అని సూక్తి. కుంకుమపూవుకు 'అగ్నిశిఖ' అని కూడా పేరు. కనుక అరుణమును, ఉష్ణమును తరుణుల వక్షోజాల్లో నిక్షిప్తంచేసి, ఆ స్తనగిరులచాటున హేమంతఋతువు అనే రాత్రిపూట సూర్యుడు అస్తమిస్తాడు. మరలా వసంతఋతువు అనే ఉదయాన్నే తన వేడిమిని తాను వెనక్కు తీసేసుకుని ఉదయిస్తాడు. యిది పాండితీ ప్రతిభ.

స్త్రీ ప్రకృతి. పురుషుడు తన ప్రకృతి గుండెపై తన వేడిని ఉద్విగ్నతను సందేహాలను బాధలను నిక్షిప్తం చేసి హాయిగా నిదురిస్తాడు. 'తన కాంతకు' తన బరువులు, బాధ్యతలు అప్పజెప్పి రాత్రుళ్ళు ఆమె గుండెలో నిదురిస్తాడు, సేద దీరుతాడు. ఆ వేడిమిని అంతా ఆమె గ్రహిస్తుంది, అతడిని గుండెల్లో దాచుకుంటుంది, సేద దీరుస్తుంది. మరలా మరొక ఉదయం తొంగిచూస్తుంది, నిత్యజీవన సమరానికి, ఉద్విగ్నతకు, వేడిమికి ఎదురు సవాలు జేస్తూ పురుషుడు పైకి లేస్తాడు. యిది స్త్రీ, పురుష సంబంధమైన, ప్రేయసీప్రియుల సంబంధమైన, దాంపత్య సంబంధమైన రహస్యం. రాయలతో సరితూగగలిగినవారు కొందరున్నారేమో, వుంటే గింటే, రాయలను మించిన కవి అయితే లేదు, రాదు! సరే, చివరన మరొక మెరుపు ఉన్నది పద్యంలో.

రాయలు అంటున్నాడు..' అలా హేమంతం అనే రాత్రి గతించి వసంతం అనే ఉదయము వచ్చి ఉండాలి, లేదంటే కాలజ్ఞులైన కోళ్ళ కూతలు (కాలగ్నపత్త్రి రుతంబు) ఎలా వినబడతాయి? మాన కుపితలు ఐన స్త్రీలు ఎందుకు భయముతో ఉలికిపడుతారు? యిది ఎంత అద్భుతమైన పద్యపాదం!

కాలజ్ఞ పత్త్రి అంటే కాలజ్ఞానము కలిగిన పక్షి అంటే కోడి, కాలమును తెలుసుకుని భంగం లేకుండా కూసి ప్రపంచాన్ని మేలుకొలుపుతుంది కనుక. కానీ 'కాలము అంటే వసంతకాలము', అది తెలుసుకోవడమే కాలజ్ఞత అని వ్యుత్పత్తి. ఈ పద్యంలో మొత్తం హేమంతఋతువును రాత్రిగా, వసంతఋతువును ఉదయంగా పోల్చడం ప్రధానంగా ఉన్నది. మామూలు ఉదయాల్లో మామూలు కోళ్ళు కూస్తాయి, ఉలిక్కిపడిన తరుణి లేస్తుంది, భార్య అయితే దైనందిన కార్యక్రమాలకు పొద్దు పోయిందే, అయ్యో మొద్దునిద్ర అనుకుంటూ. ప్రేయసి అయితే 'అయ్యో తెల్లవారింది, అందరి కళ్ళల్లో పడకుండా వెళ్లిపోవాలి' అని త్వరపడుతుంది. ఆమె అయినా ఈమె అయినా మాన కుపిత అవడం సహజమే, అనివార్యమే! పై పై రోషం, కసరులు, రుసలు,

బుసలు సద్దుమణిగి, తనవాడిని దరిదీసి,సేద దీర్చి సంతోషపెట్టి ఆనందపడుతుంది. మరొక రకంగా, రోషంతో, బెట్టుతో బిగదీసుకున్న స్త్రీ 'అమ్మో! వసంతం వచ్చేసింది, ఎలా తట్టుకుంటానో ఏమిటో?' అని ఉలికిపడుతుంది, విరహబాధ కలుగుతుంది.

వసంతఋతువు అనే ఉదయం కనుక, వసంతమును తెలుసుకోవడమే కాలజ్ఞత గనుక, వసంతఋతువులో ఆ ఋతుకాల జ్ఞానము కలిగిన 'కోకిలలు'కూస్తాయి, వసంతము అనే ఉదయం అవుతుంది! 'కాలజ్ఞాపిత కుక్కుటౌ' అని కోకిలకు బిరుదు. ' కాకః కృష్ణః పికః కృష్ణః కా భేదః పిక కాకయోః వసంత కాలే సంప్రాప్తే కాకః కాకః పికః పికః' అని సూక్తి. కాకీ నల్లగానే ఉంటుంది, కోకిలా నల్లగానే ఉంటుంది, రెండిటికీ ఏమిటీ భేదం అంటే, వసంతం వస్తే తెలుస్తుంది, కూతను బట్టి, ఏది కాకి, ఏది కోకిల అనేది! యిక్కడ ఉదయాన కోడీ కూస్తుంది, కోకిలా కూస్తుంది, అది ఏ ఉదయము అనేది కోకిల కూస్తే తెలుస్తుంది, అది 'వసంతోదయం' అని అంటున్నాడు కారణజన్ముడు ఐన కవిరాయలు!

మృగమదాలేపమును మాని రగరుకలనఁ
జన్నుఁగవ మీఁది కొప్పిరి బన్నసరము
లొంటి కురువేరు పోఁచకుఁ గంటగింప
రైరి తురిమెడు సరపువ్వులం దతివలు

ఆ వసంతఋతువులో వనితలు మృగమదా లేపమును మానేశారు. కస్తూరి లేపనము మానేశారు. అగరు పొగలకు మరిగారు. అగరు పొగలు సమశీతోష్ణ ఉపచారము. కస్తూరీ లేపనము శీతలోపచారము. కనుక ఒకటి మొదలుపెట్టారు, ఒకటి మానేశారు. కుచముల మీదకు ఒరుసుకునేట్లు ముత్యాలహారాలకు అనుమతిచ్చేశారు. గడచిన హేమంతంలో హారాలు అందునా రాళ్ళహారాలు ఇంకా చల్లగా అయిపోతాయి, అసలే చలి. ఒరుసుకుని

కొద్దిపాటి గాయాలైనా పెద్దవవుతాయి, కనుక అప్పుడు వేసుకోలేదు బహుశా, యిప్పుడు వేసుకుంటున్నారు. కురులలో దండలుగట్టిన పూలమాలికలలో లామజ్జకము అంటే ఒకటీ అరా వట్టివేళ్ళ పోచలు ఉన్నా పట్టించుకోవడంలేదు. యివన్నీ సమశీతోష్ణ ఉపచారాలు, పరిమళాన్ని, మత్తును, కోరికలను పెంచే ఉపచారాలు, వసంతంలో చేసే ఉపచారాలు. వీటికి సిద్ధమయ్యారు అతివలు.

*అవని నపుడు నవోదితుం డైన యట్టి*
*మరునకుం గుసుమర్తు వన్మంత్రసాని*
*బొడ్డుగోసిన కొడవలిఁ బోలె విరహి*
*దారకం బయ్యెఁ గింశుకకోరకంబు*

కింశుకము అంటే మోదుగు. మోదుగు పూలు ఎర్రనెర్రని రంగులో ఉంటాయి. అందునా మొగ్గలు ఇంకా లేతగా ఎర్రగా ఉంటాయి. మొగ్గలు కనుక కొనలు తేలి ఉంటాయి. అది వసంతఋతువు. కనుక అప్పుడే యేతెంచిన మన్మథుడు శిశువు. మరునికి స్వాగతము పలికే వసంతఋతువు మంత్రసాని అయ్యింది. పురిటికందుకు బొడ్డుకోయడం సహజము, అవసరముకూడా. మన్మథుడు అనే పురిటికందుకు బొడ్డుకోయడానికి ఉపయోగించిన కొడవలిలా మోదుగు మొగ్గ ఉన్నది, వాడిగా, ఎర్రగా ఉన్నది, బొడ్డుగోసినపుడు లేత నెత్తురు అంటినట్లు, ఏమి ఊహ, ఏమి వర్ణన!

అసలైన మెరుపు చివరి పాదం. ఆ కింశుకములనే కొడవళ్ళు మన్మథునికి బొడ్డు మాత్రమే కోశాయి బహుశా, దానివల్ల ఆతనికి జన్మ కలిగింది. అది వసంతము కనుక, మన్మథుడు పుట్టాడు కనుక, విరహులకు మాత్రం దారకం అయ్యింది, అంటే వీళ్ళ గుండెలను కోసే కొడవలి లాగా ఉన్నది

ఆ కింశుక కోరకము, మోదుగు మొగ్గ. బొడ్డుకొస్తే జననం, జనించినవాడు మన్మథుడు, విరహుల గుండె కోస్తే మరణం, విరహముతో! కనుక గుండెలు కోసినప్పుడు అంటిన రక్తం వలన కూడా ఎఱ్ఱగా ఉన్నది 'మోదుగుమొగ్గకొడవలి'! రాయల సంగీతంలో వినిపించే ధ్వనులెన్నో, వినిపించీ వినిపించకుండా మురిపించే రసధ్వనులు అన్ని! కనిపించే అందాలెన్నో, కనిపించీ కనిపించకుండా కవ్వించేవి అన్ని! ఈ క్రింది పద్యంలో రాయల రసికత యింకా రాజిల్లింది.

*కుసుమము లెల్లఁ గామినుల కొప్పుల నుండ నటుండలేమి సి*
*గ్గెసఁగఁగ వంగినట్లు జనియించె నన ల్మరి వంగి జీవితే*
*శసమితి కొమ్ములం గరఁచి చల్లఁ గుచక్షణి కాంగ రాగ మౌ*
*టసదె యటంచు రాగిలిన యట్టులు రాగిలి విచ్చె గింశుకిన్*

కుసుమములు అన్నీ కామినుల కొప్పుల్లోకి చేరిపోయాయి. పూవులన్నీ పూబోడుల తలల్లో దూరిపోయాయి. తాము అలా యింతుల కొప్పుల్లోకి చేరలేముకదా అని సిగ్గుపడిపోయాయి మోదుగుచెట్టుకు పూసిన పూలు. సిగ్గుపడడం ఎందుకంటే మోదుగుపూలకు సౌరభము ఉండదు, అదిలేని పూలు ఎవరిక్కావాలి? కనుక అలా సిగ్గుపడి వంగి పోయాయి జనించిన మోదుగుపూలు. ఐతేమాత్రం ఏం పోయింది, వాటికి అంతకన్నా, కొప్పులలో చేరడంకన్నా గొప్ప అదృష్టం మరొకటి పట్టనున్నది. వచ్చింది వసంతం కదా, వసంతాలు ఆడతారు కదా, ప్రాణేశులు, జీవితేశులు, ప్రియులు. ఆ పురుషులు మోదుగుపూలను రసంతీసి, వసంతమాడే గొట్టాలలో కొమ్ముల్లో ఆ రసాన్ని నింపి, తమ ప్రియురాళ్ళ మీద చల్లేప్పుడు, మరీ కొంటెగా వక్షస్థలం మీద చల్లేప్పుడు ఆ సుందర వక్షస్సీమపై పూతగా క్షణకాలమైనా ఉండడం అంటే తక్కువ అదృష్టమా? సిగలలో విరులై వడలి వాడి, వాలి రాలిపోవడంకంటే వక్షస్థలం మీద పూతయై యిగిరిపోవడం అదృష్టం కాదూ? అలా భావించి, ఆ రక్తి కలిగి, ఆశగా, కుప్పలు కుప్పలుగా మొగ్గలుతొడిగి విచ్చుకున్నాయేమో అన్నట్లు విరబూసిన పూలతో కింశుకావృక్షాలు, మోదుగుచెట్లు కోరికతో పూశాయి.

*వీరుద్ద్రుమిథున మేళన*
*కై రతిపతి యేయ దుస్సి హరితద్యుతిఁ బై*
*నారెగయఁ బొటమరించిన*
*నారసముల మొనలనంగ నన లవి మించెన్*

*వసంతఋతువులో చెట్లు లతలు చిగిర్చి వనాలు కళకళలాడుతుంటాయి. లతలు చెట్లకు మెలివేసుకుని చివుళ్ళు తొడగడాన్ని వర్ణిస్తున్నాడు రాయలవారు. లతలకు, వృక్షాలకు సంపర్కాన్ని, రతిని కలిగించడంకోసం మన్మథుడు వేసిన బాణాలు ఆ లతల వృక్షాల శరీరాల్లోనుండి దూసుకుకుపోయి వాటి మొనలు పైకి తేలి కనిపిస్తున్నాయేమో అన్నట్లు లేత పచ్చని ఎఱ్ఱనెఱ్ఱని చివుళ్ళు లతలపై, వృక్షాలపై కనిపిస్తున్నాయి. మన్మథుని బాణాలు ఒక్కటిగా చేస్తూ దూసుకుపోవడం చేత దగ్గరైనాయి లతలు, వృక్షాలు. చివుళ్ళు కనుక పచ్చ పచ్చగా, లేత ఎఱ్ఱదనం కూడా కలిగిఉన్నాయి. వాటి శరీరాలలో నుండి దూసుకుపోయి పైకి మొనలు దేలిన కారణంగా అంటిన రక్త భ్రాంతి వలన ఎఱ్ఱదనం కనిపిస్తున్నది.*

*తనయుదరంబునం బొడమి తామ్రరుచిచ్ఛట లుల్లసిల్లఁ గో*
*ల్కొను ధరణీజ సంతతికిఁ గోరకదంతము లించుకంత ని*
*క్కినయది యాదిగాఁగఁ జెలగెన్ వనలక్ష్మి గడుం జెలంగఁగాఁ*
*జనుఁ బ్రియుఁడైన మాధవుని సంగతి మీఁదటఁ జాలఁ గల్గుటన్*

వనలక్ష్మికి సంతోషం కలిగింది. తన కడుపున పుట్టిన వృక్షములనే సంతానానికి ఎర్రనెర్రని కాంతులు విరజిమ్ముతూ ఎదుగుతుంటే, వాటికి మొగ్గలు అనే పాలపండ్లు వస్తుంటే అప్పటినుండీ ఆమెకు సంతోషం పెరిగిపోతున్నది. ఇక ఆమెకు తన నాధుడైన మాధవునితో సంపర్కం కలుగబోతున్నది. కనుక ఆమెకు సంతోషం కలగడం సమంజసమే.

ఋతుపరంగా వసంతరుతువులో చెట్లూ చేమలూ చిగిర్చి, దిన దినాభివృద్ధి చెందుతూ మొగ్గలు తొడిగి, ఫలించి పుష్పించి వసంతం పులకించి పోతున్నట్లుగా ఉంటుంది ప్రకృతి. ఆ తరువాత మాధవునితో, అంటే వైశాఖ మాసంతో కలయిక జరుగుతుంది, చిత్రం తరువాత వైశాఖం వస్తుంది. వసంతఋతువు వసంతలక్ష్మి అనే స్త్రీ ఐంది, ఆమె సంతానం ఐన లతలకు, వృక్షాలకు తొడిగిన చివుళ్ళు పిల్లలకు వచ్చే పాలపండ్లు అయినాయి.

స్త్రీపరంగా, స్త్రీ ప్రసవించి, ఆ శిశువు దినదినాభివృద్ధి చెందడం ఒక సంతోష కారణం, ఆ తరువాత పాలపండ్లురావడం యింకా సంతోషదాయకం అంటున్నాడు రసిక రాయలు. ఎందుకంటే నెలలు ముదిరినదగ్గరినుండీ శిశువుకు పాలపండ్లు వచ్చేంతవరకూ దంపతులు మైథునంలో పాల్గొనకూడదు అని భారతీయ స్మృతిశాస్త్ర నిర్దేశం. యిక ఆ హద్దు చెరిగిపోయింది కనుక, విరహము తీరిపోతుంది, తన నాధుడు ఐన 'మాధవుని'తో కలయికకు తరుణం వచ్చింది అని వసంత'లక్ష్మి' అనే తల్లి, తరుణి  సంతోషపడుతున్నది అని చమత్కారం.

*మును నననల్లమిఁ బట్టి ముంగాళ్ళ ముక్కుజో దనలఁ బీలిచి పసర్కొనిన విడిచి*
*పరువంపువిరిగొందు లరసి చాలై త్రోవఁ బెట్టి యీరము లీఁగు పిండుఁ దగిలి*
*క్రొవ్విరిఁ దొలుత నొక్కండు కని యది వ్రాలు తరి దాని నిలబడఁ దాఁచి క్రోలి*
*యాకురాలుపుగండ్ల నానెదు నాస నిం తడుగూది బం కంటి యంగలార్చి*

*యెట్టకేలకు నొకఁ డబ్బఁ బొట్టనిండఁ*
*గ్రోలి యది గాలిఁ గదలినఁ గూలు నగుచు*
*భ్రమదవనపాలికలు వేడ్కఁ బట్ట నగుచు*
*మధుదినాది క్షుధాభ్రమన్మధుపచయము*

వసంతంలో ప్రకృతిని, తరువులను, లతలను, పుష్పములను, స్త్రీపురుషుల విలాసాన్ని, కోకిల పాటలను వర్ణించిన వారున్నారు. తుమ్మెదల ఝుంకారాలను, మత్తకాముకగజ ఘీంకారాలను, మదవతుల మదనక్రీడాలంకారాలను, ప్రకృతిని స్త్రీపురుషులను గెలిచిన వసంతుని సేనల అహంకారాలను వర్ణించినవారు ఉన్నారు. కానీ, కేవలం తుమ్మెదల దినచర్యను వర్ణించిన పద్యం ఎవరన్నా చెప్పారా? రాయలవారు రసరమ్యంగా చెప్పారు!

ముందు మొగ్గలను మోహంతో పట్టుకుని, ముంగాళ్ళతో అదిమిపట్టి, నాసికా రంధ్రాలతో తేనెను పీల్చి, అవి మొగ్గలు కనుక, కొద్దిగా పసరు, వగరు తగిలి వదిలిపెడుతాయి. అక్కడినుండి పక్వములైన పూలు ఉన్న గొందులు, సందులు వెతుక్కుంటూ గుంపులుగట్టి జోరున పొదలలో దూరి వెళ్తాయి. అక్కడ అదివరకే మధుపానం చేస్తున్న ఒక తుమ్మెదను చూస్తాయి. మధుపానాసక్తతతో, అంతకుముందు కొద్దిగా చేసిన మధుపానోత్సాహంతో ఆ తుమ్మెదను నిలబడకుండా తన్నివేసి, నేలమీద పడేసి, అక్కడినుండి తరిమేస్తాయి. ఆ కొత్తగా పూర్తిగా విరిసిన పుష్పపు మధువును తాము త్రాగిపారేస్తాయి. యింకా కుతి తీరదు. తీగనుండి ఆకులు రాలిన చోట, పూలు రాలినచోట పడిన గండ్లు కనిపించి, అక్కడి తేనెను త్రాగుదామని వ్రాలి, ఆ ఆకులు, పూలు

రాలినప్పుడు కొద్దిగా స్రవించే బంక కాళ్ళకు అంటుకుని కాళ్ళు లాక్కోలేక తంటాలు పడుతాయి. ఎలానో వదిలించుకుని బయటపడి, చివరికి యింకొక పుష్పం కంటబడి పొట్టనిండా దాని తేనెను త్రాగుతాయి. యిక శరీరాలు అదుపులో లేనంత మత్తు కలుగుతుంది. గాలికిఆ పూవు, ఆ తీగె కదిలినా సరే మత్తుగా నేలమీదకు పడిపోతాయి, ఆ తోటలకు కావలిగా ఉండే తరుణులకు తేలిగ్గా దొరికి పోతాయి. తుమ్మెదలను సరదాగా, ఆటకు పట్టుకునే పడతులకు చిక్కిపోతాయి. ఈ రకంగా వసంతఋతువు తొలి దినాన, ఆ రోజు మొదలుకొని 'తాగుబోతులైన' తుమ్మెదలు తిరుగుతుంటాయి. అప్పటి ఆ తుమ్మెదలే కాదు, యిప్పటి తుమ్మెదలూ మధుపానం కోసం యిలాగే తిరుగుతుంటాయి, గమనిస్తే తెలుస్తుంది!

*ద్విజతఁ గాంచియు మధుసేవ విడువలేక*
*జాతిఁ బాసినతేంట్ల నిస్వనముఁ గూడు*
*కొనుటనో యనఁ గోకిల స్వనము సెలఁగెఁ*
*దనకు మరి పంచమత్వంబు తప్పకుండ*

ద్విజుడు అంటే బ్రాహ్మణుడు. ద్విజము అంటే పక్షి అని కూడా అర్థము. భూమి మీద పడ్డప్పుడు ఒకసారి, గాయత్రీ మంత్రోపదేశము పొందిన తర్వాత రెండవసారి, యిలా రెండుసార్లు జన్మను పొందుతాడు గనుక బ్రాహ్మణుడు ద్విజుడు. పక్షి గుడ్డుగా ఒకసారి, గుడ్డులోనుండి పక్షిగా రెండవసారి జన్మను పొందుతుంది గనుక ద్విజము. ద్విజత్వము ఉన్న బ్రాహ్మణుడికి మధుపానము నిషిద్ధము, కనుక ద్విజత్వము ఉన్న తుమ్మెదకు కూడా మధుపానము నిషిద్ధమే అంటున్నాడు రాయలవారు చమత్కారంగా. అలా నిషిద్ధము అయినా కూడా మధుపానము చేసి, తుమ్మెదలకు జాతి భ్రష్టము ఐపోయింది. వాటితో కలిసి వనాలలో తిరిగిన కారణంగా కాబోలు, కోకిలలకు కూడా జాతి భ్రష్టత్వము కలిగింది. కోకిల కూడా ద్విజమే కనుక, తుమ్మెదలతో కలిసి వనాలలో తిరిగిన కారణంగా, ఆ తుమ్మెదల కంఠస్వరం కోకిలలకు వచ్చినట్లుంది. కనుక కోకిలలు పంచమత్వాన్ని పొందాయి, కనుక పంచమ స్వరంతో కూస్తున్నాయి,వసంతంలో. పంచమహాపాతకాలలో సురాపానం కూడా ఒకటి అని, ఆ మహా పాతకాలు చేసినవాళ్ళతో స్నేహం చేయడం, కలిసి తిరగడం కూడా మరొక మహా పాతకం అని ఇంతకుముందు చెప్పుకున్నాము. కనుక కోకిలలకు కూడా ఆ పాపం అంటుకుని, జాతి భ్రష్టమైపోయి, పంచమత్వాన్ని పొందాయేమో, కనుకనే పంచమస్వరంలో తీయగా పాడుతున్నాయి అని చమత్కరిస్తున్నాడు రాయలవారు.

*పూచినమావులం దవిలి పూవిలుజోదున కమ్మె మాధవుం*
*డేచిన శంక నాతఁ డవి యేకొనియే పథికావళీజయ*
*శ్రీచణుఁ డయ్యె నట్టిద యకృత్యముచే నగునట్టిపీడయుం*
*గోచరమౌనె దైవ మనుకూలము నై పరుమేలు తీరినన్*

రాయలవారి భాషాపటిమకు, భావనా గరిమకు, విస్తృతపఠనానుభవానికి, లోకోక్తులుగా నిలిచిపోయే పలుకులకు ఈ పద్యం చక్కని ఉదాహరణ. మావులు అంటే మామిడిచెట్లు అని, గుఱ్ఱములు అనికూడా అర్థం. పూయడం అంటే చెట్లు లతలు పూయడము, శరీరము పొక్కడం. మాధవుడు అంటే వసంతుడు. వసంతంలో మామిడి చెట్లు చివుళ్ళు తొడగడం, పూయడం సహజమే. మన్మథుని పూలబాణాలలో మామిడిపూలు కూడా భాగమే. ఈ రెండు విషయాలను చమత్కారపూర్వకంగా వాడాడు. అదనంగా కొన్ని అందించాడు మన్మథునికి.

నిలువెల్లా పూచిన మావులను(మామిడిచెట్లను)చూసి, నిలువెల్లా పూచిన గుఱ్ఱములు(మావులు) కావొచ్చును అని, మిక్కిలి అనుమానముతో (ఏచిన శంకన్)వసంతుడు వాటిని మన్మథునికి అమ్మేశాడు. ఎందుకంటే శరీరం పూయడం, అంటే పొక్కడం, అంటే చర్మసంబంధమైన

రుగ్మత కలగడం గుర్రాలకు మంచిది కాదు, అవి అంతకుముందులా పరుగెత్తలేవు, ఎందుకంటే చర్మసంబంధమైన తీవ్ర రుగ్మతలు ఎముకలు, కీళ్ళు దెబ్బతినేలా చేస్తాయి. ఆ గుర్రాలనే, ఆ మావులనే, ఆ మామిళ్ళనే మన్మథుడు తీసుకుని పథికులను, విరహులను జయించడానికి 'శ్రీ చణుడు' అయినాడు. మన్మథుని పూల బాణాలలో మామిడి పూలు కూడా ఉన్నాయి కనుక, మామిడి పూల బాణాల లక్షణం 'సంతాపనం', సంతాపాన్ని కలిగించడం కనుక అలా జనుల మనసులకు మన్మథ తాపాన్ని కలిగించడంలో విజయుడు అయినాడు మన్మథుడు. యిప్పుడు ఈ వసంతఋతువులో నిలువెల్లా పూచిన మామిళ్ళను తీసుకుని, వాటిని వాహనంగా చేసుకుని, అంటే మామిడి కొమ్మలనెక్కి, వాటి మాటున దాగి, యింకా విజృంభిస్తున్నాడు మన్మథుడు. దైవము అనుకూలము ఐనప్పుడు అకృత్యము అంటే చేయ గూడని పనిని, నష్టాన్ని కలిగించే పనిని చేసినా ఆ పాడుపని తాలూకు పీడ అంటుకోదు.

యింతవరకూ వ్రాసిన ఏ కవి అయినా గొప్ప కవియే అవుతాడు, కానీ 'శ్రీ చణుడు' అని ఉద్దేశపూర్వకంగా వాడిన కారణంగా, శ్రీకృష్ణదేవరాయలు కారణజన్ముడైన మహాకవి అయినాడు, ఈ వ్యాసకర్త ఉద్దేశములో. మన్మథుడు అమ్మవారి ఉపాసకులలో, లలితా ఉపాసకులలో అగ్రగణ్యులలో ఒకడు. 'శ్రీ' అని అమ్మవారిని, 'చణుడు' అని సామర్థ్యాన్ని కలిగినవాడు అని చెప్పి, మన్మథుడు అమ్మవారి కటాక్ష సామర్థ్యాన్ని, కరుణను పొంది విజయుడు అయినాడు అని చెప్తూ సౌందర్యలహరిలోని, ఆదిశంకరులవారి ఒక దివ్యమైన శ్లోకాన్ని సూచిస్తున్నాడు రాయలవారు.

*'ధనుః పౌష్పం మౌర్వీ మధుకరమయీ పంచ విశిఖా*
*వసంతః సామంతో మలయమరు దాయోధన రథః*
*తథాప్యేకః సర్వం హిమగిరి సుతే కా మపి కృపా*
*మపాంగా త్తే లబ్ధ్వా జగదిద మనంగో విజయతే '*

విల్లు గొప్పదా అంటే కాదు, పుష్ప సంబంధమైనది, చెరుకువిల్లు. వింటినారిని చూద్దామా అంటే ఎంత మాత్రమూ నిలకడలేని, ఒకచోట ఉండని తుమ్మెదల బారు నారి. సరే బాణాల సంగతి చూద్దామా అంటే ఐదు పూలు, ఐదే బాణాలు. సరే అనుసరించి వచ్చే సామంతుల అండ దండ ఏమన్నా ఉన్నదా అంటే, సామంతుడు వసంతుడు, సంవత్సరానికి ఒక్కసారి వచ్చి రెండే నెలలు వెంట ఉంటాడు. మరి రథం ఏమన్నా గొప్పదా అంటే మలయమారుతం, నిలకడలేని, సున్నితమైన గాలి. తనేమో ఒక్కడే. ఐనప్పటికీ, మన్మథుడు ఈ జగత్తును మొత్తాన్ని, అందునా కనీసము శరీరము అనే ఉనికి కూడా లేకుండా, అనంగుడై గెలుస్తున్నాడు, పడేస్తున్నాడు, ఆటాడిస్తున్నాడు ఎలా అంటే, అమ్మా! నీ కడగంటి చూపుల కరుణకు వాడు పాత్రుడు కావడం వల్లనే' అని ఆదిశంకరులవారు అన్నభావాన్ని ధ్వనిస్తున్నాడు రాయలవారు. ఆదిశంకరుల ఈ శ్లోక స్ఫురణ, స్ఫూర్తి ఉన్నాయి రాయలవారి ఈ పద్యంలో.

అంతే కాదు, మనకు దైవం అనుకూలుడు అయితే, మన శత్రువుల మంచిరోజులు ముగిసిపోతే మనదే విజయం. అంటే కేవలం మన గొప్ప వలన కాదు, దైవకృప మనమీద ఉండడం వలన, శత్రువుకు చెడ్డరోజులు దాపురించడం వలన మనము తెలిసీ తెలియక చేసిన చెడ్డపనులు కూడా చెడ్డ ఫలితాన్ని యివ్వకుండా ఉంటాయి. యిందుకు వ్యతిరేకముగా ఉన్నపుడు, దైవం అనుకూలించనప్పుడు, మనకు చెడ్డరోజులు, శత్రువులకు మంచిరోజులు వచ్చినపుడు మనం చేసే మంచిపనులు కూడా మంచి ఫలితాలను యివ్వవు, ఓడిపోతాము, కనుక మనం నిమిత్త మాత్రులమే, పనిచేసే వారిమే, పని చేయాల్సినవారిమే. గీతాచార్యుడు చెప్పినట్లుకర్మలను చేయడంలోనే మన పాత్ర, వాటి ఫలితాలను నిర్దేశించడంలో కాదు, అని చెప్తున్నాడు రాయలవారు. రాయలను మించిన కవిరాయలు ఎవరన్నా ఉన్నారా?

ఆముక్తమాల్యదలో, తెలుగుసాహిత్య నందనవనంలో, వసంతఋతువు రాయల కవనవిరులతో మధుర కవిత్వ మకరందాన్ని వరదలెత్తి పారిస్తున్నది. రాయలవారి ఉపమానాలు, ఊహలు వినూత్నమైనవి. విశాల సామ్రాజ్య స్థాపన, సువిశాల సాహిత్య రససామ్రాజ్య స్థాపన, భారతీయ ఆధ్యాత్మిక, వేదాంత, లలితకళా సీమల పర్యవేక్షణ, పరిరక్షణ, ప్రజారంజకంగా పరిపాలన యిన్నిటిని ఒంటిచేత్తో అవలీలగా చేసిన కారణజన్ముడు శ్రీకృష్ణదేవరాయలు. భారతమాత సిగలో మేలిమి రత్నం రాయలు.

వసంతఋతువు వర్ణనలో ప్రతి పద్యమూ నవనవోన్మేషమైన వర్ణనా చమత్కృతితో విలసిల్లేదే, అయినా మరీ సుందరఘట్టాలను మాత్రమే మనం పరామర్శించుకుంటున్నాము. ఈ క్రింది పద్యం అతి విచిత్రమైన భావజాల సౌందర్యమయం.

ఉరుశక్తిన్మధుమాసదోగ్ధ పిదుకన్ జ్యోత్స్నీగవీ చంద్రమన్
స్ఫురదూధఃప్రవిముక్తమైన నిబిడ జ్యోత్స్నాపయః పూరమున్
విరియంబారినగొజ్జెఁగ ల్గురియ మున్నీరైన యక్కమ్మనీ
రు రహిం గూడిన నేర్పరించు గములై రోలంబకాదంబముల్

దోగ్ధ అంటే పాలను పిదికేవాడు. జ్యోత్స్న అంటే వెన్నెల, జ్యోత్స్ని అంటే వెన్నెలను కలిగినది, వెన్నెల రాత్రి. గవి అంటే గోవు. ఊధ అంటే పొదుగు. మధుమాసము, వసంతమాసము అనే గొల్లడు, పాలను పిదికేవాడు బలంగా వెన్నెలరాత్రి అనే గోవుకున్న చంద్రుడు అనే పొదుగును పిదుకగా దట్టంగా వెన్నెల అనే పాలు కురిశాయి. గొజ్జంగి పూలు సముద్రమంత మకరందాన్ని కురిశాయి. వీటికి తుమ్మెదలు (రోలంబములు) కలహంసలు(కాదంబములు) ముసిరాయి. తుమ్మెదలు తేనెకోసం ముసరడం, హంసలు పాలను నీళ్ళను వేరు చేయగలవనే ఐతిహ్యం తెలిసిందే కదా. వసంతమాసంలో కురిసే నిండువెన్నెలను ఇలాంటి ప్రతీకలతో ఎవరైనా వర్ణించగలరా? అయితే యిందులోకూడా ఒక విశేషమైన చమత్కారం ఉంది. నిజానికి పాలవంటి వెన్నెల, సముద్రమంత తేనె అని చెప్పిన క్రమంలోనే హంసలు,తుమ్మెదలు అని చెప్పాలి కదా, అలా చెప్పలేదు రాయలు, అంటే దోషం ఉన్నదా? అంటే, పాలవంటి వెన్నెలా కురిసింది, సముద్రమంత తేనె కూడా కురిసింది, ముందుగా భూమిమీదికి పూల తేనె కురిసింది, తర్వాత ఎక్కడో పైన ఉన్న చంద్రుడి వెన్నెల కురిసింది, ముందు కురిసిన వెన్నెలకు మురిసిన తుమ్మెదలు ముందు ముసిరాయి, ఆ తర్వాత కురిసిన పాలవెన్నెలకు హంసలు ముసిరాయి, అదీ రాయల చమత్కృతి!

తరుణులు దోహదాన మధుధార నన ల్వకుళాళి నింపఁగాఁ
దరుణుల మేము గామె యని తద్గతలౌ వనదేవత ల్సురన్
ధర వకుళౌఘు మెల్లను నన ల్గనఁ గ్రాయఁగ నించుబుగ్గలన్
దొరసె మధుప్రపూర్ణత మధూకములం బృథుపాండుపుష్పముల్

సరే, వసంతంలో చెట్లూ చేమలూ చిగిర్చడం తెలిసిందే. అయితే చిగిర్చిన చెట్ల ఫలముల, పుష్పముల దిగుబడి బాగా రావాలంటే, అకాలంలో నైనా, సకాలంలోనైనా, ఆధునిక కాలంలో అయితే రకరకాల మందులు వాడుతున్నారు, కానీ, ప్రబంధ రసబంధురమైన కాలంలో దోహదక్రియలు అని చేసేవారు సుందరీమణులు. అంటే ఆ చెట్ల, తీగెల జాతులనుబట్టి ఒకోదానికి ఒకో రకంగా, దిగుబడికి, సమృద్ధికి దోహదంచేసే క్రియలన్నమాట.

అశోకవృక్షానికి అందమైన స్త్రీల కాలి తన్నుడు, పొగడచెట్టుకు అందగత్తెల ఉమ్మివేయడం, గోరంటకు కౌగిలించుకోవడం, బొట్టుగు చెట్టుకైతే కడగంటి చూపు, మామిడికైతే కరస్పర్శ, సంపెంగకు అందగత్తెల ముద్దు ముఖ కాంతులను ప్రసరింపజేయడం, ముఖాన్ని

తగిలించడం, కొండగోగు చెట్టుకైతే ముద్దు ముద్దుగా ముచ్చట్లు చెప్పడం, వావిలి చెట్టుకు అందగత్తెల నిట్టూర్పు, మోరటి చెట్టుకు పాట పాడడం, సురపొన్నకు సుందరీమణుల నవ్వు దోహదక్రియలు అని సంప్రదాయం. ఇందులో కూడా అక్కడక్కడ కొన్ని అభిప్రాయభేదాలు ఉన్నాయి.

తరుణుల ఉమ్మి, లాలాజలం అనే మధుదారతో పొగడ(వకుళ)చెట్లు సమృద్ధిగా పుష్పించడం చూసిన వనదేవతలు మేమూ తరుణులమే కదా అని, పొగడచెట్లను దోహదక్రియతో పుష్పించేలా చేయడంకోసం, తామూ తెల్లని మద్యాన్ని పుక్కిళ్ళలో పట్టి బుగ్గలు పూరించినప్పుడు ఆ మిలమిలలాడుతున్న బుగ్గల్లాగా ఆ వసంతఋతువులో యిప్ప పూలు ప్రకాశిస్తున్నాయి.

స్థాణు వొక్కండు మగవాఁడు తలఁక కుమియ
ఫల మొసఁగె నట్టె కినియక పద్మవదన
వదనసురఁ గూర్మి నొసఁగ నీవలదె పుష్ప
మైన ననుమాడ్కి నుమిసిన నలరెఁ బొగడ

స్థాణువు అంటే పొగడ అని, శివుడు అనీ అర్థాలు. గతంలో ఎప్పుడో ఒక మగవాడు (తిన్నడు) అనాగరిక ఆటవికుడు ఉమ్మేసినంతమాత్రాన ఒక స్థాణువు (శివుడు)'ఫలమును'(మోక్షఫలమును) యిచ్చాడే, అటువంటిది, ఈ పద్మముఖులు ఉమ్మివేసి, వారి ముఖ లాలాజల సుధలను యిచ్చినందుకు, అంతటి త్యాగానికి, ఉపకారానికి ఫలితంగా 'పుష్పములనైనా' ఇవ్వకుంటే ఎలా అని ఆ దోహదక్రియకు పొగడచెట్లు మురిసి విరిశాయి!

సాంద్రమకరందవృష్టి రసాతలంబు
దొరఁగు పువ్వుల భువియుఁ బుప్పొడి నభము
నీక్రమత్రయి మాధవుఁ డాక్రమించె
నురువిరోచనజనిత మహోష్మ మడఁగ

మాధవుడు అంటే వసంతుడు అని, విష్ణుమూర్తి అనీ అర్థాలు. అలనాడు ఆ మాధవుడు త్రివిక్రముడై ముల్లోకాలనూ ఆక్రమించి విరోచనుడి కుమారుడైన బలిచక్రవర్తియొక్క మహా తేజస్సును, వేడిమిని, పోడిమిని అణచివేశాడు. యిల నేడు, ఈ మాధవుడు(వసంతుడు) మకరంద వృష్టితో రసాతలాన్ని, పూలతో భూమిని, పూల పుప్పొడి రేణువులతో ఆకాశాన్ని ఆక్రమించాడు, యిలా ఈ మాధవుడూ త్రివిక్రముడై, సూర్యుని మహా వేడిమిని అణగదొక్కాడు (ఉరు విరోచనజనిత మహోష్మ మడఁగ)అప్పటికే విరహ దావానలంలో వడలిపోతున్న గోదాదేవి ఈ వసంతుడి ప్రతాపానికి తట్టుకోలేక యాతనపడుతున్నది.

నెలఁతఁ గుచకుంభయుగళ ముండియు వియోగ
జలధి నీఁదింప లేదయ్యె సఖులు వంచు
చున్న పన్నీటివెల్లి లోఁ గొన్నకతన
ముంప కది లాఘువమున దేలింపఁగలదె

ప్రవాహాలను, సముద్రాన్ని కూడా కుండలను కట్టుకుని తట్టుకోవడం, మునగకుండా కాపాడుకోవడం తెలిసిందే. ఈ అతివకు, గోదాదేవికి కూడా కడవలవంటి కుచములున్నాయి, ఆమె కుచకుంభ. అయినా ఆమె వక్షోజకుంభములు తేల్చడానికి బదులుగా, మరింతగా

ముంచేస్తున్నాయి ఆమెను. ఆమె తాపాన్ని చల్లార్చడంకోసం చెలికత్తెలు పన్నీటి కడవలను గుమ్మరించడం వలన, బహుశా, కడవలలో ఖాళీ ఐన పన్నీరు ఆమె కడవలవంటి కుచములలో నిండిపోయిందేమో, నిండు కుండలు కట్టుకుంటే తేలేవాడు కూడా మునగడం ఖాయం కనుక, ఆమె వియోగ జలధిలో మునిగిపోయింది.

పుత్త్రియుఁ దాఁ గామిని నొక
పుత్త్రియు నట్లుండుటకు నబుద్ధేక్షుధనుః
పత్త్రి యగు విష్ణుచిత్తుఁడ
పత్త్రపలే కడియు నేతపంబో యనుచున్

ఆమె యాతనలను, ఆ దుర్భర విరహావస్థను చూసిన అమాయకుడు, ఆమె తండ్రియైన విష్ణుచిత్తులవారు కొడుకుల్లేనివాడు కనుక, ఉన్న ఒక్క పుత్రికా అలా పరితపిస్తూ ఉండడాన్ని అర్థం చేసుకోలేకపోయాడు. 'అబుద్ధ ఇక్షు ధనుః పత్త్రి ..' చెరుకువింటివాని పూలబాణాల గురించి తెలియనివాడు కనుక, అదికూడా, ఆ విరహావస్థ, ఆ తిండీ తిప్పలూ మానడం, అదంతా ఏ తపస్సో, ఏ ఉపవాసాలో, ఏ నియమాలో అనుకున్నాడు పాపం. అనుకుని, ఏమిటీ తిప్పలు, ఏ దేవదేవుని గురించి, ఏమి తపస్సు అనేది తెలియడంలేదు స్వామీ! నీకు తెలియనిది ఏదీ లేదుకదా, యిదేమి తపస్సో చెప్పవయ్యా అని పరమాత్ముడిని అడిగాడు. ఆ మాధవుడు మందస్మితుడై చెప్పడం ప్రారంభించాడు అని ఆముక్తమాల్యదలో ఐదవ ఆశ్వాసాన్ని ఈ క్రింది పద్యంతో పూర్తిచేశాడు శ్రీకృష్ణదేవరాయలు.

కంధరనీలవర్ణ! మధుకైటభనాగసువర్ణ! యోగిహృ
ద్గ్రంథిభిదోత్థభోగివనితా స్వనవచ్ఛ్వసనస్రవచ్ఛిర
స్సంధివసన్నిశాపతిరసస్సృతిదగ్ధపయోధివీచికా
మంధరకేళికాదర!సమాశ్రితపఙ్క్తిశిరోధిసోదరా!

నీలిమేఘమువంటి శరీరకాంతిని కలిగినవాడా! మధుకైటభులు అనే నాగుల పాలిటి గరుత్మంతుడా! యోగుల హృదయగ్రంథులు భేదింపబడడం వలన లేచిన కుండలినీశక్తి అనే నాగకన్య వెలువరిస్తున్న బుసలధ్వనితో కూడిన, నిట్టూర్పులతో కూడిన, కపాలం మధ్యలో, స్రవిస్తున్న అమృతం అనే పాలకడలిలో నిదానంగా, హాయిగా, తీరికగా, స్వేచ్ఛగా క్రీడించడాన్ని ఆదరించేవాడా, యిష్టపడేవాడా! పదితలల రావణుని సోదరునిచేత ఆశ్రయింపబడినవాడా! వేంకటాచలపతీ! వినుమయ్యా! యిది నాచే విరచితమైన హృద్యములైన పద్యముల ఆముక్తమాల్యదలో ఐదవ ఆశ్వాసము అని ఐదవ ఆశ్వాసాన్ని ముగించాడు శ్రీకృష్ణదేవరాయలు.

రాయల ప్రౌఢ, సమాసబంధురమైన శైలికి, భాషా పటిమకు, క్లిష్టతకు ఈ పద్యం ఒక ఉదాహరణ. దాదాపు మూడుపాదాలమేర దీర్ఘమైన, దివ్యమైన కుండలినీయోగరహస్య మయమైన సమాసాన్ని యిమిడ్చాడు. ఈ పద్యాన్ని వరుసగా మూడుసార్లు ఉచ్చారణా దోషాలు లేకుండా చదువగలిగినవాడు తెలుగుభాషను, సాహిత్యాన్ని అలవోకగా కరతలామలకం చేసుకున్నట్లే!

ఆరవ ఆశ్వాసము

శ్రీకాళి కృపార్ద్రేక్షణ!
వైకుంఠ! యకుంఠ భక్తవరద! పదాబ్జా
స్తోకమరందాయితగం
గా!కాకోదరనగోదయస్థపతంగా!

శ్రీకరమైన, కృపారసంచేత ఆర్ద్రమైన చూపులుగలవాడా! నిరంతరాయంగా భక్తులకు వరములిచ్చేవాడా! నీ పాదమనే కమలముయందు అంతులేని, సమృద్ధమైన గంగానది అనే మకరందాన్ని నింపుకున్నవాడా! శేషశైలము అనే ఉదయగిరి మీద ఉన్న, ఉదయించిన సూర్యునివంటివాడా! వేంకటేశా! వినుమయ్యా! అని ఆముక్తమాల్యదా ప్రబంధంలోని చివరిదైన ఆరవ ఆశ్వాసాన్ని ప్రారంభించాడు శ్రీకృష్ణదేవరాయలు.

భారతీయ సాహిత్యంలో అత్యున్నత స్థాయిని పొందిన, అత్యుత్తమమైన సందేశాన్ని యిచ్చిన సాహిత్యం ఈ ఆశ్వాసము. భారతీయ ఆధ్యాత్మిక, సామాజిక, నైతిక విలువలకు నిర్వచనాన్ని యిచ్చిన ఆశ్వాసం యిది. 'ప్రపంచ సాహిత్యంలో ఇలాంటిది ఎక్కడా లేదు' అని విశ్వనాథ సత్యనారాయణ గారు ప్రశంసించిన ఆశ్వాసము యిది. కవిత్వ స్థాయి పరంగా అన్నారు ఆ మాట అన్నారు విశ్వనాథ. సందేశం పరంగా, నీతి పరంగా ఇలాంటి కథలు కోకొల్లలు భారతీయ వాఙ్మయంలో. ప్రతీకాత్మకంగా చూస్తే, సాహితీ ప్రాంగణంలో పాకడం కూడా యింకా సరిగా చేతగాని అర్భకుడైన ఈ వ్యాసకర్త దృష్టిలో మాత్రం యింతటి అత్యున్నత సందేశాన్ని యిచ్చినది యిలాంటిది కథ మరొక్కటే ఉంది. దీనికీ దానికీ మూలకర్త వేదవ్యాసులవారే, ముందు ముందు మరింత వివరంగా తెలుసుకుందాం!

విష్ణుచిత్తులవారు తన కుమార్తె అవస్థను చూసి 'యిదేమి పూజ? యిదేమి ఆరాధన? యిదేమి వ్రతము? యిదేమి తపస్సు? ఏమీ అర్థం కావడంలేదు స్వామీ! నీక తెలియనిది లేదు కదా! నా కుమార్తెకు ఈ అవస్థ ఏమిటి స్వామీ?' అని అడిగాడు. నారాయణుడు నవ్వి, చెప్పడం ప్రారంభించాడు.

కలఁ డొకరుండు పేరుకొనఁగాని కులంబు మదీయ భక్తుఁ డి
య్యిల మును వాఁడు వామనత నే వసియించిన పుణ్యభూమియం
దుల కొక యోజనత్రయపు దూరపుటూర వసించి బ్రాహ్మవే
ళలఁ జనుదెంచి పాడు మము లాలస మంగళనామకైశికిన్

తన కుమార్తె అవస్థను గురించి అడిగితే కథను చెప్పడం మొదలెట్టాడు కమలాక్షుడు. 'అనగనగా..నా భక్తుడు ఒకడు ఉన్నాడు. వాడిది నిమ్నకులం. నేను వామనావతారంలో ఈ భూమిమీద నివసించిన చోటికి ఒక మూడు యోజనాల దూరంలో నివసించేవాడు. బ్రాహ్మీ ముహూర్తంలో వచ్చి కోరికతో, ప్రేమతో మంగళకైశికీ రాగంలో నన్ను స్తుతిస్తూ కీర్తనలు పాడేవాడు.

జాత్యుచిత చరిత్రమ మ
త్ప్రీత్యర్థం బూఁది తనదు హృదయము శుచితో
నిత్యంబుగఁ దత్తనుసాం
గత్యము మసిపాఁత మాణికంబై యొదుఁగున్

నాకు ప్రీతికరంగా ఉండడం కొరకు, తన జాతికి తగిన నడవడికతో, హృదయాన్ని అంటే, మనసును శుచిగా ఉంచుకుని, మసిగుడ్డలో కట్టిన మాణిక్యంలాగా ఉండేవాడు. శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్స్వనుష్ఠితాత్.. అని నేను చెప్పినదే గీతావాక్యం కనుక, అలా తన స్వధర్మనిర్వహణ చేస్తూ, మనస్సును శుచిగా ఉంచుకునేవాడు. పవిత్రమైన అంతఃకరణంతో నేన్ను కీర్తించి సేవించేవాడు.

'మనశ్శౌచం జన్మశౌచం కర్మశౌచంచ భారత శరీరశౌచం వాక్శౌచం, శౌచం పంచవిధం స్మృతం, పంచశ్వేతేషు మనశ్శౌచం విశిష్యతే' అని ఆర్షవాక్యం. మనసుకు సంబంధించినది, జన్మకు సంబంధించినది, కర్మకు(చేసేపనికి)సంబంధించినది, శరీరానికి సంబంధించినది, వాక్కుకు సంబంధించినది.. అని శౌచం అంటే శుచి అంటే పరిశుద్ధంగా ఉండడం ఐదు రకాలు. వీటన్నిటిలోకీ మనస్సు పరిశుద్ధంగా ఉండడమే విశేషమైనది, ఉన్నతమైనది అని అర్థం. మనస్సు కుళ్ళుతో, బురదతో కంపుగా ఉండి, జన్మ, వృత్తి, శరీరము, పలుకులు ఎంత ఉన్నతంగా ఉన్న, అందంగా ఉన్న, నాజూగ్గా నాగరికంగా ఉన్నా, నీచమే, నికృష్టమే అని భారతీయుల ఉవాచ! ఆ గీతాచార్యుని పలుకులను, ఈ ఆర్ష వాక్యాన్ని ధ్వనించాడు రాయలవారు యిక్కడ. చండాలుడు అయినా, తన కులధర్మాన్ని పాటిస్తూ, పరిశుద్ధమైన మనసు కలవాడు కనుక నాకు ప్రీతిపాత్రుడు అంటున్నాడు సాక్షాత్తూ దేవాదిదేవుడు!

చమురైన తోల్కుబుసంబు టెంకియును ని
త్తళి శంఖ చక్ర కుండలము లమర
బివెదాలికొమ్ముదోల్తిత్తియు జోడమ్ము
మెడమీది మొగలాకుగొడుగు దనర
మత్పాదరక్షయు మావు పెన్వెరక గు
ట్టిన యోటి తిపిరిదండెయును మెరయ
జిటితాళములు సంక పుటిక నొక్కొకమాటు
గతిరయంబున దాకి కలసి మొరయ

వలుద వనమాలకంటెయు మలినతనువు
బట్టెతిరుమన్ను బెదరు గెం పుట్టు జూపు
బసుపుబొడితోలు పల్లంబు నెసక మెసగ
వచ్చు సేవింప సురియాళు వైష్ణవుండు

చమురు అంటిన చర్మము, కుళ్ళాయి కట్టుకుని, చెవులకు ఇత్తడి శంఖ చక్రాకార కుండలాలు పెట్టుకుని, భజనల్లో వెలిగించే దీపపు సెమ్మెను పట్టుకుని, తోలుతిత్తిని బాణంలాంటి పదునైన ఆయుధాన్ని వెంటబెట్టుకుని, మెడ మీదకు ఆనిన మొగిలి ఆకుల గొడుగును ఉంచుకుని, ఒక భుజాన నా పాదరక్ష వ్రేలాడుతుండగా, మరొక భుజాన గుర్రపు వెంట్రుకలు తీగలుగా ఉన్న ఓటి సొరకాయ బుర్రను వీణగా చేసుకుని, వేగంగా ఆత్రుతతో వస్తున్నపుడు చంకలో వ్రేలాడుతున్న చిటితాళాలు ఒకదానికి ఒకటి తగిలి ఖంగుమని మోతలు చేస్తుండగా, తులసిమాలను ధరించి, మాసిన శరీరముతో, దేహాభిమానం లేకుండా, తిరుమణి పట్టెవర్ధనాలు తీర్చి దిద్ది, ఎర్రని కళ్ళతో బెదురుచూపులు చూస్తూ, పసుపు బాగా పట్టించిన తోలు జందెమును ధరించి, యిలా కళకళలాడుతూ నన్ను సంకీర్తనతో సేవించడానికి వచ్చేవాడు ఆ మాలదాసరి. చిత్రకారుడు కుంచెతో సృష్టించినట్లు మాలదాసరిని అతని వృత్తికి,

ప్రవృత్తికి, నిరాడంబరతకు, అమాయక గ్రామీణ జీవనశైలికి తగినట్లుగా రూపు పోసి కనులముందు కవితాకృతిని సాక్షాత్కరింపచేశాడు శ్రీకృష్ణదేవరాయలు.

శ్రీహరి కొనసాగిస్తున్నాడు తన భక్తుని కథను. విష్ణుచిత్తులవారు వింటున్నారు. 'జన్మచేత చండాలుడు ఐనప్పటికీ, గుణము చేత ఉత్తముడైన ఆ 'మాలదాసరి' తన చెక్కిళ్ళ మీదుగా ఆనందబాష్పాలు కారుతుండగా, రాళ్ళు కరిగేలా నా కీర్తనలు పాడి, ఆనంద తాండవం చేసి, తన

భుజాలకున్న బరువులను ప్రక్కన పెట్టి, ఎండను, గాలిని, ఆకలిని లెక్క చేయకుండా అలా బ్రాహ్మీ ముహూర్తమునుండి మిట్ట మధ్యాహ్నం దాకా ఒళ్ళు పులకలెత్తుతుండగా అలా నా సేవ చేసేవాడు.'

అట్లు దడవుగ గొల్చి సాష్టాంగమెరగి
గర్భమంటపి గడిగిన కలకజలము
లోని రాతొట్టి నిండి కాలువగ జాగి
గుడి వెడలి వచ్చునది శూద్రు డిడగ గ్రోలి

అలా ఎంతో సేపు కొలిచి, సాష్టాంగ దండ ప్రణామాలు చేసి, స్వామివారి గర్భగుడిని కడిగినప్పుడు జాలుగా బయటకు వచ్చే నీటిని ఒక శూద్రుడు యిస్తే తీర్థం లాగా తీసుకుని మైమరచిపోయేవాడు. శూద్రుడు తీర్థం యివ్వడం ఎందుకంటే ఇతను పంచముడు, అతనికన్నా పై స్థాయి అని భావింపబడే వాడు తీర్థం యిచ్చేవాడు. పాఠక మిత్రులు ఈ సన్నివేశాన్ని, ఈ కథను త్వరపడి నిర్ణయింప వద్దు. ఆ నాటి సమాజాన్ని, ఈనాటికీ సమాజంలో ఉన్న చెడును విమర్శిస్తున్నాడురాయలు. అది ఈ సన్నివేశం పూర్తి అయితేనే తెలుస్తుంది. రాయలు కవి, వీరుడు, ఆధ్యాత్మిక తత్త్వవేత్త, చిత్రకారుడు, సంగీతకళా కోవిదుడు, యివన్నీ మాత్రమే కాదు, ఆయన ఒక గొప్ప మానవతావాది, సంఘసంస్కర్త! ఈ ఆశ్వాసము యిందుకు ఉదాహరణ.

యిలా బ్రాహ్మీముహూర్తంలో ఆలయం ముందుకు వచ్చి, మిట్టమధ్యాహ్నం ఎండనెత్తి మీదికి వచ్చేదాకా, పాడి, ఆడి ఆనందంగా వెళ్ళిపోయేవాడు ఆ మహానుభావుడు. యిలా జరుగుతుండగా, ఒకనాడు ఒక విచిత్రం జరిగింది.

అద్దమరే యద్దాసరి
యద్దండ బిడాలగాహితాలయక కృకవా
కూద్దండరవము విని చను
ప్రొద్దాయె నటంచుఁ బాడఁ బోవుచుఁ ద్రోవన్

ఒకనాడు అర్థరాత్రి ఒక పిల్లి అతను కోళ్ళను ఉంచే గూటిలోకి జొరబడింది. పిల్లిని చూసిన భయముతో కోళ్ళు అరిచాయి. ఆ అరుపులను తెల్లవారు ఝాము సూచనగా కోళ్ళు కూయడం అని పొరబడ్డాడు ఆ భక్తుడు. నిజానికి తెల్లర బోయేముందు కూసే కోడి కూతలకు భయముతో అవి అరిచే అరుపులకు తేడా ఉంటుంది, కానీ అంత తీరుబడిగా, తెలివిగా గమనించే లౌక్యం కూడా లేని అమాయకుడు అతను అని చెబుతున్నాడు రాయలవారు. సరే, తెల్లవారుతున్నది, కోళ్ళు కూస్తున్నాయి, నేను స్వామి సేవకు వెళ్ళాల్సిన సమయం ఐంది అనుకుని, ఎప్పటిలాగే తన సరంజామా మొత్తము భుజానికి ఎత్తుకుని బయలుదేరాడు.

మరులుఁ దీగె మెట్టి యిరు లన్న నో యని
యెడు తమిస్రఁ గాడుపడి పొలంబు
లెల్లఁ దిరిగి తూర్పు దెల్ల నౌతరి నొక్క
శూన్యగహనవాటిఁ జొచ్చి చనుచు

ఆ చీకటిలో 'మరులు తీగె'ను తొక్కాడు. 'మరులు మాతంగి తీగె' అని ఒక పిచ్చిగా అల్లుకుపోయే అడవి తీగ ఉంటుంది. దాన్ని తొక్కితే దారి తప్పి అక్కడక్కడే తిరుగుతారు అని ఐతిహ్యం. ఆ తీగెను తొక్కడంతో, ఆ చిమ్మచీకటిలో దారి తప్పాడు. ఎలాంటి చిమ్మ చీకటి అనే విషయాన్ని

చమత్కారంగా అతిశయోక్తిగా వర్ణిస్తున్నాడు. 'ఓ చీకటీ' అని పిలిస్తే, 'ఓ' అని బదులిచ్చే సంసిద్ధమైన కటికచీకటి అది. దారితప్పి, పొలాలు, బీళ్ళు, అన్నీ తిరిగి, తిరిగి, తూరుపు తెలతెలవారేముందు ఒక నిర్జనమైన, భయంకరమైన అడవిలో ప్రవేశించాడు.

విరిగిన గోడలలో చిట్టిరేగు, ఉత్తరేణి, కసింద, కోరింద పొదలు, తుప్పలు క్రిందికి పెరిగి ఉన్నాయ్. వాటిక్రింద కూలిన గోడలకున్న బొరియలలో పందికొక్కులు బొరియలు చేసుకుని గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయ్. పాడుబడ్డ బావులు, ఎండిన చెత్త, పెంట దుర్గంధాన్ని వెలువరిస్తున్నది. ఆ చెత్త చాటున, ఆ పొదల మధ్యన కడుపు ఎండి నకనక లాడుతున్న అడవిపిల్లులు చిన్న జంతువులకోసం మాటు వేసి చూస్తున్నాయ్. ఎటు చూసినా శిథిలమైన గోడలు, పొదలు, దుర్గంధం, క్షుద్ర జంతువులు, ఉన్న చిట్టడవిని దాటాడు. దారి తెలియక తిరుగుతున్నాడు.

అపమార్గత నరుగుచు మా
ర్గపు ధామార్గవపుఁ గంటకంబులఁ గాళ్ళన్
విపరీతత నూడ్చుచు నే
రుపున నల్లేరు లీడ్చి త్రోయుచుఁ జనుచున్

అలా దారి తప్పి, ఉత్తరేణి ముళ్ళు, పల్లేరు కాయలు కాళ్ళలో గుచ్చుకుని సలుపుతుంటే వాటిని కిందికి తుడిచి, దులిపి, వదిలించుకుంటూ, తీసి పారేస్తూ ఆగాగి కలయజూస్తూ, భయంకరమైన అడవిలోకి ప్రవేశించిన ఆ మాలదాసరి కనులకు ఎదురుగా ఒక భయంకరమైన దృశ్యం ఎదురయ్యింది.

కాంచెన్వైష్ణవుఁ డర్ధయోజన జటాఘూటోత్థశాఖోపశా
ఖాంచర్ఝూటచరన్మరుద్రయ దవీయః ప్రేషితోద్యచ్ఛదో
దంచత్కీటకృత వ్రణచ్ఛలన లిప్యాపాదితాధ్వన్యని
స్సంచారాత్తమహాఫలోపమఫలస్ఫాయ ద్వటక్ష్మాజమున్

ఒక బ్రహ్మాండమైన వటవృక్షాన్ని చూశాడు. దాని ఊడలు అర్ధయోజనము పొడవునా నేలకు దిగి వున్నాయి. యోజనం అన్నా, ఆమడ అన్నా నాలుగు క్రోసుల దూరం. క్రోసు అంటే రెండు మైళ్ళు. ఒకయోజనం అంటే ఎనిమిది మైళ్ళు అన్నమాట.

అర్ధ యోజనం అంటే నాలుగు మైళ్ళ పొడవు ఊడలే ఉన్నాయి, ఆ మఱ్ఱిచెట్టు అంత ఎత్తున్నదన్నమాట. ఆ ఊడలకు అనేక శాఖోపశాఖలుగా యింకా ఊడలు పెరిగి ఉన్నాయి. వాటికి పురుగులు తొలిచి కన్నాలు చేసిన ఆకులు గాలికి విడి ఎగురుతున్నాయి. ఆ ఆకులమీద పురుగులు తొలిచిన కన్నాలు, గీతలు చూడడానికి ఆ మఱ్రిచెట్టు తన ఆకులు అనే కాగితాలమీద 'ఈ వృక్షం మీద బ్రహ్మరాక్షసి ఉన్నది' అని సమాచారాన్ని చేరవేయడానికి వ్రాసిన ఉత్తరాలలా ఉన్నాయి. దారిన వెళ్ళే పథికులకు బ్రహ్మరాక్షసుడు ఉన్నాడిక్కడ, యిటు రాకండి అని హెచ్చరించి వారి ప్రాణాలను కాపాడిన పుణ్య ఫలంగానేమో అన్నట్లు పెద్ద ఫలములు ఉన్నాయి మఱ్రిచెట్టుకు. అలాంటి భీతావహమైన మఱ్రిచెట్టును చూశాడు దారితప్పిన ఆ భక్తుడు.

కాంచి యాతఁ డొక్క కాలి త్రోవయు నంతఁ
గాంచి యందుఁ దెరువుఁ గాంచినదియ
పరమలబ్ధి గాఁగఁ ద్వరితంపుగతి నవ్వ
టావనీజ మంత నంతఁ గదిసి

ఆ భయంకరమైన మర్రిచెట్టును చూశాడు అతను. ఆ చెట్టువద్దకు వెళ్తున్న ఒక కాలిబాటను కూడా చూశాడు. ఏ దారీ తెలియకుండా తిరుగుతున్నాడు కనుక అంత భయంకరమైన చెట్టువద్దకు వెళ్తున్న కాలిదారిని కూడా 'యిదే మహా ఫలం' యిదే ఒక అదృష్టం అనుకుని ఆ కాలిబాటగుండా చెట్టుకు దగ్గరకు వెళ్ళాడు. అక్కడ యింకా భీతావహమైన దృశ్యాన్ని చూశాడు.

ఎలనీటి బొండలంబులువోలె మెదడెల్ల / జుఱ్ఱి వైచిన డొల్లు పుఱ్ఱెగములు
నెఱచి గీఱిన జీర లేర్పడఁ దుదముట్టఁ / జీఁకిన నులిపచ్చి కీకసములు
దొనదొనమను నీఁగె తుట్టెల రూ పేఱు / పరక క్రంపలను వ్రేలెడు గరుసులు
ధూళ్ళ మక్కెక్కి మంగళ్ళతిప్పలు రేఁగు / వడువున గాలి నాడెడు వెఱకలుఁ

దునిసిన నరాంగకములఁ బొత్తులను గమిచి
పోక యొండొంటితోఁ బిఱువీకులాడు
శ్వాపదంబులుఁ, బదహతి వ్రస్సి వలచు
పరుగు దఱచగు ముఱుత్రోవ నలిగె యెదుట

లేత కొబ్బరినీళ్ళను పీల్చేసి, పారేసిన కొబ్బరి బోండాల లాగా మెదడు మొత్తాన్ని పీల్చిపారేసిన డొల్లు పుర్రెలు పడి ఉన్నాయి. గీకి గీకి మాంసాన్ని మొత్తం పీల్చిన పచ్చి బొమికలు పడి ఉన్నాయి. కంపలమీద వ్రేళ్ళాడుతున్న పచ్చి చర్మపు ఖండాలు  కనిపించకుండా దొన దొన మని జోరీగలు ముసురుతున్నాయి. ధూళి కొట్టుకుని కనరెక్కిన మంగలి వాళ్ళ స్థలాలలో వెంట్రుకల కుప్పలు ఎగిరినట్లు, మానవ శరీరాలమీది రోమాలు, కేశాలు గాలికి ఎగురుతున్నాయి. మానవశరీరాల ఖండాలను కరిచిపట్టుకుని అక్కడినుండి కదలకుండా ఒకదానితో ఒకటి పెనగులాడుతున్న దుష్ట జంతువులు కనిపిస్తున్నాయి. కాళ్ళతో తన్ని పగిలి కంపు కొడుతున్న మాంసపు వరుగుల కుప్పలు కనిపిస్తున్న ఆ కాలిబాటవెంట ముందుకు వెళ్ళాడు ఆ భక్తుడు.

ముందరికాళ్ళమీద సాగిలపడి, పైకి దొంగచూపులు చూస్తూ, మాంసపు ఖండాలను ఎత్తుకుని పారిపోతున్న కుక్కలు కనిపిస్తున్నాయి. మాంసపు పోగులను కరుచుకున్న గ్రద్దలు కొమ్మలమీదినుండి ఎగిరిపోతున్నప్పుడు ఆ గాలికి దుర్వాసన వ్యాపిస్తుండగా ఆ గ్రద్దల అరుపులు వినిపిస్తున్నాయి. ఆ బ్రహ్మరాక్షసుడి దారికి అడ్డంగా వచ్చి, వాడి చేతి చరుపులకు నడుములమీద చేతులు పెట్టుకుని అరుస్తూ పారిపోతున్న కోతులు కనిపిస్తున్నాయి. యిదంతా చూస్తూ బిక్కు బిక్కుమంటూ, 'యిక్కడెవడో భయంకరుడు ఉన్నాడు, వాడు మనిషి గాడు, ఎలారా దేవుడా, వెనక్కు వెళ్ళాలన్నా చాలా దూరం' అనుకుంటూ ముందుకు వెళ్ళాడు ఆ భక్తుడు, దాసరి. వెళ్లి..

మృతమర్త్యు రెంటాన నిడ్డఁ జాలక నెత్రు / రంజిల్లు పెనుపొట్ట ముంజివానిఁ
బల్లచీమల వక్ర భల్లాతకియుఁబోలె / నెల్లి దుప్పటి నొప్పు కట్టెవాని
వ్యత్యస్త హస్తిమ స్తాభఁ బాయగు గడ్డ / మును దంష్ట్రికలుఁ బొల్చు మొగమువానిఁ
గడుఁదుర్ల నిడుత్రుట్టె గతిఁ జోఁగలోఁ బొండు / రత మించు కపిలకూర్చంబువాని

నెఱకుఁదెరువరిఁ గన శాఖ లెక్క జారు
ప్రేవుజందెంబుఁ గసరి పైఁ బెట్టువాని
వ్రేలు డగుబొజ్జ గల బూర కాలి వానిఁ
జెంబుతలవాని నవటుకచంబువాని

తనచేతిలోచచ్చినవాడి శవాన్ని గోచీలాగా పెట్టుకున్నవాడిని చూశాడు. గోచీగా ఆ శవం నిడివి చాలక, లాగి, లాగి మొలతాడులో దోపుకోవడంవల్ల ఆ శవం ఛిద్రమై ఒంటి నిండా రక్తం స్రవిస్తున్న భయంకరుడిని చూశాడు. ఎర్రచీమలు నిండా పాకుతున్న నల్లని జీడి చెట్టులా ఎర్రని దుప్పటిని కప్పుకున్న నల్లటి భయంకరాకారుడిని చూశాడు. ఏనుగు తలను తలకిందులు చేసినట్లు కోర దంతాలు పైకి పొడుచుకువచ్చి, నోటిక్రింద చాలా పెద్దదైన గడ్డంతో ఉన్న వికృత భయంకరాకారుడిని చూశాడు. కందిరీగల గుంపులా గుంటగా పాండువర్ణంలో ఉన్న నుదుటితో భయంకరంగా ఉన్నవాడిని చూశాడు.

'ఎర'కోసం, తిండికోసం దారినబోయే వాడెవడన్నా ఉన్నాడా అని చూడడం కోసం కొమ్మలమీదికి ఎక్కినపుడు జారిపోయిన ప్రేగుల జందెమును కసిరి తిట్టుకుంటూ భుజము మీదికి నెట్టుకుంటున్న వాడిని, వ్రేలాడుతున్న పొట్టతో,బూరల్లా ఉన్న కాళ్ళతో, చెంబులా నున్నగా ఉన్న తలతో ముచ్చెనగుంటలో జుట్టు ఉన్న వికృత భయంకరాకారుడిని చూశాడు ఆ భక్తుడు, మాల దాసరి.

కండకన్నులవాని, నాఁకటను బండు
తిట్ల బేతాళికల సారెఁ దిట్టువాని,
నగగరిమవాని, నన్వర్ధ నాముఁ, గుంభ
జాను వనునొక్కద్విజనిశాచరునిఁ గనియె

కళ్ళల్లో కండలు పెరిగిన వికృతాకారుడిని, ఆకలితో తోటి ఆడ దయ్యాలను మాటిమాటికీ బండబూతులు తిడుతున్నవాడిని, కొండలా ఉన్నవాడిని, కుండలవంటి మోకాళ్ళతో 'కుంభజానువు' అనే సార్ధక నామధేయుడైన ఒక బ్రహ్మరాక్షసుడిని చూశాడు భాగవతోత్తముడైన ఆ మాలదాసరి. వాడు కూడా యితడిని చూడనే చూశాడు.

వాఁడును గంటిఁ బోకు మని వ్రాలె మహీరుహాశి నుగ్గుగా
వీఁడును మున్ను రే వగటి వేళకు మానిసి యౌట, బోరిలో
వాఁడిమిఁ గొంతకాల మిల వ్రాలుట లావరి యౌట, నిల్చి యా
వాఁడి శరంబుచే నడువ వాఁ డది ద్రుంపుడు వీఁడు నుద్ధతిన్

వాడు కూడా వేడిని చూశాడు కనుక, 'పోకు' 'పోకు' అని అంటూ, అక్కడి నేలమీది చిన్ని చిన్ని చెట్లు, మొక్కలు నుగ్గు అయ్యేట్కుగా చెట్టుమీదినుండి నేలమీదకు దూకాడు. వీడు కూడా, అంటే ఈ మాలదాసరి కూడా, గతంలో రాత్రికీ పగటికీ తేడా లేకుండా ధైర్యంగా, శౌర్యంతో, యుద్ధ రంగంలో గడిపిన అనుభవము ఉన్నవాడు కనుక, మొండిగా, ధైర్యంగా నిలిచి, తన వద్దనున్న , చేతితో ప్రయోగించే బాణం లాంటి యినుప ఆయుధంతో 'వాడిని' అడిచాడు, కొట్టాడు. 'వాడు' ఆ పదునైన యినుప బాణం వంటి ఆయుధాన్ని విరిచేశాడు. 'వీడు' కూడా మొండిగా, ధైర్యంగా ముందుకు కదిలాడు, పోరాటంలో.

తిగిచిన నడుగులు దెమలక రొమ్మప్ప / ళించి యవ్వలికిఁ గేడించి దాఁటి
చఱచిన వంచించి చరమభాగమునకై / తిరిగి తత్క్రియకగు దృష్టి నిలిపి
పైఁబడ్డఁ జనుమఱి పట్ల కొడ్డుక యుండు / పిడికిళ్ల బలిమి లోఁ బడక నిలిచి
చొరఁజూడఁ గ్రుంకి ముష్టులబిగి కోటగాఁ / జొరవీక తిరిగెడు చోన తిరిగి

యసుర వధసాధనము రోయు నపుడు గ్రుద్ది
తొంచి తిరిగినఁ గృతముష్టి దండ నిలిచి
యెడకొలఁది వెనుక నడుమొయ్య నడిచి యడిచి
మత్పదస్మృతి యాత్మ నే మఱక యతఁడు

'తనను లాగి పడేయడానికి ఆ రాక్షసుడు ప్రయత్నిస్తుంటే తన అడుగులు కదలకుండా రొమ్ము విశాలంగా చేసుకుని తట్టుకున్నాడు. వాడు ఎగిరి తనను చరవడానికి ప్రయత్నిస్తే, వాడిని వంచించి తప్పుకుని వెనుకకు తిరిగాడు. వాడు మరలా తనను చరిచి పడేయడానికి ప్రయత్నిస్తే పిడికిళ్ళను గుండెలకు అడ్డు పెట్టుకుని కాచుకున్నాడు. వాడు వంగి తనమీదికి దూకడానికి ప్రయత్నిస్తే తానూ వంగి, పిడికిలి పోట్లతో కాచుకుంటూ వాడు ఎటు తిరిగితే అటు తాను తిరిగి కాచుకున్నాడు, వాడికి యే మాత్రమూ సందు యివ్వలేదు. యిలా కాదని తనను చంపడానికి, ఏ ఆయుధం కోసమో రాయో రప్పో కోసమో వాడు అటూ యిటూ కలయజూస్తూ వెదుకుతుంటే పిడికిలి పోట్లతో వాడిని హింసించాడు. వాడు వెనుకకు తిరిగినపుడు, తనవైపుకు తిరిగినపుడు, వంగినపుడు, సందు దొరికినపుడల్లా వీపుమీద, నడుము మీద పిడికిలి పోట్లతో వాడిని కుమ్మేశాడు. యింత పోరాటమూ చేస్తూనే నా పద ధ్యానాన్ని యేమాత్రమూ మరిచిపోలేదు ఆ మహాభక్తుడు' అని ఆ పోరాటాన్ని వర్ణించి చెబుతున్నాడు శ్రీమహావిష్ణువు, విష్ణుచిత్తులవారికి.

త్రోచి పోఁజూడఁ దన రాక్షసీచయంబు
నెల్లఁ జీరిన డిగ్గి వా రేగుదేరఁ
బోయె నదె వాఁడు రారె రారే యటంచుఁ
బాఱి వారును దానును బట్టికొనుఁడు

అలా పోరాటం చేస్తూ ఆ బ్రహ్మరాక్షసుడిని త్రోసి పారిపోవడానికి అతడు ప్రయత్నం చేస్తుంటే, ఆ బ్రహ్మరాక్షసుడు తన చెలికత్తెలను, ఆడ రాక్షసులను పెద్దగా పిలిచాడు. వాళ్ళూ ఊడిపడ్డారు. అదిగో వాడు పోతున్నాడు, పోతున్నాడు, రాండే అని అరుస్తూ మాలదాసరి వెంటబడి ఉరికి, అందరూ కలిసి మీదపడి, ఆ భక్తుడిని పట్టుకున్నారు.

పెంచో తద్దాసరి య
ప్లుం బదహతులను గహోణి పోటుల నిరుమై
లం బొడుచుచుఁ బెనఁగుచుఁ బో
వం బట్టి వటంబుఁ జేర్చి వాఁ డిట్లనియెన్

బాగా మదించి, బలంగా ఉన్న ఆ దాసరి అప్పుడుకూడా, అంతమందీ కలిసి మీదపడి తనను పట్టుకున్నప్పటికీ, రెండుప్రక్కలా కాళ్ళతో తంతూ, మోచేతులతో పొడుస్తూ పెనగులాడుతూ తప్పించుకుని పోవడానికి ప్రయత్నిస్తుంటే అతడిని పట్టుకుని, మఱ్ఱిచెట్టుకు చేర్చి యిలా అన్నాడు ఆ బ్రహ్మరాక్షసుడు.

సా రాస్వాదనఁ బ్రాణపంచకము తృష్ణంబాసి సంతర్పణ
న్మూరింబో నసిఁ ద్రుంచి పొంగెడు భవన్మండాస్రధారోష్మ మిం
పారం గ్రోలి పిశాచి నీదు కఱకు ట్లందీ నదస్థాలకాం
తారాంతర్నృకపాలకుండవిగళన్మేరేయముం గ్రోలెదన్

నీ కొవ్వును రుచి చూసి నా పంచప్రాణాలకూ తృప్తిని కలిగిస్తాను. నేను తృప్తిని పొందుతాను అనడంలేదు, వాడు వేరు, వాడి ప్రాణాలు వేరు, మామూలు రాక్షసుడు కాదు కదా, బ్రహ్మరాక్షసుడు. 'తను' వేరు, 'తన శరీరం' వేరు అన్న జ్ఞానం ఏడిసింది వాడికి! కత్తితో నీ పుచ్చెను చీల్చి వేడినెత్తురు కడుపారా త్రాగి, నా ఆడ పిశాచులు నీ మాంసపు ముక్కలను కడ్డీలకు గుచ్చి కాల్చి అందిస్తుంటే తింటూ, ఈ తాటితోపులో ఉన్న పుర్రెల కుండల్లో మద్యాన్ని నింపి అందిస్తుంటే త్రాగుతాను.

నన్నిం తలయించినఖలు
నిన్నున్ ఋజువిధి వధింతునే యని యార్చుల్
మి న్నందఁగ బుస కొట్టుచు
నన్నీచుఁడు పొగరు వెడలు నవ్యక్తోక్తిన్

నన్ను యింత యిబ్బంది పెట్టి అలిసిపోయేట్లు చేసిన నిన్ను మామూలుగా, సున్నితంగా చంపుతాను అనుకుంటున్నావా? అని ఆకాశానికి తాకేట్లు పెడబొబ్బలు పెడుతూ, నిట్టూర్పులు విడుస్తూ, గసపెడుతూ ఆ నీచుడు పిచ్చి పిచ్చిగా రంకెలు పెట్టాడు.

అసియుఁ బాత్రియుఁ దేఁ బంచి యాంత్రవల్లిఁ
గోలగగ్గెర ద్రోయ నక్కుజముతోడ
నొరగి రక్కసుతో దైన్యవిరహితముగ
ధర్మ మెఱిఁగించుసూక్తి నాతండు పలికె

తనను నరకడానికి కత్తిని, తన రక్తాన్ని పట్టడానికి పాత్రను తెమ్మని ఆ ఆడపిశాచాలను పంపించి, రెండుకాళ్ళకూ పశువులకు తగిలించినట్లు తాళ్ళు కట్టి(గోలగగ్గెర) నేలమీదికి తోసేయడంతో ఆ మఱ్ఱిచెట్టుకు జారగిలబడి, దైన్యముతో కాకుండా, ఒక ధర్మ సూక్ష్మాన్ని చెపుతున్నట్లు, ధైర్యంగా, తాపీగా యిలా అన్నాడు ఆ మహాభక్తుడు, సాహసి, ధైర్యవంతుడు అయిన మాలదాసరి.

ఆముక్తమాల్యదలోని చివరి, ఆరవ ఆశ్వాసంలో శ్రీమహావిష్ణువుచేత ఒక భక్తుడి కథను చెప్పిస్తున్నాడు శ్రీకృష్ణదేవరాయలు. నవరసాల కలబోతగా ఆ భక్తుడైన మాలదాసరి పాత్రను తీర్చిదిద్దాడు రాయలవారు. యింతవరకూ ఆతడి భక్తిని, బ్రహ్మరాక్షసుని భయానక బీభత్స సన్నివేశాన్ని, అతడినుండి తప్పించుకోవడానికి మాలదాసరి చేసిన పోరాటంలో శౌర్యాన్ని, పరాక్రమాన్ని, ధైర్యాన్ని, మాలదాసరి బ్రహ్మరాక్షసుల సంభాషణలలో హాస్యాన్ని చూపించాడు. యిప్పుడు మాలదాసరిలో లౌక్యాన్ని చూపిస్తున్నాడు. బ్రహ్మరాక్షసుడికి చిక్కి, కాళ్ళూ చేతులూ బంధింపబడి, మఱ్ఱి చెట్టుకు చేరగిలబడి మాలదాసరి యిలా అంటున్నాడు.

విను మొకమాట రాత్రిచర వేగిర మేటికి నిన్ జయింతురే
యనిమిషు లైన? భాజనగతాన్నమ నే నిఁక నెందుఁ బోయెదన్
బెనఁగక ప్రాణరక్షణ ముపేక్ష యొనర్చుట పాప మిందుకై
కనలకు నాకు మేనియెడఁ గాన్గయు లే దిది పోవుటే యురున్

ఓ రాత్రి చరుడా! ఎందుకు అలా తొందరపడుతున్నావు, ప్రయాసపడుతున్నావు? తినబడడానికి సిద్ధంగా ఉన్న అన్నాన్ని నేను, కంచంలో సిద్ధంగా ఉన్న ఆహారాన్ని తినడానికి అంత కంగారెందుకు? నేనెక్కడికి పోతాను? యింతవరకూ నీతో ఎందుకు పోరాడానో తెలుసా? ప్రాణములు భగవంతుడు యిచ్చిన వరం, అందునా మానవజన్మ, (అందునా శ్రీహరిదాసుని జన్మ!) అలాంటి జన్మను నిష్కారణంగా పోగుట్టుకోవడం, ప్రాణాలను నిలబెట్టుకోవడం కోసం కనీస ప్రయత్నం కూడా చేయకపోవడం మహాపాపం! అందుకోసం పోరాడాను, నా వంతు ప్రయత్నం చేశాను తప్ప, ఏదో నీలాంటి మహావీరుడిని జయించాలనే దురాశతో కాదు! దీనికి కోపం తెచ్చుకోకు సుమా! అసలు నాకు ఈ శరీరము మీద కాంక్ష కూడా లేదు, యిది పోవడమే మంచిది! అన్నాడు.

నెమ్మదిగా అనునయంగా మాటల్లో పెట్టి ఏదో ప్రయత్నం చేయడానికి లౌక్యంగా మాట్లాడుతున్నాడు. కానీ అందులోనూ ధర్మ సూక్ష్మాన్ని చెబుతున్నాడు. తన దగ్గరికి కార్యార్థియై వచ్చిన శత్రువును చంపడం, అవకాశం వుండీ ప్రాణాలను కాపాడుకునే ప్రయత్నం చేయడం, ఈ రెండూ ఆత్మహత్యతో సమానం, అందుకు ఫలితం 'రౌరవ' నరకానికి పోవడం! యేవో కారణాల పేరుతో ఆత్మహత్యలు చేసుకుందామనుకునేవారుఈ పలుకులను గమనించాలి.

హీనజన్మ మఱుట యెవ్వఁడే నొక ప్రాణి
సంతసిలుట ముక్తి పొంత గనుట
మేలెకాదె శిబియ మేల్బంతిగాఁడె న
శ్వరపుదేహ మిమ్మి పరము గొనుట

ఈ హీన జన్మను, ఎవరికీ ఉపయోగపడని జన్మను పోగొట్టుకోవడం, తద్వారా వేరే ఎవరికైనా సంతోషాన్ని కలిగించడం, ఆ కారణంగా ముక్తిని పొందడం మేలు కాదూ? అశాశ్వతమైన శరీరాన్ని యిచ్చి, ముక్తిని తీసుకోవడంలో శిబిచక్రవర్తి అందరికీ మార్గదర్శకుడు కాదూ? నీ ఆకలి తీర్చడంకోసం నీకు ఆహారాన్ని కావడం, అలా నీకు సంతోషాన్ని కలిగించడం అంటే ముక్తిని పొందడం కదూ!

తెవు లయినం, గ్రహం బయినఁ, దే లయినం, గర మైన, నాత్మ పెం
దెవు లయిన, న్జలం బయినఁ, దెక్కలియైన, మృగాగ్నులైన, మే
ల్తవు లయిన, న్వ్రణం బయినఁ, ద్రా చయినన్బిడుఁ గైనఁ, దీర్చువే
లవ తను వూరకే చెడ కిల న్గ్నశు నొక్కనిఁ బ్రోచు టొప్పదే?

వ్యాధిచేతనో, గ్రహ పిశాచాదులచేతనో, తేలు వల్లనో, విషము (తినడం) వల్లనో, పెద్ద మనోవ్యాధిచేతనో, నీటిలో మునిగిపోవడం వల్లనో, దోపిడీగాళ్ళ చేతిలోనో, క్రూరమృగాల వల్లనో, అగ్నిలో కాలిపోవడం వల్లనో, ఆడదానికోసమో, డబ్బుకోసమో, పుండువల్లనో, త్రాచుపాము కరవడంవల్లనో, పిడుగు పడడంవల్లనో, పోయేకాలం యిలా యెలానో వచ్చి ఈ శరీరం నశించిపోవడం కంటే, పాపం! నీలా ఆకలి బాధచే కృశించిపోతున్నవారిని కరుణించి, వారికి ఆహారమై చనిపోవడం మంచిది కాదూ? అన్నాడు.

'చండాలా దుదకాత్ సర్పాత్ వైద్యుతాత్ బ్రాహ్మణాదపి దంష్ట్రిభ్యశ్చ పశుభ్యశ్చ మరణం పాప కారణాత్' అని ఆర్యోక్తి. వికృతమైన మనసుతో చండాలుడు అని దూరంగా పెట్టినవాడిచేత, నీటిచేత, సర్పంచేత, విద్యుత్తు(పిడుగు)చేత, బ్రాహ్మణుడి కారణంగా, కోరలున్న మృగాలు, మొసళ్ళు మొదలైన వాటిచేత, పశువులచేత మరణించడం పాపం వలన జరుగుతుంది అని. యెందుకంటే వీరు అందరూ, యివన్నీ కూడా తమ మానాన తాము ఉండేవి, అనవసరంగా ముందుజాగ్రత్తలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా ఉండడం వల్లనో, ద్రోహము, హాని తలపెట్టడం వల్లనో తప్ప వీటి వలన, వీరి వలన మరణం

రాదు అని తాత్పర్యం. అలా పాపకారణంగా చనిపోవడంకంటే నీకు ఆహారాన్నై పుణ్యం చేసి, ఆ పుణ్య కారణంగా మరణించడం మంచిది కదా అని పలికిస్తున్నాడు మాలదాసరితో.

అది సరే, యింకొక హితవు చెబుతాను, అది కూడా నేనేదో ప్రాణభయంతో చెబుతున్న మాటగా భావించకుండా విను. ఒకవేళ నువ్వు వినకున్నా, యితర ప్రాణుల హితం కోరి చెప్పే మాటలకు భగవంతుడు మెచ్చుకుంటాడు కనుక పర్లేదు, నాకేమీ నష్టం లేదు. నువ్వు మామూలు మృగానివో, క్రూరమృగానివో, విష కీటకానివో, లేదూ, నాలాంటి మామూలు మనిషివో కాదు. మామూలు రాక్షసుడివి కూడా కావు, 'బ్రహ్మ రాక్షసుడివి'! అలాంటి నీకు మలమూత్రాదులకు నిలయమైన నా మానవశరీరం తిండి ఏమిటి? అదీ కాక, నీ పూర్వీకులైన హిరణ్యకశిపుడు, రావణాసురుడు మొదలైన వారు దేవతలను జయించి కూడా చివరికి యముడి చేతిలో చిక్కి చనిపోలేదూ? యిక్కడ నువ్వు బలవంతుడివి అయితే, అక్కడ, వాడు, యముడు బలవంతుడు కదా! యింత జుగుప్సకు నిలయమైన మనవశరీరాన్ని జయించి, తిని, నువ్వు శాశ్వతంగా బ్రతికేవాడివి కావు కదా? ఎందుకు ఈ అసహ్యకరమైన తిండి చెప్పు? అన్నాడు. వాడి మేలుకోరి చెబుతున్నట్లు చెబుతున్నాడు, నన్ను కరుణించి విడిచిపెట్టవయ్యా అనడం లేదు, అదీ మాలదాసరి గడుసుదనం. ఆ మాటలకు పెద్దగా నవ్వి ఆ బ్రహ్మరాక్షసుడు యిలా అన్నాడు.

చంపకు చదువుల మేము ప
ఠింపని శాస్త్రములె? మా పఠింపని శ్రుతులే?
యింప వవి నమ్మవే 'బ్రథ
మాం పిపతే వహ్ని'యను మాటవుఁ గాదే

నీ చదువులతో, నీ పాండిత్యముతో నన్ను చంపకురా! నేను చదువని శాస్త్రాలా? శ్రుతులా? అవేవీ నాకు రుచించవు. ముందు జఠరాగ్నిని చల్లార్చుకోవాలి, ఆకలి తీర్చుకోవడమే జీవుల ప్రథమ కర్తవ్యము అని చెప్పలేదూ?

నిలు మోహో మము వారి భ్రాతలనుచున్ నీవంటి వారల్సుధా
శు లపూతాశులుగా రటంటి ప్రతిప త్సోమాంశము న్గ్రోలు మున్
జ్వలనుం డం టిఁక నొండు ని న్నడిగెదన్ సర్వాశిగాఁడా యతం
డిలఁ దన్న్యాయము చాలు మాకు నఘ మే వృద్ధానుచారంబిఁకన్?

ఆగాగు! మా బ్రహ్మరాక్షలు హిరణ్యాక్షుడు, హిరణ్యకశిపుడు, రావణుడు మొదలైన వారి భ్రాతలు అన్నావు, నావంటివారు అపవిత్రమైన ఆహారం తీసుకోరు అన్నావు, అగ్నిదేవుడు పాడ్యమినాటి చంద్రకళను, వెన్నెలను ఆహారంగా తీసుకుంటాడు అన్నావు, హహహ, ఆ అగ్నిదేవుడు యిదీ అదీ అని చూడకుండా అన్నిటినీ భక్షించేవాడు కాదూ? ఆ విషయం చాలు మాకు, పెద్దలు అనుసరించిన మార్గాన్నే మేమూ అనుసరిస్తున్నాము, అదీ యిదీ అని లేదు, అన్నీ తింటాము, అదేమైనా తప్పవుతుందా ఏమిటి?

హరికి సఖుఁడును రథమును నగు గరుడుడు
దొరకినమృతంబు సురలకు మరలనిచ్చి
యహులు కూడుగ వరమున నడిగి కొనఁడె?
యమృత మైనను జవుల జాత్యన్నసమమె?

సాక్షాత్తూ శ్రీహరికి చెలికాడు, వాహనము ఐన గరుడుడు తను దొరికించుకున్న అమృతాన్ని దేవతలకు తిరిగి యిచ్చి, క్షుద్ర జీవులైన సర్పములను ఆహారంగా యిమ్మని వారము అడిగి, ఆ పాములనే తిని బ్రతకడంలేదూ? ఏ జాతికి తగిన ఆహారం ముందు ఆ జాతికి అమృతమైనా సరే, రుచికరంగా ఉంటుందా? ఉండదు!

నిదురయుఁ గూడుఁ బోఁ జదివి నే నిటఁ గన్నది ఏమి ఎవ్వఁ డీ
చదువుల యర్థవాదపుమృష ల్విని బేల్పడు నీవు మాయెడం
జదువుల మాటలాడి కనఁ జాల వొకానొక మెచ్చు నొక్కఁ డీ
చదివినకూర వింతచవి చాలఁగఁ దెమ్మను మెచ్చు తక్కఁగన్

నిద్ర, తిండి లేకుండా చదివీ, చదివీ ఎవడైనా బావుకున్నది యేమిటటా? చదువుల అర్థాలు, శాస్త్రవాదాలు అనే కల్ల మాటలు విని 'బేలుపోయేవాడు', మోసపోయేవాడు ఎవడుంటాడు? చదువులు, శాస్త్రాలు అని ప్రసంగం చేసి, నువ్వు మామూలు కూర కాకుండా, చదివిన కూరవు ఐనావు నాకు. యింకా రుచిగా ఉంటావు! చదివిన కూరను సరిపోయేంత పెట్టుమని అడిగి లొట్టలేస్తూ మరీ తింటాను, ఈ శస్త్ర ప్రసంగం వలన నీకు ఏ ప్రశంసలూ రావు, నువ్వు తప్పించుకుని పోనూ లేవు అన్నాడు బ్రహ్మరాక్షసుడు.

ప్రఖ్యాతుండవు దైత్యులందు మును పాపైనొక్క నీకా యశో
భిఖ్యన్నేనును జేర్తు మే యొసఁగుఁ దప్పింపవ్రతం బొక్కఁడే
ముఖ్యం బై యొనరింతు దాని సఫలంబున్జేయఁగా లేవుగా
'సఖ్యం సాప్తపదీన' మన్మన మిథ స్సాజ్ఞత్య మూహించుచున్

యిదివరకే నువ్వు రాక్షసులందు ప్రఖ్యాతి చెందినవాడవు. అటువంటి నీకు మరొక కీర్తిని కలిగిస్తాను నేను. నీకు నా శరీరాన్ని సమర్పణం చేయడం అనే విషయాన్ని భంగం చేయకుండా, నా వ్రతాన్ని పూర్తి చేసుకోడానికి అవకాశము కల్పించిన కీర్తిని నీకు కలిగిస్తాను. సఖ్యం సాప్త పదీనం, అంటే ఏడడుగులు కలిసి నడిస్తే చాలు సఖ్యత కలిగినట్లే అన్నమాట నీకు తెలిసినదేగా, మనము ఇద్దరమూ యిప్పుడు స్నేహితులము అయినాము, ఏడు అడుగులు కలిసి వేసిన కారణంగా. ఆ స్నేహబంధాన్ని గుర్తించి, నా వ్రతము నొకదానిని పూర్తి చేసుకునే అవకాశాన్ని యివ్వలేవా? ఏమిటా వ్రతము అంటే..

ఈ కుఱఁగటి యీ కురుఁగుడి
వైకుంఠునిఁ బాడి వత్తు వ్రతముగఁ దత్సే
వాకృతి కడపట నాశనము
నీ కౌదు న్మఖ్య మిదియ నేఁ డగుతుదకున్

ఈ సమీపములోనే ఉన్న కురుగుడి (తిరుక్కురుంగుడి) లో వెలిసియున్న విష్ణుని కీర్తనలు పాడి, ఆయన సేవజేసి వస్తాను ప్రతిరోజూ, అది నా వ్రతము. ఈ రోజు కూడా అలాగే నా వ్రతము పూర్తి చేసుకుని వచ్చి, నీకు ఆహారాన్ని అవుతాను. అలా అయితే వ్రత సమాప్తి చేసుకున్నతర్వాత మరింత శ్రేష్ఠమైన ఆహారాన్ని అవుతాను, అలా నీకు మరింత రుచికరమైన ఆహారంగా అవుతాను. నువ్వు దయజేసి, నన్ను వదిలిపెట్టావంటే, ఈ రోజున నా చివరిసారిగా స్వామికి నా సంకీర్తనతో సేవజేసుకుని మరలా వచ్చి నీకు ఆహారాన్ని అవుతాను, నన్ను కనికరించి వదిలిపెట్టవయ్యా అని అడిగాడు మాలదాసరి.

ఆ మాటలకు కిలకిల నవ్వి, దాసరి చెంపలమీద పరిహాసముగా చరిచి, 'లెస్స పండించితివిరా దాసరీ! నానా దారులూ కొట్టి, నిన్న, మొన్ననే మహా విరాగివి, భక్తుడివి అయి ఉంటావు. నీ లౌక్యముతో నన్ను బురిడీ కొట్టించి, ఉచ్చు కొరికి పారిపోయే జంతువులాగా, తప్పించుకునిపోదామని ఎత్తులు వేస్తున్నావా? అంత తెలివితక్కువ వాడిలా కనిపిస్తున్నానా నేను?

ఏరాజ్యంబునరుండు నోరికడివో నీబోధ మాలించు? నిం
కేరాజ్యంబు నరుండు బాసకయి మే నీఁ దాన యేతెంచుఁ దీ
పార న్నేఁ జననీమియు న్మగిడి నీ వారామియుం దెల్ల మే

లా రంతుల్పలు పల్కు లంత్యకుల యేలా చింత లేలా వగల్?

ఏ తిక్క దేశంలోని యే పిచ్చి మనిషి నోటిదగ్గరి కూడును వదిలిపెట్టుకోడానికి నీ బోధలు, నీ మాటలు వింటాడు? ఇంకే తిక్క రాజ్యంలోని పిచ్చి మనిషి మాటను నిలబెట్టుకోడానికని శరీరాన్ని యివ్వడానికి తనంత తానే వెనక్కు తిరిగివస్తాడు? తియ్యగా నేను వదిలిపెట్టడమూ జరిగేది కాదు, ఒక వేళనేను వదిలిపెట్టినా మళ్ళీ నువ్వు రావడమూ జరిగేది కాదు, ఎందుకురా రచ్చ చేస్తావు? ఓరి చండాలుడా! ఎందుకీ ఆలోచనలు, ఎందుకీ మాటలు? అన్నాడు పరిహాసంగా, బ్రహ్మరాక్షసుడు.

అనినఁ జెవి మూసి నారాయణా యటంచు
నతఁడు నను నమ్మవేఁ బిశితాశి యొక్క
శపథమున నమ్ము మని వాఁడు సమ్మతింప
వేనవే ల్సత్యములు వల్కి వినకయున్న

బ్రహ్మరాక్షసుని మాటలకు రెండు చెవులూ మూసుకుని ' నారాయణ! నన్ను నమ్ముమయ్యా రాక్షస కులేశ్వరా! కావాలంటే శపథం చేస్తాను, ప్రమాణం చేస్తాను' అని వేలవేల సత్యములను ప్రమాణంగా పలికి, అప్పటికీ వాడు నమ్మకపోవడంతో

ఎవ్వనిచూడ్కిఁ జేసి జనియించు జగంబు వసించు నిజ్జగం
బెవ్వనియందు డిందు మఱి యెవ్వనియం దిది యట్టి విష్ణుతో
నివ్వల నొక్క వేల్పు గణియించిన పాతకి నౌదు నేఁడ నే
నెవ్విధినైన ని న్గదియనేని యన న్విని బంధ మూడ్చినన్

రాక్షసరాజా! రంగదాసులు అసత్యము లాడగలరా? నేను నీకు యిచ్చిన మాటను తప్పి, మరలా రాకపోతినా, ఎవరి చల్లని చూపులచేత ఈ సమస్త ప్రపంచమూ పుడుతుందో, ఎవనియందు యిది స్థిరంగా నెలకొని యుంటుందో, చివరికి ఎవరిలో లీనమవుతుందో, ఆ మహావిష్ణువుతో సమానుడైన వేరు దైవము ఉన్నాడు అని భావించిన, పలికిన మహా పాతకుడిని అవుతాను, నా పలుకులను విశ్వసించుమయ్యా! నన్ను విడిచి పెట్టుమయ్యా అని పలుకగానే, అప్పుడు ఆతని పలుకులను విశ్వసించి, ఆతని బంధనాలను విడిపించాడు బ్రహ్మరాక్షసుడు.

వాడు మామూలు రాక్షసుడు కాదు, బ్రహ్మరాక్షసుడు, అంటే వాడికీ ఉపాసనలు, విశ్వాసాలు మొదలైనవి ఉన్నాయి. ఆ మాలదాసరి మహాభాగవతుడు అని ఈ పాటికే గ్రహించాడు. మహా వైష్ణవుడు అనీ గ్రహించాడు. ఎన్ని ప్రమాణాలు చేసినా నమ్మనివాడు, 'నా దైవము ఐన శ్రీ మహావిష్ణువును యితరులతో పోల్చిన మహా పాపిని అవుతాను, తిరిగి రాకుంటే' అని పలుకగానే వదిలిపెట్టాడు, యిదొక విచిత్రము అయితే, ఈ పద్యము మొత్తమూ పోతన మహానుభావుని 'ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపల నుండు లీనమై యెవ్వని యందు డిందు' అన్న జగత్ప్రసిద్ధమైన పద్యానికి అనుకరణగా చేశాడు రాయలవారు. అది ఆయనకు పోతనమీద ఉన్న భక్తికీ, తనకు పూర్వకవులు అందరినీ క్షుణ్ణంగా చదువుకున్నవాడు అన్న సత్యానికీ నిదర్శన! అంతకన్నా అద్భుతమైన ఒక విశేషము, ' గజేంద్ర మోక్షణ' సన్నివేశంలోని పద్యాన్నే తీసుకున్నాడు స్ఫూర్తిగా. దానికి కారణమైన రసరమ్యమైన రహస్యాన్ని వచ్చేసంచికలో తెలుసుకుందాము.

ఆముక్తమాల్యద ఆరవ ఆశ్వాసములో అమూల్యమైన సందేశాత్మకమైన మాలదాసరి కథను చెప్తున్నాడు శ్రీకృష్ణదేవరాయ కవిచక్రవర్తి. మాలదాసరి కథకే మరొక పేరు కూడా ఉన్నది. 'కైశికీ ద్వాదశి'కథ అని ఆ పేరు. మాలదాసరి-బ్రహ్మరాక్షసుల సంవాదము అనే కథను శ్రీకృష్ణదేవరాయలు వేదవ్యాసముని ప్రోక్తమైన 'వరాహ పురాణం'నుండి తీసుకున్నాడు.

వరాహ పురాణంలో నలభై నాలుగవ సర్గలో వరాహస్వామి భూదేవితో తన భక్తుల ప్రభావాన్ని, తన ఉపాసనా ప్రభావాన్ని చెప్తూ ఈ కథను చెబుతాడు. ఒక కార్తీక శుక్ల ద్వాదశి రాత్రి మహాభక్తుడైన మాలదాసరి, ఎప్పటిలాగే స్వామిని సేవించడానికి వెళ్తూ బ్రహ్మరాక్షసునికి చిక్కి, వాడిని నానా విధాలుగా బ్రతిమిలాడుకుని, చివరికి, 'నేను మరలా తిరి రాకుంటే శ్రీహరితో సమానుడైన దైవము కలదు అని పలికిన మహా పాపిని అవుతాను' అని ఒట్టు వేసి, బంధ విముక్తుడై వెళ్లి, ఆ ద్వాదశి రాత్రి అంతా జాగారం చేసి, స్వామిని కీర్తించి సేవజేసి, తిరిగి బ్రహ్మరాక్షసుడి వద్దకు వస్తాడు. అతడి సత్య నిష్ఠకు ఆశ్చర్యపోయిన బ్రహ్మరాక్షసుడు ఆతని పాదాలమీద పడి, ఆనాటి కీర్తనా ఫలితాన్ని పొంది, ఆ బ్రహ్మరాక్షస రూపం నుండి విముక్తుడు అవుతాడు. కైశికీ రాగంలో స్వామిని కీర్తించిన ఆ ద్వాదశి నాటి పుణ్య సేవాఫలంగా బ్రహ్మరాక్షసుడు విముక్తుడైన ద్వాదశి కనుక అది కైశికీ ద్వాదశి.

ఆముక్తమాల్యద ప్రధాన కథతో ఈ కథకు ఎక్కడా సంబంధం లేదు. కానీ శ్రీకృష్ణదేవరాయలు 'కులం కన్నా గుణం మిన్న' అని చెప్పడం కోసం, పరమాత్ముని దృష్టిలో ఉత్తమ శీలం కలవాడే ఉత్తమ కులానికి చెందినవాడు అని చెప్పడం కోసం ఈ కథను జొప్పించాడు. వరాహపురాణంలో ఈ కథను శ్రీహరి భూదేవితో చెప్పాడు. ఇక్కడ, ఆముక్తమాల్యదలో ఈ కథను శ్రీహరి 'భూదేవి తండ్రికి' చెప్పాడు, అది ఒక చమత్కారం అయితే, ఈ కథను విశిష్టాద్వైత సంప్రదాయంతో ముడిపెట్టి, కొన్ని కల్పనలు, కొంత స్వతంత్రత జోడించి 'సత్యపాలన'ను మించిన సచ్ఛీలము లేదు అని సందేశాన్ని యిచ్చాడు. ప్రతీకాత్మకంగా చూస్తే 'గజేంద్ర మోక్షం'కథ ఒకటి మాత్రమే ఈ కథతో సరితూగ గలిగిన కథ, భారతీయ ఆధ్యాత్మిక సారస్వతంలో, అల్పమాత్ర ప్రజ్ఞుడైన ఈ వ్యాసకర్త ఉద్దేశంలో.

అక్కడ ఏనుగు మొసలికి చిక్కింది. ఇక్కడ మాలదాసరి బ్రహ్మరాక్షసుడికి చిక్కాడు. ఏనుగు, మాలదాసరి యిద్దరూ మహా భక్తులే. మొదలు యిద్దరూ స్వప్రయత్నం చేసి,ఓడిపోయారు. చివరికిద్దరూ శ్రీహరినే నమ్ముకున్నారు. ఐశ్వర్యము, మదము, కామము,భవబంధాలు అన్నిటికీ ప్రతీక ఐన మొసలిని జ్ఞానానికి, వెలుగుకు ప్రతీక ఐన 'శ్రీహరి చక్రం' ఖండించింది, 'జీవుడు' అనే ఏనుగు చివరికి విముక్తిని పొందింది. నా ధైర్యము, నా శౌర్యము,నా లౌక్యము, నా ప్రయత్నము అనే అజ్ఞానపు బంధంలో యిరుక్కున్న మాలదాసరికి 'ప్రపత్తి' మార్గము అనే జ్ఞాన సుదర్శన ప్రభలు బంధవిముక్తిని కలిగించి, తాను విముక్తుడు కావడం మాత్రమే కాక, మరొక జీవిని, బ్రహ్మరాక్షసుడిని ముక్తుడిని చేసే శక్తిని ప్రసాదించాయి.

ఒకసారి నువ్వున్నావని నమ్ముకున్న తర్వాత, నీకు సమర్పించుకున్న తర్వాత, యిక నేను-నా ప్రయత్నము-నా ఆరాటము-నా పోరాటము ఏదీ లేదు, పాల ముంచినా నీట ముంచినా భారము నీదే, ఫలితమూ నీదే, కర్తవు, కర్మవు, క్రియవు, భోక్తవు అన్నీ నువ్వే, అని నిశ్చింతగా నమ్ముకుని పడి ఉండడమే ఉత్తమమైన మార్గం, ప్రపత్తి మార్గం.

అది 'తెలిసిన' ప్రహ్లాదుడు రక్షింపబడ్డాడు. దాన్ని 'తెలుసుకున్న తర్వాత' విభీషణుడు, ఏనుగు, పాంచాలి, అహల్య, ధ్రువుడు రక్షింపబడ్డారు. మాలదాసరి కూడా అది తెలుసుకున్న తర్వాత, నిశ్చింతగా బ్రహ్మరాక్షసుడి వద్దకు తిరిగి వెళ్లి వాడికి ఆహారంగా మారడానికి సంసిద్ధుడైనాడు. తాను రక్షింపబడడమే కాకుండా, తనను చంపి తినేయాలనుకున్న బ్రహ్మరాక్షసుడినీ భయంకరమైన ఆ జన్మనుండి రక్షించాడు! ఆ రకంగా చూస్తే మాలదాసరి ఒక పిసరు ఎక్కువే, ఏనుగుకన్నా! విశిష్టాద్వైత మార్గంలో, వైష్ణవమార్గంలో భక్తుడు, భాగవతుడు భగవంతుడితో సమానుడు. భాగవత సేవ భగవత్సేవకన్నా మరీ పుణ్యప్రదం అని చెబుతుంది సంప్రదాయం. భాగవతోత్తముడైన మాలదాసరి బ్రహ్మరాక్షసుడిని రక్షించగలిగాడు.

కండబలం, మందబలం తప్ప బుద్ధిబలం లేని జంతువైన ఏనుగు, సామాజికంగా నిమ్నకులానికి చెందిన సామాన్యుడు మాలదాసరి, ఇద్దరూ ఏ ప్రత్యేకతలూ లేనివారే, శ్రీహరి భక్తి, ప్రపత్తి అనే ప్రత్యేక పెన్నిధి తప్ప. చివరికి ఆ పెన్నిధియే వారికి అక్కరకొచ్చింది. కేవలం భక్తి మాత్రమే కాదు, సత్యవ్రత నిష్ఠ కలిగిన మహానుభావుడు మాలదాసరి. తన బంధాలను తెంచుకోవాలని అనుకున్నది పరమాత్ముడి సేవకోసమే, అది నెరవేర్చుకుని వెనక్కు వెళ్లి తన

శరీరాన్ని త్యాగం చేయడానికి సిద్ధపడ్డ అపరదధీచి, ఆదర్శ మానవుడు మాలదాసరి. అటువంటి వారికి కుల, మత, వర్గ, ప్రాంత, లింగములనే తుచ్ఛపరిమితులు ఉండవు, వారు భూమి మీద సంచరించే దేవుళ్ళు అని భారతీయుల విశ్వాసం. ఉపనిషత్తులతో మొదలుకొని, భారతీయ ఇతిహాసాలు, పురాణాలు అన్నీ యిదే చెప్పాయి. 'చండాలోస్తు సతు ద్విజోస్తు గురురిత్యేషా మనీషా మమ..' అని, అన్నిటిలోనో, అందరిలోనూ, అంతటా భగవంతుడినే చూసే సమదర్శనుడు చండాలుడైనా మరెవడైనా, ఆతడే నా గురుదేవుడు అని ఆదిశంకరులు చెప్పినది ఆ సత్యాన్నే!

యిదివరకే ఎక్కడో ఉన్న కథను తీసుకొచ్చి వాడుకోవడం యేమి గొప్ప అనేవారు ఉండవచ్చు, అసలా కథను ప్రపంచానికి చెప్పాలి అనుకోవడమే మహా ఉపకారం, భారతీయ ఆలోచనా విధానాన్ని మరొకసారి చెప్పడానికి. కథ మాత్రమే కాక, కథనము, పాత్రల పోషణ, వర్ణన, చమత్కారం, లక్ష్యము యివి మాలదాసరి కథకు సాటి రాగలిగిన కథ ఎక్కడా, ఏ భాషలోనూ లేదు అని 'విశ్వనాథ'వారితో పలికించాయి.

బ్రహ్మరాక్షసుడు కట్లు విప్పదీయగానే పరుగు పరుగునా వెళ్లిపోయాడు మాలదాసరి.

*అతఁడు తదల్పపాపఫల మందుట సుంకము దీఱి పోయి త*
*చ్ఛతదళపత్త్ర నేత్రునకు జాఁగిలి మ్రొక్కి రణద్విపంచియై*
*స్తుతికలితప్రబంధములఁ జొక్కఁగఁ బాడి యసత్యభీభర*
*ద్రుతగతి వచ్చి రాత్రిచరుతో వ్రతపూర్తి గతార్తి నిట్లనున్*

ఆ మాలదాసరి యెప్పుడు, యే పాపము చేయడం వల్లనో ఫలితంగా కాబోలు, వచ్చిన ఆ బంధాలు తొలిగిపోయాయి. దాంతో ఎప్పటి పాపపు బాకీయో తీరిపోయింది బహుశా. వెళ్లి వేయిరేకుల పద్మములవంటి కన్నులున్న ఆ తిరు కురుంగుడి శ్రీహరికి సాగిలి నమస్కరించి, తన చిట్టి వీణను మీటుతూ, ఆనందంగా తాండవం చేస్తూ, స్తుతులతో కల్పించిన ప్రబంధములవంటి తన కీర్తనలతో స్వామిని కీర్తించి, సేవించి, ఆలస్యము అయితే, అసత్యము పలికాడీ దాసరి అని ఎక్కడ ఆ బ్రహ్మరాక్షసుడు అనుకుంటాడో అనే భయంతో, వేగంగా వెనక్కు తిరిగి వచ్చాడు, బ్రహ్మరాక్షసుని వద్దకు. వ్రతం పూర్తి చేసుకోవడం వలన దిగులు తొలిగిపోయి, ఆ బ్రహ్మరాక్షసుడితో యిలా అంటున్నాడు. బ్రతికి ఉండగా స్వామికి మేలుకొలుపులు పాడకుండా తెల్లవారకూడదు అనే వ్రతం నెరవేరింది, కనుక దిగులు తొలిగిపోయింది. అన్నమాట ప్రకారం ప్రాణాలను అర్పించడానికి, అది కూడా ఆలస్యము చేయకుండా వెనక్కు రావడం వలన, ఆడినమాట తప్పని వ్రతం కూడా పూర్తి అయింది, కనుక దిగులు తొలిగిపోయింది మాలదాసరికి, అని చమత్కరిస్తున్నాడు రాయలవారు.

*నీచెఱఁ బాసి పోయి రజనీచర చక్రిఁ భజింప ముక్తిపొం*
*దేచెర యే చెఱం దవుల నేనిఁక నుండగ జూడు పంచుచో*
*నే చరణం లేయుదర మేయుర మేశిర మేకరంబు లీ*
*వాచరణంబు లాయుదర మాయుర మాశిర మాకరంబులున్*

ఓ (రజనీచరా, నిశాచరా) రాక్షసేశ్వరా! నీ చెఱ నుండి తప్పించుకునిపోయి, ఆ చక్రధారి ఐన శ్రీహరిని కీర్తించడంవలన నాకు ముక్తిపొందు దగ్గరైంది. ఆయన సేవతోటీ, సత్యవ్రత నిష్ఠా పాలనంతోటీ, ఆకలిగొన్న వానికి భోజనపాత్రుడిని కావడంతోటీ నాకు ముక్తి పొందు హెచ్చు ఐంది. ఇక యే చెరలో, ఏ బంధాలలో నేను చిక్కను. యిదిగో, చూడు, నన్ను నువ్వు పంపేప్పుడు ఎలా వెళ్ళానో అలానే వచ్చాను. 'నీ'శరీరాన్ని 'నీ'కోసం భద్రంగా తెచ్చాను. నువ్వు పంపేప్పుడు ఏ కాళ్ళు, ఏ ఉదరము, ఏ రొమ్ము, ఏ తల, ఏ చేతులు, ఎలా ఉన్నాయో, ఆ కాళ్ళు, ఆ ఉదరము, ఆ రొమ్ము, ఆ తల, ఆ చేతులు అలాగే నిక్షేపంగా ఉన్నాయి, ఏమీ దాచుకోకుండా వచ్చాను, యిక ఈ శరీరం నీది, నీ యిష్టం, ఎలా తింటావో ఏమంటావో .. అన్నాడు మాలదాసరి. ఏ మాత్రమూ బాధ, భయము లేకుండా, అన్ని బాధలు, బరువులు, బాకీలు తీరినవాడిలాగా .. సంతోషంగా, ఉత్సాహంగా, సరదాగా సల్లాపాలాడుతున్నట్లు ' యిక నన్ను తినేసి నీ ఆకలి తీర్చుకో' అన్నాడు మాలదాసరి!

*అనినఁ దత్సత్యమునకు నేత్రాంబు లురలఁ*
*బ్రమద పులకితగాత్రుఁడై పాఱు టసుర*
*యినుని మధ్యందినపుటెండ తనదు పెద్ద*
*బట్టతల మించఁ బ్లవు జేరఁ బాఱుతెంచి*

మాలదాసరి అలా పలుకగానే ఆతని సత్యవ్రత పాలనకు ఆశ్చర్యము, ఆనందము కలిగి, శరీరము పులకలెత్తి, కనులవెంట ఆనందబాష్పాలు రాలుస్తూ, మధ్యాహ్నపు సూర్యుని ఎండ తన బట్టతల మీద పది తళతళ మెరుస్తుండగా, ఆ మాలదాసరిని పరుగెత్తుతూ సమీపించాడు బ్రహ్మరాక్షసుడు.

*కొండయుఁబోలె భక్తి వల గొంచునె వాఁడునిజద్రుమభ్రమీ*
*హిండన వ్రాలుపాకాలపు టేనుఁగుఁబోలె నొసల్తదంఘ్రులం*
*దుండ రొదన్మహాగిరులు హోరనఁ బ్రస్తుతి వ్రాలి దంష్ట్రికా*
*దండము లెత్తి పట్టినపదం బొకఁడొక్కఁడ నెత్తిఁ జేర్చుచున్*

మాలదాసరిని సమీపించి, ఒక పెద్ద కొండలాగా శరీరం కదిలిపోతుండగా భక్తితో ప్రదక్షిణలు చేశాడు. 'పాకలము' అనే రోగము వచ్చిన మదపుటేనుగు తనను కట్టి ఉంచిన చెట్టు చుట్టూ తిరిగి తిరిగి నేలకు వ్రాలినట్లు పెద్ద ధ్వనితో నేలమీద మాలదాసరి పాదాల వద్ద పడిపోయాడు. ఏనుగులకు మదం ఎక్కువై, మాడు పగిలిపోయే పాకలం అనే రోగం వస్తుందిట, ఈ బ్రహ్మరాక్షసుడికి కూడా మదం పట్టింది యింతవరకూ. వాడి తల తిరిగేలా, మాడు పగిలేలా ఈ ఆశ్చర్యకరమైన సంఘటన జరిగింది. దాంతో ఆ ఏనుగు లాగే పడిపోయాడు, చెట్టువంటి మాలదాసరి పాదాల చెంత.

రాయలవారి లోకజ్ఞానానికి 'పాకలం' అనే రోగపు ప్రస్తావన ఒక చిహ్నము అయితే, చెట్టులాగే పరోపకారం కోసం సర్వస్వాన్నీ నిస్వార్థంగా అందించే మహానుభావుడు ఆ మాలదాసరి అని పోల్చి చెప్పడం రాయలవారికి మాత్రమే చెల్లిన రసగుళిక.

కొండలు 'హోరు'మనేట్లు బిగ్గరగా మాలదాసరిని పొగుడుతూ తన దండములవంటి దంతములను, కోరలను పైకెత్తి, తలపైకెత్తి, నీళ్ళు నిండిన కన్నులతో మాలదాసరినిచూస్తూ, ఆతని పాదాలను పట్టుకున్నాడు. ఒక్కొక్క పాదాన్నే మార్చి, మార్చి తన నెత్తిన పెట్టుకున్నాడు.

*ఈసర్వంసహ దేవదానవమహీ భృన్మౌనివాచాతప*
*ఃసర్వస్వము నేతదన్యకృతులం జెప్పంబడు న్గోర మా*
*నీసత్యం బురరీకృతాంత మిల నెం తే వృద్ధనై మంటి నే*
*నాసత్యం బీఁక నిన్నుఁబోలెఁ గృతసంధా ధూర్వహు ల్లేమికిన్*

ఈ సమస్త విశ్వములోని దేవతలు, దానవులు, చక్రవర్తులు, మునులు, ఎవ్వరిలోనూ నీ సత్యవాక్యపాలనము అనే తపస్సు లేదు. వారిది కేవలం వాచాతపస్సు మాత్రమే, చెప్పుకోడానికి మాత్రమే అది తపస్సు. వారి సత్యవాక్య పాలనం యితర విషయాలలో మాత్రమే ఉంటుంది, ఒకవేళ ఉన్నా, గిన్నా! యిలా తమ శరీరాన్ని సమర్పించుకునే విషయములో ఉండదు. భయంకరమైన నీ సత్యపు పరిధులను అంగీకరించి తీరాల్సిందే, ఎవరైనా! ఎంతోకాలమునుండి ఉన్నాను నేను. ఎంత చూశాను, ఎందరిని చూశాను! నీలాగా ఆడిన మాటను నిలబెట్టుకున్నవారు లేరు. నేను ప్రమాణపూర్వకంగా చెబుతున్నాను.

*ఇతరులు నీకు నీడె మఱి యాధృతి నీస్మృతి నీఋతేరిత*
*స్థితగతి నీమురారిపద సేవన జీవనవన్మతిన్ సమా*
*దృతకలగాన సింధు లహరీ ప్లవన ప్లవభావ భా గురు*
*శృతి తతబద్ధతుంబికి గురుంగుడినంబికృపావలంబికిన్*

ధైర్యములో, జ్ఞానములో, ఆడినమాటను నిలుపుకోవడంలో నీకు యితరులు ఎవరైనా సాటి ఉన్నారా, లేరు. మురారిపదసేవనసర్వస్వమైన జీవనంలో నీకు సాటి వచ్చేవారు ఎవరైనా ఉన్నారా, లేరు. అత్యంత ఆదరంగా అవ్యక్తమధురమైన గానామృతంలో తేల్చే దివ్యమైన తంత్రుల 'సొరకాయబుర్ర'ను వీణగా చేసి, గానసుధలను ప్రవహించడంలో యితరులు ఎవరైనా నీకు సాటి ఉన్నారా, లేరు. శీలములో, బుద్ధిలో, భక్తిలో, సత్యములో, గానములో, ధైర్యములో నీకు ఎవరూ సాటిలేరు!

*అనిన నాతనిఁ గౌఁగిట నునిచి పలికె*
*వ్రత మొనర్పించి తని భాగవతవతంస*
*మోయి రజనీచరేంద్ర నీయురుకృపాక*
*టాక్షమునఁ జేసి ధన్యుఁడనైతి ననఘ*

బ్రహ్మరాక్షసుడు చేస్తున్న ప్రస్తుతికి, ఆతని ఆదరానికి ఆనందించి ఆతడిని కౌగలించుకుని భాగవత శ్రేష్ఠుడైన ఆ మాలదాసరి కృతజ్ఞతలు తెలిపాడు! ఓ నిశాచర రాజా! ఎలాగైతేనేం, నా వ్రతాన్ని పూర్తిచేసుకోడానికి సహకరించావు. నీ కరుణచేత, నా వ్రతానికి ఆటంకం లేకుండా పోయింది. అనఘా! నీవలన నేను ధన్యుడిని అయ్యాను అన్నాడు మాలదాసరి. అనఘా అని సంబోధించాడు, అంటే పాపరహితుడా అని పిలిచాడు. నన్ను తినాలి అనుకోవడం పాపమేమీ కాదు, నీకు భగవంతుడు యిచ్చిన ఆహార విధానాన్నే నీవు పాటించడం పాపమేమీ కాదు, నన్ను నిశ్చింతగా తినేసేయ్ అని ధ్వనిగా అంటున్నాడు. బ్రహ్మరాక్షసుడి వ్యవహారం, ఆ మన్నన, ఆ ఆదరము, భక్తి, ప్రస్తుతి చేయడం అంతా చూస్తున్నాడు కనుక, 'నన్ను మన్నించి వెళ్ళిపో నాయనా!' అంటాడేమో, అలా అని వదిలిపెడితే 'నా వ్రతాన్ని చెల్లించుకుని వచ్చి నీకు ఆహారాన్ని అవుతాను' అని తను చేసిన వాగ్దానము నెరవేరకుండా పోతుందేమో అని లోలోపల భయం ప్రారంభం అయ్యిందన్నమాట మాలదాసరికి. అలా ధ్వనిగా సూచనచేయడమే మహాకవుల లక్షణం, మహాకవి ▪ కృష్ణదేవరాయల పాత్రపోషణలోని విలక్షణం. అందుకే అంతటితో ఆగిపోలేదు మాలదాసరి.

*బాసలు బండికండ్లు మరి ప్రాణభయంబున లక్షసేసినం*
*గ్రాసము గృధ్రలబ్ధ ముడుగ న్వసమే యిది నీక చెల్లె నో*
*భూసురవంశపుణ్యజన పుణ్యజనాంకము తావకీనమే*
*పో సమకూరెడిం గులము పొత్తున దైత్యుల కెల్ల నంకతన్*

బాసలూ, బండి కండ్లూ, అంతా డొల్ల. నా గొప్పేముందయ్యా? ప్రాణభయంతో లక్ష బాసలు చెయ్యొచ్చు, అది అంత ఘనమైన విషయం ఏమీ కాదు. ఎంతో ప్రయాసపడి సంపాదించుకున్న తిండిని వదిలిపెట్టడం గొప్ప! అదేమంత సామాన్యమైన విషయము కాదు, అది నీకే చెల్లింది. కనుక ప్రాణభయముతో ఏవేవో బాసలు చేసిన నాకన్నా, దొరికిన తిండిని వదిలిపెట్టడానికి పూనుకున్న నువ్వు గొప్పవాడివి. బ్రాహ్మణ వంశంలో జన్మించిన ఓ పుణ్యాత్ముడా, ఓ బ్రహ్మరాక్షసుడా! పుణ్యపు జన్మ అన్నది నీకే చెల్లింది. నీకులంలో పుట్టిన కారణంగా రాక్షసులందరూ పుణ్యాత్ములైపోయారు పో! కనుక పుణ్యాత్ముడివి, మహానుభావుడివి, త్యాగశీలివి నువ్వే, నేను కాదు అన్నాడు మాలదాసరి.

'ఆవు-పులి' కథ ఉన్నది తెలుగు వారి కథలలో. పులినోట చిక్కిన ఆవు ఒకటి, ఆ పులిని బ్రతిమిలాడి, ' నిన్ననే పుట్టిన బిడ్డ ఉన్నది నాకు, నాకోసం ఎంత ఆర్తిగా ఎదురు చూస్తుందో, నేను వెళ్లి నా బిడ్డకు పాలు యిచ్చి, విషయము చెప్పి, ఈ పాడులోకంలో బ్రతకడానికి కావలసిన తెలివి, వివేకము, ధైర్యము అన్నీ చెప్పి, చివరిసారిగా తనివితీరా నా బిడ్డను ముద్దుగా లాలించి వెంటనే వచ్చి నీకు ఆహారాన్ని అవుతాను' అని ఎలానో ఆ పులిని ఒప్పించి వెళ్తుంది. అలానే వెనక్కు వస్తుంది. ఆశ్చర్యముతో, మనసు మారి, కరుణతో కరిగి ఆ పులి ఆవును వదిలిపెడుతుంది. మూడు దశాబ్దాల క్రితం వరకూ ఇలాంటి కథలుండేవి పిల్లల పాఠ్య పుస్తకాలలో. యిప్పుడు అరువుతెచ్చుకున్న సిద్ధాంతాల రాద్ధాంతాలు, కుల, మత, ప్రాంత విభేదాల ప్రాతిపదికల ప్రతిపాదనల కథలు ఉంటున్నాయి. ఆ 'ఆవు-పులి' కథకు బీజం ఈ మాలదాసరి-బ్రహ్మరాక్షసుల కథయే అనడంలో అతిశయోక్తి ఏమీ లేదు.

మాలదాసరి గొప్పదనాన్ని, త్యాగ ధనాన్ని గుర్తించిన మహనీయుడు బ్రహ్మరాక్షసుడు, ఆతనికి యిచ్చిన మాటను నిలబెట్టుకోవడం కోసం వెనుకకు తిరిగివచ్చి ఆహారంగా మారడానికి సిద్ధపడిన మహానుభావుడు మాలదాసరి.

*కడుపు మహాక్షుధ న్నకనకంబడ నన్నృతకృత్యుఁ జేయఁ బో*
*విడిచితి వేము జాత్యముగ వేధవిధించినకూడు మీకు నీ*
*యెడ నొకకీడు కల్గ దిఁక నే మనిన న్మఱి నీకు నానసూ*
*బడలిక దీఱ నిత్తనువు బారణసేయుము మైత్త్రి కల్గినన్*

'ఆకలి కడుపుమంటకు నకనక లాడకుండా, నన్ను కృత కృత్యుడిని చేయడానికి, నా వ్రతం పూర్తిచేసుకున్న సార్థకత కలగడానికి సహాయపడి, నన్ను వెళ్ళిపొమ్మని విడిచిపెట్టావు. మేము(మానవులు) మీకు బ్రహ్మదేవుడు చేసిన ఆహారపు జాతికి చెందిన వాళ్ళమే. నీకేమీ కీడు, అపవాదు రాదు నన్ను తినడం వలన. నేను బ్రతికానా నీ మీద ఒట్టే! నన్ను పట్టుకోడానికి, నేను తిరిగివచ్చేదాకా ఆకలితోటీ నువ్వెంతో ప్రయాస పడ్డావు మిత్రమా! నీకు కూడా ఆ మైత్రీ భావం ఏమాత్రం ఉన్నా, ఆ ప్రయాస తీరేట్లుగా నా శరీరాన్ని హాయిగా, తృప్తిగా ఆరగించు' అన్నాడు మాలదాసరి!

తనను వదిలిపెట్టడంకోసం బ్రతిమిలాడేప్పుడు 'సఖ్యం సాప్తపదీనం', ఏడడుగులు కలిసి నడిస్తే ఎవరైనా స్నేహితులే, కనుక నీ స్నేహితుడి కోరిక తీర్చడం నీ ధర్మం' అని తను అన్న మాటలను గుర్తు చేస్తున్నాడు, ఆ మాటలకు తను కట్టుబడి ఉండడం, స్నేహితుని ఆకలిని తీర్చడం స్నేహితునిగా తన ధర్మం అంటున్నాడు. తన మీది స్నేహభావంతో, తాను యిచ్చిన మాటను నిజం చేయడం కోసమైనా తనను తినడం బ్రహ్మరాక్షసుడికి, జాతి రీత్యా, స్నేహంరీత్యా కూడా ధర్మం అంటున్నాడు. స్నేహధర్మాన్ని పాటించి ఒక వ్రతాన్ని పూర్తిచేసుకునే అవకాశాన్ని యిచ్చావు. రెండో వ్రతం, నేను యిచ్చిన మాటను నిజం చేసుకోవడం అనే వ్రతాన్ని కూడా పూర్తి చేసుకోడానికి సహకరించడం స్నేహితునిగా నీ ధర్మం, కనుక నన్ను తినేసేయ్ అన్నాడు. తాను కాదు, తన తండ్రి యిచ్చిన మాటకోసం, అది కూడా తన తల్లికి కాదు, పినతల్లికి కూడా కాదు, సవతి తల్లికి యిచ్చిన మాట కోసం నిండు యవ్వనంలో చేతికి అందివచ్చిన చక్రవర్తి పదవిని వదులుకుని, అడవి దారిని పట్టిన త్యాగశీలి ▪రాముడు! సరే ఆయన యింతా కన్నతండ్రికోసం చేశాడు. తండ్రికోసం కాదు, అన్నకోసం నిద్రాహారాలు మాని, సేవక వృత్తిని ఆనందంగా జీవితాంతమూ ఎంచుకుని, అడవుల వెంట అరణపు సేవకునిగా వెళ్ళిన త్యాగశీలి లక్ష్మణుడు!

ఈ కథంతా జరిగినప్పుడు అక్కడ లేనే లేడు భరతుడు, మేనమామ యింట్లో వున్నాడు. తండ్రి మరణించిన వార్త తెలిసి అయోధ్య వచ్చాడు. తండ్రి ఎలాగూ లేడు, అన్న రాజ్యాన్ని వదులుకుని అడవులకు వెళ్ళిపోయాడు. ఏ పోటీ లేదు. రాజ్య రమణి తనను వరించడానికి సిద్ధంగా ఉన్నది. తను నిర్దోషి అని అందరికీ తెలుసు, తనకు ఏ అపవాదూ రాదనీ తెలుసు, అయినా అడవులకు పరుగెత్తి రాజ్యం నీది, నీ రాజ్యాన్ని నువ్వు తీసుకో అన్న త్యాగశీలి భరతుడు!

'అలా కుదరదు నా తండ్రివి రెండు రాజ్యాలు, ఒకటి అరణ్య సామ్రాజ్యం, మరొకటి అయోధ్యా సామ్రాజ్యం. అరణ్యరాజ్యం నాకు, అయోధ్యా రాజ్యం నీకు అని మళ్ళీ రాజ్యాన్ని వదులుకున్న వాడు ▪రాముడు. ఏ అపకీర్తి, దోషము లేకుండా చక్రవర్తి అయ్యే అవకాశం మళ్ళీ వచ్చింది. అయినా అన్నపాదుకలను సింహాసనం మీద కూర్చోబెట్టి, తాను కేవలం ప్రతినిధిగా, అన్నకోసం ఎదురుచూస్తూ, అన్నవెంట తప్ప అయోధ్యలో కాలుబెట్టను అని నందిగ్రామంలో సన్యాసిగా బ్రతికిన మహాత్యాగశీలి భరతుడు! ▪రాముడు, లక్ష్మణుడు, భరతుడు ముగ్గురికీ సాటి ఐన త్యాగపురుషుడు మాలదాసరి! సాటి కాదు, త్యాగ గుణంలో వారికన్నా ఒకపిసరు ఎక్కువే అన్నా తప్పేమీ కాదు!

మాలదాసరి పూనుకున్నది రాజ్యాన్ని త్యాగం చేయడానికి కాదు, ప్రాణాలను త్యాగం చేయడానికి! రాజులకు రాజ్యాలు పోవడమూ, రావడమూ వింత ఏమీ కాదు. అదృష్టం కలిసివస్తే సామాన్యుడికీ రాజరికం రావడం అరుదేమో కానీ అసాధ్యంకాదు. కానీ ఎవరికైనా ప్రాణము పోతే తిరిగివచ్చేది కాదు. మొదట బ్రహ్మరాక్షసుడు వదిలిపెట్టినపుడు బ్రతికే అవకాశం వచ్చింది మాలదాసరికి. అన్న మాటకోసం ఆ అవకాశాన్ని వదులుకున్నాడు. యిప్పుడు రెండోసారి అవకాశం వచ్చింది, బ్రహ్మరాక్షసుడిలో మేలుకుంటున్న మానవత్వం కారణంగా, దీన్నీ వదులుకోవడం మాత్రమే కాదు, కోరి కోరీ, బలవంతంగా, రాక్షసుడికి ఆహారంగా చనిపోవడానికి తయారై, 'నన్ను తిను' 'నన్ను తిను' అని వాడిని బ్రతిమిలాడుతున్నాడు!

*ఈమాట న్పొరపొచ్చెము*
*లేమికి నీశ్వరుఁడ కరి నిలింపవిరోధీ*

*నామెయి మేదోమయ దృ*
*ప్తామిషములు మెసవు మన్న నతఁ డను నార్తిన్*

'ఓ సురవిరోధీ! ఓ రాక్షసుడా! నా ఈ మాటలో, నన్ను చంపి తినుమనే మాటలో ఏ పొరపొచ్చాలు, ఏ కల్లలు కపటాలు లేవు అనడానికి ఆ ఈశ్వరుడే సాక్షి(కరి) నా శరీరంలోని, నా మెదడులోని కొవ్వుపట్టిన మాంసములను తినెయ్' అన్నాడు మాలదాసరి! నివ్వెరపడి, బాధగా యిలా అన్నాడు బ్రహ్మరాక్షసుడు.

*ఎట్టా యి ట్లగునయ్య పలక దయలే కిన్నాళ్ళు నీకూడె యీ*
*పొట్టం బెట్టి మహాఘలబ్ధిఁదనువుం బోషించి ఎన్నాళ్ళ కే*
*నెట్టే నొక్కతపస్వి యొక్క వ్రతి రాడే చూడఁడే తత్కృపన్*
*బుట్టు న్నీఁగెద దీని నా యెదవి యో పుణ్యాత్మ యె ట్లంటివే*

అయ్యా! దయలేకుండా యిలా పలికితే ఎలా చెప్పు? దయలేకుండా యిన్నాళ్ళూ ఈ పాడు కూడే పొట్టకు పెట్టి, మహాపాపాన్ని మూటగట్టుకుని పోషించి పోషించి, ఎన్నాళ్ళకైనా, ఎలాగైనా ఒక తపస్వి, ఒక వ్రతి రాకపోతాడా? నన్ను చూడకపోతాడా? దయజూడక పోతాడా? ఆ దయవలన ఈ రాక్షసుని పుట్టుకను పోగొట్టుకోకపోతానా అనుకుంటుంటే లభించావు నీవు. ఓ పుణ్యాతుడా! ఎలా మాట్లాడావు! అన్నాడు బ్రహ్మరాక్షసుడు.

పరివర్తన పరిణామ క్రమాన్ని తెలుపుతుంది, పథనిర్దేశం చేస్తుంది, పస తెలుపుతుంది. మంచిని గ్రహించడం ఒక దివ్య లక్షణం. దాన్ని గౌరవించడం, అనుసరించడం, ఆచరించడం దైవత్వానికి దారితీస్తుంది. తప్పులు చేయనివారు ఎవరు లోకంలో? తప్పులు చేయనివాడు దేవుడే. చేసిన తప్పును తెలుసుకుని సరిదిద్దుకునేవాడు మానవ దశనుండి దైవత్వానికి ప్రయాణం చేస్తాడు. తప్పని తెలిసినా సమర్థించుకునేవాడు, మరల మరలా ఆ తప్పులనే చేసేవాడు రాక్షసుడు! హిరణ్యకశిపుడు అదే చేశాడు. రావణుడు అదే చేశాడు. కంసుడూ, దుర్యోధనుడూ అదే చేశారు. కనుక వారు రాక్షసులుగానే మిగిలిపోయారు. వారికన్నా ఉత్తముడు ఈ బ్రహ్మరాక్షసుడు. తన తప్పును గ్రహించి, పశ్చాత్తాపముతో, సరిదిద్దుకునే మార్గం కోసం ఎదురుజూస్తున్నాడు యిన్నాళ్ళు. మాలదాసరి గొప్పదనాన్ని గుర్తించాడు. అతని సహాయంతో తన తప్పులకు పరిష్కారాన్ని, మంచి మార్గాన్ని వెదుక్కుంటున్నాడు.

*మీవంటి భాగవతులుం*
*బావనులుగ జేయరేని మఱిగతి యేదీ*
*మావంటివారి కిఁక మా*
*యేవము వెనుకటిది చూడ కీక్షింపు కృపన్*

మీలాంటి భాగవతులుకూడా కనికరించి పావనులుగా పాపరహితులుగా చేయకపోతే మాలాంటివారికి యిక ఎవరు గతి? ఇంతకుముందు నేను చేసిన హేయమైన పనికి అసహ్యపడకుండా నన్ను దయగా చూడవయ్యా అని దీనంగా బ్రతిమిలాడడం మొదలుబెట్టాడు బ్రహ్మరాక్షసుడు.

మాలదాసరి ఔన్నత్యాన్ని గుర్తించి, ఆతడిని చంపి తినడానికి బదులుగా తనను కరుణించి తన బ్రహ్మరాక్షస రూపాన్ని విడిచే ఉపాయం కోసం అతడిని బ్రతిమిలాడుతున్నాడు బ్రహ్మరాక్షసుడు.

*స్వధితియైనను ద్విజుఁ డిన్న శస్త్రమైన*
*సరియకాఁ గాంచనమా చేయుఁ బరుసవేది*
*యీయసాధారణన్యాయ మెన్నవలదె*
*మాదృశుల చోటఁ గదియు భవాదృశులకు*

బ్రాహ్మణుడిని సంహరించిన గొడ్డలిని(స్వధితి) కూడా పరుసవేది బంగారముగానే మారుస్తుంది కదా, మిగిలిన వాటితో సమానముగానే చూస్తుంది కదా! ఈ అసాధారణ న్యాయమును గుర్తించి, నాలాంటి వారిని చేరినప్పుడు మీలాంటి మహానుభావులు కూడా అలాగే మమ్ములను లెక్కించాలి, న్యాయము చేయాలి కదా అన్నాడు బ్రహ్మరాక్షసుడు.

*అనిన దేహార్పణము నొల్ల కార్తిఁ బలుకు*
*కృపణత కతఁ డభిప్రాయ మెద్ది యనిన*
*నిత్తుఁ దను వంట యనుకంప యే మదాత్మ*
*కసటుఁ బాపుటయే యనుకంప గాక*

బ్రహ్మరాక్షసుడు అలా అనగానే తన శరీరాన్ని ఆహారముగా సమర్పించడాన్ని ఒప్పుకోక, ఆర్తిగా, దైన్యాన్ని ఒలికిస్తూ పలుకుతున్న బ్రహ్మరాక్షసుని అభిప్రాయము ఏమిటో, అతడు ఏమి కోరుకుంటున్నాడో తెలుపుమని కోరాడు మాలదాసరి. 'నా శరీరాన్ని నీకు ఆహారంగా యిస్తాను అనడం దయజూపడం అవుతుందా? ఈ క్షుద్రమైన, భయంకరమైన, మలినమైన బ్రహ్మరాక్షస రూపాన్ని పోగొట్టడం దయజూపడం అవుతుంది కానీ' అన్నాడు బ్రహ్మరాక్షసుడు.

*ఘంటాకర్ణుని మించు కర్మయెకొ నాకర్మంబు మౌనీంద్రులం*
*దుంటల్సేయఁడె మాన్పి యీఁడె భగవంతుం డట్టి ■ యట్టి ■*
*కంటె న్భాగవతుండు మించ నొసఁగం గా లేఁడె యా మేలు నా*
*కంటింప న్మఱి రాదె పూజనము గాదా ప్రాణిమే ల్పక్రికిన్*

ఘంటాకర్ణుడు కుబేరుని అనుచరుడు, పిశాచి మూకలకు నాయకుడు. బదరీవనములో ■కృష్ణుడి దయచేత వాడి పిశాచ రూపాన్ని వదిలించుకున్నాడు. ఆ ఘంటాకర్ణుని కంటే ఎక్కువ పాపకర్మలు చేశానా నేను? మునులను ఋషులను నిర్దయగా సంహరించి మహా భయంకరుడైన వాడిని కూడా కనికరించి విముక్తిని ప్రసాదించాడు కదా భగవానుడు. భగవంతుడికన్నా మిన్నగా భాగవతుడు కనికరించగలడు కదా! అలాంటి మేలును నాకు చేసి, ఈ ఘోర రూపాన్ని వదిలించి నన్ను కనికరించలేవా? ప్రాణులకు మేలుచేయడంకన్నా పుణ్యము వేరే ఉంటుందా? ■హరికి కూడా ఆ మేలు చేయడం వలన కీర్తి వచ్చిందే, నీకు అపకీర్తి వస్తుందా? మేలు చేయడం అంటే అలా ఉండాలి కానీ, నిన్ను తినడానికి నన్ను పురికొల్పి యింకా ఘోరమైన పాపాలు చేయడానికి ప్రోత్సహించి, హాని చేయడమే అవుతుంది కదా అన్నాడు.

దానికి 'సరే! నీకు మేలు చేయడం ఎలానో చెప్పవయ్యా' అన్నాడు మాలదాసరి. 'నేను కుంభ జానువు అనే బ్రహ్మరాక్షసుడను. ఈ మఱ్ఱిచెట్టుని ఆశ్రయించుకుని చేయరాని ఘోరాలన్నీ చేస్తూ, దారిన వెళ్ళే వాళ్ళను భోజనం చేస్తూ వచ్చాను యిన్నాళ్ళు. పూర్వజన్మలో నేను సోమశర్మ అనే బ్రాహ్మణుడిని. ఒక అకృత్యము వలన యిలా బ్రహ్మరాక్షస జన్మను పొందాను. నీవు కైటభాంతకుడైన ■హరిని స్తుతిస్తూ ఈ నాడు పాడిన పాటయొక్క ఫలితాన్ని ఉదకపూర్వకంగా నాకు ధార పోశావా, నా ఈ జుగుప్సాకరమైన పాపిష్టి రూపం తొలిగిపోతుంది. నీకు అనంతమైన పుణ్యమూ లభిస్తుంది, నాకు మేలు చేసిన కారణంగా. నీకూ ఈ శరీరము తీరిపోతుంది. విముక్తి లభిస్తుంది' అన్నాడు బ్రహ్మరాక్షసుడు. ఆ మాటలకు కిలకిలా నవ్వి యిలా అన్నాడు మాలదాసరి.

*ఇటువంటివి యిట కెక్కుడు*
*నిట దిగుడని యెంద నెన్ని యే నిదియును నొ*
*క్కటి యొకనాఁటిద కా దొక*
*త్రుటి గీతఫలంబు నొసఁగుదునె యిమ్మెయికిన్*

యిటువంటి జన్మలు ఎన్ని ఎత్తి ఉంటాను నేను? ఒకటి ఉత్తమ జన్మ, ఒకటి తక్కువ జన్మ, అలా ఎన్ని చూశానని? అలాంటి జన్మలలో యిదొకటి మాత్రమే. యిటువంటి జన్మకోసం, ఒక రోజు పాడిన కీర్తన ఫలం కాదు కదా, ఒక త్రుటి కాలపు కీర్తనాఫలితాన్ని కూడా యివ్వనంటే యివ్వను అన్నాడు మాలదాసరి!

*దిక్పాలతను వెత్తి తిరిపెంపుఁదనుఁ దోన / యెన్నిమార్లెత్తమీ యేను నీవు?*

*మాతంగతను వెత్తి మశకంపుఁదనుఁదోన / యెన్నిమార్లెత్తమీ యేను నీవు?*

*కేసరితనువెత్తి కీటంపు దనుఁ దోన / యెన్నిమార్లెత్తమీ యేను నీవు?*

*ధరణీశతను వెత్తి దాస్యంపు దనుఁ దోన / యెన్నిమార్లెత్తమీ యేను నీవు?*

*సోమయాజు లెన్ని మార్లామి శ్వపచ*

*ఖగకులుల మెన్నిమారులు గాము పాము*

*గాములమ యెన్ని మారులు గాము వెండి*

*కంసరిపుభక్తుల మొకండె కాము గాని*

దిక్పాలకుల దివ్య జన్మలను ఎన్నిసార్లు ఎత్తి ఉంటాము, వెంటనే మరుసటి జన్మలో బిచ్చగాళ్ళ జన్మలను కూడా ఎన్నిసార్లు ఎత్తి వుంటాము? యెన్ని సార్లని ఏనుగులుగా, వెంటనే దోమలుగా పుట్టివుంటాము? సింహాలమై ఎన్నిసార్లు పుట్టి వుంటాము, వెంటనే క్షుద్ర కీటకాలమై ఎన్నిసార్లు పుట్టి ఉంటాము? చక్రవర్తులుగా ఎన్నిసార్లు పుట్టి ఉంటాము, వెంటనే బానిసలుగా ఎన్నిసార్లు పుట్టి ఉంటాము? ఎన్నిసార్లు నిష్ఠ కలిగిన సోమయాజులమై పుట్టి ఉంటాము, ఎన్నిసార్లు కుక్క మాంసాన్ని తినేవాళ్ళమై పుట్టి ఉంటాము? పక్షులమై, పాములమై, పిశాచాలమై ఎన్నిసార్లు పుట్టివుంటాము, కంసహారిఐన ■కృష్ణునిభక్తులమై పుట్టిఉండముగాని!

ఉత్తమ నీచ జన్మలను ఎన్ని పొంది ఉంటాము, ■కృష్ణుని భక్తులమై పుట్టి ఉండము గానీ అన్న ఎకసక్కెం లో కూడా దివ్యమైన చమత్కారాన్ని పొదిగాడు రాయలవారు. యిన్ని జన్మలను ఎత్తడం అంటే ■కృష్ణ భక్తులము అప్పటికి యింకా కాలేదు అని, ఎందుకంటే ■కృష్ణ భక్తి ఒక జన్మలో కలిగితే మరొక జన్మ ఉండదు అని విరుపు! యింత క్లుప్తంగా, నాలుగే నాలుగు పదాలలో, యింత ఉన్నతంగా ■కృష్ణ స్తుతి చేసినవారు యిదివరకు ఎవరూ ఉండకపోవచ్చు, పుంఖాను పుంఖాలుగా గ్రంథాలు వ్రాసి ఉండవచ్చును గానీ, రాయలకు నమస్సులు!

ఊఁతనీరు చెలఁది నేత మూ టాయిటి

దూది యెండపసుపు తొట్టియక్క

రంబు మేను దీని రహిఁ బుణ్య మమ్ముట

కప్పురంబు వెట్టి యుప్పు గొనుట

ఊత అంటే వెదురుతో అల్లిన జాడీ వంటిది, పైనా క్రిందా మూత ఉండదు, దాన్ని నీటిలో ఉంచితే దానిలోనుండి దూరిపోయే చేపలు ఆ వెదురు సందులలో యిరుక్కుపోయి దొరికిపోతాయి. రెండుప్రక్కలా మూత ఉండదు కనుక అందులో నీరు నిలిచే అవకాశమే ఉండదు, అటువంటిది, ఊతలో నిలిచే నీటి వంటిది మానవ జన్మ, అంత క్షణికం! చెలది నేతమూట అంటే సాలెపురుగు నేసిన దారాలతో కట్టిన మూట. సాలెపురు దారాలు మూటలను మోస్తాయా? ఈ మానవ జన్మ సాలెపురుగు దారాలవంటిది, బలహీనమైనది.

అయిటి దూది అంటే ఎండి గాలికి ఎగిరిపోయే దూది, బూరుగు దూది, అలాంటి క్షణికమైనది ఈ శరీరము. ఎండలో ఉంచిన పసుపులాగా యిట్టే రంగు పోయి, మ్లానమై నల్లబడేది ఈ శరీరము. తొట్టి అక్కరంబు అంటే తొట్టివాడి పలుకులాగా పసలేనిది ఈ మానవ జన్మ. యిటువంటి ఈ జన్మకోసం పరమాత్ముడిని కీర్తించిన పుణ్యాన్ని అమ్ముకోవడం అంటే కప్పురాన్ని యిచ్చి బదులుగా ఉప్పును తీసుకోవడమే, అంత పిచ్చివాడిలా కనిపిస్తున్నానా నేను? అన్నాడు మాలదాసరి.

*సంగీతఫలంబునఁ గో*

*సంగీ సగమైన దయపాసఁగ నీవే మీన్*

*మ్రింగినగ్రుక్కన్వారిధి*

*కిం గొఱఁతయె కొదయె విష్ణుకీర్తన కనినన్*

బ్రహ్మరాక్షసుడు బ్రతిమిలాడడం మొదలెట్టాడు. గోసంగీ, ఓ దాసరీ! సంగీత కీర్తనా ఫలంలో కనీసం సగమైనా నాకు ధారపోయవయ్యా! చేప మింగిన నీళ్ళవలన సముద్రానికి నీరు తగ్గిపోతుందా? విష్ణు కీర్తనకు తగ్గడం అనేది ఉంటుందా? అన్నాడు. దానికి కొద్దిగా విసుగుతో, కొద్దిగా అనునయంగా యిలా అన్నాడు మాలదాసరి.

*ఏలా నొంచె ద దేయ మిట్లడిగి యెంతే బాస మేనంబలం*

*బో లీలావటుగీతకీర్తనఫలంబో నీయెడ న్మున్ను పా*

*తాళప్రశ్నలు మాని మేన్గొనుము బేతాళచ్ఛలోక్తిన్ రుషం*

*దూలింపందలఁతేని పుట్టు మఱి నూతుల్దవ్వ బేతాళముల్*

అదేయము అంటే యివ్వకూడనిది. యివ్వకూడని పుణ్య ఫలితాన్ని యివ్వమని ఎందుకు నన్నిలా నొప్పిస్తావు? నీకు ఇంతకుముందు నేను ప్రమాణం చేసింది నా శరీరంలోని మాంసాన్ని కానీ,మాయా వటువైన వామనుడిని, ఆ ■హరిని నుతించి చేసిన కీర్తనా ఫలితాన్ని కాదు కదా! యిక నీ పాతాళ ప్రశ్నలు, తిక్క ప్రశ్నలు మాని మర్యాదగా నన్ను తినెయ్, అంతే. నాకు కోపం తెప్పించడానికి ప్రయత్నిస్తే 'బావి తవ్వడానికి బయల్దేరితే భూతాలు బయట పడ్డాయ్' అన్నట్టు అవుతుంది. అనుకున్న ఫలితం దొరక్కుండా పోతుంది. కనుక ఎక్కువ మాట్లాడకుండా నన్ను మెక్కెయ్ అన్నాడు మాలదాసరి నిష్కర్షగా!

తనను కనికరించి, తన భయంకర రూపాన్ని తొలగించడానికి ఆ నాటి సంకీర్తనా ఫలితాన్ని తనకు ధారపోయాలని మాలదాసరిని కోరాడు బ్రహ్మరాక్షసుడు. ' అదేమీ కుదరదు, మర్యాదగా నన్ను తినేసి నీ దారి నువ్వు చూసుకో. నీకు నాశరీరాన్ని తిండిగా యిస్తానని వాగ్దానం చేశాను కానీ నా పుణ్య ఫలితాన్ని ధారపోస్తానని కాదు' అన్నాడు మాలదాసరి.

మాలదాసరి పలుకులకు ఆ 'సాలకటంకట' వంశములో జన్మించిన బ్రహ్మరాక్షసుడు 'కట కటా! ఎంత నిర్దయగా మాట్లాడుతున్నావయ్యా' అని వాపోయాడు. కైటభాంతకుడైన ■హరి దాసులు పరమదయాళువులు కావలదా? అని నిలదీశాడు. యిదివరకు విశిష్టాద్వైత మతస్థాపకుడు అయిన రామానుజాచార్యులు 'పరమ రహస్యములు, జాగ్రత్త సుమా, ఎవరికి పడితే వారికి ఉపదేశింపవద్దు' అని తనకు తన గురువులు ఉపదేశించిన గీతాచరమశ్లోకమును ■రంగదేవాలయ గాలిగోపురాన్ని ఎక్కి బిగ్గరగా అరచి అందరికీ ఉపదేశించిన సంగతిని గుర్తుచేశాడు. నీకు నరకం సంప్రాప్తిస్తుంది అని గురువు అంటే, 'పర్లేదు, నేను నరకంలో పడినా ఏమిటి? తిరుమంత్రములను చరమశ్లోకమును పొందిన భాగవతులు మోక్షాన్ని పొందితే నాకు చాలు, నాకు ఏమైనా పర్లేదు' అని రామానుజులు ఉపదేశము చేసిన సంగతిని కీర్తించాడు. ఆ రామానుజులే తన మతానికి పాలు, నేయి, పెరుగులను తెచ్చిన గొల్లలకు డబ్బులు యివ్వ జూపితే, వారు వలదు అంటే, పరమపదాన్ని ప్రసాదించిన సంగతిని ఉదహరించాడు. ఆ రామానుజ యతీంద్రుడే 'రమ్యజామాత్రుమునియై' అర్చిరాది మార్గముద్వారా ముక్తి పదానికి వెళ్ళడం గురించి ఎల్లరికీ బోధించిన విషయాన్ని గుర్తుచేశాడు. యింకా రానున్న కాలములో ఎన్నెన్ని రూపాలలో, ఎన్నెన్ని నామాలతో, ఎన్నెన్ని దివ్యదేశాలలో తన ఆధ్యాత్మిక బోధనా సందేశాలతో, ■హరి పాదసేవామార్గచారులు కమ్మనే ఆదేశాలతో సకల మానవాళినీ కరుణించనున్నదీ తేటతెల్లము చేశాడు. జరిగినదీ, జరుగుతున్నదీ, జరుగనున్నదీ అంతా 'మా' జాతివారికి సులభముగా తెలిసిపోతుంది కనుక ఈ విషయములను గురించి తెలుపగలుగుతున్నాను. మాకు తపస్సు, శమ దమాదులచే సంపాదించుకున్న పుణ్యం దుర్లభం. కనుక ఈ దుర్మార్గవర్తనకు రక్తిని గొలిపే వికృత రూపాన్ని దూరము చేసి నన్ను కరుణింపకుంటే నీ భాగవత కులానికే తీరని మచ్చ అవుతుంది' అన్నాడు.

ఈనాటి సంకీర్తనా ఫలితంలో పాతిక పాలైనా నాకు యిచ్చి నన్ను కురుణింపుమని మాలదాసరి పాదాలమీద పడ్డాడు బ్రహ్మరాక్షసుడు. ససేమిరా వీలుకాదు అన్నాడు మాలదాసరి. మరింతగా విలపిస్తూ మాలదాసరి పాదాలను పట్టుకుని వదలకుండా ' ఈ నాడు నీవు పాడిన ఆఖరి కీర్తనా ఫలితాన్నైనా నాకు ధారబోయా'లని పైకి లేవకుండా మొండిపట్టు పట్టాడు బ్రహ్మరాక్షసుడు. యిక చేసేది లేక, కాదనలేక, అలాగేలే, ఈనాడు నేను చేసిన సంకీర్తనలో ఆఖరిగా పాడిన కీర్తనను నీకు ధారబోస్తానులే, లెమ్మని బ్రహ్మరాక్షసుడిని లేవనెత్తి, ఆతనికి ఆ భయంకర రూపం ఎలా వచ్చిందో వినాలని ఉన్నది అన్నాడు మాలదాసరి. అలాగే తన కథను చెప్పడం మొదలెట్టాడు బ్రహ్మరాక్షసుడు.

*ఉండుదుఁ జోళభూమి నొకయూర గళల్పదునాల్గు నేర్చి వా*
*క్చండిమఁ జర్చ గెల్తు ఘటశాసుల శ్రౌతులఁ దప్పు వట్టుదున్*
*ఖండల ముష్టి విప్పఁ గని నవ్వుదు వెండి ప్రయోక్తల న్సుధీ*
*మండలిగ్రాంథికత్వ మవమానము సేయుదు జల్పవాదినై*

చోళ దేశంలో ఒక ఊరిలో ఉండేవాడిని. పదునాలుగు కళలలో(విద్యలలో) నేర్పరిని. నాలుగు వేదాలు, శిక్ష, వ్యాకరణము, కల్పం, నిరుక్తము, జ్యోతిషము, ఛందస్సు అనే ఆరు వేదాంగాలు, మీమాంస, న్యాయము, పురాణము, ధర్మ శాస్త్రము అనే నాలుగు, మొత్తము కలిపి పదునాలుగు, ఈ పదునాలుగు విద్యాస్థానాలు అని పిలువబడుతాయి. ఈ పదునాలుగు విద్యలనూ నేర్చినవాడిని అని చెప్పుకుంటున్నాడు. తర్కములో తార్కికులను నా ప్రచండమైన వాక్పటిమతో గెలిచేవాడిని. శ్రౌత కర్మలను చేసేవారి స్ఖాలిత్యాలను, అపభ్రంశాలను ఎత్తి చూపించేవాడిని. షోడశ కర్మలకు అధికారులైన వారిని, కారికలు, వార్తికాలు మొదలైన సంచులను విప్పేవారిని, శాస్త్రాలు చెప్పేవారిని, విద్వాంసుల రచనా నైపుణ్యాన్ని గేలిచేసేవాడిని. యిలా పెద్దలందరినీ అవమానించేవాడిని. చులకనగా మాట్లాడేవాడిని. అందరినీ పరాభవించాలి అనుకునేవాడిని.

ఈ విధముగా మదించిన ఏనుగులాగా మత్తెక్కి కన్నూ మిన్నూ కానక, నాకు తెలిసినదే బ్రహ్మవిద్య, నాకు తెలియనిది ఏమున్నది, మిథ్య, అని అహంకరించి తిరిగేవాడిని. విద్యలో, వయసులో పెద్దలయినవారిని 'గెలికి' వారితో వాదానికి దిగి, నేనే గెలిచాను అని అదరగొట్టేవాడిని. నీతో సమానంగా నిలిచాను అని గప్పాలు పలికి అబద్ధాలు చెప్పేవాడిని. చిన్నా చితకా రాజులను సంపన్నులను యిలా నన్ను మించిన విద్వాంసుడు లేదు అని భ్రమింపజేసేవాడిని. యిలా విశృంఖలంగా తిరుగుతున్న నాకు ఉన్నట్టుండి యజ్ఞయాగాదులు చేస్తున్న మహానుభావులను చూసి నేను కూడా వారిలాగా యజ్ఞం చేయాలనే కోరిక పుట్టింది. ఆ యజ్ఞానికి కావలసిన ద్రవ్యాన్ని సమకూర్చుకొనడంకోసం మధురాపట్టణం వెళ్లాను నేను.

*బహివడ్డద్విజున కల్పఁపు బాచితంబిడి / పసిఁడికై తా వాని బంతి గుడిచి*
*కలసి వణిక్పురోధల తోడఁ బుణ్యాహ / ముల బియ్యములకు నై మొత్తులాడి*
*శశి రవి గ్రహ జపస్నానాదికము లెల్ల / దొరల వాకిండ్లకే దొద్ద యిచ్చి*
*పచ్చిశ్రీ తో ల్బట్టె చుచ్చాల మెట్లంది / కొనఁ దాన యూరెల్ల గుత్తవట్టి*

*దర్భపోటులఁ దిని లేని తరుల మైత్రి*
*నంటి పితృశేషముల భుజించి యదియు నెడల*
*నక్కవాడల నరకూళ్ళు మెక్కి మీఁద*
*వీనిశేఖర మొకతులార్త్విజ్యము కొని*

మధురా పట్టణానికి వెళ్లి డబ్బుకోసం ఏమేం చేశాడో చెప్తున్నాడు బ్రహ్మరాక్షసుడు. అలా చేసేవారందరూ 'బ్రహ్మ' పదవాచ్యులైన 'బ్రహ్మరాక్షసులే' అని నిలువునా విమర్శ చేస్తున్నాడు. రాయలవారికి ఎంత లోకపరిచయమున్నది, ఎంత పరిశీలనా శక్తి ఉన్నదీ తెలిపే పద్యాలలో ఇదొకటి.

తప్పుడు త్రోవలు తొక్కి వెలివేయబడ్డ బ్రాహ్మడికి సూక్ష్మంలో మోక్షంగా ఏదో అవకతవక ప్రాయశ్చిత్తం చేసి, వాడిచ్చే బంగారం కోసం వాడి పంక్తిన భుజించేవాడిని. షావుకార్ల యింటి బ్రాహ్మణులతో కలిసి పుణ్యాః వాచనలు చెప్పి, తూతూ మంత్రాల దక్షిణకోసం, ఆ పుణ్యాఃవాచన బియ్యంకోసం ఆ షావుకార్ల పురోహితులతో తగాదాలు పడేవాడిని. చంద్ర సూర్య గ్రహణాల సందర్భాలలో చేయాల్సిన జపతప స్నానాలన్నీ దొరల వాకిళ్ళకే ధారబోశాను. అంటే దొరల వాకిళ్ళకు పడిగాపులు గాసి వారి దయకోసం ప్రాకులాడాను, లేదూ, ఆ జపతపాల ఫలాన్ని వారికి ధారపోసి వారి డబ్బుకు కక్కుర్తిపడ్డాను. నువ్వు (మాలదాసరి) చెప్పినట్టు కప్పురాన్ని యిచ్చి ఉప్పుకు కక్కుర్తిపడ్డాను! జింకల పచ్చి తోలును, బఱ్ఱెలను, మేకలను దానం పుచ్చుకోడానికి ఊరు ఊరంతా నేనే గుత్తకు తీసుకున్నాను, వేరే ఎవరినీ నెగలనీయలేదు, అంతా నాదే, నాకే అన్నాను!

బ్రాహ్మణార్థాలకు వెళ్లి మెక్కాను. అదీ లేనప్పుడు స్నేహాన్ని అడ్డుపెట్టుకుని, దొరికిన చోటల్లా ప్రేమ తెచ్చిపెట్టుకుని తద్దినాల భోజనాలు చేశాను. అవీ లేనప్పుడు పూటకూళ్ళ ఇళ్ళల్లో తిన్నాను. యిక ఆ పైన, వీటన్నిటికీ శిఖరాయమానంగా, ఋత్విక్కుగా అవతరించి, చేసిన పాపాలన్నీ కడిగేసుకోవాలనుకున్న వెధవల తులాభార దానాలను పట్టాను. యిలా కాసుకోసం ఏ దరిద్రపు దారినీ తొక్కకుండా, కడుపు కక్కుర్తితో ఏ ఒక్కచోటా మెక్కకుండా విడిచిపెట్టలేదు. ఎంత ఎగబడి అయినా సరే ఒక్క పైసా కూడా వేరేవాడికి దక్కకుండా చేయడానికి ఏ బొంకూ, వంకా, నీచమూ విడిచిపెట్టలేదు అని మధురాపట్టణంలో తన జీవన విధానాన్ని చెబుతున్నాడు బ్రహ్మరాక్షసుడు.

బ్రాహ్మణుడు అయినవాడు ఏవి చేయకూడదో అవన్నీ ఎగబడి, తెగబడి చేశాను అని బ్రహ్మరాక్షసుడు చెబుతున్నాడు. అలా చేసిన, చేస్తున్న వారిని విమర్శిస్తున్నాడు రాయలవారు.

*ఇ ట్టొనగూర్చి వైశ్యునకు నిచ్చి చన న్మఱి పుచ్చి చౌకము*
*ల్వెట్టుచు వడ్డి లెక్క లటు వెత్తుచు ధారణ వాసికి కొదల్*
*పెట్టుచు వాఁడు రేఁగి మఱి పెట్టుదుఁ బెట్ట ననంగ మిట్టఁ గూ*
*వెట్టుదు నిట్టు పోరఁ గనిపెట్టుక యొక్కరుఁ డుండి వెండియున్*

యిలా నానా గడ్డీ కరిచి సంపాదించి కూడబెట్టిన డబ్బును కోమటికి వడ్డీకిచ్చి, నేను సంపాదించిన బియ్యము మొదలైన వాటిని అమ్మి వాటికి మంచి ధరను ఇమ్మని, చిల్లర వడ్డీకోసమని పోరేవాడిని. వాడు ఇస్తానని, యివ్వనని గొడవచేస్తే రచ్చకెక్కి రచ్చరచ్చ చేసేవాడిని. యిదంతా దొంగ ఒకడు కనిపెట్టి అవకాశంకోసం ఎదురుచూడడం మొదలెట్టాడు.

*వెలివాడఁ బనిక్రొత్త మలక వాల్గొని నూనె / యిడి తంగెడాకుగ గట్టెడు తహతహ*
*కూర్చంబు గౌరిగించుకొని యుష్ణ తోయంబు / టంగడిఁ దలయంటు కాడి తడవు*
*వంటపూఁటింటి కెప్పంటికంటెను బాలు / పెరుఁగు నే కూర లంపెడు తెగువలు*
*సంబెళ విదలించి తాంబూలదళ పూగా / నివహంబుఁ జాలంగ నించు నుబ్బు*

*బ్రహ్మచారిభుజంబు మాత్రకు సడింపుఁ*
*బ్రాలు నాలికి మేలుచీరలు గొనియెడు*
*సంభ్రమంబును బెఱపాంథజనులఁ బయన*

*మడుగు ప్రశ్నంబులను మత్ప్రయాణమెఱిఁగి*

చండాల వాటికలో మంచి పనితనముగల కొత్త పాదరక్షలను ఖరీదు చేసి, మంచిగా నూనెతో మెరుగు పెట్టించి, వాటికి తంగేడు ఆకును కట్టి (జోడును తగిలించి) త్వరపడుతూ, కనుబొమలను అందంగా సన్నగా గొరిగించుకుని, వేడినీళ్ళు అమ్మే అంగడిలో తలంటు స్నానము చేసి, ఆలస్యమవుతున్నది అని తొందరపడుతూ ప్రయాణ సన్నాహం చేశాను. పూటకూళ్ళ ఇంటికి వెళ్లి పాలు, పెరుగు, నేయి, కూరలు పంపే ఔదార్యాన్ని పొగడుతూ, పోకచెక్కల పెట్టెను తెరిచి తమలపాకులు, వక్కలను బాగా సరిపోయేట్లు నింపుకున్నాను. శిష్యుడి భుజానికి దంపుడు బియ్యపు సంచిని తగిలించాను. భార్యకోసం మంచి చీరలు కొన్నాను. యితర ప్రయాణీకులను(తోడుగా మందితో గుంపులుగా దూరప్రయాణాలు చేసే రోజులు) ప్రయాణం ఎప్పుడు అని ప్రశ్నలతో త్వరపెట్టాను. యిలా హడావిడి చేస్తున్న నా సన్నాహాలను గమనించి నా ప్రయాణం గురించి తెలుసుకున్నాడు, మొదటినుండీ నన్ను గమనిస్తున్న దొంగవాడొకడు.

*హత్తుకొని యొక్క కొందఱ*
*నత్తెరువుం గట్టఁ బనిచి యందఱ క్రియఁ దాఁ*
*దిత్తియొకటి గొని తే మఱి*
*యుత్తర ముత్తర మటంచు నొక ప్రొద్దుకడన్*

ఆ దొంగ కొందరిని తన వెంటనుంచుకుని, మరి కొందరిని ఆ ప్రయాణమార్గాన్ని కనిపెట్టి అడ్డగించడానికి పంపి, అందరు ప్రయాణీకులలానే ఏమీ ఎరుగనట్లు ఒక తోలు తిత్తిని(మార్గంలో మంచి నీరు త్రాగడంకోసం) పట్టుకుని, ప్రయాణం సాగిస్తూ ఒక ప్రొద్దున మనము ఉత్తరదిశకు వెళ్ళాలి, ఉత్తర దిశకు అని త్వరపెడుతూ అందరినీ దారిమళ్ళించాడు.

*లేచి పోవంగఁ దత్తఱ మేచి తోడి*
*వారు సన నేను ముడిమోపు వటునకెత్తి*
*పోవ వాఁ డిందు రం డని త్రోవ యడవిఁ*
*బెట్టి యొకవాఁగు డిగ నీల వెట్టుటయును*

ఒక ఉదయాన లేచి, ఆ దొంగ ప్రయాణీకుడు 'ఉత్తరానికి వెళ్ళాలి, ఉత్తరానికి' అని అందరినీ తొందర పెట్టడంతో అందరూ లేచి అలాగే లేచి బయలుదేరి పోవడంతో నేను కూడా త్వరపడుతూ, మూటను శిష్యుడి భుజానికి ఎత్తి బయల్దేరాను. యిటు రండి, యిటు అంటూ వాడు అందరినీ తెలివిగా ఒక అడవి దోవకు మళ్ళించాడు. ఒక వంక దిగగానే వాడు ఈల వేశాడు!

*అఱచేతి వ్రాలు గనున*
*త్తఱిఁ బడె నొకయంపకట్టె దానికి నిలువం*
*బిఱుబిఱ్ఱున ఊలు వడెం*
*దెఱపియుఁ గనలేక సాతు దిరుగంబడియెన్*

అరచేతిలోని గీతలు చూసేంత సమయంలో(అంత అల్పవ్యవధిలో)ఉన్నట్టుండి బాణం వచ్చిపడ్డది. దాంతో అందరూ ఆగిపోయారు. యింతలో బిర్రుబిర్రున రాళ్ళు వచ్చిపడ్డాయి. ప్రయాణీకుల సమూహం ముందుకు వెళ్ళే తెరపి లేక వెనుదిరిగింది. అంతే! ప్రళయకాలం వచ్చినట్లు, జంతువుల ప్రాణాలను కబళించే ఆకలిగొన్నట్లు, ముక్కంటి ప్రక్కల నడిచే పిశాచాల సమూహాలలాగా, ఉల్కలతో కూడిన గ్రహాలలాగా, సూర్యుడు కూడా భయపడే రాహువులలాగా, కాలకూటంలాగా నల్లని కాంతులను వెలువరించే ఆయుధాలను ధరించి, పదునైన బాణాలను వేస్తూ, పొడవండి! నరకండి! అని అరుస్తూ కిరాతులు చండాలురు గుంపులు గుంపులుగా వచ్చి నాలుగుప్రక్కలా కమ్ముకున్నారు మమ్ములను, పథికులను.

*పసలేదు నిలరోయి పాతకులా రని / దేవాయుధంబులు రూవువారు*
*పైఁడి బాసముఁ జెట్ల బడవైచి దుడ్డుపె / ట్లకు బారుచునె యొలె ల్వైచువారు*
*బరువు డించి కటారి పరుఁజించి నిల్పి యిం / దెందు వచ్చెద రని యెదురువారు*
*వస్త్రంబుఁ గొండు దేవర యోయి యిది చన్నఁ / బస్తని దయపుట్టఁ బలుకువారు*

*కలవి మామూకఁ నిప్పింతుఁ దొలఁగుఁడొకటి*
*యాఁడుదానిఁ జేనంటకుఁ డనుచుఁ బెద్ద*
*తనము నభిమానమును దెంపు కనఁగఁ బలికి*
*నిలిపి దోఁపిచ్చువారు నై తొలఁగి రపుడు*

వీళ్ళ దగ్గర పసలేదు, ఎక్కువమందిలేరు, పారిపోకండి, నిలిచి ఎదురుతిరగండి అని తోటి ప్రయాణీకులను ఉత్సాహపరిచే ప్రయత్నం చేస్తూనే 'పాపిష్టి వెధవల్లారా మీరు నాశనం గానూ' అని దేవాయుధాలను అంటే శాపనార్థాలను విసిరేవాళ్ళు కొందరు ఆ సమయములో. కర్రల దెబ్బలకు గావుకేకలు పెడుతూనే ఒంటిమీది బంగారాన్ని తీసి చెట్లమీదికి పుట్లమీదికి విసిరేస్తూ, విలువైన బట్టలను విసిరిపారేసే వాళ్ళు కొందరు. తమ బరువులను క్రిందపారేసి, కత్తులూ కఠార్లూ అందుకుని ఎదురునిలిచి, ఎక్కడికిరా వస్తున్నారు అని పోరాటం చేసే వాళ్ళు కొందరు. 'దీన్ని ముట్టుకోవద్దు. యిది పెరుమాళ్ళ విగ్రహంరా నాయనా! యిది పోయిందంటే పస్తే! కావాల్నంటే బట్టలు తీసుకో (ఎందుకంటే పిచ్చి అర్చకుడు, కనుక బంగారం గింగారం లేదు కనుక) అని దయ కలిగేట్లు బ్రతిమిలాడేవాళ్ళు కొందరు.

మావాళ్ళ దగ్గరున్న విలువైనవన్నీ యిప్పిస్తాను. తప్పుకోండి. ఆడవాళ్ళ మీద మాత్రం చేతులేయ వద్దు అని (తన గుంపులోని వారిలో తన) పెద్దరికాన్ని, తమ ఆడవాళ్ళ మీద అభిమానము, స్వాభిమానము, నిలబడి మాట్లాడే తెంపును చూపించి, స్వచ్ఛందంగా నిలువు దోపిడీ ఇచ్చేవాళ్ళు కొందరు, యిలా తమ తమ జన్మలకు, కర్మలకు అనువుగా ప్రవర్తించే ప్రయాణికులు నాలుగు వర్ణాలవారూ కకావికలు అవుతుంటే దోచుకోడం ప్రారంభించారు ఆ బందిపోటుదొంగలు.

ఎదురుతిరిగి కత్తులు కఠారూలూ విల్లంబులూ పట్టుకున్నవాళ్ళవైపుకు పోకుండా, తమకు ఎదురుపడ్డ వాళ్ళను పొడిచారు. లోభితనంతో సొమ్ములకోసం పెనుగులాడుతున్నవాళ్ళను పెద్దగా యిబ్బందిపెట్టకుండా నెత్తురు చిమ్మేట్లు పొడిచి చేతికి అందిన దాన్ని, చేతుల్లో ఉన్నదాన్ని లాక్కున్నారు. అన్నిటికీ సిద్ధపడి, గుంపును చీల్చుకుని పిక్కబలంతో పారిపోయేవాళ్ళను వెంటబడి తరమకుండా దొరికినవాళ్ళమీదే దృష్టి పెట్టారు, ఎందుకు సమయాన్ని పరుగుపందాలతో వృధా చేయడం అని. చిల్లి కాసులేని వాళ్ళను, బలిసి బలంగా ఉన్నవాళ్ళను విడిచిపెట్టారు వాళ్లజోలికి పోకుండా, అనవసరమైన ప్రయాస, పోరాట కౌశలం చూపించి ఎందుకు సమయాన్ని వృధా చేయడం అని. పొదలలో దూరి దాక్కున్నవాళ్ళను ఈటెలతో పొదలలో పొడిచి బయటకు లాగి, కట్టుబట్టలతో సహా సర్వమూ దోచుకుని జాలి గలవాళ్ళలాగా కట్టుకోడానికి గోచీలను మాత్రం యిచ్చారు. సన్నని, పదునైన బాణాలతో చెప్పులలో

గుచ్చి చీల్చి, సిగముడులు విప్పి శోధించారు, చెప్పుల్లో కొప్పుల్లో దాచిపెట్టుకునే మేధావుల సంగతి తెలిసినవారు గనుక! యిలా విచ్చలవిడిగా రెచ్చిపోయి నానారకాలుగా బాటసారులను దోచుకున్నారు ఆ బందిపోట్లు.

ఈ సంరంభంలో, పిరుదులమీదినుండి ఎదుర్రొమ్ము దాకా నీలిరంగు దట్టీని కట్టుకున్న వాడొకడు, పిల్లిగడ్డం వాడి కుండలాంటి పొట్టమీదికి వ్రేలాడుతుండగా, ముఖానికి నల్లగా మడ్డిని పూసుకున్నవాడు, చేతిలో చురకత్తి బిగించి పట్టుకుని, నేను మా గ్రామానికి బయలుదేరినదగ్గరినుండీ కనిపెట్టి చూస్తున్నవాడు, 'కాక శ్మశ్రువు' అనే పేరుగలవాడు, నన్ను గుర్తుపట్టాడు. నేను పారిపోవడానికి పరుగెత్తుతుంటే చూసి, హఠాత్తుగా నామీదకు ఉరికి, నా కాళ్ళసందులలో వాడి పొడవాటి కత్తిని అడ్డంగా దూర్చి నన్ను క్రింద పడవేశాడు. ధోవతీని పట్టుకుని ఈడ్చిపారేశాడు. నేను పెనుగులాడుతుంటే నా వరహాలమూటను కోసి లాక్కున్నాడు. తమ్మెలదాకా నా చెవులను అంటగోసి నా చెవిపోగులను వలుచుకున్నాడు. నా విలువైన కుళ్ళాయిని కూడా వలుచుకుని వాడు పారిపోతుంటే ఉన్నవాడిని ఊరకే ఉండకుండా నేను అరిచాను.

*నోరిసని నుండ కే నో*
*రోరి యకట మా సమీప పూరనె మనియున్*
*దూరము వోయితివే సొ*
*మ్మేరీతిని నీకు దక్కునే కానీరా*

ఒరేయ్! అయ్యయ్యో! మా ఊరికి దగ్గరలోనే ఉండేవాడివి కదూ! ఎంత దూరం పోతావు? నా సొమ్ము ఎలా నీకు దక్కుతుందో అదీ చూస్తాను అని అరిచాను.

*అనిన లాఁతుగఁ గోల్పోక నతదు రడ్డి*
*రాజుఁ గను నని కొదయుఁ దీర్పంగ మగుడి*
*యంతఁ బరియును బైప్రజ కలికి పాఱి*
*పోవ వాఁడును వెడపోట్లు వొడిచి చనియె*

యిలా నేను మూర్ఖుడిలాగా అరువగానే , నేను వాడిని గుర్తుపట్టిన సంగతిని వాడు గమనించాడు.పెద్దమొత్తంలో పోగొట్టుకున్నాను కనుక, గ్రామాధికారిని(రడ్డి/పటేలు) రాజును కలిసి, వాడి సంగతి చెబుతాను అని, మిగిలిన పనిని చక్కబెట్టడానికి, ఆ ఒక్క కొరతా తీర్చడానికి, ధనము ఎలాగూ పోయింది, మిగిలిన ప్రాణాలను కూడా తీసిపారేస్తే పోతుంది అని, వెనక్కు తిరిగాడు. అందరూ తమ తమమీదికి దాడి చేస్తున్నవారిని చూసి పారిపోతున్నారు. వాడు నన్ను సమీపించి, ప్రాణాలు పోయేట్లు అడ్డగోలుగా నన్ను పొడిచి పారిపోయాడు.

*అంతటఁ బొంతఁ బెన్దెరువునం దరు దెంచు పిఱిందిమంది మ*
*త్కాంత సహోదరుండును నొకం డరుదెంచుచు సాతు పడ్డ వృ*
*త్తాంత మెఱింగి న న్నరసి తాఁ గని యార్తి నొకండు దా నతి*
*శ్రాంతుని నన్నుఁ గావట దిసంతులు గొట్టుచు మోచు కేగుచోన్*

అంతలో దగ్గరలోనున్న ఒక రాజమార్గంలో వస్తున్న ప్రయాణీకులలో ఉన్న నా బావమరిది ఒకడు మా గుంపును బందిపోట్లు దోచుకున్న సంగతిని విన్నాడు. వాడు వచ్చి నన్ను గమనించి బాధపడుతూ ఒక్కడే నన్ను కావడిలో ఉంచుకుని మోసుకుంటూ, నా పాపిష్టిపనులకు నన్ను నిందిస్తూ, బాధపడుతూ,

వెక్కిరిస్తూ మోసుకుంటూ వెళ్ళడం ప్రారంభించాడు. సమీపములోని గ్రామాల గుండా నన్ను మంచి వైద్యుడికోసం తీసుకెళ్తున్నాడు. ఆ ఊళ్ళన్నీ దోపిడీకి గురి అయినవారితో కలకలంగా ఉన్నాయి.

*కొంగవా ల్నఱుకు లంగుళులఁ బట్టుక జబ్బ / లంటఁ గుట్టిద వెజ్జు నరయువారు*
*తలఁ బడ్డ గుదియదెబ్బలఁ బాఁత మసి యిడి / యంబలి గం జిండ్ల నడుగువారు*
*తమనేగిఁ జెప్పుకో దయమీఱ విని చీరఁ / జించిచ్చువారి దీవించువారు*
*నొలివడ్డ నెపమునఁ గల లేని సిరిఁ జెప్పి / చుట్టలపై దాడి వెట్టువారు*

*నైన పాంథులచేతఁ గ్రం దైన యూళ్ళ*
*జాడగా నిటఁ దెచ్చి యిన్నీడ డించి*
*పాఱు నీ రానఁ బోవ నొ వ్వారి మగిడి*
*వచ్చునాలోన నీ రూపు వచ్చె నాకు*

దోపిడీదొంగల వంకర కత్తులు దిగబడి అయిన గాయాలకు కుట్లు వేయించుకోడానికి వైద్యులకోసం తిరుగుతున్నారు కొందరు. తలలమీద దుడ్డు కర్రలవల్ల తగిలిన దెబ్బలకు గుడ్డలను కాల్చిన మసిని పూసుకుని, అంబలి, గంజి కోసం ఆబగా అడుగుతున్నారు కొందరు. తమ బాధలను చెప్పి, గాయాలకు దయతో చీరలను చించి కట్లు కట్టుకోడానికి యిచ్చినవారిని దీవిస్తున్నారు కొందరు. దోపిడీ జరిగిన సాకుతో ఉన్నదీ లేనిదీ కోల్పోయినట్టు చెప్పి చుట్టాలమీదికి దాడికి వెళ్ళినట్లు వెళ్లి వేపుకు తింటున్నారు కొందరు. యిలా ఆ దోపిడీలో నష్టపోయిన ప్రయాణీకులతో నిండిన గ్రామాలగుండా నన్ను మోసుకుని ఇక్కడి దాకా తీసుకొచ్చి, ఈ చెట్టు నీడలో నన్ను దించి సమీపంలో పారే నీటితో దాహం తీర్చుకోడానికి వెళ్ళాడు నా బావమరిది. వాడు మళ్ళీ తిరిగి వచ్చేలోపే తీవ్రమైన గాయాల బాధతో విలవిలలాడుతూ ప్రాణాలు విడిచాను నేను. పదేపదే పొడిచి, నాకు భయాన్ని, ప్రాణాంతకమైన యాతనను, గాయాలను కలిగించిన ఆ 'కాకశ్మశ్రువు' అనే దుర్మార్గుడి రాక్షస రూపమే నా కళ్ళలో మెదులుతుండగా ప్రాణాలు విడిచిన నాకు ఈ రూపం వచ్చింది. యిదీ నా కథ. నీవు దయచూపి నీ కైశికీ గాన ఫలితాన్ని నాకు ధార పోసి ఈ భయంకర రూపాన్ని పోగొట్టుమయ్యా అని మాలదాసరి పాదాలమీద పడిపోయాడు బ్రహ్మరాక్షసుడు.

మాలదసరికి కరుణతో గుండె కరిగింది. అయినా ప్రాపంచికమైన అక్షరజ్ఞానము లేనివాడు ఐనప్పటికీ 'అ'క్షరమైన పరమాత్మ తత్త్వజ్ఞానము కలిగిన మహానుభావుడు కనుక యిలా అన్నాడు ఆ మాలదాసరి. ' ఫలము ఏమిటో, ఎంతయో అన్నది నాకు తెలియదు, అది తెలియకుండానే, దానిగురించి ధ్యాస లేకుండానే నేను పరమాత్ముడిని సేవించే దాసుడిని. పరమాత్ముడి ముఖోల్లాసమే ఫలం! ఆయన కరుణయే ఫలం! అది యింతా, అంతా, ఎంత అని లెక్కించే అధికారము దాసులకు ఎక్కడిది? అలా ఫలమును లెక్కబెట్టడం, ఆశించడం పునర్జన్మ అనే బంధానికి కారణం అవుతుంది! కనుక పరమాత్ముడి కైంకర్య ఫలము 'యింత', అందులో 'ఒక యింత' నీకు ధారబోస్తాను అనడం నాకు భయాన్ని కలిగిస్తుందయ్యా! 'భగవంతుడే నిన్ను రక్షిస్తాడు' అని అంటున్న మాలదాసరి మాట పూర్తి కాకముందే అద్భుతం జరిగింది!

*స్నిగ్ధ త్రిభాగ ముండిత శిరశ్శిఖతోడ / హిమధవళోపవీతములతోడఁ*
*బుణ్యషడ్ద్వితయోర్ధ్వ పుండ్రవల్లులతోడఁ / దులసికాబ్జస్రగావళులతోడఁ*
*గౌపీన కటిసూత్ర కాషాయయుగితోడ / జలపూర్ణ శుభకమండలువు తోడఁ*

*బాణిద్దిదివ్యప్రబంధసంపుటితోడ / నుత్తరవాక్పూర్వకోక్తితోడ*

*బసిఁడిజిగితోడ బ్రహ్మవర్చసము వొల్చు*
*భావగతలక్ష్మితో ధూమపటలినుండి*
*వెడలు శిఖవోలె నమ్మేను వెడలి చూడఁ*
*జూడ వైష్ణవుఁ డై నిల్చె సోమశర్మ*

పొగను చీల్చుకుని వచ్చిన అగ్నిశిఖలాగా ప్రజ్జ్వరిల్లుతున్న తేజస్సుతో ఒక దివ్య మూర్తి ప్రత్యక్షమైనాడు. ఆతడు మూడువంతులు గుండుకొట్టి, ఒకవంతు తళతళ లాడుతున్న శిఖతోనున్న శిరస్సును కలిగినవాడు. మంచులాంటి తెల్లని యజ్ఞోపవీతములను కలిగినవాడు. పుణ్యప్రదములైన పన్నెండు ఊర్ధ్వ పుండ్రములను దేహముమీద పన్నెండు స్థానములలో కలిగినవాడు. తులసీపూసలు, తామరపూసలు దండలు దండలుగా ధరించినవాడు. కౌపీనమును, కటిసూత్రమును, రెండు కాషాయ వస్త్రములను ధరించినవాడు. జలపూర్ణమైన శుభప్రదమైన కమండలమును కలిగినవాడు. చేతిలో ద్రవిడవేదసంపుటిని కలిగినవాడు. ద్వయమంత్రానుసంధానము చేస్తూ, చరమశ్లోకాన్ని ఉచ్చరిస్తున్న పలుకులతో కూడిన సంభాషణ కలిగినవాడు. ఆతడు కాల్చిన బంగారంలాగా మెరిసిపోతున్నాడు. ఆతడు భాగవతలక్ష్మిని వొలికిస్తున్న బ్రహ్మతేజస్సును కలిగినవాడు. ఆతడు సోమశర్మ!

యిలా, ఉప్పు చిట్లి రెట్టింపు ఐనట్టు(!) మహాభాగవతుని కరుణను పొందిన కారణంగా బ్రాహ్మణత్వాన్ని మాత్రమే కాక, భాగవత సిరిని కూడా పొందిన పూర్వపు సోమశర్మ ప్రత్యక్షమైనాడు! తన వైష్ణవపక్షపాతపూర్వక చమత్కారాన్ని పొదిగి, క్రమక్రమంగా వైష్ణవునిగా రూపాంతరం చెందిన వైదిక బ్రాహ్మణమూర్తిని సాక్షాత్కరింప జేశాడు వైష్ణవరాయలు! తనను కరుణించి పునర్జన్మను ప్రసాదించిన గురుడు భాగవతుడు, వైష్ణవుడు కనుక, జన్మను పొందిన 'శిష్యుడు'(పుత్రసమానుడు) భాగవతుడు, వైష్ణవుడు కావడం ఆధ్యాత్మిక, సాధనామార్గ రహస్యం! 'చూడ చూడ ..' అనే పదప్రయోగంతో క్రమ క్రమంగా బ్రాహ్మణోత్తముడు భాగవత వైష్ణవోత్తమునిగా రూపును పొందాడు అంటున్నాడు. అంటే పూర్వపు రూపము పూర్వపు వైదిక లక్షణాలను చూపుతూ అంతలోనే వైష్ణవ లక్షణాలను సంతరించుకుంటున్నది అని సంభ్రమాత్మకమైన స్వాప్నిక దర్శనాన్ని వర్ణిస్తున్నాడు. అంతేకాదు, మొదటినుండీ బ్రహ్మరాక్షసుడు క్రమక్రమంగా మహాభాగవతుడైన వైష్ణవుని అభిమానిగా, ఆరాధకునిగా, దాసుడిగా రూపాంతరం చెంది చివరికి ' ఆచార్య తిరువడిగళే శరణం' అని పదేపదే మాలదాసరి పాదాలమీద పడిన సంగతిని చిలిపిగా గుర్తుచేస్తున్నాడు, కనుక ' భాగవత పరిచయ ప్రభావంబున బ్రాహ్మణ్యంబె కాక భాగవత ▪యుం గలిగి..' అని వచనములో కూడా వర్ణించాడు ▪కృష్ణదేవరాయలు. ' ▪మన్నారాయణ చరణౌ శరణం ప్రపద్యే ▪మతే నారాయణాయ నమః' అనే ద్వయ మంత్రాన్ని పలుకుతున్న క్రమంలో, తరువాతి చరమ శ్లోకాన్ని ఉచ్చరిస్తూ తన సంభాషణను కొనసాగిస్తున్నాడు ఆ భాగవతుడైన సోమశర్మ! 'సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ అహం త్వా సర్వ పాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః' ( యితరములైన అన్ని ధర్మములను, మార్గములను వదిలి 'నన్నే' శరణు వేడు, నేను అన్ని పాపములనుండి నీకు విముక్తిని కలిగిస్తాను, ముక్తిని ప్రసాదిస్తాను, శోకింపకు అని గీతాచార్యుడు పలికిన పలుకు వైష్ణవ మార్గంలో చరమ శ్లోకంగా ఉపాసింపబడుతుంది) యిందులో అంతరార్థం అష్టాక్షరీ మంత్ర జపము, ద్వయమంత్రానుసంధానము, చరమశ్లోక మననము చేస్తూ వైష్ణవునిగా బయటపడ్డాడు బ్రహ్మరాక్షసుడు, గురుదేవుడైన మాలదాసరి కృపాకారణంగా! యిదీ ఔచిత్యాన్ని ప్రదర్శించడం అంటే. ఖడ్గమును ధరించినవారిలో, ఘంటమును ధరించినవారిలో బహుశా, ఏ కొద్దిమంది మాత్రమే రాయలతో పోల్చదగినవారు ఉండవచ్చు సాహిత్య ప్రపంచములో, రాయలను 'మించినవారు' మాత్రము లేరు, రారు. 'మాలదాసరి కథ' సమస్త సాహిత్య కావ్యాలలో అత్యుత్తమ శ్రేణికి చెందినది, కథలో, కథనంలో, పాత్రపోషణంలో, చమత్కారంలో, ప్రపంచపరిశీలనలో, కవనప్రతిభలో, సందేశములో! రాయల పాదాలకు ఈ కించిన్మాత్ర ప్రజ్ఞుడైన వ్యాసకర్త శతసహస్ర ప్రణామములు, అలా 'నూతన భాగవత వైష్ణవ తేజస్సును సంతరించుకున్న పూర్వ రూపాన్ని' పొందినబ్రహ్మరాక్షసుడు, వైష్ణవ సంప్రదాయానుసారంగా, తన గురుదేవుడైన మాలదాసరిని పూజించి యిలా స్తుతించాడు.

*జయ దురుత్తరణ సంసరణాబ్జదళనీర / జయజయ గాయక సార్వభౌమ*
*జయ శౌరిగాథారసజ్ఞ పుణ్యరసజ్ఞ / జయజయ తత్త్వసంశయలవిత్ర*
*జయ జనార్వాచీన జనిసంగవంచక / జయజయ దేశిక చరణశరణ*
*జయ యుక్త వాక్ప్రతిష్ఠాతృణీకృతదేహ / జయజయ భగవదాజ్ఞాకృతిష్ఠ*

*జయ సకలజంతుసమచిత్త  జయదయార్ద్ర*
*జయ ముకుందాన్యదేవోస్తిశాస్త్రబధిర*
*జయ చతుర్ద్వయభక్తిలక్షణచితాంగ*
*జయ మురారిప్రపన్నాంఘ్రిజలజమధుప*

దాటడానికి శక్యముకాని సంసారము అనే తామరాకుమీది నీటివంటివాడా, సంసారములో ఉంటూనే, సంసార సుఖాలకు, బంధాలకు, బాధలకు చలించనివాడా నీకు జయము! గాయకసార్వభౌమా, నీకు జయము! ■హరిగాథారసమును తెలిసినవాడా, పుణ్యరసమును గ్రోలినవాడా, నీకు జయము! పరమాత్మతత్త్వమును గురించిన సందేహములను ఖండించడంలో కొడవలివంటివాడా, నీకు జయము!

తత్త్వము అంటే వేదాంతపరంగా పంచవింశతి తత్త్వములు అంటే, యిరవై అయిదు తత్త్వములు అని కూడా. శబ్ద, రూప, రస, స్పర్శ, గంధములు అనే పంచ తన్మాత్రలు, వాటినుండి జన్మించిన ఆకాశము, అగ్ని, జలము, వాయువు, భూమి అనే పంచమహాభూతములు, వాటి ద్వారా, వాటిని గ్రహించడానికి జనించిన శ్రోత్రు, చక్షు, రసన, త్వక్, ఘ్రాణ యింద్రియములు అనే పంచ జ్ఞానేంద్రియాలు, వాక్, పాణి, పాద, పాయు, ఉపస్థలు అనే పంచ కర్మేంద్రియాలు, మనస్సు-బుద్ధి-చిత్తము-అహంకారము అనే అంతరంగ చతుష్టయము, ఈ యిరవై నాలుగు తత్త్వములు కలిగిన జీవుడు అనే యిరవై ఐదవ తత్త్వము, యివి పంచవింశతి తత్త్వాలు. వీటిని కలిగిన జీవికి కలిగే సంశయములను, పరమాత్మతత్త్వజ్ఞానము అనే కొడవలితో ఖండించిన మహానుభావా, నీకు జయము! అని వేదాంతరహస్యసార సూచన చేస్తున్నాడు రాయలవారు. నీ భాగవత మహిమతాలూకు రహస్యాన్ని మరుగునపెట్టి, సామాన్య చండాల రూపములో సంచరిస్తున్న మహాజ్ఞానీ! నీకు జయము! ఆచార్యుల, పూర్వాచార్యుల,పరమాచార్యుల చరణములశరణమును పొందినవాడా, నీకు జయము. యిచ్చిన మాటను ప్రతిష్ఠించడానికి, నిలబెట్టడానికి నీ శరీరాన్ని కూడా గడ్డిపోచలాగా విసిరిపారేయడానికి, నాకు ఆహారముగా నీ దేహమును త్యాగం చేయడానికి సిద్ధపడిన సత్యవ్రత నిష్ఠుడా, నీకు జయము! భగవంతునికి విధేయుడైన దాసుడా, నీకు జయము!

సకలజంతువులపట్ల సమచిత్తమును కలిగినవాడా, సమస్తభూతప్రేమికుడా, నీకు జయము! దయార్ద్రచిత్తమును కలిగినవాడా, నీకు జయము! ముకుందుడు కాకుండా, వేరే దైవము కూడా కలదు అని చెప్పే శాస్త్రములను వినడంలో చెవిటివాడా(!) ■హరి తప్ప యితరము లేదు అని నమ్మినవాడా(ప్రహ్లాదునివలె) నీకు జయము! (చతుర్ద్వయ) ఎనిమిది భక్తి లక్షణములు పెంపొందిన శరీరము గలవాడా, నీకు జయము!

భక్తి నవవిధములు అని మాత్రమే కాక, ఎనిమిది విధములు అని కూడా ప్రమాణం, విష్ణుపురాణ శ్లోకం ప్రకారం. 'మద్భక్త జనవాత్సల్యం, పూజాయాంచానుమోదనం, స్వయమభ్యర్చనం చైవ మదర్థే దంభవర్జనం, మత్కథాశ్రవణే భక్తిః సర్వనేత్రాంగ విక్రియా, మమానుస్మరణం నిత్యం యచ్చ మాముపజీవతి, భక్తిరష్టవిధాహ్యేషా యస్మిన్ మ్లేచ్ఛేపి వర్తతే, స విప్రేంద్ర స్సచ ■మాన్ స యతి స్స చ పండితః' నా భక్తులపట్ల వాత్సల్యము, నా పూజలకు సంతోషముగా అంగీకరించడం, స్వయముగా చేయడం, నా పట్ల, నా భక్తులపట్ల, నా పూజలపట్ల దంభమునుకపటమును విసర్జించడం, నా కథలను వినడంలో భక్తి, కనులు తదితర అవయవములతో  దేహము సర్వము నాకోసమే అని నమ్మడం( ప్రహ్లాదునివలె, కంజాక్షునకు గాని కాయంబు..) నిత్యమూ నా నామ స్మరణము చేయడం, నామీదనే ఆధారపడి, నావల్లనే, నాకోసమే అని జీవించడం అనే ఈ ఎనిమిది విధములైన భక్తిలక్షణములను కలిగినవాడు

మ్లేచ్ఛుడైనా సరే, వాడే విప్రోత్తముడు, వాడే ▪మంతుడు, వాడే యతిరాజు, వాడే పండితుడు అని అర్థం. అటువంటి ఎనిమిదివిధములైన లక్షణములను కలిగిన మహాభక్తుడా, నీకు జయము!

యింతేకాదు, సాత్విక భక్తి ఎనిమిది విధాలు అని సంప్రదాయం. ప్రళయము, స్తంభము, కంపము, రోమాంచము, స్వేదము, వైవర్ణ్యము, వైస్వర్యము, అశ్రుపాతము అనే ఎనిమిది లక్షణాలను కలిగివుంటాడు సాత్విక భక్తుడు. తన దేవుని సేవలోనూ, సేవకు దూరమైనపుడూ ప్రళయము వచ్చినట్లు సంచలించిపోతాడు. ఆ భావోద్రేకములో స్తంభించిపోతాడు. శరీరము కంపించిపోతుంది. గగుర్పాటుతో రోమాంచితుడు అవుతాడు. చెమటలు పోస్తాయి. ముఖము, శరీరము వివర్ణమైపోతాయి, గొంతు గద్గదికము అవుతుంది. ధారగా సేవలో ఆనందబాష్పాలు, దర్శనంకోసం దుఃఖ బాష్పాలు ప్రవహిస్తాయి. అటువంటి ఎనిమిది సాత్వికభక్తిలక్షణాలు కలిగిన మహాభక్తుడా, నీకు జయము అని మాలదాసరిని స్తుతించాడు బ్రహ్మరాక్షసుడు.

ప్రహ్లాదునికి, ఆంజనేయునికి, తర్వాతి కాలంలో ఆదిశంకరులకు, రామానుజులకు, చైతన్య ప్రభువులకు, రామకృష్ణపరమహంసకు ఈ స్థితులన్నీ కలిగేవి, ఈ లక్షణాలు కలిగేవి! యిక మరల మరలా జన్మించి, ఇల్లు, వాకిలి, భార్య, పిల్లలు, సుఖాలు అని భ్రమించి, సంసారచక్రంలో యిరుక్కుపోకూడదు అని నిశ్చయించుకుని, తన ఆచార్యుడైన మాలదాసరికి కడసారి నమస్కరించి బదరి మొదలైన పుణ్యప్రదేశాలలో నిరంతరమూ సంచరిస్తూ చివరకు దేహాన్ని చలించి మోక్షాన్ని పొందాడు ఆ సోమశర్మ.

ఓ విష్ణుచిత్తా! ఈ దివ్యమైన కథను పూర్వము వరాహరూపములో ఉన్న నేను భూదేవికి చెప్పాను. నా పూజావిధానములో అత్యంత శ్రేష్ఠమైనది గానకైంకర్యమే అని నేను ఉదాహరణపూర్వకంగా చెప్పిన ఈ కథను విని ఆ భూదేవియే నాకు గానకైంకర్యము చేయాలనే కోరికతో, ఆ మార్గాన్ని ఈ ప్రపంచానికి బోధించాలనే 'వాత్సల్యముతో' యిలా నీకు కుమార్తెగా జన్మించిందయ్యా! నిరంతరమూ నా విరహముతో, నా పట్ల భక్తి, వ్యామోహములతో నా కీర్తన చేస్తూ పలవరిస్తున్నది. యిదేమి తపస్సో, యిదేమి వ్రతమో అని పరిపరివిధాలుగా కలవరిస్తున్నావే, అమాయకుడా! ఇంతకన్నా తపస్సు ఏదైనా ఉన్నదా అని సన్నగా నవ్వాడు చక్రధరుడు. కరములు ముకుళించి, దేహము పులకించి వింటున్నాడు విష్ణుచిత్తుడు. ' నీకు అంతా మేలే జరుగుతుంది. ▪రంగనాథుని రూపములో ఉన్న నన్ను సేవించడం కోసం నీ కుమార్తెను ▪రంగమునకు వెంటనే తీసుకువెళ్ళు' అని ▪హరి అదృశ్యుడు అయినాడు. ఆ ఆజ్ఞ ప్రకారము వందలాది పరిచారికలు సేవిస్తుండగా, భాగవతుల సమూహాలు వెంట వస్తుండగా, బంగరుపల్లకీలో తన కుమార్తెను పరమానురాగముతో ▪రంగమునకు తోడ్కొని వెళ్ళాడు విష్ణుచిత్తులవారు అని మాలదాసరి కథను ముగించాడు ▪కృష్ణదేవరాయలు.

*చని కాంచె న్విరజాభిధాంతర వపు స్సహ్యోద్భవాతీర నం*
*దన వాటీవలయద్రుమావళి దళాంతర్దృశ్య పాపాళి భం*
*జన చాంపేయసుమాయమాన విషమ స్వర్ణావృతివ్రాత ర*
*శ్మి నభస్పృక్శిఖరాళి దీపకలికాశృంగంబు ▪రంగమున్*

▪రంగానికి వెళ్ళిన విష్ణుచిత్తులవారు అల్లంత దూరంనుండే ▪రంగదేవాలయ శిఖరాలను చూశాడు. విరజ అని మరొక పేరు కలిగిన, సహ్యపర్వతాలలో ఉద్భవించిన కావేరీనదీ తీరములో, నందనవనములవంటి వనములలోని చెట్ల ఆకులమధ్యనుండి కనిపించే, పాపములు అనే తుమ్మెదలను భంగపరచే సంపెంగపూవులవంటి, విషమసంఖ్యలో ఉండే, ఆకాశానికి ఒరుసుకుంటున్నట్లు ఎత్తుగా ఉండే దేవాలయ శిఖరాలను చూశాడు. వైకుంఠానికి చుట్టూ ఒరుసుకుని ప్రవహించే దివ్యనది విరజానది. ▪రంగమును చుట్టి ప్రవహించే నది కావేరి. కావేరికి విరజ అని మరొకపేరు ఉన్నది అని అతిశయోక్తిగా అంటున్నాడు, విరజకు మరోపేరు కావేరి అనకుండా. తుమ్మెదలకు సంపెంగపూల పరిమళము మింగుడుపడదు, కొరుకుడుపడదు, సహించదు. పాపములు అనే తుమ్మెదలకు ▪రంగశిఖరప్రభలు సహించవు, పాపులకు ▪రంగశిఖర ప్రభలు సహించవు, సంప్రాప్తించవు. పుణ్యాత్ములకు మాత్రమే ఆ ప్రాప్తం, అదీ చమత్కారం. ▪రంగదేవాలయ శిఖరాలు సంఖ్యలో ఏడు, కనుక విషమసంఖ్య అంటున్నాడు.

*చోళీహల్లకచితకచ*

*పాళీ పాళీభవద్వీపంచీస్వన భృం*
*గాళీ కవేరదుహితృ మ*
*రాళీధ్వను లెసఁగుగాడ్పు వ్రతివడ యడిపెన్*

అది చోళ సామ్రాజ్యం. అక్కడి స్త్రీల కొప్పులలో కూర్చిన ఎర్ర కలువలకు బారులు తీరి ముసురుకుంటున్న తుమ్మెదలు చేస్తున్న రొద (అక్కడి అందగత్తెలు చేస్తున్న) వీణా నాదంలా ఉన్నది. కావేరీ నదిలోని హంసల మధుర కూజితములు వినిపిస్తున్నాయి. ఆ నదిమీదినుండి వీస్తున్న చల్లనిగాలి వ్రతనిష్ఠలు, నియమాలు కలిగిన విష్ణుచిత్తులకు మార్గాయాసాన్ని తీర్చింది. అఘమర్షణసూక్తములసహితముగా స్నానం చేసి, బ్రహ్మయజ్ఞము మొదలైన నిత్యానుష్ఠాన విధులను తీర్చుకుని, స్నానముచేసి, సర్వాలంకృతయైన తన కుమార్తెను వెంటబెట్టుకుని భాగవత సమూహము సేవిస్తుండగా స్వామిని దర్శించుకొనడానికి వెళ్ళాడు. ఆ సనయానికి రంగనాథుని సేవించడానికి వచ్చిన దేవతలను అడ్డుకొని, యిది మీకు సమయము కాదు, వెళ్ళండి అని, విష్ణుచిత్తులవారికి స్వామి దర్శనానికి అనుమతిని యిచ్చాడు చండుడు అనే ద్వారపాలకుడు!

రత్నాలు తాపడంచేసిన అరుగుమీద పరచిన బంగారు తివాచీమీద కూర్చున్న విష్వక్సేనుల దర్శనం చేసుకున్నాడు విష్ణుచిత్తులవారు. తెల్లతామరలవంటి కన్నులున్న స్వామి ఆ స్వామి. ▪హరియొక్క రాజముద్ర ఉన్న ఉంగరాన్ని, బెత్తాన్ని ధరించి ఉన్నాడు. ఆయనకు రెండుప్రక్కలా గజముఖులైన వందమంది సేవకులు సేవిస్తున్నారు. సూత్రవతీదేవితో కూడి ఉన్న ఆ స్వామిని విష్ణుచిత్తులవారు సేవించారు. ఆయనకూడా విష్ణుచిత్తులవారిని భక్తితో సేవించాడు, సాక్షాత్తూ రంగనాథునికి మామగారు కాబోతున్నాడు కదా మరి!

ఆ తరువాత ఇంద్రుని వజ్రాయుధపు దెబ్బలను ఎరుగని బంగారు కొండవంటి వినతాసూనుడిని, గరుత్మంతుడిని దర్శించుకున్నాడు. ఆ గరుడుని రెక్కల ఈకల కాంతులు నీరెండలో సూర్యుని కాంతిలా మిలమిలలాడిపోతున్నాయి. వేదాత్మకుడైన గరుడుడిని వినయముగా, భక్తిగా సేవించాడు విష్ణుచిత్తులవారు. ఆయనకూడా ఈయనను నమస్కరించి సేవించాడు. అనంతరం స్వామివారి సన్నిధికిచేరి అనేకవిధాలుగా దివ్య స్తోత్రములతో స్వామిని కీర్తించాడు.

*విధిగృహాక్షయవిత్తసేవధికి శరణు*
*చిరకృతేక్ష్వాకుపుణ్యరాశికిని బ్రణుతి*
*ధనపతి భ్రాతృకుల దేవతకు జొహారు*
*నతమృడాదిక సుమనస్సునకు నమస్సు*

బ్రహ్మదేవుని యింటిలోని అక్షయమైన నిధికి శరణు, ఇక్ష్వాకుమహారాజు పుణ్యరాశిని శాశ్వతము చేసిన మహానుభావునకు ప్రణుతి, కుబేరుని సోదరుడైన విభీషణుని కులదేవతకు జోహారు, శివుడు మొదలైన దేవతలచే నమస్కరింపబడే నీకు నమస్సులు అని స్వామిని కీర్తించాడు విష్ణుచిత్తులవారు.

*కొలుతు సర్వేశు సర్వాత్మకుని ననంతు*
*నప్రకాశు నభేద్యు సమస్తలోక*
*సముదయాధారు నణుసమూహములకును న*
*ణీయు నిన్ను ననాధారు నిత్యు సత్యు*

సర్వేశ్వరుడిని, సర్వాత్మకుడిని, అనంతుడిని, దృష్టికి అందని దివ్యతేజుడిని, భేదింప శక్యముగాని అణువుకన్ననూ ా సూక్ష్మమైన పరిమాణము గలవాని, తనకంటూ ఎవరూ ఆధారము లేని సర్వాధారుడిని, నిత్యుడిని, సత్యుడిని, నిన్ను కొలిచెదను స్వామీ అని పొగిడాడు. స్వామి కరుణ ఒలుకుతున్న కడగన్నులతో విష్ణుచిత్తులవారిని చూచి, కుశలప్రశ్నలు వేశాడు. తమ కరకంకణ ధ్వనులతో తన పాదములకు కుసుమాంజలులు సమర్పించే నారీరత్నముల శిరోరత్నంలాగా దివ్యప్రభలతో మెరిసిపోతున్న 'ఆముక్తమాల్యద'పై పడింది స్వామి చూపు!

దీనిచూపు పైకి లేవడం వలననే కదా, మన్మథునికి బిరుదైన ధ్వజము దొరికింది అనుకున్నాడు స్వామి, ఆమె కన్నులు చేపలలాగా ఉన్నాయి, మన్మధుని ధ్వజము మీనధ్వజము కదా! దీని లతవంటి నడుము ఊగాడడం వలననే కదా వసంతునికి భూమి మీద కాలు పెట్టడానికి సందు దొరికింది అనుకున్నాడు స్వామి, లతలు తీగలు పచ్చపచ్చగా ఉంటేనే కదా వసంత ఋతువుకు పట్టు! దీని వక్షోజముల పెంపుచేతనే కదా రతీదేవి యొక్క కిన్నెరవీణా నాదానికి వన్నె కలిగింది అనుకున్నాడు స్వామి, ఆ కిన్నెరవీణ గుండ్రని దిమ్మకు ఈ వక్షోజముల పోలిక ఉండడం వల్లనే ఆ వీణకు ఆ నాదం అని! దీని ముఖపద్మము వికసించడం వల్లనే కదా, పద్మములు వికసించి సరస్వతీదేవి వాహనమైన హంసకు నెలవు దొరకడం అనుకున్నాడు స్వామి, హంసలకు పద్మములు నివాసస్థలాలు అని ఐతిహ్యం! దీని మేఘములవంటి కేశములు దట్టంగా అలుముకోవడంవల్లనే కదా నెమళ్ళకు మేఘములను చూసి మోహము, ఆనందము కలగడం అనుకున్నాడు స్వామి! మెట్టతామరలవంటి దీని పాదములవలననే కదా, తామరల తేనెలు తుమ్మెదలకు దొరకడం అనుకున్నాడు స్వామి! యిలా గోదాదేవి అందచందాలకు, లావణ్యానికి స్వామి మోహపరవశుడై, తాళలేక ఆమె స్థానంలో ఒక మాయాకన్యకను ఆమెలాగే ఉంచి, ఆమెను తన అంతఃపురానికి చేర్చాడు! అర్చకులచేత విష్ణుచిత్తులవారికి, ఆ మాయాగోదాదేవికి తీర్థ ప్రసాదాలు ఇప్పించి, వారి బసకు వెళ్ళడానికి ఆనతిచ్చాడు, ఆశీర్వదించి.

విష్ణుచిత్తులవారు తమ పల్లకీలో కుమార్తెను కూర్చొనబెట్టి బసకు వెళ్లి, పల్లకీ తెరను తొలగించి చూడగా గోదాదేవి లేదు, మాయాగోదాదేవి మాయమైంది! ఎంత అన్యాయం చేశాడు రంగడు, నా కుమార్తెను అపహరించాడు, సభ్యులందరూ నా గతి చూడండి మొర్రో అని చేతులు పైకెత్తి దుఃఖజలధిలో మునిగి ఆర్తనాదాలు చేస్తూ స్వామిని నిందించాడు.

*శివుఁడు విరించి వాసవుఁడుఁ జెప్ప నశక్తులు గొల్చినట్టి వా*
*రవుట నిరంకుశుండ నని యక్కట పాడిఁ దొఱంగఁ జెల్లునే?*
*భువనము లెల్ల నీవయినఁ బొంత దయానిధి యమ్మ లేదె? భా*
*గవతులు లేరె నా కొరకుఁగా వహియించుకొనంగఁ గేశవా!*

శివుడు, బ్రహ్మ, దేవేంద్రుడు నీ సేవకులు కనుక న్యాయము చెప్పలేరు, నిన్ను తప్పు పట్టలేరు బహుశా. నేను నిరంకుశుడిని, నన్ను హద్దుల్లో పెట్టేవారు ఎవరూ లేరు అని దారితప్పడం ఏమన్నా పద్ధతా? ప్రపంచాలన్నీ నీవేనేమో కానీ, నీ ప్రక్కనే దయానిధియైన అమ్మ ఉన్నదికదా, భాగవతులు ఉన్నారు కదా నా పక్షం వహించడానికి, నిన్ను నిలదీయడానికి అని ఆక్రోశించాడు.

*నెట్టన యల్ల లచ్చి యల నీళయు భూసతి యుండ నీకు నీ*
*నెట్టిక నీలపై మనసునిల్పుట కేమనవచ్చు? వెఱ్ఱి యౌ*
*నట్టుగఁ బేద నన్నుఁ బరిహాసము సేఁతకుఁ దక్క వింతచూ*
*పెట్టిది? దిద్దు నెవ్వఁ డిల నేఱులవంకలు వారిడొంకలున్*

నీకోసం నిరంతరమూ సిద్ధంగా ఆ లక్ష్మి, ఆ నీళాదేవి, ఆ భూదేవి ఉండనే ఉన్నారే, నీకు ఈ చిగురు మీద మనసు పడ్డది అంటే ఏమనాలి? ఈ పేద బాపడిని వెఱ్ఱివాడిని చేయడానికి, పరిహాసము చేయడానికి కాకుంటే, నీకు ఈ బాలికపై చూపు పడడం ఏమిటి? వాగులు, వంకల వంకర టింకర వర్తనలు

సరిదిద్దడానికి ఎవరుంటారు గనుక? అని యిలా పరి పరివిధాల వాపోతున్న ఆ అమాయక భాగవతుడిని చూసి స్వామి జాలిపడ్డాడు తనే. గడుసుగా 'ఏమయ్యా నీకేమైనా ముదిమితో మతి తప్పిందా ఏమిటి? నీ బిడ్డను యింట్లోనే భద్రంగా ఉంచుకుని నన్ను అంటావేమిటి? నేనే అలుసైనానా నీకు? ఇంకోసారి నీ బసలో చూసుకో పో! అప్పుడూ కనబడకుంటే నన్ను నిందించు కావాలంటే' అన్నాడు. చల్లని మాట చెప్పావు స్వామీ, నీకు విజయమగుగాక, మంగళము కలుగు గాక అని తన బసకు వెళ్లి కుమార్తెను క్షేమంగా కనుగొన్నాడు విష్ణుచిత్తులవారు. నా తల్లీ! మళ్ళీ నిన్ను చూశాను కదా అని బిడ్డను దగ్గరకు తీసుకుని వెన్ను నిమిరాడు ప్రేమగా!

యిక రంగనాథుడు తాళలేకపోయాడు. సరస్వతీ బ్రహ్మలను, గౌరీ రుద్రులను ఆ పిల్లను నాకు యిమ్మని అడగండి అని చెప్పి విష్ణుచిత్తులవారి దగ్గరకు పంపాడు. వారు విష్వక్సేనులను వెంటబెట్టుకుని, విష్ణుచిత్తులవారి బసకు వచ్చి వధువును యిమ్మని అడిగారు. ఆయన 'నేను ధన్యుడిని అయ్యాను, భృగువు, సముద్రుడు ఎంతటి ధన్యులో, నేను అంతటి ధన్యుడిని! యియ్యదగిన సంబంధమే! కానీ బిడ్డను మోసుకొచ్చి యిచ్చాడుఅని లోకులంటారు, స్వామిని మా గ్రామానికి తరలివచ్చి నా బిడ్డను పెండ్లియాడుమని చెప్పండి, మీరు చెపితే వింటాడు అన్నాడు. వారు వెళ్లి స్వామితో అలానే చెప్పారు. స్వామి సంతోషంగా ఒప్పుకుని, గరుడవాహనం మీద, యితర దేవతలందరూ తమతమ వాహనాలమీద వెంటరాగా విల్లిపుత్తూరుకు తరలివెళ్ళాడు పెండ్లికుమారునిగా. విశ్వకర్మ నిర్మించిన దివ్యభవనంలో మగపెళ్ళివారు విడిది చేశారు.

*శర్వాణీ వాణీ ముఖ*
*గీర్వాణీకోటి జానకీరఘుకులరా*
*ట్పూర్వాచరిత వివాహో*
*ఖర్వ సుగీతములు పాడగా విభవమునన్*

పూర్వము జానకీరఘురాముల వివాహ సందర్భములో గానముచేసిన శుభప్రదమైన గీతాలను మరలా ఈ వివాహ సందర్భములో గానము చేశారు పార్వతి, సరస్వతి మొదలైనవారు. గోదారంగనాథుల వివాహము కన్నులపండువుగా జరిగింది. విధివిధానముగా వివాహక్రియ జరిగింది. వధూవరులు ముత్యాల తలబ్రాలు పోసుకున్నారు. ఆ సమయములో గోదమ్మ చివుళ్ళవంటి వ్రేళ్ళు తగిలి స్వామికి ఒళ్ళు చెమర్చింది. నీలిమేఘమువంటి ఆ దేహము చెమర్చి, చెమట బిందువులు వర్షపు బిందువులలాగా కురిశాయి, ముత్యాలు వడగండ్లలాగా మెరిశాయి!

*ఇంతి దోయిట నేసంబ్రా లెత్తుచోట*
*గుబ్బపాలిండ్లఁ బ్రేవ గ్రక్కున మురారి*
*కన్నువేయుటఁ గల లజ్జ గదుర బాహు*
*లెత్తక కరాగ్రములన పై కెగురఁజల్లె*

స్వామితలమీద పోయడానికి గోదాదేవి దోసిళ్ళలో తలబ్రాలు తీసుకుని చేతులు పైకెత్తింది. ఉదుటున బహిర్గతములైన ఆమె కుచములమీద స్వామి కన్ను పడింది. ఆమెకు లజ్జ కలిగి, బాహువులు పైకి ఎత్తకుండానే చేతివ్రేళ్ళ కొసలతో తలబ్రాలను పైకి వెదజల్లింది. ఏ చిన్ని రహస్యమూ రాయల కనులకు కనబడకుండా ఉండదు.

*లలనచే నిష్ఠతో లాజలు వేల్పించి / శార్ఙ్గి మెట్టించెను సప్తపదులు*
*తెలివఁ గూడి యరుంధతీదర్శనముఁ జేసె / బ్రహ్మరుద్రాది గీర్వాణకోటి*

*యర్పించు నుడుగర లనుకంపఁ గైకొని / యనిచె బ్రసాదభాజనుల జేసి*
*యాత్మపట్టణమున కతివైభవంబున / నతివఁదోడ్కొని విజయంబుచేసి*

*సహ్యకన్యా తటోద్యాన చందనద్రు*
*కుంజముల నీలకుంతలఁ గుస్తరించి*
*కంతుసామ్రాజ్య మేలించి కరుణఁ జిత్త*
*మొలయ జగములఁ బాలించు చున్నవాడు*

గోదాదేవితో హోమములో లాజలు వ్రేల్పించాడు స్వామి. సప్తపదులు త్రొక్కించాడు. ఆమెతో కలసి అరుంధతీ దర్శనము చేసుకున్నాడు. బ్రహ్మ, రుద్రుడు మొదలైన కోట్లాది దేవతలు సమర్పించిన కానుకలను, చదివింపులను ప్రేమగా పుచ్చుకున్నాడు. తన అనుగ్రహానికి వారిని పాత్రులుగా చేసి సాగనంపాడు. తన పట్టణానికి, ▪రంగానికి వైభవముగా తన ఇల్లాలిని తోడ్కొని ప్రవేశించాడు. ఆ నీలవేణిని, గోదాదేవిని కావేరీ నదీతీరములోని ▪ చందనవృక్షముల పొదరిండ్లలో లాలనగా మన్మథసామ్రాజ్యానికి మహారాణిని చేసి, నిరత సురతక్రీడలలో ఓలలాడించి, దయగా ఈ జగములను తాను ఆ రంగనాథుడు పాలిస్తున్నాడు నాటినుండీ!

*స్కందసరస్తటీరమణ కందర చందన కుందవాటికా*
*మందసమీరలోల వనమాలిక! నిర్మలదివ్యవిగ్రహా*
*స్పందివిభాధరీకృత నభస్స్ఫుటకాళిక! వల్లవాంగనా*
*బృందమనోభిమాన ధృతి భేదన! పేశల వంశవాదనా!*

స్వామిపుష్కరిణీ దరులయందున్న మనోహరమైన గుహల యందలి హరిచందన వృక్షముల, మొల్లల సమూహములనుండి వెలువడుతున్న మందపవనములతో కదలాడుతున్న వనమాలికను ధరించినవాడా! నిర్మలమైన దివ్యమైన చలింపని నల్లని మేని వర్ణముచేత ఆకాశపు నీలిమను ధిక్కరించేవాడా! గోపికల మనసులలోని అభిమానమును, ధీరత్వమును భేదించినవాడా! మృదుతరమైన వేణువాదనము చేయువాడా!

*వాలినిర్భేదనా! వారిజాతేక్షణా!*
*శైలకన్యాస్తుతా! శార్ఙ్గ చంచద్భుజా!*
*ఫాలదృక్పద్మభూపాకభేదిస్ఫుర*
*న్మౌళిమాణిక్యరుఙ్మండితాంఘ్రిద్వయా!*

వాలిని సంహరించినవాడా! తామరలవంటి కనులు గలవాడా! పార్వతీదేవి చేత స్తుతింపబడినవాడా! శార్ఙ్గధనుస్సును ధరించి కదలాడుతున్న భుజమును కలిగినవాడా! శివుడు, బ్రహ్మ, ఇంద్రుడు నీకు నమస్కరిస్తున్నపుడు వారి శిరస్సులందలి మణులకాంతులచేత ప్రకాశిస్తున్న పాదములు గలవాడా! యిది కృష్ణరాయలు అనుపేరుగల నాచేత రచింపబడిన ఆముక్తమాల్యద గ్రంథమందలి హృద్యమైన పద్యముల ఆరవ ఆశ్వాసము, సకలమూ సంపూర్ణము అని రాయలవారు ఆముక్తమాల్యదను వేంకటేశ్వరుని శ్రోతగా చేసుకుని ముగించాడు.

★★★★

# నా మాట

తెలుగుసాహిత్యసరస్వతి కంఠసీమలో మేలి ముత్యాలమాల ఆముక్తమాల్యద. నా పరిమితమైన సాహిత్య పరిచయముతో, నా శక్తికి అందిన మేరకు, అమ్మదయ నామీద ప్రసరించినమేరకు ఆముక్తమాల్యదపై దీర్ఘ సాహిత్యవ్యాసమును అందించే ప్రయత్నము చేశాను. పూర్వ పండితుల వ్యాఖ్యల సహాయము కేవలము క్లిష్టమైన ప్రయోగాల సందర్భములలోనే తీసుకున్నాను. అన్వయము, పరిశీలన నా మనసుకు ఔననిపించిన మార్గంలోనే చేశాను. అనేక సందర్భాలలో, దుస్సాహసంతో, మహామహులు, అపార పాండితీసాగర సద్రుశులు ఐన వారితో విభేదించి, రాయల సమస్తశాస్త్రవైదుష్యాన్ని, రాయలవ్యక్తిత్వాన్ని నా రుచి మేరకు, నా దృష్టిమేరకు వ్యాఖ్యానించడానికి ప్రయత్నం చేశాను. నా విశ్లేషణలో, అన్వయములో ఏవైనా లోపాలుంటే పాఠకులు మన్నింతురుగాక! రాయలను మించిన కవి, యోధుడు లేరు, నా దృష్టిలో. సాహిత్య, సామాజిక, ఆధ్యాత్మిక రంగాలలో భారతధరిత్రికి యుగాల పర్యంతమూ బలమును యిచ్చిన కారణజన్ముడు ■కృష్ణదేవరాయలు! ప్రాచీన పద్యకావ్యవిమర్శకు దీర్ఘకాలంగా యింతటి ప్రోత్సాహాన్ని యిచ్చిన 'కౌముది'కి, ఆదరించిన పాఠకులకు ధన్యవాదాలతో, రాయలకు ఈ కవితాంజలితో, 'ఆముక్తమాల్యద' సాహిత్య విమర్శను ముగిస్తున్నాను.

*జయహో ■ కృష్ణ దేవ రాయ!*
*జయ నిత్య కీర్తి కాయా!*
*జయ కదన కవన రవి చంద్ర తేజ!*
*జయ భువన విజయమున ఆంధ్ర భోజ!*

*నీ తనువు కదన ఘన విజయలక్ష్మికి*
*నీ మనువు కవనమున విజయలక్ష్మికి*
*తను వృత్తి నీకు సామ్రాజ్య రక్షణం*
*నీ ప్రవృత్తి సాహిత్య వీక్షణం*

*చినరాణినీకు సామ్రాజ్య లక్ష్మి*
*పెద్ద రాణి నీకు సాహిత్య లక్ష్మి*
*చిన్నమ్మ తోడి చిరకాల చెలిమి*
*పెద రాణి తోడి కల కాల కలిమి*

*నడి వీధిలోన రతనాలు రాశి*
*నడి రేయి దాక కవనాలు దూసి*
*పడి కరకు తురక తలచెండ్లు కోసి*
*కడలేని కీర్తిగనినావు వాసి*

*గజపతుల కైన ఘన స్వప్న సింహమా!*
*మదవతుల కేళి శృంగార చిహ్నమా!*
*కవితా వధూటి సిగపువ్వు చంద్రమా!*
*తులలేని అలల సాహిత్య సంద్రమా!*

*ఘన  తెలుగు కవన ధారా విపంచి*
*పలికించి తేనెలొలికించి   మించి*
*వలపించి చూడిక్కు డుత్త  నాచ్చి*
*నేలించినావు రంగేశుకిచ్చి*

*భువి రాజులెందు?  శాసనములందు!*
*కవిరాజులెందు? ఉచ్ఛ్వాసమందు,*
*జన జీవ నాడి నిశ్వాసమందు*
*నిలిచుండురందు! నువు?గుండెలందు!*

*బ్రహ్మాండమందు ▪ వేంకటాద్రి,*
*దైవతములందు ▪ వేంకటేశుడు,*
*పలు దేశ భాషలను తెలుగు లెస్సరా!!*
*రాజులందు, రాయ నువు లెస్సరా!*